ఉప్పు మితిమీరితే తలనొప్పి సమస్య!

ఆహార పదార్థాల్లో మోతాదుకు మించి ఉప్పు వాడితే తలనొప్పి సమస్య తప్పదని తాజా అధ్యయనంలో పరిశోధకులు తేల్చారు. ప్రతి రోజూ ఎనిమిది గ్రాములకు మించి ఉప్పు తీసుకునే వారిలో మూడింట ఒకటో వంతు మంది శిరోభారంతో బాధ పడుతున్నారని, రోజూ నాలుగు గ్రాములకు మించకుండా ఉప్పువాడే వారిలో ఇలాంటి సమస్యలు లేనట్లు అమెరికాకు చెందిన పరిశోధకులు గుర్తించారు.

ఉప్పు అధికంగా వాడే వారిని రక్తపోటు సమస్య కూడా వేధిస్తున్నట్లు పరిశోధనలో కనుగొన్నారు. అమెరికాలో చాలామంది మోతాదుకు మించి ఆహార పదార్థాల్లో ఉప్పు వినియోగిస్తున్నందున అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని అధ్యయనానికి నేతృత్వం వహించిన లారెన్స్ ఏపెల్ తేల్చిచెబుతున్నారు. ఉప్పును తగ్గించుకుంటే తలనొప్పి సమస్యకు దూరం కావొచ్చని ఆయన సూచిస్తున్నారు.

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

గురువారం 18, డిసెంబర్ 2014

చింతల నుంచి విముక్తికే.. 'వానప్రస్థం'

ఈ మధ్య ఒక కథా వస్తువు తరచుగా కనబడుతున్నది. పిల్లల నిరాదరణకు గురైన తల్లిదండ్రులు లేదా పిల్లలు తమను పట్టించుకోవడం లేదని భావిస్తున్న అమ్మానాన్నలు వృద్ధాశ్రమాలలో చేరుతూంటారు. కొన్నాళ్ళ తర్వాత ఆ ఆశ్రమంలో జీవితమే బాగుందని ఆనందిస్తూ ఉంటారు (సొంత పిల్లలే తల్లిదండ్రులను ఆశ్రమాలలో చేర్పించిన కథలూ వస్తున్నాయి. ఏ కథలోనైనా విలన్లు పిల్లలే!) ఇలాంటి కథలు చదువుతూంటే ఒక అనుమానం కలుగుతుంది. వ్యాపార దృష్టితో నడిపే వృద్ధాశ్రమాలు నిజంగా స్వర్గధామాలు కాగలవా? డబ్బు కట్టి చేరే ఆశ్రమాలే కాదు, ఫ్రీగా చేర్చుకునేవాటిలో కూడా నిర్వాహకుల దృష్టి నిత్యం డొనేషన్లపైనే ఉంటుంది. (అక్కడక్కడ కొన్ని మంచిగా నడిపేవీ ఉండవచ్చు.)

ఆశ్రమ జీవితం బాగుంటుందా? లేదా? అన్న ప్రశ్నను పక్కనపెడితే, వాటిలో చేరడానికి కారణాలు సరైనవేనా? అన్న ప్రశ్న కూడా వృద్ధులు వేసుకోవాలి. పిల్లలు నిరాదరించినప్పుడు వృద్ధులు ఆశ్రమంలో చేరుతున్నారు. పిల్లలు బాగా చూసుకుంటుంటే- హాయిగా ఇంట్లో ఉండడం సబబేనా? ఇంట్లో కోడళ్ళు పోటీపడుతూ కాఫీ, టీ, టిఫిన్లు, భోజనం రుచిగా అమర్చిపెడుతూంటే, కొడుకులు కోరినవన్నీ కొనిపెడుతూంటే, మనవలు మమకారం చూపిస్తూ ఉంటే, రాచభోగాలు అనుభవిస్తూ ఉండవచ్చా? ప్రాచీన భారతదేశంలో వృద్ధులు అలాగే ఉండేవారా? అయిదువేల ఏళ్ళనాడు ఏం జరిగింది?

కురుక్షేత్ర సంగ్రామం ముగిసింది. ధర్మరాజు పట్టాభిషిక్తుడయ్యాడు. వందమంది కొడుకులను పోగొట్టుకుని గాంధారీ ధృతరాష్ట్రులు శోక సముద్రంలో ఉన్నారు. వారిని ప్రేమగా చూడాలనీ, ఎటువంటి అవమానమూ జరగక్కుండా చూడాలనీ ధర్మరాజు తన తమ్ముళ్ళకూ, పరిచారకులకూ ఆదేశమిచ్చాడు. అలా ఉండడం భీమునికి సాధ్యమా? కొంతకాలానికి ధృతరాష్ట్రుడు విదురుని సలహాపై అడవికి వెళ్లిపోవడానికి నిశ్చయించుకున్నాడు. ఇష్టం లేకపోయినా ధర్మరాజు తప్పనిసరిగా సమ్మతించాడు. గాంధారీ ధృతరాష్ట్రులతో వెళ్లాలని కుంతి కూడా నిశ్చయించుకుంది.

అడవికి వెళ్లిపోవడానికి గాంధారీ ధృతరాష్ట్రులకు కారణముంది. వాళ్ళకి ఇంట్లో అవమానాలు జరుగుతున్నాయి. కుంతికి ఆ అవసరం లేదు. కొడుకులైదుగురూ, ద్రౌపదీ, సుభద్రా మొదలైన కోడళ్ళూ ఆమెను నెత్తిన పెట్టుకొని పూజిస్తున్నారు. రాజమాతగా సుఖపడవలసిన ఆమె అడవికి ఎందుకు బయల్దేరింది? సనాతన భారతీయ ధర్మంపై నమ్మకముంది కనుక.

భారతీయ ధర్మం మానవ జీవితాన్ని నాలుగు భాగాలుగా విభజించింది. మొదటి భాగంలో బ్రహ్మచర్యం పాటించి చదువుకోవాలి. రెండవదైన గృహస్థాశ్రమంలో పిల్లలను కని పెంచి పెద్దచెయ్యాలి. పిల్లలు పెద్దవాళ్ళయ్యాక గృహ నిర్వహణ బాధ్యతను వారికి అప్పగించి వృద్ధ దంపతులు అడవిలో భగవంతుని గురించిన చింతనలో విరాగులుగా జీవించాలి. తనలో వార్ధక్య చిహ్నాలు కనబడగానే దశరథుడు శ్రీరామునికి పట్టాభిషేకం చెయ్యాలనుకున్నాడు. విధి కైక రూపంలో వక్రించిందన్నది వేరే సంగతి. ఆనాడు అందరూ అంతే. పిల్లలకు బాధ్యతలు అప్పగించి వానప్రస్థానికి వెళ్లిపోయేవారు. పురాణాలను నమ్మనివారికి చరిత్రలోనూ ఉదాహరణలున్నాయి. చంద్రగుప్త మౌర్యుడు కొడుకైన బిందుసారుడికి రాజ్యమప్పగించి కర్ణాటకలోని శ్రవణబెళగళలో చివరి రోజులు గడిపాడు.

ఆశ్రమ జీవితం బాగుంటుందా? లేదా? అన్న ప్రశ్నను పక్కనపెడితే, వాటిలో చేరడానికి కారణాలు సరైనవేనా? అన్న ప్రశ్న కూడా వృద్ధులు వేసుకోవాలి. పిల్లలు నిరాదరించినప్పుడు వృద్ధులు ఆశ్రమంలో చేరుతున్నారు. పిల్లలు బాగా చూసుకుంటుంటే- హాయిగా ఇంట్లో ఉండడం సబబేనా?

వానప్రస్థ జీవితం గడపడంలోని పద్ధతులనూ, ఆహార విహారాలనూ పూర్వీకులు స్పష్టంగా చెప్పారు. భూమిని దున్ని పండించిన ఆహారం తినకూడదు. పెరిగిన మొక్క నుంచి కూడా ధాన్యాన్ని కోసుకుని తినకూడదు. దానంతట అది రాలిపోయిన ధాన్యాన్ని స్వీకరించాలి. పళ్ళ విషయమైనా అంతే. మాంసం స్వయంగా వేటాడి తినరాదు. మొదట్లో ఇతరులు వేటాడినది తినవచ్చును. క్రమేపీ మాంసాహారం పూర్తిగా మానెయ్యాలి. తాటాకు గుడిసెలోనో, కొండ గుహలోనో నివసించాలి. ఎండనూ, వాననూ, చలినీ ఓర్చుకునే శక్తిని అలవరచుకోవాలి. రోజూ మూడుసార్లు స్నానం, రోజంతా భగవధ్యానం, నేలపై పడుకోవడం, ఏమీ దాచకోకపోవడం వంటి నియమాలెన్నో ఉన్నాయి. వృద్ధ దంపతులు ఇద్దరూ ఇష్టపూర్వకంగా వానప్రస్థ జీవితం గడపడం సనాతన ధర్మం. శరీరం సహకరించినంతవరకూ పూజ, హోమం చేసుకుంటూ ఆపైన మానసిక జపం చేసుకోవాలి.

ప్రస్తుతం జరుగుతున్నదేమిటి? సుమారు అరవై ఏళ్ళనుంచి వార్ధక్యం ప్రారంభమౌతుందనుకోవచ్చు. ఆ వయస్సు రాగానే వృద్ధులేం చేస్తున్నారు?పూర్వంలా అడవిలోకి వెళ్లి ఉండడానికి ప్రభుత్వం అంగీకరించదు. అడవిలో ఉండే రాజ్యాంగేతర శక్తులూ అక్కడ ఉండనివ్వవు. ఆనాటి ఆహార నియమాలలో కొన్నిటికి నేటి ఆరోగ్య పరిస్థితులు అనుకూలించవు. కానీ, వానప్రస్థమన్న మాటను వృద్ధులు మనస్సులోకైనా రానిస్తున్నారా? కోరికలలో ఒక్కదాన్నైనా వదులుకోవాలనుకుంటున్నారా? ఎంతసేపూ పిల్లలు పట్టించుకోవడం లేదన్న ఆవేదనా, ఆవేశం మాత్రం ఎందుకు విన్పిస్తున్నాయి? నెమ్మది నెమ్మదిగా కోరికలనూ, అహంకార మమకారాలనూ తగ్గించుకోవలసిన వయస్సులో 'మనల్ని పట్టించుకోవడం లేదు, మనకి ఏమీ జరగడంలేదు..' అన్న బాధ ఎందుకు? 'మనం పిల్లల్ని పెంచాం, వాళ్ళు మనని వృద్ధాప్యంలో చూసుకోవాలి' అంటే అది వ్యాపారమౌతుంది. కానీ, గృహస్థాశ్రమ ధర్మం నిర్వహణ అవుతుందా? ఎంతసేపూ పిల్లలు పట్టించుకోవడం లేదు అన్న ఒక్క విషయం మీదనే మనస్సు లగ్నం చేస్తే సాధించేదేమిటి? పిల్లలు పట్టించుకోవడంలేదా? పట్టించుకోలేక పోతున్నారా? ఎంత పట్టించుకున్నా సరిపోవడం లేదా?

వార్ధక్యం వచ్చినకొద్దీ కోరికలు తగ్గించుకోవాలి. భగవంతుడందుకే శరీరంలో మార్పులు పెట్టేడేమో..! సులభంగా అరిగే సాత్వికాహారం మాత్రం స్వీకరించడానికి వీలుగా పళ్ళు ఊడిపోతాయి కాబోలు. అయినా జంతికలు తినడం మానేసేదెవరు? పిల్లలచేత వాటిని పొడి కొట్టించుకుని చప్పరించే వృద్ధులున్నారు. ప్రకృతి విరుద్ధంగా బతకడం మంచిదా? లేక ప్రకృతి సహజంగా జీవించడం మంచిదా? నేటి వృద్ధాశ్రమం నాటి వానప్రస్థాశ్రమం వంటిదే. ఇహలోక సంబంధమైన బంధాలనూ, కోరికలనూ, అహంకార మమకారాలనూ తగ్గించుకుందుకు అపూర్వమైన అవకాశం. ఆంగ్లంలో 'ఔట్ ఆఫ్ సైట్ ఔట్ ఆఫ్ మైండ్' అనే నానుడి ఉంది. కనిపించనిదాని మీదకు మనస్సు పోదు. ఇంట్లో అందరూ కారప్పూస కజ్జికాయలు చేసుకుంటే, కోడి పలావ్ వండుకుంటే తినాలనిపిస్తుంది, ఆరోగ్యం పాడవుతుంది. మనవడికి జ్వరంవస్తే దృష్టి దేవుడిమీద ఉండదు.

అందుకే ప్రాచీనులు వానప్రస్థాశ్రమాన్ని నిర్దేశించారు. దాని ఆధునిక రూపమే వృద్ధాశ్రమం. ఇంట్లో ఎంత హాయిగా అందరూ చూసుకున్నా ఇష్టపూర్వకంగా ఆశ్రమంలో భగవచ్చింతనలో, మానవసేవలో జీవితాన్ని గడపడమే సనాతన భారతీయ సంప్రదాయం. సుఖాల్లో మునిగిపోవడమో, సుఖాలు లేవని బాధపడడమో కాదు. మన ధర్మం మనం నిర్వర్తించకుండా యువతీ యువకులనూ, మధ్యవయస్కులనూ వారి ధర్మం గురించి హెచ్చరించడం ఎంతవరకు సబబు?

-పాలంకి సత్య

ముత్యాల ముగ్గు

పివిఎల్ సుజాత,
సికిందరాబాద్



22 చుక్కలు
2 వరుసలు
2 వచ్చే వరకూ
సరిచుక్క

మీ సృజనకు పదునుపెట్టి కొత్తకోణాల్లో ఆకర్షించే అందమైన ముగ్గులు పంపండి. చుక్కల వివరాలు రాయడం మరువకండి. చుక్కలు, గీతలు.. ఏ ముగ్గులైనా చూసేందుకు స్పష్టంగా ఉండాలి. చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికిందరాబాద్-500003.

ముగ్గులు వేసిన కాగితాలను కలర్ స్కానింగ్ చేయించి pdf ఫార్మాట్‌లో bhoomika@andhrabhoomi.net కు మెయిల్‌లో కూడా పంపొచ్చు.

స్వశక్తితో కీర్తి శిఖరంపైకి..

గార్మెంట్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగులకు సూచనలిస్తున్న షీలా

ఆసక్తి, పట్టుదల ఉంటే విజయం దానంతట అదే వరిస్తుందని కేరళకు చెందిన షీలా అంటారు. ఇరవై ఏళ్ల క్రితం ఆమె సాధారణ గృహిణి. కార్యదక్షతతో వ్యాపార రంగంలో ప్రవేశించి ఇప్పుడు 75 కోట్ల రూపాయల వార్షిక టర్నోవర్ సాధిస్తూ తోటి మహిళా పారిశ్రామికవేత్తలకు ఆమె స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వ్యాపార రీత్యా భర్త, చదువుకునేందుకు పిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లాక ఆమె సమయాన్ని వృథా చేసేవారు కాదు. అర్థశాస్త్రం, బిజినెస్, మార్కెటింగ్ రంగానికి చెందిన పుస్తకాలను విరివిగా చదవడంతో పెట్టుబడి, ఉత్పత్తి, వినియోగదారులు, వారి అవసరాలు వంటి విషయాలపై ఆమెకు అవగాహన పెరిగింది. తాను వ్యాపార రంగంలోకి వెళితే ఎలా ఉంటుందా? అని షీలా తరచూ ఆలోచించేవారు. భర్త కూడా ఆమెను ప్రోత్సహించారు. ఆమె భర్త ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ రంగంలో బిజినెస్ చేస్తున్నారు. షీలా ఆసక్తికి తగ్గ బిజినెస్ ఏమిటా? అని ఆయన కూడా ఆలోచించారు. అయితే తగిన సలహాలు ఇచ్చేందుకు ఆయనకు సమయం ఉండేది కాదు. దీంతో తాను చేయవలసిన బిజినెస్ ఏమిటో తానే నిర్ణయించుకోవాలని ఆమె అనుకున్నారు. ఈలోగా ఒకరిద్దరు మహిళలు షీలా వద్దకు వచ్చి, ఏదైనా పని ఇప్పించాలని, తమకు టైలరింగ్ వచ్చని చెప్పారు. వెంటనే షీలాకి తాను ఏ తరహా బిజినెస్ చేయాలో ఆలోచన వచ్చింది. గార్మెంట్ బిజినెస్ తనకు వీలుగా ఉంటుందని భావించి కొందరు నిపుణులను సంప్రదించారు. దుస్తుల తయారీ రంగంలో మంచి లాభాలు రావాలంటే వాటి ఉత్పత్తి, మార్కెటింగ్ ఒక్కరే చేస్తే మంచిదని, అంతర్జాతీయ స్థాయిలో గార్మెంట్స్ రూపొందిస్తే తక్కువ కాలంలోనే నిలదొక్కుకోవచ్చని నిపుణులు ఆమెకు సూచించారు. ఆ తర్వాత ఆమె బ్యాంకు నుంచి 20 లక్షల రూపాయల రుణం తీసుకుని, దుస్తుల డిజైనింగ్‌లో మెళకువలు తెలిసిన కొందరిని, టైలరింగ్ పని తెలిసిన కొందరిని పనిలో పెట్టుకుని ఉత్పత్తి మొదలుపెట్టారు. తొలుత భర్త సహకారంతో ఉత్పత్తులను మార్కెటింగ్ చేసారు. ఆ తర్వాత సొంతంగానే మార్కెటింగ్ చేసుకుంటున్నారు. ఇప్పుడు ఆమె వద్ద స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కలిపి ఏభై మంది వరకు మహిళలు పని చేస్తున్నారు. ఆర్డర్లు ఎక్కువ ఉన్నప్పుడు అదనపు సమయం పనిచేస్తూ వారు షీలాకు సహకరిస్తుంటారు. అందుకు తగ్గట్లే ఆమె వారికి అదనంగా డబ్బు చెల్లిస్తుంటారు. ఏ ఆసరా లేని మహిళలను చేరదీసి వారికి పని నేర్పిస్తారు. ప్రస్తుతం కేరళలో వి-స్టార్ పేరిట ఉత్పత్తి చేస్తున్న గార్మెంట్స్‌ని ఇతర రాష్ట్రాలలో కూడా విక్రయించాలని ఆమె భావిస్తున్నారు. కొన్ని విదేశాలకు ఇప్పటికే ఎగుమతి చేస్తున్నారు. తన విజయం గురించి షీలా మాట్లాడుతూ, జీవితంలో గెలవాలన్న తపన ఉంటే ఏదీ అసాధ్యం కాదంటారు. తీరైన ప్రణాళిక, పట్టుదల, సేవాభావం వంటివి అలవాటు చేసుకుంటే ఏ మహిళ అయినా తనకు నచ్చిన రంగంలో రాణించవచ్చని ఆమె అంటున్నారు.

వ్యాపారవేత్తగా ఎదిగిన షీలా

-లావణ్య



మగువలు స్టేడియంలోకి వస్తే అరెస్ట్!

సౌదీ అరేబియాలో ఆడవాళ్లు విడిగా ఫుట్‌బాల్ ఆట 'ఘోషా'గా ఆడుకోవాలే తప్ప- పురుషుల పోటీలను తిలకించడానికి స్టేడియంలోకి రాకూడదు. కానీ, ఇటీవల ఓ గడుసు యువతి జెడ్డాలోని 'అల్ జవాహరా' స్టేడియంలో ఫుట్‌బాల్ మ్యాచ్ తిలకించి, పులకించిపోవాలని ఉవ్విళ్లూరుతూ- ఆన్‌లైన్‌లో టిక్కెట్ కొనుక్కుంది. సౌదీలో అమెరికన్ మహిళలను కూడా ఫుట్‌బాల్ మ్యాచ్ క్రీడాస్థలిలోకి ముందుగా అర్జీ పెట్టుకుని అనుమతి పొందితేనే రానిస్తారు. అటువంటిది స్థానికురాలైన ఆ అమ్మాయి ప్యాంటూ షర్టూ, స్కార్ఫూ వగైరా ధరించి మగాడి వేషంలో నల్లకళ్లద్దాలు ధరించి- రెండు ప్రతిష్ఠాత్మకమైన సౌదీ జట్లమధ్య జరుగుతున్న పోటీ- రంజుగా వున్న సమయంలో స్టేడియంలోకి ప్రవేశించి -ఖాళీగా ఉన్న ఒక స్టాండులో గప్‌చిప్‌న వచ్చి కూర్చుని, మ్యాచ్ తిలకించసాగింది. ఇది ఒక పురుషుడి కంటబడ్డది. 'యు ట్యూబ్' కోసం ఫొటోలు తీసే ఒక బృందం కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఆమె గుట్టు కాస్తా బయటపడ్డది. తలమీద బేస్‌బాల్ టోపీ ధరించినా- వీపుమీద జాలువారి వున్న కురులు బయటికి తొంగి చూడటంతో పోలీసులు రంగప్రవేశం చేశారు.

ఆ మధ్య ఇదే తీరులో ఇరాన్‌లో ఓ 'ఇరాన్ బ్రిటీష్ యువతి' వాలీబాల్ మ్యాచ్ చూడడానికి వెళ్తే అరెస్టు చేసి జైల్లో పెట్టారు. స్త్రీలకు 'పర్దా' ఒక్కటే 'మస్టు' కాదు- పురుషులు ఆడే ఏ రకమైన ఆటనైనా చూడ వీలులేదు. ఇరాన్‌లో, సౌదీలో స్త్రీలు కారు డ్రైవ్ చెయ్యకూడదు. ఒక పురుషుడు వెంట వస్తే తప్ప కారు డ్రైవింగ్ కూడా నేర్చుకోకూడదు. పెళ్లి కూడా మగవాడైన గార్డియన్ అనుమతితోనే చేసుకోవాలి. ఎన్ని రకాల ఆంక్షలున్నా కూడా ఫుట్‌బాల్ అభిమానిగా మగ వేషంలో కారు నడుపుకుంటూ వచ్చి స్టేడియంలో ఆమె దూరింది. ఆమెకు ఎక్కువ కాలం శిక్ష విధించాలని స్టేడియంలోని మగ ప్రేక్షకులు కోరారు. కేసును అత్యున్నత స్థాయిల్లో విచారిస్తామంటున్నారు పోలీసులు. ఇలాంటి ఆంక్షల నడుమ స్త్రీలు సౌదీలో సమాన ప్రతిపత్తికోసం ఉద్యమం లేవదీస్తున్నారు. వారి ఆందోళన క్రమంగా ఉద్ధృతం అవుతోంది.

సలసల కాగే నూనె చల్లారు..!

అతడు ఆర్.జె.డి పార్టీలో ప్రముఖుడు. బీహార్‌లోని బేలాగంజ్ నియోజకవర్గం నుంచి బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిచిన ఎమ్ఎల్ఏ. కానీ, 'గయ'మీదుగా వస్తూ ఓ మిఠాయి కొట్టుదగ్గర ఆగి - ఆ వూళ్ళో దొరికే స్పెషల్ స్వీట్స్- 'తిలుకుట్, అనార్స్' అనే వాటిని కొనుక్కుపోదామని డ్రయివర్‌ని పంపించాడు ఎమ్మెల్యే సురేంద్ర ప్రసాద్ యాదవ్. అయితే షాపులోకి వెళ్లిన డ్రైవర్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో- అతగాడు ఏదో తగాదాలో పడ్డాడనుకుని గన్‌మ్యాన్‌ని పంపించాడు. ఈ 'తుపాకీధారి' కూడా మిఠాయి కొట్లో ఏదో చేదు అనుభవం రాగా గొడవపడుతున్నట్లు గమనించి యాదవ్ స్వయంగా రంగంలోకి దూకాడు. అప్పటికే మాటల యుద్ధం క్లయిమాక్సుకు చేరుకుంది. ఎమ్మెల్యేతో కూడా షాపు యజమాని వాగ్యుద్ధం కొనసాగించాడు. ఆఖరికి ఎం.ఎల్.ఏమీద, డ్రయివర్‌మీదా, గన్‌మ్యాన్‌మీద సలసల కాగే నూనె చిమ్మించాడు.

సురేంద్ర యాదవ్‌కి మెడమీద, తల వెనుక కూడా బొబ్బలు తేలాయి. షాపు ఓనర్ ధీరేంద్ర కుమార్ తనమీద కొంతమంది 'నేరగాండ్ర' చేత- మరిగిన నూనె పోయించాడని, తన అంగరక్షకుల తుపాకీలని కూడా లాక్కున్నారనీ- ఎమ్.ఎమ్.ఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ''నన్నూ, నా మనుషుల్నీ- ఎమ్.ఎల్.ఎ అనుయాయులు తుపాకులు తిరగేసి వాటి మడమలతో చితకబాదారనీ ఎదురు ఫిర్యాదుచేశాడు దుకాణదారుడు. ఈ సంఘటనంతో 'గయ' పట్టణం అట్టుడికిపోయింది. అడిగిన మిఠాయిలు ఇవ్వడంలో ఆలస్యం చేశారన్నది ఎమ్మెల్యే ఆరోపణ. ప్రతీకారం ఇంత దారుణంగా వుంటుందని వూహించలేదు ఎమ్.ఎల్.ఏ., అతని సిబ్బందీ!

బురఖాలు తీసేయండి..

'పర్దా' లేక 'నకాబ్' ధరించడం- అది ఏ దేశమైనా ముస్లిం మహిళలు విధిగా పాటిస్తారు. అది వారి మతాచారం. కానీ, చైనాలోని జిన్ జియాంగ్ రాష్ట్రంలో- ముసల్మానులు అధికంగా వుండే 'ఉయిఘర్' పట్టణంలో ముస్లిమ్ వనితలు- 'బహిరంగ ప్రదేశాలలోకి, షాపింగ్ సెంటర్లకు పోయేటప్పుడు బురఖాలు వేసుకుని ''రాకూడదు'' అన్న చట్టం చేయాలని స్థానిక పురపాలక సంఘం తీర్మానించింది. సిటీ బస్‌లలో బురఖాలు ధరించరాదని లోగడ ఎప్పుడో చైనా గవర్నమెంటు ఆదేశించింది. నిజానికి అదే రాష్ట్రంలోని 'కారమాయ్' అనే నగరంలో సిటీ బస్సులలో మహమ్మదీయ సంప్రదయానికి చెందిన 'పర్దా'లు అవి ఏ మోడల్‌వి అయినా సరే వేసుకోడానికి అనుమతి ఇవ్వడం మానేసి చాలా కాలమయింది. బురఖాలపై నిషేధం విధించిన నేపథ్యంలో మతపెద్దల వైఖరి ఏమిటో వేచి చూడాలి!

అవీ..ఇవీ..అన్నీ

- వీరాజీ

ఉరి తీశాక.. శిక్ష రద్దు!

ఇలా కూడా జరుగుతుందా?- అంటే నమ్మలేం గానీ- 'ఇన్నర్ మంగోలియా'లోని హైకోర్టు- ఒక చైనా యువకుడు రేప్, హత్య కేసులలో ఉరిశిక్ష పొంది- అది అమలు చేయబడ్డాక- 18 సంవత్సరాల తర్వాత 'దాన్ని' రద్దుచేసింది. హ్యూగ్జెలిస్ట్ అనే టీనేజీ కుర్రాడికి- ఒక మహిళను రేప్ చేసి హత్య చేశాడన్న ఆరోపణపై మరణశిక్ష విధించి చాలా కాలమైంది. ''నేను ఎలాంటి నేరం చేయలేదు.. ఆ మహిళను మానభంగం నుంచి, హత్యనుంచి రక్షించాలని అనుకున్నాను..'' అంటూ ఆ యువకుడు చేసిన రోదన ఫలించలేదు. 1996లో ఆ యువకుడికి ఉరి శిక్ష అమలు అయింది. కానీ- అసలు దోషి- తానే మానభంగం, హత్య చేశానంటూ 2005లో కోర్టు ముందు వాంగ్మూలం ఇచ్చాడు. దాంతో కేసు విచారణ మళ్లీ మొదలైంది. అటు తర్వాత హైకోర్టు మృతుడి తల్లిదండ్రులను పిలిపించారు. 'అపాలజీ' చెప్పారు. 4,800 డాలర్లు నగదు నష్టపరిహారం కూడా ఇచ్చారు. అతడి ప్రాణాలకు కోర్టువారు కట్టిన విలువ అది..!

veeraji.columnist@gmail.com

నేర్చుకుందాం

క. అతిథి జనంబులు భక్తన్
సతతము c బూజించి యుచిత సత్కారములు
న్నతి నడపు సజ్జనులు శా
శ్వత కీర్తులు ధరణిc బడయ c జాలుదు రనఘా

భావం: ఓ పుణ్యాత్ముడా! అతిథి జనాన్ని సదా భక్తితో పూజించిన వారికి ఉచిత సత్కారం చేసి సన్మార్గులు శాశ్వత కీర్తిని పొందుతారు.

భారతీయంలో అతిథి దేవో భవ అన్నారు. కదా. తిథి వార నక్షత్రాదులను పట్టిచుకోకుండా ఎప్పుడైనను వచ్చేవ్యక్తి అతిథే. ఈ అతిథిని భగవంతుడిగా తలచాలన్నది సనాతన ధర్మము. ఈ ధర్మాన్ని ఆచరించే హిందువులు అతిథి ని భగవంతుడి ప్రతిరూపంగా భావించి వారి కోరికలు నెరవేర్చడం అనేది అనాదిగా వస్తున్నదే.

పోతన భాగవతము - దశమ స్కంధము

స్పందన

35

కె. ప్రమీలాజనార్దన్

ఢిల్లీవచ్చాక భావన ఓ ప్రయివేటు కాలేజీలో లెక్చరర్‌గా చేరింది. కొత్త జీవితం.. కొత్త ఉద్యోగం.. హాయిగా సాగిపోతుంటే తమ పెద్ద వాళ్ళు తమను నిందించిన మాటలు గుర్తొచ్చినా బాధనిపించడంలేదు. మన అలవాట్లు ఆచారాలు వాళ్ళను అలాగే మాట్లాడిస్తాయి. కొత్తదనాన్ని తొందరగా ఆమోదించలేని పాత తరానికి కొత్త భావాలతో ఆలోచనలతో సాగే యువతరానికి ఎప్పుడూ సంఘర్షణే.

ఉల్లాసభరితమైన జీవితంలో మరో కొత్త రాగం పలకుతూ వారిద్దరి మధ్యకు వచ్చాడు వారి దాంపత్యపు తీపిగుర్తు అజిత్.. కాళ్ళు చేతులు పూపుతూ కేరింతలు కొట్టే కొడుకును చూస్తోంటే మనసంతా తెలియని ఆనందం. వాడి అణువణువు తమ రక్తబిందువులే. మెత్తగా వున్న వాడి చేతులను పట్టుకొని మురిసిపోతుంది భావన. మనవడు పుట్టాడంటే మా అమ్మ నాన్న, మీ అమ్మా నాన్న గూడా పరుగెత్తుకొస్తారు. వాళ్ళకు తెలుపుదామీవిషయం'' అంది భావన.

''అలాగే...'' తల్లిదండ్రులకు, అత్తమామలకు గూడా లెటర్ వ్రాశాడు శ్యామ్. ఫోన్ చేస్తే ఏం మాట్లాడతారోనన్న భయం ఆ పని చెయ్యనివ్వలేదు. మనసు తేలికై ఆనందంగా వుంటున్నారిప్పుడు. వాళ్ళ మనసు మారకపోతే అలాగే మాట్లాడతారు. ఆ బాధను కోరి తెచ్చుకున్నట్లే అవుతుంది. లెటరైతే ఇష్టం వుంటే చూసేందుకు వస్తారు. లేకపోతే లెటర్ పక్కన పడేస్తారు అనుకున్నాడు శ్యామ్. కాని అతడనుకున్నట్లుగా లెటర్ పక్కన పడేసి వూరుకోలేదు వాళ్ళు.

మీ గురించిన విషయాలేవీ తెలపక్కర్లేదు. మాకు మనవడు వద్దు. మీరూ వద్దన్నట్లు వ్రాశారు ఇద్దరి తండ్రులు. భావన తండ్రి వ్రాసిన లెటర్‌లో అదే అర్థం స్ఫురించే మాటలే కాకుండా ''నువ్వు చేసిన అప్రాచ్యపు పనికి నా తల్లి ఆర్నెల్ల క్రిందట పోయింది. ఇంకా మీ దగ్గరినుండి లెటర్స్ వస్తే మేమేమైపోతామో.. నిన్ను మేము చచ్చినదాని క్రిందే జమకట్టాము...'' అంటూ వ్రాసిన మాటలు చదివి రెండు రోజులు ఏడుస్తూ కూర్చుంది భావన.

శ్యామ్ మనసు గూడా వికలమవ్వడంతో భార్యను ఓదార్చలేక మౌనంగా వుండిపోయాడు రెండు రోజులు. మూడో రోజు మాత్రం అలాగే వుండలేక భావన దగ్గరికి వచ్చి కూర్చున్నాడు. భావనా మనవాళ్ళు మనల్ని కాదన్నారని మనం బాధపడుతూ బాబును నిర్లక్ష్యం చేస్తున్నాము. ఇప్పుడే వాడికి మంచి పోషణ అవసరం. మనం మన వాళ్ళ మాటలు మరిచిపోవాలి బాబును జాగ్రత్తగా చూసుకోవాలి ...'' అంటూ భావన చేతుల్లో వున్న బాబును తీసుకొని ముద్దు పెట్టుకున్నాడు. బాబు నవ్వులు ఏడుపు ఆటపాటలు వాళ్ళ బాధను తొందరగానే మరిచేట్లు చేశాయి. మళ్ళీ రెండేళ్ళకు సూర్య పుట్టాడు. ఇక ఈసారి ఎవరికీ తెలుపలేదు. అజిత్ పుట్టినపుడు చేసుకున్నట్లే స్నేహితులను, కొలీగ్స్‌ను పిలిచి నామకరణం చేసుకున్నారు.

రోజులు గతంలోకి జారుతూ ఏళ్ళు పెరుగుతుంటే శ్యామ్ భావన జీవితంలో గూడా మార్పు వచ్చింది. శ్యామ్ స్వంత నర్సింగ్ హోమ్ పెట్టాడు. భావనను వుద్యోగం మానిపించి హాస్పిటల్ ఇన్‌ఛార్జిగా వుండమన్నాడు. పిల్లల చదువులైపోయాయి. అజిత్, సూర్య ఇద్దరూ ఇంజనీర్లే. డాక్టర్ అయితే ఎప్పుడూ పేషెంట్లు జబ్బుల గురించే ఆలోచన వుంటుందని డాడీని చూసి తెలుసుకున్నాను. అమ్మో, అలా వుండడం నా వల్ల కాదు'' అన్నాడు అజిత్.

''డాడీకి హాస్పిటల్లో డాక్టర్నై సహాయం చెయ్యలేను. రోగుల బాధ అరుపులు నేను భరించలేను'' అంటూ సూర్య గూడా ఇంజనీరింగ్ చదివాడు.

అజిత్ కొన్నాళ్ళు ఢిల్లీలోనే పనిచేశాడు. అతడు పని చేసే కంపెనీ వాళ్ళే అతడ్ని లండన్ పంపించారు.

సూర్యకు రావడమే ముంబైలో ఉద్యోగం వచ్చింది. ఒక కొడుకు పై దేశంలో వున్నాడు. మరో కొడుకు ఈ దేశంలో వున్నా దూరంగా వున్నాడు. ఎటో పోవాల్సిన జీవిత నావ ఆనంద సాగరానికి చేరుకోవడం అప్పుడప్పుడు వింతగా అనిపిస్తుంది భావనకు... ఆ సమయంలో మొదట గుర్తొచ్చేది అరుంధతే. ఆమె లెటర్ వ్రాయకపోతే తనకు మళ్ళీ పెళ్లి గురించి తలంపే వచ్చేది కాదు. ఆ లెటర్ గురించి శ్యామ్‌కు చెప్పడంవల్లే అతడిలో ఆలోచన వచ్చింది. తనకోసం అయినవారందర్ని దూరం చేసుకున్నాడనిపించినప్పుడు ఆమెకు తెలియకుండానే నిట్టూర్పు వెలువడుతుంది.

అలా బాధ ఆనందం కలగలిపిన జీవితం సాగిస్తున్న తనకు మహిత దగ్గరినుండి ఫోన్ రావడం.. ముఖ్యమైన విషయమేదో తమ ఊళ్ళోనే చెబుతాననడం. మాష్టారు పోవడంతో ఇక ఏ విషయం తెలిసే అవకాశం లేకుండా పోయింది. అమ్మా నాన్న వాళ్ళు ఎందుకు ఈ ఊరు వదిలి వెళ్ళారు? నాన్న నాకందచెయ్యమన్న కవరులో ఏం వ్రాసి వుంటారు? అమ్మా నాన్నకు నామీద కోపం పోయి వుంటుందా?'' భావన అశాంతిగా పడుకొని అటు ఇటు కదులుతోంది.

అజిత్ ఆఫీసులో కూర్చున్నాడు కాని పని చెయ్యాలనిపించడంలేదు. అందుకే తన ముందున్న ల్యాప్‌టాప్‌ను ఓపెన్ గూడా చెయ్యలేదు. ఇంట్లో రోజూ ప్రొద్దున్నే లేచి కాఫీ పెట్టుకొని తాగి అన్నం కూరో ఉప్మానో చేసుకొని బాక్స్‌లోపెట్టుకొని వచ్చేవాడు.

-ఇంకావుంది

అధ్యాత్మ రామాయణం

యుద్ధకాండ 204

- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

ఉనికిలేమి అనే ప్రత్యయాలు లేనివాడు, యోగాసక్తులు శంకరాది ప్రముఖుల చేత అర్చించబడిన పాదయుగళుడు, నిత్యుడు, శుద్ధుడు, బుద్ధుడు, అనంతుడు, ప్రణవనాముడు, వీరుడు, సకల రాక్షస సంహారకుడైన రామునకు నమస్కరిస్తున్నాను.

స్వామీ! నీవే నా నాథుడవు, (నియామకుడవు), ప్రార్థించినవారి సకల కార్యాలను సాధించిపెట్టేవాడవు, మానాతీతుడవు, మాధవరూపుడవు, అఖిల జీవధారకుడవు, భక్తి ఉపాయ సాధ్యుడవు, భావిత సకల రూపుడవు, భవ హరుడవు, యోగాభ్యాసశీలుర శుద్ధ చిత్తులకు సహచరుడవు.

వందే రామా! సుందరమిందీ వర నీల రూపా! లోకాలకు నీవే ఆద్యుడవు, అంత్యమూ అయినవాడవు. పరముడవు, సర్వలోక మహేశ్వరుడవు. లౌకిక ప్రమాణాలకు అతీతుడవు, భక్తి శ్రద్ధలు మనస్సులో నిండుగా వున్న వారి చేతనే నీవు సేవింపబడేవాడవు.

మాధవా! నీవు ప్రత్యక్షాది ప్రమాణాలకు అతీతుడవు. పరిధులకు అతీతుడవు; ఆ కారణంగా మాయాసక్తుడు నిన్నెలా తెలుసుకోగలుగుతాడు. మునిమాన్యుడవు. బృందావనంలోని దేవతలందరి చేత స్తుతింపబడుతున్నవాడవు. శంకరాదులే నిన్ను స్తుతిస్తున్నారు. ఆనంద ఘన స్వరూపుడవైన రామా! నీకివే నమస్కారాలు. రామా! మరకతవర్ణా! మధురాధిపా! (రామకృష్ణావతారాల్లో మధురతో బంధమున్నది) నిన్ను నానాశాస్త్రాలు వేదాలు ప్రతిపాదించాయి. నీవు నిత్యానందుడవు; విశుద్ధజ్ఞాన స్వరూపుడవు; అనాదివి. మా కార్యం సిద్ధింపజేయడానికై మానవ రూపంలో అవతరించిన స్వామీ! నీకివే నమస్కారాలు. ఈ స్తవం బ్రహ్మజ్ఞాన విధాయకం. ఈ శ్రేష్ఠ బ్రహ్మ స్తవాన్ని శ్రద్ధాయుక్తుడై పఠించే, భూమండలంలోని మానవుడెవడైనా స్వామి అనుగ్రహంతో సమస్త పాతకాల నుండి దూరమవుతాడు. కామితప్రదుడు, ఈశుడు, శ్యామలవర్ణుడు అయిన రాముణ్ణి ధ్యానించి ఈ బ్రహ్మస్తవాన్ని పఠించాలి. లోకగురువైన బ్రహ్మ చేసిన ఈ స్తుతి అగ్నిదేవుడు విన్నాడు. కాంతితో ప్రకాశిస్తున్న, విమలారుణద్యుతి కలిగి వున్న రక్తాంబరధారిణి, దివ్యాభరణాలంకృత అయిన వైదేహిని తన అంకాన ఉంచుకొని ప్రత్యక్షమయ్యాడు. జగత్‌సాక్షి, ప్రసన్న సర్వార్తిహరుడు అయిన రామునితో అగ్నిదేవుడిలా అన్నాడు. రఘునాథా! ఇంతకుపూర్వం వనంలో మీరున్నప్పుడు, నాకు న్యాసంగా (భద్రత నిమిత్తమిచ్చి మళ్ళీ గ్రహించే విధంగా) ఇచ్చిన జానకీదేవిని తిరిగి తీసికోవలసినది.

ఓ ప్రభూ! హరిహరీ! అప్పుడు రావణుని ప్రాణహరణానికై మాయాసీతను కల్పించావు; దశకంఠుణ్ణి సపుత్ర బాంధవంగా అంతం చేశావు; భూభారాన్ని తొలగించావు. దేనికొరకై నీవు ప్రతిబింబంబరూపిణిగా (మాయ) సీతను కల్పించావో ఆమె తన బాధ్యతలు నెరవేర్చింది; తిరోహితురాలయింది... అని చెప్పి నిలిచిన అగ్నిని రాముడు పూజించాడు; అతి సంతోషంతో జానకిని స్వీకరించాడు.

సదానపాయినీ (ఎప్పుడూ వీడి ఉండనిది) త్రిలోక జనని అయిన మహాలక్ష్మిని (జానకిని) లక్ష్మీపతి అయిన రాముడు తన ఒడిలో కూచోబెట్టుకొన్నాడు. జానకీయుతుడై లక్ష్మీ వైభవంతో ప్రకాశించే రామచంద్రుణ్ణి అందరూ చూశారు. సురనాయకుడు దేవేంద్రుడు సంతోషంతో, గద్గద స్వరంతో అంజలించాడు; భక్తిపూర్వకంగా ఇలా స్తుతించాడు.

ఇందీవరశ్యాముడైన రాముణ్ణి, సంసార మనే ఘోరారణ్యాన్ని దహించే అగ్నినాముణ్ణి, పార్వతీ మానసంలో ఎల్లప్పుడూ ధ్యానింపబడే ఆనందరూపుణ్ణి, అస్తినాస్తి అనే భావాల నెరుగని వాణ్ణి, శంకరాదుల శరణ్యుడైన శ్రీరాముణ్ణి నేను సదా సేవిస్తాను.

- ఇంకావుంది

గురువారం 18 డిసెంబర్, 2014

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ జయ, దక్షిణాయనం
హేమంత ఋతువు - మార్గశిరమాసం

తిథి: బహుళ ఏకాదశి ఉ.8.33
నక్షత్రం: స్వాతి రా.8.24
వర్జ్యం: రా.2.12 నుండి 4.01 వరకు
దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు
తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)
వృత్తిరీత్యా ఇబ్బందులను అధిగమిస్తారు. మానసికాందోళనతో కాలం గడుపుతారు. స్త్రీలు చేసే వ్యవహారాల్లో సమస్యలెదురవుతాయి. ఆకస్మిక ధననష్టం ఏర్పడే అవకాశముంటుంది. రహస్య శత్రువులపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది.

• వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. నూతన కార్యాలు ప్రారంభించకుండా నుండుట మంచిది.

• మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)
వృత్తి, ఉద్యోగ రంగాల్లో ఆలస్యంగా అభివృద్ధి ఉంటుంది. ధనస్థానం కలిగే అవకాశాలుంటాయి. ఏ విషయంలోను స్థిర నిర్ణయాలు తీసుకోలేకపోతారు.ముఖ్యమైన వ్యక్తుల్ని కలుస్తారు.

• కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండుటచే మానసికానందాన్ని పొందుతారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లో మంచి గుర్తింపు లభిస్తుంది. కొన్ని పనులు పూర్తిచేసుకోగలుగుతారు.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)
కుటుంబంలో సుఖ, సంతోషాలుంటాయి. ధన ధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. ప్రయత్న కార్యములు ఫలిస్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తినిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు.

• కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)
సంతృప్తికరంగా ఉంటారు. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలుంటాయి. అంతటా అనుకూల వాతావరణమేర్పడుతుంది. స్త్రీలు సౌభాగ్యాన్ని పొందుతారు. బంధు, మిత్రులు కలుస్తారు.

• తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)
అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనవసర వ్యయ ప్రయాసలుంటాయి. ప్రయాణాలెక్కువ చేస్తారు.

• వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)
స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ, ప్రయాసలు తప్పవు. కలహాలకు దూరంగా ఉండుటకు ప్రయత్నించాలి. దూర వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)
శుభకార్య ప్రయత్నాలు నెరవేరతాయి. ప్రయాణాలవల్ల లాభం చేకూరుతుంది. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి.

• మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)
స్త్రీల మూలకంగా లాభాలుంటాయి. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం పొందుతారు. శుభ వార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబం అంతా సౌఖ్యంగా ఉంటారు. అత్యంత సన్నిహితులను కలుస్తారు.

• కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)
అద్భుతమైన అవకాశాలను పొందుతారు. ముఖ్యమైన శుభవార్తలు వింటారు. ఆత్మీయుల సహాయ, సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి. అనుకోకుండా డబ్బు చేతికందుతుంది.

• మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)
గృహంలో మార్పును కోరుకుంటారు. ఇతరుల విమర్శలకు లోనవుతారు. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. ధనవ్యయం అయ్యే అవకాశం. బంధు, మిత్రులతో జాగ్రత్త అవసరం.

మంచిమాట

దూరం చేసుకోవాల్సిన గుణం

ద్వేషం రాక్షస గుణం. దీని ఫలితం వెంటనే వస్తుంది. కడివెడు పాలలో ఒక విషం బొట్టు వేస్తే పాలన్నీ ఎలా చెడిపోతాయో! అలాగే ద్వేషం అనే ఒక్క ఆలోచన మన మనస్సులో పుడితే, అది అమితమైన శక్తిని తీసుకొని, బుద్ధిని సరిగా పనిచేయనీయకుండా, మనస్సుకు శాంతిని లేకుండా చేస్తుంది.

ఎప్పుడైతే ద్వేషం, అసూయ అనే ఆలోచనలు మన మనస్సులోకి ప్రవేశించాయో! అప్పుడు దేహంలో ఒత్తిడి పెరుగుతుంది. ఆకలి నశిస్తుంది. నిద్రకు దూరమవుతాము.

మనస్తత్వ శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నది ఏమిటంటే చాలావేగంగా మన మనస్సు చెడువైపు ఎక్కువగా ఆకర్షింపబడుతుంది. ఇవి మనకు తెలియకుండానే ఆ భావనలు మన అచేతనంలో చేరుతాయి. చెడు గురించి తెలియజేసే పనిలో పత్రికలు, టీ.వీలు చెడుని ఎక్కువగా చూపించడం కూడా చాలామందిని ముఖ్యంగా యువతను బలహీన మనస్కులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

ఫలితంగా చెడు సంఘటనలు ఒకటికి పదిగా రెట్టింపు అవుతున్నాయే కానీ ఏమాత్రం తగ్గటం లేదు. యుద్ధాన్ని యుద్ధంతో సమాప్తం చేయలేము. మళ్ళీ ఎప్పటికైనా యుద్ధమే వస్తుంది. యుద్ధాన్ని శాంతితో ద్వేషాన్ని క్షమతోనే పరిసమాప్తం చేయగలం. వ్యతిరేక ఆలోచనలు ఎప్పుడూ వ్యతిరేక ఫలితాలనే ఇస్తాయి.

ఒకసారి గౌతమబుద్ధుని సదానందుడనే బ్రాహ్మణుడు తన ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు. బుద్ధుడు సదానందుడి ఇంటికి వెళ్ళినప్పుడు సదానందుడు భోజనం పెట్టకపోగా, నోటికి వచ్చినట్లు దూషించసాగాడు. అలా అతను అలసిపోయేంతసేపు బుద్ధుని ద్వేషిస్తూ అనరాని మాటలు అన్నాడు. సదానందుడు తిడుతున్నంత సేపూ బుద్ధుడు పళ్లెత్తు మాట అనలేదు సరికదా నవ్వుతూ చూశాడు.

క్రోధంతో, తిట్లతో అలసిపోయాడు సదానందుడు. బుద్ధుడు 'సదానందా! మీ ఇంటికి బంధువులు వస్తారుకదా! వస్తే ఏం చేస్తావు?'' అని ప్రశ్నించాడు.

''మంచి విందు ఏర్పాటుచేస్తాను''అని బదులిచ్చాడు సదానందుడు.

''వాళ్ళు ఇప్పుడే ఆరగించి వచ్చాం. అంటే ఏం చేస్తావు?'' అడిగాడు బుద్ధుడు.

''ఏం చేస్తాం. ఆ వండిన వంటలు మేమే భోం చేస్తాం..'' టక్కున బదులుచ్చాడు సదానందుడు.

''సరే సదానందా, ఇప్పటిదాకా దూషించిన నీ దూషణలన్నీ నేను స్వీకరించడం లేదు. నువ్వే స్వీకరించు..''అని చెప్పి బయలుదేరాడు బుద్ధుడు. ఒక్క మాటతో తన తప్పు తెలిసి వచ్చిన సదానందుడు బుద్ధుడి కాళ్ళపైబడి పశ్చాత్తాప పడ్డాడు.

ఇలా ద్వేషంతో, అసూయతో క్రోధంతో రగిలిపోయే వాళ్ళను అంతకుమించిన ద్వేషంతో మార్చలేము. సహనంతో, చక్కని ప్రతిచర్యతో మాత్రమే వారిలో మార్పు తీసుకురాగలము.

ఇక్కడ బుద్ధుడు చేసింది కూడా అదే. తన తప్పు తనకే తెలిసి వచ్చేట్లు చేశాడు. ఎదుటివానిలో ద్వేషాన్ని తొలగించి జ్ఞానాన్ని వెలిగించాడు. ద్వేషం ద్వేషంతో పోదు. ఇంకా ద్వేషాన్ని పెంచుతుంది. ద్వేషాన్ని ప్రేమతోనూ, సహనంతోనూ క్షమతోనూ జయించాలి.

సహనం ఒక ఆభరణం లాంటిది అది ఉన్న వారితో ద్వేషధారులు ఎంత మంది కలిసి పోరాడినా గెలవలేరు. ద్వేషించేవారిని తిరిగి ద్వేషించకపోవడమే వారిలో తప్పక మార్పును తెస్తుంది.

- పి.వి.రమణకుమార్

● మంచిమాట శీర్షికకు ఆధ్యాత్మిక సంబంధమైన వ్యాసాలను సులభశైలిలో ఎవరైనా సొంతంగా రాసి పంపించవచ్చు. రచనలు పాఠకులకు ఆసక్తికరంగా వుండాలి. మూడు అరకాపులకు తగ్గకుండా వుండాలి. ప్రచురించిన రచనలకు పారితోషికం ఉంటుంది.

సత్యభామ 46

బొమ్మలు: శ్రీరామ్



మాటాట

నిర్వహణ: సుధామ 586



ఆధారాలు

ఆధారాలు: 85
అడ్డం
1. కథల మాస్టారు
3. శివ తాండవం ఓ నృత్యరీతి
5. అంచేత
8. లెక్కలు
9. అందగత్తెల జాతి
11. కుమారి కాదు
13. వాణితో ఒకనాటి నటి
14. సిగ్గు

నిలువు
2. వచ్చుట
3. చతుర్ముఖ పారాయణం అంటే దీనితో ఆట
4. సర్పం
6. బహువచనం లేని నువ్వులు
7. పద్మం
10. పార్వతి
11. మహాప్రస్థాన కవి
12. నువ్వుగింజ

మాటాట - 585 సమాధానం

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

ఎవరి 'ఇంటర్' వారిదే!

ఫోకస్

ఇంటర్మీడియట్ బోర్డు... గత ఆరు మాసాలుగా వార్తల్లో విపరీతంగా వినిపించిన సంస్థ... ఎట్టకేలకు రెండు ముక్కలైంది. తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఆవిర్భవించడంతో ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు, తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డుగా రూపాంతరం చెందాయి. డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ ఇనస్ట్రక్షన్ 1971లో ఇంటర్మీడియట్ బోర్డుగా మారి గత 44 ఏళ్లలో ఎన్నో మైలురాళ్లు దాటింది. భారతదేశంలో అత్యాధునిక సిలబస్‌ను, సంపూర్ణ సౌకర్యాలతో ప్రభుత్వ రంగంలో అత్యధిక కాలేజీలను ఏర్పాటు చేసుకోవడమేగాక, బోధనలోనూ, ప్రమాణాలలోనూ దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉండేది. భారతదేశం మొత్తం మీద చూసుకుంటే ప్రభుత్వ కాలేజీల పరంగానూ మన రెండు రాష్ట్రాల్లోనే ఎక్కువ. అలాగే ప్రైవేటు ఎయిడెడ్ కాలేజీల విషయంలో కూడా మన రెండు రాష్ట్రాల్లోనే కాలేజీలు ఎక్కువ. రోజురోజుకూ విద్యాపరిమళం వ్యాపించి జాతీయ స్థాయిలో జరిగిన అన్ని ప్రవేశపరీక్షల్లోనూ ఆంధ్రప్రదేశ్ విద్యార్థులే అగ్రగణ్యులుగా నిలిచారు. ఐఐటి జెఇఇ, ఎయిమ్స్ వంటి జాతీయ ప్రతిష్ఠాత్మక సంస్థల్లో కూడా తెలుగు విద్యార్థులు తమ సత్తాను ప్రదర్శించారు, ప్రదర్శిస్తూనే ఉన్నారు. టాపర్లు అవుతున్నారు. తొలుత కొన్ని ర్యాంకులకే పరిమితం కాగా, ఇపుడు జాతీయ స్థాయిలో తొలి వంద ర్యాంకుల్లో మనవాళ్లే అత్యధికంగా ఉంటున్నారు. అతితక్కువ సీట్లు ఉండే ఎయిమ్స్ లాంటి సంస్థల్లో కూడా మనవాళ్లు పెద్ద ఎత్తున ఎంపికవుతున్నారు. అది ఎంతవరకూ పోయిందంటే ప్రతి రెండు సీట్లలో ఒకరు మనవారే కావడంతో ఐఐటి జెఇఇ ప్రవేశపరీక్ష విధానంలో కూడా మార్పులు తీసుకువచ్చింది. మెరిట్ ర్యాంకులు ఇచ్చే విధానంలో మార్పులు చేశారు. అయినా తెలుగు రాష్ట్రాల విద్యార్థులకే అది మరింత కలిసొచ్చింది. సీట్లు పొందేవారి సంఖ్య పెరిగింది. దాంతో మరోమారు మార్పులు చేయాలని ఐఐటి జెఇఇ కమిటీ నిర్ణయించింది. వాస్తవానికి తాజాగా చేసిన మార్పులు కూడా తెలుగువారికి మరింత ప్రయోజనాన్ని కలిగించేవే. ఇంటర్మీడియట్ విద్య 1969-70 విద్యా సంవత్సరంలో ప్రారంభమైంది. రెండేళ్ల కోర్సును ఇంటర్ విద్యగా గుర్తించారు. 1971 నుండి ఇంటర్మీడియట్ కోర్సునకు సంబంధించి 1978-79 విద్యా సంవత్సరం నుండి ఫస్టియర్‌కు వేరుగా, సెకండియర్‌కు వేరుగా పరీక్షలు నిర్వహించడం మొదలుపెట్టారు. అంతకుముందు రెండు సంవత్సరాలకు కలిపి ఒకేమారు పరీక్షలు పెట్టేవారు. అక్కడి నుండి ఇంటర్మీడియట్ గాడిలో పడింది. పరీక్షల సంస్కరణలు నిజానికి ఇంటర్మీడియట్ నుండే మొదలయ్యాయి. ఇంటర్ విద్యార్థుల జంబ్లింగ్ విధానం, జవాబుపత్రాల జిరాక్స్ కాపీలను అందజేయడం, జూనియర్ లెక్చరర్లకు శిక్షణ, అకడమిక్ ఆడిట్ విభాగం ఏర్పాటు, రీజనల్ ఇనస్పెక్టింగ్ వ్యవస్థ మొదలుకుంటే పరీక్షల్లో కూర్చుని రాసేవారిని సైతం జంబ్లింగ్ చేయడం వంటి అనేక చర్యలను బోర్డు తీసుకుంది. దేశంలో అత్యంత పకడ్బందీగా పరీక్షలు నిర్వహించే బోర్డుగా ఖ్యాతి గడించింది. ప్రస్తుతం 14 నుండి 16 లక్షల మంది విద్యార్థులు ఏటా పరీక్షలకు హాజరవుతున్నారు.

ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విడిపోయింది. తెలంగాణ కొత్త రాష్ట్రం అయింది. దాంతో తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక ఇంటర్మీడియట్ బోర్డును ఏర్పాటు చేసింది. అంతవరకూ ఉమ్మడిగా ఉన్న పరీక్షలను ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ప్రత్యేకంగా నిర్వహించుకోవాలనే ఆలోచన వచ్చింది. ఆంధ్రప్రదేశ్ మాత్రం కలిసే పరీక్షలు నిర్వహిద్దామని వాదించింది. తెలంగాణ రాష్ట్రం మాత్రం మేం వేరుగా పరీక్షలు నిర్వహించుకుంటామని చెప్పింది. రెండు రాష్ట్రాల మధ్య విద్యాసంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. ఒక దశలో తెలంగాణ రాష్ట్రం స్థానికత అంశం తెరమీదకు తెచ్చింది. 'ఫాస్ట్' పేరిట ఫీజుల రీయింబర్స్‌మెంట్ విధానానికి నిబంధనలు జారీ చేయడంతో ఇంటర్ పరీక్షల వ్యవహారం కాస్తా ముదిరింది. అదే సమయంలో ఇంజనీరింగ్ కాలేజీల్లో రెండో దశ కౌన్సెలింగ్ అంశం, ఉన్నత విద్యా మండలి ఏర్పాటు విషయంలో కూడా ఇరు రాష్ట్రాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంది. కలిసే పరీక్షలు నిర్వహించాలన్న ఆంధ్రప్రదేశ్ వాదనను తెలంగాణ ప్రభుత్వం తిప్పికొట్టింది. ఒక దశలో ఇంటర్ బోర్డు తమదేనని, కావాలంటే ఆంధ్రా విద్యార్థులకు కొంత సర్వీసు రుసుం తీసుకుని తామే పరీక్షలు నిర్వహిస్తామని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. బోర్డు మాదే అంటే మాదే అనే పరిస్థితి వచ్చింది. దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్‌కు ఫిర్యాదు చేసింది, మరోపక్క కేంద్రం దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకువెళ్లింది. పదేళ్ల వరకూ ఉమ్మడిగానే పరీక్షలు నిర్వహించుకోవాలనే ఒడంబడికను తెలంగాణ ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని ఆంధ్రప్రదేశ్ వాదించింది. రాష్ట్రాలు విడిపోయాక, ఇక ఉమ్మడిగా పరీక్షలు నిర్వహించడం ఏమిటని తెలంగాణ ప్రభుత్వం కొట్టిపారేసింది. చివరికి ఇరు రాష్ట్రాల వాదనలను గమనించిన గవర్నర్ మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, గంటా శ్రీనివాసరావులను పిలిచి మాట్లాడారు. అయితే గవర్నర్ సమక్షంలోనూ వ్యవహారం సద్దుమణకపోవడమేగాక, అది కాస్తా మరింత ముదిరింది. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ఇంటర్మీడియట్ బోర్డును ఏర్పాటు చేస్తూ, ఉత్తర్వులను జారీ చేసింది. బోర్డు కార్యదర్శిని కూడా నియమించింది. ప్రస్తుత బోర్డులో ఉన్న సిబ్బందిని రెండు విభాగాలుగా పంచిపెట్టారు. పరీక్షల టైమ్ టేబుళ్లు వెలువడ్డాయి. మరో నెల రోజుల్లో పరీక్షలకు కౌంట్‌డౌన్ స్టార్టవుతుంది. జనవరిలోనే కామన్ సబ్జెక్టులకు పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్ మొదలవుతాయి. ఇంతవరకూ జరిగిన వివాదంపై పలు రంగాలకు చెందిన ప్రముఖుల అభిప్రాయాలే ఈ వారం ఫోకస్.

విడిగా ఇంటర్.. కలిసే ఎమ్సెట్



మాధ్యమిక విద్య విడిపోవడానికి ఇదే సరైన సమయం. ఇంటర్మీడియట్ బోర్డు విడిపోవాలనే నేను కోరుకుంటున్నాను. ఎవరికి ఇష్టమున్నా లేకున్నా నా అభిప్రాయం ఇదే. విభజన వల్ల రెండు రాష్ట్రాల విద్యార్థులకూ మేలు జరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే సమాజంలో వైషమ్యాలకు ఇంటర్మీడియట్ విద్య కారణభూతం అయిందని అంగీకరించాల్సిందే, తెలంగాణ ఉద్యమంతో గుణపాఠాలు నేర్చుకోవాలి, ఎక్కడైతే లోపాలు, బలహీనతలు ఉన్నాయో అక్కడ ఉద్యమాలు, ప్రాంతీయ తత్వం పెరుగుతుంది. రాయలసీమలో ఇప్పటికీ విద్య అంత బలంగా లేదు. అలాంటి చోట ప్రభుత్వం దృష్టి పెట్టాల్సింది. ఇంటర్మీడియట్ విద్యే మొత్తం విద్యారంగానికి నాడి వంటిది. అక్కడి నుండే వృత్తి, సాంకేతిక విద్యాసంస్థల్లోకి విద్యార్థులు ప్రవేశిస్తారు. అందుకే ఇంటర్మీడియట్ విద్య రెండు రాష్ట్రాలకూ చాలా కీలకం. ఆంధ్రా ప్రాంతంలో ఇంటర్మీడియట్ విద్యను కన్సాలిడేట్ చేయాలి, కాని తెలంగాణ ప్రాంతంలో ఇంటర్ విద్యను పునర్నిర్మించాలి. అందుకే బోర్డు విడిపోవడం అనేది మంచిది అంటున్నాను. ఇంటర్మీడియట్ విద్యతో తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనా కార్యకుశలత, విద్యాత్మక సామర్థ్యం, ఉత్కృష్టత, దక్షత, సమర్థత, ఫలోత్పాదక శక్తి సాధించాల్సి ఉంటుంది. వృత్తివిద్యపై ప్రత్యేకంగా దృష్టి సారించడం, విద్యార్థుల్లో వృత్తివిద్యా కౌశల్యాన్ని పెంచడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన్ని వికాసాన్ని అందించడం చాలా ముఖ్యం. అభ్యసన ప్రక్రియలో ఐసిటి వినియోగించడం ద్వారా మరింత స్పష్టంగా, నిర్దిష్టంగా చెప్పగలుగుతాం. ప్రత్యేక రంగాలకు చెందిన వారిలో నైపుణ్యాలు పెంచాల్సి ఉంటుంది.

నిజానికి ఇంటర్మీడియట్ విద్య విభజన అనేది పాలనాపరమైనదే కాదు, ఈ మాట ఎందుకు అంటున్నానంటే పరీక్షలకు క్లాసు రూం టీచింగ్‌కూ సంబంధం ఉంటుంది. టీచింగ్‌కు టీచర్ల సామర్థ్యానికి సంబంధం ఉంటుంది. నేడు పరీక్షలతో విద్యార్థి సామర్థ్యాన్ని, టీచర్ల సామర్థ్యాలను అంచనా వేస్తున్నాం. పరీక్ష అనేది అంతిమ నిర్ణయం తప్ప ఆది నిర్ణయం కాదని అర్థం చేసుకోవాలి. ప్రశ్నాపత్రాల ఆధారిత చదువు పోవాలి, అందుకే తెలంగాణ ఆంధ్రా ప్రాంతాల్లో లక్ష్యాల్లో తేడా ఉందని అంటున్నాను. ఆంధ్రాలో చదువుకు గట్టి పునాది ఉంది, మంచి విద్యా సంస్థలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ స్కూళ్లున్నాయి. వాటిని మరింత పటిష్ట పరచాలి. హైదరాబాద్ వదిలి వెళ్తే తెలంగాణలో ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వ కాలేజీలు మండల స్థాయిలో లేవు. కాంట్రాక్టు టీచర్ల వ్యవస్థను తొలగించి అర్హులైన నిపుణులైన అధ్యాపకులను నియమించుకోవలసి ఉంది. ఎమ్సెట్‌ను విడిగా కాకుండా కలిసే నిర్వహించుకోవాలి. ప్రత్యేకించి ఎమ్సెట్ నిర్వహిస్తే ఎక్స్‌లెన్సీకి ప్రాధాన్యత వస్తుంది. ఈక్విటీ రావాలంటే కలిసి ఉమ్మడిగానే ఎమ్సెట్ నిర్వహించుకోవాలి. ప్రిన్సిపాల్ మొదలు అటెండర్ వరకూ కాంట్రాక్టు సిబ్బందినే నియమించుకుంటే ఏం ప్రయోజనం. ఉత్తమమైన టీచర్ విద్యలో వెనుకబడిన విద్యార్థులకు చాలా అవసరం. మంచి విద్యార్థులు స్వతహాగానే చదువుకోగలుగుతారు, కాని చదవురాని వారికి, చదువుకుందామంటే సౌకర్యం లేనివారికే కదా మంచి టీచర్లు కావల్సింది.

-డాక్టర్ చుక్కా రామయ్య
విద్యా నిపుణులు,
శాసనమండలి మాజీ సభ్యులు

విద్యార్థుల మేలు కోసమే..

ఉమ్మడిగా ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ కోరుకున్నది విద్యార్థుల మేలు కోసమే, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాలను అమలుచేయమని, వాటిని కట్టుబడి ఉండాలని కోరుకుంటున్నాం. అంతకుమించి ఆంధ్రప్రదేశ్‌కు ఈ విషయంలో ప్రత్యేక ఇంటరెస్టులు ఏమీ లేవు. ఏ నిర్ణయమైనా రెండు రాష్ట్రాల విద్యార్థుల శ్రేయస్సు కోసమే అనేది అర్థం చేసుకోవాలి. నిర్దేశించిన నియమాలు నిబంధనలు పాటించాల్సిన అవసరం అందరిపై ఉంటుంది. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోమని, ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలకు సహకరించమని ఎంతో ఓపికతోనూ, సహనంతోనూ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరాం. ఇదే అంశం గవర్నర్ సమక్షంలోనూ చర్చకు వచ్చింది. గవర్నర్ ఎలా సూచిస్తే అలాగే చేయాలని నిర్ణయించుకున్నాం. పరీక్షలు ఉమ్మడిగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు రాకుంటే న్యాయపోరాటం చేయాలనే ఆలోచన వచ్చినా, విద్యార్థులపై వత్తిడి పెరగకూడదని, విద్యా సంవత్సరం పాటించడంలో సమస్యలు తలెత్తరాదనే ఆంధ్రప్రదేశ్ తన పరీక్షలను తానే నిర్వహించుకోవాలని నిర్ణయించింది. తాజా పరిస్థితుల్లో విడిగానే ఇంటర్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించాం. ఉమ్మడిగా పరీక్షలు నిర్వహించాలనే ప్రతిపాదనకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో అనివార్యంగా వేరుగా నిర్వహించాల్సి వస్తోంది. ఆంధ్రా ప్రాంతానికి ఇంటర్ పరీక్షలు మార్చి 11 నుండి జరుగుతాయి. వేరుగా పరీక్షలు నిర్వహించుకోవాలన్న నిర్ణయంతో తెలంగాణ ప్రభుత్వం పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘించినట్టయింది. అయినా రెండు రాష్ట్రాలు కలిసి పనిచేయాలనేదే మా అభిమతం.

-గంటా శ్రీనివాసరావు
ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి

వేరువేరుగా నిర్వహించడమే మంచిది

ఇంటర్మీడియట్ పరీక్షలను ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు వేరువేరుగా నిర్వహించడం ఉత్తమమైన విధానం. పరస్పరం అనుమానాలు, సందేహాలు, సంశయాలు చుట్టుముట్టిన తరుణంలో విద్యార్థుల జీవితాలకు సంబంధించి కీలకమైన ఇంటర్ పరీక్షల విషయంలో రెండు రాష్ట్రాలు స్పష్టతతో ఉండాలని భావిస్తున్నాను. ఇంటర్ పరీక్షలను వేరుగా నిర్వహించడం వల్ల విద్యార్థులకు మేలు చేసినట్లవుతుంది. ఇంటర్ పరీక్షలను మాత్రమే బోర్డు నిర్వహిస్తుంది. కాని పరీక్షల నిర్వహణకు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం తోడ్పాటు అవసరం. అలాగే రెండు ప్రభుత్వాలు తమ పరిధిలో ఇంటర్ పరీక్షలను పారదర్శకంగా, సకాలంలో నిర్వహించుకునేందుకు వెసులుబాటు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఇంటర్ పరీక్షలను ఎక్కడా ఉమ్మడిగా నిర్వహించాలని లేదు. ఏ నిబంధనలు కూడా చట్టంలో లేవు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటర్ పరీక్షల నిర్వహణకు కీచులాడుకోవడం వల్ల విద్యార్థులు, తల్లితండ్రుల్లో ఆందోళన కలుగుతోంది. తెలంగాణ మంత్రి చైర్మన్‌గా, ఆంధ్ర మంత్రి వైస్ చైర్మన్‌గా కమిటీ వేసి ఇంటర్ పరీక్షలు నిర్వహించాలనే ప్రతిపాదన వచ్చింది. ఒకవేళ కరీంనగర్‌లో పేపర్ లీకయితే ఆంధ్ర మంత్రి ఆదేశాలను ఎవరు పాటిస్తారు, అలాగే విశాఖలో పరీక్ష పేపర్ లీకయితే, తెలంగాణ మంత్రి ఆదేశాలను అక్కడ అధికారులు పాటిస్తారా? ఇవేమీ అమలు జరగవు. ఆచరణలో ఇవేమీ సాధ్యం కావు. అలాగే జవాబుపత్రాలను ఉమ్మడిగా దిద్దితే, అధ్యాపకులు సరిగా దిద్దలేదని, చిత్తశుద్ధి లేదని, తమ ప్రాంతం వారికి ఎక్కువ మార్కులు వేశారనే అనుమానాలు, అభియోగాలు వస్తాయి. ఇంత రాద్ధాంతం అవసరమా? ఈ అనుమానాలు రెండు ప్రాంతాల వారికి వస్తాయి. అందుకే ఎవరి ఇంటర్ పరీక్ష నిర్వహణ వారిదే. ఎవరి జవాబు పత్రాలు వారే దిద్దుకునే విధంగానే ఈ పరీక్షలను నిర్వహించాలి. ఎమ్సెట్ పరీక్షను కూడా ఉమ్మడిగా కాకుండా వేరువేరుగా నిర్వహించడం మంచిది. 25 శాతం మార్కులు వెయిటేజీగా ఇస్తున్నారు. మార్కులు ఎక్కువే సుకున్నారనే అ హో ^హ ల ం కూడా విద్యార్థులకు వస్తాయి. అందుకే ఐఐటి తరహాలో పర్సంటైల్ విధానాన్ని అనుసరించడం మంచిది. ఇప్పుడున్న వెయిటేజీని రద్దు చేయడం మంచిది. ఎమ్సెట్ అడ్మిషన్లు ఉమ్మడిగానే ఉంటాయి. చట్టం ప్రకారం ఉమ్మడి ప్రవేశాలు పదేళ్లు ఉంటాయి. కాబట్టి వేరువేరుగానే ఇంటర్, ఎమ్సెట్ నిర్వహించిన తర్వాత ఉమ్మడి అడ్మిషన్లను నిబంధనల మేరకు అంటే నాలుగు సంవత్సరాలు ఎక్కడ చదివితే అక్కడ లోకల్ అనే విధంగా ప్రవేశాలు చేయడం మంచిది. ఈ నిబంధనను ఎవరూ ఉల్లంఘించలేరు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు వివాదాలను పక్కనపెట్టి, విద్యార్థుల్లో గందరగోళం, ఆందోళన పెరగకుండా విడివిడిగా ఇంటర్, ఎమ్సెట్ పరీక్షలను నిర్వహించడం, అనంతరం మెరిట్, రిజర్వేషన్, స్థానికత ప్రాతిపదికన చట్టం నిబంధనల మేరకు ఉమ్మడి ప్రవేశాలు జరపాలని కోరుతున్నాం.

- డాక్టర్ పి. మధుసూదన రెడ్డి
అధ్యక్షుడు, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం

పరీక్షలకు ఇబ్బందేమీ లేదు



విడిపోయిన తరువాత ఎవరి పాలన వాళ్లు చేసుకోవడం మంచిది. తెలంగాణలో ఇంటర్ మీడియట్ పరీక్షలను తెలంగాణనే సొంతంగా నిర్వహించుకుంటుందని మొదటి నుంచి చెబుతున్నాం. ఇంటర్ మీడియట్ పరీక్షల షెడ్యూల్‌ను కూడా ప్రకటించాం. పరీక్షల నిర్వాహణకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించాం. సిబ్బంది ఆ పనుల్లో ఉంది. తెలంగాణ ప్రభుత్వానికి పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేవు. జెఇఇ మేయిన్‌కు ముందే ఇంటర్ మీడియట్ పరీక్షలు పూర్తి చేస్తాం. ఎవరి పరీక్షలు వారు నిర్వహించుకుందామని మేం ముందు నుంచి చెబుతున్నాం. ఈ అంశంలో పొరుగు రాష్ట్రం వాదనను మేము అంగీకరించేది లేదని ముందు నుంచి చెబుతున్నాం. తెలంగాణలో పరీక్షలు తెలంగాణ నిర్వహిస్తుంది, ఆంధ్రలో ఆంధ్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. దీనికి విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ముందుగా ప్రకటించిన విధంగానే పరీక్షలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం ఇంటర్ మీడియట్ పరీక్షలు సొంతంగా నిర్వహించుకోవడానికి ఎలాంటి అడ్డంకులు లేవు. తెలంగాణ ఇంటర్ మీడియట్ బోర్డును ఏర్పాటు చేశాం. అధికారులకు బాధ్యతలు అప్పగించాం. పదేళ్ల పాటు ఉమ్మడిగా ప్రవేశాలు ఉంటాయని విభజన చట్టంలో చెప్పిన దాన్ని అమలు చేస్తాం. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టి మళ్లించడానికి ఆంధ్రప్రదేశ్ నాయకులు ఇంటర్ మీడియట్ పరీక్షలపై వివాదం సృష్టించేందుకు ప్రయత్నించారు. చివరు మేము ముందు ఏ మాట చెప్పామో దానికే కట్టుబడి ఉన్నాం, ఆ మాట ప్రకారమే విడివిడిగానే పరీక్షలు జరుగుతున్నాయి. రాష్ట్రమే విడిపోయిన తరువాత ఇంకా ఉమ్మడి పరీక్షలు అవసరమా? ఆలోచించాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్ పరీక్షలు నిర్వహించమని అడిగితే నిర్వహించేందుకు సిద్ధమే అని కూడా చెప్పాం. ఇప్పుడు వివాదం ఏమీ లేదు. ఎవరి పరీక్షలు వారు చక్కగా నిర్వహించుకుంటారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- జి జగదీశ్‌రెడ్డి
తెలంగాణ విద్యా శాఖ మంత్రి

ఎబివిపి స్వాగతిస్తోంది

తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలను వేర్వేరుగా నిర్వహించడాన్ని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఎబివిపి) స్వాగతిస్తోంది. ఇంటర్మీడియట్ పరీక్షలను వేర్వేరుగా నిర్వహించాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని సముచితమైన నిర్ణయంగా భావిస్తున్నాము. ఇంటర్ పరీక్షలకు సిద్ధమవుతున్న రెండు రాష్ట్రాల్లోని లక్షలాది మంది విద్యార్థులు ఒకింత గందరగోళానికి గురయ్యే పరిస్థితి కల్పించడంలో రెండు రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులు తమ వంతు పాత్ర పోషించారనడంలో సందేహం లేదు. రెండు రాష్ట్రాల మంత్రులు కొంత కాలంగా చేస్తూ వచ్చిన ప్రకటనలు ఉద్రిక్త పరిస్థితిని కల్పించడమే కాకుండా, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గందరగోళానికి గురిచేశాయి. పరీక్ష తేదీలను ఖరారు చేయడంలో ఇంటర్ బోర్డు అధికారులు ఇద్దరు విద్యాశాఖ మంత్రులను ఒక దరికి చేర్చేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ఈ నేపథ్యంలో గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ వద్ద కూడా చర్చలు జరిగాయి. ఇరువురు మంత్రులు గవర్నర్‌ను కలిసి, ఆయన సమక్షంలోనే చర్చలు జరిపారు. అయితే మంత్రులు గవర్నర్ వద్ద ఒక మాట, బయటకు వచ్చాక వేరొక మాట మాట్లాడటంతో పరిస్థితి విషమించింది. సమైక్య రాష్ట్రం విభజనకు పూర్వమే ఇంటర్ బోర్డు పునర్వ్యవస్థీకరణపై జోరుగా చర్చలు జరిగాయి. ఇంటర్ బోర్డును ఐదు జోన్లుగా విభజించాలన్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమయింది. ప్రొఫెసర్ నీరదారెడ్డి నేతృత్వంలో ఒక కమిషన్ ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ సైతం జోన్లు ఉండాలనే సూచించింది. నీరదారెడ్డి కమిషన్ సిఫార్సులు కూడా అమల్లోకి రాలేదు. చివరకు సమైక్య ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిపోయింది. ఈ పరిస్థితిలో ఇంటర్మీడియట్ పరీక్షలు వేర్వేరుగా ఉంటేనే బాగుంటుందని పలువురు భావించారు. ఇంటర్మీడియట్ కళాశాలల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం వల్ల పర్యవేక్షణ చేయడం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అధికారులకు భారంగా మారింది. ఇంటర్ కళాశాలలన్నీ ఒకే బోర్డు కింద పనిచేయడం వల్ల పర్యవేక్షణ ఇబ్బందికరంగా ఉంది. వికేంద్రీకరణ జరిగితే మంచి ఫలితాలు ఉంటాయి. ఇంటర్మీడియట్ పరీక్షలు రెండు రాష్ట్రాలు వేర్వేరుగా నిర్వహించడం వల్ల జాతీయస్థాయి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు లాభం పొందుతారనడంలో సందేహం లేదు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) లాంటి సంస్థల్లో సొంత రాష్ట్రం ఆధారంగా ప్రాధాన్యత లభిస్తుంది. ఆయా రాష్ట్రాలు వారి రాష్ట్రాలకు అనుగుణంగా సిలబస్ మార్చుకునే సౌలభ్యం కలుగుతుంది. పరీక్షలు వేర్వేరుగా ఉండటం వల్ల బోర్డుపై పనిభారం తగ్గుతుంది. ఉమ్మడిగా పరీక్షలు జరిగితే కొన్ని నష్టాలు వస్తాయి. మారుమూల ప్రాంతంలోని ఒక పరీక్షా కేంద్రంలో అవకతవకలు జరిగితే మరో ప్రాంతంలోని విద్యార్థులు ఇక్కట్లకు గురికాకుండా నివారించేందుకు వీలవుతుంది. పరీక్షలు వేర్వేరుగానే జరగాలంటూ ఎబివిపి నేతృత్వంలో ఉద్యమం జరిగింది. ప్రతి అంశంలో కూడా సమస్యలు ఉంటాయి. సమస్యలను పరిష్కరించడంలో వివేకం ప్రదర్శించాల్సిన అవసరం ఉంది.

- జమాల్‌పూర్ నిరంజన్,
కార్యదర్శి, ఎబివిపి, తెలంగాణ రాష్ట్రం

పిల్లల్ని ఇక్కట్లకు గురిచేయవద్దు

తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో గొడవపడటం అనవసరం. విద్యార్థులను టెన్షన్‌కు గురిచేయకుండా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తే బాగుండేది. విద్యా సంవత్సరం మధ్యలో ఉండగా పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటే సరిపోయేది. ప్రస్తుతానికి ఉమ్మడిగానే పరీక్షలు నిర్వహించి, వచ్చే విద్యాసంవత్సరం నుండి వేర్వేరుగా పరీక్షలు నిర్వహించుకుంటే బాగుండేది. ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా విద్యార్థులకు సౌకర్యంగా ఉండాలి. విద్యార్థులను ఇబ్బందికి గురి చేయకుండా చూడాలి. రాజకీయ గొడవలతో విద్యార్థులకు ఎలాంటి సంబంధం లేదు. అందువల్ల రాజకీయాల్లో విద్యార్థులను పావులుగా మారేలా చేయడం సమంజసం కాదు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు రాజకీయ ప్రయోజనం కోసం గొడవలు పడితే ఎవరికీ ఇబ్బంది లేదు. విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశాల్లో జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది.

ఉన్నత విద్యలో కాని, పాఠశాల విద్యలో కాని ఎలాంటి సమస్య రాలేదు. యూనివర్సిటీలు స్వతంత్రంగా పనిచేస్తుండటం వల్ల ఏ యూనివర్సిటీ పరిధిలో ఆ యూనివర్సిటీ నిర్ణయాలు తీసుకుంటోంది. పాఠశాల విద్య, పదోతరగతి విద్యార్థులకు నిర్వహించే పరీక్షల్లో కూడా ఎలాంటి వివాదం తలెత్తలేదు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల్లో వేర్వేరుగానే పరీక్షలు జరుగుతున్నాయి.



ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు సాధించే మార్కులకు ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రాధాన్యత ఇస్తుండటం వల్ల ఇంటర్ పరీక్షలకు ప్రాధాన్యత పెరిగింది. ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ తదితర కాలేజీల్లో చేరేందుకు ఇంటర్ పరీక్షల్లో వచ్చే మార్కులకు వెయిటేజీ ఇవ్వడం వల్ల ఇంటర్ పరీక్షలు కీలకంగా మారాయి. ఇంటర్మీడియట్ విద్యలో కార్పొరేటర్ కల్చర్ రావడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎమ్సెట్ నిర్వహించడమే అనేక అనర్థాలకు దారితీస్తోంది. ఎంసెట్ వల్ల ఇంటర్‌కు ప్రాధాన్యత తగ్గిపోయింది. అది వేరే విషయం.

పోలవరం లాంటి అంశాలపై లేని వివాదం ఇంటర్ బోర్డు నిర్వహించే పరీక్షలకు ఎదురుకావడం దురదృష్టకరం. తీవ్రమైన అంశాలను పరిష్కరించుకోవడంలో రెండు రాష్ట్రాలు దృష్టి కేంద్రీకరిస్తే బాగుంటుంది. ఎట్టి పరిస్థితిలోనూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత రెండు రాష్ట్రాల ప్రభుత్వాలపై ఉందనడంలో సందేహం లేదు.

- జి. హరగోపాల్
ప్రొఫెసర్ (రిటైర్డ్)

అంతర్జాతీయ స్థాయికి ప్రమాణాలు

కొత్త రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి మొదలు, మంత్రులు, ప్రధాన కార్యదర్శి, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు ఏర్పాటయ్యారు. రేపోమాపో హైకోర్టు కూడా ప్రత్యేకంగా ఏర్పాటవుతుంది. తెలంగాణ రాష్ట్రం మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ఇంక సొంత సంస్థలు ఏర్పాటు అనివార్యం... అందులో భాగంగానే ఇంటర్ విద్యా బోర్డు ఏర్పాటయింది. దానిని ఒక పెద్ద చర్చనీయాంశం చేయడం ఎంతమాత్రం సబబుకాదు. ఐసిఎస్‌ఇ, సిబిఎస్‌ఇ వంటి బోర్డులు ఎక్కడ ఉన్నాయి? ఢిల్లీలో ఉన్నాయి. అయినా వాటిపై చర్చ జరగడం లేదు కదా... విద్య ప్రమాణాలు చాలా ముఖ్యం. కొత్తగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలి. కార్నెగి మిలాన్ యూనివర్శిటీ అంటేనో, ఆక్స్‌ఫర్డు అంటేనో, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అంటేనో మనం ఆశ్చర్యంగా చూస్తాం కదా... అవకాశాలు అక్కడ చదువుకున్న వారి వెంట పడి రావడం లేదా... మన వర్శిటీలు విద్యాసంస్థలకు అంత పేరు ఎందుకు లేదు? ప్రపంచంలో చాలా విశ్వవిద్యాలయాలు చూస్తే మన వద్ద ఉన్న చాలా విద్యాసంస్థల కంటే చిన్నవే, కాని పేరు విషయంలో మనకంటే గొప్పవి. కారణం ప్రామాణిక విద్య అందించడమే అని వేరుగా చెప్పనక్కర్లేదు. ప్రాథమిక స్థాయి నుండి విద్యను పటిష్టం చేయాలి. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి, ఎలక్ట్రానిక్ క్లాసురూమ్‌లను, ఐసిటిని పెద్ద ఎత్తున వినియోగించుకోవాలి. స్కూళ్లు, కాలేజీలు, యూనివర్శిటీల్లో సదుపాయాలు పెరగాలి, బోధన సిబ్బందిని అవసరమైన మేరకు నియమించాలి. బోధనేతర సిబ్బంది కూడా అందుబాటులో ఉండాలి. అపుడు సవ్యమైన చదువు విద్యార్థులకు అందుతుంది. తెలంగాణలో చదువుకున్నాను అనగానే వారికి ప్రాధాన్యత లభిస్తుంది. అందులో అనుమానం అక్కర్లేదు. ఏదేమైనా తెలంగాణకు ఇంటర్ బోర్డు ఆవిర్భవించడంతో మన రాష్ట్రం మనమే పరీక్షలు నిర్వహించుకునేందుకు అడ్డంకులు తొలగినట్టయింది. ఈ మేరకు జీవో 21 జారీ అయింది. పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని 101 సెక్షన్ ప్రకారం ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ యాక్ట్ 1971లో ఆంధ్రప్రదేశ్ స్థానే తెలంగాణ అనే పదాన్ని చేర్చి కొత్త బోర్డును తీసుకువచ్చారు. విద్యామంత్రి బోర్డుకు చైర్మన్‌గా ఉంటారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా మరో 10 మంది ఉంటారు. విద్యాశాఖ కార్యదర్శి, కళాశాల విద్య కమిషనర్, పాఠశాల విద్య కమిషనర్, ఇంటర్ విద్య కమిషనర్, సాంకేతిక విద్య కమిషనర్, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్, ఇండస్ట్రీస్ డైరెక్టర్, అగ్రికల్చర్ డైరెక్టర్, తెలుగు అకాడమి డైరెక్టర్, కార్యదర్శి ఉంటారు. వీరితో పాటు నామినేటెడ్, కో ఆప్షన్ సభ్యులు, విద్యానిపుణులు ఉంటారు. వచ్చే ఏడాది తెలంగాణ బోర్డు ఆధ్వర్యంలోనే పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రశ్నాపత్రాల తయారీ, వాటి కోసం నిపుణుల ఎంపిక, జవాబు పత్రాల ముద్రణ వంటి పనులు వేగం పుంజుకుంటున్నట్టు అధికారులు చెబుతున్నారు. తెలంగాణ బోర్డుకు సంబంధించి ప్రత్యేకంగా పరిపాలనా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారు. నిధులు వాటాలు సిద్ధం చేసుకుంటున్నారు. కనుక ఏం జరిగినా మనం స్వాగతించాలి. విద్యార్థులకు, ప్రజలకు ఉపయోగపడేవిగా ఎదగాలి. అంతేతప్ప రాజకీయాల కోసం విభజన పనికిరాదు.

-డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు
కరస్పాండెంట్, జాగృతి విద్యాసంస్థలు

ఏకాగ్రత దెబ్బతినకూడదు

ఇంటర్ పరీక్షలు కీలకమైనవి. ఈ పరీక్షలు రాస్తూనే విద్యార్థులు అఖిల భారత స్థాయి ఇంజనీరింగ్, మెడిసెన్, లా పరీక్షలకు హాజరవుతుంటారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు వివాదాలకు స్వస్తి చెప్పి విద్యార్థులు ప్రశాంతంగా చదివి పరీక్షలు రాసే పరిస్థితి కల్పించాలి. అంతేకాని రెండు ప్రభుత్వాల గొడవలతో విద్యార్థులకు సంబంధం లేదు. కామన్ అడ్మిషన్లకు సంబంధించి ఎటువంటి పేచీ లేకుండా, ఇంటర్, ఎమ్సెట్ పరీక్షలు వేరువేరుగా నిర్వహిస్తే సరిపోతుంది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్వహిస్తాయా లేదా విడివిడిగా నిర్వహిస్తాయా అనే దాంతో విద్యార్థులకు సంబంధం ఉండదు. విద్యార్థులకు ఆందోళన లేకుండా పరీక్షలు నిర్వహించడం, ఎప్పటిలాగానే మార్చిలో నిర్వహించి, ఏప్రిల్‌లో ఫలితాలు ప్రకటించడం అవసరం. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పేచీ పడడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత దెబ్బతింటుంది. పరీక్షలు సరిగా రాయలేరు. దీని ప్రభావం ఫలితాలపై ఉంటుంది. సగటు విద్యార్థి కోరుకునేది సకాలంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలను ప్రభుత్వం ఇవ్వాలని కోరుకుంటారు. మేధావులు, విద్యావేత్తలు ఈ విషయంలో జోక్యం చేసుకుని ఈ ఏడాదితో పాటు ఇక రానున్న 9 సంవత్సరాల్లో కూడా ఇంటర్ విద్యార్థులకు గందరగోళం కలిగించకుండా పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నాం.

- కార్తీక్ వి, ఇంటర్ విద్యార్థి

వెన్నెల
శుక్రవారం 19 డిసెంబర్ 2014
ఆంధ్రభూమి

విశాఖలో అందమైన బీచ్ లొకేషన్

రాష్ట్రం విడిపోయింది.
పంపకాలూ పూర్తవుతున్నాయి.
కొన్ని అంశాల్లో తెగని వాటాలపై మా(పో)ట్లా
టలూ జరుగుతున్నాయి. ఇంకొన్ని అంశాల్లో
-ఉభయ రాష్ట్రాల భవితవ్యాన్ని దృష్టిలో
పెట్టుకుని సయోధ్యలూ సాగుతున్నాయి.
ఎలాగూ ఒక్క తెలుగు రాష్ట్రం -రెండయ్యాయి.
కనుక -వాటి మనుగడ కోసం పరుగూ
ప్రారంభమైంది. పరుగులో రాజకీయ,
ఆర్థిక, సామాజిక కోణాలున్నట్టే
-సినిమా పరిశ్రమదీ ఓ కోణం.

ఆల్ ఈజ్ వెల్!

రాష్ట్రం విడిపోయింది. మరి -పరిశ్రమ భవిష్యత్ ఏమిటి? భాషాభేదాలు, సంకుచిత భావాలకు అతీతమైన వినోదాత్మక సినిమా కళ ఎటు నిలబడుతుంది? చెన్నైనుంచి చిన్నగా తరలివచ్చి.. దశాబ్దాల కృషితో బలంగా వేళ్లూనుకుని.. దక్షిణాది రాష్ట్రాల్లో మేరునగధీర స్థాయికెదిగిన తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఏమైపోతుంది? ఈ ప్రశ్నలపై చర్చ -రాష్ట్ర విభజన ఖాయమన్న నమ్మకాలు చిగురించినప్పుడే ప్రారంభమైంది. విడిపోయి నెలలు గడుస్తున్నా కొనసాగుతోంది. చర్చలో ప్రాంతీయ ఆశలు, ఆర్థిక అవస్థలు, భవిష్యత్‌పై అభిప్రాయభేదాలు, వెళ్లాలి వద్దూ అన్న మీమాంసలు.. ఇలా చాలా చాలా విషయాలే ప్రస్తావనకూ వచ్చాయి, వస్తున్నాయి కూడా. వీటన్నింటికీ భిన్నంగా వినిపిస్తున్న మరోకోణమూ ఉంది. అదే-'అంతా మనమంచికే'.

'చెన్నైనుంచి కదిలివచ్చి హైదరాబాద్‌లో కుదురుకుంటున్నపుడు తెలుగు చిత్ర పరిశ్రమ ఎలాంటి కుదుపులు ఎదుర్కొందో -ఇప్పుడు ఆంధ్రలో పరిశ్రమ ఏర్పాటు కావాలన్న విషయంలో అదే పరిస్థితి కనిపిస్తోంది. చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చేసినపుడు -తమిళ పరిశ్రమ నష్టపోలేదు. కానీ, హైదరాబాద్‌లో మాత్రం సినీ పరిశ్రమ వృద్ధిచెందింది. సినిమాలు పెరిగాయి. అవకాశాలు పెరిగాయి. సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందింది. విశాఖలో చిత్ర పరిశ్రమ వేళ్లూనుకోవాలన్న విషయంలో రేపు కనిపించబోయేది అదే. రాష్ట్రం విడిపోయింది కనుక -కొన్ని కారణాలతో, మరికొన్ని అవకాశాలతో ఆంధ్రలోనూ సినీ పరిశ్రమ అనువైన కేంద్రాన్ని వెతుక్కుంటుంది. లేదూ ఇప్పటికే ఉన్న ప్రాంతంలో వృద్ధి చెందుతుంది. అంతమాత్రం చేత -హైదరాబాద్‌లో స్థిరపడిన పరిశ్రమకు వచ్చిన నష్టమేమీ ఉండదు. అలాగని -ఆంధ్రలో సినీ పరిశ్రమ పునాదులు వేసుకోకుండా ఆపగలిగే శక్తీ ఎవరికీ ఉండదు. ఇందులో ఎవ్వరూ చేసేది, చేయగలిగేదీ కూడా ఉండదు. ఒక వ్యవస్థ వేళ్లూనుకునే సమయంలో కనిపించే అవస్థ మాత్రమే ఇప్పుడు మనం చూసేది. మరోరకంగా చెప్పాలంటే -తెలుగు సినీ పరిశ్రమ విస్తరిస్తోంది. రెండు రాష్ట్రాల శక్తిగా అవతరించబోతోంది' అంటున్నారు సీనియర్లు.

విశాఖ వైపూ చూపు!

ఆంధ్ర రాష్ట్రంలో సినీ పరిశ్రమ వేళ్లూనుకోవడానికి అనువైన కేంద్రం విశాఖేనన్నది ఎవర్నడిగినా చెప్పే సమాధానమే. కోస్తా, ఉత్తరకోస్తాలో షూటింగ్‌లకు అనువైన ప్రాంతాలు ఎన్నోవున్నా -వాటికి కేంద్ర బిందువు విశాఖే. అరకు, భీమిలి, బొబ్బిలి, సుమారు 200 కిలోమీటర్ల దూరంలోని గోదావరి తీరం.. వీటన్నింటిని ఎన్నో సినిమాల్లో ఎన్నెన్నో సన్నివేశాల్లో సినిమా కెమెరాలు కాప్చర్ చేసినవే. అయినా ప్రతిసారీ ఏదో కొత్తదనాన్ని అందిస్తూనే ఉంటాయి. రాష్ట్ర విభజన తరువాత చిత్ర పరిశ్రమను విశాఖలోనూ వృద్ధి చేయాలన్న ఆలోచనలు లేకపోలేదు. అయితే, ఒక వ్యవస్థ వేళ్లూనుకోవడమన్నది రాత్రికిరాత్రో, ఒక్కరోజులోనో సాధ్యమయ్యే పని కాదు. ఇప్పుడిప్పుడే విశాఖవైపు పరిశ్రమ దృష్టిపెట్టింది. ఇప్పటి వరకూ లొకేషన్లపరంగానే చూస్తే, ఇప్పుడు శాశ్వత నిర్మాణాల కోణంలోనూ కొందరు ఆలోచనలు చేస్తున్నారు. ఒక్కొక్కటిగా పడుతున్న అడుగులే -కొన్నాళ్లకు వ్యవస్థగా రూపాంతరం చెందకపోవన్న నమ్మకాలూ బలపడుతున్నాయి. నాలుగైదేళ్లలోనే సినీ పరిశ్రమ విశాఖలోనూ ఒక రూపం తీసుకోవడం ఖాయమని చెబుతున్నట్టే.. ఇప్పట్లో అది సాధ్యం కాకపోవచ్చని కొట్టిపారేసే వాళ్లూ పరిశ్రమలో ఉన్నారు. కాకపోతే- కనువిందు చేయదగిన పచ్చని ప్రకృతిశోభ మధ్య ఒక్క సన్నివేశం చిత్రీకరించినా ఆ సినిమా హిట్టన్న సెంటిమెంట్ తెలుగు సినిమా వాళ్లకే కాదు, తమిళ, కన్నడ, బెంగాలి, ఒడిశా, హిందీ పరిశ్రమకూ ఉండటమే ప్లస్ పాయింట్. ప్రముఖ దర్శకుడు బాలచందర్ 'మరోచరిత్ర' సినిమా నుంచీ అనేక సినిమాలు హిట్లు కొట్టి ఆ విషయాన్ని రుజువు చేశాయి - మిగతా 12లో

బీచ్‌లో ఓ సినిమా షూటింగ్ హడావుడి

ట్రేడ్ టాక్

ఈవారం కూడా థియేటర్లు దొరకనంత దొంతర్లుగా సినిమాలు వచ్చేశాయ్. రజనీకాంత్ కథానాయకుడిగా పెద్ద అంచనాతో వచ్చిన 'లింగ' ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విఫలమైంది. వరుణ్ సందేశ్ కథానాయకుడిగా 'ఈ వర్షం సాక్షిగా', యువతారలతో రూపొందించిన 'అమ్మా నాన్న ఊరెళితే', మలయాళ రీమేక్ 'సాహెబా సుబ్రహ్మణ్యం', మరో డబ్బింగ్ 'నిర్ణయం', 'లైఫ్ ఆఫ్టర్ డెత్', హైటెక్ లవ్ లాంటి చిత్రాలు విడుదలయ్యాయి. ఒక్క 'లింగ' తప్ప మిగతా చిత్రాలను చూసి ప్రేక్షకులు పెదవి విరుస్తున్నారు. దక్షిణ భారతీయ అగ్రతార రజనీకాంత్ మాజిక్‌తో 'లింగ' మాత్రం సోసోగా సాగుతుంది. కలెక్షన్లు ఫర్వాలేదనిపిస్తున్నాయి. ఇక, ఈవారం విడుదలైన మిగతా చిత్రాల గురించి చెప్పుకోవాల్సినంత సీన్ మాత్రం లేదు.

రివ్యూస్
11లో

తను కళ్లతోనే నటించాడు

మోడ్రన్ డ్రెస్‌లోనూ సంప్రదాయ తెలుగమ్మాయిలా కనిపించే హీరోయిన్ -పూజా హెగ్డే. తెలుగులో వరుస చాన్స్‌లు అందుకుంటూ -కొత్త హీరోయిన్ల రేసులో తానూ ఉన్నానని ప్రూవ్ చేసుకుంటోంది. తాజాగా మెగా ఫ్యామిలీ నుంచి మరో నటవారసుడు వరుణ్ తేజ్ హీరోగా పరిచయమవుతున్న 'ముకుంద'తో జతకట్టింది. ఈ సినిమాతో తెలుగులో మరిన్ని చాన్స్‌లుంటాయని ఎక్స్‌పెక్టేషన్స్‌తోవున్న పూజాతో ఇంటర్వ్యూ.

'ముకుంద'ను ఆటపట్టించారా?

- లేదు లేదు, సంప్రదాయ తెలుగమ్మాయిగానే కనిపిస్తాను. సినిమా మొత్తం నా పాత్ర చుట్టూనే ఉంటుంది. సినిమాలో నన్ను చూశాక -ప్రతి తండ్రీ తన కూతురు ఇలాగే ఉండాలని ఆశించేలాంటి క్యారెక్టర్ నాది.

మరి.. మోడ్రన్ పాత్రలు ఇష్టమంటారే..?

- అలాగని ఏమీ లేదు. కథకు సెట్ అవుతానంటే, ఎలాంటి పాత్రలు చేయడానికైనా రెడీ. అంతేగానీ, మోడ్రన్ పాత్రలే చేస్తానని భీష్మించుకుని కూర్చోను.

వరుణ్ తేజ్ గురించి ఏం చెబుతారు?

- హీరో వరుణ్ అందరినీ ఆకట్టుకుంటాడు. ఫస్ట్ చాన్సే బెస్ట్ చాన్స్ దక్కింది అతనికి. ఇక తనది సినిమాలో -మహాభారతంలో కృష్ణుడి పాత్రలాంటిది. మొదటి సినిమా అయినా అద్భుతంగా చేశాడు. కళ్లతోనే భావాలు వ్యక్తం చేయగల టాలెంటెడ్ ఆర్టిస్ట్. అతనితో వర్క్ టైం హ్యాపీగా గడిచిపోయింది.

మరి, దర్శకుడి గురించి?

- శ్రీకాంత్ అడ్డాల 'సీతమ్మ వాకిట్లో...' సినిమా చూశా. చాలా గొప్పగా అనిపించింది. తను మంచి నేరేటర్. నటులకు స్వేచ్ఛనిచ్చి వారినుంచి కావాల్సిన నటన రాబట్టుకుంటాడు. ముఖ్యంగా అమ్మాయిలను అందంగా చూపించగలడు. ఆయనతో వర్క్‌చేయడం గుడ్ ఎక్స్‌పీరియన్స్.

తెలుగులో వరుసగా సినిమాలు చేస్తున్నారు, ఎలా అన్పిస్తోంది?

- ఆనందంగా ఉంది, తెలుగు ప్రేక్షకులు - మిగతా 10లో

పూజా హెగ్డే

మీ ఫ్యూస్

అంతం కాదు

'ది ఎండ్' పేరుచూసి ఎవరైనా ఇంగ్లీషు సినిమా అనుకుంటారు. ఇంగ్లీషు సినిమాల ప్రభావంతో తెరకెక్కించారేమో. సినిమా మొదలైనప్పటి నుండి జనాలను ఉత్కంఠలో ఉంచేసారు. ఎక్కడా అసభ్యంగా, అశ్లీలతకు పోకుండా జాగ్రత్తపడ్డారు. మనిషి మానసిక స్థితిని అవకాశంగా తీసుకుని సొంత మనుషులే ఎలా మోసం చేస్తారో చూపారు. అనుమానం ప్రేక్షకులకు ఏమాత్రం లేకుండా తీసారు. ప్రేక్షకులను ఓ భ్రమలో ఉంచేసారు సినిమా మొత్తం మీద. ఆఖరులో సస్పెన్స్ రీవిల్ చేసినప్పుడు అరే మనం ఈ పాయింటును అసలు పట్టించుకోలేదే అనే విషయం గుర్తొస్తుంది. చిత్రీకరణ పొదుపుగా సాగింది. తక్కువమంది నటులు, తక్కువ లోకేషన్లు, ఒక హాస్పిటల్ అంతే. మన సొంతవాళ్లను కూడా నమ్మకూడదు అన్న సందేశం ఇచ్చారు. కానీ, దీనివల్ల సమాజంలో ఇంకా ఎన్నో కొత్త కొత్త నేరాలకు మార్గం చూపినట్టయింది. ఈ విషయం దర్శక, నిర్మాతలు ఆలోచించారా?

- జిష్ణు మిహిర్, తార్నా

సాఫీలేని ప్రయాణం

'ఎర్రబస్సు' ప్రయాణం సాఫీగా లేదు. తాత-మనవుడు రేంజిలో ఉంటుందని ఆశించాం. నిరాశ పడ్డాం. దాసరికి డబ్బింగ్, రీమేక్‌లు ఇష్టం ఉండదు. స్వయంగా మంచి రచయత అయినా ఆయన సినిమాలన్నీ ఫట్‌మనడంతో రీమేక్‌కు పాల్పడిన దురదృష్టం వెంటాడి బస్సు ఆగిపోయింది. 50 ఏళ్ళ క్రితం డొక్కుబస్సులా ఉంది. ఆయన ఆలోచనలు, టెక్నిక్‌లు నూతన ప్రపంచానికి ఆవిష్కరించలేకపోయాడు. చిన్నమార్పును కూడా దాసరి గ్రహించలేకపోయాడు.

-పి.ఎస్.లక్ష్మి, కాకినాడ

రాజీపడడు

వీడే మనహీరో వ్యాసంలో ఎంతకు మారని మన హీరోల ఆలోచనలు ఎండగట్టారు. అక్కినేని అంతటివాడే 'సీతారామయ్యగారి మనవరాలు'లో మేకప్ లేకుండా బట్టతలతో నటిస్తే అభిమానులు ఒప్పుకోరని నిరాకరిస్తే దర్శకుడు మాత్రం చిత్రం మానుకుంటానుకాని, రాజీపడనని పట్టుబట్టాడట. చివరకు అక్కినేని ఒప్పుకున్నాడు. ఆ సినిమా ఎంత ఘనవిజయమైందో అందరికి తెలిసిందే. దర్శకుని సత్తా ఉండి ప్రేక్షకులకు నచ్చేట్లు తీస్తే ప్రయోగాత్మక చిత్రాలు కూడా హిట్ అవుతాయని కమలహాసన్ సినిమాలు, శంకరాభరణం లాంటి చిత్రాలు నిరూపించలేదా?

- కె. ఉదయ, శ్రీనగరం

ఫర్వాలేదు

నారా రోహిత్ నటించిన 'రౌడీఫెలో' ఫర్వాలేదు. హీరోయిన్ మైనస్, ఆమెకు డబ్బింగ్ బాగుంది. రోహిత్ సినిమాల్లో పాటలు మైనస్. ఇప్పటి కుర్రాళ్లమాదిరిగా డ్యాన్స్ చేయించారు. స్టార్ కమెడియన్స్ ఉండరు. చిత్రంలో పోసాని కామెడి బాగుంది. కమర్షియల్ ఎలిమెంట్స్ తక్కువగా ఉండి విభిన్నంగా సాగింది. సరైన హిట్ లేకపోయినా కొంచెం వళ్లు తగ్గితే నారా రోహిత్ బాగుంటాడు. రావు రమేష్ డైలాగ్ డెలివరి, నటన తండ్రినే గుర్తుకు తెస్తున్నాడు.

-పాట్టి వెంకట శివప్రసాదరావు, అద్దంకి

సహజత్వానికి దగ్గరగా...

ఏ సినిమాలోనైనా తీయ్యండలోనే ఉంటుంది. సామాజిక అంశాన్ని అందిస్తూ సహజత్వానికి దగ్గరగా రూపొందించిన 'నా బంగారుతల్లి' సమస్యలను కళ్లకు కట్టినట్లు చూపింది. దర్శకుడు ఓ మంచి చిత్రాన్ని అందించడంలో సఫలీకృతులయ్యారు. మంచి సినిమాలు రావడం లేదనేవారికి ఈ చిత్రం ఓ మచ్చుతునక. కమర్షియల్ తళుకు చలకలతో, రోటీన్ కథలతో విసుగెత్తిన వారికి ఇది ఒక సందేశాత్మకం. కమర్షియల్ చిత్రాలతో పోటీని తట్టుకునే నిలవాలంటే అవార్డుల పంట రావడం ఓ ఆనందం.

- ఐనం రఘురామారావు, ఖమ్మం

అదృష్టమే

'శ్రీ కాళహస్తీశ్వర' చిత్ర విశేషాలు చదివి ఆనందించాం. ఈ చిత్రానికి సంబంధించి ఇంకో విశేషం కూడా ఉంది. ఇది రాజ్‌కుమార్ తొలి చిత్రం. తొలి చిత్రంతోనే రాజ్‌కుమార్‌కు ఘంటశాల గానం చేయడం విశేషం. ఈ అదృష్టం ఎన్టీఆర్, ఎఎన్ఆర్‌లకు కూడా దక్కలేదు.

- డి.ఎస్.శంకర్, వక్కలంక

హాస్యనటీమణులు

చిత్ర పరిశ్రమలో తనదైన ముద్రతో ఏలిన నటీమణి 'గిరిజ'. కథానాయికగా, హాస్యనటిగా అన్ని రకాల పాత్రలను పోషించిన నటీమణి. రేలంగి, రమణారెడ్డి, పద్మనాభం వంటి హాస్యనటుల సరసన నటించడంతోపాటు ఎన్టీఆర్, ఎఎన్ఆర్‌ల కథానాయికా కూడా ఆమె నటించారు. ఈతరం సీనియర్ నటి రమాప్రభ, రాజబాబు, పద్మనాభం, అల్లు రామలింగయ్య వంటి వారితో విభిన్న తరహా పాత్రలు పోషించి తనదైన సొంత భాణితో సంభాషణలు పలకడంలో ధిట్ట.

-మంగం ఆనందరావు, వేగివారిపాలెం

కొక్కి అవస్థ

అనిర్వచనీయమైన అవస్థ వ్యాసంలో భారీ బడ్జెట్ సినిమాలు తక్కువ బడ్జెట్‌తో రూపొందించిన సినిమాలు కూడా బాక్సాఫీసు దగ్గర బోర్లాపడుతున్న వాస్తవాన్ని గ్రహించాం. సినీ పరిశ్రమ అవస్థ కొక్కిపెట్టిన కోడిలా ఉందంటూ చక్కగా వివరించారు. వామపక్షీయులు చెప్పినట్టుగా పూర్తిగా వ్యవస్థను నాశనం చేస్తే తప్ప సరికొత్త ఆదర్శప్రాయ వ్యవస్థ పుట్టుకు రాదేమో! శిథిలాలలోనుంచే సరికొత్త అందాల ప్రపంచం ఉద్భవిస్తుందేమో. ఆంధ్రాలో పెద్ద స్టూడియో కట్టే సాహసం ఎవరూ చేయలేరు. నిజానికి నేటి సినిమాలకు స్టూడియోలే అవసరం లేదు. ఎందుకంటే అవుట్ డోర్‌లేనే ఎక్కువగా షూటింగ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇమడలేనివారు బెంగళూరు వైపు దృష్టి సారిస్తారేమో. ఏదేమైనా మనవాళ్లకు సంకల్ప బలం ఉండాలి.

- శాండో ప్రచండ్, కాకినాడ
-అల్లాడి వేణుగోపాల్, బారకాసు

దురదృష్టం

బోర్‌కొట్టేసారు. వ్యాసంలో చెప్పినదంతా నిజమే. కానీ, శ్రియ, త్రిష లాంటి వారికి ఇంకా పాత్రలు అక్కడక్కడ లభిస్తున్నాయి. మంచి పాత్రలు లభించకపోవడం వారి దురదృష్టం. మనంలో శ్రియ మెరిసింది. నాలుగైదు చిత్రాల్లో నటించాక రేట్లు పెంచేయడంతో చిన్న చిత్రాలకు అందుబాటులో లేకుండా పోయారు. పెద్ద చిత్రాల్లో వీరి పాత్రలకు ప్రాధాన్యం ఉండదు. దానితో తెర మారడం, తెరమరుగు కావడం జరుగుతోంది. కొత్తవారు ఉచితంగానో, నామమాత్రపు పారితోషికానికే నటించడం కూడా మరో కారణం.

-ప్రవీణ్, కాకినాడ

తెనాలి రామకృష్ణ

భరణీ, వినోదవంటి నిర్మాణ సంస్థల్లో ఛాయాగ్రాహకుడిగా ప్రతిభ చూపిన వ్యక్తి బియస్ రంగా (బందినగనవివే శ్రీనివాస అయ్యంగార్ రంగా). 1941లో 'భక్తతులసీదాస్' తమిళ చిత్రానికి దర్శకునిగా పనిచేశారు. 1954లో విక్రమ్ ప్రొడక్షన్స్ స్థాపించి 'మా గోపి' నిర్మించారు. ఆ సంస్థ రూపొందించిన రెండో చిత్రం -తెనాలి రామకృష్ణ. 12-01-1956న ఈ చారిత్రాత్మక చిత్రం విడుదలయింది.

విజయనగరాన్ని శ్రీకృష్ణదేవరాయలు (ఎన్టీ రామారావు) వైభవంగా పాలిస్తుంటాడు. తెనాలికి చెందిన రామకృష్ణుడు (అక్కినేని) తాను వ్రాసిన గ్రంథం పండితుల ప్రశంసలకు నోచుకోకపోవడంతో విరక్తుడై ఓ సాధువు సలహాతో భార్య కమల (జమున), కుమారుడితో కలిసి విజయనగరం బయలుదేరుతాడు. దారిలో కాళికాదేవి ఆలయంలో జంతుబలిని ఆపి, ఆ రాత్రి అమ్మవారి అనుగ్రహం పొంది వికటకవిగా ఇతరులను సంతోషపెట్టి బతుకుతానని విజయనగరం చేరతాడు. అతికష్టంపై రాయలవారి దర్శనాన్ని, వారి అనుగ్రహాన్ని పొంది శ్రీకృష్ణదేవరాయల అష్టదిగ్గజాల్లో ఒకనిగా రాణిస్తుంటాడు. రామకృష్ణునిపై తాతాచార్యులకు అకారణ ద్వేషంతో అతన్ని భంగపరచి తరిమివేయాలని శిష్యుడు (వంగర), రాధసాని (సురభి బాలసరస్వతి)ల ద్వారా ప్రయత్నాలు చేసి విఫలుడౌతుంటాడు. విజయనగరాన్ని కబళించాలనే బహమనీ సుల్తానుల గూఢచారి కనకరాజు (మిక్కలినేని) రామకృష్ణని బంధువుగా వారింటచేరి రాయలవారిపై హత్యాయత్నం చేస్తాడు. దీనికై రామకృష్ణుడు శిక్షకు గురవుతాడు. తెలివిగా దాన్నించి బయటపడిన రామకృష్ణుడు, బహమనీ సుల్తానులు పంపగా వచ్చి రాయలవారి ప్రాపకం సంపాదించిన కృష్ణసాని (భానుమతి) రహస్యం రాయలకు తెలియచేస్తాడు. కృష్ణసాని ఆత్మహత్య చేసుకుంటుంది. విజయనగరాన్ని ఆక్రమించాలని బయలుదేరిన బహమనీ సుల్తానులకు అండగా ఢిల్లీ పాదుషా బాబర్ నుంచి గజ సైన్యం వస్తుందన్న వార్త తెలిసిన రామకృష్ణుడు, మారువేషంతో ఢిల్లీచేరి బాబర్‌ను మెప్పించి అతనికి నిజం తెలియచేసి, గజ సైన్యం యుద్ధానికి రాకుండా ఆపి విజయనగరానికి విజయాన్ని చేకూరుస్తాడు. కవిగానేకాక దేశభక్తునిగా తెనాలి రామకృష్ణుడిని శ్రీకృష్ణదేవరాయలు అభినందించటంతో చిత్రం సుఖాంతమవుతుంది.

ఈ చిత్రంలో రామకృష్ణుని తల్లిగా వెంకుమాంబ, తాతాచార్యులుగా ముక్కామల, అప్పాజీగా నాగయ్య, చాకలిగా రామకోటి, తెనాలి రామకృష్ణ కుమారుడిగా మాస్టర్ వెంకటేశ్వర్లు, మహారాణి తిరుమలదేవిగా సంధ్య, బాబర్‌గా కామరాజు నటించాడు.

అక్కినేని నాగేశ్వరరావు తెనాలి రామకృష్ణుడిగా ఎంతో వైవిధ్యాన్ని పలు సన్నివేశాలలో చూపుతూ అద్భుతమైన నటనతో మెప్పించారు. శ్రీకృష్ణదేవరాయల పాత్రలో ఎన్టీ రామారావు ధీరోదాత్త, సౌందర్య, శృంగార, వీరోచిత నాయకునిగా అలరించారు. కృష్ణసానిగా భానుమతి రాయలవారి వద్ద హొయలు వగలు ఒలికించటమేకాక అభిజాత్యం కల యువతిగా వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా నటించగా, కమలగా జమున సాత్వికతను, భర్తపట్ల అనురాగాన్ని కుమారుడి పట్ల వాత్సల్యాన్ని చిరునవ్వుతో చక్కగా నటనలో చూపారు. పరిణితిగల మిగిలిన పాత్రధారులంతా తమ పాత్రలను చక్కగా పోషించి చిత్రానికి రక్తికట్టించారు.

దర్శకునిగా బిఎస్ రంగా కొన్ని సన్నివేశాలతో తన ప్రతిభను చాటుకున్నారు. రాజ్యసభలో కృష్ణరాయలు తన కవిత్వానికి సూచించిన మార్పుకు రామకృష్ణుడు ముచ్చటపడి 'అందుకోండి ప్రభు, ఈ కవి బహుమతి' అంటూ తలకు చుట్టుకున్న పెండ్లిచీర (మధుపర్కం) ఇవ్వబోతాడు. అప్పాజీ సహా సభికులంతా నివ్వెరపోతారు. మహారాజు దాన్ని చిరునవ్వుతో సేవకుని ద్వారా స్వీకరించి 'సరస్వతి ప్రసాదం' అంటూ కళ్ళకద్దుకునే సన్నివేశం రంగా దర్శకత్వ ప్రతిభకు మచ్చుతునక.

మహారాజు భువన విజయంలో 'మేకతోకకు మేక' అన్న రామకృష్ణుడి పద్యాన్ని చిరునవ్వుతో ఆనందించటం, మరోమారు 'తెలియనివన్నీ తప్పులని' ఆశేషపడుతున్న రామకృష్ణుని శాంతించమనటం, 'రంజన చెడి పాండవులు' సమస్యలో రామకృష్ణుని చాతుర్యానికి ముచ్చటపడి 'మీ బుద్ధికి రెండువైపులా పదును' అని మెచ్చుకోవడం, రామకృష్ణునికి మరణశిక్ష విధించిన సందర్భంలో 'మీలాగే నేనూ విచారిస్తున్నాను' అని అప్పాజీతో అంటూ రామకృష్ణుడితో ఉన్న సఖ్యత, వాత్సల్యాన్ని వ్యక్తపర్చటం లాంటి సన్నివేశాలన్నీ దర్శకుల ప్రతిభకు మచ్చుతునకలే. ఖర్చుకు వెనకాడక భారీ వ్యయంతో రాజదర్బారు, భువనవిజయం సెట్లు వేసి, యుద్ధ సన్నివేశాలు చిత్రీకరించి నిర్మాతగా అభిరుచిని, రామకృష్ణుడు కాళికామాత అనుగ్రహం పొందే రాత్రిపూట సన్నివేశాల చిత్రీకరణలో ఛాయాగ్రాహకునిగా నేర్పుచూపటం అభినందనీయం. సీనియర్ సముద్రాల సంభాషణల్లో 'వోక్తులు అక్కరకు రానిది రత్నమైనా రాయితో సమానం', 'అసూయ ముందు- ఆడది తరువాత', 'మహారాణులైనా మనస్థత్వాలు మారవు'లాంటివి సువర్ణ కణికల్లా తోస్తాయి.

తెనాలి రామకృష్ణుడు రచించిన పద్యాలు -'ఈ కాంతలు, ఈ తనయులు', 'తరుణ శశాంకరేఖ రమ రాశమునకు', రాజ్యసభలో ఎన్టీఆర్, నాగయ్య, ముక్కామల పండిత పామర సభికులముందు ఎఎన్నార్‌పై చిత్రీకరించిన పద్యం -'నరసింహ కృష్ణరాయల', నంది తిమ్మన కవిత్వం గూర్చి -'మాకొలది జానపదులకు నీ కవనపుఠీవి అబ్బునే', ధూర్జటి కవిని గూర్చి రాయలు ఎన్టీఆర్ భువనవిజయంలో ప్రశ్నింపగా, రామకృష్ణుడు జవాబుచెప్పే సన్నివేశంలో -'స్తుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కులకేలగల్గెనో అతులిత మాధురీమహిమ', ఓ కవి భువన విజయంలో పరుల కవిత్వంలో తప్పులుపడతాను, చెప్పింది ఆగకుండా వ్రాస్తాను అన్నప్పటి పద్యం -'త్రుప్పవట బాబా తలపై పువ్వట జాబిల్లి', మరో పద్యం -'తెలియనివన్ని తప్పులని దిట్టతనాన', తాతాచార్యులు సేవకునిచే అడిగించిన సమస్యకు రామకృష్ణుడు చెప్పిన పద్యం -'గంజాయి తాగి తురకల సంజాతముచే', కృష్ణరాయలవద్ద చెప్పిన పద్యం -'రంజనచెడి పాండవులరి భంజనులై', తాను వ్రాసిన కవిత్వానికి అర్థంచెప్పమన్న కవితో రామకృష్ణుడు ఈ పద్యానికి అర్థం చెప్పమని -'మేకతోకకు మేక తోకమేకకు తోక', కృష్ణసానివద్ద పద్యం అక్కినేని -'పరబింబాధర మున్' (గానం అక్కినేని కావచ్చు).. లాంటివన్నీ తెనాలి రామకృష్ణ కవి విరచితమై ఘంటసాల గానంతో చిరస్మరణీయంగా నిలిచాయి. చిత్రంలో టైటిల్స్ వస్తుండగా జమున, బాబుపై (సముద్రాల- చిత్రీకరించిన 'జగములాదయనేలే జననీ' గీతం తిరిగి రామకృష్ణునికి మరణశిక్ష విధించినపుడు రెండో చరణంగా 'మరునీ గెలిచిన వానికి మరులూ, ఆపదలందున ఆదరించవే జగములా దయనేలే జననీ' (లీల) అని వస్తుంది. రామకృష్ణుని కవిత్వం వింటుండగా ఓ పండితుడు బయటి వీధిలో శబ్దం వినగా వచ్చే నృత్యగీతం 'ఓలాలా కంచెల చెలిగే చేడె కురులపై తుమ్మెదలాన ఓలాలా' (ఏపి కోమల- సముద్రాల), బహమని సుల్తానుల వద్ద భానుమతి పాడే నృత్య గీతం -'కన్నుల నిండే కన్నె లమిన్న మన్ననలీరా రాజా' (భానుమతి- సముద్రాల), తెనాలి రామకృష్ణుని భూమిలో పాతిపెట్టగా చాకలి రామకోటిపై చిత్రీకరించిన గీతం -'ఆకతాయి పిల్లమూక అందాల చిలకా' (రామకోటి గానం), రాయలవారి సమక్షంలో కృష్ణసానిపై చిత్రీకరించిన నృత్య గీతం భానుమతి అభినయిస్తూ పాడిన -'నీవెగారా రాజీవిగా', నయవిజయశాలి మహారాజుతో అంతరంగిక మందిరంలో ఎన్టీఆర్ ముందు నర్తిస్తూ భానుమతి పాడే గీతం -'తీరని నా కోరికలే తీరెను ఈరోజు' (భానుమతి), ఎఎన్నార్, నాగయ్య మారువేషాలతో పాడే గీతం -'హరేరాం, హరేరాం గండుపిల్లిమేనుమరచి' (ఘంటసాల, నాగయ్య), ఈ చిత్రంలోని సందేశాత్మక గీతం అక్కినేనిపై మారువేషంలో చిత్రీకరించిన గీతం -'చేసేది ఏమిటో చేసెయ్యి సూటిగా వేసెయ్యి పాగా ఈ కోటలో'.. హరిత వన నినాదానికి అద్దంపట్టే విధంగా పైగీతాలు సముద్రాలవారి రచనా విశిష్టతను ప్రకటిస్తాయి. కొద్ది మార్పులతో అన్నమాచార్య కృతి 'ఇచ్ఛకాలు నాకు నీకు'- బాలసరస్వతి, అక్కినేని, ముక్కామల బృందంపై చిత్రీకరణ, జయదేవుని అష్టపది -'చందన చర్చిత నీలకళేబర' అద్భుతం. దీన్ని రాధాకృష్ణుల నృత్యంగా వీణపై సంధ్య పాడుతుండగా ఎన్టీఆర్ అంతపురంలోకి ప్రవేశిస్తుండగా చిత్రీకరించారు. తెనాలి రామకృష్ణ -చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి ప్రారంభించారు. తమిళంలో టైటిల్‌రోల్ శివాజీ గణేశన్ పోషించగా, శ్రీకృష్ణదేవరాయలుగా ఎన్టీఆర్ నటించారు. భానుమతి, సంధ్య, జమున తమిళంలోనూ నటించారు. తెనాలి రామకృష్ణ చిత్రం రాష్ట్రపతి రజిత పతకం అందుకుంది. పలు కేంద్రాలలో శత దినోత్సవాలు జరుపుకొని, ఆర్థికంగానూ ఘన విజయం సాధించింది. ఛాయాగ్రాహకునిగా, దర్శకునిగా బిఎస్ రంగా సామర్థ్యానికి వన్నెతెచ్చిన చిత్రంగా పేరుపొందింది.

మంచి మనసులు -చిత్రంలో శిలలపై శిల్పాలు చెక్కినారు పాటలో భువన విజయం, యుద్ధం సన్నివేశాలు, ఎన్టీఆర్, ఎన్నార్ రాయలు, రామకృష్ణుని వున్న సన్నివేశాలు చూపటం ప్రత్యేక విశేషం.

-సివిఆర్ మాణిక్యేశ్వరి

1941లో హెచ్ఎం రెడ్డి -తెనాలి రామకృష్ణ చిత్రాన్ని రూపొందించారు. రామకృష్ణుని బాల్యం సంఘటనలతో, మాస్టర్ రాజు ప్రధాన పాత్రగా ఆ చిత్రం నిర్మించారు. తిమ్మరుసుగా, పెళ్ళిళ్ళ పేరయ్యగా యల్‌వి ప్రసాద్ రెండు పాత్రలు పోషించారు. రచయిత సదాశివబ్రహ్మం, హాస్య నటుడు సీతారాం ఈ చిత్రం ద్వారానే పరిశ్రమలోకి అడుగుపెట్టారు.

ఫ్లాష్‌బ్యాక్ @50

మూల కథ: నికె వెంకట్రామయ్య రచించిన నాటకం
కథ, మాటలు, పాటలు: సీనియర్ సముద్రాల
సంగీతం: విశ్వనాథం, రామ్మూర్తి
కళ: వాలి, గంగా
నృత్యం: చోప్రా, గోపాలకృష్ణన్
కూర్పు: పిజి మోహన్
నిర్మాత, దర్శకుడు, ఛాయాగ్రాహకుడు: బిఎస్ రంగా.

తను కళ్లతోనే నటించాడు

9వ పేజీ తరువాయి...

ఇంతగా ఆదరిస్తున్నందుకు. ఒక లైలాకోసం సినిమాతోనూ బాగా ఎంకరేజ్ చేశారు.

★ మరి తదుపరి చిత్రాలు?

- త్వరలోనే బాలీవుడ్‌లో 'మొహంజదారో' ప్రారంభమవుతుంది. అశుతోష్ గోవారికర్‌లాంటి దర్శకుడితో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. ఆయన దర్శకత్వం వహించిన లగాన్, స్వదేశ్ చిత్రాలు థియేటర్లలో చూసిన నాకు ఆయనతో సినిమా చేసే అవకాశం వస్తుందని ఊహించలేదు. నిజంగా నేను లక్కీగా ఫీలవుతున్నా.

అవకాశం ఎలా వచ్చింది?

- నేను టీవీయస్ యాడ్‌లో నటించినపుడు అశుతోష్ భార్య సునీత చూసి నన్ను సంప్రదించారు. ఈ సినిమాలోని పాత్రకు నేనైతేనే కరెక్ట్ అని ఆమె భావించారట. అలా ఇలాంటి చారిత్రాత్మక చిత్రంలో నటించే గొప్ప చాన్స్ దక్కింది.

పాత్ర కోసం ఏదైనా రీసెర్చ్ చేస్తున్నారా?

-నేను ఎలాంటి రీసెర్చ్ చేయడం లేదు. ఆ రీసెర్చ్ మొత్తం అశుతోష్ గోవారికరే చేశారు. ప్రస్తుతం వర్క్‌షాపులో పాల్గొంటున్నా. మిగతాదంతా ఆయనే చూసుకుంటారు.

'ముకుంద'లో మీ పేరు?

- నిజానికి ఈ సినిమాలో నాకసలు పేరే పెట్టలేదు. మీరు 'సీతమ్మ వాకిట్లో..' సినిమా చూస్తే కూడా చిన్నోడా, పెద్దోడా అంటారే తప్ప పాత్ర పేరు లేదు. అలాగే ఇందులో నాకు, వరుణ్‌కి పేర్లే లేవు.

గ్లామర్ పాత్రలు వస్తే..?

- మంచి స్క్రిప్టు, దానికి తగ్గట్టు పాత్ర డిమాండ్ చేస్తే గ్లామర్ పాత్రలు చేయడానికి రెడీ. అంతేగానీ, అనవసరమైన గ్లామర్ ప్రదర్శనను ఇష్టపడను.

ఫ్యూచర్ ప్లాన్స్ ఏమిటి?

- ప్రస్తుతానికి నా దృష్టంతా బాలీవుడ్ సినిమా 'మొహంజదారో'పైనే ఉంది. జనవరి నుంచి మే వరకు డేట్స్ ఇచ్చేశా. తెలుగులోనూ వరుసగా అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం స్క్రిప్టులు వింటున్నాను.

-శ్రీ

డియర్ ఫ్రెండ్స్.. ఈ క్విజ్ మీ కోసమే...

మీ సమాధానాలు కార్డుపైన గానీ, మరే విధంగానైనా గానీ రాసి పంపించవచ్చు. ఎలాంటి కొట్టివేతలు, తుడిపివేతలు లేకుండా జవాబులన్నీ స్పష్టంగా రాయాలి. మా దగ్గరున్న కీ సొల్యూషన్‌తో అన్ని విధాలా సరిపోయే జవాబులు రాసిన వారి పేర్లు ప్రచురిస్తాం.



ఫిలిం క్విజ్ 13

నిర్వహణ: కైపు ఆదిశేషారెడ్డి

1. ఈ స్టిల్ చూశారుగా ఏ సినిమాలోది...?
2. సిద్ధార్థ 'ఓయ్'కి సంగీత దర్శకుడు
3. కలెక్టరుగారు సినిమాలో మోహన్‌బాబుకు జతగా నటించిన హీరోయిన్
4. చిరంజీవిని 'ఘరానా మొగుడు'గా చేసిన దర్శకుడు
5. శివాజీ గణేశన్ ఈ చిత్రంలో రజనీకాంత్‌కు తండ్రిగా నటించాడు
6. కన్నడ చిత్రం 'గజ్జెపూజ'కు తెలుగు రీమేక్
7. 'ముద్దుల మాబాబు నిద్దరోతున్నాడు..' పాట ఏ సినిమాలోది?
8. 'హిందూస్థాన్‌లో అందం అంటే నీదేలే..' ఈ పాటను రాసినవారు
9. తరుణ్, జెనీలియాలు నటించిన ఈ సినిమాకు దర్శకుడు కృష్ణవంశీ
10. ఈ చిత్రంలోని కథానాయికను గుర్తుపట్టారా..?

సరైన సమాధానాలు రాసిన వారు

నేమాన సుభాష్‌చంద్రబోస్ - విశాఖపట్నం
ఎన్.శివస్వామి - బొబ్బిలి
ఆర్.వి.సిహెచ్.ఎన్.రావు - శ్రీకాకుళం
ఎన్.నాగరాజారావు - ఏలూరు
బి.అనిల్‌కుమార్ - కర్నూలు
ఎస్.శ్రీనివాసరావు - ఎమ్మిగనూరు
మార్కస్ మణిరాజ్ - ముద్దనూరు
కె.కళ్యాణి - ప్రొద్దుటూరు
శ్రీమతి కళాభూషణ్ - కర్నూలు
జి.జయచంద్రగుప్త - కర్నూలు
డా. శివభూషణం - కర్నూలు
ఎం.మణి - ముద్దనూరు

ఫిలిం క్విజ్-11 సమాధానాలు

1. మల్లన్న 2. బురిడి 3. శేఖర్‌కపూర్ 4. ఏడిద నాగేశ్వరరావు 5. సీరత్‌కపూర్ 6. పింగళి నాగేంద్రరావు 7. సిరివెన్నెల సీతారామశాస్త్రి 8. ఇళయరాజా 9. ఉదయభాను 10. తమన్నా.

పూర్తి చేసిన క్విజ్‌ను పంపించాల్సిన మా చిరునామా: ఎడిటర్, వెన్నెల, ఆంధ్రభూమి దినపత్రిక 36, సరోజినీదేవి రోడ్, సికిందరాబాద్- 03

■ ★★★★ చాలా బాగుంది ■ ★★★ బాగుంది ■ ★★ ఫర్వాలేదు ■ ★ బాగోలేదు

చినుకే లేదు..

ఇటీవలి కాలంలో హిట్లేలేని యంగ్ హీరో వరుణ్ సందేశ్ -బాక్సాఫీస్‌పై దండయాత్రలు చేస్తూనే ఉన్నాడు. అలాంటి దండయాత్రలో కొత్తగా వచ్చిన పాత చిత్రమే -'ఈ వర్షం సాక్షిగా'. రమణమొగిలి దర్శకత్వం వహించిన చిత్రంలో హరిప్రియ హీరోయిన్. సరికొత్త ప్రేమకథతో తెర కెక్కిన చిత్రమంటూ పబ్లిసిటీ చేసుకొన్న సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకోడానికి వరుణ్ సందేశ్ ఎలా ప్రయత్నించాడో చూద్దాం.

కథ ఏంటంటే..

జై (వరుణ్‌సందేశ్) అమ్మాయిల చేతిలో మోసపోయి ఇంకెప్పుడూ అమ్మాయిలకు దగ్గరగా వెళ్లొద్దనుకునే అమాయక యువకుడు. ఒక సాంప్రదాయకమైన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని అనుకుంటాడు. రైల్లో ప్రయాణిస్తున్న అతనికి అనుకోకుండా మహాలక్ష్మి (హరిప్రియ) అనే అమ్మాయి తారసపడుతుంది. జై ప్రేమలోపడతాడు. సాంప్రదాయకంగా కనిపించిన మహాలక్ష్మిని పెళ్లి చేసుకోవాలనుకుని, ప్రపోజ్ చేయాలనుకుంటాడు. ఓ వేడుకలో ఆమెను కలుస్తాడు. అక్కడో భయంకరమైన నిజం (ట్విస్ట్) తెలుస్తుంది. దాంతో షాక్‌కు గురైన జై -ఎలాగైనా ఆ అమ్మాయిని వెతికి పట్టుకోవాలని, ఆమె కుటుంబీకులను కలపాలని ప్రయత్నిస్తాడు. అసలు మహాలక్ష్మికి ఏం జరిగింది? ఆమెను వారి కుటుంబీకులతో కలిపాడా? తన ప్రేమను నిలబెట్టుకున్నాడా? అనేదే -మిగతా సినిమా.

'కొత్తబంగారు లోకం' తర్వాత వరుణ్ సందేశ్ కెరీర్‌లో చెప్పుకోదగ్గ సక్సెస్‌లు లేవు. మంచి విజయం కోసం ఎదురు చూస్తున్న అతనికి ఏ సినిమా కూడా కలిసి రావడం లేదు. కథను ఎంచుకోవడంలో కేర్ తీసుకుంటే తప్ప -సక్సెస్ వచ్చే దాఖలాలూ కనిపించడం లేదు. ఈ వర్షం సాక్షిగా.. సినిమాలో వరుణ్ పాత్రపరంగా ఫరవాలేదనుకున్నా -నటనలో పరిణితి కరవైంది. ఇమేజ్‌ను నమ్ముకుని కథను వదిలిస్తే -బోల్తా పడటం ఖాయం. వరుణ్ గురించి ఇంతకంటే ఎక్కువ చెప్పుకునే సీన్‌గానీ, సన్నివేశాలుగానీ సినిమాలో కనిపించవు. ఇక హరిప్రియ ఉన్నంతలో బాగానే చేసింది. ముఖ్యంగా గ్లామర్‌గా కనిపిస్తూ చలాకీతనంతో ఒకింత ఆకట్టుకుంది. మిగిలిన పాత్రలు పరిధుల మేరకే ఉన్నాయి. ఇక కమెడియన్లుగా నటించిన ధన్‌రాజ్, జీవా, చంద్ర తదితరులు కామెడీ చేయాలని శతవిధాలా ప్రయత్నించి ట్రాజెడీ మిగిల్చారు. సినిమాలో ఆకట్టుకునే కథ, కూర్చోబెట్టే కథనం లేకపోవడంతో ప్రేక్షకుడికి ఎలాంటి ఫీలింగ్ కలగదు.

సాంకేతికంగా చూస్తే -దర్శకుడు కథపై ఆసక్తి చూపలేదు. సరైన కథ లేకపోవడంతో కథనాన్ని నడిపించే విషయంలోనూ తికమకపడ్డాడు. చిన్న లైన్ తీసుకుని రూపొందించిన కథ రెండున్నర గంటలపాటు ప్రేక్షకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దడంలో వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. దానికితోడు సినిమా చూస్తున్నసేపూ -అంతకు ముందు సినిమాల్లోని సన్నివేశాలు మనల్ని వెంటాడుతుంటాయి. సన్నివేశాలు నెమ్మదిగా సాగడంతో ప్రేక్షకుడు బోర్ ఫీలవుతాడు. ఒక అమ్మాయి చేతిలో మోసపోయిన హీరో -అమ్మాయిలంతా ఇంతేననే ఫీల్‌ను వ్యక్తం చేయడం పాత్రల ఔచిత్యాన్ని దెబ్బతీసినట్టయ్యింది. హీరో అలాంటి అభిప్రాయానికి ఫిక్సవ్వడానికి దర్శకుడు కన్వెన్స్ సీన్లు కూడా వండలేకపోవడం గమనార్హం. ట్విస్ట్ తరువాత -సెకండాఫ్ కూడా నిరాశపర్చడంతో కూర్చోవడం కష్టమైంది. సంగీతపరంగానూ ఆకట్టుకునే పాటలు, నేపథ్య సంగీతం లేకపోయింది. రీరికార్డింగ్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. నిర్మాణపరంగా ఓకే అనిపించుకున్నా -సినిమాను గాడిలో నడిపించడంలో దర్శకుడు ఘోరంగా విఫలమయ్యాడు. సినిమాకు కథే కీలకమనే విషయం అందరికీ తెలిసిందే. కానీ కమర్షియల్ అంశాల కోసం కథను కిల్ చేస్తూ సినిమాను రూపొందిస్తే ఫలితం ఇలాగే ఉంటుంది. సినిమా విషయంలో టైటిల్ చూసి అట్రాక్ట్ అయిన ప్రేక్షకుడికి థియేటర్‌లో ఎలాంటి ఫీల్‌వున్న చినుకులు పడవు.

- ద్వివేది

★ ఈ వర్షం సాక్షిగా..

తారాగణం: వరుణ్ సందేశ్, హరిప్రియ, ధన్‌రాజ్, వేణు, చమ్మక్‌చంద్ర తదితరులు

సంగీతం: అనీల్ గోపిరెడ్డి

నిర్మాత: బి.ఓబుల్‌సుబ్బారెడ్డి

దర్శకత్వం: రమణ మొగిలి

గురి తప్పింది

శిల ఎలాంటిదైనా ఉలి దెబ్బ ఒడుపుగా పడితే -కళ కనిపిస్తుంది.

కథ ముతకదైనా కథనంపై మనసుపెడితే -కళాఖండం అనిపిస్తుంది.

రొటీన్‌గా రజనీ సినిమాకు -కొన్ని వాల్యూస్ ఉంటాయి. -ఇంకొన్ని క్వాలిటీస్ ఉంటాయి. జీవితానికి పనికొచ్చే -మెసెజ్‌లుంటాయి. వీటన్నింటిపైనా అభిమానులకు -లెక్కలేనన్ని ఎక్స్‌పెక్టేషన్సూ ఉంటాయి. ఇవి మాత్రమే కాదు -దర్శకుడు, సంగీత దర్శకుడు, కళా దర్శకుడు, ఛాయాగ్రాహకుడు, కథకుడు.. ఇలా మిగిలిన విభాగాల పనితనమూ లెక్కలేనంతగా ఉంటుంది. అన్ని విభాగాలూ అద్భుతాన్ని చూపిస్తే -ఆ ఫలితం మొదట రజనీదే అవుతుంది. సినిమాలో ఎక్కడైనా తప్పు జరిగినా, ఫిట్టింగ్‌లో కాస్త స్క్రూ లూజైనా -పర్యావసానమూ రజనీయే మోయాల్సి ఉంటుంది. ఎందుకంటే -అది రజనీ సినిమా. తలైవా కోసమేనన్నట్టు థియేటర్లకు పరిగెత్తి, తలైవ కోసమేనన్న మూడ్‌లో సినిమా చూసి -బయటికొచ్చాక హిట్టో ఫట్టోనంటూ అభిమాన ప్రేక్షకుడు కొట్టే ఫస్ట్ డైలాగ్ -రజనీని దృష్టిలో పెట్టుకునే. మరి ఈ -లింగ ఏం చేశాడు?

కథలోకెళ్తే..

లింగ (రజనీకాంత్) దొంగ. చిలక్కొట్టుడు చోరీలు మానేసి -భారీ లూటీతో బతుకులో సెటిలవుదామంటారు స్నేహితులు. సరేనంటూ -ఓ ఎగ్జిబిషన్ నుంచి విలువైన నెక్లెస్ కొట్టేస్తాడు లింగ. అప్పటికే -ఓ ముఖ్య కారణంతో అతడిని వెతుక్కుంటూ వచ్చిన మహాలక్ష్మి (అనుష్కశెట్టి) వాళ్లను వెంటాడుతుంది. పోలీసులకు దొరికిపోయే పరిస్థితి కల్పించి, లింగను రక్షిస్తున్నట్టుగా ఊరికి తీసుకెళ్తుంది. స్నేహితుడు (సంతానం)తో కలిసి ఊళ్లోకి అడుగుపెట్టిన లింగకు నానమ్మ భారతి (సోనాక్షి సిన్హా) తమ్ముడి (కె విశ్వనాథ్) ద్వారా అసలు కథ తెలుస్తుంది. లింగ వంశం పుట్టుపూర్వోత్తరాలు, తాత రాజా లింగేశ్వర (రజనీకాంత్) గొప్పతనం అర్థమవుతుంది. గద్వాల మహారాజా వంశీకుడైన రాజా లింగేశ్వరకి సింగనూరుకి సంబంధమేంటి? కలెక్టర్‌గా వచ్చిన రాజా అక్కడ డ్యామ్ ఎందుకు కట్టించాడు? ఒకతరం దాటిన తరువాత లింగ ఆ ఊరికి ఎందుకు రావాల్సి వచ్చింది? డబ్బు కోసం డ్యామ్‌ని దెబ్బ తీయడానికి కుట్రపన్నిన ఎంపీ (జగపతిబాబు)ని ఎలా నివారించాడు. డ్యామ్‌ని ఎలా రక్షించాడు? లాంటి సవాలక్ష ప్రశ్నలకు డ్రామా సమాధానాన్ని -తెరపై చూపించాడు దర్శకుడు కెఎస్ రవికుమార్.

ఎవరెలా చేశారు?

సినిమాలో రజనీ కనిపిస్తాడు. కానీ -స్టయిల్ తక్కువ. మార్క్ మిస్సు. రజనీకే సాధ్యమయ్యే మేనరిజమ్స్ మటాష్. విలన్ చెంప చెళ్లుమనిపించే పంచ్‌లు.. అభిమానులు ఔరా అనుకునే మెసేజ్‌లు.. అలా దొర్లిపోతుంటాయి కానీ వాటిలో జీవం ఉండదు. 64ఏళ్ల వయసులో మిగిలిన వాళ్ల మైనస్‌లను మోసేంత శక్తి -రజనీలో కరవైనట్టు అనిపిస్తుంది. బొద్దుగా కనిపించిన హీరోయిన్లు ఇద్దరూ -రజనీ పక్కన సరే అనిపించుకున్నారుగానీ సినిమాను రక్తికట్టించలేకపోయారు. హీరోగా ఉన్న టైంలో చాలామంది విలన్లను ఫేస్ చేసిన అనుభవం జగపతిబాబుకు ఇప్పుడు పనికొస్తుంది. లింగలోనూ తనదైన విలనిజాన్ని బాగానే ప్రజెంట్ చేయగలిగాడు. పాత్రకు తగ్గట్టుగా విశ్వనాథ్‌ని చట్రంలో బిగించేస్తే -టైమింగ్‌వున్న సంతానాన్ని ఫస్టాఫ్‌కే పరిమితం చేశారు. పోనీ -ఉన్న అరగంటైనా పూర్తిగా వాడుకున్నారా అంటే అదీ లేదు. కామెడీ భారాన్నీ రజనీకే అప్పగించేశారు. మిగిలిన పాత్రలన్నీ ఏదో అలా...

టెక్నికల్‌గా..

ఆస్కార్ రేసులోవున్న ఎఆర్ రెహమాన్ అందించిన అత్యద్భుత, అనిర్వచనీయ విషాద సంగీతం -లింగ. పాటల బాణీలు ఎంత బాధపెడతాయో.. నేపథ్య సంగీతం అంత విసుగు తెప్పిస్తుంది. ఏ ఒక్క సన్నివేశంలోనూ ఫీల్‌ని ఎలివేట్ చేయగలిగే నేపథ్య స్వరం వినిపించకపోవడం దారుణం. అసలు కథ దగ్గరకి ప్రేక్షకుడిని తెచ్చేందుకు అర్థభాగం సినిమా వాడేసుకున్నాడు దర్శకుడు. ఆ తప్పులోనైనా -ఒప్పుకునేలాంటి వినోదాన్ని అందించాడా? అంటే అదీ లేదు. బ్లాక్‌బస్టర్ మూవీస్ అందించడంలో వెనుకబడిన కెఎస్ రవికుమార్, లింగ చేయి అందుకుని పైకి లేస్తాడనుకుంటే -రజనీని సైతం డ్యామ్ కిందకు లాక్కెళ్లాడనిపిస్తుంది. చెత్తను కత్తిరించి పారేయాల్సిన ఎడిటర్ సంజిత్ -ఆ బాధ్యత తనకు లేదన్నట్టు అనవసర దృశ్యాలనూ హాయిగా అతికించేశాడనిపించక మానదు సినిమా చూస్తుంటే. కనీసం సినిమాటోగ్రాఫరైనా విజువల్స్‌ని ఎలివేట్ చేయగలిగాడు కనుక -కొంచెంసేపు ఓపి కపట్టగలుగుతాం -అదీ సెకెండాఫ్‌లో. ఏరియల్ వ్యూస్ ఎప్పుడూ ఆసక్తికరంగా ఉంటాయి కనుక, డ్యామ్ షాట్స్ అన్నీ హైఎండ్ క్రేన్ షాట్స్‌గా తీసి ఫరవాలేదనిపించాడు. సినిమా మొత్తంమీద ఏదోకచోటైనా రజనీ స్టయిల్ కనిపించకపోతుందా? అన్న ఆశతో మాత్రమే కడవరకూ కూర్చోవాలి తప్ప, అలాంటి ఆశ లేకపోతే ముగింపు వరకూ మూడ్‌ని కేరీ చేయడం కష్టమే. భారీగా సెట్స్‌వేసినా -ఎంచుకున్న లోకేషన్స్‌లో లైఫ్ లేకపోవడం కూడా కళ్లకు విందూ అందించలేదు. కోట్ల ప్రాజెక్టు కనుక -క్వాలిటీలో కాంప్రమైజ్ కాలేదులే అనిపిస్తుందంతే.

విశ్లేషణ

రజనీ సినిమాలో లాజిక్ ఉండదు. కానీ -లాజిక్కులు వెతుక్కునే చాన్స్ ఇవ్వకుండా మేజిక్‌లు మాత్రం పుష్కలంగా ఉంటాయి. చిత్రం ఏంటంటే లింగలో మేజిక్ కూడా మిస్సయ్యింది. రజనీ సినిమాలు ఎలా చూసినా బావుంటాయి. కానీ -ఆ జాబితాలో లింగను చేర్చలేం. రజనీ చాలా సినిమాల్లో కనిపించినట్టే -లింగలోనూ చాలా దృశ్యాలూ, సన్నివేశాలూ ఉన్నాయి. తలైవ కోసం కదిలొచ్చే జన సందోహాలున్నాయి. కానీ, ఆ సన్నివేశాల్లో రజనీ స్టయిల్‌ని ఎలివేట్ చేసే మార్క్ కనిపించలేదు. రజనీ మేనరిజమ్స్ లేవు. రజనీ మెసెజ్‌లు లేవు. కనీసం -విలన్స్‌కి గట్టిగా వార్నింగ్ ఇచ్చే సీన్స్ కూడా లేవు. అందుకే -థియేటర్లలో మాస్ అభిమానులు వేసే విజిల్ సౌండ్స్ కూడా లేవు.

సారీ టు సే..

రజనీ డేట్స్ ఇచ్చాడు. కెఎస్ రవికుమార్ సినిమా తీశాడు. ప్రేక్షకుడు చూసి -పెదవి విరిచాడు. లింగ సైలెంటైపోయాడు.

-విజయప్రసాద్

★★ లింగ

తారాగణం: రజనీకాంత్, జగపతిబాబు, అనుష్కశెట్టి, సోనాక్షి సిన్హా, కె విశ్వనాథ్, సంతానం తదితరులు

సంగీతం: ఎఆర్ రెహమాన్

నిర్మాత: రాక్‌లైన్ వెంకటేష్

దర్శకత్వం: కెఎస్ రవికుమార్

బ్యానర్: రాక్‌లైన్ ఎంటర్‌టైన్‌మెంట్స్

కథ: పొన్ కుమరన్, కెఎస్ రవికుమార్

నాటు ప్రయోగం!

నేటి యువత పెడదారి పట్టడానికి ప్రధాన కారణమేమిటి? అమ్మా నాన్నలు పిల్లలను గొప్పవారిగా చూడాలనుకుంటారు. వారి పరిధిలో ఆలోచించి వారి ఆలోచనలే పిల్లలు పాటించాలనుకుంటారు. అలా చేస్తే జీవితంలో వారు మంచి భవిష్యత్తుతో బ్రతుకుతారని ఆశ. కానీ, పిల్లల ఆశయాలు వేరుగా ఉంటాయి. నిరంతం తమను అంటిపెట్టుకుని ఉండే తల్లిదండ్రులు, వారి కోరికలు, అలవాట్లను తమపై రుద్దుతున్నారన్న బాధతో జీవితాన్ని సాగిస్తుంటారు. కొంత మంది ఎదిరించి తమ ఇష్టాలను ప్రదర్శిస్తుంటే, మరి కొందరు రాముడు మంచి బాలుడు అన్నట్టుగా పెద్దవారి ఇష్టానికి తగ్గట్టు చదివేస్తుంటారు. తల్లిదండ్రులు -పిల్లలమధ్య ఉన్న సంఘర్షణ ఎలాంటి రూపానికి మారుతుంది అనే అంశం తీసుకుని సందేశాత్మకంగానే చిత్రం నిర్మిద్దామనుకున్నా, సన్నివేశాలు రాసుకునే విధానం మాత్రం నేలస్థాయిని వదలి పాతాళానికి వెళ్లడంతో ఈ చిత్రం అభాసుపాలవుతుంది.

కథేంటి?

రామకోటి (సిద్ధార్థ్‌వర్మ) వెంకట్రావు (ఎఫ్ఎం బాబాయ్) ఏకైక కుమారుడు. రామకోటి స్నేహితులు రాహుల్, విక్కీ, శీను, మహి అనబడే మహాలక్ష్మి (శిల్పాస్వి). ఈ ఐదుగురూ చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నవాళ్లే. మహాలక్ష్మి మాత్రం ఆ తరువాత వేరే ఊరికి వెళ్లిపోతుంది తండ్రితోపాటు. నలుగురు అబ్బాయిలు పెద్దవాళ్ళవుతారు. ఆ తరువాత స్నేహితుల వద్దకు మళ్లీ వస్తుంది మహాలక్ష్మి. రామకోటి స్నేహితులకు ప్రియురాళ్లు ఉంటారు. వాళ్ళో నలుగురు వీళ్లో నలుగురు కలిసి కాలేజీల్లో నిరంతరం హల్‌చల్ చేస్తుంటారు. మధ్యమధ్యలో మందు పార్టీలు, రేవ్ పార్టీలంటూ కథనం సాగుతూనే ఉంటుంది. కాలేజీలో మందు తాగుతూ సిగరెట్లు తాగుతూ స్నేహితులంతా ఆడుతూ పాడుతూ గెంతులేస్తూ, డ్యూయెట్లు పాడుతూ సగం సినిమా లాగిస్తారు. మహాలక్ష్మి రామకోటితో గడపడానికి ఆఫర్ ఇస్తుంది. ఆ ఆఫర్‌ను ఉపయోగించుకోవడం కోసం తాను వెంకన్నకు మొక్కుకున్నానని చెప్పి తల్లిదండ్రులను తిరుపతి పంపిస్తాడు రామకోటి. ఇక అప్పటి నుండి అమ్మా నాన్న ఊరెళితే ఇంట్లో యథేచ్ఛగా ఎట్లాంటి పనులు చేయొచ్చో అలాంటి పనులు స్నేహితులతో కలిసి చేసేస్తుంటాడు. చివరికి ఓ పార్టీలో అమ్మాయిల్ని అబ్బాయిల్ని పోలీసులు పట్టుకుంటారు. తరువాత ఏం జరిగింది అనేది మిగతా కథనం.

ఎలా ఉందంటే?

సినిమా మొదటినుండీ పిచ్చిపిచ్చి వాగుడుకాయల మాటలతో, అరుపులతో, గోలలతో సాగుతుంది. మధ్యమధ్యలో లావాటి అమ్మాయితో ఆకాశం అమ్మాయి అయితే పాట కూడా సాగింది. టూరిస్టు ట్రావెల్స్ టిక్కెట్లు బుక్‌చేసే ఆఫీసుల తతంగాలు, లవ్ కుష్ చూడాల్సిన సమయంలో లవకుశ చిత్రాలు చూస్తావేంట్రా అని దెప్పిపొడవడం, హీరో రామాచారిలా ఉండేవాడు రెమోలా తయారవడం వంటి సన్నివేశాలు సాగుతాయి. వాడికి ఛాన్స్ ఇచ్చినాగానీ ఉపయోగించుకోలేక పోయాడే అని హీరోయిన్ చెప్పడం దిగజారుడుతనమే. దానికితోడు ఆమె ఇచ్చిన ఛాన్స్‌ను ఉపయోగించుకోమని స్నేహితులు కండోమ్ ప్యాకెట్లు కొనివ్వడం మరింత ఘోరం! అదికూడా ఎలా ఉపయోగించాలో నేర్పుతానంటూ 5వేలు డిమాండ్ చేసే అమ్మాయిలాంటి సంఘటనలు తలబొప్పి కట్టిస్తాయి. ఓ పక్క నాయనమ్మ చనిపోతే శోభనానికి లాక్కెళ్ళే మనవరాలులాంటి పాత్రలు కూడా అబ్బో అనిపిస్తాయి. ఇక సోనియా అగర్వాల్‌తో చేసిన ఐటెమ్ సాంగ్ గుడివాడ ఎల్లాను, గుంటూరు పోయాను అనే జయమాలిని పాటకు పేరడీనే. ఇంతాచేసి చివరికి ఐటెమ్ పాప చేతే యువతకు సందేశం ఇప్పించారు. అంత సరికొత్తగా ఆలోచించాడు 'దర్శకుడు'.

ఎవరెలా?

నటించిన నటీనటులందరూ కృత్రిమంగా కన్పిస్తారు. ఎవరిదగ్గర సరైన నటన కన్పించదు. ఇక కెమెరా యాంగిల్స్ ఘోరం. సంగీతంలో 'మేఘాలే దాటే, ఓరిదేవుడో, కురిసే వెన్నెల' లాంటి పాటలు సోసోగా సాగుతాయి. స్టూడెంట్ కుర్రోళ్ళు కరెంటు ఉన్నోళ్లు పాట మరీ ఘోరం. ఇక మాటలపరంగా బొమ్మరిల్లు ఫాదరా? మహేష్‌బాబులా ఉంటావనుకుంటే స్వాతిముత్యం కమల్‌హసన్‌లా ఉన్నావ్! శ్రీరాముడు సీతను అడవిలో వదిలేశాడని తెలిసినా ప్రతి ఆడది రామున్నే కోరుకుంటుందిలాంటి మాటలు ఆకట్టుకుంటాయి. దర్శకత్వపరంగా ఎలాంటి మెరుపులూ కనపడవు. సెక్స్ సినిమా తీసి చివరిలో సందేశమిచ్చినట్టు సాగి ప్రేక్షకుడికి అసహనం కలిగిస్తుంది.

-తిలక్

★ అమ్మా నాన్న ఊరెళితే..

తారాగణం: సిద్ధార్థ్‌వర్మ, విజయ్, మధు, తేజ, శిల్పాస్వి, మనస్విని, శివకృష్ణ, అపూర్వ, ఎఫ్ఎం బాబాయ్ తదితరులు

సంగీతం: మున్నా కాశి

నిర్మాత: నాగమణి అనగాని

దర్శకత్వం: అంజి శ్రీను

రాశిఫలం

శుక్రవారం 19-12-2014

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

శ్రీ జయ, ఉత్తరాయణం, హేమంతఋతువు, మార్గశిర మాసం, తిథి- బహుళ ద్వాదశి ఉ.8.58, నక్షత్రం- విశాఖ రా.9.08
వర్జ్యం- రా.1.11 నుండి 2.41 వరకు
దుర్ముహూర్తం- ఉ.08.24 నుండి 09.12వరకు
తిరిగి మ.12.24 నుండి 01.12 వరకు

మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.) ఆకస్మిక ధన నష్టం కలిగే అవకాశముంది. స్థిరాస్తుల విషయంలో మిక్కిలి జాగ్రత్త అవసరం. క్రొత్త వ్యక్తులను నమ్మి మోసపోరాదు. క్రీడాకారులకు, రాజకీయ రంగాల్లోని వారికి మానసికాందోళన తప్పదు. నూతన కార్యాలు వాయిదా వేసుకోవడం మంచిది.

వృషభం (కృత్తిక 2,3,4పా., రోహిణి, మృగశిర 1,2పా.) బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృత్తి, ఉద్యోగ రంగంలో అభివృద్ధి ఉంటుంది. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ప్రయత్నలోపం లేకున్నా పనులు పూర్తిచేసుకోలేకపోతారు.

మిథునం (మృగశిర 3,4 పా., ఆరుద్ర, పునర్వసు 1,2,3పా.) కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండుటచే మానసికానందాన్ని పొందుతారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లో మంచి గుర్తింపు లభిస్తుంది. నిన్నటివరకు వాయిదా వేయబడిన కొన్ని పనులు ఈరోజు పూర్తిచేసుకోగలుగుతారు. ముఖ్యమైన వ్యక్తుల్ని కలుస్తారు.

కర్కాటకం (పునర్వసు 4పా., పుష్యమి, ఆశ్లేష) నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలు పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. విద్యార్థుల ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. వినోదాల్లో పాల్గొంటారు. చర్చలు, సదస్సులు మిమ్మల్ని ఆకర్షిస్తాయి. మనోధైర్యాన్ని కలిగియుంటారు. శుభవార్తలు వింటారు.

సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా.) ఆకస్మిక ధన లాభయోగముంటుంది. కుటుంబంలో సంతృప్తికరంగా ఉంటారు. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలుంటాయి.

అంతటా అనుకూల వాతావరణమేర్పడుతుంది. స్త్రీలు సౌభాగ్యాన్ని పొందుతారు. బంధు, మిత్రులు కలుస్తారు.

కన్య (ఉత్తర 2,3,4పా., హస్త, చిత్త 1,2పా.) అకాల భోజనాదులవల్ల అనారోగ్యమేర్పడుతుంది. పిల్లల పట్ల ఎక్కువ పట్టుదలతో నుండుట అంత మంచిది కాదు. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. మనోద్వేగానికి గురిఅవుతారు. కోపాన్ని తగ్గించుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరం. క్రొత్త పనులు ప్రారంభించరాదు.

తుల (చిత్త 3,4పా, స్వాతి, విశాఖ 1,2,3పా.) కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలెదురవుతాయి. వృథా ప్రయాణాల వల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగావుండుట మంచిది. అందరితో స్నేహంగానుండుటకు ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా వుంటాయి.

వృశ్చికం (విశాఖ 4పా., అనూరాధ, జ్యేష్ఠ) గౌరవ మర్యాదలకు లోపముండదు. అనవసర వ్యయప్రయాసలుంటాయి. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. మానసికాందోళనతోనే కాలం గడుపవలసి వస్తుంది. బంధుమిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్తవహించాలి. శారీరకంగా బలహీనులవుతారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా.) స్త్రీల మూలకంగా లాభాలుంటాయి. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం పొందుతారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబం అంతా సౌఖ్యంగా ఉంటారు. అత్యంత సన్నిహితులను కలుస్తారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1,2పా.) ప్రయాణాలు ఎక్కువగా చేయాల్సివస్తుంది. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. అనవసరంగా డబ్బు ఖర్చగుటచే, ఆందోళన చెందుతారు.
విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించక తప్పదు.

కుంభం (ధనిష్ఠ 3,4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా.) ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. ఆకస్మిక భయాందోళనలు దూరమవుతాయి. ఋణప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. కుటుంబంలో మనశ్శాంతి లోపిస్తుంది. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్తవహించుట మంచిది. రహస్య శత్రుబాధలుండే అవకాశం ఉంది.

మీనం (పూర్వాభాద్ర 4పా., ఉత్తరాభాద్ర, రేవతి) ఆరోగ్యంగూర్చి జాగ్రత్తపడుట మంచిది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. కుటుంబ కలహాలకు దూరంగావుంటే మేలు. సహనం అన్నివిధాలా శ్రేయస్కరం. డబ్బును పొదుపుగా వాడతారు.

ఆల్ ఈజ్ వెల్!

డైరెక్టర్స్ ఛాయిస్..

రచయిత కావాలనుకుని నటుడిగా స్థిరపడిన ఎంఎస్ నారాయణ కుమార్తె దర్శకురాలిగా చేసిన తొలి ప్రయత్నమే 'సాహెబా సుబ్రహ్మణ్యం'. డైరెక్టర్‌గా తొలి మెట్టు ఎక్కిన శశికిరణ్‌తో స్పెషల్ చిట్‌చాట్..

దర్శకత్వమే ఇష్టం

దర్శకత్వంపై ఆసక్తికి కారణం?

- నాన్నగారు దర్శకుడు, రచయిత అవ్వాలనుకొని నటుడయ్యారు. ఇంట్లో నాన్న ఆసక్తిచూపే నాటకాల వాతావరణం చాలా ఎక్కువ ఉండేది. దాంతోనే నాకు దర్శకత్వంపై ఆలోచన, ఆసక్తి కలిగింది.

ఇంతకుముందు..?

- మాటీవీలో ప్రోగ్రామ్ డిజైనర్‌గా చేశా. సినిమా నైపుణ్యాన్ని అక్కడే నేర్చుకున్నా.

తొలి అవకాశం ఎలా వచ్చింది?

- ఫ్రెండ్ వేణు ద్వారా. మలయాళంలో ఈ చిత్రాన్ని చూసిన నిర్మాత నాగేశ్వరరావు లేడీ డైరెక్టర్‌ను వెతుకుతుంటే, వేణు నన్ను సిఫార్స్ చేశాడు.

సెన్సిబుల్ కథను ఎంచుకున్నారెందుకు?

- తొలి ప్రయత్నమే హిందూ- ముస్లిం ప్రేమకథతో మొదలెట్టా. మతంకంటే మనసులు కలవడమే ముఖ్యమనే పాయింట్ నచ్చింది.

సినిమాకు రెస్పాన్స్?

- మంచి కథతో తీశానంటున్నారు. హింసాత్మక ఘటనలకు దూరంగా సెన్సిబుల్ పాయింట్‌ను చూపినందుకు అభినందిస్తున్నారు.

దర్శకురాలిగా స్ఫూర్తి?

- మణిరత్నంగారే. పట్టుదల వుంటే సాధ్యంకానిదేదీ లేదని నమ్ముతాను.

తదుపరి చిత్రాలు?

- రోడ్డు జర్నీ కాన్సెప్టుతో కథ ఒకటి సిద్ధంగా వుంది.

ఎలాంటి జోనర్ సినిమాలు ఇష్టం?

- కుటుంబమంతా కలిసి చూసే సినిమాలంటే కాస్త ఎక్కువ మక్కువ.

పచ్చని తివాసీలా కనిపించే అరకులోయ ప్రాంతం



తెలంగాణలో సినీ నగరికి వేదికకానున్న రాచకొండ ప్రాంతం

9వ పేజీ తరువాయి

కూడా. అంటే -విశాఖలో చిత్ర పరిశ్రమకు మంచి అవకాశాలే ఉన్నాయి. ఆ కోణంలో అడుగులూ పడుతున్నాయి. ఇప్పటికే రామానాయుడు స్టూడియో నిర్మించారు. హీరోలు నాగార్జున, చిరంజీవి, నిర్మాత బండ్ల గణేష్ వంటివారూ విశాఖలో స్టూడియోలు నెలకొల్పాలన్న ఆలోచనతో ఉన్నారు. ఎటొచ్చీ చిత్ర పరిశ్రమ విశాఖకూ విస్తరించేలా చొరవ చూపడంలో రాష్ట్ర ప్రభుత్వమే అడుగు ముందుకేయాల్సి ఉంది.

దొరకని అనుమతులు

విశాఖ పరిసరాల్లో చిన్న చిత్రాల నిర్మాణానికి సంబంధించి ఇబ్బందులున్న మాట వాస్తవం. ముఖ్యంగా పోర్టు, రైల్వేస్టేషన్, ఫిషింగ్ హార్బర్, కైలాసగిరి ప్రాంతాల్లో చిత్ర నిర్మాణానికి అనుమతి సంపాదించడం చాలా కష్టం. అనమతుల కోసం లక్షల్లో డిపాజిట్లు చెల్లించాల్సి రావడం, షూటింగ్‌లు పూర్తైన చాలా కాలానికిగాని అవి తిరిగిరాకపోవడం లాంటి ఇబ్బందులున్నాయి. దీంతో సినిమాకు అనువైన ప్రాంతమే అయినా, షూటింగులు తగ్గించేసుకుంటున్నారు. సాంకేతిక ఇబ్బందులను అధిగమించాల్సిన పరిస్థితీ విశాఖలో కనిపిస్తోంది. నాణ్యమైన సినిమాలు చిత్రీకరించాలంటే ఇంకా హైదరాబాద్ నుంచే సరంజామా తెచ్చుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. శిక్షణ పొందిన ఆర్టిస్టుల కరవు, థియేటర్ల ఇబ్బందుల్లాంటివన్నీ విశాఖలో పరిశ్రమ వేళ్లూనుకోవడానికి అడ్డంపడే అవరోధాలుగా కనిపిస్తున్నాయి.

నాలుగైదేళ్లలోనే..

పరిస్థితులు ఎప్పుడూ ఇలాగే ఉండవు. పరిస్థితిలో మార్పు ఖాయం అంటున్నారు సీనియర్ దర్శకుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ. రాష్ట్ర విభజన జరిగింది కనుక పరిశ్రమ అక్కడకూ విస్తరించడం ఒక్కటే మార్గం అంటన్నారు. వచ్చే ఐదారేళ్ల కాలంలోనే చిత్ర పరిశ్రమకూ అక్కడా ఓ రూపం వస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. -హైదరాబాద్‌లో స్థిరపడిన చిత్ర పరిశ్రమకు నష్టం జరగదు. అదే సమయంలో విశాఖ ప్రాంతానికీ పరిశ్రమ విస్తరించే అవకాశాలు లేకపోలేదు. ప్రాంతానికీ, భాషకూ అతీతమైన వినోద పరిశ్రమ కనుక -రెండు రాష్ట్రాలకు విస్తరిస్తున్న తెలుగు సినీ పరిశ్రమ పరిధిని ఎవ్వరూ కుదించలేరు. బలోపేతమవుతున్న సినీ పరిశ్రమ వృద్ధిలో ఎవరి ప్రమేయం అవసరం కూడా ఉండదు' అన్నారాయన. -'ప్రత్యేక రాష్ట్రంగా ఆంధ్రలోనూ ఆర్థిక వృద్ధి పెరుగుతుంది. దానికి అనుగుణంగా సినీ పరిశ్రమా విస్తరిస్తుంది. స్థానికంగా కొత్త నిర్మాతలు పుట్టుకొస్తారు. కొత్త టాలెంట్లూ వస్తారు. కాకపోతే, క్రమంగా వ్యవస్థీకృతం కావడానిక కొంత సమయం పట్టొచ్చు' అన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. 'వాస్తవానికి సినిమా పరిశ్రమ అక్కడ లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేం. విశాఖలోనూ స్టూడియోలున్నాయి. రికార్డింగ్, డబ్బింగ్ సూట్లు ఉన్నాయి. మల్టీప్లెక్స్‌లూ ఉన్నాయి. ఉన్నవి బలోపేతం అవుతున్నాయి. కొత్తవి పుట్టుకొస్తున్నాయి. నిర్మాతలు, దర్శకులు, ఆర్టిస్టులూ అందరూ ఉన్నారు. ఎక్కడున్నా వినియోగించుకోవడానికి వీలుగా సినిమా సాంకేతిక పరిజ్ఞానమూ విస్తరిస్తోంది. ఇవన్నీ కేంద్రీకృతమై వ్యవస్థగా, పరిశ్రమగా రూపం తీసుకోవడానికి, ఓక ఫార్మాట్ ఆవిష్కృతం కావడానికి కొంచెం సమయం పట్టొచ్చంతే' అన్నది ఆయన అభిప్రాయం.

మరోపక్క -హైదరాబాద్‌కే పరిమితమైన ఆడియో రిలీజ్ ఫంక్షన్లు, సక్సెస్ మీట్లూ ఆంధ్రకూ విస్తరిస్తున్నాయి. చిత్రోత్సవాలను విశాఖకూ విస్తరించాలని, ఎపి ఫిల్మ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్టిస్టులనూ ప్రోత్సహించాలన్న డిమాండ్లూ వినిపిస్తున్నాయి.

తెలుగు సినిమా విశాఖకు విస్తరించాలంటే -చిత్ర నిర్మాణం పట్ల ఔత్సాహికులకు అవగాహన కల్పించాలంటున్నారు -స్వాతిముత్యం, సిరివెన్నెల, సితార, అన్వేషణ, ఏప్రిల్ ఒకటి విడుదల వంటి చిత్రాలకు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించి, ప్రస్తుతం విశాఖలో ఫిల్మ్ స్కూల్ నడుపుతున్న ఎంవి రఘు. విశాఖకు సినిమా పరిశ్రమ విస్తరించాలన్న కోరిక మొన్నటి వరకూ బాల్య దశలోనే ఉండేదని, త్వరలోనే విశాఖలో స్థిరపడే పరిణామాలు కనిపిస్తున్నాయని అంటున్నారు.

చిత్ర నిర్మాణానికి అనుమతులే పెద్ద సమస్యగా మారిన తరుణంలో -సింగిల్ విండో విధానం అమలుచేస్తే పరిశ్రమ వేళ్లూనుకోవడానికి బలమైన బాట వేసినట్టవుతుందని విశాఖపట్నం ఫిల్మ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ నాయకుడు సత్యనారాయణ అంటున్నారు. చిత్ర పరిశ్రమ ఎదుగుదలకు అవరోధంగా నిలుస్తున్న ముఖ్యమైన అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందంటున్నారు.

రాజకొండచుట్టూ..

తెలుగు సినీ పరిశ్రమకు కేరాఫ్ అడ్రస్ ప్రస్తుతం హైదరాబాదే. అందులో ఎవరికీ ఎలాంటి సందేహాలు లేవు. ఇప్పటికే అడ్వాన్స్‌డ్ ఎక్విప్‌మెంట్‌తో ఎస్టాబ్లిష్ అయిన పరిశ్రమను -మరింత ఎత్తుకు తీసుకెళ్లే ప్రయత్నాలూ జరుగుతుండటం శుభపరిణామం. చారిత్రాత్మక రాచకొండ పరిసరాలల్లో సినిమా పరిశ్రమకు సంబంధించి భారీ నిర్మాణాలు చేపట్టే యోచన ఉన్నట్టు ముఖ్యమంత్రి కెసిఆర్ రెండురోజుల కిందటే ప్రకటించారు. ఏరియల్ సర్వేతో ఆయా ప్రాంతాలను పరిశీలించిన కెసిఆర్, అనుగుణమైన ప్రణాళికలూ సిద్ధం చేయమని అధికారులను ఆదేశించారు. దీంతో చిత్ర పరిశ్రమ ముక్కలవుతుందా? అన్న శంకలు, ఆలోచనలు పక్కనపెడితే -విస్తరిస్తున్న పరిశ్రమ రెండు రాష్ట్రాల తెలుగు సినీ శక్తిగా ఎదుగుతుందన్నది ఎవ్వరూ కాదనలేని వాస్తవం.

- ప్రవవి, కెవిజి



విశాఖలో రామానాయుడి స్టూడియో

స్టూడియోకి వెళ్లే మార్గం

నాకు నచ్చిన సినిమా...

వన్నె తరగని దాగుడుమూతలు

నిర్మాత పి.బి.నారాయణ 'దాగుడుమూతలు' చిత్రాన్ని 1964లో నిర్మించారు. ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో హాస్య కుటుంబ కథాచిత్రంగా ఈ సినిమా రూపొందింది. ఆదుర్తి ఎప్పుడూ అక్కినేనితోనే వరుస హిట్లు అందిస్తున్న తరుణంలో, ఎన్టీఆర్‌తో చేయడం లేదని అభిమానులు అనుకున్నారు. ఆ మాటని అబద్ధం చేయడానికి ఈ సినిమా వచ్చింది. గుండమ్మకథ తర్వాత ఎన్టీఆర్ పూర్తిస్థాయిలో కామెడీ పాత్రలో ఒదిగిపోయారు.

హోటల్ యజమానిగా, కల్లాకపటం లేని అమాయకుడిగా కోటీశ్వరుడి వారసుడైనా మనవడిగా, హుందాగా నటించి మెప్పించారు. హీరోయిన్‌గా బి.సరోజాదేవి కీలకమైన పాత్రలో రాణించి సినిమాకే వన్నె తెచ్చింది. ఈ సినిమా పాటలన్నీ సూపర్‌హిట్లే. ఇప్పటికి ఈ పాటలు ఆణిముత్యాల్లా వినిపిస్తూనే ఉంటాయి. దాసరథి వ్రాసిన రిపీట్ సాంగ్ సందర్భోచితంగా 'గోరంక గూటికే చేరావు చిలుక', 'గోరంకకు ఎందుకో కొండత అలక', 'అందలం ఎక్కాడమ్మా... అందకుండా పోయాడమ్మా...', 'మెల్లమెల్లగా... అణువణువు నీదెగా...',

'దేవుడికేం హాయిగా ఉన్నాడు', 'ఎంకొచ్చిందోయ్ మామ... ఎంకొచ్చింది...' వంటి పాటలు ప్రేక్షకులను అలరిస్తాయి. ఈ సినిమాకు కథా, సంభాషణలు అందించిన ముళ్లపూడి రమణకు ఇదే తొలి అవకాశం కావడం విశేషం. ఇప్పటికి ఈ చిత్రం అంటే తెలుగు ప్రేక్షకులకు చాలా ఇష్టం.

-పాట్టి వెంకట శివప్రసాద్‌రావు, అద్దంకి

తెలుగు చలన చిత్రాలలో ఇప్పటికే ఎన్నో వందల సినిమాలు ప్రేక్షకులు చూసారు. అన్ని చిత్రాల్లో కొన్ని చిత్రాలు మనసును ఆకట్టుకుంటాయి. హృదయాన్ని ఏ పిల్ల సమీర తీరాలకో తీసుకెళతాయి. కొన్ని చిత్రాలు సందేశాత్మకంగా ఉంటే, మరికొన్ని నిత్య నూతనంగా భావించే ప్రేమలాలిత్యంతో అద్భుతంగా ప్రేక్షకుల మనసులలో తొణికిసలాడుతాయి. ఏ సినిమా ఏ ప్రేక్షకుడికి ఎలా నచ్చుతుందో తెలియదు. ఒక్కసారి సినిమా చూశాక ఆ చిత్రం నిరంతరం ప్రేక్షకుణ్ణి వెంటాడింది అంటే అది ఉత్తమ చిత్రమే. అదేవిధంగా ఒక్కసారి మన అద్భుతమైన సంగీత దర్శకులు బాణీలు కట్టిన పాటలు వింటే, మళ్లీమళ్లీ అదే పాట చెవులలో మారుమ్రోగుతుంటే, అది ఉత్తమమైన బాణి. సాహిత్యపరంగా అద్భుతంగా తీర్చిదిద్దిన మాటలు. తమ గానంతో గాయనీ గాయకులు ఆ పాటకు అమరత్వాన్ని చేకూరుస్తారు. అటువంటి గొప్ప పాటలు సినిమాలు మనకు కొదవలేదు. అటువంటి పాటలకు లేక చిత్రాలకు వేదికే ఈ శీర్షిక. మీకు నచ్చిన పాట కానీ, చిత్రం కానీ ఈ శీర్షికలో మీరు పాఠకులతో మీ భావాలు పంచుకోవచ్చు. అయితే, మీకు ఆ పాట కాని, ఆ చిత్రం కాని ఎందుకు నచ్చింది అనే విషయాన్ని సవివరంగా రాయాల్సి వుంటుంది. మీకు నచ్చిన ఆ పాటను కానీ, చిత్రాన్ని కానీ తోటి పాఠకులతో పంచుకోవడానికి ఇది ఉత్తమమైన వేదిక. ఇక ఆలస్యమెందుకు మీకు నచ్చిన పాట లేక సినిమా గూర్చి సవివరంగా వ్రాసి పంపమని ఆహ్వానిస్తున్నాం.

మా చిరునామా : ఎడిటర్, వెన్నెల, ఆంధ్రభూమి దినపత్రిక , 36, సరోజినీదేవి రోడ్ , సికిందరాబాద్- 03

నాకు నచ్చిన పాట

"పిచ్చి పిచ్చి పిచ్చి... రకరకాల పిచ్చి..."

తెలుగు సినీ వినీలాకాశంలో అనేక ఇంద్రధనస్సులు పాటల రూపంలో ప్రేక్షకులకు కన్నులవిందు చేశాయి. శ్రీశ్రీ, ఆత్రేయ వంటి మహాకవులు సినీపాటలు వ్రాసి ప్రేక్షకులను ఊర్రూతలూగించారు. ఆత్రేయ రచించిన పండండి సంసారం చిత్రంలోని పాట ఇప్పటికి వ్యంగ్యమైన విరుపులతో నేటి యువతను హెచ్చరిస్తూనే ఉంటుంది. ఆత్రేయ వ్రాసిన పాట అర్థాన్ని భానుమతి గాత్రం అద్భుతంగా ఆవిష్కరిస్తుంది. పిచ్చి అనే అంశంతో ఈ పాట ఉన్నా నాకెంతో నచ్చింది. పుహళేంది బాణీతో రూపొందిన ఈ పాట తేలిక పదాలతో మానవ స్వాభావాలను పిచ్చిగా వర్ణించింది. అంత్య ప్రాసలతో పిచ్చిని ఆత్రేయ వాడిన తీరు అద్భుతం. దేవుడిని నిర్భయంగా చీకటి వెలుగులకు, కష్టసుఖాలకు బాధ్యుడనీ, అలాంటి దేవుడి కోసం వెతికేవారిది, ఆ దేవుడిది కూడా పిచ్చే అనడం ఆత్రేయ కలానికే చెందింది. ఉన్నవాడికి ఇంకా కావాలి అనే మాట, తృప్తి చెందిన మానవ జీవితాలకు వర్తిస్తే, ఉన్నవాడిని లేని వాడిగా చేయాలనే లేని వాడి కక్ష, లేనివాడి పిచ్చిగా చెబుతూ సాగింది. పదవులకోసం పాకులాడడం, వెర్రిమొర్రిగా ప్రేమించే కుర్రవాళ్లు ఉండడం, వారిని అడ్డుకునే అమ్మానాన్నలది, భక్తికూడా ఒక పిచ్చేనని ఖచ్చితంగా చెబుతున్నది ఈ పాట. ఆత్రేయ సమాజాన్ని ఎంతగా చదివాడో ఈ పాట వింటే తెలుస్తుంది. మామూలు వ్యక్తులు ఇటువంటి మాటలతో తిట్టినా వారిని కోపిష్టులుగా, ఫెమినిస్టులుగా వ్యతిరేకించే జనం, కవి అభిప్రాయాలను ఎలా అయినా మెచ్చుకుంటారు అని ఈ పాట నిరూపించింది.

-ఎం.వి.రమణకుమారి, హైదరాబాద్

వెన్నెల రచయితలకు సూచన

వెన్నెలకు రచనలు పంపాలనుకునే వారు ఈ కింది విషయాలను గమనించగలరు

- ప్రతి శుక్రవారం వెలువడే వెన్నెలకు రచనలు మంగళవారం లోపు చేరాల్సి వుంటుంది.
- రచనల్లో కొత్తదనం ముఖ్యం
- అరిగిపోయిన పాత సినిమా కబుర్లు, శ్రద్ధాంజలి వ్యాసాలు, సినిమాలపై హితబోధల కన్నా, చదివించే కొత్త తరహా వ్యాసాలకు ప్రాధాన్యత వుంటుంది.
- కొత్త సినిమాలపై సమీక్షలు రాయాలనుకున్న ఔత్సాహికులు ముందుగా ఒకటి రెండు సమీక్షలు పరిశీలన కోసం రాసి పంపితే, పరిశీలించగలం.
- తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వచ్చే కొత్తసినిమాలను పరిశీలించే ఆసక్తి వున్నవారు, సంబంధిత వ్యాసాలు పంపితే అవీ ప్రచురణార్హమే.
- కొత్త హాలీవుడ్ సినిమాలకు సంబంధించిన వ్యాసాలకు కూడా స్వాగతం.
- ఇంతవరకు ఎక్కడా ప్రచురితం కాని, అపురూప చిత్రాలు వుంటే పంపొచ్చు.
- రచనలను ఈ మెయిల్‌లో స్కాన్ లేదా పిడిఎఫ్ ఫార్మాట్‌లో vennela@deccanmail.com కు మెయిల్ చేయగలరు.
- ప్రచురించిన (మీ వ్యూస్ మినహా) ప్రతి వ్యాసానికి పారితోషికం వుంటుంది.

మా చిరునామా :
ఎడిటర్, వెన్నెల, ఆంధ్రభూమి దినపత్రిక
36, సరోజినీదేవి రోడ్ , సికిందరాబాద్- 03

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి శనివారం 20, డిసెంబర్ 2014

60 నిమిషాల్లో 60 మందికి మేకప్!

● తనేజా ప్రపంచ రికార్డు

'ముద్దుగుమ్మలకు ముస్తాబు చేస్తూంటే ఎంత సమయమూ చాలదు.. మగువలు 'మేకప్' మొదలెడితే ఒకంతటికి తెమలదు..'- ఇలాంటి వ్యాఖ్యానాల సంగతెలా ఉన్నా.. ప్రముఖ అంతర్జాతీయ బ్యూటీషియన్ ఇషికా తనేజా 'మేకప్' కళలో ప్రపంచ రికార్డుతో సంచలనం సృష్టించారు. కేవలం అరవై నిమిషాల వ్యవధిలో అరవై మంది యువతులకు అత్యంత వేగవంతంగా మేకప్ చేసి ఆమె 'గిన్నిస్ రికార్డు బుక్'లో స్థానం సంపాదించారు. తాజాగా ఢిల్లీలో ప్రముఖుల సమక్షంలో తనేజా ఈ ఘనతను సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. మూడు రంగులను మాత్రమే ఉపయోగించి అరవై మంది యువతులకు ఆమె 'ఎయిర్‌బ్రష్'తో మేకప్ పూర్తి చేశారు. మేకప్ ప్రక్రియను ఏడు దశలుగా విభజించి ఎయిర్‌బ్రష్‌ను మాత్రమే వినియోగించారు. ఈ సందర్భంగా 'గిన్నిస్ రికార్డు బుక్' ప్రతినిధులు హాజరై తనేజా ఘనతను నమోదు చేశారు. భారత్‌లో ఇలాంటి అరుదైన రికార్డును సృష్టించినవారు ఇంతవరకూ ఎవరూ లేరని, తొలుత 25 మందికి మాత్రమే మేకప్ చేయాలని అనుకున్నా, ఏకంగా అరవై మందికి గంట వ్యవధిలో మేకప్ పూర్తి చేయడం విశేషమని వారు పేర్కొన్నారు.

కాగా, తాను సాధించిన ప్రపంచ రికార్డును 'నిర్భయ'కు అంకితం ఇస్తున్నట్లు తనేజా ప్రకటించారు. సరిగ్గా రెండేళ్ల క్రితం ఢిల్లీలో ఆరుగురు యువకులు బస్సులో సామూహిక అత్యాచారం జరిపినపుడు వైద్య విద్యార్థిని 'నిర్భయ' ఎంతో ధైర్యంగా పోరాడి చివరికి ప్రాణాలు కోల్పోయిందని ఆమె గుర్తు చేశారు. 'నిర్భయ' మనోధైర్యం యువతులందరికీ స్ఫూర్తి కలిగిస్తుందన్నారు. మేకప్ కళను ప్రదర్శించిన సందర్భంగా వసూలైన విరాళాలను 'నిర్భయ జ్యోతి ట్రస్టు'కు అందజేస్తున్నట్లు తనేజా ప్రకటించారు. ఢిల్లీలో 12 మంది అత్యాచార బాధితులకు ఉన్నత చదువుల కోసం లక్ష రూపాయల చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు ప్రకటించారు. మరికొంత మంది బాధితులకు తాను నిర్వహిస్తున్న బ్యూటీ క్లినిక్‌లో ఉపాధి కల్పిస్తున్నట్లు తనేజా తెలిపారు. ★

ముత్యాల ముగ్గు

18 చుక్కలు, 6 వరసలు (రెండు వైపులా ఒక చుక్క వదిలి 6 చుక్కలు వచ్చే వరకూ)

జాస్తి భాగ్యలక్ష్మి
జయపురం (కృష్ణా జిల్లా)

మీ సృజనకు పదునుపెట్టి కొత్తకోణాల్లో ఆకర్షించే అందమైన ముగ్గులు పంపండి. చుక్కల వివరాలు రాయడం మరువకండి. చుక్కలు, గీతలు.. ఏ ముగ్గులైనా చూసేందుకు స్పష్టంగా ఉండాలి. చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికిందరాబాద్-500 003.

ముగ్గులు వేసిన కాగితాలను కలర్ స్కానింగ్ చేయించి bhoomika@andhrabhoomi.netకు మెయిల్‌లో కూడా పంపొచ్చు.

ఆత్మసౌందర్యం ఎంతో గొప్పది..

● 'మిస్ ఇండియా అమెరికా' ప్రణతి

'అందాల పోటీలు శారీరక సౌందర్యాన్ని మాత్రమే కాదు, నలుగురి ఎదుట ఆత్మసౌందర్యాన్ని కూడా ఆవిష్కరింపజేస్తాయి.. ప్రపంచంలోనే ఎంతో ఉన్నతమైన భారతీయ సంస్కృతి మనల్ని వినయ సంపన్నులుగా నిలబెడుతోంది..' అని 'మిస్ ఇండియా అమెరికా' పోటీలో విజేతగా నిలిచిన తెలుగమ్మాయి ప్రణతి గంగరాజు (19) చెబుతోంది. ఇటీవలి కాలంలో పలు అంతర్జాతీయ అందాల పోటీల్లో భారతీయ యువతులు కీర్తిపతాకాలను రెపరెపలాడించడం సంతోషం కలిగిస్తోందని, భారతీయ సమాజం, సంస్కృతి ఏ విషయంలోనూ తక్కువ కాదని అందాల పోటీలు నిరూపిస్తున్నాయని ఆమె తన మనోభావాలను ఆవిష్కరించింది. విదేశీగడ్డపై ఉంటున్నా స్వచ్ఛమైన తెలుగు భాషలో మాట్లాడే ఈ 'విజయవాడ అమ్మాయి' తన తల్లిదండ్రులు ఇస్తున్న ప్రోత్సాహంతోనే తాను ఇంతటి ఘనతను సాధించినట్లు చెబుతోంది. ఇండియాలోను, అమెరికాలోనూ మంచి సినీ నటిగా పేరు తెచ్చుకోవాలన్నదే తన చిరకాల వాంఛ అని, ఆ దిశగానే తాను కృషి చేస్తున్నానని తన అంతరంగాన్ని బహిర్గతం చేసింది. నటన, సినిమాల నిర్మాణంలో మెళకువలు నేర్చుకునేందుకు ఆమె ప్రస్తుతం లాస్ ఏంజిల్స్‌లోని 'లీ స్ట్రాస్‌బెర్గ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్'లో విద్యనభ్యసిస్తోంది. సినీ రంగంలో సత్తా నిరూపించుకుంటానని, అలాగే సేవా కార్యక్రమాల్లోనూ వీలైనంత వరకూ పాల్గొంటానని ఆమె అంటోంది. నటన అంటే చిన్నప్పటి నుంచి తనకెంతో ఇష్టంగనుక ఆ రంగంలో స్థిరపడాలన్నదే తన సంకల్పమని చెబుతోంది. నటనా పరంగా ఎన్నో పాత్రలు కొత్త కొత్త విషయాలు నేర్పుతుంటాయని, భావి జీవితానికి లక్ష్యాలను నిర్దేశిస్తుంటాయని ప్రణతి విశ్లేషిస్తోంది. 'మిస్ ఇండియా అమెరికా' పోటీలో పాల్గొన్నపుడు ప్రతి క్షణాన్ని తాను ఎంతగానో ఆస్వాదించానని, ఆత్మవిశ్వాసం తోడైతే గమ్యాన్ని చేరుకోవడం అసాధ్యం కాదంటోంది.

అమెరికాలోని జార్జియాలో ఉంటున్న ప్రణతి ప్రస్తుతం నటనపైనే దృష్టి కేంద్రీకరించింది.

'మిస్ ఇండియా యుఎస్ఏ' పోటీలను ఇరవై ఏళ్ల క్రితం ప్రారంభించగా, ఈ టైటిల్‌ను సాధించిన తొలి తెలుగు యువతిగా ఆమె రికార్డు సృష్టించింది. బాలీవుడ్ నటి రిచా గంగోపాధ్యాయ 2007లో ఈ టైటిల్‌ను సాధించగా, మళ్లీ ఇన్నాళ్లకు దీన్ని కైవసం చేసుకున్న ఘనత ప్రణతికి దక్కింది. పాటలు పాడడం, నృత్యం, రచనా వ్యాసంగం, స్విమ్మింగ్ అంటే అమితాసక్తి చూపే ఆమె మోనికా గిల్ (గత ఏడాది 'మిస్ ఇండియా యుఎస్ఏ' టైటిల్ విజేత) నుంచి కిరీటాన్ని అందుకుంది. టైటిల్ గెలిచిన ప్రణతికి ఎనిమిది వేల అమెరికన్ డాలర్లను నిర్వాహకులు బహుమతిగా అందజేశారు. హనుమకొండలో జన్మించిన ప్రణతి అమెరికాలో ఉంటున్నా తెలుగు భాషపై మమకారాన్ని వదులుకోలేదు. ఆమె తల్లి మైత్రేయి శర్మ హనుమకొండకు, తండ్రి రామ్ గంగరాజు విజయవాడకు చెందిన వారు. ఆయన జార్జియాలో వ్యాపారవేత్తగా ఉంటూ ఓ సాఫ్ట్‌వేర్ సంస్థను నిర్వహిస్తున్నారు. తల్లి మైత్రేయి సాధారణ గృహిణిగా ఉంటూ ప్రణతిని అన్ని విషయాల్లోనూ ప్రోత్సహిస్తున్నారు. 'ఫిట్‌నెస్' కోసం తన కుమార్తె అలసట లేకుండా నిత్యం పని చేస్తుంటుందని, మాతృభాషలో మాట్లాడేందుకు ఇష్టపడుతుందని ఆయన తెలిపారు. 2016లో గోవాలో జరిగే 'ప్రపంచ స్థాయి మిస్ ఇండియా' పోటీల్లో అమెరికా తరఫున ప్రణతి ప్రాతినిధ్యం వహించనుంది. ★

రైల్వే స్టేషన్‌లో ఓ సాయంత్రం..

-మాన్యం రమేష్‌కుమార్

కథల పోటీలో ఎంపికైన రచన

పైజాగ్ రైల్వేస్టేషన్.. సాయంత్రం ఐదు గంటలు.. ప్లాట్‌ఫామ్ నెంబర్ రెండులో విశ్రాంతిగా ఓ బెంచీమీద కూర్చుని మాగజైన్ చదువుతూ ట్రైన్‌కోసం ఎదురుచూస్తున్నాను. ఎడతెరిపి లే కుండా కురుస్తున్న వర్షాల వల్ల రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో ట్రైన్ గంటంపావు ఆలస్యమని అనౌన్స్ చేశారు. సామర్లకోటలో అర్ధరాత్రి ముహూర్తానికి జరగనున్న ఓ పెళ్లికి వెళ్తున్నాను. దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించినట్లుగా, వెనకనుంచి ఎవరో తరుముకొస్తున్నట్టుగా ప్లాట్‌ఫామ్ మీద జనం అటూ ఇటూ పరుగులు పెడుతున్నారు. నా పక్క బెంచీమీద కూర్చున్న కుర్రాడు మాత్రం ఏకదీక్షతో సెల్ ఫోన్‌లో ఏదో చేసుకుంటున్నాడు. సెల్‌లో అతను ఫేస్‌బుక్ చూస్తున్నాడు. ఇంచుమించు నా కొలీగ్స్ అందరికీ ఫేస్‌బుక్ అకౌంట్ ఉన్నా నాకు మాత్రం దానిమీద పెద్దగా ఆసక్తిలేదు. అందరూ ఎందుకలా అంతంత టైమ్ వేస్ట్ చేసుకుంటారో నాకర్థం కాదు.

మేగజైన్ మడిచి బ్యాగ్‌లో పెట్టాను. 'ఇంకా గంట సమయం ఎలా గడపాల్రా బాబూ..' అని అనుకుంటుండగా కనిపించాడు వాడు. తేరిపార చూశాక కన్‌ఫర్మ్ చేసుకున్నాను. సందేహం లేదు... వాడు ప్రకాష్! మా కంపెనీ శ్రీకాకుళం బ్రాంచిలో ఎనిమిదేళ్ళ క్రితం ఇద్దరం కలిసి పనిచేశాం. నిజానికి అదే మా తొలి పరిచయం కాదు. ఇద్దరిదీ ఒకటే వూరు. టెన్త్‌వరకూ ఇద్దరం క్లాస్‌మేట్స్ కూడా.

'ప్రకాష్..' అని పిలవగానే నావైపు చూశాడు. వెంటనే గుర్తుపట్టి 'ఎన్నాళ్లకెన్నాళ్లకు..' అంటూ పక్కకొచ్చి కూర్చున్నాడు.

ట్రాన్స్‌ఫర్ అయ్యాక ఇద్దరం కొన్నాళ్లపాటు తరచుగా ఫోన్లో మాట్లాడుకునేవాళ్ళం. తర్వాత్తర్వాత ఆ ఫ్రీక్వెన్సీ తగ్గింది. ఇప్పుడు నేను వైజాగ్ బ్రాంచిలో, వాడు రాజమండ్రి బ్రాంచిలో చేస్తున్నాం. ఏదో ఫంక్షన్ నిమిత్తం వైజాగ్ వచ్చి తిరిగి వెళ్తున్నాడట. నేను ఎదురుచూస్తున్న ట్రైన్‌కే వాడూ వస్తున్నాడు. కుశల ప్రశ్నలయ్యాక ఇద్దరం కాసేపు ఏవో పాత విషయాల గురించీ, మిగతా కొలీగ్స్ గురించీ మాట్లాడుతూ కూర్చున్నాం. తవ్వుతున్నకొద్దీ చెలమలో నీళ్ళు ఊరుతున్నట్టు మా జ్ఞాపకాలు వూరుతూనే వున్నాయి.

కాసేపయ్యాక అన్నాను- ''ఆ ఎదురుగా వున్న కుర్రాణ్ణి చూశావా? వెయిటింగ్ గురించి బెంగ అతనికి అక్కర్లేదు. చాలాసేపట్నుంచి అలా ఫేస్‌బుక్‌లో మునిగిపోయే వున్నాడు..''

''అది సరే.. అసలు నువ్వెందుకు ఫేస్‌బుక్‌లో లేవు..?'' అప్పుడే గుర్తొచ్చినట్టు అడిగాడు వాడు.

''ఇంటి దగ్గర ఇంటర్‌నెట్ అప్పుడప్పుడూ చూస్తుంటాను గానీ, నాకెందుకో ఫేస్‌బుక్ అలవాటవలేదురా. ఖాళీగా వుంటే ఏదైనా బుక్ చదువుతూ కూర్చుంటాను గానీ ఫేస్‌బుక్‌లోకి మాత్రం వెళ్ళను...'' నవ్వుతూ అన్నాను.

''మరీ అలా తీసిపారెయ్యకురా.. సామాజిక వెబ్‌సైట్లవల్ల కూడా ఉపయోగం ఉంది'' అన్నాడు వాడు.

''సామాజిక వెబ్‌సైట్లవల్ల ఏం ఉపయోగం..? ఏవో కాలక్షేపం చర్చలూ.. వాటికి లైక్‌లూ, కామెంట్లూ తప్ప..! అసలు పరిచయాల మూలంగా కొన్నిచోట్ల మోసాలు జరగడం కూడా పత్రికల్లో చూస్తూనే వున్నాం.. కదా'' అన్నాను.

''వాటిలో వచ్చేవన్నీ కాలక్షేపం కబుర్లు కాదు. కొన్నిసార్లు అర్థవంతమైన చర్చలూ జరుగుతాయి. ఒక్కోసారి తెలుసుకోవాల్సిన విషయాలూ కనిపిస్తుంటాయి. అదంతా వాటిని ఉపయోగించుకొనే వారి మనస్తత్వంపై ఆధారపడి ఉంటుంది.''

''నువ్వేదో విషయాన్ని గురించి చెప్పదలుచుకున్నట్లుంది. ట్రైన్ రావడానికింకా అరగంట పైనే టైముంది. అదేదో తొందరగా చెప్పేయ్..'' వాడి మొహంలో ఏదో చెప్పాలన్న ఉత్సుకతను గమనించి అన్నాను.

''నిజమేరా.. కొద్ది రోజుల క్రితం నా జీవితంలో జరిగిన ఓ సంఘటన నీకు చెప్పాలనిపించింది..'' అంటూ మొదలుపెట్టాడు.

''గత ఏడాది మే నెలలో ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఒక అమ్మాయి గురించి అనుకోకుండా తెలుసుకున్నాను. తనకి పదిహేనేళ్లుంటాయి. ఆ అమ్మాయికి చిన్న యాక్సిడెంట్ జరిగింది. చూడ్డానికి బాగానే ఉన్నా, తలకు తగిలిన దెబ్బవలన మెదడులో ఇంటర్నల్ బ్లీడింగ్ జరిగింది. నిజానికామె పరిస్థితి విషమంగా వుంది. మందులతో కుదరదన్నారు డాక్టర్లు. ఆపరేషన్ చెయ్యాల్సి వుంది. వాళ్ళ నాన్న ఓ చిన్న కంపెనీలో ఉద్యోగి. ఆపరేషన్‌కి లక్షల ఖర్చు భరించగలిగే స్థితి ఆయనకు లేదు. వాళ్ళకున్నది ఒక్కగానొక్క కూతురు. ఈ పరిస్థితి చూశాక వాళ్ళకు ఎలాగైనా సాయం చెయ్యాలనిపించింది. కానీ, నీకు తెలుసు కదా.. మనవి కూడా మధ్య తరగతి బతుకులే.. ఏం చెయ్యాలో అర్థం కాలేదు'' అని అడిగాడు.

''మరైతే ఏం చేశావ్..?'' ఆసక్తిగా అడిగాను.

''నాకో ఆలోచన తట్టింది. అదెంతవరకూ సక్సెస్ అవుతుందో... అసలలా చెయ్యడం సరైనదో కాదో నాకు తెలీలేదు. కానీ, ప్రయత్నించి చూద్దామనుకున్నాను...''

''ఇంతకీ ఏమిటా ఆలోచన...?'' నాలో ఆసక్తి పెరిగింది.

''ఫేస్‌బుక్‌ను ఉపయోగించుకోవడం.. నీకు తెలుసుగా. నాకు ఇంటర్నెట్ అంటే మొదటి నుంచీ బాగా ఆసక్తి. ఫేస్‌బుక్‌లో ఎంతోమంది ఫ్రెండ్సున్నారు. ఆ ఛానల్‌ను ఉపయోగించుకోవాలనుకున్నాను. ఆ అమ్మాయి తండ్రికి నేనో స్వచ్ఛంద సంస్థనుంచి వచ్చానని చెప్పి పరిచయం చేసుకొని, వారికి ఎలా సాయం చెయ్యదల్చుకున్నానో చెప్పాను. ఆ అమ్మాయి పరిస్థితి గురించి వివరిస్తూ సాయం అందించాలని ఫేస్‌బుక్‌లో ఓ 'పోస్ట్' పెట్టాను. అందులో ఆయన బ్యాంకు అకౌంట్ నెంబర్ కూడా ఇచ్చాను''.

''ఎవరైనా స్పందించారా..?''

''స్పందించారు. కానీ, నేననుకున్న విధంగా కాదు.. 'నిజంగానా..? తమాషాకి చెప్తున్నావా..?' అని కొంతమంది, 'ఈ ఉద్యోగం ఎప్పణ్ణుంచి మొదలెట్టావ్..?' అని మరికొంతమంది కామెంట్లు పెట్టారు. ఆ రకంగా వచ్చింది స్పందన...''

''మరేం చేశావ్?''

''ఏం చేస్తే వీళ్ళు నమ్ముతారా..? అని ఆలోచించాను. హాస్పిటల్ బెడ్‌పై వున్న ఈ అమ్మాయి ఫొటో తీసుకున్నాను. యాక్సిడెంట్ ఫలితంగా ఆమెకు ఏ విధంగా బ్రెయిన్‌లో డామేజి జరిగింది? దానిని సరిచెయ్యడానికి ఏం చెయ్యాలి? ఎంత త్వరగా ఆపరేషన్ జరగాలి? ఇలా నేను తెలుసుకున్న విషయాలన్నీ ఆ అమ్మాయి ఫొటోతోపాటు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాను. ఆ పోస్ట్‌ను ప్రతి ఒక్కరూ షేర్ చెయ్యాలని రిక్వెస్టు వుంచాను. దానివల్ల వారి ఫ్రెండ్స్‌కు, అక్కణ్ణుంచి మిగతా వారికి వెళ్తూ చాలామందికి చేరుతుంది''.

''సరే.. మరి పాజిటివ్‌గా స్పందన వచ్చిందా?'' అడిగాను.

''వచ్చింది. చాలామంది ఆ పోస్ట్‌ను షేర్ చేశారు. కొంతమంది అకౌంట్ నెంబర్‌కు డబ్బు పంపిస్తూ ఆ వివరాల్ని పోస్ట్ చేశారు. మరికొంతమంది సానుభూతి మాత్రం చూపించారు...''

''కావలసిన డబ్బు సమకూరిందా..?''

''లేదు. లక్ష్యానికి చాలా దూరంలో ఉండిపోయాం. ఆపరేషన్ ఇక రెండు రోజుల వ్యవధిలో తప్పనిసరిగా చెయ్యాలి. పాపం.. ఆ అమ్మాయి తల్లిదండ్రులు ఎన్ని ప్రయత్నాలు చేసినా డబ్బు సమకూర్చుకోలేకపోయారు. ఆ అమ్మాయిని కాపాడలేనేమో అని చాలా బాధపడ్డాను.. అయినా పట్టు విడవకుండా ఫేస్‌బుక్‌లో ఆ పోస్ట్‌ను అప్‌డేట్ చేస్తూనే వున్నాను..''

''చివరికి ఏమైంది..? ఆ అమ్మాయి బతికిందా..?'' ఆతృతగా అడిగాను.

''ఆపరేషన్ జరగడానికి ముందురోజు ఓ స్వచ్ఛంద సంస్థ తరఫున ఒక పెద్ద మనిషి యాభై వేలు డొనేట్ చేశారు. తన పెద్దకొడుకు ఈ విధంగానే యాక్సిడెంట్‌కు గురై తరువాత బ్రెయిన్ హెమరేజ్‌తో చనిపోయాడని.. సకాలంలో తెలుసుకోకపోవడంవల్ల తాను కొడుకును కోల్పోయానని, ఆలస్యమైతే ఈ అమ్మాయి కూడా చనిపోవచ్చుననీ, దాతలు స్పందించాలని 'పోస్ట్' పెట్టారు. అంతే.. కొన్ని గంటల వ్యవధిలోనే అనూహ్యమైన స్పందన మొదలైంది. పదివేలు, ఐదువేలు, వెయ్యి ఇలా ఎవరికి తోచినంత వారు పంపుతూ ఫేస్‌బుక్‌లో పోస్ట్‌లు పెట్టసాగారు. మర్నాటికల్లా ఆపరేషన్‌కు కావలసిన ఐదు లక్షలకు సరిగ్గా ఇరవై వేలు తక్కువగా పోగైంది. ఆ ఇరవై వేలూ నేను జత చేసి మొత్తం ఐదు లక్షలూ అందించాను. ఆ మధ్యాహ్నమే ఆపరేషన్ జరిగింది. మృత్యువు కౌగిలినుంచి ఆ అమ్మాయి బైటపడింది...''

''నిజంగా ఇదొక అద్భుతమైన విషయమే..' సంభ్రమానికి గురవుతూ అన్నాను.

''అవును.. ఆ అమ్మాయి బెడ్‌పైనుంచి తనకు సాయం చేసిన వారందరికీ కృతజ్ఞతలు చెప్తున్న వీడియోను పోస్ట్‌లో జత చేశాను. ఆమె త్వరగా కోలుకోవాలన్న ఆకాంక్షలూ, అభినందనలు వెల్లువెత్తాయి..'' వాడు చెప్పడం ఆపాడు.



ఇదంతా విన్న తర్వాత సంతోషంతో పాటు ఒక రకమైన ఆశ్చర్యం కూడా నా మనసులో నిండిపోయింది. ఓ ప్రాణాన్ని నిలబెట్టాలన్న ఆలోచన ప్రకాష్‌కు రావడం గొప్ప విషయం. వాణ్ణి ఎంత అభినందించినా తక్కువే. అదే విషయం వాడితో చెప్పాను. ప్రకాష్ చిన్న నవ్వు నవ్వి ఊరుకున్నాడు. తను చేసిన పని ఓ గొప్ప విషయంగా వాడు భావించినట్టు అనిపించలేదు. కాసేపు మౌనంగా వున్నాక ''నీతో చెప్పాల్సిన విషయం ఇంకొకటి వుందిరా...'' అన్నాడు వాడు.

అప్పుడు గమనించాను. వాడి మొహంలో అదోలాంటి ఇబ్బందికరమైన భావం.. ఇంకా ఏదో చెప్పాలన్న తపన..

''ఇదంతా ఎందుకు చేశానో, ఆ అమ్మాయికి సాయపడాలని ఎందుకనుకున్నానో ఆలోచించావా?'' అడిగాడు.

నిజమే.. నా మనసులో చిన్న సందేహం వచ్చినా దానికంత ప్రాముఖ్యత ఇవ్వలేదు. యాదృచ్ఛికంగా ఆ కుటుంబం వీడి దృష్టిలో పడిందనీ, ఆ అమ్మాయి పరిస్థితి చూసి చలించి ఇదంతా చేశాడనీ అనుకున్నాను.

''ఇదంతా యాదృచ్ఛికంగానే జరిగిందనుకుంటున్నావా..?'' నా మనసులో భావాలు చదివినట్టుగా అన్నాడు వాడు. కొన్ని క్షణాల మౌనం తర్వాత మళ్లీ వాడే చెప్పడం మొదలుపెట్టాడు.

'ఆమధ్య ఓ రోజు ఉదయాన్నే ఐదు గంటలకు బైక్‌మీద యోగా క్లాసుకు వెళ్తున్నాను. ఆ సమయంలో ట్రాఫిక్ పెద్దగా లేదని కాస్త స్పీడుగానే వెళ్తున్నాను. మలుపు వద్ద ఎదురుగా సైకిల్ మీద వస్తున్న అమ్మాయిని ఢీకొట్టాను. ఆ అమ్మాయి సైకిల్ పైనుంచి ఎగిరి తలకు గాయం తగిలి పడిపోయింది. ఆమెలో కదలిక లేదు. వెంటనే చనిపోయిందేమోనన్న అనుమానం వచ్చింది. భయంతో నాకు చెమటలు పట్టాయి. ఆ సమయంలో అటుపక్క ఎవరూ రాలేదు. జరిగిన సంఘటనను ఎవరూ చూడలేదు. అనైతికంగా ప్రవర్తిస్తున్నానని తెలిసినా- ఆ భావాన్ని భయం డామినేట్ చేసింది. ఎవరూ రాకముందే అక్కణ్ణుంచి వేగంగా వెళ్లిపోయాను. మరోలా చెప్పాలంటే పారిపోయాను. అక్కణ్ణుంచి బైటపడ్డానే కానీ- నా మనసులో అపరాధ భావం అంతకంతకీ పెరిగిపోయింది. దాన్నుంచి తప్పించుకోలేక ఆ అమ్మాయి గురించి ఎంక్వైరీ చెయ్యడం ప్రారంభించాను. మెదడులో రక్తస్రావం జరిగి, ప్రాణాపాయ పరిస్థితిలో ఆమె ఆస్పత్రిలో వుందని తెలిసింది. ఆ తరువాత ఏం చేశానో ఆ కథంతా నీకు తెలిసిందే. ఇదంతా జరిగాక ఆ కుటుంబం నన్నో దేవుడిలా చూస్తుంటే- గిల్టీ ఫీలింగ్ కలుగుతోందిరా.. వాళ్ళ కృతజ్ఞతకి అర్హుడిని కానేమోనన్న భావం నన్ను గుచ్చుకుంటోంది. ఈ విషయం మొదట నీకే చెప్పాను. ఈ విషయం వాళ్ళకు చెప్పేస్తే ఎలా వుంటుందా? అని ఆలోచిస్తున్నా.. నువ్వే సలహా ఇవ్వాలి...'' చెప్పడం ముగించాడు వాడు.

నేను కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాను. వాడు కావాలని యాక్సిడెంట్ చేయలేదు. ప్రమాదం జరిగాక వాడు ఆమెను రోడ్డుపై వదిలేసి వెళ్లిపోవడం తప్పే. ఆ క్షణం వాడి మనఃస్థితి వాడి చేత అలా చేయించింది. తర్వాత తన తప్పు తెలుసుకొని విజ్ఞతతో వ్యవహరించాడు. ఓ పరిష్కారాన్ని కనుగొని ఆమె ప్రాణాన్ని నిలబెట్టాడు. తప్పు తెలుసుకొని సరిదిద్దుకోవడం కన్నా గొప్ప సంగతి ఏముంది..? అదే విషయం వాడితో చెప్పాను.

''ఇంతకీ నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదు నువ్వు..'' అన్నాడు వాడు.

''యాక్సిడెంట్ చేసింది నువ్వేనని వాళ్ళకు చెప్పడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. కొన్ని విషయాలను గోప్యంగా వుంచడం వల్ల ఎవరికీ నష్టం లేనపుడు- అది మంచిదే కదా..! ఈ విషయాన్ని ఎవరికి చెప్పినా వాళ్ళకి నీమీద చెడు అభిప్రాయం ఏర్పడుతుందే తప్ప ఎవరూ నిన్ను తప్పుపట్టరు. ఫేస్‌బుక్ ద్వారా ఇలాంటి ఒక మంచి పని చెయ్యొచ్చనే ఆలోచన రావడం.. దాన్ని విజయవంతంగా అమలుచేసి ఒక వ్యక్తిని మృత్యుముఖం నుంచి బైటకు తీసుకురావడమనేది చిన్న విషయం కాదు. లేనిపోని ఆలోచనలు మానేసి ఒక ప్రాణాన్ని నిలబెట్టినందుకు గర్వపడు. నీలాంటివాడు స్నేహితుడిగా వున్నందుకు నిజంగా గర్వపడుతున్నానా..!'' వాడి అరచేతిని నా చేతిలోకి తీసుకొని ఆప్యాయంగా నొక్కుతూ అన్నాను. నా మాటలతో వాడి మొహంలో అంతవరకూ ఉన్న సందిగ్ధత తొలగిపోయి, వాడు తెరిపిన పడిన ఫీలింగ్ కనబడింది. ఒక మంచి పనిచేసిన వ్యక్తికి దానివల్ల లభించే సంతృప్తి మాత్రమే నిజమైన బహుమానం. అనవసర సందేహాలతో దాన్ని కోల్పోకూడదు.

మేం ఎక్కాల్సిన ట్రైన్ మరికొద్ది క్షణాల్లో రాబోతోందన్న అనౌన్స్‌మెంట్ వినబడడంతో మా కలయిక ఇచ్చిన జ్ఞాపకాలను భద్రపరచుకొని గమ్యస్థానాలకు చేరుకోవడానికి సన్నద్ధమయ్యాం. ★

రచయిత ఫోన్ నెం: 94924 54678

నేర్చుకుందాం

క. పరికింపఁగ దేహం బ
స్థిర మని నిజబుద్ధి ఁ దలఁ చి చిరతర కీర్తి
స్ఫురణం బ్రస్తుతి కెక్కని
పురుషుఁడు జీవన్మృతుండు భూరి వివేకా!

భావం; ఓ వివేకవంతుడా! ఈ దేహం శాశ్వతం కాదని తలంచి శాశ్వతమైన యశస్సును సంపాదించాలనే ఆసక్తికలిగి మహాదాతగా ప్రసిద్ధి కెక్కని మనుష్యుని బ్రతుకు వ్యర్థం. వాడు జీవించి కూడా మరణించిన వానితో సమానం. అంటూ దానం ఎంత ముఖ్యమైనదో శ్రీకృష్ణార్జునులు జలంధరుడికి చెబుతున్నారు. బ్రాహ్మణవేషంలో వచ్చిన వానితో యుద్ధాన్ని భిక్ష అడుగడానికి ప్రయత్నపూర్వకంగా వచ్చినవారు పాండవులు. కప్పం కట్టని జరాసంధునితో ఈ వ్యూహాన్ని పన్నారు.

పోతన భాగవతము - దశమ స్కంధము

స్పందన

36 **కె. ప్రమీలాజనార్దన్**

ఈ రోజు వంట చేసుకోవాలనిపించ లేదు. కాఫీ మాత్రం పెట్టుకొని తాగి వచ్చాడు. కళ్ళముందు తల్లి రూపమే కనిపిస్తోంది. ఆ కళ్ళలో దీనత్వమే తన గుండెను బరువెక్కిస్తోంది. అమ్మ ఇంతకాలం తల్లిదండ్రుల ఆదరణ లేదని బాధపడ్డది. ఇప్పుడు వాళ్ళు ఆ ఊరే వదిలేశారన్న బాధ.. వెళ్ళేవాళ్ళు వెళ్ళకుండా వాళ్ళు అమ్మకు అందచెయ్యమని కవరు ఇవ్వడం.. ఆ కవరులో ఏం వ్రాశారోనని అమ్మ ఆందోళన...

అవన్నీ మరచిపోవాలనుకొని రాకుండా అక్కడే వుండి ఆ ఊళ్ళో వున్న ఎవరి అమ్మాయినో కోడలిగా చేసుకొని ఆ ఊరితో బంధం పెంచుకోవాలనుకున్నట్లుంది. అందుకే తనను ''నువ్వక్కడ ఎవ్వరినీ ప్రేమించలేదు గదూ!'' అని అడిగింది. ఆ అడగడంలో తను ఎవర్నీ ప్రేమించలేదన్న నమ్మకం... అలా జరగకూడదన్న ఆలోచనా కూడా కనిపిస్తున్నాయి.

ఆమెకు దూరమైన బాంధవ్యాలు ఈ రకంగానైనా దగ్గర చేసుకోవాలన్న ఆశ వుండొచ్చు. కాని ఆ ఊరితో సంబంధం పెట్టుకుంటే ఎప్పుడో జరిగిన సంఘటనలు మళ్ళీ తలపుల్లో మెదిలి మనసును కలచివేస్తాయనుకోవడంలేదు.

కాని ఇప్పుడు ఆమెకా మాట చెప్పినా వినిపించుకోదు. ''ఎవర్నీ ప్రేమించలేదు గదూ!'' అన్న ఆమె మాటలో ఆమె ఆంతర్యాన్ని అవగతం చేసుకొని లేదన్నట్లు చెప్పాడు.

కాని అలా చెప్పి తనెంత తప్పు చేశాడో ఇప్పుడు తెలుస్తోంది. సూర్య ఎప్పుడైనా ''అక్కడ ఏ తెల్ల అమ్మాయికో తన మనసు అర్పితమయిందా?'' అంటూ ఆట పట్టిస్తే ఏం నీకు తెల్ల అమ్మాయి లంటే అంత మోజుగా వుందా?

నీకే చూస్తాను.. లేకపోతే నువ్వు చూసుకుందువుగానిరా...'' అనేవాడు తను నవ్వుతూ. నాలుగు నెలల కిందటి వరకు తన మనసులో ముద్రించుకున్న రూపేదీ లేదు. కాని సూర్య అన్నట్లు ఇప్పుడు కూడా తను తెల్లవాళ్ళమ్మాయిని కోరుకోలేదు.

తన మనసును మురిపించి మరిపించింది అచ్చు పదహారణాల తెలుగు అమ్మాయి.. తనకు తెలియకుండానే ఆమెతో అనుబంధం పెరిగింది. ఆమె పరిచయమైన రోజు గుర్తురాగానే నవ్వొచ్చింది.

ఒత్తైన నిగనిగలాడే నలుపుతో వున్న కురులను జడల్లుకొని నీలిరంగు చుడీదార్‌లో పచ్చటి శరీరం మెరుస్తున్నట్లుగా అనిపిస్తోంటే కొద్దిసేపు చూపులు తిప్పుకోలేకపోయాడు అజిత్. లేడిపిల్లలా భయభయంగా చూస్తూ తన క్యాబిన్‌లోకి కంపెనీ ఆర్డర్ చూపించింది హారిక.. పేరే కాదు. మీనాల్లాంటి కళ్ళతో మనిషి గూడా అందంగా వుంది.

అమాయకంగా కనిపిస్తున్న ఆమెను చూసి చిన్నగా నవ్వుతూ ''మీరు ఇక్కడ వుద్యోగం చెయ్యగలరా?'' అన్నాడు అజిత్.

''ఎందుకొచ్చింది మీకా అనుమానం?'' చురుగ్గా చూసిన ఆమె చూపుల్లో తన మాటలు ఆమెకు కోపం తెప్పించాయని గ్రహించాడతడు.

''సారీ...'' తప్పు చేసినట్లుగా చూశాడు.

''నోనో. మీరేం తప్పు అన్నారని అంత బాధపడుతున్నారు? పై అధికారినన్న భావం లేకుండా మీరలా సారీ అనడం నేను తొందరపాటుతో మాట్లాడానన్న విషయం తెలిపి నన్ను నేనే కోప్పడుకొనేట్లు చేసింది'' అంది.

''అరె నేను గమనించనే లేదు. కొచ్చిన్ నుండి వచ్చారంటే మలయాళం మాతృభాష అనుకున్నాను. తెలుగు.. ఇంతవరకు చూడకుండా మమ్మల్ని అడగకుండా అన్య భాషలో మాట్లాడుకున్నాము..'' ఆమె అనుకోకుండా మాట్లాడిన తెలుగు మాటలు విని సంతోషంగా అన్నాడు. అంతవరకు ఆంగ్లంలో మాట్లాడుకున్నందుకు కాస్త బాధ గూడా కలిగింది. ఆమాటే పైకి అన్నాడు అజిత్.

''మన దేశంలో మనం మాట్లాడుకొనేది ఇదే భాష కదా! మాతృభాషలో మాట్లాడడం మహాపరాధంగా భావిస్తారు అక్కడి జనం'' అంది హారిక.

అపరాధమని కాదు. ప్రపంచాన్ని అర్థం చేసుకొనే వీలుండదని ఆంగ్లానికంత ప్రాముఖ్యతనిస్తున్నాను. ఇదివరకైతే విదేశం అంటే అది మనం చూడలేని కొత్త ప్రపంచముకొనే వారు. ఇప్పుడలా కాదు. పుట్టినప్పటినుండి పిల్లలకు వీసా ఎలా సంపాదించాలో నేర్పే ధ్యాసలో వున్నారు తల్లిదండ్రులు..'' అన్నాడు అజిత్.

''అలా అయితే మీరు పుట్టినప్పుడే విదేశాలకు ఎలా వెళ్ళాలో తెలుసుకున్నారన్నమాట'' నవ్వింది హారిక.

''లేదండి'' సిన్సియర్ విద్యార్థిలా అన్నాడు. ''మధ్యలో వచ్చిన ఆలోచన. నాన్న ఆ కాలంలోనే ఇక్కడ చదివారు. ఆయన డాక్టర్. నేనూ డాక్టర్ కావాలని ఆయన కోరిక.

అలా అని ఆయన ఇష్టాన్ని నా మీద బలవంతంగా రుద్దలేదు. నేను చదవాలనుకున్న ఇంజనీరింగ్ చదివాను. అక్కడ కంపెనీలో వుద్యోగం వచ్చింది. వాళ్ళు ఇక్కడికి వెళ్ళమనే అపాయింట్ ఆర్డర్ ఇచ్చారు, వచ్చాను''.

''ఎలాగైతేనేం విదేశంలో వుంటున్నారు'' అని ఇక ఎక్కువ మాట్లాడడం ఇష్టం లేనిదానిలా ముఖం పెట్టి ''నా ప్రాజెక్టు గురించి...'' అర్థోక్తిగా ఆగిపోయింది.

''వెరీ నైస్.. పనిమీద చాలా శ్రద్ధ వుంది మీకు'' మెప్పుకోలుగా అని ఫోన్ చేసి ఎవరినో పిలిచాడు.రెండు నిమిషాల తర్వాత తెలుపు ఎరుపు రంగు కలయికతో వున్న మేని ఛాయ కాస్త బొద్దుగా వుండి నల్లటి ప్యాంటు టీ షర్ట్ వేసుకున్న ఆంగ్లేయన్ యువతి అక్కడికి వచ్చింది.

-ఇంకావుంది

అధ్యాత్మ రామాయణం



- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

యుద్ధకాండ 205

సకల దేవతాగణాల దుఃఖనాశక కారణుడైన వాడు, నరాకారదేహుడు, నిరాకరాడు, వందనీయుడు, పరేశుడు, పరమానందరూపుడు, శ్రేష్ఠుడు, తాపత్రయహరుడు, ఈశుడు, భూభారనాశకుడైన రాముణ్ణి స్తుతిస్తాను.

శరణాగతులకు సర్వవిధ ఆనందదాయకుడు, సర్వలోక శరణ్యుడు, శరణాగతుల ఆర్తిని పూర్తిగా తొలగించగల నామధేయుడు, తపస్సు ద్వారా యోగం ద్వారా యోగీశ్వరులచే భావించబడేవాడు, సుగ్రీవాదులకు స్నేహితుడు అయిన రామస్వరూపునకు నమస్కారాలు.

సర్వదాభోగలాలసులైన వారికి అందనంత దూరంలో వుండేవాడు, నిరంతర యోగశాస్త్రాధ్యయనశీలురకు అత్యంత సమీంలో ప్రకాశించేవాడు, చిదానందకందుడు, వైదేహదేవి ఆనంద స్వరూపుడు, రాఘవేంద్రుడైన స్వామికి నమస్కారాలు; ఆ స్వామిని శరణని వేడుకొంటాను.

స్వామీ! నీవు నీ మహాయోగమాయ గణాలతోకలిసి నర రూప లీలతో ప్రకాశిస్తున్నావు. ఈశా! నీ ఆనందమయాలైన లీలాకథనంతో నిండిన చెవులున్నవారు ఇహలోకంలోనే సదానందరూపులవుతారు.

ప్రభూ! నేను సన్మానాలతో సోమపానాలతో మత్తప్రమత్తుడనై ఉన్నాను. అఖిలేశుడననే దురభిమానంతో ఎవరినీ లెక్కింపకుండే వాణ్ణి. ఇపుడు నీ పాద పద్మాల అనుగ్రహం వల్ల తిలోకాధిపత్య గర్వం నశించింది.

రాఘవేశా! ప్రకాశించే రత్నకేయూర హారాలు ధరించి అందంగా కనిపించే రామచంద్రా! భూభార కారకులైన రాక్షసులనే అడవికి కార్చిచ్చువంటి స్వరూపమా! శరత్కాల చంద్రుని వంటి మోముగల స్వామీ! సుందర పద్మ సదృశ నేత్రములున్న నెలతేడా! దుస్తర మాయకు అతీతమైన రామా? నిన్ను నేను నిత్యం భుజిస్తుంటాను.

ఇంద్ర నీలమణి మేఘం వంటి శ్యామవర్ణంతో ప్రకాశించే ప్రభూ! విరాధాది రాక్షసులను వధించి లోకాలకు శాంతి ప్రసాదించిన స్వామీ! కిరీటాది ఆభరణాలతో శోభించే దేవా! మహాదేవుని సర్వస్వమైన దేవేశా! రఘువంశధీశా! రామంద్రా! నేను నిన్నెప్పుడూ భజిస్తుంటాను.

కోటి చంద్రుల కాంతితో వెలిగే సింహాసనాధిష్ఠాతా! ప్రకాశించే బంగారువన్నెతో, మెరపులు ముద్దకట్టిన కాంతితో ఉన్న సీతాదేవి ఒడిలో ఉండగా ఆసీనులైయున్న స్వామీ! దుఃఖాన్నీ ఆలస్యాన్ని దరిచేరనీయని శ్రీరామచంద్రా! నీకివే నా నమస్కారాలు.

ఈ విధంగా ఇంద్రుడు స్తుతించి, నమస్కరించి నిలుచున్న తర్వాత ఆకాశ విమానంలో భవానీ సహితుడై ఉన్న శంకర భగవానుడు కమల పత్రాక్షుడైన రామునితో ఇలా అన్నాడు.

నేను అయోధ్యానగరానికి వస్తాను. రాజ్య పట్టాభిషిక్తుడవైన నిన్ను చూస్తాను. అయితే ఇప్పుడు ఈ దేహంలో ఉన్న మీ నాన్నగారు దశరథుణ్ణి దర్శించవయ్యా! రామయ్య!

శంకర భగవానుని ఈ మాటలు విని ఎదురుగా విమానంలో ఉన్న దశరథుణ్ణి రాముడు చూచాడు. భక్తి సంతోషాలతో తమ్మునితో పాటు శిరస్సు వంచి పాదాలకు ప్రణమిల్లాడు. దశరథుడు రాముణ్ణి ఆలింగనం చేసికొన్నాడు. మూర్ధాన్ని ఆఘ్రాణించి ఇలా అన్నాడు.

వత్సా! నేను నీ కారణంగానే సంసార రూపి దుఃఖ సాగరం నుండి తరింపబడ్డాను నాయనా!

అలా పలికిన దశరథుడు పుత్రుణ్ణి మరోసారి ఆలింగనం చేసికొన్నాడు. రాముడు తండ్రిని పూజించాడు. దశరథుడు శివపార్వతులననుసరించే వెళ్లిపోయాడు.

- ఇంకావుంది

శనివారం 20 డిసెంబర్, 2014

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ జయ, దక్షిణాయనం
హేమంత ఋతువు - మార్గశిరమాసం

తిథి: బహుళ త్రయోదశి ఉ.8.53
నక్షత్రం: అనూరాధ రా.9.23
వర్జ్యం: రా.2.56 నుండి 4.31 వరకు
దుర్ముహూర్తం: ఉ.06.00 నుండి 07.36 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)
ఎక్కువ ప్రయాణాలు చేస్తారు. ఆరోగ్యం చెడిపోతుంది. చిన్న విషయాల్లో మానసికాందోళన చెందుతారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది. సహనం అన్ని విధాలా శ్రేయస్కరం.

• వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)
మనోవిచారాన్ని పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధన నష్టం పట్ల జాగ్రత్త వహించాలి. ప్రయాణాలు ఎక్కువ చేస్తారు.

• మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)
కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. ఆకస్మిక ధనలాభంతో ఆనందాన్ని పొందుతారు. ఇతరులకు ఉపకారం చేసే కార్యాల్లో నిమగ్నులవుతారు. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి.

• కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)
కుటుంబపరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనం వహించుట మంచిది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. ప్రయాణాలవల్ల లాభం వస్తుంది.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)
మానసిక చంచలంతో ఇబ్బంది పడతారు. సోమరితనం ఆవహిస్తుంది. పిల్లలపట్ల మిక్కిలి జాగ్రత్త వహిస్తారు. కొన్ని మంచి అవకాశాలను కోల్పోతారు. ఆర్థిక పరిస్థితిలో మార్పులుండవు.

• కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)
అన్ని కార్యములందు విజయాన్ని సాధిస్తారు. అంతటా సౌఖ్యాన్ని పొందుతారు. శుభవార్తలు వింటారు. గౌరవ మర్యాదలు అధికమవుతాయి. అద్భుత శక్తి సామర్థ్యాలను పొందగలుగుతారు. కుటుంబంలో అభివృద్ధిఉంటుంది.

• తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. దూర బంధువులతో కలుస్తారు. తద్వారా లాభాలుంటాయి. విదేశయాన ప్రయత్నాలు సంపూర్ణంగా నెరవేర్చుకుంటారు. ఆకస్మిక ధన లాభయోగముంటుంది.

• వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)
వ్యాపారంలో విశేష లాభాన్ని ఆర్జిస్తారు. మంచి వారితో స్నేహం చేస్తారు. అంతటా సుఖమే లభిస్తుంది. ఆకస్మిక ధనలాభముంటుంది. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఒక ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తారు.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)
మానసికానందం లభిస్తుంది. కొన్ని పనులు పూర్తవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు. పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి.

• మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)
ఋణప్రయత్నం ఫలిస్తుంది. చెడు సహవాసం వైపు వెళ్లకుండా వుంటే గౌరవం దక్కుతుంది. క్షణికావేశం పనికిరాదు. కలతలేర్పడే అవకాశముంది. బంధు, మిత్రులతో జాగ్రత్తఅవసరం.

• కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)
వృత్తిలో ఇబ్బందుల అధిగమిస్తారు. మీరు చేసే వ్యతిరేక ఫలితాలు కలుగకుండా జాగ్రత్త అవసరం. దూర బంధువులతో కలుస్తారు. ధైర్యసాహసాలతో నూతన కార్యాలు ప్రారంభిస్తారు.

• మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)
విదేశయాన ప్రయత్నం సులభమవుతుంది. కుటుంబ కలహాలకు తావీయరాదు. ఆకస్మిక ధన నష్టమేర్పడే అవకాశముంది. పిల్లలతో జాగ్రత్త వహించుట మంచిది. వృత్తి, ఉద్యోగ రంగంలోని వారికి ఆటంకాలెదువుతాయి.

మంచిమాట

ధ్యానం - జీవనం

భగవంతుని సాక్షాత్కరింపచేసుకోవడానికి మార్గములు ఎన్నో ఉన్నా ధ్యానమునకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చుట జరుగుతుంది. వాస్తవానికి భగవంతుని పాద పద్మములయందు మనసు లగ్నం చేసినవారికి కంటిముందు అపురూప సంపద సైతం చితాభస్మంవలె గోచరిస్తుంది. ధ్యానం అనేది నిండుగా ఆచరించినపుడే దాని ఫలితము లభిస్తుంది. డాంబిక ధ్యానం ధ్యానం అనే సరస్సులో పైపైనే తేలియాడుతూ యుంటే భగవత్ ప్రాప్తి ఎప్పటికి సాధించేటట్లు. అలా అయితే ఒక జీవితకాలం చాలదు. భగవంతుడు నిరాకారుడే, కాని ఆ భగవంతుడే సాకారుడు గూడా. రామకృష్ణ పరమహంస వారు సెలవిచ్చినట్లుగా సాకార రూపంలో ధ్యానం ప్రారంభించి నిరాకార రూపం చేరుకోగలగాలి. 'ఆదౌ శ్రద్ధా' ఏ పని ప్రారంభించినా ముందు శ్రద్ధ ఉండాలి. ధ్యానం కూడా అంతే. భగవంతుని పట్ల అపార నమ్మకం విశ్వాసం, శ్రద్ధ యున్నపుడే ధ్యానం సాధ్యం. ధ్యానము చేయుటకు ప్రత్యేక ప్రాంతం, ఆసనం సమయం అవసరం లేదు.

ధ్యానమునకు ప్రాణాయామం సహకరిస్తుంది. దేనికైనా అభ్యాసం ద్వారా నాణ్యత సంప్రాప్తిస్తుంది. ధ్యాన చింతన కూడా అంతే. ఏదో ఒక అంశముపై చింతన ధ్యానం. ఏకాగ్ర చిత్తమునకు ధ్యానం సహకరిస్తుంది. ధ్యాన సమయమందు చిత్తమును కొంతమంది దైవ స్వరూపము యందు కేంద్రీకరిస్తే మరికొంతమంది మంత్రము నందు లగ్నం చేస్తారు. రెండూ ఉత్తమమయినవే. ధ్యాన సమయమునందు మనము ఆసంకల్పముగానే కనులు మూసుకోవడం జరుగుతుంది. మనము ధ్యానవ్యగ్రులగుటకు కనులు మూయగానే మనస్సునందు అణగారి ఉన్న తలపులు విజృంభిస్తాయి. మనకు ధ్యానభగ్నమై తెలియకనే కనులు తెరుస్తాం. మనసును ఆలోచన రహితం చేసి పునః ధ్యానము చేయుటకు చాలా సమయం పడుతుంది. ధ్యానంపై చిత్తం ఏకాగ్రం చేయగలిగినపుడు ఆటంకాలు ఉండవు. మనోబలం ధ్యాన సాధనలో కీలక పాత్ర పోషిస్తుంది. ధ్యానం ద్వారా సత్ చిత్ భావన ఏర్పడును.

ధ్యానసమయంలో అప్పుడప్పుడు మనసు స్థానభ్రంశమగును. కనుక ధ్యానమును చింతన పరాయణతో కొనసాగిస్తే శాంతి లభిస్తుంది. లభించిన శాంతిని ఆత్మానుభవం చేసుకోగలవాడు ధన్యుడు. ధ్యానం మరియు విచారం ఒకటే భావనగా పరిగణించేవారు ఎందరో. ధ్యానమగ్నుడయిన అభ్యాసి ఒక దశలో తనను తాను మరచి నేనే దేవుడను అని భావన ధ్యానం కొనసాగిస్తాడు. ఇటువంటివారికి దైవం మిగిలి ఆత్మభావన తానే అనుకుంటూ దైవం సర్వాంతర్యామి అని గ్రహించగలుగుతాడు. ఇక ధ్యానము విచార మార్గములో అభ్యసించేవారు 'నేను ఎవరు' అనే భావనతో మొదలు పెట్టి దైవ స్వరూపమును గుర్తించి ఆత్మజ్ఞానము పొందెదరు.

మనిషికి ఒక పర్యాయం ధ్యానం చేయడం అలవాటు అయితే మనము ఏ పని చేయుచున్నా అంతర్లీనంగా దాని పని అది చేసుకొని పోతూ ఉంటుంది. మరికొంతమంది ధ్యానంకు కేంద్రంగా హృదయం కాకుండా భ్రూమధ్యమును ఎంపిక చేసుకుంటారు. ధ్యానం గురించి తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి - ధ్యానం అనేది ఈనాటిది కాదు తరతరాల వారసత్వసంపద. ధ్యానం చేయువాడికి ఎప్పటికి ప్రాముఖ్యత లేదు. దాని వలన అంటే ధ్యానం చేయు వ్యక్తి వలన 'ధ్యానం'కు ఎటువంటి కీర్తి రాదు. ధ్యానమనేది చీకటి గదిలో కూర్చుని పెదాలు కదలిస్తే రాదు. ఏకాగ్రత నీ పరమైనపుడు ధ్యానం నీ దగ్గరకు తనంతట తానే వస్తుంది. నీవు ఎదురుచూడవలసిన పనిలేదు. ధ్యాన సమయంలో ధ్యానం చేసేవాడు అన్వేషకుడు, దృశ్యము, ద్రష్ట, వేరువేరుగా యుండవు. అన్నీ ఒక్కటవుతాయి. అదే పరిపక్వత.

రామకృష్ణ పరమహంస - ఏమన్నారంటే కామన రహిత స్థితిలో అంటే లౌకిక వాసనలు దూరమైతే మనసు స్థిరపడి వ్యక్తి సమాధిస్థితి పొందగలడు. కోర్కెలు అంతరించడము, మనసు భగవంతునిలో విలీనమవుగుట, జ్యోతి దర్శనం ఏకకాలంలో సంభవిస్తే ఆ వ్యక్తి సమాధి స్థితి పొందినట్లు.

-వేదగిరి రామకృష్ణ

సత్యభామ

47 బొమ్మలు: శ్రీరామ్

మాటాట

నిర్వహణ: సుధామ **587**



ఆధారాలు

ఆధారాలు: 85
అడ్డం
1. శ్రీకృష్ణుడే కాదురాయబారానికి ఇతడూ ప్రయత్నించాడు
4.తలపాగా
5. దేవవేశ్య
6. జనని
9. పొలము
10. చేరదు మధ్యలోనే పోయింది
12. అతికొంచెం
14. నెమ్మదిగా నడిచేది

నిలువు
1. యుద్ధం
2.ఉపాయం
3. కొమ్ము
4. అంగీకారం
7. లేత కాదు
8. వెలగపండు కోతి ముందుంది
11. తలదువ్వుకొనే సాధనం
13. శతము

మాటాట - 586 సమాధానం



అక్షర

11
ఆంధ్రభూమి
శనివారం
20, డిసెంబర్
2014

వేదవ్యాసకృత మహాభారతము
ద్వితీయ భాగము
తెలుగు వచన అనువాదము
ఎం.వి.నరసింహారెడ్డి
పేజీలు: 336, వెల: రూ.350
ప్రతులకు: సాహిత్య నికేతన్, 3-4-852, కేశవ నిలయం,
బర్కత్‌పురా, హైదరాబాదు-27.. ఫోన్: 040- 27563236
కౌసల్యా తెలుగు పండిత కళాశాల- జగిత్యాల
సెల్: 98941 10922

కందాల విందులూ.. చమత్కారాల చిందులూ

కావత్తు ప్రాస కుదిరిందని చెప్పడం కాదు; ఇది అక్కిరాజువారి చక్కనైన పొత్తం, కంద పద్యాల ముచ్చటైన మనోవిహార యాత్రాఫలాలు. యావత్తు పుస్తకం చదివితే అక్కిరాజు సుందర రామకృష్ణ నాటక, కావ్య పద్య పఠనం లోనే కాదు, పద్య రచనంలో కూడా రాణించదగిన వారనిపిస్తుంది.

దశావతారాల్లో నరసింహావతారం ఒక విలక్షణ అవతారం. సగం నరుడూ, సగం సింగమూ. నృహరీ మకుటంతో ఇప్పుడు శతక సింహాసనంపై అక్కిరాజు భాసిస్తున్నారు. ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణదేవరాయలు నరసింహస్వామిని 'దంభకేసరి' అన్నాడు. 'లక్షాధికారైన లవణమన్నమెకాని, మెరుగు బంగారంబు మింగబోడు'వంటి శాశ్వత సూక్తిరత్నాకరమైన నరసింహ శతకం వేమన శతకం వంటి శతకాల వెంబడిని ప్రజావాఙ్మయ విలీనమైంది. ఆమధ్య రామడుగు వెంకటేశ్వరశర్మ చెంచులక్ష్మి అనే ఒక మనోహర కావ్యంలో నృసింహస్వామి కథాభివర్ణనలు చేశారు. ఇలా నరసింహస్వామి ఇప్పటికీ సాహిత్యంలో అవతరిస్తూనే వున్నాడు.

వర్తమాన కాలంలోని ఈ పంచశతి ఆకట్టుకునే సామాజిక అయస్కాంతాల్ని స్వంతం చేసుకుంది.

'కొడుకులు సింహాసనముల/ కడునేర్పున కూర్చొనంగ కావించెడి ఆ/

చెడుగుల యత్నములక్కట/ అడుగడుగునా గాంచుచుంటి

మయ్యా నృహరీ' అంటూ కుటుంబ పాలనల్ని నిరసిస్తారు. **'పుడమిని మాత్రమె కాదుర/ కడు కంపునుగొట్టు మురికి కాల్వలగూడన్/ చెడుగులు కబ్జాచేసిరి/ సడిసప్పుడు చేయకుండ చతురతన్నహరీ'** అంటూ భూకబ్జాదారుల నిస్సిగ్గు పనుల్ని నిరసించారు.

భాషా సంపద పుష్కలంగా ఉంటే యతి, ప్రాస, గమక, గమనాల్లో వీర విహారం చేయగలం- ఎటొచ్చీ శోధనా నైపుణ్యం, సమయ సందర్భ పద క్రీడా రహస్యాలు తెలిస్తే అని కవి నిరూపించారు. దేవుళ్ళపై భలే చమత్కారాలు చేస్తారు. **డ్రెస్సులు గడిగడి మార్చుచు/ కస్సూబుస్సులను చూప ఘనునీకంటెన్/ డ్రెస్సే ఎరుగని శివుడే/ లెస్సగు దైవంబు తెలిసెలేరా- నృహరీ'** అటువంటిదే.

గణగుణాలూ, గుణగణాలూ రెండిటా నిండుదనాన్ని పొందిన త్రిశతి, యిది.

'తలకాయలు తమతమ జే/బులలోపల వేసికొనుచు పోలింగు కు, పో/వలసిన రోజులు వస్తే/ సెలవింక డెమోక్రసీకి సిరిసిరి మువ్వా' అంటూ ఆధునిక భావాలతో సిరిసిరిమువ్వ శతకంలో కందకందుక క్రీడాకారుడయ్యాడు. ప్రశంసని హృదయంలోంచి కంఠంలోకి తెచ్చుకుని మాటల్లోకి తెచ్చుకోలేనివారు తప్ప ఎవ్వరైనా ఈ త్రిశతిని మెచ్చుకు తీరతారు ఇందులోని తలపు మువ్వల సవ్వడులకి.

నృహరీ!
పంచశతి; కవి: డా.అక్కిరాజు సుందరరామకృష్ణ;
పుటలు: 224, వెల: తెలుపలేదు;
ప్రతులకు: డా.అక్కిరాజు సుందరరామకృష్ణ,
1-8-702/1/1, ఆంధ్రా బ్యాంకు సందు, నల్లకుంట,
హైదరాబాదు- 500 044

'పక్కింటివారి లోగిట/ చక్కగా తెగ పూచినట్టి చామంతి పువుల్;/ కుక్కలు కాపలయున్నను/ పక్క ప్లానేసి జయము వడసితి- నృహరీ అంటారు సహజ చమత్కారంగా.

'ఇపుడు పెద్దమగాడను/ చెప్పగ, బాల్యాన సిసలు చిల్లరగాడన్/ తప్పులు దండిగ చేసితి/ అప్పామన్నించు నీ ప్రియాత్మజు- నృహరీ' అనడంలో నీ ప్రియాత్మజుడను అనడంలో ఆత్మీయత, కొంటెతనం గడుసుదనం మేళవించాయి. ఈ నృహరి త్రిశతిలో 'వీరస్తుతులు!' లేవుగాని వైరభక్తివుంది. నరసన్నను కన్నతండిరిగా భావించిన చనవు మాటలుంటాయి.

'ఈ మధుమేహమదేమో/ భామలపై తరుగనట్టి వాంఛలవేమో! శ్రీ మహిళాధవ, భువి/ కడు/ ధీమహితుడు చెప్పలేడు- తెలియుర నృహరీ!' అంటూ 'మధు'మోహాన్ని' కూడా దాపరికం లేకుండా చెబుతారు.

'ఎంచగ గతమున నెంతో/ మంచిగ పలుకాడు నీవు, మార్చితె మోటొ చెంచుల 'కుర్రో'యనివి/న్పించెడి 'బేవర్సు' బాస బిత్తరినృహరీ!' అన్నారు. బేవర్సు బాస అని యధాలాపంగా అనేశారు, చమత్'కారం'గా.

ఉక్తిచమత్కారాలు శక్తిచమత్కారాలై విభిన్న భావ విహారాలై చమత్కారాల చిందుల్తో కందాల విందుల్ని చేసింది ఈ త్రిశతి.

చమత్కారమంటే 'లోకాతీతమగు వస్తువును చూడగా చిత్తమునకు కలుగు ఆనందహేతువైన వికాసం' అని అర్థం. ఈ త్రిశతి అటువంటి హృదయ వికాసాన్ని కలిగిస్తుంది. కవిగారు సుమారు అరవై పుటల్లో 'నామాట'అని వ్రాసింది పఠన యోగ్యమవడం విశేషం. అందులో అనుభవాలు అనుభవసారాలూ వున్నాయి.

''ఇది భక్తికావ్యం కాదు, ఇది అధిక్షేపకావ్యమే. భగవంతునికి తనను తాను అర్పించుకునే ఆర్తినివేదనం, కైవల్య ప్రాప్తికై ఆరాటంకాదు, చెడుపై చెడుగుళ్ళూ ఆడడం, మాటల తూటాలను పేల్చడం బాధ్యతగా కర్తవ్యంగా తలపోస్తూ భగవంతుని నిలదీయడం''అని ఆచార్య నిత్యానందరావు 'పద్య పరశువు' అనే తమ అభిప్రాయంలో అన్నది యదార్థ వాక్యాలు.

మంచి కవిత్వాలు వస్తున్నాయి. కని పూర్వంలా రసజ్ఞులు, కవితాభిమానులు కవిత్వ ప్రచారం పంపిణీలు చేయలేకపోతున్నారనిపిస్తుంది. చేస్తే ఈ పొత్తం ప్రయోజనదాయకం. ఈ పంచశతి కందాలవిందుల్ని చేస్తూ మనపై చమత్కారాల పన్నీటి చుక్కల్ని చిందిస్తుంది.

-సన్నిధానం నరసింహశర్మ

సులభ గ్రాహ్యంగా భారతం

> **శాంతి, అనుశాసనిక పర్వాలలో అనేకానేక ధర్మసంబంధ విషయాలు బహురీతులలో వివరింపబడినాయి. అశ్వమేధపర్వంలో ధర్మరాజు యజ్ఞంచేసి దానధర్మాలు చేయడం పేర్కొనబడినది. ఆశ్రమవాస పర్వంలో ధృతరాష్ట్రాదుల వనవాసానికి వెళ్లి దావానలంలో చిక్కుకొని దగ్ధం కావడం తెలుపబడింది. మౌసల పర్వంలో యదువంశీయులు నాశనం కావడం, శ్రీకృష్ణుడు కూడా అంతరించడం వివరించబడింది.**

మహాభారతమునకు 'పంచమ వేదము' అని ప్రసిద్ధివున్నది. దీనిలో వందలాది కథలు, ఉప కథలు, చిత్ర విచిత్ర సంఘటనలు ఉన్నాయి. ఇందులో వెల్లడించు ఉత్తమోత్తమ ఉపదేశాలను ఆచరణలోపెట్టిన ప్రజలకు అన్ని శుభములూ చేకూరగలవు అనేది అందరి ఆమోదాన్నీ పొందే విషయం.

ఈ మహాభారతమునందు మొత్తం 18 పర్వములు ఉండగా ఆదిపర్వము నుండి భీష్మపర్వము వరకు ఆరు పర్వములు ప్రథమభాగంగా ఇంతకుముందే ప్రచురించగా ఇప్పుడు మిగతా పన్నెండు పర్వములు ద్వితీయభాగంగా ఇప్పుడు ప్రచురించడం జరిగింది.

దీనిలో ద్రోణపర్వం, కర్ణపర్వం, శల్య పర్వం, సౌప్తిక పర్వం, స్త్రీ పర్వం శాంతి పర్వం, అనుశాసనిక పర్వం, అశ్వమేధ పర్వం, ఆశ్రమ వాస పర్వం, మౌసల పర్వం, మహాప్రస్థాన పర్వం, సర్గారోహణ పర్వం ఉన్నాయి.

వీటిలోని ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక పర్వాలలో యుద్ధాన్ని గురించిన విపులమైన వర్ణన ఉన్నది. స్త్రీపర్వంలో గాంధారిని వేదవ్యాసుడు ఊరడించుట, గాంధారి ద్రౌపదిని అనునయించుట, తర్వాత గాంధారి శ్రీకృష్ణుని ఆక్షేపిస్తూ శపించుట ఉన్నాయి.

ఆ తర్వాత శాంతి, అనుశాసనిక పర్వాలలో అనేకానేక ధర్మసంబంధ విషయాలు బహురీతులలో వివరింపబడినాయి. అశ్వమేధపర్వంలో ధర్మరాజు యజ్ఞంచేసి దానధర్మాలు చేయడం పేర్కొనబడినది. ఆశ్రమవాస పర్వంలో ధృతరాష్ట్రాదుల వనవాసానికి వెళ్లి దావానలంలో చిక్కుకొని దగ్ధం కావడం తెలుపబడింది. మౌసల పర్వంలో యదువంశీయులు నాశనం కావడం, శ్రీకృష్ణుడు కూడా అంతరించడం వివరించబడింది. మహాప్రస్థాన పర్వంలో ధర్మరాజు తప్ప మిగిలిన పాండవులందరూ మార్గమధ్యంలో పడిపోయి చనిపోవడం కానవస్తారు. తర్వాత స్వర్గారోహణ పర్వంలో ధర్మరాజు దివ్యలోకానికి చేరుకొని తనవారు అందరు అక్కడ ఉండగా గమనించి సంతృప్తిచెందడం చెప్పబడింది.

ఇలా 18 పర్వాలుగల సంస్కృత భారతాన్ని తెలుగు వచన రూపంలోకి అనువదించి తెలుగు ప్రజలకు అందించినందుకు ఆయన సర్వదా అభినందనీయులు. సులభగ్రాహ్యంగా భారతకథను వచనరూపంలో తెలుగు ప్రజలకు అందించడం ఎంతో శ్రమతోకూడిన పని అని చెప్పక తప్పదు. ఇది ఒక మహా తపస్సు. అట్టి తపస్వి ఎం.వి.నరసింహారెడ్డి ప్రపంచంలో ఉపాధ్యాయులకు అందరకూ ఆదర్శప్రాయుడు అనడంలో సందేహం లేదు.

-ఎస్.యజ్ఞనారాయణమూర్తి

మృదువైన శైలిలో మధురానుభూతి..



'నీవు మాకు ఆదర్శం'
కవితా సంపుటి,
-జస్టిస్ బి.చంద్రకుమార్
పుటలు: 92: వెల: రూ.60
ప్రతులకు: శ్రీమతి నర్మద,
ఇంటి నెం.8-7-55/బి/2,
శ్రీ షిరిడీసాయినగర్ కాలనీ,
హస్తినాపురం సెంట్రల్,
నాగార్జునసాగర్ రోడ్,
హైదరాబాద్- 500 079

భావ వ్యక్తీకరణలో శిల్పం పేరిట ఏవేవో రకరకాల విన్యాసాలు చూపి, అన్వయ క్లిష్టత అనే ఇబ్బందికి పాఠకుడిని గురిచేసి అనవసర శ్రమ కలిగించకుండా సూటిగా చెప్పిన కొన్ని అనుభూతుల, సందేశాల వచన కవితల సంపుటి ఇది. ఇందులో వివిధ శీర్షికలతో మొత్తం 42 కవితలున్నాయి.

జస్టిస్ చంద్రకుమార్ తన వృత్తిలోను, జీవితంలోను చూసిన కొన్ని కొన్ని ప్రత్యేక సంఘటనలను, తాను గమనిస్తున్న ప్రస్తుత సాంఘిక, రాజకీయ వికృత లక్షణాలను మనసులో పెట్టుకొని తన ప్రతిస్పందనలను హృదయపు లోతులనుంచి పాఠకునికి సూటిగా అందించే ప్రయత్నంలో సఫలత సాధించారు.

'చిన్నారి చిఱునవ్వు' శీర్షిక క్రింద కవితలో చిట్టిపాప నవ్వును **"అనంతకోటి చుక్కలు ఆకాశంలో పండుగ చేసుకుంటున్నట్లు"** అంటూ ఉపమించటం మంచి అనుభూతివాద కవిత్వం. అసలు చుక్కలనేవే అందాలకు నిలయాలు. అలాంటివన్నీ కలసి పండుగ సంబరాలలో ఉన్నాయి అనుకుంటే ఇక ఆ దృశ్యం ఎంత శోభాయమానంగా ఉంటుందో- ఆ ఊహ, ఆ క్రాంత దర్శనం మధురాతి మధురాలు.

'నీవు మాకు ఆదర్శం' అనే కవితలో చెట్టుయొక్క ఉదాత్తతను అక్షర చిత్రీకరణ చేశారు. **"నారు పోసినోడు లేడు/ నీరు పోసినోడు లేడు/ కంచె వేసినోడో లేడు/ కావలి కాచినోడు లేడు/ నీడ...గూడు... పండు... కలప/ ఎవ్వరినీ అడగకుండా - ఏది కావాలంటే అది ఇచ్చే/ అడవిలోని వృక్షమా- ఆదర్శం నీవు మాకు"**అంటూ గుర్తింపునకు నోచుకోని అజ్ఞాతపు అమ్మ అడవి చెట్టు ఆదర్శాన్ని గుర్తుచేశారు.

ఇంకా ఇందులోని 'విజయ సోపానాలు', 'ప్రశ్నిస్తే', 'మాది గాంధీ మార్గం', 'గెలుపునాదే', 'ఏమిటి నీ కర్తవ్యం', 'ఎన్నాళ్ళీ అక్రమాలు' మొదలైన కవితలలోని సందేశాత్మకత, భావనైర్మల్యం, వ్యంగ్య చమత్కారాలు, సున్నిత హాస్యం మొదలైన సొబగులు బాగున్నాయి.

-శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం

కొత్త పుస్తకం

న్యూమోల్
-ఎమిర్ సాదెర్
వెల: రూ.80/-
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్
ఎంహెచ్ భవన్, ప్లాట్ నెం.21/1
అజామాబాద్,
ఆర్‌టిసి కళ్యాణ మండపం దగ్గర
హైదరాబాద్-20.
040-2766 0013

శ్రీ వేంకటేశ సుప్రభాత మంజరి
-డా.కె.వి.రాఘవాచార్య
మూల్యం: 216
ప్రతులకు: రచయిత
106,శ్రీపాద కేశవ టవర్స్
11-35, యస్.వి.నగర్
తిరుపతి-517 502
92900 86012

భాషా, సాహిత్యాలకు సరైన పథ నిర్దేశం

> **సాహిత్యం వెర్రితలలు వేస్తున్న కాలంలో దాన్ని సన్మార్గంలో పయనింపచేసిన మహామనీషి, భారతీయమైన ఆధ్యాత్మిక తత్వాన్ని భూమికగా స్వీకరించాలని వ్యక్తిగా జీవించడం మాత్రమే కాదు సమాజంలో ఒక సంఘ జీవిగా ఇతరుల సమస్యలకు ప్రతినిధిగా ఉండాలి. కాని వాటినుండి దూరంగా పరిగెత్తకూడదని సంపత్కుమార స్పష్టంగా ప్రబోధించారని డా.ఆకునూరి విద్యాదేవి అభిప్రాయపడ్డారు.**

సాహిత్య విమర్శకు
'కోవెల' సంపత్కుమార సాహిత్య దర్శనం
వెల: రు.100.. పేజీలు: 104
ప్రతులకు: డా.టి.రంగస్వామి
శ్రీలేఖ సాహితి, ఇంటి.నెం.14-5/2,
మండల కార్యాలయం ఎదురుగా
శ్రీలేఖ కాలనీ, హసన్‌పర్తి,
వరంగల్లు-506371
తెలంగాణ రాష్ట్రం
ఫోన్: 0870-25647222

విమర్శకునిగా, వక్తగా, కవిగా ఆచార్యునిగా కోవెల సంపత్కుమారాచార్య వారు జగమెరిగినవారు. వారు కీర్తిశేషులై అపుడే నాలుగేళ్లు దాటుతుంది. కోవెల సంపత్కుమార పర్యవేక్షణలో డాక్టరేటు పట్టం గ్రహించిన ప్రియ శిష్యుడు శ్రీలేఖ సాహితీ సంస్థ నిర్వాహకుడు డా.టి.రంగస్వామి ఈ నివాళి గ్రంథాన్ని ప్రకటించారు. ఇది ఒక ఉత్తమ గురువునుంచి సంక్రమించిన ఉత్తమ సంస్కార లక్షణంగా భావిస్తూ శ్రీరంగస్వామిని అభినందించవచ్చు.

సంపత్కుమార ఛందఃపరిశోధన పారమ్యతను ఉగ్గడిస్తూ పల్లె శీను, ఆముదాల మురళి, ఆముక్త కావ్యాన్ని విశ్లేషిస్తూ ఎస్.రాజేంద్రప్రసాద్, శ్రీరంగస్వామి గార్లు రాసిన వ్యాసాలున్నాయి. చింతయంతి, శతకాలు, కాలస్పృహ, అపర్ణ లాంటి కావ్యాల గురించి పి.వీరస్వామి, ఆకునూరి విద్యావతి, భిక్షపతి మొదలైనవారు రాసిన వ్యాసాలు, పెన్నా శివరామకృష్ణ, టి.ఉదయవర్లు సంపత్కుమార గారితో గతంలో చేసిన ఇంటర్వ్యూలను ఈ సంకలనంలో పొందుపరిచారు.

విశ్వప్రేమ అనే వృత్తానికి ప్రేమ కేంద్రబిందువని వైవాహిక జీవితమంటే ఐహిక సౌఖ్య మొకటే కాదు, మేధాపరమైన సహవాసం. ఇరువురు కలిసి సేవామార్గంలో, నివృత్తి మార్గంలో పయనించవచ్చు (పుట 66) అంటూ సంపత్కుమార రాసిన అపర్ణ కావ్యాన్ని విశ్లేషిస్తూ పెన్నా శివరామకృష్ణ వ్యక్తీకరించిన అభిప్రాయాలు విశిష్టమైనవి, ఔచితీమంతమైనవి.

సాహిత్యం వెర్రితలలు వేస్తున్న కాలంలో దాన్ని సన్మార్గంలో పయనింపచేసిన మహామనీషి, భారతీయమైన ఆధ్యాత్మిక తత్వాన్ని భూమికగా స్వీకరించాలని వ్యక్తిగా జీవించడం మాత్రమే కాదు సమాజంలో ఒక సంఘ జీవిగా ఇతరుల సమస్యలకు ప్రతినిధిగా ఉండాలి. కాని వాటినుండి దూరంగా పరిగెత్తకూడదని సంపత్కుమార స్పష్టంగా ప్రబోధించారని (పుట 45) డా.ఆకునూరి విద్యాదేవి అభిప్రాయపడ్డారు.

పల్లేరు వీరస్వామి సంపత్కుమార రచించిన చింతయంతి కావ్యంలోని ఆర్తభక్తి, లోకరీతులు, సంస్తుతి, భాగవతాంశాలు మాతృత్వం, వ్యాజస్తుతి, కృష్ణానురక్తి, గోదావచస్సుధలను సోదాహరణంగా వివరించిన తీరు పాఠకులకు సంతృప్తి కలిగిస్తుంది. తెలంగాణ ప్రజల వ్యావహారిక భాషలోనే పాఠ్య గ్రంథాలుండడంవల్ల కలిగే లాభనష్టాలేమిటని పెన్నా శివరామకృష్ణ అడిగిన ప్రశ్నకు కోవెల సంపత్కుమార ఇచ్చిన జవాబు చూడండి.

రాజకీయంగా ఆర్థికంగా రాష్ట్ర విభజన ఉద్దేశాలు ఏమైనా కావచ్చు. కాని భాషాపరంగా మొత్తం తెలుగువారిలో ఒక ఏకీభావం ఉండడం అవసరం. నిజానికి మాండలికాలనేవి భాషాపరంగా యాసలు. భిన్నమైన వ్యావహారిక పద సముదాయం ఉండవచ్చు. అందువల్ల ఒక ప్రాంతపు భాష పాఠ్యగ్రంథ భాషగా ఉండడంవల్ల ఈ ఏకీభావం ఆ ప్రాంతంలోనే దెబ్బతినడానికి అవకాశం ఉంది. తెలంగాణలోనే వేరు వేరు జిల్లాల్లో వేరు వేరైన పలుకుబడి, యాసలు ఉన్నాయి. అందువల్ల వీటిలో భాషా సమత్వం కోసం ఒక సాధారణత్వాన్ని సాధించడం అవసరం. బోధన ఎట్లాగు ఎవరు చెప్పినా, చెప్పకపోయినా ఆయా యాసలోనే సాగుతుంది. మాండలిక పదాలు భాషలో చేరడం భాషా సమృద్ధికి దోహదం చేస్తుంది. కాని ఆ యాసలే పాఠ్యభాషలో కూడ రావాలనడం అంత ఆరోగ్యకరమైన విషయం కాదేమో! ఇదే పరిస్థితి మిగతా ప్రాంతాలకు కూడా వర్తిస్తుంది. పాఠ్యభాష, బోధన భాష రెండూ కలిసి విద్యార్థి భాషా శక్తిని పెంపొందిస్తాయి. భాషా, సాహిత్యాల విషయంలో ఎవరికైనా విశాల దృక్పథం అవసరం. భాషా, సాహిత్యాలు యాక్షన్- రియాక్షన్ల విషయాలు కావు (పుట 95)

ఇప్పుడు ఉద్యమావేశంలో ఉన్నాం. క్రమేపీ ఒక నాలుగయిదేళ్ల తర్వాత ప్రశాంతత ఏర్పడుతుంది. అప్పుడు ఈ భావనకే అందరూ చేరక తప్పదు. కోవెల సంపత్కుమార గారి యౌవనంలోని ఫోటో అందమైంది ముఖ చిత్రంగా అలంకరించినందుకు మంచి పుస్తకాన్ని అందించినందుకు శ్రీరంగస్వామి అభినందనీయులు

-వెలుదండ నిత్యానందరావు

సామాజిక ఇతివృత్తాలతో సాగే 'కథన కుతూహలం'

ఆధునిక తెలుగు కథాసాహిత్యంలో సుపరిచిత కథకులు సింహప్రసాద్‌గారు. పతనమవుతున్న మానవత్వ విలువలపై ఆవేదనతో రాస్తున్న అతికొద్దిమంది రచయితల్లో ఆయన ఒకరు. వర్తమాన జీవనంలోని సున్నిత అంశాలపై హృద్యంగా రాస్తున్న కథలు, నవలలు ఆకట్టుకుంటున్నాయి. గత నాలుగు సంవత్సరాల్లో వివిధ దిన, వార, మాస పత్రికలు నిర్వహించిన కథల పోటీల్లో పురస్కారం పొందిన ఇరవై కథలతో 'వటపత్రశాయి'గా ఏడవ కథాసంపుటిని వెలువరించారు. పోటీకి వచ్చిన కొన్ని వందల కథలనుండి ఎన్నుకున్న కథ అంటే సహజంగానే ఆసక్తి కల్గుతుంది. మన చుట్టువున్న రకరకాల వైవిధ్య జీవితాల్ని పరిచయం చేస్తాయి.

మానవ సృష్టి నిరంతరంగా సాగుతూనే సమాజముంటుంది. గత కొన్ని దశాబ్దాలుగా పిండదశలోనే పిల్లలను తొలగించుకుంటున్న దుస్థితిని మనం చూస్తున్నాం. మాతృత్వం చాలా గొప్ప సంప్రదాయమని చాటిచెప్పిన కథ 'వటపత్రశాయి'. పిల్లలను కనడానికి అనువైన యవ్వన కాలాన్ని కాదనుకొని డబ్బు సంపాదనకై పరుగుపెడ్తున్న దంపతులకు చెంపదెబ్బలాంటి కథ ఇది. కుటుంబ జీవనంలో స్త్రీని ఒక సంపాదన వనరుగాకాక జగన్మాతగా చూడాలని, ప్రతి బిడ్డా వటపత్రశాయేనని చెప్పిన కథ ఆలోచింపజేస్తుంది. ఇతర పనులను వాయిదావేసుకున్న ఫర్వలేదుకాని తల్లికావడాన్ని వదులుకోవద్దని నేటి తరానికి హితవుచెప్పిన కథ ఇది. మనం సుఖంగా ఉంటేనే సరిపోదు మన చుట్టు ఉండేవాళ్ళుకూడా బాగుండాలి. అనాథ పిల్లలకోసం నడుపుతున్న ఆశ్రమానికి సహాయం చేయడంకోసం అన్నపూర్ణమ్మ రోజు వండుకునే బియ్యంలో పిడికెడు తీసి పక్కనపెట్టి, నెల రోజుల తర్వాత ఆ బియ్యాన్ని నిర్వాహకులకు ఇచ్చి, వాళ్ళకు కొంత సహాయపడ గలిగినందుకు తృప్తిచెందుతుంది. తమ పిల్లలు తమకు పెట్టకపోయినా పింఛన్ డబ్బులతో కాలం వెళ్లదీస్తున్న వృద్ధులు వాళ్ళు. తాము రోజు తినే తిండిని తగ్గించుకుని సహాయం చేస్తారు. మానవీయతకు అద్దంపట్టిన కథ 'గుప్పెడు.'



వటపత్రశాయి,
రచయిత: సింహప్రసాద్,
పేజీలు: 240, వెల: రూ.175/-
చిరునామా: శ్రీశ్రీ ప్రచురణలు,
401, మయూరి ఎస్టేట్స్,
ఎమ్.ఐ.జి-2 650,
హైదరాబాద్- 500 085.
సెల్: 9849061668

'వంశవృక్షం' కథలో నీ ఎదుగుదల మూలాలను తెలుసుకోవాలని సూచిస్తారు. ఉద్యోగ జీవితంలో అవినీతి అక్రమ సంపాదనలో కూరుకుపోయి, తమకు నీడనిచ్చిన కుటుంబాన్నే మరిచిన ఉదంతం బాధను కల్గిస్తుంది. పేద పురోహితుడి అశక్తికి కారణం తనదగ్గర డబ్బు లేకపోవడం. తన పూర్వీకులు సహాయంకోరిన వాళ్ళను ఆదుకొని ఆస్తులను కోల్పోతారు. ఆ రెవెన్యూ అధికారి కుటుంబం కూడా వాళ్ళు అందించిన సహకారంతోనే నిలిచింది. ఆ కుటుంబం కష్టాల్లోఉంటే సహాయం చేయాల్సిందిపోయి డబ్బులకోసం సతాయించడం చూస్తాం. నేటి మానవ నైజానికి నిదర్శనమీ కథ. సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న మహిళలపై జరుగుతున్న అత్యాచార యత్నాలను ధైర్యంగా తిప్పికొట్టి, తగిన బుద్ధిచెప్పిన కథ 'ఓ సీతకథ.' ఒక లంబాడీ మహిళ బతుకుకై ఆర్ట్స్ విద్యార్థులకోసం తన అందమైన యవ్వనాకృతుల్ని అర్పించిన దీనగాథ 'మోడల్'కథ. ఆమె దేహాన్ని చిత్రించి ఎంతోమంది గొప్ప చిత్రకారులైనారు. ఆమె ఆకలి మాత్రం తీరలేదు. చివరికి ఆమె శవంగా మారినా మోడల్‌గా ఉండి దహన ఖర్చులను సంపాదించుకున్న తీరు ద్రవింపజేస్తుంది.

కార్పొరేట్ విద్య అందించే డబ్బుకు దాసోహమన్న గణిత మేధావి సూరిబాబు గుర్తింపుకై పడిన తండ్లాటలో చదువుచెప్పిన గురువునే తక్కువచేసి ఆలోచించుకుంటాడు. పూర్వ విద్యార్థులు అందరు కలిసి ఆ గురువుకు సన్మానం చేయాలను కుంటారు. గురువు మాత్రం నాకన్న విశేషమైన కృషిచేసిన నా శిష్యుణ్ణి సన్మానం చేస్తానని సూరిబాబుకు సన్మానం చేస్తాడు. దాంతో అతనిలోని అహంకారం పటాపంచలవుతుంది. గురువు ఔన్నత్యాన్ని చాటిచెప్పనే నేటి విద్యారంగంలోని అవలక్షణాలను కూడా చర్చించిన కథ 'పరబ్రహ్మం.'

రైతులకు గిట్టుబాటు ధర లేక పంటలు వేయమని సమ్మెచేస్తున్న పట్టించుకోని ప్రభుత్వాల తీరును ఎండగట్టిన కథ 'రోమ్-నీరో-ఫిడేలు'. ఆడపిల్లల జనాభా తగ్గడంతో పెళ్ళికోసం పరీక్షలురాసే రోజులు రానున్నాయని హాస్యంగా చెప్పిన కథ 'రేపింతే'. ప్రపంచీకరణ ప్రభావంతో ప్రతీది వినోదభరితంగా ఉండాలనే మీడియా ప్రభావంవల్ల మానవత్వం మసకబారుతున్న వైనాన్ని కుండబద్దలుకొట్టినట్లు చెప్పారు 'విష పరిష్వంగం' కథలో. ఒక నిరుద్యోగి ఉరిని ఈవెంట్‌గా మార్చుకున్న వ్యాపార కోణాన్ని చూపి నివ్వెరపోయేట్లు చేశారు. మార్పు సహజం. రెండు దశాబ్దాల క్రితందాక కూడా కంప్యూటర్ల ప్రభావం లేదు. టైపు మిషన్‌లతో ఉపాధి చూసుకున్నవారు ఉన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శరవేగంగా వచ్చిన ప్రగతితో ఆ కుటుంబాలవారు ఉపాధికి దూరమయ్యారు. ఐనా నమ్ముకున్న వృత్తే కాపాడుతుందని నమ్మిన వృద్ధుని కథే 'పాతనీరు'. పాతది పనికిరాదనే దృక్పథాన్ని నిరసించే కథ ఇది. ఒకప్పటి పాత నీరు కొత్తదే అని తెలిపిన కథ. దేని ఉపయోగం దానికి ఉంటుందని తెలుస్తుంది. నేటి అవినీతి ఉద్యోగులకు బుద్ధిచెప్పటానికి ఒక తెలివైన పౌరుడు లంచంగా దొంగనోట్లును ఇస్తాడు. దాంతో ఆ ఉద్యోగి పడిన అవస్థల కథే 'గాంధీతాత నవ్వేడు'. నగరంలో పెరిగిన సెల్‌టవర్ల మూలన అంతరిస్తున్న పక్షుల గూర్చిన కథ 'వాయసం.' పిండాలు తినే కాకులు కనబడవు. మారిన అలవాట్లు కాకులకు తిండి లేకుండా చేశాయని ఆవేదన చెందుతారు. చివరికి పిండాలు తినడానికి కాకులు రావు కాని కుక్కలు ఎగబడుతున్నాయని వాస్తవ స్థితిని చిత్రీకరించారు. సర్‌గోసి మదర్ గూర్చిన కథ 'తల్లీ నిన్నుదలంచి..' పేదరికంలో మగ్గుతున్న ఒక కుటుంబం గర్భాశయాన్ని అద్దెకివ్వడం ద్వారా వచ్చే ఆదాయంతో బతకాలనుకుంటే, బిడ్డను కన్న తర్వాత వీసా సమస్యతో బిడ్డను వదిలించుకుంటే 'విత్తనం నాదికాకపోయిన భూమినాదే' కాబట్టి నేనే పెంచుకుంటానని ఆ తల్లి ధైర్యంగా బిడ్డను స్వీకరిస్తుంది.

మనిషికి నిజమైన ఆనందం సంపాదనలో లేదని పదుగురికి సహాయం చేయడంలోనే ఉందని చెప్పే కథ 'మనిషి దేవో భవ'. అత్తాకోడళ్ల పోట్లాటలు కొత్తకాదు కాని టీవిల దగ్గర నుండి నేటి ఫేస్‌బుక్ వాడకం దాకా వాళ్ళ రుసరుసలు, తిట్టుకోవడాలు హాస్యంగా వివరిస్తూనే కొడుకుగా, భర్తగా పాత్రలను పోషిస్తూ ఆ పురుషుని బాధలను వర్ణించారు 'ఒక యుద్ధం ఒక సంధి ఒక శాంతి' కథలో. భార్యభర్తల మధ్య ఉండే చిన్నచిన్న సంఘటనలకు విపరీతంగా ఆలోచించి చిన్నాభిన్నం అవుతున్న ఇతివృత్తాలు అనేకంగా ఉన్నాయి. అందుకే తొందరపడి కఠిన నిర్ణయాలను తీసుకోవద్దని చెప్పేకథ 'మనసా! తొందరపడకే.' విలాసానికి బానిసైన ఒక బ్యాంకు ఉద్యోగి పతనావస్థకు దర్పణం 'జారుడుమెట్లు'కథ. 'రెయిన్‌రెయిన్ గో అవే' రైమ్స్ నేర్పే కాన్వెంటు చదువులను నిరసిస్తూనే వాన అవసరాన్ని చాటిచెప్పిన కథ 'వాన వాన వల్లప్ప'. కుటుంబం ఆనందాల హరివిల్లు అంటారు. ఒక ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ఉమ్మడి కుటుంబంగూర్చి పెద్ద ఉపన్యాసం ఇస్తే, ఒక చానల్ రిపోర్టర్ ఆయన అబద్ధాలను బట్టబయలుచేసి, తల్లిని మరిచిన నీది ఒక ఉమ్మడి కుటుంబమా? అని నిలదీస్తుంది 'ఆత్మపదార్థం' కథలో. ఇంకా కుల వివక్ష కొనసాగుతుందని, కష్టాల్లో ఉన్నవాళ్ళకు వాటి పట్టింపు ఉండదని, ఉత్తరాఖండ్ వరదల్లో యాత్రికులను సైనికులు కాపాడిన సాహస విధానాన్ని చక్కటి కథనంతో వివరించిన కథ 'గబ్బిలం'. మొత్తం మీద విభిన్న సామాజిక అంశాలపై రాసిన సింహప్రసాద్ కథలు ఒక్కసారైన చదవాల్సిందే. కొలకలూరి ఇనాక్, పోరంకి దక్షిణామూర్తి, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ముందుమాటలు ఈ సంపుటికి అదనపు ఆకర్షణ.

-గోపగాని రవీందర్

> **రైతులకు గిట్టుబాటు ధర లేక పంటలు వేయమని సమ్మెచేస్తున్న పట్టించుకోని ప్రభుత్వాల తీరును ఎండగట్టిన కథ 'రోమ్-నీరో-ఫిడేలు'. ఆడపిల్లల జనాభా తగ్గడంతో పెళ్ళికోసం పరీక్షలురాసే రోజులు రానున్నాయని హాస్యంగా చెప్పిన కథ 'రేపింతే'.**

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

ఆదివారం 21, డిసెంబర్ 2014

కొబ్బరి చేగోడీలు

కావాల్సినవి:
బియ్యం పిండి - 3 కప్పులు
నీళ్లు- 3 కప్పులు
పచ్చికొబ్బరి - 1 కప్పు
పెసరపప్పు - 2 టీ.స్పూ.
కారం పొడి - 3 టీ.స్పూ.
ఇంగువ - చిటికెడు
ఉప్పు - తగినంత
నూనె -వేయించడానికి

వండే విధానం:
పెసరపప్పు నీళ్లు పోసి గంటసేపు నానబెట్టాలి. పచ్చికొబ్బరి తురుములో కొద్దిగా నీరు కలిపి మెత్తగా రుబ్బుకోవాలి. ఒక గిన్నెలో 3 కప్పుల నీళ్లు మరిగించి చెంచాడు నూనె, నానబెట్టిన పెసరపప్పు, ఇంగువ, కారం పొడి, ఉప్పు, కొబ్బరిముద్ద, బియ్యం పిండి వేసి బాగా కలిపి దింపేసి మూత పెట్టి ఉంచాలి. చల్లారిన తర్వాత పిండిని బాగా పిసికి నూనె చేత్తో చిన్న చిన్న ఉండలు చేసుకుని పొడవుగా వత్తుకుని అంచులు కలిపి వత్తాలి. ఇలా అన్ని చేగోడీలను వేసి బంగారు రంగు వచ్చేలా వేయించుకుని చల్లారిన తర్వాత నిలవ చేసుకోవాలి.

మిక్స్ ఫ్రూట్ కస్టర్డ్

కావాల్సినవి:
పాలు - 1 లీటర్
కస్టర్డ్ పౌడర్ - 5 టీ.స్పూ.
పంచదార - 200 గ్రా.
అరటిపళ్లు - 3
ఆపిల్ - 1
దానిమ్మ - 1
సపోటా - 2
ద్రాక్ష - 20
జీడిపప్పు, బాదం పప్పు - 10
వెనిలా ఎసెన్స్ - 4, 6 చుక్కలు

వండే పద్ధతి:
ఒక గిన్నెలో పాలు బాగా మరిగించి పంచదార వేయాలి. కస్టర్డ్ పౌడర్‌లో కొద్దిగా నీళ్లు పోసి ఉండలు లేకుండా కలుపుకుని మరుగుతున్న పాలల్లో వేసి ఉండలు కట్టకుండా కలుపుతూనే వుండాలి. చిక్కబడ్డ తర్వాత వెనిలాఎసెన్స్ వేసి కలిపి దింపేయాలి. పూర్తిగా చల్లారిన తర్వాత ఫ్రిజ్‌లో పెట్టి పళ్లన్నీ చిన్న చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. ఆపిల్, అరటిపళ్లు ముందు కోసిపెడితే నల్లబడకుండా కాస్త నిమ్మరసం కలపి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. సర్వ్ చేసే ముందు కస్టర్డ్, పళ్ల ముక్కలు కలిపి సన్నగా తరిగిన జీడిపప్పు, బాదం పప్పుతో అలకరించాలి. ఇష్టముంటే ఇందులో పాలతోపాటు కప్పుడు ఓట్స్ కూడా ఉడికించుకోవచ్చు. రుచిగానే గాక ఆరోగ్యానికి చాలా మంచిది.

మిర్చి మసాలా కూర

కావాల్సినవి:
మిరపకాలు - 250 గ్రా.
చింతపండు పులుసు - 1/4 కప్పు
పసుపు - 1/4 టీ.స్పూ.
కారం పొడి - 1 టీ.స్పూ.
ఉప్పు - తగినంత
కొబ్బరిపొడి - 3 టీ.స్పూ.
జీలకర్ర పొడి - 1/2 టీ.స్పూ.
మెంతిపొడి - 1/4 టీ.స్పూ.
పల్లీల పొడి - 2 టీ.స్పూ.
నువ్వుల పొడి - 2 టీ.స్పూ.
వేయించిన ఉల్లిపాయలు - 2 టీ.స్పూ.
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీ.స్పూ.
జీలకర్ర - 1/4 టీ.స్పూ.
గరం మసాలా పొడి - 1 టీ.స్పూ.
మెంతులు - చిటికెడు
నూనె - 4 టీ.స్పూ.

చేసేద్దాం ఇలా:
ఈ కూర కోసం బజ్జీ మిరపకాయలను వాడాలి. మిరపకాయలను మధ్యలో చాకుతో గాటుపెట్టి గింజలు తీసేయాలి. ఇలా చేస్తే కారం తగ్గుతుంది. పాన్‌లో నూనె వేడి చేసి మిరపకాయలను కొద్దిగా మెత్తబడేవరకు వేయించి పక్కన పెట్టుకోవాలి. ఒక గిన్నెలో చింతపండు పులుసు, వేయించిన ఉల్లిపాయలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం పొడి, కొబ్బరిపొడి, పసుపు, ఉప్పు, పల్లీల పొడి, నువ్వుల పొడి, జీలకర్ర, మెంతిపొడి వేసి బాగా కలిపి ఉంచాలి. మిరపకాయలు వేయించిన పాన్‌లోనే నూనె వేడి చేసి జీలకర్ర, మెంతులు వేసి ఎర్రబడ్డాక పొడులన్నీ కలిపిన చింతపండు పులుసు, కప్పుడు నీళ్లు పోసి నిదానంగా మరిగించాలి. పులుసు, పొడులు ఉడికి కమ్మటివాసన వస్తున్నపుడు వేయించిన మిరపకాయలు, గరం మసాలా పొడి వేసి మరో ఐదు నిమిషాలు మసాలాలో ఉడకనిచ్చి నూనె తేలగానే దింపేయాలి. ఈ కూర బిరియానీ, వెజ్‌ఫ్రైడ్ రైస్, పులావ్, రొట్టెలకు బావుంటుంది.

చికెన్ కుర్మా

కావాల్సినవి:
చికెన్ - 2 కేజీలు
ఉల్లిపాయలు - 2
పచ్చిమిర్చి - 3
అల్లం వెల్లుల్లి ముద్ద - 2 టీస్పూ.
పసుపు - 1/4 టీ.స్పూ.
కారం పొడి - 2 టీ.స్పూ.
ధనియాల పొడి - 2 టీ.స్పూ.
కొబ్బరిపొడి - 2 టీ.స్పూ.
గసగసాలు - 2 టీ.స్పూ.
జీడిపప్పు - 10
గరం మసాలాపొడి - 1/2 టీ.స్పూ.
టమాటాలు - 2
కొత్తిమీర - కొద్దిగా
ఉప్పు - తగినంత
నూనె - 4 టీ.స్పూ.

చేద్దాం ఇలా:
చికెన్ ముక్కలు శుభ్రంగా కడిగి జల్లెట్లో వేసుకోవాలి. పాన్ వేడి చేసి గసాలు వేయించి కొబ్బరి, జీడిపప్పుతో కలిపి మెత్తగా పొడి చేసుకోవాలి. అదే పాన్‌లో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి వేసి దోరగా వేయించి పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద వేసి కొద్దిగా వేగిన తర్వాత కారం పొడి, ధనియాల పొడి వేసి కలిపి చికెన్ ముక్కలు, తగినంత ఉప్పు వేసి కలిపి మూత పెట్టాలి. ముక్కలు కాస్త వేగిన తర్వాత రెండు టమాటాలు సన్నగా తరిగి లేదా నూరి వేయాలి. ఇందులో కొబ్బరి, గసాలా పొడి వేసి కలిపి రెండు నిమిషాలు వేగిన తర్వాత తగినన్ని నీళ్లు పోసి కలిపి మూత పెట్టి ఉడికించాలి. ముక్కలు, మసాలాలో కలిసి పూర్తిగా ఉడికి నూనె తేలుతున్నపుడు గరం మసాలాపొడి, కొత్తిమీర వేసి దింపేయాలి. ఈ కూర చపాతీ, పులావ్‌లకు బావుంటుంది.

అరటికాయ వేపుడు

కావాల్సినవి:
అరటికాయలు -3
ఉల్లిపాయలు - 2
పచ్చిమిర్చి - 6
అల్లం - చిన్నముక్క
కొత్తిమీర - 3 టీ.స్పూ.
కరివేపాకు - 2 రెబ్బలు
పసుపు - 1/4 టీ.స్పూ.
ఆవాలు, జీలకర్ర - 1/4 టీ.స్పూ.
శనగపప్పు - 2 టీ.స్పూ.
ఉప్పు - తగినంత
నూనె - 3 టీ.స్పూ.

ఇలా చేద్దాం:
అరటికాయలు చెక్కు తీసి చిన్న ముక్కలుగా తరిగి కాస్త మజ్జిగ, ఉప్పు వేసిన నీళ్ళలో ఉంచాలి. పాన్‌లో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి మెత్తబడేవరకు వేయించాలి. ఇందులో సన్నగా తిరిగిన పచ్చిమిర్చి, అల్లం ముక్కలు, కరివేపాకు వేసి కొద్దిగా వేగిన తర్వాత పసుపు, అరటికాయ ముక్కలు, తగినంత ఉప్పువేసి కలిపి మూత పెట్టాలి. ముక్కలు కాస్త మగ్గిన తర్వాత మూత తీసి వేయించాలి. ముక్కలు బాగా వేగిన తర్వాత సన్నగా తరిగిన కొత్తిమీర చల్లి దింపేయాలి.

- జ్యోతి వలబోజు

కౌమారం.. బాలికలకు అత్యంత కీలకం

తెలుసుకొనవె యువతీ!

- డాక్టర్ కేతరాజు సరోజినీ దేవి
ఫోన్ : 040- 271 70 468 (క్లినిక్)

కౌమారం అనేది బాల్యానికి, యవ్వనానికి మధ్య దశ. అప్పుడు బాలికల శరీరంలోను, మనసులోను, వ్యక్తిత్వంలోను చాలా మార్పులు జరుగుతాయి. లార్వా నుంచి సీతాకోక చిలుక ఎలా ఆవిర్భవిస్తుందో ఆ విధంగా బాలిక ఓ సంపూర్ణ యువతిగా పరిణతి చెందుతుంది. ఈ దశనే అందరూ 'టీనేజ్' అని వ్యవహరిస్తారు. సాధారణంగా పదేళ్ల వయసులో మొదలై 19 ఏళ్ల వరకూ ఈ ప్యూబర్టీ పీరియడ్ విస్తరిస్తుంది. ఇందులో

మాధవీలత, హెచ్ఎంటి నగర్, హైదరాబాద్

ప్ర: నేను గత ఏడాది స్కూటరుపై నుంచి పడిపోయాను. అప్పుడు డాక్టరు సలహాతో టి.టి ఇంజెక్షన్ తీసుకున్నాను. ఇప్పుడు 5వ నెల గర్భవతిని. మళ్లీ టి.టి ఇంజెక్షన్ ఎందుకు? పైగా మూడుసార్లు ఇస్తారుట. అవసరమా..?

జ: *గర్భిణిగా వున్నపుడు టి.టి. ఇంజెక్షన్లు తప్పనిసరి. టెటనస్ మీకే కాక, శిశువుకు కూడా సోకకుండా వుంటుంది. తప్పక వేయించుకోవాలి.*

మెనార్కీ అంటే రుతుక్రమం మొదలు కావడం, టీలార్కీ అంటే రోమాలు వివిధ ప్రదేశాలలో పెరగడం, ఎడ్రినార్కీ అంటే ఎడ్రినల్ గ్రంధి పెరుగుదల, దాని నుంచి హార్మోనుల విడుదల మొదలైనవిగా పేర్కొంటారు వైద్య పరిభాషలో.

శరీరంలో ఎండోక్రయిన్ గ్లాండ్స్ ఎన్ని వున్నా అన్నిటిమీద ఆధిపత్యం వహించేది- మెదడులోని పిట్యూటరీ గ్రంధి. దాన్ని అందుకనే బాండ్ మాస్టర్ ఆఫ్ ఎండోక్రయిన్స్ అని పిలుస్తారు. ఈ గ్రంధి నుంచి కొన్ని ఉత్తేజిత ద్రవాలు, ట్రోఫిక్ హార్మోనులు విడుదలై అన్ని ఎండోక్రయిన్ గ్రంధుల్నీ జాగృతం చేస్తాయి. థైరాయిడు, ఎడ్రినల్ ఓవరీ- ఇలా అన్ని గ్రంధులు ఉత్తేజం పొంది తమ తమ హార్మోన్లు విడుదల చేస్తాయి. పిట్యూటరీ గ్రంధి సరిగా పనిచేయకపోతే బాలిక పెరుగుదల లేక కురచగాను, మందకొడిగాను వుంటుంది. సెక్సువల్ డెవలప్‌మెంటు వుండదు. రజస్వల కాకుండా వయసు దాటిపోతుంది. అందుకని 10-14 సంవత్సరాల వయసుకి రజస్వల కాకపోయినా, శారీరకంగా సెక్సువల్ డెవలప్‌మెంట్ లేకపోయినా వైద్య పరీక్షలు అవసరం. పిట్యూటరీ గ్రంధి బాగున్నా థైరాయిడు లోపం ఉండవచ్చు. అపుడు బాలిక పొడుగు పెరిగినా మందకొడిగాను, దళసరి చర్మంతోను, జ్ఞాపకశక్తి లోపంతోను వుండి చదువులో వెనుకబడటం, నీరసం, నిస్సత్తువతో బాధపడటం చూస్తుంటాము. అటువంటప్పుడు T3, T4, TSH, థైరాయిడు యాంటీబాడీస్ అనే రక్తపరీక్షల ద్వారా రోగ నిర్ణయం చేస్తారు. చికిత్స చాలా సులువుగా నోటి బిళ్లల ద్వారా చేస్తారు. ఎడ్రినల్ గ్రంధి సరిగా పనిచేయకపోతే రోమాలు అవాంఛిత ప్రదేశాలలో పెరగడం, జననేంద్రియాల అవకతవకలు కలుగుతాయి. రుతుక్రమం మొదలుకాకపోవచ్చు, మొదలైనా క్రమపద్ధతిలో వుండకపోవచ్చు. పురుష హార్మోనుల నిష్పత్తి ఎక్కువగా వుంటుంది. ముఖంపైనా, శరీరంపైనా మొటిమలు విపరీతంగా వుంటాయి. ఇక ఓవరీలు జాగృతం కానపుడు రుతుక్రమం కాకపోవడం, సెక్సువల్ డెవలప్‌మెంటు లోపించడం జరుగుతుంది. ఒక్కొక్కసారి అన్నీ సరిగా వున్నా జన్యులోపాలవల్ల గర్భాశయం చిన్నదిగాను, శక్తిహీనంగాను (Rudimentary) వుండవచ్చు. లేక కన్నెపొర దళసరిగా వుంటే రుతుస్రావం బయటికి రాకపోవచ్చు. కనుక సరియైన వయసులో రొమ్ముల పెరుగుదల, రుతుక్రమం లేకపోతే తప్పనిసరిగా గైనకాలజిస్టుని సంప్రదించాలి. ఈ ఆధునిక యుగంలో ఏ శారీరకలోపమైనా త్వరగా కనిపెట్టే పద్ధతులున్నాయి. వాటిని సకాలంలో ఉపయోగించుకుని, సమస్యల నుంచి బయట పడాలి. ★

ముత్యాల ముగ్గు



23 చుక్కలు - 1 సరిచుక్క

ఆయి కమలమ్మ,
వనస్థలిపురం, హైదరాబాద్

మీ సృజనకు పదునుపెట్టి కొత్తకోణాల్లో ఆకర్షించే అందమైన ముగ్గులు పంపండి. చుక్కల వివరాలు రాయడం మరువకండి. చుక్కలు, గీతలు.. ఏ ముగ్గులైనా చూసేందుకు స్పష్టంగా ఉండాలి. చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500003.

ముగ్గులు వేసిన కాగితాలను కలర్ స్కానింగ్ చేయించి pdf ఫార్మాట్‌లో bhoomika@andhrabhoomi.net కు మెయిల్‌లో కూడా పంపొచ్చు.

భవిష్య కాలం

- 'దివ్యజ్ఞాన విభూషణ' ఉమాపతి. బి.శర్మ

రావుల లలితమ్మ- సూళ్ళూరుపేట (నెల్లూరు)

ప్ర: మీరు చెప్పిన ప్రకారం వ్యాపారం ప్రారంభించాం. అందరికీ చాలా బాగుంది. నా జన్మనక్షత్రం స్వాతి. నామ నక్షత్రం అశ్విని. దేన్నీ దేనికి పాటించాలో అర్థం కావటం లేదు. దయచేసి చెప్పండి.

సమా: జన్మ సంస్కారాలకూ, వివాహాదులకూ జన్మనక్షత్రం ప్రధానం. వ్యవహార (లౌకిక) కార్యక్రమాలకూ, వాస్తు విషయాదులకూ నామ నక్షత్రాన్ని పాటించాలి.

శ్యాం సుందర్- విశాఖపట్టణం

ప్ర: మధ్యవయస్కుణ్ణి- అవివాహితుణ్ణి- నిరుద్యోగిని- నా జీవితం ఏమిటి..?

సమా: మైనస్ పాయింట్లను ప్లస్ పాయింట్లుగా, బలహీనమైన పరిస్థితినే బలం గల పరిస్థితిగా మార్చుకోవటమే మీరు చేయగలిగేది. అనవసర తాపత్రయాలకు పోకుండా ఆధ్యాత్మిక లేదా సాంఘిక సేవా కార్యక్రమాల వైపు వెళ్లండి.

ఎ.వైకుంఠవాసులు - మర్రిపాలెం - వైజాగ్

ప్ర: ఏ విషయమూ కలసి రావటం లేదు. ఉద్యోగంలో అభివృద్ధి లేదు. ఎలా..?

సమా: అధైర్యపడకండి. అన్ని కాలాలూ ఒకేలా ఉండవు. 'తట్టుము తెరువబడును అన్వేషించుము.. దొరకును' అన్నాడు క్రీస్తు ప్రభువు. సహనం వహించండి. మంచి రోజులు రాగలవు. మీ ఇంటి దేవతను కొలవండి.

బి.హేమలక్ష్మి- బొబ్బిలి

ప్ర: వ్యాపారాభివృద్ధి - ఆర్థికాభివృద్ధి- ఎప్పుడు..?

సమా: 2015 జూన్ నుండి మీ వ్యాపారం అభివృద్ధి కాగలదు. స్థిరాస్తి మూలకంగా కొంత డబ్బు కూడా చేతికి రాగలదు.

ఎం.లలిత - తెనాలి (గుంటూరు)

ప్ర: మా చెల్లెలి వివాహం ఎప్పుడు?

సమా: మీ చెల్లెలి వివాహం గురించి మీ చెల్లెలే తన పేరు, సంఖ్య చెప్పాలి. మీరు కాదు.

పి.శ్రీవాణి - నేరేడ్‌మెట్ - హైదరాబాద్

ప్ర: ఉద్యోగం - విదేశీయానం..?

సమా: రెండూ ఆలస్యంగా జరిగే అవకాశం ఉంది.

ఎల్ల రమేశ్, సాతారం (కరీంనగర్)

ప్ర: అనేక రకమైన ఆటంకాలు- ఉద్యోగం- ఆర్థిక- శారీరక బాధలు- ఏం చేయాలి..?

సమా: మీ జాతకాన్ని పరిశీలిస్తే మానసిక స్థిరత్వ లోపం కనిపిస్తున్నది. వివిధ రకాలుగా కాకుండా ఒకే ఒక లక్ష్యంతో పనిచేయండి. మనోబలం, శారీరిక బలం కోసం ప్రతిరోజూ హనుమాన్ చాలీసా పారాయణం చేయండి. మంచి జరుగుతుంది.

పి.విజయలక్ష్మి- న్యూ కరాసా (వైజాగ్)

ప్ర: నాకు వివాహం ఎప్పుడు కుదురుతుంది?

సమా: 2015 ఫిబ్రవరి. మార్చిల్లో తప్పకుండా జరుగుతుంది.

ఎం.సూర్యనారాయణమూర్తి - కాకినాడ

ప్ర: ఆరోగ్య సమస్యలు, కుటుంబ సభ్యులతో సమస్యలు.. పరిహారమేమిటి..?

సమా: 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్'. ఆరోగ్యం కోసం ప్రతిరోజూ సూర్యోదయాత్పూర్వం సూర్య నమస్కారాలు ఏ కొంచెమైనా చేయండి. శివునికి భస్మోదకంతో అభిషేకం చేయండి. కుటుంబ సమస్యల కోసం ప్రతి సోమవారం ఉలవలు దానం చేయండి. శివనామస్మరణతో ఉలవచారు తాగండి. అన్నీ కుదుటపడతాయి.

ఎం.షణ్ముఖస్వామి, హుజూరాబాద్ (కరీంనగర్)

ప్ర: ఆరోగ్యం గురించి...

సమా: మీ అనారోగ్యం కొంచెం ప్రత్యేకంగా కనిపిస్తోంది. ప్రత్యేక నిపుణులను సంప్రదించండి. అశ్రద్ధ చేయవద్దు.

ఒట్టు వీర వెంకటలక్ష్మి- గుంటూరు

ప్ర: నా ఇద్దరు కుమారులు నా వద్దకు ఎప్పుడు వస్తారు?

సమా: వస్తారు. నగదు - నగలు- శుభకార్య సంబంధమైన విషయాలలో మాట పట్టింపులు కనపడుతున్నాయి. అవి పరిష్కారమైతే అంతా కుదుటపడుతుంది. ఆలస్యమైనా నిరాశ పడవలసిన పనిలేదు.

మైనేపల్లి సుబ్రహ్మణ్యం - ఆకునూరు (కృష్ణా)

ప్ర: జ్యోతిష వాస్తు శాస్త్రాలు పాటించి విసిగిపోతున్నాము. జ్యోతిష, వాస్తు శాస్త్రజ్ఞులకు ఏదైనా 'సింబల్' ఉండాలంటే ఏది ఉండాలి.

సమా: శాస్త్రాన్ని సమన్వయం చేసేటపుడు శాస్త్రజ్ఞానంతోపాటు ఇంగిత లోకజ్ఞానం కూడా ఉండాలి. లంఖణం అనే మాటను లంఘనంగా అర్థం చేసుకొని గోడ దూకి కాలు విరగ్గొట్టుకున్నాడట ఒక పండితుడు! శాస్త్ర జ్ఞానంతో పాటు లోకజ్ఞానం కూడా ఉండాలి.

బి.ఆర్.మూర్తి కీర పండలీపురం (కృష్ణా)

ప్ర: నాకు ఆర్థిక బాధలు లేవు. అయినా అశాంతితో బాధపడుతున్నాను. కారణం చెప్పండి.

సమా: 'కారణం వినా కార్యం నభవతి'. కారణం లేకుండా ఏదీ జరగదు. సూక్ష్మబుద్ధిలో (సబ్ కాన్సస్)లో ప్రవేశించిన అంశాలు మనకు గుర్తుండవు. కొంత అనారోగ్యం- జననేంద్రియ సంబంధం కానీ- హృదయ సంబంధమైన దౌర్బల్యం కానీ ఉండే అవకాశం. ఏదో దేవతా సంబంధమైన విషయంలో అపరాధభావం కూడా మీ మనస్సును దొలుస్తోంది. (ఆత్మీయుల విషయంలో కూడా కావచ్చు) భక్తితో భగవద్గీతా పారాయణం కానీ, శ్రీమద్రామయణం కానీ పారాయణం చేయండి. మనశ్శాంతి లభిస్తుంది.

ఎం.విజయలక్ష్మి- తులసీనగర్ -విజయవాడ

ప్ర: మా కుటుంబసభ్యులందరూ కలిసి ఉండే రోజులు వస్తాయా? నాకు మనశ్శాంతి కలుగుతుందా?

సమా: కొన్ని ప్రభుత్వ వ్యవహారాలు- వివాహ ధన సంబంధ విషయాలు- భిన్న స్వభావాల కారణంగా కలసినా మీకు మనశ్శాంతి కలిగే విధంగా ఉండదు. ఎక్కువ కాలం కలిసి ఉంటారనే నమ్మకమూ లేదు. అవసరాల కోసం కలుస్తారేమో కానీ, అనుబంధాల కోసం కాదు. 'యోనేన కలహం నాస్తి' అనే మాట గుర్తుపెట్టుకుంటే మీకు శాంతి కలుగుతుంది. ★

ప్రశ్నలు పంపాల్సిన చిరునామా

ఉమాపతి. బి.శర్మ
ఇంటి నెం. 16-2-834-బి/1/, ఎన్‌బిహెచ్-బి కాలనీ దగ్గర,
కోదండ రామాలయం రోడ్డు,
శ్రద్ధాబాద్ (సైదాబాద్), హైదరాబాద్- 500 059.
umapathisharma@ymail.com

పేరు :
చిరునామా :
.....
.....
.....

తోచిన సంఖ్య (1 నుంచి 108 లోపు) :
ఆ సంఖ్యను అనుకున్న సమయం, తేదీ:
.....
ప్రశ్న :
.....
.....
.....
.....

కూపన్ల ద్వారా మాత్రమే ప్రశ్నలు పంపాలి. పోస్ట్‌కార్డులపై, కవర్ల ద్వారా పంపిన ప్రశ్నలు పరిశీలించబడవు.

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
ఆదివారం
21,డిసెంబర్
2014

నేర్చుకుందాం

క. ధారుణిలోన వదాన్యుల
కీ రాని పదార్థ మొక్కటేనిం గలదే
కోరినఁ దన మేయెముకలు
ధీరుండై యిచ్చె నని దధీచి ని వినమే

భావం: దాతలకు దానం చేయరాని వస్తువంటూ లేదు.దేవతలు వచ్చి తన శరీరంలో ఎముకలను కోరిన వెంటనే ఇచ్చిన దధీచి గూర్చి మనం వినలేదా. జరాసంధునికి దాన గొప్పతనం గురించి చెబుతున్న కృష్ణార్జునులు దధీచి గురించి దధీచి చేసిన దానం గురించి చెబుతున్నారు. వృతాసురుని చంపడానికై వజ్రాయుధ నిర్మాణం చేయాలనుకొన్నారు దేవతలు. వజ్రాయుధ నిర్మాణానికి బతికి వాని వెన్నుముక కావాలి. దానికై దధీచి దగ్గరకువెళ్లగా ఆయన ఎంతో సంతోషంతో వారికి తన వెన్నుముకను దానం చేశాడు. అటువంటి వారు ఉన్నఈ భూమిలో నీవు ఏ వస్తువునైనా దానం చేయడానికి ఆలోచించనక్కర్లేదు అని చెబుతున్నారు.

పోతన భాగవతము - దశమ స్కంధము

స్పందన

37

కె. ప్రమీలాజనార్దన్

''మిస్ రియానా... మీ ప్రాజెక్టు ఆమే చూస్తుంది'' అంటూ హారికకు ఆమెను పరిచయం చేశాడు.

''మిస్ హారిక... ఇండియా నుండి వచ్చింది'' అంటూ ఆమెకు హారికను పరిచయం చేశాడు.

''హాయ్...'' అంటూ హారికకు షేక్‌హ్యాండ్ ఇచ్చి హృదయానికి హత్తుకుంది రియానా.

హారిక నవ్వుతూనే తన హర్షాన్ని వెలిబుచ్చింది. అంతటితో ఆమె గురించి పట్టించుకోకుండా వుంటే తనకే బాధ వుండేది కాదు. అజిత్ ట్రైయాంగిల్ స్ట్రీట్‌లో సైనికుల గుర్తుగా నిలిచిన ఉక్కు సైనికుడి విగ్రహం ఉక్కు సింహాలను ఎప్పుడూ చూడనివాడిలా చూస్తూ కూర్చున్నాడు.

వచ్చిన కొత్తలో చూసినపుడు చాలా బాగున్నాయనిపించింది. ఫ్రెండ్స్‌తో టవర్ బ్రిడ్జి చూశాడు. బాగానే వుందనిపించింది తప్ప దాని గురించి ఏ ఆలోచనా రాలేదు. ప్యారిస్ వెళ్ళాడు. అదీ అంత గొప్పగా అనిపించలేదు. ఏదో చూడొచ్చునని మాత్రం అనుకున్నాడు.

కాని హారికతో వెళ్లినపుడు తను చూసిన ఆ ప్రదేశాలన్నీ అందంగా కనిపించాయి. అవి ఆ దేశాల సౌభాగ్యాలనిపించాయి. మనసులో ఆనందం చూస్తున్న ప్రదేశాలను అందంగా కనిపించేలా చేస్తుందేమో! హారిక తనకంత దగ్గరవ్వడం తనకే ఆశ్చర్యంగా వుంది. ఆమె ఆఫీసుకు వచ్చిన తొలి రోజు మొదట ఎంత అమాయకంగా కనిపించింది...

తర్వాత ఆమె మాటలు ప్రవర్తనతో తెలివైనది, ధైరస్థురాలని అర్థమయింది. ఆమె ఆఫీసులో చేరిన మొదటి రోజే ఆఫీసులో పని ఎక్కువగా వుండడంతో రాత్రి చాలా ప్రొద్దుపోయింది. ఆమె క్యాబ్‌కోసం చూస్తుంటే తను చెప్పాడు తన కారులో ఆమెను ఇంటి దగ్గర డ్రాప్ చేస్తానని...

''థాంక్యూ. నేను క్యాబ్‌లో వెళతాను, మీరు వెళ్ళండి'' అంది కాస్త కరుకు స్వరంతో. ఆమెకు ఇంటి దగ్గరవాళ్ళు ఇక్కడ చాలా జాగ్రత్తగా మసలుకోవాలని గట్టిగా చెప్పినట్లున్నారు. అందుకే ఆమె దృఢంగా చెబుతుందనుకున్నాడు తను.

''మీరు క్యాబ్‌లో వెళ్ళలేరనికాదు. ఇంత రాత్రివేళ ఒక్కరు వెళ్ళడం మంచిది కాదు. నేనూ ప్యారింగ్‌టన్ ఏరియాలోనే వుంటున్నాను. నన్ను అనుమానించకండి. మీరు నేను ఒక దేశం వాళ్ళమనే కాదు.. ఒంటరిగా ఇంత రాత్రివేళ ఆడవాళ్ళు అలా క్యాబ్‌లలో వెళ్ళడం ఏదైనా ఉపద్రవానికి దారితీస్తుందేమోనన్న భయంతో చెబుతున్నాను.

ప్లీజ్, నన్ను అర్థం చేసుకోండి...'' అంటూ ఆమెకు మరోమాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా కారు తెచ్చి ఆమె ముందు నిలిపాడు. తప్పదన్నట్లు ఆమె ఎక్కి కూర్చుంది. కారులో వున్నంతసేపు ఆమె ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఇల్లు అంత దూరంలో వుండగానే ప్రాణం లేచి వచ్చినట్లు చూసి ''అదే నేనుండే ఇల్లు'' అని చూపించింది.

''ఒక్కరే వుంటున్నారా?'' అని అడగబోయి ఆమె తనను అనుమానిస్తుందేమోనన్న భయతో ఆగిపోయాడు.

''థ్యాంక్యూ వెరీమచ్. మీరు చెప్పినట్లు నేను క్యాబ్‌లో వచ్చి వుంటే భయం వేసేది'' అంటూ అక్కడ వరసగా వున్న కార్ల వైపు చూసి దేశంలో మనుషులు కరువైనట్లుంది. కార్లు మాత్రం అమ్మకానికి పెట్టినట్లు వరుసగా కనిపిస్తాయి. వీటిని చూస్తూ ఇక్కడ వుండడం ఎలాగో...'' అంది దిగులుగా

అలవాటవుతుంది లెండి. ఎవరూ ఎవర్నీ పట్టించుకోరని ఇక్కడికి వచ్చిన కొత్తలో సంతోషపడతారు. తర్వాత మనసు విప్పి మాట్లాడుకొనేందుకు మనవాళ్ళనే వాళ్ళు లేరని మానసికంగా ఒంటరితనం అనుభవిస్తూ రోజూ యుగంగా గడుస్తుందంటారు. అయినా మీకా సమస్య ఉండదు. ఆఫీసుకు వస్తారు, పని వుంటుంది... మనుషులు కనిపిస్తూ మాట్లాడుతుంటారు కాబట్టి అంత బాధ వుండదు'' అంటూ నవ్వి 'బై' అంటూ కారు స్టార్టు చేశాడు అజిత్.

***

అక్కడికి ఫర్లాంగు దూరంలోనే వుంది అజిత్ వుండే ఫ్లాట్. అతడితో పాటు వేరే కంపెనీల్లో పనిచేసే ఇద్దరు యువకులు వున్నారు. ఒకరు చైనా నుండి వచ్చిన వ్యక్తి.. మరొకరు పాకిస్తానీ. తను వచ్చిన కొత్తలో ఆఫీసు గెస్ట్ హౌస్‌లో వుంటూ ఇల్లు వెతుకుతూ ఎవరికో చెబుతున్నప్పుడు వీళ్ళు అక్కడ వున్నారు. మేము వుంటున్నది మూడు బెడ్‌రూమ్స్ వున్న ఫ్లాట్. మీకభ్యంతరం లేకపోతే మాతో వుండొచ్చు'' అన్నారు. సరేనన్నాడు అజిత్.

ఒక్కరే వుంటే బోర్ అనిపిస్తుంది. ఇంటికి రాగానే కబుర్లు చెప్పుకుంటూ వంటా వార్పూ చేసుకొని భోజనాలు చెయ్యడం.. చైనా యువకుడు చైనీస్ వంటకాలంటూ అప్పుడప్పుడూ స్పెషల్స్ చేస్తుంటాడు. నాకలవాటు లేదు. నేను తినలేను'' అంటూ ఆ రోజు వుత్త పప్పు, అమ్మ పంపించిన ఆవకాయతో అన్నం తింటాడు అజిత్. ''ఒక ముద్ద పెట్టు...'' అంటూ వాళ్ళిద్దరు ముద్దలు వేయించుకొని తిని ఎంత బాగుందో.. అంటూ ఎంజాయ్ చేస్తూ తింటుంటారప్పుడప్పుడు.

''మన దేశాలు వేరు కాని మనమంతా మనుషులమే. ఒకరికొకరుగా వుండడంలో ఎంత ఆనందంగా వుంది. ఈ రాజకీయ నాయకుల కుతంత్రాలే జనాలను కష్టపెడుతున్నాయి, విడదీస్తున్నాయి'' పాకిస్తానీ యువకుడు వాపోయాడు.

-ఇంకావుంది

అధ్యాత్మ రామాయణం

- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

యుద్ధకాండ 206

అంతవరకు అక్కడే అంజలీబద్ధుడై ఉన్న దేవేంద్రుణ్ణి రాముడు చూశాడు. అతనితో ఇలా అన్నాడు.

సహస్రాక్షా! నా కొరకు వానరులు యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో ఎందరో మరణించారు. నేలకొరిగిన ఆ వానరులందరిపై అమృతాన్ని కురిపించు. నా ఆజ్ఞగా వెంటనే వారిని బ్రతికించు.

దేవేంద్రుడు, అవశ్యం అలాగే జరుగుగాక అన్నాడు. వెంటనే అమృతవర్షం కురిపించాడు. చనిపోయిన వానరులనందరిని బ్రతికించాడు. ఇంతకుపూర్వం జరిగిన యుద్ధంలో ఎవరెవరు మరణించారో వారందరూ నిద్రనుండి లేచిన వారిలాగా, పూర్వమున్న సంపూర్ణ బలంతో అత్యంత సంతోషంతో రాముని సన్నిధికి చేరారు. కాని అమృత స్పర్శకు రాక్షసులెవ్వరూ బ్రతుకలేదు (రాముడు వానరులనే అన్నాడు; రాముని బాణాలు తాకి మరణించిన రాక్షసులు ముక్తులయ్యారు; ముక్తి పొందినవారికి మళ్లీ జన్మలేదు) ఈ సమయంలోనే సాష్టాంగ నమస్కారం చేసి విభీషణుడు రామునితో ఇలా అన్నాడు.

దేవా! నామీది ప్రేమతో దయతలచవలసినది. సీతా సమన్వితుడవై మంగళస్నానం చేయవలసి వున్నది. రేపు మనమందరం బయలుదేరవలలసి ఉన్నది.

విభీషణుని మాటలు విని రఘువరుడు రాముడు ఈ విధంగా పలికాడు.

అక్కడ భరతుడు నిరీక్షిస్తుంటాడు. సుకుమారుడు, అత్యంత భక్తుడైన భరతుడు జటా వల్కాల ధారియై ఉన్నాడు. నిరంతరం ప్రణవ పరబ్రహ్మనే (నన్నే) ధ్యానిస్తున్నాడు. ఎదురుచూస్తున్న అతనిని దర్శించాలి. అతడు లేకుండా స్నానాలంకారాలు ఎలా కుదురుతాయి? అందువల్ల నీవు వెంటనే సుగ్రీవాది వానరవీరులను గౌరవించు. వారు పూజలందుకొంటే అవి నాకు చెందినట్లే! సంశయించవలసిన అవసరం లేదు అన్నాడు రాముడు.

అప్పుడు విభీషణుడు ఆయా వానరుల కోరిక మేరకు, బంగారాన్ని, రత్నాలను, వస్త్రాలను వారి వారి అభిరుచులననుసరించి పుష్కలంగా ఇచ్చి సత్కరించాడు. ఆ విధంగా సేనాపతులూ తదితరులు రత్నాది వస్తువులతో పూజింపబడడం రాముడు చూచి హరీశ్వరులను (వానరాధిపతులను) అభినందించి యథావిధిగా వారికి వీడ్కోలు పలికాడు.

అప్పుడు విభీషణుడు పుష్పక విమానం తీసికొని వచ్చాడు. రాముడు, యశస్విని అయిన వైదేహి సిగ్గుదొంతరలలో ఉండగా ఆమెను అంకాన చేర్చికొని ఉత్తమైన పుష్పక విమానాన్ని అధిరోహించాడు.

పరాక్రమశాలి, ధనుర్ధారులలో శ్రేష్ఠుడూ, సోదరుడైన లక్ష్మణుడు రాముని ప్రక్కనే ఉన్నాడు. విమానంలో ఉన్న రాముడు, వానర రాజు సుగ్రీవునితో, అంగదునితో, విభీషణునితో ఇలా చెప్పాడు.

వానరులందరితో, మీరు మిత్రకార్యం పూర్తిచేశారు. ఇక మీరు మీ మీ స్థలాలకు యథేచ్ఛగా వెళ్ళవచ్చును.

సుగ్రీవా! సర్వసైన్యంతో నీవు వెంటనే కిష్కింధకు వెళ్లు. విభీషణా! నీ రాజ్యాన్ని, ఈ లంకానగరాన్ని పాలించు; భక్తియుతడవై నివసించు. ఇంద్ర సహితులైన దేవతలెవరూ కూడా నిన్నిక బాధించే అవకాశమే లేదు. నా తండ్రి రాజాధాని అయోధ్య. నేనా నగరానికి వెళ్లవలసి యున్నది.

రాముడా విధంగా ఆదేశించగానే, బలశాలురైన వానరులందరు, విభీషణునితోపాటు అంజలీబద్ధహస్తులై ఇలా నివేదించుకొన్నారు.

రఘోత్తమా! మేమందరం నీతో అయోధ్య రావాలని కోరుకుంటున్నాం! నిన్ను రాజ్యాభిషిక్తునిగా చూడాలని అభిలాష!

- ఇంకావుంది

ఆదివారం 21 డిసెంబర్, 2014

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ జయ, దక్షిణాయనం
హేమంత ఋతువు - మార్గశిరమాసం

తిథి: బహుళ చతుర్దశి ఉ.8.20
నక్షత్రం: జ్యేష్ఠ రా.9.10
వర్జ్యం: లేదు
దుర్ముహూర్తం: సా.04.24 నుండి 05.12 వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
  మిత్రులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. కలహాలకు అవకాశముంటుంది. ధననష్టాన్ని అధిగమించుటకు ఋణప్రయత్నం చేస్తారు. కుటుంబ విషయాల్లో మార్పులు వుంటాయి.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
  బంధు, మిత్రులతో సరదాగా కాలక్షేపం చేస్తారు. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. అన్ని విధాలా సుఖాన్ని అనుభవిస్తారు.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
  కోపాన్ని అదుపులో నుంచుకొనుట మంచిది. మానసికాందోళనను తొలగించుటకు దైవధ్యానం అవసరం. శారీరక అనారోగ్యంతో బాధపడతారు. కుటుంబ విషయాలు సంతృప్తికరంగా నుండవు.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)**
  ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు ఆభరణాలు ఖరీదు చేస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. అన్ని రంగాల్లో అద్భుత విజయాలను సాధిస్తారు. నూతన కార్యాలను ప్రారంభిస్తారు.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
  ఋణప్రయత్నాలు తొందరగా ఫలిస్తాయి. స్థాన చలన సూచనలుంటాయి. శుభకార్యాల మూలకంగా ధనవ్యయం అధికమవుతుంది. ప్రయాణాలెక్కువ చేస్తారు.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
  అనారోగ్య బాధలను అధిగమిస్తారు. నూతన కార్యాలకు ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. వృత్తి, వ్యాపార రంగాల్లో ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించాలి.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
  మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అధికారులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. అనవసర భయం ఆవహిస్తుంది.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
  నూతన వస్తు, వస్త్ర, వాహన, ఆభరణ లాభాలను పొందుతారు. ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
  లాభదాయకంగా వుంటుంది. తొందరపాటువల్ల ప్రయత్న కార్యాలు చెడిపోతాయి. చెడును కోరే వారికి దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక భయము, ఆందోళన ఆవహిస్తాయి.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
  దిగ్విజయాన్ని పొందుతారు. ధనలాభముంటుంది. సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
  తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. మీ ఆలోచనలు ప్రణాళికాబద్ధంగా ఉంటాయి.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
  వృత్తిరీత్యా ఇబ్బందులను అధిగమిస్తారు. మానసికాందోళనతో కాలం గడుపుతారు. స్త్రీలు చేసే వ్యవహారాల్లో సమస్యలెదురవుతాయి. ఆకస్మిక ధననష్టం ఏర్పడే అవకాశముంటుంది.

మంచిమాట

భగవంతుడు

అన్ని జన్మలకెల్లా మానవ జన్మ మహోన్నతమైనది. అన్ని జీవులకన్నా ఆలోచించే మనసు కల జీవి మనిషి. మంచి చెడుల విచక్షణా జ్ఞానంతో జీవించగలగడమే మన మానవ జన్మ లక్షణం. 'ఓంకారం'తో మొదలైన ఈ సృష్టి భగవంతుడు ప్రసాదించిన గొప్ప వరం. ఆదిమానవుని మనుగడ అన్వేషణతో మొదలై.. ఈ కలియుగంవరకు అంతులేని అభివృద్ధిని సాధించాడు. ఇంకా నిరంతరం ఏదో తెల్సుకోవాలన్న తపనతో అన్వేషణ కొనసాగిస్తూనే వున్నాడు. కాని ఇవన్నీ మనకు ప్రసాదించిన గొప్ప దాత ఆ ప్రధాత. ఆ 'అదృశ్యశక్తి' లేనిదే మనం లేమన్నది జగమెరిగిన అక్షరసత్యం.

కొంతమంది దేవుడు లేడు అంటారు. అంతా సైన్స్ అంటారు. చివరకు తాము తయారుచేసిన యంత్రాలకు బొట్టుపెట్టి కొబ్బరికాయ కొడతారు. పక్షికి ఎగరగడం- చేపకు ఈదడం ఎవరు నేర్పారు. ప్రకృతిపరంగా వాటికి దేవుడిచ్చిన వరం. వాటి ప్రేరణతో మనిషి విమానాలు, జలాంతర్గాములు తయారుచేశాడు. చంద్రమండలంపై కాలు మోపాడు. సముద్రం అఖాతపు అంచువరకు వెళ్లి వచ్చాడు. ఇదంతా ఎలా సాధ్యమయ్యింది అంటే- ఇదంతా ఆ దైవలీలా, మాయా విశేషం.

నిత్య జీవితంలో మనిషి ఉన్నదాంట్లో తృప్తిపడక ఇంకా ఏదో కావాలన్న తపనతో తన విలువైన జీవితాన్ని ఫణంగా పెడుతున్నాడు. ముఖ్యంగా యువత క్షణికమైన సుఖాల వెంట పరుగెట్టి జీవితాన్ని అంధకారం చేసుకొంటున్నారు. చదువుకొనే వయస్సులో చదువును వదిలి సినిమాలు, షికార్లు, ప్రేమలు అంటూ విలువైన జీవితాన్ని పాడుచేసుకొని ఎందుకు పనికిరానివారుగా మిగుల్తున్నారు. అమ్మా నాన్నలు, ఆత్మీయులు చెప్పే మంచి మాటలు వినకుండా జీవితాన్ని ఛిద్రం చేసుకొని జీవచ్ఛవాల్లా మారుతున్నారు. ఏ వయసులో చేయాల్సిన పని ఆ వయసులో చేస్తే అందరికీ మంచిది. ముందు మంచి చదువు, తర్వాత ఉపాధి, ఆ తర్వాత అంతా ఆనందమయం అవుతుంది.

మరి కొంతమంది అందరికన్నా నేనే గొప్పగా వుండాలని.. జీవితాంతం గాడిదలా చాకిరీ చేసి.. చేసి తిరిగి చూస్తే అనుభవించడానికంటూ ఏమీ మిగిలి ఉండదు. నీకు లేని ఆనందం ఎవరికోసం! చివరి క్షణంలో నిన్ను ఎవరు పట్టించుకోకపోతే నీ పరిస్థితి ఏమిటో ఆలోచించుకో! సంపాదనలో పడి అందరికీ దూరమై ఏకాకిగా మిగలడమంత దురదృష్టం ఏమీ వుండదు. అందుకే కష్టపడాలి. వున్నంతలో తృప్తిపడాలి. పదిమందికి సాయపడాలి. మనిషన్నాక శ్రమించాలి. అపుడే సంపూర్ణ ఆరోగ్యం మన సొంతమవుతుంది. శరీరం నుండి చెమట ఎంత వెళితే అంత ఆరోగ్యం. భగవంతుడిచ్చిన ఈ శరీరం చాలా గొప్పది. ఈ దేహంలో శక్తి వున్నంతవరకు ఏదో పని చేయాలి. బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం మన జీవనక్రమం. బాల్యం హాయిగా ఆటపాటలతో, యవ్వనం విద్యాబుద్ధులు నేర్చుకొని సుఖమైన జీవన మార్గంతో.. వృద్ధాప్యం అయిన వాళ్ళతో సుఖజీవనం చేయాలి. మనిషి బుద్ధిజీవి. ఏమి చేయాలన్నా మంచి చెడు ఆలోచించి జీవనం కొనసాగించాలి.

ఒక బోయవాడు మహాకవిగా మారాడంటే అంతా దైవకృప కాదా! అతడే వాల్మీకి. అతడు గతంలో దారి కాచి అందరినీ దోచుకొనే ఒక దొంగ. ఒకనాడు దారిన వెళ్తున్న మునులను అడ్డగించి మీ దగ్గరున్న వస్తువులన్నీ ఇమ్మని బెదిరించాడు. ఇస్తాము కాని, ఇదంతా ఎవరికోసం చేస్తున్నావని అడిగాడు. నా భార్యా పిల్లలకై అని బదులిచ్చాడు. అయితే నీవు చేస్తున్న ఈ పాపం నీ వాళ్ళు పంచుకొంటారా లేదా అడిగి రమ్మన్నారు. అతను వెళ్లి వారిని అడిగాడు. వారు నీ పాపం మేము పంచుకోం అని బదులిచ్చారు. కనువిప్పు కలిగిన ఆ బోయవాడు, ఆ మునివరులకు ప్రణమిల్లి.. ఆ హరిహరుని కృపతో, ఆ మునులు చూపిన సన్మార్గంలో బోయవాడు వాల్మీకిగా మారి మహాకవిగా మారాడు. మంచిమాట ఎపుడూ మంచే చేస్తుంది. చెడు మాట చెరుపే చేస్తుంది. సజ్జన సాంగత్యం మంచి జీవితానికి సన్మార్గం. మంచిని పెంచుదాము.. పంచుదాము. మంచికై పాటు పడదాము, సదా భగవన్నామ స్మరణతో జీవిద్దాం.

-కురువ శ్రీనివాసులు

సత్యభామ

48

బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ 588 మాటాట



ఆధారాలు

ఆధారాలు: 85
అడ్డం
11. జీవనది
3. ఇంగ్లీషు లో పుట్టిన రోజు
5రచయిత చేసేది
7. మేఘము
8. ఒక నక్షత్రం పేర వార పత్రిక
10. ప్యాన్
11. రాయి
12. దుండగులు
13.బురఖా

నిలువు
1. ఒక పద్యవృత్తం
2. తెలుగు తేనెకన్న...
3. కానుక
4. గుడారం
6. రాట్నం
8. నేను, నాదను వైయుక్తిక బుద్ధి
9. పిల్లలు
10. బురద
11. భీతి

మాటాట - 587 సమాధానం



రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

పాప్‌కార్న్



నామర్ అంటే భయం!

☼ రెడ్ సాక్స్ సాఫ్ట్‌బాల్ జట్టు స్టార్ ఆంథోనీ నామర్ గార్సియాపరాకు అఫెన్స్ విభాగంలో తిరుగులేని వీరుడిగా మంచి పేరుంది. అతను మైదానంలోకి దిగితే ప్రత్యర్థులు భయపడేవారు. అంతవరకు బాగానే ఉన్నా, సహచరులకు కూడా నామర్ అంటే భయమే. ఎందుకంటే, ఒక టోర్నీ మొదటి మ్యాచ్‌లో ఆడిన గోవ్స్, షూన్‌ను కనీసం శుభ్రం కూడా చేయకుండా ప్రతి మ్యాచ్‌లోనూ వాడేవాడు. అవి మురికిపట్టినా, దుర్వాసన వేస్తున్నా పట్టించుకునే వాడుకాడు. వాటిని మారిస్తే విఫలమవుతానన్నది అతని అనుమానం. అతని నమ్మకాలు ఎలావున్నా, గ్లోవ్స్‌ను, బూట్లను మార్చకపోవడం సహచరులను చాలా ఇబ్బందులకు గురిచేసేది.



బోగ్స్ విజయ రహస్యం..

☼ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు సంపాదించుకున్న బేస్ బాల్ ఆటగాడు వేడ్ బోగ్స్ తన కెరీర్‌లో ఎన్నో విజయాలు సాధించాడు. అత్యున్నత శిఖరాలను అధిరోహించాడు. 12 సార్లు ఆల్‌స్టార్ గేమ్స్ టైటిళ్లను, 1996లో వరల్డ్ సిరీస్‌ను గెల్చుకున్నాడు. ఇంత సామర్థ్యం ఉన్న ఆటగాడిగా నమ్మకాలు కూడా ఎక్కువే. అతను ప్రాక్టీస్‌కు ముందు సరిగ్గా 150 బంతులను మైదానంలో ఉంచేవాడు. ప్రాక్టీస్‌ను సాయంత్రం ఖచ్చితంగా 5 గంటల 17 నిమిషాలకు మొదలు పెట్టేవాడు. పొరపాటును ఒక్క నిమిషం తేడా వచ్చినా ప్రాక్టీస్‌ను మానుకునే వాడు. రెండు గంటల తర్వాత, అంటే సరిగ్గా 7 గంటల 17 నిమిషాలకు వ్యాయామ ప్రక్రియను మొదలు పెట్టేవాడు. మ్యాచ్ ఆడే ముందు ఖచ్చితంగా చికెన్ తినేవాడు. అందుకే మిత్రులంతా అతనిని 'చికెన్‌మన్' అని పిలిచేశారు. అయితే, ఈ నమ్మకాలే తన విజయాలకు కారణమని బోగ్స్ నమ్మకం.

'రఫా' స్పెషల్!

☼ శక్తివంతమైన సర్వీసులు, అద్భుతమైన ప్లేసింగ్స్‌తో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేసే 'స్పెయిన్ బుల్' రాఫెల్ నాదల్‌కు ఉన్న నమ్మకాలు అన్నీఇన్నీ కావు. ప్రతి మ్యాచ్‌కి 45 నిమిషాల ముందు తప్పనిసరిగా చన్నీటి స్నానం చేస్తాడు. ఆట ప్రారంభం నుంచి ముగిసే వరకూ విశ్రాంతి తీసుకోవడానికి కుర్చీలో కూర్చున్న తర్వాత, తన ప్రత్యర్థి లేచిన తర్వాతగానీ రఫా లేవడు. మంచినీటి బాటిల్‌పై ఉన్న లేబుల్ దిశ కోర్టు చివరివైపు ఉండేలా జాగ్రత్త పడతాడు. ప్రతి పాయింట్ తర్వాత టవల్‌తో తుడుచుకుంటాడు. నాదల్‌కు సీమ పంది మాంసం, వెన్న అంటే అసలు పడదు. తుపానులు, జంతువులంటే అసహ్యం. ఇలా చెప్తూపోతే అతని నమ్మకాల జాబితాకు అంతం ఉండదు.

- సత్య

భువనేశ్వర్‌లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్ సెమీ ఫైనల్‌లో భారత్‌ను ఓడించిన తర్వాత పాకిస్తాన్ ఆటగాళ్లు షర్టులు విప్పి గంతులు వేశారు. ప్రేక్షకులను చూస్తూ అసభ్యంగా ప్రవర్తించి, తమ నైజాన్ని చాటుకున్నారు.

పాకిస్తాన్ బరితెగించింది. భారత్‌తో క్రీడా సంబంధాలను మెరుగు పరచుకుంటామని ఒకవైపు ప్రకటిస్తూనే మరోవైపు రెచ్చగొట్టే ధోరణితో సహనాన్ని పరీక్షిస్తున్నది. పాక్ హాకీ క్రీడాకారులు చాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్ సెమీస్‌లో భారత్‌ను ఓడించిన తర్వాత చేసిన అతి చేష్టలు క్రీడాస్ఫూర్తిని వెక్కిరించాయి. భారత ఆటగాళ్లు సంయమనం పాటించకపోతే, పాక్ క్రీడాకారుల కవ్వింపు ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులను సృష్టించి ఉండేదో ఊహించుకోచ్చు. మన దేశంలో పోటీలు జరిగాయి కాబట్టి , సర్దార్ సింగ్ నాయకత్వంలోని భారత హాకీ జట్టు ఆటగాళ్లు ఓపిక పట్టారు. మరో దేశంలో ఈ టోర్నీ జరిగితే పరిస్థితి వేరే విధంగా ఉండేది. ఏ విధంగా చూసినా పాకిస్తాన్ క్రీడాకారుల చేష్టలు సమర్థనీయం కాదు.

బరితెగించిన పాకిస్తాన్!

పాకిస్తాన్ అంటేనే వివాదాల పుట్ట. క్రీడాస్ఫూర్తిని మంటగలపడం పాక్‌కు తెలిసినంతగా మరో దేశానికి తెలీదు. చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్ సెమీ ఫైనల్‌లో భారత్‌ను 4-3 తేడాతో ఓడించిన తర్వాత పాకిస్తాన్ ఆటగాళ్లు మైదానంలోనే చొక్కాలు విప్పి గంతులు వేయడం, ప్రేక్షకులను ఉద్దేశిస్తూ అసభ్యకరమైన భంగిమలను ప్రదర్శించడం పాక్ క్రీడాకారుల నైజానికీ, భారత్‌పై వారికి ఉన్న వ్యతిరేకతకు పరాకాష్ఠ. అంతర్గత కుమ్ములాటలు ఎన్నివున్నా భారత్‌ను వ్యతిరేకించడంలో అందరూ పెద్దలే. ఒక గూటి పక్షులే. నాడు భారత క్రికెట్ జట్టు వికెట్‌కీపర్ కిరణ్ మోరేను వెక్కిరిస్తూ పాకిస్తాన్ బ్యాట్స్‌మన్ జావేద్ మియందాద్ కుప్పిగంతులేసి హేళన చేస్తే, ఇప్పుడు హాకీ ఆటగాళ్లు మహమ్మద్ తౌసిక్, అంజద్ అలీ, షఫాకత్ రసూల్ మరోసారి భారత్‌పై విషం చిమ్మారు. తౌసిక్, అలీలను ఒక మ్యాచ్ నుంచి సస్పెండ్ చేసిన అంతర్జాతీయ హాకీ సమాఖ్య రసూల్‌ను హెచ్చరించి విడిచిపెట్టింది. ఇది ఎంత హేయమైన చర్యో తెలిసిన తర్వాత కూడా సమాఖ్య నామమాత్రపు శిక్షతో విడిచిపెట్టడం పాకిస్తాన్ క్రీడాకారులు భవిష్యత్తులో మరింతగా రెచ్చిపోవడానికి అవకాశం కల్పిస్తుంది. ఈ సంఘటనను మరవక ముందే స్పిన్నర్ సయీద్ అజ్మల్, మహమ్మద్ హఫీజ్‌లను ఆకాశానికి ఎత్తుతూ, వారంటే భారత్ భయపడుతున్నదని విమర్శిస్తున్న ఘనత పాకిస్తాన్‌కే దక్కింది. ప్రపంచ కప్ పోటీల్లో వీరిద్దరూ ఉంటే తమను ఆపడం టీమిండియాకు సాధ్యం కాదన్న నిర్ణయానికి వచ్చిన భారత క్రికెట్ ప్రాధికారిక సంస్థ (బిసిసిఐ) పనిగట్టుకొని వారి బౌలింగ్ యాక్షన్‌పై అనుమానం అన్న పేరుతో సస్పెండ్ చేయించిందని పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు, అధికారులు విచిత్రమైన వాదనను లేవనెత్తారు. పాక్ క్రీడారంగంలో, ప్రత్యేకించి క్రికెట్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తినా వాటిని భారత్‌కు ఆపాదించడం, అక్కసు వెళ్లగక్కడం పాకిస్తాన్‌కు ఆనవాయితీగా మారింది. శ్రీలంక క్రికెటర్లను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు చేసిన దాడి వెనుక భారత్ హస్తం ఉందని ఆరోపించిన పాకిస్తాన్ ఆతర్వాత ప్రపంచ కప్ మ్యాచ్‌లు తమకు దక్కకపోవడానికి కూడా బిసిసిఐనే కారణమంటూ రచ్చకెక్కింది. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలను భారత మీడియా కుట్రగా అభివర్ణించింది. చాంపియన్స్ ట్రోఫీ చాంపియన్‌షిప్ నుంచి సెమీస్‌లోనే పాక్ జట్టు ఓటమిపాలై వెనుదిరిగితే, అక్కడ దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆ జట్టు శ్రీలంకలో పర్యటించినప్పుడు భారత బుకీలు కొందరు ఆటగాళ్లను కలిసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. మ్యాచ్ ఫిక్సింగ్ కారణంగానే చాంపియన్స్ ట్రోఫీ చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో పాక్ ఓటమిపాలైందని, ఆతర్వాత సెమీస్‌లో ఇంగ్లాండ్‌ను ఢీకొని ఓటమిపాలుకావడానికి కూడా ఇదే కారణమని పాక్ మీడియా ధ్వజమెత్తింది. కానీ, పాక్ మాత్రం ఇదంతా భారత్ కుట్ర అంటూ తప్పించుకునే ప్రయత్నం చేయడం హాస్యాస్పదంగా ఉంది. సుమారు నాలుగేళ్ల క్రితం, పాక్‌కు 2011 ప్రపంచకప్ మ్యాచ్‌లు దక్కకపోవడంపై అక్కడి మాజీ క్రికెట్ అధికారులు, క్రికెటర్లకు ఆగ్రహం ఇంకా తగ్గడం లేదు. ఈసారి పాక్ జట్టు ట్రోఫీని గెల్చుకుంటుందన్న నమ్మకం వారికి లేదు. అందుకే భారత్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీయడమే పాకిస్తాన్ ధ్యేయంగా ఎంచుకుంది. ఈ పరిస్థితుల్లో పాక్‌తో క్రీడా సంబంధాలు సాధ్యమా?

- బిట్రగుంట

భారత్ వికెట్‌కీపర్ కిరణ్ మోరేను వెక్కిరిస్తూ కుప్పిగంతులు వేస్తున్న జావేద్ మియందాద్

ఇజాజ్ బట్ పిసిబి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు వెల్లువెత్తాయి. అంతర్జాతీయ క్రికెట్ వేదికపై పాక్ పరువుప్రతిష్టలను కోల్పోయింది. భారత్‌తోనూ బట్‌కు సత్సంబంధాలు లేవు. అనేకానేక సమయాల్లో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డుపై అతను విరుచుకుపడ్డాడు. బిసిసిఐని విమర్శించకుండా ఒక్క ఇంటర్వ్యూను కూడా అతను ఇవ్వలేదనడం అతిశయోక్తికాదు. బిసిసిఐతో నేకాదు... పిసిబి సభ్యులతోనూ బట్ వైఖరి విచిత్రంగా ఉండేది. తానే సర్వాధికారినన్న చందంగా అతను వ్యవహించేవాడు. బోర్డు సమావేశాలు నిర్వహించకుండా, ఒకవేళ సమావేశాలు జరిపినా వివరాలు సభ్యులకు తెలపకుండా ఏక పక్ష నిర్ణయాలు తీసుకునే వాడు. జట్టు సెలక్షన్ విధానంలోనూ జోక్యం చేసుకునే వాడు. క్రికెటర్లతో విభేదించి, వారిని బెదిరించేవాడు. బట్ వ్యవహార శైలిపై ధ్వజమెత్తిన షాహిద్ అఫ్రిదీ 2011లో అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. అందరూ నచ్చచెప్పడంతో చివరికి తన నిర్ణయాన్ని మార్చుకొని మళ్లీ క్రికెట్ ఆడుతున్నాడు. బట్ ఆగ్రహానికి గురైన ఆటగాళ్లలో చాలా మంది కెరీర్ అర్ధాంతరంగా ముగిసింది. చివరికి షోయబ్ అక్తర్ వంటి సూపర్ ఫాస్ట్ బౌలర్ కెరీర్‌ను కూడా బట్ దారుణంగా దెబ్బతీశాడు. ఇన్ని సమస్యలకూ భారత్ ప్రధాన కారణమంటూ బట్ ఎప్పుడూ ఆరోపించేవాడు. అంతర్జాతీయ వేదికలపై తమను ఎదుర్కోలేక భారత్ ఈ విధంగా కుట్రలు పన్నుతున్నదంటూ నోరు పారేసుకునేవాడు.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)కు వచ్చిన ఆదరణ కూడా పాకిస్తాన్ ఆగ్రహానికి కారణమైంది. చిరకాల ప్రత్యర్థి దేశం ఈ విధంగా క్రికెట్‌ను శాసించే స్థాయికి చేరుకోవడాన్ని పాక్ జీర్ణించుకోలేకపోతున్నది. ఇతర దేశాలు అధికారికంగా ప్రకటించకపోయినా ఐపిఎల్‌ను దృష్టిలో పెట్టుకుని తమతమ పర్యటనలను ఖరారు చేయడం పాక్ కోపానికి మరోకారణం. ఇలావుంటే చాలా ఫ్రాంచైజీలు పాకిస్తాన్ క్రికెటర్ల పట్ల వేలంలో మొగ్గు చూపకపోవడం ఆ దేశానికి భారత్ పట్ల వ్యతిరేకతను మరింతగా పెంచుతోంది. ఐపిఎల్‌ను దెబ్బతీసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేసిన పిసిబి చివరికి ఓడింది. ఆ అక్కసును ఇతర మార్గాల్లో తీర్చుకుంటున్నది. పాక్ వైఖరిని ఆ దేశ హాకీ క్రీడాకారుల అతి చేష్టలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి.

చివరికి కెన్యాతో సిరీస్..

☼ శ్రీలంకపై ఉగ్రవాద దాడి జరిగిన తర్వాత పాకిస్తాన్ పర్యటనకు వెళ్లేందుకు ప్రపంచ క్రికెట్ దేశాలు జంకుతున్నాయి. దీనితో ఆర్థికంగా నష్టపోతున్న పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పిసిబి) ఎట్టకేలకు ఓ అనధికార వన్డే సిరీస్‌ను నిర్వహిస్తున్నది. నిజానికి పాక్ స్థాయికి కెన్యా ఏమాత్రం తగదు. కానీ, గత్యంతరం లేని పరిస్థితుల్లో 'పసికూన జట్టు'కు పిసిబి ప్రతిపాదన పంపింది. అక్కడి నుంచి సానుకూలంగా స్పందన రావడంతో ఊపిరి పీల్చుకుంది. కెన్యాను టూర్‌కు ఆహ్వానించడమే పిసిబి ఎదుర్కొంటున్న దారుణ పరిస్థితికి అద్దం అద్దం పడుతుంది. ఐసిసి ప్రపంచ క్రికెట్ లీగ్ డివిజన్-2 చాంపియన్‌షిప్ కోసం సిద్ధమవుతున్న కెన్యాకు పాక్‌లో పర్యటన ఎంతో ఉపయోగపడుతుంది. ఇలావుంటే, ఇంతకు ముందు పలు జట్లు ఇదే విధంగా పాక్ టూర్‌కు సిద్ధంగా ఉన్నామని ప్రకటించి ఆతర్వాత వెనుకడుగు వేశాయి. బంగ్లాదేశ్ చివరి క్షణం వరకూ వస్తున్నామంటూ ఊరించి, హఠాత్తుగా రానని తేల్చిచెప్పింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో తటస్థ వేదికపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)లో హోం మ్యాచ్‌లు ఆడుతున్న పాకిస్తాన్‌కు కెన్యా జట్టు రావడం అదృష్టమే.

పిసిబి ద్వంద్వ వైఖరి!

☼ ఒకవైపు భారత్‌ను విమర్శిస్తూనే మరోవైపు మన దేశంలో క్రికెట్ సంబంధాలను మెరుగుపరచుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేయడం పిసిబి ద్వంద్వ వైఖరికి నిదర్శనం. భారత్‌తో క్రీడా సంబంధాలను మెరుగు పరచుకోవాలని పిసిబి ముమ్మర యత్నాలు చేయడం వాస్తవం. ఇప్పటికే బిసిసిఐ ప్రతినిధులు కొందరితో పిసిబి అధికారులు ఫోన్లలో చర్చలు జరిపారని సమాచారం. భారత్‌తో క్రికెట్‌కు సంబంధించి ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని, లేకపోతే నష్టాల ఊబి నుంచి బైటపడడం అసాధ్యమని పిసిబిలో ఒక వర్గం గట్టిగా వాదిస్తోంది. అందుకే బిసిసిఐని దారిలోకి తెచ్చుకొని, తద్వారా భారత ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్న పాక్ కుతంత్రం పిసిబి విమర్శలు, సయోధ్యకు చేస్తున్న ప్రయత్నాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ వైఖరికి పిసిబి తెరదించాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతానికి అసాధ్యం..

☼ పాకిస్తాన్‌లో అంతర్జాతీయ క్రికెట్ పునర్ ప్రారంభానికి ఆ దేశం ఇంకొంత కాలం వేచి చూడాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) స్పష్టం చేసింది. విదేశీ జట్ల నమ్మకాన్ని సొంతం చేసుకునేందుకు ఆ దేశం పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని తేల్చిచెప్పింది. అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించడానికి పాక్ సురక్షితమో కాదో ఇప్పుడే చెప్పడం తొందరపడటమే అవుతుందని వ్యాఖ్యానించింది. పాక్‌లో పరిస్థితులపై భద్రత అధికారులను అడగాలని, అయితే వారు ఈ విషయంలో అంత సంతృప్తికరంగా లేరని చెప్పింది. విదేశీ జట్లు తమ దేశంలో పర్యటించేందుకు ఒప్పించడానికి ప్రయత్నించడం మినహా పాకిస్తాన్‌కు మరో మార్గం లేదని ఐసిసి ఇప్పటికే ప్రకటించింది.

సిరీస్‌లు రద్దు..

☼ భారత్‌లో పాకిస్తాన్ హాకీ జట్టు ఈఏడాది ఏప్రిల్ 5 నుంచి 15వ తేదీ వరకూ పర్యటించి, ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లకు రాంచీ, లక్నో, ఢిల్లీ, మొహాలీ, జలంధర్ నగరాలను వేదికలుగా నిర్ధారించారు. ఆతర్వాత ఏప్రిల్ 23 నుంచి పాకిస్తాన్‌లో భారత హాకీ జట్టు సిరీస్ ఆడాలి. ఈ జట్టు కూడా అక్కడ లాహోర్, ఫైసలాబాద్, కరాచీ, సియాల్‌కోట్ నగరాల్లో మొత్తం ఐదు టెస్టుల్లో పాల్గొనాలి. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖతోపాటు హోం శాఖ కూడా ఈ సిరీస్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే, విదేశాంగ శాఖ ససేమిరా అనడంతో సిరీస్ రద్దయింది. రెండు దేశాల మధ్య చివరి సారి హాకీ సిరీస్‌లు 2006లో జరిగాయి. పాకిస్తాన్‌లో మూడు, భారత్‌లో మూడు మ్యాచ్‌లను నిర్వహించారు. పాక్ మూడు మ్యాచ్‌లను గెల్చుకోగా, భారత్ ఒక మ్యాచ్‌లో విజయం సాధించింది. మిగతా రెండు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఇలావుంటే, హాకీ సిరీస్ రద్దుకావడంతో, దాని ప్రభావం ఇరు దేశాల మధ్య జరగాల్సిన ఇతర క్రీడా పోటీలపై కూడా పడనుంది. ఇప్పటికే భారత్, పాక్ మధ్య జరగాల్సిన స్నూకర్ సిరీస్ రద్దయింది.



కబడ్డీతో కొత్త జీవితం!

మన దేశంలో క్రికెటర్లకు, ఐరోపా దేశాల్లో ఫుట్‌బాలర్లకు విపరీతమైన క్రేజ్ ఉంది. మన సంప్రదాయ గ్రామీణ క్రీడ కబడ్డీని చాలాకాలం క్రితమే ప్రజలు మరచిపోయారు. కానీ, ఇటీవల జరిగిన వేవ్ వరల్డ్ కబడ్డీ లీగ్ (డబ్ల్యుడబ్ల్యుకెఎల్) పుణ్యామాని ఈ క్రీడకు పూర్వ వైభవం దక్కుతోంది. కబడ్డీని హాబీగా తప్ప ప్రొఫెషన్‌గా ఎంచుకోవడానికి ఎవరూ ముందుకు రాని దుస్థితి నుంచి ఇందులోనే కెరీర్‌ను ఎంపిక చేసుకోవడానికి పోటీపడే స్థితి వరకు ఎదిగింది. పలు వివేశాల్లో మ్యాచ్‌లు ఆడడం వల్ల ఆటగాళ్లు భారీగానే సంపాదిస్తున్నారు. బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా సహ భాగస్వామిగా వ్యవహరిస్తున్న యునైటెడ్ సింగ్స్ జట్టు ఆటగాళ్లు లవ్‌రూప్ సింగ్ ఇప్పటికే కెనడా, నార్వే, జర్మనీ, ఆస్ట్రేలియా, బెల్జియం, ఫ్రాన్స్, ఇటలీ తదితర దేశాల్లో మ్యాచ్‌లు ఆడాడు. ఆయా స్థానిక క్లబ్స్ ఒక్కో కాంట్రాక్టుకు ఆరు లక్షల రూపాయలు చొప్పున చెల్లించింది. యునైటెడ్ సింగ్స్ క్లబ్ ఒక్కో ఆటగాడికి 1.5 కోట్ల రూపాయలు చెల్లించడం లవ్‌రూప్ సింగ్‌ను కోటీశ్వరుడ్ని చేసింది. అతని తమ్ముడు నవ్‌రూప్ సింగ్ జర్మనీ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ప్రొఫెషనల్ కబడ్డీ క్రీడాకారులుగా మారినప్పుడు ఇంత భారీ సంపాదన ఉంటుందని ఊహించలేదని వీరిద్దరూ అంటున్నారు. ఇప్పుడు లభిస్తున్న ఆదాయానికి, గౌరవానికి సంబరపడుతున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

మన దేశంలోనే కాదు.. విదేశాల్లోనూ కబడ్డీ క్రీడాకారుల సంబరం మిన్నంటుతోంది. లాహోర్ లయన్స్ రైడర్ లాలా ఉబైదుల్లా కబడ్డీ తన కుటుంబానికి ఎలాంటి లోటు రానివ్వడం లేదని, భారీ పారితోషికం లభిస్తున్నందున సంతోషంగా రోజులు గడిచిపోతున్నాయని అంటున్నాడు. స్టాపర్‌గా సేవలు అందిస్తున్న అతని సోదరుడు లాలా సైఫ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. మాజీ రెజ్లర్ కుమారులైన ఒబైదుల్లా, సైఫ్‌తో పాటు అతని మరో ఇద్దరు తమ్ముళ్లు కూడా కబడ్డీ క్రీడాకారులే. వీరికి ఫైసలాబాద్‌లో కబడ్డీ ట్రైనింగ్ సెంటర్ కూడా ఉంది. 12 నుంచి 22 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారికి అక్కడ శిక్షణనిస్తున్నారు. బల్జీత్ సింగ్ కూనర్ బ్రిటన్‌లో స్థిరపడిన భారత సంతతికి చెందినవాడు. యునైటెడ్ సింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఆస్ట్రేలియా, కెనడా, అమెరికాతోపాటు యూరోప్‌లోని దాదాపు అన్ని దేశాల్లోనూ కబడ్డీ మ్యాచ్‌లు ఆడుతున్నాడు. ఏడాదికి 12 టోర్నీల్లో పాల్గొని రెండు చేతులా ఆర్జిస్తున్నాడు. కబడ్డీ తన జీవితానికి ఒక చక్కటి మార్గాన్ని చూపిందని అంటున్న అతను అనుకూకుండా ఈ క్రీడలో అడుగుపెట్టాడు. కూనర్ ఒకసారి స్థానిక కబడ్డీ జట్టులో ఓ ఆటగాడు గాయపడడంతో అతని తరపున మ్యాచ్ ఆడాడు. ఏ క్షణంలో కబడ్డీ మైదానంలోకి అడుగుపెట్టాడోగానీ, తక్కువ సమయంలోనే అత్యుత్తమ ఆటగాడిగా పేరుప్రఖ్యాతలు ఆర్జించాడు. యునైటెడ్ కింగ్స్ జట్టులో స్థానం లభించడంతో అతని రాత మారిపోయింది. ప్రొఫెషనల్ కబడ్డీ క్రీడాకారుడిగా స్థిరపడ్డాడు. గుర్దీప్ సింగ్‌ది కూడా దాదాపు ఇలాంటి అనుభవమే. మాజీ అథ్లెట్ కుమారుడైన గుర్దీప్ ఎక్కువగా దుబాయ్‌లో కబడ్డీ మ్యాచ్‌లు ఆడుతున్నాడు. లక్షల్లో సంపాదిస్తున్నాడు. ఇలాంటి ఎంతో మందికి కబడ్డీ కొత్త జీవితాన్ని ప్రసాదించింది. సాకర్, క్రికెట్, టెన్నిస్ స్థాయిలో త్వరలోనే కబడ్డీ కూడా అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను ఆకర్షించి, భారీ సంపాదనకు ఒక అద్భుతమైన వేదికగా మారడం ఖాయం.

సాహితి

email: sahiti@andhrabhoomi.net

ఆంధ్రభూమి సోమవారం, 22 డిసెంబర్ 2014

గొలుసు రాత

తపించే సమయం లేక
అదేపనిగా చరిస్తుంటామా
కలలో కొన్ని పాదాలు
కదిలి వస్తాయి
మెలుకువలో కుదురుకున్న పదాలు
ఎందుకనో భంగపడ్తాయి
ఎప్పుడైనా పనికొస్తుందని
నీళ్లలో ఈదడం నేర్చుకున్నట్లే
విమానం ఎక్కిన ప్రతీసారి

ఎన్నడూ పనికిరాని
లైఫ్ జాకెట్ పాఠం శ్రద్ధగా వింటాం
రాసిన కవిత్వంలో
హుషారైన వాక్యాలు కూడా
ధోకా చేసినప్పుడు
ఎప్పుడూ నడిచిన నేలమీదే
ఒకప్పుడు జారిపడ్తాం
పగలబడే లోకం ముందు
కొత్త సంకేతాలతో మోకరిల్లుతాం
దిక్కులు పిక్కటిల్లే దుఃఖ ఘోషను
కవిత్వంగా సాధన చేస్తాం
చుట్టూరా తరచిన కొద్దీ
అర్థంకాని అంతరంగాల మాయ
ఎంత ప్రయత్నించినా
అంతుచిక్కని
గొలుసు రాత లాంటి మనుగడ
ముందుకు సాగుతున్న కొద్దీ
మన ప్రమేయం తగ్గిపోవడం గురించి
రాస్తూనే ఉంటాం

- ఏనుగు నరసింహారెడ్డి
8978869183

ఏకత్వంలో భిన్నత్వం.. ఆధునిక భాషాశాస్త్రం

చదువుకున్న వాళ్లు మాట్లాడే భాషకూ, చదువుకొనని వాళ్లు మాట్లాడే భాషకూ మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. ఎందువల్ల? చదువుకొననివాళ్లు మాట్లాడేభాష వారి వారి ప్రాంతీయ మాండలిక భాష రూపంలో ఉంటుంది. చదువుకున్నవాళ్ల భాష దాదాపు 80 శాతం సంస్కృత పదాలతోనే నిండి ఉంటుంది. అందువల్లనే ఆ వ్యత్యాసం. చదువుకున్న వారి భాషను 'శిష్ట వ్యవహార భాష', లేక 'ప్రమాణ భాష' అంటారు. చదువుకోని వారి భాషను 'జానపద భాష' లేక 'మాండలిక భాష' అంటారు.

'ప్రమాణ భాష'కు ముఖ్యంగా ఆరు లక్షణాలు కానవస్తాయి. 1) సమాజంలోని ఎక్కువ మందికి- నగరాలలో గ్రామాలలో నివసించే చదువుకున్న వారికీ, చదువుకొనని వారికీ అనగా చదువుకొనక పోయినా చదువుకున్న వారు అనుసరించే వారికీ అత్యధిక శాతం ప్రజలకు 'ప్రమాణ భాష' ఆమోదయోగ్యంగా ఉంటుంది. 2) ప్రమాణ భాష నేర్చుకొనడమే విద్యావంతుల ప్రధాన అర్హతగా, లక్ష్యంగా గుర్తింపబడుతున్నది. అందువల్లనే విద్యాబోధన అంతా ప్రమాణ భాషలలోనే జరుగుతుంది. 3) జానపదాలు, మాండలికాల ప్రయోగం కంటె ప్రమాణ భాషా ప్రయోగానికే వ్యాప్తి ఎక్కువ. ఉపన్యాసాలు, కవిత్వాలు,వచన రచనలు, వార్తాపత్రికలు, సినిమాలు, రేడియో, టెలివిజన్ మొదలైన విజ్ఞాన వ్యాపక సాధనాలన్నీ ప్రమాణ భాషనే వాడతాయి. 4) విద్యావంతుల సాంస్కృతిక, వైజ్ఞానిక ఐకమత్యానికి సంకేతంగా ప్రమాణ భాష గొప్ప పాత్ర నిర్వహిస్తుంది. ప్రజల ఐకమత్యానికి సంకేతం ప్రమాణ భాష అయితే వాళ్లను విడదీయడానికి దోహదం చేసేవిగా ప్రాంతాలకు, వర్గ మాండలికాలు తమ పాత్రలను నిర్వహిస్తాయి. 5) ప్రమాణ భాష ప్రాథమికంగా ఏదో ఒక ప్రాంతంలో ఉండి హెచ్చుగా చదువుకున్న వారి వాడుక భాష ఆధారంగా ఏర్పడి దానిలో కొద్దికొద్దిగా జానపదాలను, మాండలికాలనూ కలుపుకుంటూ వ్యాప్తం అవుతుంది. 6) కొన్ని భాషల్లో ప్రాచీన కావ్య భాషనే ప్రమాణ భాషగా వ్యవహరించడం జరుగుతుంది. అట్టి సందర్భాలలో మాండలికాల ప్రభావం ప్రమాణ భాషపై హెచ్చుగా ఉండదు.

నాలుగు మండలాలుగా తెలుగు ప్రజల విభజన

తెలుగు భాషలో నాలుగు మండలాలను గుర్తించడానికి వీలు కలిగిందనీ, ఒకటి- శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలు గల 'పూర్వమండల'మనీ, రెండు- రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు గల 'దక్షిణ మండలమ'నీ మూడు- తెలంగాణా, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో కోస్తా, రాయలసీమలను ఆనుకొని ఉన్న తాలుకాలు తప్ప మిగతా ప్రాంతంగల 'ఉత్తర మండలం' అనీ 4 ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాలు గల 'మధ్య మండలమనీ' - సామాజిక భాషా శాస్త్ర పితామహుడైన భద్రిరాజు కృష్ణమూర్తిగారికి వృత్తి పదకోశాల నిర్మాణంలో సహాయకుడుగా వ్యవహరించిన డాక్టర్ పొరటి దక్షిణమూర్తి తెలియజేశారు. ఈ నాలుగు మండలాలలోనూ వివిధ వృత్తులవారు వాడే తెలుగు పదాలలో కొన్ని తీవ్ర వ్యత్యాసాలూ, కొన్ని స్వల్ప వ్యత్యాసాలూ కూడా ఉన్నాయి. అయితే ఈ వేర్వేరు పదాలకు అన్నింటికీ మౌలికమైన అర్థాలిచ్చే మౌలిక మూలాధార సంస్కృత పదాలు ఉండడం భాషా శాస్త్ర పరిశోధనలు, అధ్యయనంలో ఉత్సాహం కలవారు అందరూ గమనించదగిన విషయం.

అన్ని తెలుగు పదాలకూ వేద సంస్కృత మూలాలు

'నాగలి' అనే పదం, రెండు మండలాల్లో 'నాగలి' అనే వాడుకలో ఉండగా ఒక మండలంలో మాత్రం 'నాగేలి' అని వాడుకలో ఉంది. ఈ పదాలకు సంస్కృత మూలం మామూలుగా వాడుకలో ఉన్న సంస్కృత

> ***తన భాషలోనే తన మాటల్లోనే 80 శాతం సంస్కృత పదాలను ఉపయోగిస్తూ ప్రకటించడం- వితండవాదం తిరోగమన వాదం కాక మరేమౌతుంది? ఇలా తిరోగమన దిశగా భాషా శాస్త్ర ప్రస్థానం జరుగుతుంది. అవాక్కులై చూస్తూ ఊరుకుండేవారిని ఏమని ప్రశంసించాలో అర్థం కావడంలేదు. తాటాకుల చప్పళ్లకు కుందేళ్లు బెదరవులే అని దీని అర్థమా?***

పదం 'హలం' కాదు, కాజాలదు. కాని మామూలుగా వాడుకలో లేని సంస్కృత పదం ఒకటి ఉన్నది. 'లాంగలి', లాంగల అని, 'ఈ 'లాంగల' అనే సంస్కృత పదం చదువురానివారి వాడుకలో 'నాగలి'గా వాడుకలోనికి వచ్చిందని మనం ఊహించలేమా? 'మోటబావి'లోని 'మోట' అనే పదం కూడా మరో రెండు మండలాల్లో వాడుకలో ఉంది. ఒక మండలంలో మాత్రం 'కపిల' అనే పదం వాడుకలో ఉంది.

మాండలికాలకు మూలం ప్రాచీన ద్రావిడ భాషలు

ఇలా అన్ని మాండలిక పదాలకూ మౌలిక రూపాలైన వేద సంస్కృత పదాలు కొద్ది శ్రమచేసి పరిశీలిస్తే ఎవ్వరికైనా తప్పక లభిస్తాయి. కాని 'ఈ మాండలిక పదాల మూల రూపాలు వేద సంస్కృత పదాలు కాదు. ద్రావిడ పదాలు మాత్రమే వాటి మూల రూపాలు. అట్టి ప్రాచీన ద్రావిడ భాష సమగ్ర రూపాన్ని కనుగొనడానికే మేమిప్పుడు కృషిచేస్తున్నాం' అంటున్నారు కొందరు మహానుభావులు. సూర్యోదయాన్ని చూడడానికి తూర్పు దిశగా పయనించడానికి బదులు పడమటి వైపుగా ఎంతో ఉత్సాహంతో, ఉద్రేకంతో, ఉద్వేగంతో అడుగులు వేస్తూ-. దాన్ని పురోగమనం అంటారా? 'తిరోగమనం' అంటారా? విజ్ఞులే గ్రహిస్తారు. ఇలా దక్షిణదేశాలన్నిటిలోకీ మొట్టమొదటగా భారతదేశంలో, అందునా ఆంధ్ర ప్రదేశాలు తెలుగు భాషలో వృత్తిపదకోశాలు తయారుచేసి- చూశారా? ఈ ద్రవిడ భాషలలో ఎంత వైవిధ్యం ఉన్నదో? ఇంతటి సమగ్రమూ, నిర్దుష్టమూ అయిన ద్రావిడ భాషా చరిత్ర రాయడానికి అనాగరిక భాషా సామగ్రి ఎంత అవసరమో గ్రహిస్తున్నారా? అని ఒకప్పుడు సామాజిక భాషా శాస్త్ర పితామహులు భద్రిరాజు కృష్ణమూర్తి అనడం ఆశ్చర్యం కలించక మానదు. ఇక్కడ మనం ఒక ముఖ్య విషయం పరిశీలింపవలసి యున్నది. అదేమిటంటే- అసలు 'శాస్త్రం' అంటే ఏమిటి? 'శాస్త్రం' ప్రయోజనం ఏమిటి? అని. సృష్టిలోని మానవ జీవితంలోని వివిధ విషయాల పరిణామక్రమాన్ని యథాతథంగా తెలియపరుస్తూ, 'ఈ క్రమమే, ఈ విజ్ఞానమే అనుసరణీయం' అని శాసించేది 'శాస్త్రం'. ఇలా శాసించడం వలన ప్రయోజనం ఏమిటి?

శాస్త్ర ప్రయోజనం భిన్నత్వంలో ఏకత్వం

ఇలా శాసించడం వలన, అనగా శాస్త్రం వలన ప్రయోజనం ఏమిటి?- అంటే- భిన్నత్వంలో ఏకత్వాన్ని సందర్శింపజేయడం.. తద్వారా ప్రతి మనిషి మనస్సునకూ ఏకాగ్రతను లభింపజేసి- తద్వారా అమంద ఆనందానుభూతిని కలిగించి జన్మచరితార్థం అయిందనే సంతృప్తిని కలిగించడం. మనస్సు ఏకాగ్రమై ఉండడమే ఆనందానికి ప్రతీక. మనస్సు పరిపరివిధాలుగా సంచరిస్తూ ఉండడమే అన్నిరకాలైన ఆందోళనలకు దుఃఖానికీ కారణం.

ఏకత్వంలో భిన్నత్వం సృష్టించే వారు ఏం చెయ్యాలి?

చదువుకున్న వాళ్లందరూ మాట్లాడే 'ప్రామాణిక భాష'లో 80 శాతం సంస్కృత పదాలు, 20 శాతం మాత్రమే మాండలికాలూ ఉండగా మనం మాట్లాడుతున్న, వ్రాస్తున్న భాష అంతా- 'భాష' అనే పదంతో సహా 'సంస్కృతమే' అయి ఉండగా- 'సంస్కృతం' ఈ భాషలకు మూలం కాదు- ఈ ద్రావిడ భాషలన్నింటికీ మూలమైన 'మూల ద్రావిడ భాష' ఎక్కడ ఏ ప్రాంతంలో విశేషంగా వాడుకలో ఉందో పరిశోధించి ప్రజల ముందు ఉంచాల్సి ఉన్నది. ఈ ద్రావిడ భాషలకూ, ఆర్యల భాష, వేద భాష దేశ భాష అయిన సంస్కృతానికీ ఎక్కడా ఏ సంబంధమూ లేదు' అంటూ తన భాషలోనే తన మాటల్లోనే 80 శాతం సంస్కృత పదాలను ఉపయోగిస్తూ ప్రకటించడం- వితండవాదం తిరోగమన వాదం కాక మరేమౌతుంది? ఇలా తిరోగమన దిశగా భాషా శాస్త్ర ప్రస్థానం జరుగుతుంది. అవాక్కులై చూస్తూ ఊరుకుండేవారిని ఏమని ప్రశంసించాలో అర్థం కావడంలేదు. తాటాకుల చప్పళ్లకు కుందేళ్లు బెదరవులే అని దీని అర్థమా?

- సన్నిధానం యజ్ఞనారాయణమూర్తి

సాహిత్య విమర్శలో మేటి... రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

సాహితీ ప్రక్రియల్లో విమర్శ అత్యంత కీలకం. రచనతో పాటు విమర్శకూ అదే స్థాయి ప్రాధాన్యం ఉందనడంలో అతిశయోక్తి లేదు. రచయితను సైతం మెప్పించి, పాఠకులను ఆలోచింపచేసే విమర్శకుల సంఖ్య తగ్గుతోందనే వాదోపవాదాల మాట ఎలా వున్నా, ఆ రంగంలో నిష్ణాతులైనవారు ఉన్నారనేందుకు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి నిలువెత్తు నిదర్శనం. తెలుగు సాహిత్య విమర్శపై చెరగని ముద్ర వేసి విద్వత్ విమర్శకుడిగా ఆయన ఖ్యాతి గడించారు. తెలుగు సాహిత్య విమర్శను శాస్త్రీయంగా తీర్చిదిద్దిన సాహితీవేత్త ఆయన. సాహితీ ప్రక్రియల్లో, రచనల్లో, విమర్శలో, పరిశోధనల్లో ఆయనది అందె వేసిన చెయ్యి. లోతైన విశ్లేషణ, ఆలోచింపజేసే విమర్శతో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న రాచపాళెం, ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక కావడం హర్షణీయం. 'మన నవలలు - మన కథానికలు' అనే సాహితీ విమర్శ రచనకు గాను రాచపాళెం ఈ అవార్డుకు ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లా తిరుపతి సమీపంలోని కుంట్రపాకం గ్రామానికి చెందిన రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేశారు.



రాయలసీమ సాహిత్యోద్యమాల చరిత్ర, దళిత కథలు, ఆధునికాంధ్ర కవిత్వం, గురజాడ కథానికలు వంటి ఎన్నో రచనలతో ఆయన ఖ్యాతి గడించారు. పలు పత్రికల్లో విమర్శనా వ్యాసాలు రాయడంతో పాటు అనువాదాలు కూడా చేశారు. రాయలసీమ సాహిత్యంపైనా, తెలుగు సాహితీ రంగంపైనా ఆయన చెరగని ముద్ర వేశారు. ఎన్నో రచనలు, మరెన్నో అవార్డులు, సత్కారాలు పొందిన రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ప్రస్తుతం యోగి వేమన విశ్వవిద్యాలయంలోని సిపి బ్రౌన్ గ్రంథాలయంలో తెలుగు భాషా విభాగం అధిపతిగా పనిచేస్తున్నారు. కథా సాహిత్య విమర్శ మీద అనేక పరిశోధనలకు రాచపాళెం మార్గదర్శకులు. ఒక పథకం ప్రకారం జరిగిన ఈ పరిశోధనలతో తెలుగు కథలకీ, సాహిత్యానికీ, విమర్శకీ విశ్లేషణతో పాటు విలువైన సమాచారం అందుబాటులోకి వచ్చింది.

- మోహన్

స్వీయ సానుభూతి

పందానికి పరుగుకు
ఎప్పుడంటే అప్పుడు
తయారుగుండే గజ్జెల గుర్రం బతుకు
మరుగుజ్జులా కుంచించుకుపోతుంది

ఉప్పు కారం తీపి లేక
ప్రణయ ప్రయాణం
చప్ప చప్పగా సాగుతుంది

ఉదయం సాయంత్రం
చెప్పాపెట్టకుండా
పారిపోయిన ఆరోగ్యాన్ని
ఎంత నడిచి ఒడిసి పట్టుకుందామన్నా
ఒకే ఒక్క అడుగు దూరంలో
తప్పక అందకుండా పోతుంది

ఎంత జిడ్డు చేసినా
ముద్దు హద్దులను చెరిపేయలేక
చతికిల పడి నిట్టూరుస్తుంది

పాలు మరుగుతాయి
కానీ తోడు కలిపినా
ప్రతిసారి పెరుగు కాలేక
మరుగున పడుతుంది

భాగస్వామి స్ఫూర్తిని అందించినా
చిక్కుపడి బిక్కమొకమేసినా
కాంక్ష ఎంత పురికొల్పినా
నిట్టనిలువునా కుప్పకూలుతుంది

చక్కగా గూత పట్టరాదు
కూడగట్టుకు ఒకవేళ గూత పట్టినా
బాతను తొక్కకుండానే
ఆటలోంచి అర్ధాంతరంగా
స్వచ్ఛందంగా నిష్క్రమిస్తాం

పొద్దు మాపు నుంచి
దినం తప్పిచ్చి దినం నుంచి
వారం వారం నుంచి
తడి తడతడ పెడుతూ
ఇంతింత బొత్తలకు ఇంకిపోతుంది

చెరువులో నీటి కరువు
ఎండి నెర్రెలిచ్చిన పొలం
నీరటి కాన్ని నిరాశ్రయుల్ని చేస్తుంది

దయా జాలి కరుణ లేని
దేహం ముందు
జల్లెడతో మనిషి దాహం తీర్చలేక
బేషరతుగా చేతులెత్తేసి
బీరగింజోలె బీరిపోతాం

వయస్సు తూర్పార పడితే
అసలు పొల్లు వేరవుతున్న
గట్టి ఆత్మ తేజరిల్లుతుంది

పుట్టుకే కట్టపు పుట్టువడి
పట్టుమని పది నిమిషాలు
ముఖాముఖి ఉండలేక
అటు తిరిగి ఆమె
ఇటు తిరిగి నేను
ఎటమటమవుతున్న దాంపత్యం

గోళీలెన్ని మింగినా
రంగోళిగా విరియని చోట
యవ్వనానికి నివాళులు అర్పించాలి

బతుకు గానుగ
మనసు గంతలు విప్పాలి
ఇంతవరకున్న ఆశా నిరాశ లక్ష్యం
గమ్యం
సుఖం దుఃఖం తనకుతానే
కొత్త దిశను నిర్దేశించుకుంటుంది

మనసు కొట్టుకుంటుంది
కానీ హృదయం
సహాయ నిరాకరణ చేస్తుంది

జీవితం పట్టనట్టు ఉంది
రక్తం అనురక్తితో
సలసలా మరుగుతుంది
చిత్రాతి చిత్రం జీవన యానం
ఉప్పు కారం తీపి ఒప్పక
కారు చేదు ఎక్కుతుంది

- జూకంటి జగన్నాథం
9441078095

వెదురు కణుపుల్లో దాగిన లిపి

హరప్ప మొహంజదారో పుర్రెలు ఓ చరిత్ర
మొసపటోమియా ఇసుక తిన్నెల కింద ఓ ఆధారం
వీటిని మితి, పరిమితి...
సర్వం పట్టించలేని చరిత్ర స్థితి

దేవకణపు దేవులాట కాదు గొప్ప
అవి మిషిన్లు చేసే పని
కానీ... గుంజాల అక్షరపు లిపి గింజ
మట్టివేళ్ల ముచ్చట!

తరతరాల వారసత్వాల జవసత్వాల తడి
ఈ గింజకు పాదుచేసి సారెడు నీళ్లు పోస్తే చాలు
సాలు సాలుకు చరిత్ర ఆనవాళ్లను చూపించే
వికీపీడియా ఇదే కావొచ్చు

రాతి పలకలపై ఆరబోసిన అక్షరాలు
మునివేళ్ల సందుల్లోంచి
మారుమూల గోండ్వనాలోంచి
జాలువారుతున్నాయి

ఏమో ఎవరికి తెలుసు
మనం సరిగ్గా చూడాలే గాని
అరిస్టాటిల్... అలెగ్జాండర్ గోండిగూడెంలోనే
ఆనాడు పురుడు పోసుకుని ఉండవచ్చు
అణువంత విత్తనం చాలు
ఆకాశాన్ని తాకే చెట్టవడానికి
ఈ అక్షరాలు ఏ చరిత్రను పుష్పిస్తాయో
ఏ తప్పుడు చరిత్రను ఎట్లా బోనులో నిలబెడ్తాయో

రాజెవడో... బంటెవడో
పంట చేతికొస్తే అన్నీ దెలుస్తయ్
బల్లెం... ఈటె... గురి తప్పక కొట్టిన
తొలి దెబ్బ ఎవరిదో
అక్కడక్కడా అడవుల్లో,
గుహల్లో కన్పిస్తున్న జాడలెవరివో
ఆదిమూలం... అమ్మ మూలం...
ఈ గింజలే చెప్తాయో కావొచ్చు
ఎవరికి దెల్సు ఏ పుట్టల ఏం పాముందో

వీరుడెవరో... శూరుడెవరో
తొలి సిపాయి ఎవడో...
అక్షరాల పోతపోసి...
ఘంటంతో... చారిత్రక తొలి గంట కొట్టిందెవరో
ప్రచార పటాటోపాలతో
వాస్తవాలపై దుప్పటి కప్పిందెవరు?
ఏ చరిత్ర ఎట్లా ఏ అక్షరాల్లో మలుపు తిరిగిందో
ఎక్కడ ఏం కుట్ర జరిగిందో
ఇంకా తవ్వేది ఎంతో ఉంది
తప్పకం అన్యాయపు అక్షరాలను పూడ్చడానికే!
వెతికేది... పరిహారం పొందేది ఎంతో ఉంది
ఎవరికి దెల్సు...
ఆదివాసీ అక్షరంపై... సహాసంపై...
పగబట్టిందెవరో...
బరిగిసి నిలబడిన ఈనాటి ధీరులెవరో...
కల్లం అడుగులతో సహా
ఈ గుంజాల లిపి గింజ కడిగేసి చెబుతుంది
అక్షరాలా ఆది లిపి మూలాలు ఇవి!
(గుంజాల కోయతూర్ లిపి రాత ప్రతులు చూసి)

- జి. బిచ్చన్న, 8790999116

ప్రపంచీకరణలో తెలుగు కథా సాహిత్యం

చిన్నాభిన్నమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, ఉపాధి కోల్పోతున్న కుల వృత్తుల గురించి వ్యాఖ్యానించిన సాహిత్యం తెలుగులో విస్తృతంగా వచ్చింది. ప్రపంచీకరణ, అభివృద్ధీకరణ, నగరీకరణ తెచ్చిపెట్టే సమస్యలకుతోడు ప్రాజెక్టుల కింద భూములను తక్కువ ధరకు కొనుక్కుని వలసవాదులు తెలంగాణలో స్థిరపడ్డారు. దాంతో తెలంగాణ ప్రజలు వారి భుక్తినుండి, తరతరాల వ్యవసాయ కృషినుంచి, గ్రామాల నుండి మూలాల నుంచి దూరమై నైజాం పాలనకన్నా భయంకరమైన భూసమస్యను ఎదుర్కొంటున్నారు. తెలంగాణ సంపదలను దోచుకొని తెలంగాణను వలస భూమిగా మారుస్తున్నారనే ఆవేదనను కథల్లో వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా పులుగు శ్రీనివాస్ 'సంకర విత్తులు', పి.చంద్ 'భూ నిర్వాసితులు', సుజాతారెడ్డి 'గుడిసెలు గుడిసెలు' కథలను ప్రత్యేకించి చెప్పవచ్చు.

ప్రపంచీకరణ వల్ల వ్యక్తికీ, సమూహానికి మధ్య ఒక కృత్రిమమైన దూరం ఏర్పడుతోంది. దాన్ని జయించడానికి చైతన్యవంతుడైన వ్యక్తి కొన్ని ప్రత్యామ్నాయాల్ని వెతుక్కోక తప్పదు. అది అనివార్యత. ఆ అన్వేషణకు ప్రధానమైన సాధనం స్థానికత. ఈ నేపథ్యంలో కాలువ మల్లయ్య కథలు రాసారు. నూతన వ్యవసాయిక, సాంకేతిక విధానాలు, పరిణామాలు, ఫలితాలు వస్తువుగా కలిగిన కథ ఇది. కుల వృత్తుల మూలాలను, వాటి విచ్ఛిన్నాన్ని వాటిలో వచ్చిన ఆధునికీకరణను ఈ 'పరాయీకరణ' ఆవిష్కరించింది.

ప్రపంచీకరణ క్రమంలో గ్రామాలను, గ్రామ సంపదలను అందులో భాగంగా రైతు జీవితాన్ని ఆక్రమించుకొంటూ, మింగేస్తూ బహుళజాతి సంస్థలు విస్తరిస్తూ బలపడే క్రమాన్ని స్వామి రాసిన 'తెల్లదయ్యం' కథ సమర్థవంతంగా చిత్రించింది. కుల వృత్తులు అంతరిస్తూ జీవితాలలో తెచ్చే సంక్షోభాన్ని పెద్దింటి అశోక్‌కుమార్ తన కథలలో చిత్రించారు. 'తెగిన బంధాలు' కథలో పెండ్లిళ్ళ పద్ధతులు మారటంవలన కూరాడు కుండలకు, పోలు ముంతలకు పెళ్ళితంతులో స్థానం లేకుండాపోవటం అది కుమ్మరికి ఇంతకుముందున్న ప్రాధాన్యతను అభావం చేయటం, ఒక్క కుమ్మరులే కాదు డబ్బు పెట్టుబడి, వ్యాపారీకరణల ప్రాధాన్యతలో అభివృద్ధిచెందిన కొత్త పెండ్లి తీరులో చాకలి, మంగలి, మాదిగ మొదలైన అన్ని కులాల వాళ్ళూ ఉపాంతీకరించబడటం చిత్రితమయ్యాయి.

కాగుబొత్త కథ కుమ్మరి జీవన విషాదాన్ని చిత్రించిన కథ. జాతరలో చలివేంద్రం పెట్టడానికి మట్టికాగులు చేసే పని తండ్రి చేపడితే నీటి ప్యాకెట్లను అమ్ముకొనే కాంట్రాక్టు పట్టాడు కొడుకు. బతుకుతెరువు పాకులాటలో తండ్రీ కొడుకుల సంబంధాలు నిలబడనివే అయినాయి. నీళ్ళను ముల్లెగట్టి అమ్మే వ్యాపారం వచ్చి కాగు బొత్తకు స్థానం లేకుండా చేసిన క్రమంలో ఉన్న హింస ఈ కథ వివరిస్తుంది. వ్యాపార సంస్కృతి గ్రామీణ సహజ వనరులను కొల్లగొట్టే ప్రమాదం ఎంతగా ఉందో 'పేగు ముడి' కథలో అశోక్‌కుమార్ సూచించారు. 'కీలుబొమ్మలు' కథలో ప్రపంచీకరణ క్రమంలో కార్పొరేట్ వ్యవసాయ విధానం గ్రామాలలోకి చొచ్చుకొని వస్తూ రైతుల, కూలీల జీవితంలో నింపుతున్న సంక్షోభాన్ని ప్రతిఫలించింది.

కాలువ మల్లయ్య రాసిన కథలు ఒకవైపు నూతన ఆర్థిక విధానాల కారణంగా గ్రామీణ వ్యవసాయిక జీవితంలో వచ్చిన సంక్షోభాన్ని, మరొకవైపు పారిశ్రామిక విధానాలలో వస్తున్న మార్పులను చిత్రించాయి. 'నేల తల్లి'లో వ్యవసాయం గిట్టుబాటుకాక, పెట్టుబడులకు అప్పులు తేలేక, మార్కెట్ తనకు అనుకూలంగా లేక, వ్యవసాయం వదులుకోలేక రైతు పడే వేదనను

> ***వృత్తులు నశించి ప్రత్యామ్నాయం లేని బతుకుతో జనం విలవిలలాడుతున్నారు. కొన్ని సంస్కృతులు, భాషలు కనుమరుగయ్యే పరిస్థితులొస్తున్నాయి. మానవతా విలువలు మృగ్యమవుతున్నాయి. సేవాభావం నశించి స్వార్థం పెరిగిపోతుంది. డబ్బుకు ప్రాముఖ్యం ఎక్కువై రక్తసంబంధాలను కూడా నశింపచేస్తుంది. మనుషుల మధ్య, జాతుల మధ్య, ప్రాంతాల మధ్య వైరుధ్యాలు ఎక్కువవుతున్నాయి.***

చిత్రించింది. పారిశ్రామికీకరణం, ప్రపంచీకరణం, యాంత్రీకరణం, వ్యాపారీకరణం మొదలైన దుష్టశక్తులు పల్లె-పట్టణ ప్రజాజీవితాల్లో చేసిన గాయాలను గూర్చి ఎంతో ఆవేదన చెందుతూ తెలంగాణ కథకులు అద్భుతమైన కథలందించారు.

ఈ కథల్లో మట్టివాసనలు మాయమవుతున్న తీరు, గ్రామ స్వరూప స్వభావాలు, వృత్తులు నశించిపోతూ పనిముట్లు మూలన పడేయాల్సి వచ్చి బాధపడే తీరు, భూములు అన్యాక్రాంతం కావడం, జానపద కళలు అడుగంటిపోవడం, వలసలు అనివార్యం కావడం, ఫ్యాక్టరీల మూసివేతతో బతుకుదెరువు కోల్పోయిన దీనస్థితికి దిగజారి మనోవేదన చెందుతూ, ఆత్మహత్యల పర్వంతో వాస్తవ జీవిత గాథలను అక్షరీకరించడం కనిపిస్తుంది. రెండవ తరం రచయితలు కథలు రాసేనాటికి రాయలసీమలో చెప్పుకోదగ్గ మార్పులు చాలానే వచ్చాయి. స్కూళ్ళు, కాలేజీలు బహుళ సంఖ్యలో పెరిగాయి. సెకండరీ స్థాయివరకూ ఉచిత విద్య లభించటంవల్ల మధ్యతరగతికి విద్య అందుబాటులోకి వచ్చింది. పల్లెపల్లెకూ రవాణా సౌకర్యాలు ఏర్పడ్డాయి. కపిల మోటల స్థానంలో కరెంటింజన్లు వచ్చాయి. కొంత కాలం గడిచేసరికి గొట్టపు బావులు వచ్చాయి. ఇంతకుముందు శ్రమను పెట్టుబడిగా మార్చి పంటలు పండించే రైతులు ఇప్పుడు డబ్బును పెట్టుబడిగా చేసి వ్యవసాయం చేయటం వల్ల క్రమంగా చితికిపోతున్నారు. ఓట్ల రాజకీయాల జోరు క్రమంగా పెరిగింది. ఓట్లకోసం రాజకీయ నాయకులు అమాయకపు పల్లెల్ని రెండువర్గాలుగా చీల్చటం ప్రారంభించారు. కులం మునుపెన్నడూ లేనంతగా పడగ విప్పింది. ఫ్యాక్షన్ పెరిగింది.

రాయలసీమ రైతుకు పండే పంటలు అంతంతమాత్రం. తీరా దాన్ని అమ్మబోతే ఎలాంటి మోసానికి, దోపిడీకి గురౌతున్నాడో తెలియజెప్పే కథలు రచయితలు రాసారు. శాంతి నారాయణ రాసిన 'దళారీ', సింగమనేని నారాయణ రాసిన 'అడుసు'లాంటి కథలు ఇందుకు మంచి ఉదాహరణలు. అంతేకాదు ఈ నేపథ్యం పలు సందర్భాల్లో ఉత్తరాంధ్రకు చెందిన గ్రామీణ, సెమీ, అర్బన్, గిరిజన్ ప్రాంతాలకు చెందినది కావడంతో స్థానిక ముద్ర ఆయా కథలకు మరికొంత ప్రత్యేకతను సమకూర్చింది. అవాంఛనీయ యంత్ర నాగరికతలో చేతి వృత్తులను వెలివేస్తున్న పల్లెలు, ఈ హృదయ విదారక దృశ్యాలన్నీ 'భూమి పుండు', 'తిరుగుడమ్మి', 'నీటి ముల్లు', 'ఏటి పాట', 'వలస పక్షి' కథల్లో ఆవిష్కరించారు గౌరునాయుడు.

వృత్తులు నశించి ప్రత్యామ్నాయం లేని బతుకుతో జనం విలవిలలాడుతున్నారు. కొన్ని సంస్కృతులు, భాషలు కనుమరుగయ్యే పరిస్థితులొస్తున్నాయి. మానవతా విలువలు మృగ్యమవుతున్నాయి. సేవాభావం నశించి స్వార్థం పెరిగిపోతుంది. డబ్బుకు ప్రాముఖ్యం ఎక్కువై రక్తసంబంధాలను కూడా నశింపచేస్తుంది. మనుషుల మధ్య, జాతుల మధ్య, ప్రాంతాల మధ్య వైరుధ్యాలు ఎక్కువవుతున్నాయి. 'మానవుణ్ణి అమానవుడిగ మార్చే పెట్టుబడిదారి వ్యవస్థ పరిణామ రూపం సామ్రాజ్యవాదం, దాని అంతిమ దశ ప్రపంచీకరణ.' పెరుగుతున్న ప్రపంచీకరణలో పెరుగుతున్న డబ్బు అవసరాలు, ప్రాధాన్యత, వృత్తి పనివాళ్ళ జీవితాలలో వస్తున్న సంక్షోభం వీటికి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించి ఆవిష్కరించటంలో తెలుగు కథకులు సఫలీకృతులవుతూ రచయితలుగా తమ సామాజిక బాధ్యతను సమర్థవంతంగా నెరవేరుస్తున్నారు.

- బానోత్ అనితబాయి,
9441680713

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
సోమవారం
22,డిసెంబర్
2014

నేర్చుకుందాం

క. అడిగిన వృథ సేయక తన
యొడ లాఁకలి గొన్న యెఱుకు కోగిరముగ నే
ర్పడ నిచ్చి కీర్తి ఁ గనె నని
పుడమిన్ మును వినమె యల కపోతము ననఘా!

భావం: ఆకలి గొన్న బోయవానికి అడిగిన వెంటనే కాదనకుండా తన శరీరాన్నే ఆహారంగా సమర్పించి కీర్తిని పొందిన పావురం కథ విన లేదా. మళ్లీ ధదీచి దానత్వవము గురించి చెప్పిన వారు పావురం బోయ వాని ఆకలి తీర్చడానికి తనకు తానై మంటల్లో పడి శరీర త్యాగానికి ఒడిగట్టిన విధానం గురించి నీకు తెలియదా అని అడుగుతున్నారు. ఆకలి గొన్నవారికి కడుపునిండా అన్నం పెట్టడమే భారతీయ సనాతన ధర్మం. ఈ ధర్మం పశు పక్ష్యాదులు కూడా నిర్వర్తిస్తున్నాయంటే భారతీయ సంస్కృతి ఎంత సనాతనమూ నిత్యనూతనమైందో తెలుస్తోంది కదా.

పోతన భాగవతము - దశమ స్కంధము

స్పందన

38

కె. ప్రమీలాజనార్దన్

''ఇప్పుడవన్నీ ఎందుకు? మన ముగ్గురం మూడు దేశాల వాళ్ళము. ఆ రాజ కీయ నాయకుల మాటలు విన్నా వాళ్ళ గురించి మాట్లాడుకుంటున్నా మనం శత్రువుల మవ్వలేదు. మనుషులంతా ఒకటేననుకుంటు న్నాము. ఎప్పుడూ మనం ఇలాగే అనుకొనేట్లు చెయ్యమని భగవంతుణ్ణి మనసారా కోరుకుం దాము'' అన్నాడు అజిత్.

రాత్రి నిద్రపట్టేవరకు మాట్లాడుకుంటుండే వారు.

ముగ్గురూ కలిసి ముఖ్యమైన ప్రదేశాలెన్నో చూశారు.

ఎందరో మహనీయులు చదువుకున్న ఆక్సఫర్డుకు వెళ్ళారు. అక్కడ ఎన్నో ప్రసిద్ధి చెందిన కాలేజీలు వున్నాయి. తన తండ్రి అక్కడ చదువుకున్నాడంటే గర్వంగా అనిపి స్తుంది అజిత్‌కు. ఆయనతోపాటు వరుణ్ అనే అతడు కూడా చదువుకున్నాడు. వాళ్ళిద్దరు మంచి స్నేహితులు. మా డాడీ రమ్మనగానే నర్సింగ్ హోమ్‌లో భాగస్వామ్యం తీసు కుంటానంటూ వచ్చారు. వరుణ్ అంకుల్ మా ఫ్యామిలీ ఫ్రెండ్ అనేకంటే మాకందరికీ అత్యంత ఆత్మీయుడు..'' అంటూ వరుణ్ గురించి స్నేహితులకు చెప్పాడు.

''స్నేహమంటే అదే.. ఒకరి కొకరుగా వుండాలి'' అన్నారు వాళ్ళు.

ఎప్పటిలా ఆ రోజు రాత్రి స్నేహితులతో మాట్లాడుతూ హారిక విషయం చెప్పాడు అజిత్. 'వండర్‌ఫుల్. మీ దేశం నుండి రావడమేకాదు.. మీ భాష ఒకటే అయిన అమ్మాయి నీ కొలీగ్‌గా వచ్చింది. తర్వాత లైఫ్ పార్ట్‌నర్ అవుతుందేమో...'' అన్నారు వాళ్ళు ఆటపట్టిస్తూ.

''అంత సీను లేదు. ఎందు కంటే ఆ అమ్మాయి చాలా కట్టుబాట్ల మధ్య పెరిగినట్లుంది. ఇక్కడికి వచ్చేటప్పుడు వాళ్ళ వాళ్ళందరు బైటి ప్రపంచంలో ముఖ్యంగా యువకులతో చాలా జాగ్రత్తగా వ్యవహరించా లని చెప్పినట్లున్నారు. అందుకని ఆమె అంద రిలా మామూలుగా మాట్లాడి స్నేహమౌతుం దని నేననుకోవడంలేదు'' అన్నాడు అజిత్. కాని రెండు రోజుల తర్వాత అతడు ఊహిం చని విధంగా జరిగింది.. అది హారిక తన కారులో తీసుకెళ్ళమనడం.. ఆశ్చర్యంగా చూశాడు అజిత్.

''నాకేం అభ్యంతరం లేదు. మీరు వచ్చిన రోజే ఆఫీసులో ఆలస్యమయిందని కారులో తీసుకెళతానన్నాను. మీరు భయపడుతూనే కారెక్కారు. అందుకని నేను మళ్లీ మిమ్మల్ని అడగలేదు'' అన్నాడు అజిత్.

''సారీ, ఆ రోజు నిజంగానే ఆలా భయప డ్డాను. అంతా కొత్తగదండి. ఎవరినెలా అర్థం చేసుకోవాలో తెలియక ఆందోళన పడ్డాను'' అంది హారిక.

''నెవర్‌మైండ్. దాని గురించి ఆలోచించ కండి. మన దేశంలో అమ్మాయిలకు ఆ భయం వుండడం సహజమే..'' అంటూ ఆమె వైపు చూసినప్పుడు అర్థమయింది అతడికి, ఆమె తనను కారులో తీసుకెళ్ళమని అడిగిందో...

''మీరు చాలా నీరసంగా వున్నారు. ఒంట్లో బాగాలేదా?'' అడిగాడు.

''ఈ రోజు ప్రొద్దున ఇంటినుండి బైలుదేరే టప్పుడే కాస్త నలతగా అనిపించింది. మధ్యాహ్నం నుండి ఫీవర్ వచ్చినట్లుంది. తొందరగా ఇంటికి వెళ్లి పడుకోవాలనిపి స్తోంది'' అంది హారిక.

''సారీ, మిమ్మల్ని చూడకుండా ఏదో మాట్లాడాను. టెంపరేచర్ ఎక్కువగా వున్న ట్లుంది.. పదండి. ఆలస్యం చెయ్యడమెం దుకు? మనం వెళ్ళే త్రోవలోనే నాకు తెలిసిన మంచి డాక్టర్ వున్నాడు. అక్కడ చూపించుకుం దురుగాని...'' అంటూ సీటులో నుంచి లేచి బైటికి నడిచాడు అజిత్.

''మీకు బాగా ట్రబుల్ ఇస్తున్నాను'' అంది హారిక కారెక్కి కూర్చుంటూ.

''నాకేం కష్టం లేదులెండి'' అని ఆమె వైపు చూసి కొత్తగా వచ్చారు. వాతావరణం మార్పు వల్ల అనారోగ్యం కలిగి వుంటుంది. ఈ సమ యంలో ఒక్కరే వుంటే కాస్త ఇబ్బందిగా వుంటుంది. మీరు ఒక్కరే వుంటున్నారా?'' అడి గాడు అజిత్.

''లేదు. చెన్నైనుండి వచ్చిన ఆవిడ అలివేలని సైంటిస్ట్.. ఇండియాలో మాకు తెలిసిన వాళ్ళద్వారా ఆమెను కాంటాక్ట్ చేసి ఆమెతో మాట్లాడే ఇక్కడికి వచ్చాను. ఆమె వయసు ముప్పై ఐదేళ్ళు... ఒక కొడుకు వున్నాడు. భర్త చెన్నైలో బ్యాంక్ ఆఫీసర్... సంవత్సరం అయ్యాక చెన్నై వెళ్ళిపోతుందామె...'' అని ఆమె గురించి వివరాలు చెప్పింది.

''పోన్లెండి. ఒకే దేశస్థులవ్వడంవల్ల మీకు అంత కష్టం వుండదు'' అన్నాడు అజిత్.

''ఏం, మీరు ఒక్కరే వుంటు న్నారా?'' అడిగింది హారిక.

''లేదు. ముగ్గురం మూడు దేశాల వాళ్ళం.. ముద్దుగా మాట్లాడుకుం టాము. పోట్లాడుకుంటాము.. ఆటలా డుకుంటాము'' అన్నాడు అజిత్ స్నేహి తులను తలచుకొని సంతోషంగా.

మాటల్లోనే హాస్పిటల్ వచ్చింది. ముందుగా అపాయింట్‌మెంట్ లేకున్నా శ్యామ్‌తో పాటు చదివిన డాక్టరవ్వడం వల్ల అజిత్ అంటే అతడికి అభిమానం. అందువల్ల అతడికి ఏ ఇబ్బంది వుండదు డాక్టర్ని కలిసేందుకు. 'ఇక్కడ నీకే అవసరంవ చ్చినా నేనున్నానని మరచిపోకు'' ఇండియా నుండి వచ్చిన కొత్తలోనే అజిత్‌కు చెప్పాడా డాక్టర్.

-ఇంకావుంది

అధ్యాత్మ రామాయణం

- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

యుద్ధకాండ 207

కౌసల్యా మాతకు నమస్కరించాలి! ఆ తర్వాతనే మేము మా మా రాజ్యాలకు చేరు కొంటాం! ప్రభూ! మాకు ఇందుకనుజ్ఞ ఇవ్వ వలసినది.

రాముడు వారి మాటను మన్నించాడు. సుగ్రీవాది వానరులతోపాటు పుష్పకాన్ని అధి రోహించవలసినదన్నాడు. విభీషణా! హనుమా! అందరు పుష్పకంపైకి రండి! అని ఆహ్వానించాడు.

సుగ్రీవుడు తన సైన్యంతో, విభీషణుడు మంత్రులందరితో ఇలా అందరూ వెంట వెంటనే పుష్పకాన్ని అధిరోహించారు.

కుబేరుని వాహనం పుష్పకం. అందరు అధిరోహించగానే రాముడు ఆజ్ఞాపించాడు. పుష్పకం ఆకాశంలోకి ఎగిరింది. (ఎందరు కూర్చున్నా అందరికి పుష్పకంలో చోటు లభి స్తుంది. రాముని సంక ల్పబలంవల్ల పుష్పకా నికి వ్యాపించే గుణం కలిగింది)

ఆ పుష్పకం నలువైపులా హంసలున్నాయి. ఆ హంసలమధ్య విమానంలో ఉన్న రాముడు అపర చతుర్ముఖునిలా ప్రకాశిస్తు న్నాడు.

సీతా సమేతుడైన రామచంద్రుని కార ణంగా, రామానుజుడు తనపై ఆసీనుడై ఉండగా, రాముని సౌందర్యం సంతోషానికి మూలం కాగా, కుబేరుని తపఃఫలంగా లభిం చిన భాస్కర ప్రభలతో వెలిగే పుష్పకం, మరీ మరీ అందాలొలికించుకొంటూ అయోధ్యావై పుగా పయనించింది.

::ఇది అధ్యాత్మ రామాయణాంతర్గతం, ఉమామహేశ్వర సంవాదంలోని, యుద్ధకాం డలో త్రయోదశ సర్గ.

చతుర్థశ సర్గ

శ్రీ మహాదేవులవారిలా అన్నారు:-

ఓ పార్వతీ! విను! పుష్పక విమానంలో ప్రయాణం; అన్ని వంకల దృష్టి సారిస్తూ రఘునందనుడు చంద్రముఖి అయిన మైథిలీ సీతతో ఇలా అన్నాడు.

త్రికూట పర్వతంపైన కాంతిమంతంగా వెలిగే ఈ లంకాపురిని చూడు. ఈ రణరంగ మంతా మాంసం ముద్దలతో బురదగా బుర దగా వుంది. ఇక్కడే వానరులకు రాక్షసులకు ఘోరంగా పోరు జరిగింది. ఇక్కడ రాక్షస రాజు నావల్లనే నేల కొరిగాడు. కుంభకర్ణ, ఇంద్రజిత్తు తదితర రాక్షస వీరులందరు ఇక్కడే ప్రాణాలు కోల్పోయారు. నిండా నీటితో కనిపిస్తున్న ఈ సముద్రం మీద నేనే సేతువు నిర్మించాను. ఇది సేతు బంధం (ఇప్పు డిది రామసేతువు) అనే పేర త్రిలోకాల్లో పూజింపబడుతూ కానవస్తున్న సాగర తీర్థం ఇది పవిత్ర మైంది, శ్రేష్ఠమైంది. దర్శనంవల్లనే పాపాలు హరించే తీర్థమిది. ఇక్కడే రామేశ్వరుడనే పేర శంకర భగవానుని నేను ప్రతిష్ఠాపించాను. ఇక్కడే మంత్రులతో వచ్చి విభీషణుడు శరణా గతి పొందాడు. ఇదే ఇదే చిత్ర చిత్రారణ్యా లతో నిండి వున్న సుగ్రీవుని నగరం కిష్కింధ.

అక్కడ పుష్పకమాగింది. సీతాదేవి యిష్టప డగా సుగ్రీవుడు రామాజ్ఞ తలదాల్చి తార తది తర వానరస్త్రీలను తీసికొనివచ్చాడు. వారంద రితో వేగంగా విమానం ఆకాశంలోకి ఎగి రింది. అప్పుడు రాఘవుడు సీతతో ఇలా అన్నాడు.

చూడు సీతా! ఇది ఋష్యమూక పర్వతం ఈ సమీపంలోనే వా సంహారం జరిగింది.

ఇదే పంచవటి! ఇక్కడే నేను ఎందరో రాక్ష సులను సంహరించాను. శుభముఖీ! ఇవే అగస్త్య- సుతీక్షణ మహర్షుల ఆశ్రమాలు. చూడు వరవర్ణినీ! వీరే తాపసులు; అంతటా కనిపిస్తున్నారు. ఇదిగో ఈ పర్వతం- చిత్ర కూటం ప్రకాశిస్తున్నది. ఇక్కడే సుమా!

- ఇంకావుంది

సోమవారం 22 డిసెంబర్, 2014

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ జయ, దక్షిణాయనం
హేమంత ఋతువు - మార్గశిరమాసం

తిథి: బహుళ అమావాస్య ఉ.7.17 త. శు। పాడ్యమి రా.తె.6.00 నక్షత్రం: మూల రా.8.34 వర్జ్యం: రా.7.01 నుండి 8.34 వరకు తిరిగి రా.తె.5.45 నుండి దుర్ముహూర్తం: మ.12.24 నుండి 01.12 వరకు తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
  ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
  వ్యాపారంలో విశేష లాభాన్ని ఆర్జిస్తారు. మంచి వారితో స్నేహం చేస్తారు. అంతటా సుఖమే లభి స్తుంది. ఆకస్మిక ధనలాభముంటుంది. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
  నూతన కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు. ధనలాభముంటుంది. కుటుంబ సౌఖ్యం సంపూ ర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులతో కలిసి వినో దాల్లో పాల్గొంటారు. శుభవార్తలు వింటారు.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)**
  మానసిక చంచలంతో ఇబ్బంది పడతారు. సోమ రితనం ఆవహిస్తుంది. పిల్లలపట్ల మిక్కిలి జాగ్రత్త వహిస్తారు. కొన్ని మంచి అవకాశాలను కోల్పో తారు. ప్రయత్న కార్యాలందు దిగ్విజయాన్ని పొందుతారు.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
  కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనం వహించుట అన్ని విధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అనవసర ధనవ్య యంతో ఋణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
  మానసికాందోళనతో ఉంటారు. ఆకస్మిక ధనలాభం కలిగే అవకాశముంది. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ఆరోగ్యం గూర్చి ప్రత్యేక శ్రద్ధ అవసరం. వృత్తి, ఉద్యోగ రంగంలో అభివృద్ధి ఉంటుంది.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
  అద్భుతమైన అవకాశాలు లభిస్తాయి. అన్నింటా విజయాన్నే సాధిస్తారు. బంధు మిత్రులు కలు స్తారు. శుభవార్తలు వింటారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లోనివారికి అభివృద్ధి ఉంటుంది.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
  ఋణప్రయత్నాలు ఫలిస్తాయి. అనారోగ్య బాధ లుంటాయి. బంధు, మిత్రులతో వైరమేర్పడ కుండా జాగ్రత్తపడుట మంచిది. ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం వుంది.గృహంలో జరిగే మార్పులవల్ల సంతృప్తినికలుగచేస్తాయి.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
  బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది. ఆర్థిక ఇబ్బందులనెదుర్కొం టారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. మాన సికాందోళనతో కాలం గడుస్తుంది.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
  ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు మిత్రులతో జాగ్రత్తగా మెలగాలి. కలహా లకు అవకాశముంటుంది. ధననష్టాన్ని అధిగమిం చుటకు ఋణప్రయత్నం చేస్తారు.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
  ఆకస్మిక ధనలాభయోగముంటుంది. కుటుం బంలో సంతృప్తికరంగా ఉంటారు. పేరు, ప్రతి ష్ఠలు లభిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాద లుంటాయి. అంతటా అనుకూల వాతావరణమే ర్పడుతుంది.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
  కుటుంబ కలహాలు దూరమవుతాయి. ఆటంకాలె దురవుతాయి. దానితో అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా ఉండాలి. అందరితో స్నేహంగా నుండుటకు ప్రయత్నించాలి.

మంచిమాట

కర్మయోగం

శాస్త్రవిహితమైన ఉత్తమ క్రియనే కర్మ అంటారు. సమభావం కలిగి ఉండడాన్ని యోగం అంటారు. కాబట్టి మమతాసక్తులు, కామక్రోధాలు, లోభమోహాలు మొదలై నవి లేకుండా సమభావంతో వర్ణాశ్రమ స్వభావ పరిస్థితుల్ని అనుసరించి శాస్త్ర విహిత కర్తవ్య కర్మల్ని ఆచరించడాన్నే కర్మయోగం అంటారు. దీన్నే సమత్వయోగం, బుద్ధి యోగం, తదర్థకర్మ, మదర్థకర్మ, మత్కర్మా అని కూడా అంటారు.

కర్మయోగ సాధన పరిపూర్ణ స్థితికి చేరుకోగానే సాధకునికి పరబ్రహ్మ పరమాత్మ ప్రాప్తి కలుగుతుంది. శాస్త్ర విహితమైన, భిక్షాటనము, యుద్ధము, వ్యవసాయం, వ్యాపారం, సేవలు మొదలైన కర్మలు సమభావ యుక్తాలవటంవల్ల తక్షణమే సంసారం నుండి ఉద్ధరింపబడతారు. ఎందుకంటే కల్యాణ సాధనలో కర్మకంటే భావమే ప్రధానం.

ఈ కర్మయోగంలో కొద్దిపాటి సాధన చేసినా, నిర్వాణ బ్రహ్మ ప్రాప్తి కల్గుతుంది. అంటే సమత్వమందు నిశ్చల స్థితిని పొంది అసమభావంతో అంత్యకాలం వరకూ ఏ కొంచెమైనా కర్తవ్య కర్మల్ని చేస్తే తప్పక బ్రహ్మప్రాప్తి కలుగుతుంది. ఆ కర్మలన్నీ నిష్కామ భావంతో ఆచరింపబడాలి. అలా కాక సకామ భావంతో మహాయజ్ఞాలు, దానాలు, తపశ్చర్యలు, తీర్థయాత్రలు, వ్రతాలు, ఉపవాసాలు మొదలైన కర్మలు వేల సంవత్సరాలు చేసినా నిష్ఫలమే. అవి జీవిని సంసారం నుండి ఉద్ధరింపలేవు. కాబట్టి నిష్కామ భావంతో సాధకుడు స్వల్ప సాధన చేసినా ఉద్ధరింపబడుననుటలో ఏ మాత్రం సందేహం లేదు.

అతడు ఈ జన్మలో కానీ జన్మాంతరంలో కానీ ఉద్ధరింపబడవచ్చు. ఎందుకంటే ఈ స్వల్ప సాధన క్రమంగా వృద్ధిచెంది సంపూర్ణ స్థితికి చేరినప్పుడే అతడు ఉద్ధరింపబడ తాడు. కాబట్టి వెంటనే ఫలితాన్ని పొందాలనుకునేవారు తత్పరత, ఉత్సాహాలతో సంపూర్ణంగా సమత్వస్థితిని పొందటానికి ప్రయత్నించాలి.

కర్మయోగ సాధనకు ఎన్నటికీ బీజనాశనమనేది ఉండదు. ఉదాహరణకు ఒకడు తన పొలంలో విత్తనాలు చల్లి వాటిని కాపాడలేకపోయినా, వాటిని నీటితో తడుప కన్నా అవి నష్టపోవడం జరుగుతుంది. కానీ కర్మయోగం సాధన చేయటానికి మొద లుపెట్టినవాడు దానిని పూర్తిచేయకముందే మధ్యలో మానివేసినా ఆ సాధన వ్యర్థం కాదు. ఆ సాధనా ఫలములు సాధకుని అంతఃకరణంలో స్థిరమై తదుపరి జన్మలో మళ్లీ అతన్ని సాధనలో నిమగ్నం చేస్తుంది. కాబట్టి కర్మయోగ సాధనకు ఎన్నడూ బీజ నాశనం ఉండదు.

ఏదైనా రోగం సంభవించినపుడు రోగి తన రోగ నివారణ కొరకు ఔషధాన్ని సేవి స్తాడు. ఒక్కోసారి ఆ ఔషధం రోగంపై పనిచేయకపోగా వికటించి మరిన్ని కొత్త సమ స్యల్ని సృష్టించడానికి కారణం కావచ్చు. కర్మయోగ సాధన అలా కాదు. దీనివల్ల ఎటు వంటి విపరీత పరిణామాలూ సృష్టింపబడవు. స్వార్థరహితమైన యజ్ఞ, దాన, తపో కర్మలు ఆచరించుటలో ఎట్టి లోపం జరిగినా విపరీత ఫలరూపమైన హాని జరుగదు. సకామ భావంతో చేసే కర్మల్లో ఏదైనా లోపం జరిగినా అసంతృప్తి వల్ల సాధకునికి హాని కలిగినా కలుగవచ్చు కానీ నిష్కామ భావంతో చేసే కర్మ యోగ సాధనలో అలా ఎన్నటికీ జరుగదు. ఈ జన్మలో సాధకునికి కర్మయోగంలో పరమపద ప్రాప్తి కల్గింప కున్నా అతనికి పూర్వకృత పాపాల ఫల స్వరూపాలలు ఈ జన్మలో సంభవించిన అనుషంగిక హింసాదుల ఫల స్వరూపాలును అయిన తిర్యగ్యోనులలో జన్మించుట కానీ నరకయాతనల ప్రాప్తి కానీ కలుగదు. పూర్వ శుభకర్మల ఫలరూపాలయిన ఇహ పరలోక సుఖానుభవాలను పొందియే తీరగలదు. అతడు పుణ్యాత్ములు చేరుకొనే ఉత్తమ లోకాల్ని చేరి అచ్చట అనేక సంవత్సరాలు నివసించి మరల పవిత్రమైన శ్రీమంతుల ఇళ్ళలో జన్మించగలడు లేదా యోగుల వంశంలో జన్మించవచ్చు. పూర్వా భ్యాస ప్రభావంవల్ల మరలా సాధను కొనసాగిస్తాడు.

-కరణం రాజేశ్వరరావు

సత్యభామ

49

బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 589 మాటాట



ఆధారాలు

ఆధారాలు: 85
అడ్డం
2. ఓర్పు , సహనం
4. నవనీతం
5. గుఱ్ఱము
7. పిరుదు
9. గ్రంథి
11. సుమారు
13. ఆసరా , వెన్న
14. నేత రాతి బొమ్మ
15. మొలకెత్తె విత్తనం

నిలువు
1. కోపం
2. గతించిన సరికొత్త రోజు
3. పచ్చదనం
6. తల క్రిందయినసిగ్గు
8. చెదరిన బంజరుభూమి
10. ఎల్లప్పుడూ
12. సూర్యుడు
13. ఆలోచన

మాటాట - 588 సమాధానం

1 స్ర	వం	2 తి		3 ఖ	ర్త	4 డి
ర్థ		య్య		హ		రా
5 ర	6 వ	న		7 మ	ఖ్ఖ	
	ర		8 స్వా	తి		9 ఖి
10 పం	భా		ర్థ		11 బ	ర్థ
క			12 ము	మ్మ	రు	లు
13 ము	మ	గు			ఉ	

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

మధురం.. మధురం..

మధురాధిపతి నిలయం

"భూత భవ్య భవత్ప్రభుః" - అని విష్ణు సహస్రం చెబుతున్న పరమాత్మనే శ్రీముఖనామ సంవత్సర, దక్షిణాయనం, వర్షఋతువు, శ్రావణ బహుళ అష్టమి, రోహిణీ నక్షత్రం నాలుగో పాదము, బుధవారము, అర్ధరాత్రివేళ మధుర కారాగారములో యదువంశములో దేవకీ, వసుదేవులకు పుత్రుడుగా జన్మించాడు. నిరాకారుడు నిస్సంగుడు అయిన భగవంతుడే సాకారుడుగా తన భక్తుల రక్షణార్థం తనను తాను సృజియించు కుంటూనే ఉంటాడు. ధర్మానికి హాని కలిగినప్పుడల్లా అవసరానికి తగ్గ రూపు ఏర్పరుచుకొని ఆ రూపానికి తగిన నామాన్ని ధరించి దివి నుంచి భువికి ఏతెంచువాడే పరమాత్మ. అలా వచ్చిన పరమాత్మ ఎనిమిదవ అవతారమే శ్రీకృష్ణావతారం. ఈ శ్రీకృష్ణుడు లీలావినోదుడు. తాను ఎదురుగా కనిపిస్తూనే ఇతరులను భ్రమకు లోను చేసేవాడు. అంతా తానే అయి కూడా వేర్వేరు అనే భావాన్ని కలుగచేసేవాడు. కర్త కర్మ క్రియ అన్నీ తానే అయి ఏమీ కానివాడిలా గోచరమయ్యేవాడు. కోరికలను పుట్టించేవాడు, వాటిని తీర్చేవాడు, వాటిని తీర్చనివాడు కూడా ఆ పరమాత్మే. విచక్షణ అనే బుద్ధిని కలుగ చేసి కోరికలకు దాసులను చేసి వాటిని తీర్చే క్రమంలో వివిధ దేవీదేవతలను ఉపాసించేటట్లు చేసేవాడు. ఎవరికి ఏ దేవతపై ప్రీతి కలిగినా ఆ దేవతానుగ్రహం కలిగేలా చేయించే వాడూ ఆ పరమాత్మ. అటువంటి పరమాత్మనే వేదోపనిషత్తుల సారభూతమైన భగవద్గీతలో స్వరమూ తానైన పరమాత్మ తన విభూతులను చెబుతూ సకల ప్రాణి అంతరంగంలోని ఆత్మను నేను, అంతేకాదు రుద్రులల్లో శివుడను, యక్షరక్షసులల్లో కుబేరుడను, ఆదిత్యులలో విష్ణువును, జ్యోతిర్మయ వస్తువుల్లో సూర్యుడను అంతేకాదు మహర్షులలో భృగువునీ, వాఙ్మయంలో 'ఓం'కారాన్ని వాయువును, నీటిని, కాంతిని నేను కానిది ఏది లేదంటాడు పరమాత్మ. నదులన్నీ ఏవిధంగా సముద్రంలో కలుస్తాయో అదేవిధంగా మీరు ఏవిధంగా ఎన్ని మార్గాలల్లో ప్రయాణించినా, ఏ దేవతను ఉపాసించినా చివరకు అవి అన్నీ నన్నే చేరుతాయి.

ఆపదలల్లో చిక్కుకున్నవాడు, జిజ్ఞాసువు , జ్ఞాని, సంపదను కాంక్షించేవాడూ, ఈ నలుగురే నన్ను తెలుసుకోవాలని ఆరాటపడతారంటాడు. వారిలో జ్ఞాని ఉత్తమమైనవాడు. ఈ జ్ఞాని నాకు అత్యంత ఇష్టుడని అంటాడు. తాను సృజియించిన లోకంలో సర్వమూ తానే అయినా కర్మపాశబద్ధులను చేస్తూ వారి వారి వివేకంతో నా గురించి తెలుసుకొన్న వారికి తామరాకుపై నీటిబొట్టులాగా ఉండడమనే నడతనునేర్పి ఈ సంసారసాగరాన్ని ఈదడంలో తోడు నీడగా ఉంటూ ఎల్లవేళలా, సర్వావస్థల్లోనూ నేను సంరక్షిస్తాను అని చెప్పిన భగవంతుణ్ణి సర్వ పాపములను 'కర్షణము' (లాగివేయుట) చేసి అనుగ్రహించేవాడు అని మనమందరం కీర్తించాల్సిందే కదా. కనుకనే వ్రజభూమిలో శ్రీకృష్ణుని కొలిచిన కాంతలందరూ శ్రీకృష్ణునినే పొందారట. కైలాసంలోని సతీదేవి దక్షుని యాగకుండంలో తన శరీరాన్ని త్యాగం చేసి తిరిగి ఉమాదేవిగా పుట్టి కాత్యాయని వ్రతం చేసి తిరిగి పరమేశ్వరుడినే తన పతిగా పొందిందట. అలానే చిన్ననాటి నుండి శ్రీకృష్ణుని సదా స్మరించే రుక్మిణీదేవి కాత్యాయని వ్రతం చేసి, ఆ వ్రతసమాప్తి రోజే భగవంతుడైన శ్రీకృష్ణుడిని పొందిందట. ఈ విషయాలన్నీ తెలుసుకొన్న విల్లి పుత్తూరులోని విష్ణుచిత్తుని కుమార్తె తిరుప్పావై పాశురాలు అనుసంధిస్తూ ధనుర్మాస వ్రతం చేసి ఆ రంగ రంగని పొందిందట.

కనుక ఎల్లవేళలా భగవంతుని నామాన్ని అనుసంధానిస్తూనే ఉన్నా భగవంతుడే మానవ రూపంలో పుట్టి నడయాడిన మధురను దర్శించడం పుణ్యప్రదం. ఆ మధురాధిపతి నడిచిన నేలను బంగరు భూమిగా అభివర్ణిస్తారు కృష్ణభక్తులు. ఆ మధుర నేటి ఆగ్రా పట్టణానికి సుమారు 50 కిలోమీటర్లు దూరం నెలకొంది. అక్కడే కృష్ణమందిరం నెలకొని ఉంది. అంతేకాదు మధుర నగరంలో 5000 సంవత్సరాల క్రితం నాటిదిగా చెప్పబడుతున్న ఓ కోట కూడా భక్తులను, జిజ్ఞాసువులను ఆకర్షిస్తోంది. ఇది ఇపుడు బాగా శిథిలమైపోయింది. శ్రీకృష్ణుడు జన్మించింది చెరసాలలో. దానిని 'వ్రజ్' భూమి అని పిలుస్తారు.

ఇక్కడే దేవకీ వసుదేవులను ఉంచిన కారాగారం ఉండేది. ఈ ప్రాంతంలో హిందువులు ఇప్పటికీ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తుంటారు. ఆధునిక సొబగులతో అందంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో చూపరులను ఆకట్టుకుంటోందిప్పుడు.

ఈ మందిరంలో శ్రీకృష్ణుడు రుక్మిణీమాత కొలువైయ్యారు. ఇక్కడుండే గీతామందిరం శ్రీకృష్ణుడు అలనాడు చూపిన లీలలను కళ్లకు కడుతుంది. ఇక్కడ యమునానది మధుర నగరాన్ని తాకుతూ ప్రవహిస్తోంది. ఇక్కడే 17 మీటర్లు ఎత్తయిన సతీబురుజు ఒకటి ఉంది. యమునా నది తీరంలోనే అన్నాచెల్లెళ్ళ ఘాట్ ఉంది. అన్నాచెల్లెల్ళు ఈ ఘాట్‌లో స్నానాదికాలు చేస్తే, వారి పాపాలు పోయి స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందంటారు. ఇక్కడకు సమీపంలోనే విశ్రామ్ ఘాట్ ఉంది. శ్రీకృష్ణ బలరాములు విశ్రాంతి తీసుకున్న ప్రదేశమని అంటారు. వారి పాదాలు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. మధురకు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో 'గోకులం' ఉంది. శ్రీకృష్ణుడు గోప బాలురతో క్రీడించిన స్థలంగా దీనిని చెబుతారు. బాలుడైన శ్రీకృష్ణుడు తనను చంపవచ్చిన పూతన అనే రాక్షసిని సంహరించిన చోటు ఇదే నంటారు. గోకులంలో రాధాకృష్ణ, బలరామ మందిరాలున్నాయి. శ్రీకృష్ణుడు బాల్యక్రీడలు సల్పిన ప్రాంతం బృందావనమిది. ఇప్పటికీ శ్రీకృష్ణ భగవానుడు రాత్రివేళల్లో తన నెచ్చెలులతో ఇక్కడ విహరిస్తారనీ, ఆ కారణంగానే రాత్రివేళలో బృందావన సందర్శన నిషిద్ధం చేసారు.

మన్ను తింటున్నావని కోపగించుకొనే తన తల్లికి పరబ్రహ్మను నేనే అని చెప్పడానికి ఆ తల్లికి తన నోటనే 14 భువనాలను చూపించాడు ఆ చిన్ని కృష్ణుడు. ఆ పుణ్యస్థలమే 'మహావన్'. ఇది మధురకు ఏడు కిలోమీటర్లు దూరంలో ఉంది.

మధురకు 40 కిలోమీటర్లు దూరంలో 'బర్సానా' గ్రామం ఉంది. రాధాదేవి పుట్టినస్థలమిదేనంటారు. ఇక్కడే అష్టసఖులు గల రాధాకృష్ణుల ఆలయం ఉంది. ఈ ఆలయంలో లలిత, విశాఖ, చిత్ర, ఇందులేఖ, చంపకలత, రంగదేవి, తుంగవిద్య, సుదేవిలు అష్టసఖులుగా దర్శనమిస్తారు. మధురలో మరో ముఖ్యమైన మందిరంగా బాంకి బీహారిక మందిరం ప్రసిద్ధి చెందింది. ఈ మందిరాన్ని 1590వ సంవత్సరంలో నిర్మించారు. శ్రీకృష్ణుడు భామలతో రాసక్రీడలు జరిపిన రమ్యప్రదేశాన్ని నిజ బిహారి వనం అని పిలుస్తారు.

ఆ బాలగోపాలాన్ని ఇంద్రుని దుచేష్టతకు ఎరకాకుండా కనిపెట్టి కాపాడిన గోవర్ధనగిరిధారి ఎత్తిన గోవర్ధనం మధురకు సమీపంలోనే ఉంది. ఇక్కడే మానస గంగ అనే పెద్ద సరస్సు ఉంది. సమీపానే మానసాదేవి మందిరం ఉంది. మానస గంగలో స్నానంచేసి, మానసాదేవిని పూజిస్తే గోహత్యా దోషం తొలగిపోతుందని అంటారు. ఇక్కడే లక్ష్మీనారాయణ మందిరం కూడా ఉంది. మధుర పరిసర ప్రాంతాలలోనే ధరణీ తీర్థం ఉంది. విశ్వామిత్రుడు యజ్ఞం చేసిందిక్కడే నంటుంది స్థలపురాణం. శివాలయం, పురాతన ఆంజనేయ ఆలయాలు కూడా ఇక్కడ భక్తులను ఆకర్షిస్తాయి. మధురను చూడడం, శ్రీకృష్ణుని స్మరించడం శుభప్రదం.

- హనుమాయమ్మ

విల్లిపుత్తూరులోని విష్ణుచిత్తుని ముద్దుల తనయ తాన్నున్న ఊరినే రేపల్లెగా భావించేది. తన చెలులనే గోపీజనులుగా అనుకొనేది. అలా అనుకునే కోవై - గోదాదేవి శ్రీవ్రతాన్ని ఆచరించా లనుకొంది. మాసాల్లో మార్గశిరం తానని చెప్పిన శ్రీకృష్ణుని తలుచుకుని వెంటనే ధనుర్మాసంలో తన చెలులకు హితబోధచేస్తూ రోజుకొక్క పాశురాన్ని పాడతూ సిరినోమునోచింది. నోము సమాప్తి చేస్తూ ఆ రంగరంగనితో అంగరంగ వైభోగంతో వివాహం చేసుకొంది. ఆ రంగనిలోనే ఐక్యమైంది. ఆ నాడు పాడిన ఆ తల్లి పాడిన పాశరాలనే నేడు ప్రతివైష్ణవా లయాల్లోనూ అనుసంధానిస్తూ గోదా వ్రతం చేస్తున్నారు భక్తజనసందోహమంతా. ఆ భక్తజనులు ఆలపించే కీర్తనలు నాడు మాలదాసరి ఆలపించిన కైకశిరాగాలాపనను అనుభవంలోకి తెప్పిస్తాయి. ఈ నాడు కూడా తన భక్తులను అలరించేందకు, వారి కోరికలను తీర్చేందుకు వైకుంఠం నుంచి లక్ష్మీ వల్లభుడైన రంగడు సతీ సమేతుడై వచ్చినిల్చున్న అనుభూతిని పొందుతున్నారు రంగని భక్తులు.

జానాబాయి సేవలో జనార్దనుడు

సర్వజన ప్రియుడైన పండరీపుర పాండురంగ విఠలుని సందర్శించి పూజించి ధన్యులు అయిన వారు ఎందరో. భక్తతుకారాం, ఏకనాథుడు, సక్కుబాయి ఆ కోవకు చెందినవారే. వారి సరసన జనాబాయి స్థానం సంపాదించుకుంది. ఈమె జననం భాగ్యవంతులు లేక విజ్ఞాన కుటుంబాలలో ఏర్పడలేదు. జనాబాయి తండ్రి దామా అతి సామాన్య వ్యవసాయ కుటుంబ నేపథ్యంనుంచి వచ్చినాడు. పవిత్ర గోదావరి నదీతీరంలో వుండే గర్గఖేడ్ ఈయన స్వగ్రామము. కాలం కలిసి రాక ఆర్థికంగా ఉన్నతంగా వున్నవాడు కాకపోవడం వలన తన కూతురు అయిన జనాబాయిని పండరీపురంలోని దామాసేర్ ఇంట్లో పనిమనిషిగా కురిర్చాడు. దామాసేర్ ఏ రోజూ జనాబాయిని పనిమనిషిగా చూడలేదు.

ఇంటి మనిషిగా చూసాడు. పరమ భాగవతోత్తముడు అయిన నామదేవుడు దామాసేర్ కుమారుడు. ఆయన ఆప్తమిత్రుడైన జ్ఞానదేవుడు ఎప్పుడూ నామదేవుని ఇంట్లో వుంటూ పాండురంగ విఠలుని భజనలు చేస్తూ అభంగములు రచించేవాడు. నామదేవుని, జ్ఞానదేవుని జనాబాయి దగ్గరుండి గమనించుట వలన ఆమెకు పాండురంగ విఠలునిపై అవ్యాజనురాగములు అలౌకిక భక్తి ఏర్పడినవి. జనాబాయి మనసు ఏ పని చేస్తున్నా పాండురంగనిపై మరలేది. అనతి కాలంలోనే ఆమెకు పాండురంగ విఠలునిపై అనితర మరియు అచంచలమైన భక్తి కుదిరింది. ఆమె భక్తికి పారవశ్యుడైన పాండురంగడు ఆమెకు తరచుగా కనపించేవాడు. ఆమెతో కలిసి ఆడేవాడు పాడేవాడు. ఆమెకు ఇంటి పనిలో పాండురంగడు సహాయము చేసేవాడు అంటే అతిశయోక్తి కాదు. ఒకరోజు జనాబాయి గోధుమలు తిరగలిలో పోసి విసురుతోంది. పాండురంగడుని గూర్చి అభంగములు పాడుతోంది. తిరగలి పిడిపై చేయివేసి ఆనందంగా తిప్పుతూ వుంది. ఆమె భక్తి పారవశ్యమునకు పులకితుడు అయిన పాండురంగ విఠలుడు ఆమె ఎదురుగా కూర్చుని తిరగలి తిప్పుతున్న ఆమె చేతిపై తన చేతి నుంచి తిరగలి తిప్పసాగాడు. పరమాత్ముని చేతి స్పర్శ ఆమెకు పరమానందం కలిగించింది. జగన్నాధుని కాంచిన మరక్షణం ఆమె ఇహలోక బంధాలకు ఈతి బాధలకు అతీతంగా వుండాలని నిర్ణయించుకుంది.

కాని జగన్నాటక సూత్రధారి ఆమె భక్తి తీవ్రతను స్థాయిని గమనించదలచినాడు. కాని ఇందులో పరమార్థము ఏమంటే భక్తులు, భక్తులు కాని వారి స్థాయిలు ఆయనకు తెలియనివి కావు. ఆమె భక్తి స్థాయిని ప్రపంచమునకు తెలియజేయదలచుకొనినాడు. ఇటువంటి పరీక్షకు ఎదురు నిలబడగలిగినపుడు భక్తి పరిపక్వ దశకు చేరుకుంటుంది. ఒక పర్యాయము పాండురంగ విఠలుడు జనాబాయితో కలిసి పిండి తిరగలిలో విసురు తున్నాడు. అపుడు ఆ వనమాలి తన కౌస్తుభ హారమును అక్కడే వదిలేసివెళ్లిపోయాడు. ఏమీ తెలియని వానిలాగా ఆలయంలో కొలువైయ్యాడు ఆ పరంధాముడు. సాయం సమయం కాగానే ఆలయ అర్చకులు యధా విధిగా విఠలునికి పూజ నిర్వహించదలచి ఆలయ ద్వారము తీయగానే విఠలుని కౌస్తుభ హారం మాయ మగుట గుర్తించారు. ఈ విషయం వెంటనే గ్రామ పెద్దకు తెలియజేసారు. ఎ వరో దొంగలు గుర్తించాల్సిన అగత్యం గ్రామ పెద్దకు కుదిరింది. ఆయన పండరిపురంలో ప్రతి గృహమును తన గృహముతో సహా వెదకమని తన కింది ఉద్యోగులకు పురమాయించాడు. వారు ప్రతి గృహమును తనిఖీ చేస్తూ నామదేవుడి ఇంటి ముందుకు వచ్చారు. అయ్యా ప్రతి ఇల్లు తనిఖీ చేయమని అధికారుల ఆజ్ఞ తమరు అనువతిస్తే మేము తనిఖీ ప్రారంభించెదమని ఉద్యోగులు అనగానే నామదేవులవారు తమ సమ్మతి తెలిపారు.

నామదేవుని గృహంలో ప్రతి గది తనిఖీ చేస్తూండగా జనాబాయి గదిలో కౌస్తుభ మణిహారం దొరికింది. వచ్చిన ఉద్యోగులు జనాబాయి తప్పక దొంగతనం చేసిందని నిశ్చయించుకున్నారు. అప్పుడు జనాబాయి అ య అయ్యా! ఇందాక విఠలదేవుడు ఇక్కడే వుండినారు. పొరపాటున ఇక్కట మరిచి వెళ్లినారేమో అని ఆమె అనగానే ఉద్యోగులు నవ్వుకుంటూ ఆమెను ఈడ్చుకుంటూ గ్రామ పెద్ద వద్దకు కొనిపోయారు.

జనాబాయి మాటలు విశ్వసించని గ్రామ పెద్ద ఆమెకు కొరత శిక్ష విధించాడు. ఏ రీతిన ఆయినా తనకు ఇహలోకంనుండి ఈ ఈతి బాధలనుండి ముక్తి లభిస్తున్నందుకు జనాబాయి ఆనంద పరవశురాలు అయింది. ఆమెకు కొరత వేసే రోజు రానే వచ్చింది. ఆమెను కొరత వేయుటకు శూలంలా వుండే ఇనుప వస్తువు వైపుకు తీసుకుని వస్తున్నారు. ఆమెలో ఏమరుపాటుగా అయినా తొణుకు బెణుకు లేదు. ఆమె శూలాయుధం వద్దకు చేరుకోగానే ఆ శూలాయుధం హిమము కలిగినట్టు కరిగిపోయింది. ఆమెను కొరత వేయుటకు వచ్చిన ఉద్యోగులు ఈ సంఘటన చూడగానే బిత్తరపోయారు. జనాబాయికి వచ్చిన కష్టమునకు చూచి ఆమెకు మద్దతుగా వచ్చిన భక్త జనావళికి ఈ సంఘటన సంభ్రమ ఆశ్చర్యములకు గురి చేసింది. జనాబాయికి జై పాండురంగ విఠలునికి జై అన్న నినాదములతో మారోమోగినవి. విఠలుని జగన్నాటకమును గుర్తించిన గ్రామ పెద్ద ఆమెను ఉచిత రీతిని సత్కరించి ఆమె ప్రసన్నతతను చూరగొన్నాడు. కొంత కాలం తర్వాత విఠల నామస్మరణముతోనే ఆమె ఆ పాండురంగనిలో మమేకమైనది. భక్త సమాజమునందు జనాబాయి వంటి భక్తురాలు బహు అరుదు.

-వేదగిరి రామకృష్ణ

ఐశ్వర్యం ఇదే!

భగవద్గీత హిందువులకు పవిత్ర గ్రంథం. పరమ పవిత్రమైన ఈ గ్రంథాన్ని శ్రద్ధ, భక్తి భావాలతో చదివి మానవుడు తన కర్తవ్యాన్ని గుర్తించి, పరోపకార భావంతో, యుక్తాయుక్త విచక్షణతో ప్రవర్తించి, జీవితం సార్థకం చేసకోవాలన్నదే గీతావరణ రహస్యం.

గీత మానవుని మాధవుని స్థాయికి చేర్చి ముక్తిని ప్రసాదిస్తుంది. భవబంధాల్ని తొలగించి, ఆత్మసాక్షాత్కారమును కలిగించి ఆశీర్వదిస్తుంది. శాంతిని ప్రసాదిస్తుంది. గీత ముక్తి ప్రదాయక దివ్య గీత.

భారతీయ తత్త్వవేత్తలే కాదు, ఇంగ్లీషువారైన థామస్ కార్లైల్, ఎమర్సన్, వారెన్ హేస్టింగ్స్ మొదలైన మహామహులు కూడా గీతను ఏకంగా అనువాదం చేసి ప్రసిద్ధి చెందాడు. అడ్విన్ ఆర్నాల్డ్ గీతను పద్య రూపంలోరచించాడంటే గీత వైశిష్ట్యం, విశ్వసనీయత ఇట్టే బోధపడుతుంది.

వేదాంతం ఏ దేశంలో, ఏ భాషలో, ఏ మతంలో చెప్పినా ఈశ్వరుడు, మానవుడు, ప్రకృతి పరస్పర సంబంధాన్ని గురించే చెబుతుంది. వారి మధ్య రహస్య సంబంధాన్ని ఆకళింపు చేసుకోవడం మాత్రం సులువు కాదు.

గీతలో ముఖ్యంగా ఈశ్వర రూపుడైన శ్రీకృష్ణుని బోధలు మనకు లభిస్తాయి. మానవుని మనసుకు అందని ఈశ్వరుణ్ణి భగవద్గీతలో నిర్వచించిన తీరు మరే ఇతర పవిత్ర గ్రంథంలో కాని, వాఙ్మయంలో కాని కనపడదు. ఈశ్వరుడు శ్రీకృష్ణుని అవతారంలో ఈ భూమ్మీదకి దిగి, తానేవరినో మానవునకు అనేక విధాలుగా తెలియజేస్తాడు.

నిజానికి ఈశ్వరుడు ప్రతి హృదయంలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు. కాని మానవుని మాటలకు, ఇంద్రియానుభవాలకు మనసుకు మించిన అనుభవంగా అవ్యక్తుడై వుంటాడు. ఈశ్వరుడు మానసాతీతుడు,రూపరహితుడు. ఆయన ఉనికి నిర్ధారించలేం. కారణం మనిషి జ్ఞానం మానసికం. ఈశ్వరుడు మానసాతీతుడు. ఆయన నీ హృదయంలో వెలుగుతున్నాడనే ఆ అనుభవం మనసుకు అందదు. ఆత్మస్వరూపుడైన పరమాత్మను దర్శించాలంటే నీ మనసు తెరను తొలగించాల్సిందే. అపుడే నీ దుఃఖం తొలగిపోతుంది. నీ స్వప్నాలు సాకారమౌతాయి. అంతటితో నీ అన్వేషణ ఆగిపోతుందని చెపుతుంది భగవద్గీత.

నీ ఆశకు, నీ ప్రశ్నలకు జవాబు ఈశ్వరుడొక్కడే. ఆయన్ని చేరుకుంటానే గాని శాశ్వత సుఖం లేదు, నీ సంశయాలు తీరవు. వీటన్నింటిని దాటి ఈశ్వరుణ్ణి ఎలా చేరుకోవాలో చెపుతాను విను అంటుంది. విశ్వమత గ్రంథం భగవద్గీత.

ఈశ్వరుణ్ణి చేరకోవడానికి దారి చూపేవారున్నారు, చేయూత ఇచ్చి సాయం చేయగల్గేవారున్నారు. కాని వారు ఆయన్ని మాత్రం ఇవ్వలేరు. జ్ఞానులు తమకు అంతా తెలుసంటారు. కాని వారు చెప్పింది మనకు అర్థంకాదు. భక్తుల విషయం కూడా అంతే వారికి భక్తి ద్వారా లభించిన ఆత్మ తృప్తిని, ఆ మహాదానందాన్ని మనకు అందివ్వలేరు. కనుకనే ఎవరికి వారు ఆ ఈశ్వరుని విశ్వసించి, శరణువేడి, సాధన ద్వారానే, ఆయన అనుగ్రహంతోనే దర్శనం సాధించాలి, శాంతిని పొందాలి.

భగవాన్ గీతలో ఈశ్వరుణ్ణి గురించి అనేక నిర్వచనాలు చెప్పాడు. నిజానికి మానవునికి అర్థం కావడానికే ఇన్ని నిర్వచనాలు చెప్పాడు. కాని, ఈశ్వరుని స్వభావం అనిర్వచనీయం, అనుభవించవలసిందే, ఐక్యం కావల్సిందే తప్ప ఆయన్ని గురించి తెలుసుకోవడం, నిర్వచించడం మానవునికి అసాధ్యమైన పని అనేది నిర్వివాదం.

ఐనా, భగవాన్ మహా యోగీశ్వరుడైన పార్థుని మానసిక స్థితిని గమనించి, ఈశ్వర నిర్వచనాన్ని అందించిన తీరును తెలుసుకుందాం. పరమాత్మ తత్త్వాన్ని గురించి శ్రీకృష్ణుడు ఇలా చెప్తాడు ఆరు శ్లోకాల్లో:-

''సర్వ భూత హృదయ స్థితుడైన ఆత్మను నేనే. సర్వ భూతాలకు అది మధ్యాంతాన్ని నేనే. ''ఈ జగత్తుకు తండ్రిని, తల్లిని, తాతను, వేద్యుణ్ణి, పవిత్ర ఓంకారాన్ని, ఋగ్‌సామ యజుర్వేదాల్ని'' ''అఖిల జగత్తు భావింపజేసే అర్కద్యుతి, చంద్ర కాంతి, అగ్నిజ్వలనం- ఇవన్నీ నా తేజస్సేనని తెలుసుకో.

''నేనే గతిర్భర్త ప్రభు, సాక్షి, నివాసం, శరణం, సుహృద్, ప్రభవం, ప్రలయం, స్థానం, నివాసం, బీజం, అవ్యయం.'' ''జ్యోతులన్నింటికి జ్యోతి, తమస్సుకు అతీతుడు, అతనే జ్ఞానం, జ్ఞేయం, జ్ఞాన గమ్యం, హృది సర్వస్వ విష్ఠితం.''

''నీళ్లలో రసం, సూర్యచంద్రుల్లో కాంతి, అన్ని వేదాలలోని ప్రణవం, ఆకాశంలోని శబ్దం, మనుష్యులోని పౌరుషం నేను.'' ఇలా ఈ మహనీయ శ్లోకాల భావాల్ని ఆకళింపు చేసుకుంటే ఆ మాట్లాడేది ఈశ్వరుడు కాక మరెవరౌతాడు?

అర్జునుడు శ్రీకృష్ణ భక్తుడు, సఖుడు ఆడుతూ, పాడుతూ తిరిగినవారు. అప్పటివరకు తన మనస్సులో స్థిరీకరించుకున్న స్నేహితుడు ఒక్కసారిగా చేసిన ఈ అద్భుత బోధ విని అర్జునుని మనోస్థితి ఎలా వుండి ఉంటుందో, ఊహించగలమా?

కనుక వేదాంత పరంగా, శాస్త్రపరంగా, నీతి పరంగా, బుద్ధిపరంగా, ఆశపరంగా, అవమాన భీతి పరంగా తన ప్రియ స్నేహితుణ్ణి లోకోత్తర కాంతికి కనులు తెరిపించుటయే శ్రీకృష్ణుని లక్ష్యం. గీతాసారం, అదే ఐశ్వర్యం, సర్వం.

- పింగళి పాండురంగరావు

దివ్య జనని శారదామాత

నాయనా! ఓర్మి వహించడము సద్గుణము. మానవుడు కూడా ధరిత్రివలె సహనము కలిగి యుండాలి. తృప్తికి మించిన సంపద లేదు. కష్టాలను సహనంతో ఎదుర్కొనడం కంటె మించిన సద్గుణము లేదు. కష్టాలు వస్తూ వుంటాయి. వంతెన క్రింద నీరువలె అవి సాగిపోతూ వుంటాయి. దేవునిపై విశ్వాసముంటే చాలు వారికి ఏ పరిస్థితులలోనూ హాని జరుగదు. భగవంతుడు మన సొంతము. ఈ సంబంధము సనాతనమైనది. త్రికరణ శుద్ధిగా మనము భగవంతుని ప్రేమిస్తే ఆయనను మనము పొందగలము. కేవలం ప్రేమవలెననె అది సాధ్యము. సర్వవ్యాప్తియైన భగవంతుని ఆర్తితో పిలువుడు, ఆయన తప్పక తన కరుణను వర్షింపజేస్తాడు అని చెప్పే శారదామాత రామకృష్ణుని ఇల్లాలు. ఇల్లాలిని సైతం దివ్యురాలిగా రామకృష్ణ భావించారు. ఆ తల్లి వంగ రాష్ట్రంలో జయరాంబాటి గ్రామంలో 1853 డిసెంబర్ 22న జన్మించారు. తల్లిదండ్రులు పేద వారయినప్పటికి భక్తినిష్ఠాతత్పరులు. తమ ఇంట్లో భగవత్పూజ జరిగే సమయాలలో బాల శారద నిశ్చలంగా కూర్చొని తన్మయురాలై ధ్యానంలో మునిగిపోయేది. శారదకు ఆరవ ఏట, ఇరవై మూడు సంవత్సరాల వయస్సు గల శ్రీరామకృష్ణునితో వివాహం జరిగింది. శ్రీ రామకృష్ణుడామెను ప్రశ్నిస్తాడీ విధంగా నన్నీ సంసార కూపంలోకి దింపడానికి వచ్చావా? లేదు లేదు, మీరెన్నుకున్న పారమార్థిక మార్గంలో మీకు సహకరించడానికే వచ్చాను అని శ్రీ శారదాదేవి చెప్పారు. ఆ సమయంలో ఆయన తన హృదయంలో ఒక అమృత కలశాన్ని ఉంచినట్లు ఆమెకు అనుభూతి కలిగింది. మార్వాడీ భక్తుడొకడు శ్రీరామకృష్ణునికి పదివేల రూపాయలు బహుకరిస్తే ఆయన నిరాకరించారు. ఆ భక్తుడపుడు శ్రీ శారదాదేవిని స్వీకరించమని ప్రాధేయపడతాడు. దానికామె నేను తీసుకున్నా వారి సేవకే వినియోగించాలి. కనుక నేను తీసుకున్నా శ్రీరామకృష్ణుడు తీసుకున్నట్లే లెక్క కదా! అని సున్నితంగా తిరస్కరిస్తుంది. ఇదే ఆధ్యాత్మిక బలం. ఇది ఆమె నిష్కళంక శీలానికి నిదర్శనం. 1872 జూన్ 5న శ్రీరామకృష్ణులు శ్రీ శారదాదేవిని జగన్మాతగా భావించి షోడశ పూజనాచరించారు. ఈ విధంగా సర్వజీవుల యందు ఈమెలోగల మాతృభావాన్ని జాగృతము చేశారు. శ్రీ శారదాదేవి నిరాడంబర జీవితము, నిస్వార్థత, మాతృవాత్సల్యం, కరుణ సాటిలేనివి. నిశ్శబ్ద ప్రార్థన, భక్తిత్పరతయే ఆమె జీవితం. ఈ సంసార క్లేశాలనుండి ఎందరికో ఆమె అనురాగం, శాంతిని చేకూర్చింది. భక్తి, జ్ఞాన, కర్మయోగాల పరిపూర్ణ సమ్మేళనమే ఆమె జీవితము. గృహిణిగా, పరిపూర్ణ సన్యాసినిగా, అనురాగ పూరిత మాతగా ఆదర్శ గురువుగా, ఆమె దర్శనమిస్తారు. స్వామి వివేకానందులచే రామకృష్ణ మిషన్ స్థాపింపచేసి, విద్య, ఆదర్శ సేవారంగాలలో ఆ సంస్థకి స్ఫూర్తినిచ్చారామె. ఆ దివ్య జనని 1920 జూలై 20న కలకత్తాలో మహాసమాధి పొందారు. ఆమె నేటి మహిళలకు ఆదర్శనీయురాలు. నిత్య ప్రాతఃస్మరణీయురాలు.

- వేదుల జనార్దనరావు

ధర్మ సందేహాలు

శంఖానాదం చేయవచ్చా?

★ నరకాసురుడు బంధించిన రాచకన్యల సంఖ్య 16వేలు? 16వేల ఒక వందా? అందులో శ్రీకృష్ణుడు వివాహమాడినది ఎంత మందిని?

- సాయిరామానందస్వామి, పొదలకొండపల్లె

సంఖ్య గురించిన వాదాలలో సారం లేదు. అంత పెద్దసంఖ్య వున్నప్పుడు కొంచెం అటూఇటూగా ఆ సంఖ్యను ఉదాహరించటం మన గ్రంథాలలో మామూలే. ఇక వారిని స్వామి వివాహమాడటమన్నది సాంకేతికం మాత్రమే? వారందరూ స్వామికి ఆత్మార్పణ చేసికొని మధురభక్తిమార్గంలో ఉపాసించారు కనుక, వారిని స్వామి పత్నులుగా వ్యవహరించారు.

★ పూజామందిరంలో ప్రతిరోజూ శంఖనాదం చేయవచ్చా?

- కె.వి.ప్రసాదరావు, కందుకూరు

శంఖనాదం ఓంకారానికి, దేవతాహ్వానానికి సంకేతం. దాన్ని గుడిలోనూ, ఇంట్లోనూ గూడా ఆచరించుకోవచ్చు.

ప్రశ్నలు పంపాల్సిన చిరునామా :
కుప్పా వేంకట కృష్ణమూర్తి
ఇంటి నెం. 11-13-279, రోడ్ నెం. 8, అలకాపురి, హైదరాబాద్ - 500 035.
vedakavi@serveveda.org

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

మంగళవారం 23, డిసెంబర్ 2014

చాకొలెట్లతో ఉత్తేజం!

ఆహార పదార్థాల్లో మోతాదుకు మించి చక్కెర వాడితే అనర్థదాయకమన్న విషయం అందరికీ తెలిసినా, తీపిని అందించే చాకొలెట్లను తినడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్తేజం తథ్యమని పరిశోధకులు తేల్చి చెబుతున్నారు. లాక్విలా విశ్వవిద్యాలయానికి (ఇటలీ) చెందిన శాస్త్రవేత్తలు జరిపిన తాజా అధ్యయనంలో చాకొలెట్లకు సంబంధించి పలు ఆసక్తికరమైన అంశాలు వెలుగుచూశాయి. వృద్ధాప్య ఛాయలు రాకుండా ఉండాలన్నా, రక్త సరఫరా మెరుగు పడాలన్నా, అదనపు బరువును తగ్గించుకోవాలన్నా మితంగా చాకొలెట్లను తినడం మంచిదట! చాకొలెట్లలోని ఫ్లవనాల్ అనే యాంటీ ఆక్సిడెంట్ రక్త సరఫరా తీరును మెరుగుపరుస్తుంది. వీటిని తినడం వల్ల మెదడులో శక్తిసామర్థ్యాలు పెరుగుతాయి. తాజా పండ్లు, కూరగాయల్లో లభించే యాంటీ ఆక్సిడెంట్లు చాకొలెట్లలోనూ ఉన్నందున చర్మం ముడతలు పడడం వంటి వృద్ధాప్య సమస్యల నుంచి బయటపడొచ్చని పరిశోధకులు భరోసా ఇస్తున్నారు. చాకొలెట్లను తినడం వల్ల మానసిక స్థాయి మెరుగవుతుందని, ఒత్తిళ్ల నుంచి ఉపశమనం కలుగుతుందని కూడా వారు చెబుతున్నారు. మెగ్నీషియం వంటి ఖనిజాలు అధికంగా ఉన్నందున మెదడు చురుగ్గా పనిచేస్తూ మానసిక ప్రశాంతత లభిస్తుంది. రక్తంలో కొలెస్ట్రాల్‌ను నివారించడంలోను, బరువును నియంత్రించడంలోనూ చాకొలెట్ దోహదపడుతుంది. రోజుకు రెండు, మూడు చాకొలెట్లను తినడం వల్ల ఈ ప్రయోజనాలన్నీ లభిస్తాయని పరిశోధకులు చెబుతున్నారు.

మహిళలపై వివక్ష.. ఏ మతమూ చెప్పదు..

బాల్యం నుంచే ఆడపిల్లలపై వివక్ష చూపుతూ వారిని అభివృద్ధికి దూరం చేయడం ఓ సామాజిక రుగ్మత అని ఫర్దీనా అభివర్ణిస్తున్నారు. లింగ వివక్ష లేకుండా ఆడపిల్లలను చిన్నతనం నుంచి అన్ని విధాలుగా ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. కఠిన చట్టాలు చేసినంత మాత్రాన మహిళలపై లైంగిక దాడులు, హింస తగ్గవని, శాసనాలను కట్టుదిట్టంగా అమలుచేసినపుడే అకృత్యాలు తగ్గుముఖం పడతాయని ఆమె చెబుతున్నారు.

మహిళలను అణచివేయాలంటూ ఏ మతమూ బోధించదని అయితే, కొందరు మతాన్ని అడ్డం పెట్టుకుని స్త్రీలపై వివక్ష చూపడం అనాగరికమని ఐఎఎస్ అధికారిణి ఉమ్మె ఫర్దీనా అదిల్ అంటున్నారు. అస్సాం నుంచి ఐఎఎస్‌కు ఎంపికైన తొలి ముస్లిం వనితగా (319వ ర్యాంకు) రికార్డు సృష్టించిన ఆమె- 'మేధస్సుకు సంబంధించి ఆడ, మగల్లో ఎలాంటి తేడా ఉండద'ని చెబుతున్నారు. అవకాశం వస్తే పురుషులకు ఏ రంగంలోనూ తీసిపోమని ఇప్పటికే ఎంతోమంది మహిళలు నిరూపించారని గుర్తు చేస్తున్నారు. బాల్యం నుంచే ఆడపిల్లలపై వివక్ష చూపుతూ వారిని అభివృద్ధికి దూరం చేయడం ఓ సామాజిక రుగ్మత అని ఆమె అభివర్ణిస్తున్నారు. లింగ వివక్ష లేకుండా ఆడపిల్లలను చిన్నతనం నుంచి అన్ని విధాలుగా ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కాగా, కఠిన చట్టాలు చేసినంత మాత్రాన మహిళలపై లైంగిక దాడులు, హింస తగ్గవని, శాసనాలను కట్టుదిట్టంగా అమలుచేసినపుడే అకృత్యాలు తగ్గుముఖం పడతాయని ఫర్దీనా చెబుతున్నారు. మహిళలను గౌరవించాలనే భావం సమాజంలో బలపడినపుడు వారి పట్ల వివక్ష, హింస అంతం అవుతాయని తాను నమ్ముతానని ఆమె అంటున్నారు.

తొలి ప్రయత్నంలోనే...

గౌహతిలోని డిస్నీల్యాండ్ స్కూలులో ప్రాథమిక విద్య, కాటన్ కాలేజీలో ఉన్నత విద్య పూర్తి చేసిన ఫర్దీనా కేవలం తొమ్మిది నెలలు మాత్రమే కఠోర దీక్షతో చదివి సివిల్స్‌కు సిద్ధమయ్యారు. తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించారు. రోజుకు ఆరు గంటల సేపు ఆమె పుస్తకాలపై దృష్టి సారిస్తూ, జనరల్ నాలెడ్జి కోసం అన్ని దినపత్రికలు చదివేవారు. పలురకాల వెబ్‌సైట్ల ద్వారా సమాచారం తీసుకుని సొంతంగా నోట్సు తయారు చేసుకునేవారు. సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించాలంటే కరెంట్ ఎఫైర్స్, పొలిటికల్ అనాలసిస్‌పై మంచి అవగాహన ఉండాలని ఫర్దీనా చెబుతుంటారు. ఎన్ని పుస్తకాలు చదివినా, గ్రూప్ డిస్కషన్స్ లే కపోతే మంచి ఫలితం సాధించడం కష్టమని అంటున్నారు. గ్రూప్ డిస్కషన్ వల్ల మనం చదివింది బాగా అర్థం చేసుకోవడమే కాకుండా, విశ్లేషణాశక్తి అలవడుతుందని వివరిస్తున్నారు. ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలపై తగిన అవగాహన ఏర్పరచుకుంటే యుపిఎస్‌సి పరీక్షలో చివరి దశను ఎదుర్కోవడం సులువవుతుందని చెబుతున్నారు. సేవాభావం, ప్రజలతో మమేకమై పని చేసే స్వభావం ఉన్న వారికే సివిల్ సర్వీస్ ఉపయోగకరంగా ఉంటుందని, అలాంటి అంకితభావం లేని వారు ఇటు రావడం అనవసరమని చెబుతుంటారు. అస్సాం నుంచి ఐఎఎస్‌కు ఎంపికైన తొలి ముస్లిం మహిళగా ఖ్యాతి దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. నచ్చిన రంగంలోకి వచ్చాను కనుక, తన శక్తిమేరకు ప్రజల కోసం పనిచేస్తానని చెబుతున్నారు.

-బాబు

ఫర్దీనా

ముత్యాల ముగ్గు



21 మధ్య చుక్క 11 వరకూ

టి.మేఘన, కందుకూరు

మీ సృజనకు పదునుపెట్టి కొత్తకోణాల్లో ఆకర్షించే అందమైన ముగ్గులు పంపండి. చుక్కల వివరాలు రాయడం మరువకండి. చుక్కలు, గీతలు.. ఏ ముగ్గులైనా చూసేందుకు స్పష్టంగా ఉండాలి. చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికిందరాబాద్-500003.

ముగ్గులు వేసిన కాగితాలను కలర్ స్కానింగ్ చేయించి pdf ఫార్మాట్‌లో bhoomika@andhrabhoomi.net కు మెయిల్‌లో కూడా పంపొచ్చు.

వేగంగా తింటే ఊబకాయం..!

అధిక బరువుతో ఉన్నవారు తొలుత ఎంత అందంగా ఉన్నప్పటికీ- రాను రానూ నాజూకుదనం కోల్పోతారు. అలాగే, నలభై ఏళ్ల వయసుకు చేరువవుతున్నవారు కూడా బాడీ షేప్‌ని కోల్పోతారు. మంచి శరీరాకృతిని పోగొట్టుకున్నవారు తర్వాతి కాలంలో డైటింగ్, వాకింగ్, యోగా వంటివి చేస్తూ సన్నబడాలని ప్రయత్నిస్తారు. ఎంతగా ప్రయత్నించినా కొంత మందిలో ఎటువంటి మార్పు కనిపించదు. ఆహారం తీసుకునే విధానమే దీనికి కారణమని అంటున్నారు బ్రిటన్‌కు చెందిన డాక్టర్ డేవిడ్ లూయిస్. సుమారు మూడు వేలమంది ఆహారపు అలవాట్లను అధ్యయనం చేశాక పలు ఆశ్చర్యకరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయని ఆయన చెబుతున్నారు. మామూలుగా ఆహారం తీసుకునేవారి కంటే వేగంగా ఆహారం తీసుకునేవారికి ఊబకాయం ఎక్కువగా వస్తున్నట్లు పరిశోధనలో వెల్లడైంది.

వేగంగా తినే పురుషులకంటే మహిళలు ఊబకాయులుగా మారుతున్నారని అధ్యయనంలో తేలింది. ఆహారం తినడం మొదలుపెట్టిన తర్వాత కరవై నిముషాలకి కడుపు నిండినట్లు మెదడు సంకేతాలు పంపుతుందట. దాంతో ఆకలి వేయడం ఆగుతుందట. మెల్లగా తింటూ ఇరవై నిముషాల పాటు గడిపేవారికన్నా, వేగంగా తింటూ అదే సమయం గడిపేవారు మరింత ఎక్కువ ఆహారం తీసుకుంటారని, ఈ కారణంగానే వేగంగా భుజించేవారు మెల్లగా భుజించేవారికన్నా ఊబకాయులుగా మారతారని లూయిస్ చెబుతున్నారు. ఇదే విషయాన్ని సౌత్ కరోలినాలోని మెడికల్ యూనివర్సిటీ కూడా నిర్ధారిస్తోంది. వేగంగా ఆహారం తీసుకునే వారిలో అజీర్తి, గ్యాస్, యాసిడ్స్ ఉత్పత్తి కావడం, బ్లీడింగ్, కాన్సర్ వంటి రుగ్మతలు కూడా దాడి చేయవచ్చని హెచ్చరిస్తోంది. 690 క్యాలరీల ఆహారాన్ని అయిదు నిముషాల్లో తింటే 50 శాతం అదనంగా యాసిడ్స్ శరీరంలో ఉత్పత్తి అవుతాయట. కనుక వేగంగా తినడం అనే అలవాటును ఎవరైనా వదులుకోవలసిందేనని హెచ్చరిస్తున్నారు. టీవీ ముందు కూర్చుని తినడం వల్ల మనకి కావలసినదానికంటే మరింత ఎక్కువ ఆహారం తీసుకుంటామని, కనుక ఆ పద్ధతికి స్వస్తి చెప్పాలని అమెరికాకు చెందిన పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల అజీర్తి, కడుపు నొప్పి వస్తాయని అంటున్నారు.



భోజనం చేయడానికి అరగంట, ఫలహారం తీసుకోవడానికి పదిహేను నిముషాలు కేటాయిస్తే అది మంచి అలవాటు అని డాక్టర్ లూయిస్ చెబుతున్నారు. ఆహారాన్ని బాగా చూసి తినాలని అంటున్నారు. ఆహారం తీసుకుంటూ మంచినీళ్ళు తాగకూడదని, కనీసం అరగంట ముందు నీళ్లు తాగి తర్వాత భోజనం చేయాలని చెబుతున్నారు. తింటూ మధ్యలో అదేపనిగా నీళ్లు తాగితే జీర్ణక్రియకు సహకరించే ఎంజైములు సమర్థవంతంగా పనిచేయలేవని హెచ్చరిస్తున్నారు. వేగంగా తిన డంవల్ల ఆహారంతోపాటు గాలి కూడా పెద్ద మొత్తంలో కడుపులో చేరుతుందని, ఇది మంచిది కాదని అంటున్నారు. నోరు పట్టనంతగా ఆహారాన్ని కుక్కేసుకుని ఆదరాబాదరాగా తినడం వల్ల, ఆ పరిమాణానికి తగ్గట్లు లాలాజలం ఊరక, జీర్ణశక్తి మందగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. నెమ్మదిగా ఆహారం భుజించాలని, మధ్యలో నీళ్లు తాగకూడదని, ఆహారాన్ని తగుమాత్రం నోట్లో పెట్టుకుని తింటే ఊబకాయం, అజీర్తితోపాటు ఇతర రుగ్మతలు కూడా దరి చేరవని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

-లావణ్య

మమతల మాధుర్యం.. పిల్లలకు దూరం

ఒకప్పుడు ఆటవిక మానవులు గుంపులుగా సంచరిస్తూ.. జంతువులను వేటాడి, దొరికినదాన్ని సమానంగా పంచుకొని తినేవారు. అందరూ కలిసిమెలిసి ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపేవారు. అనేక పరిణామాల నేపథ్యంలో ఆదిమానవుడు అంచెలంచెలుగా పురోగతి సాధించడంతో ఉమ్మడి కుటుంబాలు ఏర్పడ్డాయి. నాగరికత వృద్ధి చెంది, ఇలా ఎన్నో తరాలు మారుతూ వచ్చాయి. ఉమ్మడి కుటుంబంలో తాతలు, ముత్తాతలు, అమ్మమ్మలు, నానమ్మలు, పెద్దనాన్నలు, చిన్నాన్నలు, మేనమామలు, మేనత్తలు- ఇలా ఎంతోమంది కలిసి మెలిసి ఒకే చోట జీవనం సాగించేవారు. కుటుంబ పెద్ద సూచించిన విధంగా ఎవరి పనులను వారు సక్రమంగా నిర్వహించేవారు. గౌరవ మర్యాదలతో, భయభక్తులతో ఐక్యంగా కలిసి సాగేవారు. అది ఉమ్మడి కుటుంబాలలో ఉండే క్రమశిక్షణ. తీరిక వేళల్లో ఏదైనా ఆటలు ఆడాలన్నా, పాటలు పాడాలన్నా ఆ ఇంట్లో ఉండే పిల్లలే సరిపోయేవారు.

ఇంట్లో ఉండే తాతలు, అమ్మమ్మలు చిన్న పిల్లలను ఆడిస్తూ... పాడిస్తూ.. కథలు, సామెతలు చెబుతూ ఉండేవారు. ఆడిస్తూ.. ఊరడిస్తూ.. చిన్నారులను ఎంతో అల్లారు ముద్దుగా పెంచేవారు. అది వారి బాధ్యతగా గుర్తించేవారు. పెద్దలు చెప్పిన కథలు, నీతి సూత్రాలు, న్యాయ, ధర్మసూత్రాలు తూ.చ. తప్పకుండా అలవర్చుకొని వారి అడుగుజాడల్లో పిల్లలు నడిచేవారు. ఒకే ఇంట్లో ఉంటూ పనులు చేసుకోవటం, కలిసి మెలిసి భోంచేయడం వలన ఎవరిఎవరి భావోద్వేగాలు, ప్రవర్తన వంటివి ఎలా ఉంటాయో ఇట్టే తెలిసిపోయేది. కుటుంబ పెద్ద అవి కనిపెట్టి ఏ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తగా పరిష్కరించి అందరినీ ఐక్యంగా ముందుకునడిపేవారు.

కాగా, నేటి నవ నాగరిక కాలంలో ఉమ్మడి కుటుంబాల జాడే లేకుండా పోవడంతో ఇళ్లలో చిన్న పిల్లల ఆలనా పాలనా చూసే వారే కరవై పోతున్నారు. ఉద్యోగాలు చేసే కొడుకులు వారి తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నారు. వివాహం జరిగాక వేరు కాపురం పెట్టడం అనివార్యమవుతోంది. బతకడానికి ధనమే ప్రధానం కావటంతో- అది లభించే చోటకు పరుగు తీయడం ప్రారంభించారు. ఇలాంటి పరిస్థితుల వల్లే ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగైపోయింది. ఇపుడు ఎక్కడ చూచినా దంపతులు ఒక బిడ్డతోనే సరిపెట్టుకుంటున్నారు. ఆలుమగలిద్దరూ ఉద్యోగాలకు పోతే, ఇంట్లో పెద్దలు ఎవరూ లేకపోవడంతో ఆ బిడ్డను బేబీ కేర్ సెంటర్‌లో ఉంచాల్సిందే. ఒక బిడ్డను కన్న తల్లిదండ్రులు తమ బిడ్డను అల్లారుముద్దుగా పెంచుకొని మురిసిపోతున్నారా? అంటే అది లేదు. పసివాళ్ళను బేబీ కేర్ సెంటర్‌లో చేర్చటం, ఆపైన యుకెజి, ఎల్‌కెజి అంటూ కాన్వెంట్లకు పంపడం ఆనవాయితీగా మారింది. నేడు చిన్నపిల్లలకు అమ్మ ఒడి, వెచ్చని లాలిపాట అంటే ఏంటో తెలియదు. నాన్న వేలు పట్టుకొని నడిచే అదృష్టానికి నోచుకోక విల విలలాడిపోతున్నారు. బాల్యంలో సరదాలు, మధురానుభూతులు ఏమిటో పిల్లలకు తెలియడం లేదు.



ఇటీవలి కాలంలో తల్లిదండ్రుల్లో విపరీతమైన పోకడ దాపురించింది. సంపాదనే ధ్యేయంగా కాన్వెంట్లు, కార్పొరేట్ స్కూళ్ళు, హాస్టళ్లు వెలుస్తున్నాయి. చిన్న పిల్లలను హాస్టల్లో వేసి పేరెంట్స్ చేతులు దులుపుకుంటున్నారు. చదువు నెపంతో నేటి బాలబాలికలంతా ఇంచుమించు జైలు జీవితమే గడుపుతున్నారనటంలో ఏ సందేహం లేదు. పిల్లలు హాస్టల్లో ఏం భోంచేస్తున్నారు? ఎలా చదువుతున్నారు? వారి మనోస్థితి ఏంటో తల్లిదండ్రులు అర్థం చేసుకోలేకపోతున్నారు. తల్లిదండ్రుల ధ్యాసంతా పిల్లలకొచ్చే మార్కులు, ర్యాంకుల పైనే. వారు మంచి ఉద్యోగం చేసి లక్షలు సంపాదిస్తే చాలనుకుంటున్నారు. బాగా చదువుకున్నవాళ్ళే భారీగా డబ్బు సంపాదించి రాశులు పోస్తారనుకోవటం ఉత్త భ్రమే! సాధారణ చదువులున్నవారు కూడా తమ తెలివి తేటలతో కోట్లు సంపాదించి నవ సమాజానికి మార్గదర్శకులుగా మిగిలారు.

ఇక- తల్లిదండ్రులు, పిల్లలు ఒకే ఇంట్లో ఉంటున్నా తలా ఒక బెడ్‌రూమ్ ఏర్పాటు చేసుకొని ఎవరికివారే బిజీగా గడుపుతున్నారు. ఎవరు ఏం చేస్తున్నారో, ఎలా వుంటున్నారో, ఏం తింటున్నారో కూడా తెలియదు. ఒక ఇంట్లోనే ఉంటూ సెల్‌ఫోన్‌లో పలకరించుకోవటం, దూరమైతే నెట్లో పలకరించుకోవటం అలవాటుగా మారిపోయింది. డబ్బున్నవాళ్ళే కాదు, సగటు కుటుంబాల్లో సైతం ఒకరికొకరు కలిసి బతికింది లేదు, కలిసి తిన్నది లేదు. వాళ్ళు కూడా సెల్‌ఫోన్‌లతోనే పలకరించుకుంటున్నారు. ఆధునిక సౌకర్యాలు విస్తరించడంతో నేటి తరానికి బంధుత్వం, అనుబంధం అంటే ఏంటో తెలియకుండా పోతోంది. మమ్మీ, డాడీ, ఆంటీ, అంకుల్ తప్పితే- తాత, ముత్తాత, అమ్మమ్మ, నాయనమ్మ, మేనమామ, మేనత్త, పెద్దనాన్న, చిన్ననాన్న, అక్క, చెల్లి, తమ్ముడు, అన్న అనే వరుసలు కూడా తెలియకుండా పోతున్నారు. ఇదే ధోరణి కొనసాగితే కొన్నాళ్లకు చుట్టాలనే పదం కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. పరిసరాలు అంటే ఏంటో పిల్లలకు తెలియకుండా పోతుంది. చదువు, డబ్బు సంపాదన ధ్యాసతో.. మనం మన పిల్లలను దూరం చేసుకుంటున్నాం. ఎవరికి వారు విడివిడిగా బతికేస్తుంటే ఇక- కుటుంబం అనే మాటలో మాధుర్యం గురించి చిన్నారులకు తెలిసేదెలా?

-ఆకుల రాఘవ



నేర్చుకుందాం

క. ఆ యింద్రాగ్నులు శ్యేనక
వాయస రూపముల c వలఁతిగ వేఁడన్
ధీయుతుఁడై మును శిబి తన
కాయము గోసిచ్చె నన జగంబుల వినమే !

భావం: ఆ ఇంద్రుడు డేగ రూపాన్నీ అగ్ని కాకిరూపాన్ని ధరించి వచ్చి తన్ను ప్రార్థింపగా శిబి చక్రవర్తి తన దేహాన్నే కోసి యిచ్చాడని మనం విన్నాము కదా. దెబ్బ తగిలి గిలగిలలాడుతున్న కాకిని రక్షించాలనుకున్నాడు శిబి చక్రవర్తి ఓ రోజు. దాన్ని రక్షించబోగా డేగ రూపాన్ని ధరించి వచ్చిన ఇంద్రుడు ఆ కాకి తన ఆహారమని అనగా వానిని ఒప్పించలేకచివరకు తనదేహాన్ని కాకి శరీరానికి బదులుగా ఇవ్వడానికి బయలు దేరిన సంగతి నీవు వినలేదా. అంటే లోకంలో దానం చేసే మహాపురుషులు ఎందరో ఉన్నారు. వారి జాడలోనే ప్రతివారు నడవాలని దానగ్రహీతలు దానం ఇచ్చే జరాసంధునితో మాట్లాడుతున్నారు.

పోతన భాగవతము - దశమ స్కంధము

స్పందన

39 **కె. ప్రమీలాజనార్దన్**

హారికను ఇండియానుండి కొత్తగా వచ్చిన అమ్మాయని చెప్పి డాక్టర్‌కు పరిచయం చేశాడు. 'బాగా ఫీవర్ వున్నట్లుంది అందుకే మీదగ్గరికి తీసుకొచ్చాను'' అన్నాడు అజిత్.

''ఓ.కె. భయంలేదు'' అంటూ టెంపరేచర్ చూసి మందులు ఇచ్చాడు డాక్టర్.

''రేపు అలాగే వుంటే రమ్మన్నాడు. హారికకు నాలుగు రోజులు జ్వరం తగ్గలేదు. ఆమె తోపాటు వుంటున్న అలివేలు సెలవుపెట్టి ఇంట్లో వుండి ఆమెకెంతో సేవ చేసింది.

అజిత్ హాస్పిటల్‌కు తీసుకెళ్ళడం ఆమెకు కావాల్సిన మందులు, పళ్లు, బిస్కెట్స్ లాంటివి తెచ్చివ్వడంతో అనుకోకుండానే అతడితో స్నేహం పెరిగింది హారికకు.

అలా పెరిగిన స్నేహం స్నేహంగా వుంటే బాగుండేది. తెలియని బంధం పెనవేసుకొని పోయేట్లు చేశాయి, ఆఫీసులో వాళ్లు వేసిన పిక్నిక్స్‌వల్ల.

ప్యారిస్ ఇదివరకు చూసిందే అయినా ఇలా ఆఫీసులో వాళ్ళందరితో కలిసి రావడం ముఖ్యంగా హారిక తనతోపాటే వుండి మాట్లాడుతుంటే కొత్తగా అనిపిస్తోంది అజిత్‌కు.

రాత్రి పురవీధులలో బస్సు పోతుంటే ఎట్టి మందారాలు పరిచిన ప్రదేశంలో ప్రయాణం చేస్తున్నట్లనిపించింది. మరోవైపు ఆకుపచ్చని రంగులో వున్నట్లు దీప కాంతులు... నగర శోభను మరింత పెంచాయి. రాత్రి పూట ప్యారిస్ నగరాన్ని చూడాలన్న బస్సు డ్రైవర్ మాటలు నిజమేననిపించాయి అజిత్‌కు.

ఈఫిల్ టవర్ లైట్ల కాంతిలో ధగధగమెరుస్తోంటే హారిక చిన్నపిల్లలా సంబరంగా చూసింది.

''అది చూశారా, ఆకాశాన్నందుకొనేందుకు పైకి పోతున్నట్లుంది గదూ!'' అంది హారిక దానివైపే చూస్తూ.

''ఔను. ఆశ లేనిదే మనిషి లేడుగా. మనిషి ఆశ నుండి పుట్టిందీ టవర్. ఇది మనిషి ఏదో సాధించాలన్న పట్టుదల, తమ దేశానికి పేరు, అందం తెచ్చేదిగా వుండాలన్న ఆరాటం దీని నిర్మాణానికి పునాది వేసింది'' అన్నాడు అజిత్.

''నిజమే.. మనిషికి ఆశే లేకపోతే జీవితం లేదంటారు. అలాగే అందాలూ వుండవు. ఈ టవర్ చూడండి, ప్యారిస్ నగరానికి రత్నాల హారమయింది'' అంది హారిక.

తర్వాత బకింగ్‌హామ్ నుండి చుట్టూ వున్న ప్రదేశాలు చూడాలని ప్లాన్ చేసుకొని వెళ్ళారు, ఆఫీసులో వాళ్ళతోపాటు హారిక, అజిత్ కూడా. అందులో హిల్ టాప్ అజిత్‌కు బాగా గుర్తున్న పేరు. ''అమ్మో హిల్ టాప్ అంటే చాలా ఎత్తుగా వుంటుందేమో... నేను రాను. మీరు వెళ్ళండి'' అంది హారిక. ఎత్తు ప్రదేశాలంటే ఆమెకు భయం. ఈఫిల్ టవర్ కూడా ఎక్కలేదామె. చాలు, క్రిందినుండి చూశాను. ఆ అందం మదిలో అలాగే ముద్రించుకుపోనివ్వండి. భయభ్రాంతురాలినయ్యే సన్నివేశాలను కోరి తెచ్చుకోలేను'' అంది.

''హిల్‌టాప్ అంటే ఎత్తులో వున్నదని అర్థం కాదు'' నవ్వుతూ అన్నాడు అజిత్. రచయిత్రి పేరు అది. ఆమె చిన్నపిల్లల కథలెన్నో వ్రాసింది. ఆమె నివాసం చుట్టూ వున్న వనం చూడు.. ఎన్ని రకాల మొక్కలు పూలతో ఎంత అందంగా వుందో.. ఈ హాయిగొలిపే వాతావరణం ఆమె కలంలోకి పసిపిల్లల మనస్తత్వాన్ని సిరాగా పోసి వుంటుంది''.

షేక్స్‌పియర్ చిన్ననాడు చదివిన స్కూలు చూశారు. పూర్వం మన దేశంలో పల్లెటూళ్ళలో వుండే స్కూళ్ళలోలాగే బండలు పరిచిన బెంచీలు పలకలు వున్నాయి. ఈ దేశంలోనూ ఇండియాలోలాగే స్త్రీలకు చదువు అనవసరమని అణిగి మణిగి వుండాలని అనుకొనేవారట ఆ కాలంలో. రాను రాను ఆ ఆలోచనలో మార్పు వచ్చింది. ఇండియాలో చాలా ఆలస్యంగా వచ్చిందా మార్పు..'' వాటి గురించి మాట్లాడుతున్నప్పుడు ''ఇక నా ప్రాజెక్టు అయిపోవచ్చింది, తొందరలో ఇండియా వెళ్లిపోవాలి...'' దిగులుగా అంది హారిక.

''ఏం, నీకు ఇండియా వెళ్ళాలనిపించడం లేదా?'' అన్నాడు అజిత్.

''ఇండియా వెళ్ళటం ఇష్టం లేక కాదు, అక్కడ అమ్మా నాన్న నాకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అదే ఇష్టం లేదు.''

''హారిక...'' ఆమె వైపు చూశాడు అజిత్.

''నీవెందుకు బాధపడుతున్నావో తెలియక కాదు. నీ నోటితో నువ్వే నన్ను కోరుకుంటున్నానని చెప్పాలని.. ఇండియా వెళితే నేను దూరమౌతానని నీ భయం. ఔనా?'' చిలిపిగా చూశాడు అజిత్.

''కాదు'' అంది హారిక.

''మరి...'' అర్థంకాని వాడిలా చూశాడు అజిత్. ''నేనంటే నీకు..'' అతడి మాటల మధ్యలోనే నవ్వింది హారిక.

''నా మనసు తెలుసని ఇప్పుడే అంత దృఢంగా చెప్పారు. ఇంతలోనే అంత డీలాపడిపోయారేమిటి?''

''హారికా చెప్పు, నీవు నా గురించి ఆలోచించడంలేదూ!'' ఆత్రంగా అడిగాడు అజిత్.

''ఆలోచిస్తున్నాను. కానీ నీ గురించి కాదు, మన పెళ్లి గురించి'' అంది హారిక.

''అంత మంచి మాట చెప్పేందుకు నన్ను ఇంత భయపెడతావా?'' అన్నాడు అజిత్ అలక ముఖం పెట్టి.

''మిమ్మల్ని భయపెట్టాలని కాదు. నేను మా నాన్నకు మన స్నేహం గురించి, ఆ స్నేహం పెరిగి పెళ్లి చేసుకోవాలనిపించేలా చేసిందని చెప్పి నీ గురించిన వివరాలు కూడా చెప్పాను.

-ఇంకావుంది

అధ్యాత్మ రామాయణం



- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

యుద్ధకాండ 208

నన్ను ప్రసాదపరచి తీసికొని వెళ్లడానికి కైకేయీ పుత్రుడు భరతుడు వచ్చి విడిసినది అదిగో! యమునానది ఒడ్డున భరద్వాజుల వారి ఆశ్రమం కనిపిస్తున్నది.

ఇదే గంగానది. భగీరథుని తపస్సువల్ల దివి నుండి భువికి జారినది. లోకపావని గంగ. ఇక్కడ సరయూనదీ తీరంలోని యజ్ఞ యూప స్తంభాల వరుసలు కనిపిస్తున్నాయి. అక్కడ అదిగో! అయోధ్య కనిపిస్తున్నది. భామినీ! నమస్కరించు (ప్రణామం కురుభామినీ). ఇలా క్రమంగా వివరించాడు రాముడు. అప్పుడు విమానం భరద్వాజాశ్రమానికి చేరింది.

పదునాలుగు సంవత్సరాల వనవాసం పూర్తయింది. ఆ రోజు పంచమి. ప్రభువు రఘునాథుడు సోదరునితో విచ్చేసి, ఆశ్రమంలో ఉన్న భరద్వాజ మునికి నమస్కరించాడు. వినయంతో రఘోత్తముడు మునిని ప్రశ్నించాడు.

శత్రుఘ్ను సమేతుడైన మా తమ్ముడు భరతుని క్షేమ సమాచారాలు మీరేమైనా విన్నారా? అయోధ్య సుభిక్షంగానే ఉన్నది కదా! తల్లులందరు కుశలమే కదా! (జీవంతి చహి మాతరః)

రాముని మాటలు విని భరద్వాజుడు సంతోషించాడు. ప్రసన్న మనస్కుడై రాముని కిలా సమాధానమిచ్చాడు.

అందరు కుశలమే! భరతుడు మహామనస్వి, మనీషి. ఫలమూలాదులే ఆహారంగా స్వీకరిస్తున్నాడు. జటావల్కలధారియై వ్యవహరిస్తున్నాడు. పాదుకులపైననే సకల రాజ్య భారముంచి నిర్వహిస్తున్నాడు. పూర్తిగా (మరొక ఆలోచన లేక) నీ కోసమే ఎదురు చూస్తున్నాడు.

రఘునందనా! దండకారణ్యంలో నీవేమేం చేశావో, రాక్షస వినాశనం, సీతాపహరణం తదితర విషయాలన్నీ నీ అనుగ్రహంవల్ల లభించిన తపోబలం ద్వారానే గ్రహించాను.

సాక్షాత్తు నీవే పరబ్రహ్మవు. ఆది మధ్యాంతాలు లేనివాడవు. నీవు ముందు నీటిని సృష్టించి, అందులోనే శయనించావు. భూత కోటికి నీవే సృష్టికర్తవు. నీవు నారాయణుడవు; విశ్వాత్మవు, నరులలో అంతర్యామివి. నీ నాభిలో పుట్టిన కమలంలోనే లోకపితామహుడు బ్రహ్మ ఆవిర్భవించాడు. అందువల్ల నీవు జగములకన్నిటికీ నియంతవు. సర్వలోకాలు నమస్కరించే అర్హత కలవాడవు. నీవు విష్ణుభగవానుడవు. జానకియే మహాలక్ష్మి. ఆదిశేషువే లక్ష్మణుని పేర అవతరించాడు. నీవు నీ ఆత్మ మాయద్వారా స్వయంగా జగత్తును కల్పిస్తావు. కాని ఆకాశంలాగా దేనికీ అంటకుండా ఉంటావు. నీవు నీ చిచ్ఛక్తితో అందరికీ సాక్షిగా ఉంటావు.

రఘునందనా! సమస్త ప్రాణులలో లోపల వెలుపల ఉండేవాడవు. నీవు పరిపూర్ణుడవు; అజ్ఞానులైన మూఢులకు నీవు వేరుగా స్ఫురిస్తావు.

ఓ జగత్పతీ! నీవే జగత్తు; జగత్తుకు ఆధారం నీవే! పరిపాలకుడవు నీవే. సమస్త ప్రాణులకు భోక్తవూ- భోజ్యానివి నీవే! రఘుశ్రేష్ఠా! చూచేది నిన్నే; వినేది నీ గురించే; స్మరించేది నిన్నే. సర్వం నీవే! నీకన్న భిన్నంగా మరొకటి లేదు.

రామా! నీ శక్తిచేత ప్రేరితమైన మాయ తన అహంకారాది గుణాలతో సమస్త లోకాలను సృష్టిస్తున్నది. ఈ కారణంగా ఈ సృష్టి రచన నీదే అని ఆరోపిస్తున్నారు. అయస్కాంతం సన్నిధిలో ఇనుము వంటి జడ పదార్థాలున్నప్పుడు ఏ విధంగా చలిస్తాయో, అదేవిధంగా నీ దృష్టిపడడంవల్ల మాయ కదలి చైతన్యవంతమైన ఈ జగత్తును సృష్టిస్తున్నది.

రామా! నీకు దేహమే లేదు. కాని విశ్వరక్షణ చేసే దృష్టితో, స్థూల- విరాట్- సూక్ష్మ-సూత్ర దేహాలు పొందుతూ ఉన్నావు.

- ఇంకావుంది

మంగళవారం 23 డిసెంబర్, 2014

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ జయ, దక్షిణాయనం
హేమంత ఋతువు - మార్గశిరమాసం

తిథి: శుద్ధ విదియ రా.తె.4.09
నక్షత్రం: పూ.షా.రా.7.33 వర్జ్యం: ఉ.7.17 వరకు తిరిగి రా.3.07 నుం 4.38 వరకు
దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 09.12 వరకు తిరిగి రా.10.48 నుం 11.36 వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
  ఆకస్మిక ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. తీర్థయాత్రకు ప్రయత్నిస్తారు. దైవదర్శనం ఉంటుంది. స్త్రీలు మనోల్లాసాన్ని పొందుతారు.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
  అల్పభోజనంవల్ల అనారోగ్యాన్ని పొందుతారు. ఏదో ఒక విషయం మిమ్మల్ని మనస్తాపానికి గురిచేస్తుంది. వీలైనంతవరకు అసత్యానికి దూరంగా నుండాలి. అనవసర భయాందోళనలకు లోనవుతారు.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
  చంచలం అధికమవుతుంది. గృహంలో మార్పులు కోరుకుంటారు. స్వల్ప అనారోగ్య కారణంతో నిరుత్సాహంగా ఉంటారు. స్త్రీలతో తగాదాలేర్పడే అవకాశాలుంటాయి. ప్రయత్న కార్యాలు ఫలిస్తాయి.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)**
  ఆకస్మిక ధననష్టం జరుగకుండా జాగ్రత్తపడుట మంచిది. మనస్తాపానికి గురి అవుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. నూతన కార్యాలు వాయిదావేసుకోక తప్పదు
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
  స్థానచలన సూచనలుంటాయి. నూతన వ్యక్తులు కలుస్తారు. ఆర్థిక ఇబ్బందులు దూరమవుతాయి. కుటుంబపరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. గృహంలో మార్పులు కోరుకుంటారు.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
  ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. నూతన కార్యాలు ప్రారంభించరాదు. గృహంలో జరిగే మార్పులవల్ల ఆందోళన చెందుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం.దైవ ప్రార్థన చేస్తారు.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
  తోటివారితో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. వ్యాపార మూలకంగా ధననష్టం కలిగే అవకాశాలున్నాయి. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. కుటుంబ విషయాలందు అనాసక్తితో వుంటారు.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
  ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొంటారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లో నష్టపోయే అవకాశముంటుంది. కుటుంబంలో మార్పులు కోరుకుంటారు. ఒక మంచి అవకాశాన్ని జారవిడుచుకుంటారు.అనారోగ్య బాధలతో సమతమవుతారు.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
  నూతన కార్యాలకు ఆటంకాలేర్పడతాయి. కోపాన్ని తగ్గించుకుంటే మంచిది. కఠిన సంభాషణవల్ల ఇబ్బందులనెదుర్కొంటారు. ఇతరులకు హాని తలపెట్టు కార్యాలకు దూరంగా వుంటారు.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
  నూతన వ్యక్తులను నమ్మి మోసపోరాదు. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవడంతో ఇబ్బంది పడతారు. దైవదర్శనానికి ప్రయత్నిస్తారు. ఋణప్రయత్నాలు ఫలిస్తాయి.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
  కుటుంబంలో ఆనందోత్సాహాలు లభిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. సమాజంలో గౌరవం లభిస్తుంది. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ప్రతి విషయంలో అభివృద్ధి ఉంటుంది.ఆకస్మిక ధనలాభముంటుంది
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
  ప్రయత్నం మేరకు స్వల్పలాభముంటుంది. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. వ్యాపార రంగంలో లాభాలుంటాయి. ఋణప్రయత్నాలు చేస్తారు . నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు.

మంచిమాట

శివకేశవులు ఒక్కటే

నేడు హిందూమత ధర్మంలో శివుడికి, విష్ణువుకి ఒకరంటే ఒకరికి పడదని, ఇద్దరూ వేరు వేరని ఒక అపోహ ఉంది. ఈ అపోహ కారణంగా భక్తులమధ్య ఘర్షణలు రేకెత్తుతున్నాయి. ఇది ఎంతమాత్రం నిజం కాదు. శివుడు, విష్ణువు ఒక్కరే. శివకేశవులకు అభేదం. ఈ విషయం పురాణాలలో కూడా ఎన్నోసార్లు నిరూపించబడింది.

'శివస్య హృదయం విష్ణుర్
విష్ణుస్య హృదయం శివాహ్' అని పురాణాలు, వేదాలలో పేర్కొనబడింది.

రామాయణంలో రాముడు సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు అవతారమైతే, హనుమంతుడు శివస్వరూపం. హనుమ నిరంతరం రామనామ స్మరణతో విష్ణువుని సేవించాడు. అలాగే సీతాదేవిని రావణుడు అపహరించినపుడు రాముడు నేడు రామేశ్వరంగా పిలవబడుచున్న చోట శివలింగాన్ని ప్రతిష్ఠించి శివుడిని పూజించాడు. ఈ విధంగా నిరంతరం ఒకరినొకరు స్మరిస్తూ ఉండేవారు. అలాగే భారతంలో శ్రీకృష్ణుడు గోవర్ధనగిని ఎత్తి గోపాల బాలురను కాపాడితే, రామాయణంలో శివస్వరూపుడైన హనుమ సంజీవని పర్వతాన్ని ఎత్తి తెచ్చి లక్ష్మణునితోపాటు వానరులందరి ప్రాణాలు కాపాడాడు.

సాక్షాత్తు పరమేశ్వరుని అవతారమైన శంకరాచార్యులు 'భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే' అంటూ ఆ నారాయణున్ని సేవించాడు. భస్మాసురుని వరంవల్ల శివునికి ఆపద ఏర్పడినపుడు విష్ణువు మోహిని అవతరమెత్తి సమస్యను తొలగించాడు. అలాగే విష్ణువు చేసిన తపస్సు మెచ్చి పరమశివుడు సుదర్శన చక్రాన్ని శ్రీవారికి ప్రసాదించాడు. అమృతం కోసం దేవతలు మంథర పర్వతాన్ని మథిస్తున్నపుడు ఆ పర్వతాన్ని తను మోస్తూ విష్ణువు, హలాహలాన్ని స్వీకరించి పరమశివుడు కలిసి సహాయపడ్డారు.

ఒకనాడు శివమాయవల్ల వేదవ్యాసుడు నందీశ్వరునితో శ్రీ మహామిష్ణువే అసలైన భగవంతుడని వాదిస్తుంటే అపుడు శ్రీహరి ప్రత్యక్షమై ''నేను పరమశివుడు ఇద్దరం ఒక్కటేనని'' స్వయంగా చెప్పాడు. అలాగే శివుడు పార్వతి సమేతంగా నిరంతరం రామనామ జపం చేస్తుంటే, విష్ణువు నిరంతరం పరమశివున్ని మనస్సులో నిలుపుకుంటాడు. అలాగే శ్రీహరి అనుగ్రహం లేకపోతే కాశీ పట్టణంలోకి ప్రవేశం దొరకదని పురాణేతి హాసాలలో పేర్కొనబడింది.

మహాభారతంలో కురుక్షేత్ర సంగ్రామంలో కోట్లకొలది మహాసైన్యాన్ని ఎవరు సంహరించారన్న సందేహం ఏర్పడినపుడు, కురుక్షేత్ర యుద్ధమంతటికి ప్రత్యక్ష సాక్షిగా ఉన్న బర్బరీకున్ని ప్రశ్నించగా ''యుద్ధంలో అంతమందిని సంహరించింది అర్జునుడో, భీముడో కాదు, ఎడమ చేతివైపు నల్లని శరీరంతో శంఖ, చక్ర, గదా పద్మములను పట్టుకుని, పట్టు పీతంబరం కట్టుకుని ఉండగా, కుడిచేతివైపు చంద్ర వంక పెట్టుకుని, జటాఝూటంతో, త్రిశూలధారియై ఇద్దరూ కలిసిన హరిహర స్వరూపం ధర్మంకోసం ఈ సైన్యాన్నంతా సంహరించిందని'' వెల్లడించాడు. ఈ ఒక్క సాక్ష్యం చాలు శివకేశవులిద్దరూ ఒక్కటేనని చెప్పడానికి.

తత్వ పరిశీలన చేస్తే పార్వతీదేవి, శ్రీమహావిష్ణువు అన్నాచెల్లెలు. అందుకే అమ్మవారిని 'నారాయణి' అని, విష్ణువును 'నారాయణ' అని పిలుస్తారు. స్త్రీతత్వంలో అమ్మవారిగా, పురుషతత్వంలో విష్ణువుగా ఉంటారు. అమ్మవారు అలంకార ప్రియులు, శ్రీమన్నారాయణుడు కూడా అలంకార ప్రియుడే. అటువంటి అమ్మవారికి తన శరీరంలో సగ భాగాన్ని ప్రసాదించిన పరమశివుడు శ్రీ మహావిష్ణువుకి స్థానమిచ్చినట్టే.

అర్జునుడు నిరంతరం శ్రీకృష్ణుని సేవించిన పుణ్యంవలన పరమేశ్వరుడు పాశుపతాస్త్రాన్ని ప్రసాదించాడు. అలాగే పోతనగారు నదీ తీరంలో కూర్చుని రామనామజపం చేస్తుండగా శ్రీ మహావిష్ణువు పరమశివుని రూపంలో ప్రత్యక్షమయ్యాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు. ఉన్నది ఒక్కటే పరబ్రహ్మం. ఆ పరబ్రహ్మయే సృష్టి జరుగుతున్నపుడు బ్రహ్మగా, స్థితికాలంలో విష్ణువుగా, ప్రళయకాలంలో పరమశివునిగా అవతరిస్తాడు. ఎవరు ఏ రూపంలో కొలిస్తే ఆ రూపంలో దర్శనమిస్తాడు.

-మాదాల రామకృష్ణ

సత్యభామ

50 బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 590 మాటాట



ఆధారాలు

ఆధారాలు: 85

అడ్డం
1. అమెరికా ఈ బాపతు రాజ్యం
4. మన పొరుగు దేశమే
6. సమూహం
8. హిందీలో దాహం
9. లక్ష్మి
12. ఒప్పు, శోభిల్లు
14. సంఘబహిష్కారం
15. బురఖా
17. అందం, సొంపు

నిలువు
2. ప్లానెట్
3. తల కిందయిన మోక్షం
4. చేతనా స్థితి
5. స్త్రీ
7. నాట్యశాస్త్రం రాసిన ఋషితుల్యుడు
10. ఎద
11. ప్రస్తుత యుగం
13. జొన్నలు వంటి ఒక ధ్యానం
16. క్లుప్తంగా చాగంటి సోమయాజులు

మాటాట - 589 సమాధానం

1 ఆ	■	■	2 ని	గ్ర	3 హ	ము
గ్ర	■	4 వె	న్న	■	రి	■
5 హ	6 యం	■	■	7 ని	తం	8 బం
9 ము	డి	■	10 ని	■	■	భూ
■	బి	■	11 ర	మా	ర	మి
12 ర	■	13 టీ	త	■	■	రు
14 బి	గ్ర	హ	ము	■	15 గిం	జ

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

హెచ్‌టిసినుంచి

మరో కొత్త స్మార్ట్‌ఫోన్

అగ్రశ్రేణి సెల్ కంపెనీ హెచ్‌టిసి మరో కొత్త స్మార్ట్‌ఫోన్‌తో మార్కెట్లోకి వస్తోంది. సామ్‌సంగ్, ఎల్‌జివంటివాటితో పోలిస్తే కాస్త చిన్న సైజులో క్యూట్‌గా ఉండే ఫోన్లతో మార్కెట్‌ను ఊపేసే హెచ్‌టిసి- ఈసారి సాంప్రదాయానికి భిన్నంగా పెద్దసైజులో స్మార్ట్‌ఫోన్‌ను తీసుకొస్తోంది. దాని పేరు- హెచ్‌టిసి వన్ ఎమ్9. అయితే ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న ఎమ్8ను ఈ కొత్త ఫోన్ రిప్లేస్ చేస్తుందో లేక దానికి సీక్వెల్‌గా తెస్తోందో తెలియదు. 5.5 అంగుళాల స్క్రీన్‌తో, 2560-1440 పిక్సెల్స్ రిజల్యూషన్‌తో వచ్చే ఏడాది మార్చిలో మార్కెట్‌లోకి వచ్చే ఎమ్9 ఎన్ని సంచలనాలకు తెరతీస్తుందో వేచిచూడాల్సిందే.



ఏ తరమైనా యువ 'తరమే'!

సమాజాన్ని మార్చేది..తాననుకున్నట్టుగా పరివర్తన తీసుకొచ్చేది యువతే. సినిమా అయినా, షికారైనా యువతే టార్గెట్. ఫ్యాషనైనా వ్యాపార వాణిజ్య ప్రకటనలైనా వర్తమాన యువ శక్తే ఊపిరి. బ్రాండైనా, టెలిబ్రాండైనా కూడా యువత లేనిదే రాణించలేదు. వారి ఆదరణ లేనిదే మనుగడ సాగించలేదు.

యువ తేజానికి..ఉత్తేజానికి ప్రతీక యువత. వారి ముద్ర ఎక్కడైనా స్పష్టంగా, పదునుగానే ఉంటుంది. కాలమేదైనా, పరిస్థితుల మౌలిక స్వరూప మేదైనా కూడా యువతను విస్మరించే సమాజం ఉండదు. వారి ఆశలు, ఆకాంక్షలకు అద్దం పట్టేందుకే ప్రయత్నిస్తుంది. సమాజంలో సరికొత్త మార్పులకు అస్కారం ఇస్తుంది. సినిమా అయినా, ఫ్యాషనైనా, వ్యాపార వాణిజ్యాలైనా కూడా యువత కేంద్రకంగానే సాగుతాయి. అన్ని కాలాల్లోనూ సరికొత్త సొబగులను సంతరించుకుని దేదీప్యమవుతాయి. సమాజ బాటలో వెళ్లకుండా తామనుకున్న దారిలోకి సమాజాన్ని తీసుకొచ్చే శక్తి, యుక్తి యువతనే ఉంటుందనడం అతిశయోక్తి కాదు. అందుకే తరమేదైనా, కాలమేదైనా యువతే. లక్షాల నిర్దేశనలో..వాటిని సాకారం చేసుకోవడంలో యువ తరం అనుసరించే మార్గమే భిన్నం. వారి ఆలలోచనలే విభిన్నం. అందుకే నేటి తరం వృద్ధులు సైతం మార్పుల విషయానికొస్తే తన యవ్వనాన్ని గుర్తు చేసుంటారు. అప్పట్లో తామెలా ఉండేవాళ్లమో నేటి తరానికి చెబుతూంటారు. అందుకే అన్ని దేశాలు యువశక్తికి ఉద్దీపన పడతాయి. యువతీ యువకులను ఆకట్టుకోగలిగే సరికొత్త ఆలోచనలతో ముందుకొస్తాయి. యువత సైతం తన శైలిలో సమకాలీన సామాజిక అంశాల్ని ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తుంది. సమకాలీన పరిస్థితులకు భిన్నంగా తమదైన శైలిలో రాణించేందుకు ఆరాట పడుతుంది. అన్ని రంగాల్లోనూ తనదైన ముద్ర వేయడానికే ప్రయత్నిస్తుంది. మార్పు కాల ధర్మం. దానికి అనుగుణంగా వ్యక్తులు తమ జీవితాలు, ఆలోచనలను తీర్చిదిద్దుకోవడం సహజం. తరాలు మారుతున్న కొద్దీ వ్యక్తులు రుచులు, అభిరుచులు, ఆలోచనలు మారుతూంటాయి. ఈ మార్పులను పసిగట్టి వాటి స్వరూపాన్ని అర్థం చేసుకోవడంలోనే రాణింపు ఉంటుంది. నవతరం ఆలోచనలన్నీ మార్పుల్ని ఆస్వాదిస్తాయి. వాటిని ఆకళింపు చేసుకుని తమ దారిని నిర్దేశించుకునేందుకు ప్రయత్నిస్తాయి. ఏ తరంలోనైనా సామాజికంగా బలమైన మార్పులు తీసుకురాగలిగేది యువతే..సమకాలీన పరిస్థితులకు అద్దం పట్టేది..వాటిని అనుసరించేది కూడా యువతరమే. కాలమేదైనా ఇలాంటి మార్పులు రావడానికి మీడియా ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. దశకమేదైనా సామాజిక పరంగా పరివర్తనకు ప్రధానంగా సమకాలీన వాతావరణమే దోహదం చేస్తుంది. ఇలాంటి మార్పుల కోసం ఉద్యమించేది, తమ తరాల్ని ప్రభావితం చేయగలిగేదీ యువతేననడంలో ఎలాంటి సందేహం లేదు. బూజు పట్టిన భావాల్ని తొలగించాలన్నా..సరికొత్త రీతిలో నూతనత్వాన్ని పాదుగొల్పాలన్నా ముందుండే యువత ఉద్యమ సారథి కూడా. ఫ్యాషనైనా, సినిమా అయినా కూడా టార్గెట్ యువతే.

-బిఆర్‌పి

యువత తన శైలిలో సమకాలీన సామాజిక అంశాల్ని ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తుంది. సమకాలీన పరిస్థితులకు భిన్నంగా తమదైన శైలిలో రాణించేందుకు ఆరాట పడుతుంది. అన్ని రంగాల్లోనూ తనదైన ముద్ర వేయడానికే ప్రయత్నిస్తుంది. మార్పు కాల ధర్మం. దానికి అనుగుణంగా వ్యక్తులు తమ జీవితాలు, ఆలోచనలను తీర్చిదిద్దుకోవడం సహజం. తరాలు మారుతున్న కొద్దీ వ్యక్తులు రుచులు, అభిరుచులు, ఆలోచనలు మారుతూంటాయి. ఈ మార్పులను పసిగట్టి వాటి స్వరూపాన్ని అర్థం చేసుకోవడంలోనే రాణింపు ఉంటుంది. నవతరం ఆలోచనలన్నీ మార్పుల్ని ఆస్వాదిస్తాయి.

రాబిన్ విలియమ్స్‌కోసం గూగుల్ సెర్చ్

గూగుల్ సెర్చ్ ఇంజన్ వాడని నెటిజన్ లేడంటే అతిశయోక్తి కాదు. ప్రపంచంలోనే అతి పెద్ద సెర్చ్ ఇంజన్ అయిన గూగుల్ అమెరికా సెర్చ్ మార్కెట్‌లో 67శాతాన్ని సొంతం చేసుకుంది. ఒక్క క్లిక్‌తో సమాచారాన్ని సెకన్ల వ్యవధిలో కళ్లముందు ఆవిష్కరించే గూగుల్ సెర్చ్ ఇంజన్‌లో అమెరికన్లు ఈ ఏడాది దేనిగురించి అత్యధికంగా సెర్చ్ చేశారో తెలుసా? చెబితే ఆశ్చర్యపోతారు. వారు గూగుల్ సెర్చ్ ఇంజన్‌లో ఎక్కువగా సెర్చ్ చేసింది... రాబిన్ విలియమ్స్ గురించి! ఈ ఏడాది ఆగస్టు 2న ఆత్మహత్య చేసుకున్న ఈ హాలీవుడ్ కమేడియన్ గురించి తెలుసుకునేందుకు, అతని ఫొటోలు చూసేందుకు అమెరికన్లు ఎంతో ఉత్సుకత చూపారట. 'జుమాన్‌జీ' పేరు చెబితే రాబిన్ విలియమ్స్ మరింత తక్కున గుర్తుకొస్తాడు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది అభిమానులున్న ఈ హాలీవుడ్ స్టార్ అకస్మాత్తుగా డిప్రెషన్‌తో ఆత్మహత్య చేసుకోవడం అందరినీ కలచివేసింది.

'రాబిన్ విలియమ్స్' తర్వాత అమెరికాలోని నెటిజన్లు సెర్చ్ ఇంజన్‌లో వెతికింది 'వరల్డ్ కప్' గురించి! బ్రెజిల్‌లో ఈ ఏడాది జరిగిన ప్రపంచ కప్ సాకర్ టోర్నమెంట్ విశేషాలు తెలుసుకునేందుకు వారు గూగుల్‌ను శోధించేశారట. ఎన్నో సంచలనాలు రేకెత్తించిన ఈ టోర్నమెంట్‌లో చివరికి ప్రపంచ కప్‌ను జర్మనీ ఎగరేసుకుపోయిన సంగతి తెలిసిందే.

ఇక ప్రపంచాన్నే గడగడలాడిస్తున్న 'ఎబోలా' వైరస్... గూగుల్ సెర్చ్‌లో మూడో స్థానం ఆక్రమించిందట. ఆ తరవాత 'మలేసియన్ ఎయిర్‌లైన్స్', 'ఫ్లాపీ బర్డ్', 'ఎఎల్‌ఎస్ ఐస్ బకెట్ ఛాలెంజ్', 'ఐఎస్‌ఐఎస్' వంటి అంశాలగురించీ గూగుల్ సెర్చ్‌లో నెటిజన్లు అధిక సంఖ్యలో సెర్చ్ చేశారట.

'జుమాన్‌జీ' పేరు చెబితే రాబిన్ విలియమ్స్ మరింత తక్కున గుర్తుకొస్తాడు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది అభిమానులున్న ఈ హాలీవుడ్ స్టార్ అకస్మాత్తుగా డిప్రెషన్‌తో ఆత్మహత్య చేసుకోవడం అందరినీ కలచివేసింది.


వార్మర్ ఫ్లోర్‌మ్యాట్

చలికిక బై..బై

హీటింగ్ బ్లాంకెట్

'అసలే చలికాలం...ఏసి తగ్గిస్తే బాస్ ఊరుకోడు...ఎలా చచ్చేది'- ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విసుగు.

'చలి గజగజ వణికిస్తోంది...కాళ్లు కింద పెడితే నేల మరీ చల్లగా ఉంది. అడుగుతీసి అడుగేయాలంటే నరకం కనబడుతోంది' - ఓ ఇల్లాలి ఆవేదన.

'డిసెంబర్ నెల... పొద్దున 8 గంటలైనా ఎండ జాడ లేదు. అమ్మా ఇవాళ స్కూలుకు వెళ్లను'- నాలుగేళ్ల చిన్నారి మొరాయింపు

...ఇలాంటి బాధలన్నిటికీ ఇక చెల్లు చీటీ ఇచ్చేయాల్సిందే. ఈ సమస్యలన్నిటికీ ఇదిగో పరిష్కారమంటూ రకరకాల గాడ్జెట్స్ మార్కెట్‌లోకి వచ్చేశాయి మరి!

హీటింగ్ బ్లాంకెట్

బాస్ ఎసి తగ్గించడానికి ఒప్పుకోవడం లేదా? అయితే యుఎస్‌బి హీటింగ్ బ్లాంకెట్‌ను కొనేసుకోండి. ఈ బ్లాంకెట్‌లోనే హీటింగ్ ప్యాడ్ ఉంటుంది. దీన్ని యుఎస్‌బి ద్వారా కనెక్ట్ చేసుకుంటే క్షణాల్లో వెచ్చగా మారుతుంది. బ్లాంకెట్ 33 అంగుళాల పొడవు, 18 అంగుళాల వెడల్పుతో భుజాలపైనుంచి కప్పుకునేందుకు వీలుగా ఉంటుంది. ఈ హీటింగ్ బ్లాంకెట్‌ను హాయిగా ఉతుక్కోవచ్చు కూడా. perpetual.com ఈ బ్లాంకెట్‌ను ఆన్‌లైన్‌లో 34 డాలర్లకు అందిస్తోంది.


హీటింగ్ స్లిప్పర్స్

వార్మర్ ఫ్లోర్‌మ్యాట్

రెండంగుళాల మందంతో కాటన్ సాక్స్ వేసుకున్నా కాళ్లు వణుకుతున్నాయా? అలాంటప్పుడు వార్మర్ ఫ్లోర్‌మ్యాట్‌ను కొనుక్కుంటే సరి. ఈ ఫ్లోర్‌మ్యాట్‌ను ప్లగ్‌తో అనుసంధానించి స్విచ్ ఆన్ చేస్తే వేడెక్కుతుంది. దానిమీద కాళ్లు పెట్టుకుని హాయిగా టీవీ చూడచ్చు. లేదా కంప్యూటర్‌లో పనిచేసుకోవచ్చు. alsto.com ఈ ఫ్లోర్‌మ్యాట్‌ను 29.99 డాలర్లకు అందిస్తోంది.

హీటింగ్ స్లిప్పర్స్

చలికాలంలో కాళ్లు నేలమీద పెట్టలేకపోతున్నారా? అయితే హీటింగ్ స్లిప్పర్స్ వేసుకుంటే సరి! యుఎస్‌బి బ్రాండో కంపెనీ అందిస్తున్న హీటింగ్ స్లిప్పర్స్ వేసుకుంటే పాదాలు వెచ్చగా ఉంటాయి. ఈ స్లిప్పర్స్‌లో ఉన్న వామింగ్ ప్యాడ్‌ను యుఎస్‌బి పోర్ట్ ద్వారా కనెక్ట్ చేస్తే క్షణాల్లో చెప్పులు వెచ్చనవుతాయి.

హీటింగ్ జాకెట్

బయటకెళ్లాలంటే చలి...అయితేనేం..బ్రూక్‌స్టోన్ యాక్టివ్ హీట్ దీనికో పరిష్కారం కనిపెట్టింది. బ్యాటరీల సాయంతో వేడెక్కే జాకెట్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చింది. ఈ జాకెట్లో మూడు చోట్ల సూక్ష్మమైన హీటింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. వాటి ద్వారా జాకెట్ వెచ్చనవుతుంది. అవసరమైతే వీటిని రీచార్జ్ చేసుకోవచ్చు. రకరకాల సైజుల్లో ఈ జాకెట్లు మార్కెట్‌లో అందుబాట్లో ఉన్నాయి.

హీటింగ్ జాకెట్

మీ క్రెడిట్ కార్డులకు బెటాబ్రాండ్ రక్ష

క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డుల్లో సమాచారాన్ని స్కాన్ చేసి చోరీ చేయడం, ఆ సమాచారం ఆధారంగా మన అకౌంట్‌లో డబ్బంతా ఊడ్చేయడం- ఈ రకం దొంగతనాలు ఇంకా ఇండియాలో ఊపందుకోలేదు కానీ అమెరికాను వణికిస్తున్నాయట. వైట్ కాలర్ చోరీలు పెరిగిపోయాక క్రెడిట్ కార్డులకూ భద్రత కరవైంది. సినిమా టికెట్లకోసమో, రైల్వే కౌంటర్ దగ్గరో మీరు క్యూలో ఉంటారు. మీ బ్యాక్ పాకెట్‌లో క్రెడిట్ కార్డు ఉంటుంది. దానిని ఎవరైనా స్కాన్ చేసి సమాచారాన్ని తస్కరించే ప్రమాదం ఉంటుంది. టాబ్లెట్ సైజులో ఉండే ఓ ఎలక్ట్రానిక్ పరికరం ఆధారంగా మూడడుగుల దూరంనుంచి కార్డుల్లోని సమాచారాన్ని దొంగిలించే వీలుంది. 'ఐటే' అనే ఓ రీసెర్చి సంస్థ అంచనా ప్రకారం 2015 సంవత్సరాంతానికి అమెరికాలో వాడుకలో ఉన్న 70శాతం క్రెడిట్ కార్డులు, 40 శాతం డెబిట్ కార్డులు ఈ రకమైన సమాచార దోపిడీలకు గురయ్యే అవకాశం ఉందట. 'ఫెడరల్ ట్రేడ్ కమిషన్' సర్వే ప్రకారం ఇప్పటికే ఏటా ప్రపంచవ్యాప్తంగా 90 లక్షల క్రెడిట్, డెబిట్ కార్డుల్లో సమాచారం చౌర్యానికి గురవుతోంది. అంటే... నిమిషానికి 19మంది ఇలా డిజిటల్ దోపిడీకి గురవుతున్నారు. మరి దీనికేదీ దారి అంటే వేర్ దేరీజ్ విల్ దేరీజ్ వే అంటూ ప్రముఖ దుస్తుల కంపెనీ 'బెటాబ్రాండ్' ముందుకొచ్చింది. శాన్‌ఫ్రాసిస్కో కేంద్రంగా 'గే జీన్స్'తో సంచలనాలకు తెరతీసిన బెటాబ్రాండ్ ఇప్పుడు సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్ కంపెనీ - నోర్టాన్‌తో కలసి 'రెడీ జీన్స్' దుస్తులతో డిజిటల్ చౌర్యానికి అడ్డుకట్టే వేసేందుకు రంగంలోకి దిగింది. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్‌ఎఫ్‌ఐడి) బ్లాకింగ్ మెటీరియల్‌తో బెటాబ్రాండ్ దుస్తులను రూపొందించింది. జీన్స్ ప్యాంట్ ముందూ వెనకా పాకెట్ల వద్ద ఈ మెటీరియల్‌తో రూపొందించిన పసుపు పచ్చటి స్టిక్కర్లను అతికిస్తారు. ఇందులో ఉండే ఆర్‌ఎఫ్‌ఐడి మెటీరియల్ ఎలాంటి స్కానింగ్‌నయినా నిరోధిస్తుంది. ఈ జీన్స్ ఖరీదు 168 డాలర్లు. మగవాళ్ళకు సరే...మరి ఆడవారి మాట ఏంటంటారా? మహిళలకోసం ఇదే పద్ధతిలో బ్లేజర్లు రూపొందించింది బెటాబ్రాండ్. వీటి విలువ 198 డాలర్లు. ★

జ్ఞాపకాలో, అనుభవాలో, అల్లరో, ఆనందమో.. ఏ అంశంమీదనైనా పాఠకులతో మీ ఫీలింగ్స్ పంచుకోవాలని అనిపిస్తే -ఈ పేజీకి రాసి పంపించండి. బావుంటే తప్పక ప్రచురిస్తాం.

రచనలు పంపాల్సిన చిరునామా..

ఎడిటర్,
ఆంధ్రభూమి దిన పత్రిక
36, సరోజినీ దేవి రోడ్
సికింద్రాబాద్-500003

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

బుధవారం 24, డిసెంబర్ 2014

కాలం.. ఓ ఇంద్రజాలం..!

'చూస్తుండగానే.. కళ్లెదుటే ఇరవై ఏళ్లు గడిచిపోయాయి.. కాలం అంతుపట్టని ఇంద్రజాలంలా ఏదో మాయ చేసింది.. రెండు దశాబ్దాలంటే తక్కువేం కాదు.. ఈ కాలమంతా ఎక్కడికి పోయిందో నా ఆలోచనలకు అందడం లేదు.. అయినా, గత ఇరవై ఏళ్లలో ప్రతి ఒక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నా జీవితానికి మెరుగులు దిద్దుకున్నా..'- అంటూ ఎంతో భావోద్వేగంతో చెబుతోంది ప్రముఖ నటి సుస్మితా సేన్. 'విశ్వ సుందరి' కిరీటాన్ని కైవసం చేసుకుని సరిగ్గా ఇరవై ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆమె ఢిల్లీలో ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని తన అంతరంగాన్ని ఆవిష్కరించింది. 1994 డిసెంబర్‌లో 'మిస్ యూనివర్స్'గా తాను ఎంపికైన మధుర క్షణాలు ఇంకా తన కళ్లముందు కదలాడుతున్నాయని ఈ 39 ఏళ్ల ముద్దుగుమ్మ అంటోంది.

1996లో 'దస్తక్'తో సినీరంగ ప్రవేశం చేసిన సుస్మిత బహుభాషా నటిగా, మోడల్‌గా సత్తా చాటుకుంది. హైదరాబాద్‌లో పుట్టి పెరిగి, సికిందరాబాద్ సెంట్ ఆన్స్ హైస్కూల్‌లో చదివాక అందాల పోటీల్లో పాల్గొనాలన్న ఆసక్తి ఆమెలో పెరిగింది. నటిగా అవకాశాలు రావడంతో ముంబయిలో స్థిరపడింది. కాలం ఎంతవేగంగా గడిచిపోయిందో తన జీవితంలోనూ అనేక సంఘటనలు అనూహ్యంగా చోటు చేసుకున్నాయని ఆమె చెబుతోంది.

20 ఏళ్ల క్రితం మిస్ యూనివర్స్‌గా ఎన్నికైనపుడు...

నటిగా, మోడల్‌గానే కాకుండా సామాజిక సేవలోనూ తనకు మంచి గుర్తింపు వచ్చిందని, జీవితానికి అవసరమయ్యే ఎన్నో విషయాలను నేర్చుకున్నానన్న సంతృప్తి మిగిలిందని ఆనందం వ్యక్తం చేస్తోంది. సముద్రం మధ్యలోకి వెళ్లి ఈత కొట్టడం ఈమధ్యే నేర్చుకున్నానని చెబుతోంది. జీవితంలో ఏది జరిగినా అది మంచికేనని తాను నమ్ముతానని, కాలంతో పాటు అవకాశాలను అందిపుచ్చుకుంటేనే దేన్నయినా సాధించగలుగుతామని వివరిస్తోంది. వయసు పెరుగుతోందని బాధ పడడం కన్నా, ఏదో ఒక రంగంలో రాణించాలని దృష్టి పెడితే ఏ సమస్యలూ ఉండవంటోంది. తన కుమార్తెలతో కలిసి ఈ ఏడాది చివరలో విదేశీయాత్రకు వెళ్లాలని సన్నాహాలు చేసుకుంటున్నట్లు సుస్మిత తెలిపింది.

అందాల పోటీల్లో పాల్గొనే యువతులకు తర్ఫీదు ఇవ్వడంలో తాను నిత్యం బిజీగానే ఉంటానని అంటోంది. గత రెండున్నరేళ్ల కాలంలో సుమారు 70 మంది యువతులకు అందాల పోటీల గురించి మెళకువలు నేర్పినట్లు వివరిస్తోంది. తన వద్ద శిక్షణ పొందిన వారు నటీమణులుగా, న్యూస్ రీడర్లుగా, మోడల్స్‌గా రాణించడం తనకెంతో సంతృప్తి కలిగిస్తోందని ఆమె చెబుతోంది. 'సౌందర్యం' అనేది ఎల్లలు లేని అంశమని, ఎంత నేర్చుకున్నా ఇంకా ఎంతో మిగిలే ఉంటుందని ఆమె విశ్లేషిస్తోంది. సినీ, మోడలింగ్ రంగాల్లోనే కాదు, దత్తత తీసుకున్న పిల్లలతో ఒంటరి తల్లిగానూ సుస్మిత పలు సవాళ్లను ఎదుర్కొంటూ సత్తా చాటుకుంటోంది. *



నాకు ఆంక్షల సంకెళ్లు...

రేపిస్టుకు స్వేచ్ఛా..?



చూపెట్టి నన్ను భయపెట్టారు.. నా శరీరంపై కాలుతున్న సిగరెట్లతో వాతలు పెట్టి, మాటల్లో చెప్పలేని విధంగా వారంతా నాపై సామూహికంగా అత్యాచారం చేశారు.. ఎంతగా అరిచినా, బతిమాలినా వారు ఏ మాత్రం కనికరించకుండా పైశాచిక ఆనందం పొందారు.. హింసను భరించలేక నేను చనిపోయానని భావించి వారు నన్ను పొలాల వద్ద వదిలిపెట్టి పారిపోయారు. అయితే, ఆ రేపిస్టులకు శిక్ష పడడాన్ని నేను కళ్లారా చూడాలనేమో- ఆ దేవుడు నన్ను బతికించాడు.. అత్యాచారం చేసిన ఆ యువకుల్లో ఒకడికి- ఓ రాజకీయ గూండాతో బంధుత్వం ఉంది. రేపిస్టుల్లో అయిదుగురికి కింది కోర్టు శిక్షలు వేసింది. ఇందులో ఇద్దరు ప్రమాదాల్లో మరణించారు. ప్రధాన నిందితుడు మాత్రం ఇప్పటికీ వీధుల్లో దర్జాగా తిరుగుతున్నాడు. బాధితురాలినైన నేను మాత్రం ఎవరికీ ముఖం చూపించకూడదు.. ఇదెక్కడి న్యాయం..? కేసు నుంచి తప్పించుకునేందుకు అతను డబ్బుతో, రాజకీయ పలుకుబడితో ప్రయత్నిస్తున్నాడు. అత్యాచార సమయంలో ఆ నిందితుడు 'కౌమార వయస్కుడు' కాదని తేల్చి చెప్పేందుకు 'జువైనల్ జస్టిస్ బోర్డు'కు ఎనిమిదేళ్లు పట్టింది. ఆ నిర్ణయం వెలువడి చాలారోజులైనా కేసు పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు లేదు.

కేసు విషయమై సమాచారం కోసం మా నాన్న ఏభై, అరవై సార్లు కోర్టుకు వెళ్లారు.. కేసు విచారణలో అదే జాప్యం.. జడ్జి సెలవులో ఉన్నారని కొన్నాళ్లు, డిఫెన్స్ న్యాయవాది చూపే సాకులతో కొన్నాళ్లు.. ఇలా ఎన్నాళ్లు వాయిదాలు వేస్తారు..? కోర్టు పనిమీద మా నాన్న వస్తే ఇక ఆ రోజు అతడికి ఎలాంటి సంపాదనా ఉండదు.. ప్రధాన నిందితుడిపై విచారణ ఎప్పుడు మొదలవుతుందో, కేసు విచారణ ఎపుడు ముగుస్తుందో ఆ దేవుడికే తెలియాలి.. ఆ నిందితుడు హాయిగా పెళ్లి చేసుకున్నాడని, అతనికి కొడుకు పుట్టాడని కూడా అంతా చెబుతున్నారు.. నేను మాత్రం పదేళ్లుగా న్యాయం కోసం ఎదురుచూస్తూనే ఉన్నాను..

ఎన్ని సార్లు చెప్పాలి..?

'నిందితులు అత్యాచారం ఎలా చేశారు? ఏ విధంగా హింసించారు..'- అన్న ప్రశ్నకు కోర్టులో ఇప్పటికి సుమారు 30 సార్లు నేను సమాధానం చెప్పాను. మొదటిసారి చెప్పినపుడే నా వాంగ్మూలం రికార్డు చేస్తారు కదా..? ఇంకెన్ని సార్లు ఆ ప్రశ్న అడుగుతారు..? సమాధానం చెప్పిన ప్రతిసారీ- 'మళ్లీ అత్యాచారం జరిగినట్లు' ఆ బాధను అనుభవించి చెప్పాలా..? నా కేసు వల్ల మా కుటుంబం అన్ని విధాలా ఇబ్బందుల పాలైంది.. బడికి వెళ్లాల్సిన నా చెల్లెలికి వేరే చోట ఆశ్రయం కల్పించారు.. నేను మాత్రం 'ఓపెన్ స్కూల్' పద్ధతిలో చదివైనా డిగ్రీ సంపాదిస్తాను.. ఎప్పటికైనా జడ్జిగా ఉద్యోగం చేస్తా.. న్యాయం కోసం అల్లాడుతున్న ఆడపిల్లలకు అండగా నిలుస్తా.. ఈ కలను తప్పక నిజం చేసుకుంటా.. నేను ప్రార్థనలు చేయను, ఉపవాసాలు ఉండను.. కానీ, రేపిస్టులకు శిక్షలు అమలుచేస్తే అజ్మేర్ షరీఫ్‌కు వెళ్లి మొక్కుబడులు చెల్లిస్తా..

ఢిల్లీలో 'నిర్భయ' ఘటన గురించి తెలిసింది.. ఆ కేసులో నిందితులకు శిక్షలు పడ్డాయని విన్నా.. అత్యాచార కేసుల్లో బాధితురాలు మరణిస్తే తప్ప నిందితులకు శిక్షలు వేయరా..? నా విషయానికొస్తే- రేప్ కేసులో ప్రధాన నిందితుడు హాయిగా కోర్టుకు వస్తాడు.. అతడికి రక్షణగా ఓ గన్‌మేన్.. ఇదంతా చూస్తుంటే- 'రాక్షసంగా ప్రవర్తించిన వాడికి ఇంత రక్షణా..?'- అనిపిస్తుంది... నాపై నాకే జాలేస్తుంది.. కేసును వదిలేసి రాజీ పడాలంటూ నాకు నిందితులు, వారి బంధువులు డబ్బు ఎర వేశారు, కుటుంబాన్ని అంతం చేస్తామని బెదిరిస్తున్నారు.. అయినా వేటికీ నేను లొంగే ప్రసక్తే లేదు.. ఎన్ని బాధలు ఎదురైనా న్యాయం కోసం ప్రాణం ఉన్నంత వరకూ పోరాడతా..! ధనవంతులు, బలవంతులతో పోరాడడం చాలా కష్టమే..

ఈ కేసు సంగతి మరచిపోయి, అస్సాంలోని మా గ్రామానికి వెళిపోతే బాగుంటుందని నా కుటుంబ సభ్యులు తరచూ అంటారు.. నేరస్థులా భయపడి మనం ఎక్కడికో పారిపోవడం ఎందుకని నేనే వారిని వారిస్తుంటాను.. మేం ఏ తప్పూ చేయలేదు.. మేమెందుకు రాజీ పడాలి? మేమెందుకు లక్నో నుంచి ఎక్కడికో వెళ్లిపోవాలి? న్యాయం దక్కాలంటే ఇంకెన్నాళ్లు పడుతుందో ఓపిగ్గా వేచి చూస్తా..

పైన ఓ అద్భుత శక్తి ఉంటుందని, ప్రపంచంలో జరిగే అన్ని విషయాలను ఆ శక్తి అనునిత్యం కనిపెడుతూనే ఉంటుంద' ని మా అమ్మ చెబుతుంటుంది.. ఆ అద్భుత శక్తే నాకు న్యాయం చేకూర్చేలా సహకరిస్తుందన్న నమ్మకం నాలో ఇంకా బలంగానే ఉంది..! *

(2005 మే 2న లక్నో (యుపి)లోని ఆషియానా కాంప్లెక్స్ సమీపంలో అత్యాచారానికి గురైన యువతి న్యాయం కోసం ఏళ్ల తరబడి కోర్టు చుట్టూ తిరుగుతూ.. కొద్ది రోజుల క్రితం మీడియా ముందు వెళ్లబోసుకున్న గోడు ఇది...)

విజయానికి చిరునామా.. పద్మారాణా



ఒకప్పుడు తన పిల్లలకి సరైన ఆహారం కూడా ఇవ్వలేకపోయిన ఆమె- కృషి, పట్టుదలతో తర్వాతి కాలంలో మంచి పోషకాలతో కూడిన భోజనాన్ని అవలీలగా అందించగలుగుతోంది. ఆర్థిక సమస్యలతో అలమటించిన తన కుటుంబానికి ఆమే ఓ పెద్ద దిక్కయ్యింది. ఆ ఇల్లాలే- ఉత్తరాఖండ్‌లోని బజ్పూరీ గ్రామ నివాసి పద్మాదేవి రాణా. పేద కుటుంబానికి చెందిన ఆమె భర్త కూలీగా పని చేసేవాడు. ఒక్కోసారి ఎక్కడా పని దొరికేది కాదు. నలుగురు మగపిల్లలను పెంచేందుకు అతని సంపాదన ఏ మూలకూ సరిపోయేది కాదు. పిల్లలకి సరైన ఆహారం పెట్టలేకపోతున్నామన్న బాధ పద్మాదేవిని కలచివేస్తుండేది. తాను కూడా ఏదైనా పని చేయాలని అనుకున్నా పెద్దగా చదువుకోకపోవడం వల్ల ఏం చేయాలో ఆమెకి తోచలేదు. ఓసారి డెహ్రాడూన్‌కి చెందిన హిమాలయన్ యాక్షన్ రీసెర్చి సెంటర్ (హెచ్ఎఆర్‌సి) ప్రతినిధులు పద్మాదేవి ఉంటున్న గ్రామానికి వచ్చారు. అక్కడ తాండవిస్తున్న పేదరికాన్ని వారు స్వయంగా చూశారు. మహిళలకు కుటీర పరిశ్రమల్లో తర్ఫీదు ఇస్తామని, నైపుణ్యం సంపాదించుకున్న తర్వాత బ్యాంకు రుణాలకు సిఫారసు చేస్తామని వారు గ్రామస్థులకు చెప్పారు. చదువుకున్నా, చదువుకోకపోయినా ఫర్వాలేదని, తమ వద్ద పేర్లు నమోదు చేసుకున్న వారికి నచ్చిన రంగంలో శిక్షణ ఇస్తామని చెప్పారు. హెచ్ఎఆర్‌సి సభ్యులు సందర్శించిన మిగతా గ్రామాల్లోని ఏ ఒక్క మహిళ కూడా శిక్షణ తీసుకోవడానికి ముందుకు రాలేదు. కుటుంబ కట్టుబాట్లు, సామాజిక పరిస్థితుల వల్ల ఎవరూ నోరు మెదపలేదు. కానీ, పద్మాదేవి మాత్రం తాను స్వయం ఉపాధి కోసం శిక్షణ తీసుకుంటానని ధైర్యంగా ముందుకొచ్చింది. దాంతో హెచ్ఎఆర్‌సి బృందం సభ్యులు సంతోషించారు. పాడి పశువులను పెంచేందుకు తాను సిద్ధమేనని వారితో ఆమె చెప్పింది. పశు సంరక్షణలో ఆమెకు శిక్షణ ఇప్పించడమే కాకుండా రుణానికి కూడా వారు సిఫారసు చేసారు.

నెలరోజుల్లోనే ఆమెకి 15 వేల రూపాయల రుణం మంజూరైంది. ఆ డబ్బుతో ఆమె రెండు ఆవులను కొనుగోలు చేసింది. అవి ఒక్కొక్కటి రోజూ ఎనిమిదేసి లీటర్ల పాలు ఇచ్చేవి. ఇంట్లోకి మూడు లీటర్లు ఉంచి, మిగిలిన అయిదు లీటర్ల పాలను విక్రయించగా రోజుకి రెండున్నర వందల వరకు ఆదాయం వచ్చేది. ఆదాయాన్ని పొదుపు చేస్తూ, బ్యాంకుకు కట్టాల్సిన వాయిదాలను క్రమంగా చెల్లించేది. ఇలా తమ సంపాదన కాస్త పెరగడంతో పిల్లలకి మంచి భోజనం, తాగడానికి పాలు ఇచ్చేది. దాంతో వారు ఆరోగ్యంగా తయారయ్యారు. గ్రామంలోని మిగిలిన మహిళలు కూడా ఎంతో కొంత సంపాదించి కుటుంబానికి ఆసరాగా నిలవాలనుకుని ఆమెని కలిశారు. వారు కూడా ఆవులను కొనుగోలు చేసి పాల వ్యాపారం ప్రారంభించారు. రాణా రెండోసారి బ్యాంకు నుంచి రుణం తీసుకుని మూడు మేలు రకం ఆవులను కొనుగోలు చేసింది. గ్రామంలోని మరో ఏడుగురితో కలసి పాల సేకరణ, విక్రయ కేంద్రాన్ని ఆమె ప్రారంభించింది. పాలను ఓ పెద్ద డెయిరీకి విక్రయించడం మొదలు పెట్టాక లాభాలు మరింతగా పెరిగాయి. సక్రమంగా వాయిదాలు చెల్లించడంతో బ్యాంకులు కూడా పెద్ద మొత్తంలో రుణాలు మంజూరు చేశాయి. రాణా నేతృత్వంలో మహిళలంతా వ్యాపారాన్ని మరింత విస్తరించారు. ఇప్పుడు రాణా సొంతంగా పెద్ద డెయిరీ నిర్వహిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమె సాధించిన ఘనత గురించి హెచ్ఎఆర్‌సి వ్యవస్థాపకుడు మహేంద్రసింగ్ కున్వర్ మాట్లాడుతూ మహిళలు తలచుకుంటే ఏదైనా సాధ్యమేనని అంటున్నారు. దృఢసంకల్పం ఉంటే కొద్దిగా ఆలస్యమైనా విజయం వరించి తీరుతుందని ఆయన చెబుతున్నారు. రాణా ఇపుడు మిగతా గ్రామాల మహిళలకు సైతం స్ఫూర్తిగా నిలిచింది. ఒకప్పుడు బయటికి వెళ్లడం, పరాయి మగాళ్లతో మాట్లాడడమే నేరంగా భావించే ఆ ప్రాంత మహిళలు ఇప్పుడు బ్యాంకులకు వెళుతున్నారు, బజార్లు చుట్టొస్తున్నారు. పిల్లల్ని చదివిస్తూ, స్కూళ్లకు స్వయంగా వెళ్లి అన్ని విషయాలు మాట్లాడి వస్తున్నారు. ఇదంతా కేవలం రాణా వల్లే సాధ్యమైందని అక్కడి మగవారు కూడా మెచ్చుకుంటారు.

రాణా నేతృత్వంలో మహిళలంతా వ్యాపారాన్ని మరింత విస్తరించారు. ఇప్పుడు రాణా సొంతంగా పెద్ద డెయిరీ నిర్వహిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమె సాధించిన ఘనత గురించి హెచ్ఎఆర్‌సి వ్యవస్థాపకుడు మహేంద్రసింగ్ కున్వర్ మాట్లాడుతూ మహిళలు తలచుకుంటే ఏదైనా సాధ్యమేనని అంటున్నారు. దృఢసంకల్పం ఉంటే కొద్దిగా ఆలస్యమైనా విజయం వరించి తీరుతుందని ఆయన చెబుతున్నారు.

-కమల

అదరహో 'కేక్ షో'

పార్లమెంటు భవనం, తాజ్‌మహల్, చార్మినార్, కుతుబ్ మినార్, అంతరిక్షంలోకి దూసుకెళ్లిన ఉపగ్రహం.. ఇలా అదీ, ఇదీ అని కాదు... మన దేశానికి వన్నె తెచ్చిన ప్రముఖ కట్టడాలు, అరుదైన సంఘటనలను- ఆ ఆకృతులు మన కళ్లెదుటే సాక్షాత్కరింపజేస్తాయి.. ఇవన్నీ ఇటుకలు, ఇసుకతో చేసినవి కావు.. అచ్చంగా పంచదార, మైదాపిండితో చేసినవి.. వీటిని చూస్తుంటే ఎవరికైనా నోట్లో నీళ్లూరడం ఖాయం.. ఈసారి కూడా విభిన్నమైన ఆకృతులతో బెంగళూరులో 'కేక్ షో' అందరినీ అలరించబోతోంది. దక్షిణ భారతంలో ఏటా నిర్వహించే ఈ అతిపెద్ద 'కేక్ షో'ను తిలకించేందుకు, తమకు నచ్చిన కేకులను కొనుగోలు చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు భారీ సంఖ్యలో తరలివస్తారు. క్రిస్మస్, ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా ఈ నెల చివరి వారం నుంచి జనవరి 5వ తేదీ వరకూ జరిగే 'కేక్ షో'లో వివిధ ఆకృతులను ప్రదర్శించేందుకు ఎంతోమంది పోటీ పడుతుంటారు. ఏటా ఈ 'షో'లో ఓ ప్రత్యేక ఆకర్షణ ఉండడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి 'పార్లమెంటు కేకు' అందరినీ అలరిస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. 18 అడుగుల వ్యాసార్థంతో 'పార్లమెంటు కేకు'ను తీర్చిదిద్దేందుకు సుమారు మూడు నెలల సమయం పట్టిందట!

14 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పుతో తయారైన 'డ్రాగన్ కేకు' ముఖ్యంగా చిన్నారులను ఆకట్టుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆకర్షణీయమైన రంగుల్లో ప్రత్యేకంగా తయారు చేసిన భారీ కేకులను మాత్రం ఎవరికీ విక్రయించరు. వీటిని ఓ స్వచ్ఛంద సంస్థకు అందజేస్తారు. భారీ కేకులను కరిగించి, అందులోని తీపి పదార్థాన్ని వేరు చేసి ఇతర స్వీట్లను తయారు చేసేందుకు వినియోగిస్తారు. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ బేకరీ ఉత్పత్తుల సంస్థలు పాల్గొనే ఈ 'కేక్ షో' సందర్శకులకు మధురానుభూతి కలిగిస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. *

ముత్యాల ముగ్గు

19 చుక్కలు 1 వచ్చే వరకూ

ముల్కల్ల రాజమ్మ, కుంభంపల్లి

మీ సృజనకు పదునుపెట్టి కొత్తకోణాల్లో ఆకర్షించే అందమైన ముగ్గులు పంపండి. చుక్కల వివరాలు రాయడం మరువకండి. చుక్కలు, గీతలు.. ఏ ముగ్గులైనా చూసేందుకు స్పష్టంగా ఉండాలి. చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికిందరాబాద్-500003.

ముగ్గులు వేసిన కాగితాలను కలర్ స్కానింగ్ చేయించి bhoomika@andhrabhoomi.net కు మెయిల్‌లో కూడా పంపొచ్చు.

నేర్చుకుందాం

ఆ. ధీరమతులు రంతి దేవ హరిశ్చంద్ర
బలులు నుంఛవృత్తి బ్రాహ్మణునివి
మున్ను సెప్ప వినమె సన్నుత చరితులు
సన్న నైన నేఁడు నున్నవారు

భావం: ధీరులైన రంతిదేవుడు, హరిశ్చంద్రుడు, బలి చక్రవర్తులూ కళ్ళల్లో గింజలు ఏరుకొని తిని జీవించిన బ్రాహ్మణు సక్తుప్రస్థుడూ వీరిని గూర్చి చెప్పుకోటం పూర్వం మనం విన్నాం. పొగడ తగిన చరిత్రలు గల ఆ మహనీయులు మరణించినప్పటికిన్నీ బ్రతికే వున్నారు. మంచిపని చేసి పుణ్యం సంపాదించుకున్నవారు ఎల్లపుడు చిరస్మరణీయులే. వారు చనిపోయినా ప్రజల నాలుకలపై నిలిచియే వుంటారు. అలాకాక చెడు పనులు చేస్తూ నలుగురిని హింసిస్తూ ఎన్నాళ్లు జీవించినా వారు జీవించిఉండగనే నలుగురి చేత ఈసడింపబడుతుంటారు. ఎపుడు వీనికి మరణం సంభవిస్తుందా అని నలుగురూ ఎదురుచూస్తుంటారు. కనుక వారు బతికిఉన్నా చనిపోయినట్టే కదా.

పోతన భాగవతము - దశమ స్కంధము

స్పందన

40

కె. ప్రమీలాజనార్దన్

నాన్న క్షణం కూడా ఆలోచించకుండా 'నీ ఇష్టమే మా ఇష్టమమ్మా' అన్నారు. అప్పటి నుండి కలవరంగా వుంది, నిన్ను అడక్కుండా ముందుగా మా అమ్మా నాన్నకు చెప్పానని. ఇప్పుడు నువ్వు నీ మనసు తెలిపావు. కాబట్టి ఇక దిగుల్లేదు. మీ అమ్మా నాన్నలకు ఈరోజే నువ్వూ చెప్పేసెయ్యి. వాళ్ళూ సరేనన్నారంటే ఇంకే ఆలోచనా వుండదు'' అంది హారిక.

''అమ్మో. వచ్చిన రోజు అంత అమాయకంగా కనిపించారు. సంవత్సరం తిరిగేసరికి మారిపోయావు. ఇప్పుడు ఫాస్ట్ గర్ల్ అనిపిస్తున్నావు'' అన్నాడు అజిత్.

''నువ్విప్పుడు ఫాస్ట్ అబ్బాయివనిపించాలి. తప్పదు. ఎందుకంటే నాన్న ప్రొద్దున ఫోన్ చేశారు. తొందరలో ముహూర్తం పెట్టిస్తానని. అంతలోగా మీవాళ్ళతో మాట్లాడి వస్తానని కూడా అన్నారు'' అంది హారిక.

''అమ్మా నాన్న ఇప్పుడు ఊళ్ళో లేరు. అయినా మీవాళ్ళెవరేం వెళ్లక్కర్లేదు. మా డాడీతో నేనే చెబుతానీరోజు..'' అని వాళ్ళ కుటుంబం గురించి వివరాలు చెప్పమన్నాడు.

''ఏమిటి కొత్తగా అడుగుతున్నావు మళ్లీ.. మేముండేది కొచ్చిన్. నాకో చెల్లెలుంది. అదీ ఎమ్‌సిఏ చేస్తున్నదని చెప్పానుగా.'' అంది హారిక.

''ఆ విషయాలే కాదు. మీ అమ్మ నాన్న పేర్లు... మీరు వుండడం కొచ్చిన్ అన్నావు కాని స్వంత ఊరు ఆంధ్రప్రదేశ్‌లో గదా! అక్కడ ఏ ఊరని?'' అజిత్ అడిగీ అడక్కముందే ఆ వివరాలన్నీ చెప్పింది హారిక. అవి విన్న అజిత్‌కు ఒక్కసారిగా భూమి కంపించినట్లనిపించింది.

కాని హారిక ముందు బైటపడడం ఇష్టం లేక ''ఈ రోజు డాడీతో మాట్లాడతాను. డోన్ట్ వర్రీ'' అంటూ ఆమెకు ధైర్యం చెప్పాడు కాని తనకే భయంగా వుంది. తన తల్లికి గతం గుర్తువచ్చే ఏ పనీ చెయ్యకూడదని ఎప్పటి నుండో అనుకొనేవాడు. కాని ఇప్పుడు.. తను హారికను చేసుకుంటే మరిచిపోవాలన్నా తన తల్లి గతాన్ని మరవలేదు. అలా అని తను హారికను వదులుకోలేడు.. ఎలా?'' అనుకుంటూ ట్రయాంగిల్ సర్కిల్ నుండి ఇంటిత్రోవ పడుతుండగా సెల్ మోగింది. సూర్య దగ్గరినుండి ఫోన్.. ''అజిత్ నీకో గుడ్ న్యూస్‌రా...''.

''ఏమిటి నీకు ప్రమోషన్ వచ్చిందా?'' అడిగాడు అజిత్.

''ఏం ప్రమోషన్ తప్ప ఇంకే విషయమూ గుడ్‌న్యూస్ కాదా?'' అన్నాడు సూర్య కోపంగా. ''సరే అయితే చెప్పు'' తన ఆలోచనలతో ఏ మాత్రం ఉత్సాహం కనబరచకపోగా నీరస స్వరంతో అన్నాడు అజిత్. ఒకవేళ తల్లి తను కాదనడన్న నమ్మకంతో ఆ ఊళ్ళో వారెవరి అమ్మాయినో తనకు నిశ్చయించి ఆ మాట ముందు సూర్యకు చెప్పిందేమోనన్న అనుమానం వచ్చి మరింత అశాంతి పాలయ్యాడు అజిత్. 'అలా అయితే తనేం చెయ్యాలి?' అన్న అతడి ఆలోచనను త్రుంచేస్తూ అన్నాడు సూర్య: ''నేనొక అమ్మాయిని ప్రేమించాను''.

''అమ్మయ్యా.. నేనింకేదో అనుకొని భయపడ్డాను'' అన్నాడు అజిత్ తేలిగ్గా శ్వాస తీసుకుంటూ.

''ఏమనుకున్నావు?'' అడిగాడు సూర్య.

''ఏదో ఒకటి అనుకున్నానులే. నువ్వు చెప్పు ఎవర్ని ప్రేమించావు?'' అడిగాడు అజిత్.

''నేను చెబుతాను. ఆ విషయం అలా వుంచు. నువ్వేమిటి దిగులుగా మాట్లాడుతున్నావు? ఆఫీసులోకాని నీతోపాటు ఇంట్లో వుంటున్న వ్యక్తులవల్లకాని ఏదైనా ప్రాబ్లం వచ్చిందా?'' అజిత్ ఎప్పటిలా ఉత్సాహంగా మాట్లాడకపోయేసరికి అతడికి అనుమానం వచ్చింది.

''ఏం లేదురా అంతా బాగానే వుంది. ఏమిటో ఈ రోజు కాస్త డల్‌గా వుంది, అంతే'' అన్నాడు అజిత్. ''అదే.. ఎందుకంత డల్‌గా వున్నావని అడుగుతున్నాను'' రెట్టించి అడిగాడు సూర్య.

''నువ్వెవరో అమ్మాయిని ప్రేమించానన్నావు. నేనూ ప్రేమించాను..'' ఏదో ఘోరమైన నేరం చేసినట్లుగా అన్నాడు అజిత్.

''ఏం, ఖండాంతర వాసురాలిని అదే.. అక్కడుండే తెల్లవారి అమ్మాయిని ప్రేమించావా?'' అన్నాడు సూర్య.

''లేదు. అలా అయినా బాధ వుండేది కాదు. మమ్మీ డాడీలను ఒప్పించేవాడ్ని. ఆ కాలంలోనే డాడీ భర్తపోయిన అమ్మాయిని చేసుకున్న సంస్కారవంతుడు. ఆయన నేనీ దేశంలో అమ్మాయిని చేసుకుంటానన్నా కాదనరు. కానీ నేను కోరుకున్న అమ్మాయి మమ్మీ జీవితంలో చీకటి రోజులను గుర్తుకు తెచ్చేదౌతుందని నా భయం. అలా అని హారికను కాదనుకోలేనురా. వాళ్ళ అమ్మ నాన్న అన్ని విషయాలు తెలుసుకొనే అంగీకరించారు...'' అంటూ హారిక గురించి చెప్పాడు అజిత్. అంతా విన్న సూర్య నవ్వాడు. ప్రేమించేటప్పుడు ఎప్పుడు ఎవరికీ బాధ కలుతుందోనన్న ఆలోచన రాదు. మనసుకు మాత్రమే తెలిసి పదే పదే ఆ మనిషి తన స్వంతమవ్వాలనుకుంటుంది. అంతకుమించి అప్పుడే ఆలోచనా రాదు'' అన్న సూర్య మాటలు విని ''ఒరేయ్...'' బెదిరించినట్లు అని నవ్వాడు అజిత్. ''వింటున్నాను కదా అని బామ్మలు తాతయ్యలు మాట్లాడినట్లు మాట్లాడకు''

-ఇంకావుంది

అధ్యాత్మ రామాయణం



- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

యుద్ధకాండ 209

రఘునందనా! నీ విరాట్ శరీరం నుండే వేలకొలది అవతారాలు వస్తున్నాయి. అవి తమ పని ముగించుకొని నీలో లీనమై పోతున్నాయి. రఘువరా! ఈ లోకంలో మరొక ఆలోచన లేక ఎవరు నీ అవతార గాథలను గానం చేస్తారో, వింటారో వారికి ముక్తి తప్పక లభిస్తుంది.

ఓ రాఘవా! ఒకప్పుడు బ్రహ్మదేవుడు భూభారం తొలగించడానికి మిమ్ము ప్రార్థించాడు. ఆయన తపస్సుకూ ప్రార్థనకు సంతోషించి నీవు రఘుకులంలో అవతరించావు. రామా! దేవతలకే దుష్కరమైన గొప్ప కార్యాన్ని నీవు సాధించావు. ఇంకా ఎన్నో వేల సంవత్సరాలు నీవు ఈ మానవ దేహంలో ఉంటావు. ఇహ పరలోకాల కల్యాణం నిమిత్తం ఇంకా ఎన్నో అలౌకిక కార్యాలు చేస్తావు. పాప వినాశకరాలైన పనులెన్నో చేస్తావు. సర్వలోకాలు నీ యశస్సుతో పరిపూర్ణంగా నిండిపోతాయి.

జగన్నాథా! ఈ రోజిక్కడ ఉండు. సపరివారంగా మా ఆతిథ్యం స్వీకరించండి. రేపు పట్టణానికి వెళ్లవచ్చును. ఇది నా ప్రార్థన అన్నాడు భరద్వాజ ముని.

రాఘవుడు ముని మాటలు మన్నించి పరివార (సైన్య) సమేతంగా అక్కడే ఉన్నాడు. సీతా లక్ష్మణులతో పూజలందుకొంటూ ఆ ఉత్తమాశ్రమంలో ఆ రోజు నిలిచాడు.

అలా అక్కడున్న కాలంలో రాముడు కొంతసేపు ఆలోచించి మారుతిని పిలిచాడు. భావి కార్యక్రమయోజన వివరించాడు.

నీవు వేగమే ఇక్కడినుండి అయోధ్యకు వెళ్లు. రాజభవనంలో అందరి క్షేమం గురించి విచారించు. శృంగబేర పురానికి వెళ్లు; అక్కడ నా మిత్రుడు గుహుని క్షేమం తెలుసుకో! నేను జానకీ లక్ష్మణులతో వచ్చానని చెప్పు. నందిగ్రామానికి వెళ్లు; నా తమ్ముడు భరతుడక్కడే ఉన్నాడు. అతణ్ణీ కుశలమడుగు. నా కుశల సమాచారం తెలియజెయ్. సీతాలక్ష్మణ సమేతుడనై నేను వచ్చినట్లు చెప్పు. సీతాపహరణం మొదలు రావణ వధ పర్యంతం జరిగిన విషయాలన్నీ క్రమంగా వివరించు. శత్రుగణాల సంహరించి కృతార్థుడనై భార్యతో-తమ్మునితో భల్లూక వానర సమేతంగా నేను వస్తున్నానన్న వార్తలు చెప్పు. ఇలా చెప్పిన తర్వాత అక్కడి పరిస్థితులు తెలుసుకో. భరతుని వ్యక్తిత్వం- ప్రవర్తననూ గ్రహించి వేగమే వెనక్కు మళ్లి, నా దగ్గరికి రా! అని కార్యభార్యాన్ని మోపాడు రాముడు.

హనుమ వెంటనే సంసిద్ధుడై మానవుని రూపం ధరించాడు. పామును పట్టబోయే గరుడునిలాగా మారుతి వాయువేగంతో నందిగ్రామానికి చేరాడు. శృంగబేరపురానికి వెళ్లి గుహుణ్ణి కలిశాడు. ఎంతో సంతోషం నిండిన మనస్సుతో మధురంగా మాటాడాడు.

శ్రీమంతుడైన దాశరథి రాముడు ధర్మాత్ముడు. ఆయన నీ స్నేహితుడు; సీతతో సౌమిత్రితో క్షేమంగా ఉన్నాడు. నీ కుశలమడిగాడు. ఇపుడు భరద్వాజుని అనుమతి తీసుకొని అక్కడినుండి రాఘవుడు బయలుదేరుతాడు. రాముని ఈ ప్రయాణంలో నీవూ ఆయనను దర్శిస్తావు. ఈ మాటలతో గుహుడు పులకిత గాత్రుడయ్యాడు. ఇక అక్కడినుండి మారుతి అత్యంత వేగంతో ఎగసి పయనించాడు. రామతీర్థం దాటాడు; సరయూ నదిని చూశాడు; సంతోషంగా నందిగ్రామం చేరాడు. నందిగ్రామం అయోధ్యకు క్రోసు దూరంలో వుంది. అక్కడ భరతుడు ఆశ్రమంలో ఉన్నాడు. నార చీరలు కృష్ణాజినం ధరించి ఉన్నాడు. దీనుడై కృశించి ఉన్న భరతుణ్ణి హనుమంతుడు చూశాడు. ఆయనకు దేహధ్యాస లేదు; ఒడలంతా మురికే ఉంది; జడలూ వల్కలాలు ధరించి ఉన్నాడు. ఫలమూలాలే ఆహారంగా గ్రహిస్తూ రాముణ్ణే చింతిస్తున్నాడు.

- ఇంకావుంది

బుధవారం 24 డిసెంబర్, 2014

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ జయ, దక్షిణాయనం
హేమంత ఋతువు - మార్గశిరమాసం

తిథి: శుద్ధ తదియ రా.2.03
నక్షత్రం: ఉ.షా. సా.6.15
వర్జ్యం: రా.10.01 నుండి 11.32 వరకు
దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
  తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తిచేసుకోగలుగుతారు. మర్యాద మన్ననలను పొందుతారు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తారు.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
  ఇంతవరకు అనుభవించిన కష్టాలన్నీ క్రమేణా తొలగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా వుంటుంది. బంధు, మిత్రులతో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తారు.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
  ఋణప్రయత్నాలు సులభంగా ఫలిస్తాయి. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. వ్యవహారంలో ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం వుంది.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)**
  వృత్తి, ఉద్యోగ రంగాల్లో ఆలస్యంగా అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశాలున్నాయి. స్థిర నిర్ణయాలు తీసుకోలేకపోతారు. మెల్లగా అనుకూల పరిస్థితులేర్పడతాయి.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
  ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో స్థానచలన సూచనలున్నవి. ఆర్థిక పరిస్థితిలో మార్పులుంటాయి. ఋణప్రయత్నాలు చేస్తారు.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
  కుటుంబంలో సుఖ, సంతోషాలుంటాయి. ధన ధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. ప్రయత్న కార్యములు ఫలిస్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తినిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
  ఆకస్మిక ధననష్టంపట్ల జాగ్రత్త అవసరం. కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృధా ప్రయాణాలు చేస్తారు. స్థానచలన సూచనలున్నాయి.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
  ప్రయత్న కార్యాలన్నీ వెంటనే ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. ఋణబాధలు తొలగిపోతాయి.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
  స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ, ప్రయాసలు తప్పవు. కలహాలకు దూరంగా ఉండుటకు ప్రయత్నించాలి. దూర వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
  సంతోషంగా కాలం గడుపుతారు. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. ఇతరులచే గౌరవింపబడుదురు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థికచింత ఉండదు. స్త్రీలు మనోల్లాసాన్ని పొందెదరు.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
  శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభంలో ఆనందంగా ఉంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు. కీర్తి, ప్రతిష్ఠలు అధికమవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
  అద్భుతమైన అవకాశాలు లభిస్తాయి. అన్నింటా విజయాన్నే సాధిస్తారు. శుభవార్తలు వింటారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లోనివారికి అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధనలాభముంది.

మంచిమాట

అహంకారం

అనంతంగా ఉన్న ఈ వేదాంత సారమును విభజించి, వింగడించి వ్యాసమహర్షి నాలుగు వేదాలుగా మార్చారు. వేదాంత భాగమును వివరించి చెప్పడానికి ఆనాటి వ్యాసమహర్షి మొదలు ఈనాటి రమణమహర్షి వరకు అనేక మంది అనేక గ్రంథములు రచిస్తూనేఉన్నారు. ఆత్మ ఒక్కటే అనీ, అన్వేషించే వాని దృష్టినిబట్టివారికి ఆవిధంగానే అర్థమవుతుందంటారు మహర్షి రమణులు. ప్రపంచంలోని ఏ మతము వారైనాసరే, జగత్తు, జీవుడు, దేవుడు అనబడే అంశాలను ప్రతిఫలించేవే మతాలు. నిజానికి ఈ మూడింటిని అన్ని మతములూ అంగీకరిస్తాయి.

జగత్తు అంటే లోకము, మానవనుడు అవలోకించేదంతా, చూసేదంతా లోకమే. సాధకుడు చూసేది కనిపించినా, కనిపించకపోయినా బాహ్యాలలో ఉన్నదంతా లోకమే. రెండవది జీవుడు. ప్రాణికి నివాసయోగ్యమైన దేహం. తత్వశాస్త్రములు మినహా మిగతా మత సంబంధమైన గ్రంథములన్ని జీవుడు దేహదారి అని తలపోయుచున్నది. మూడవది ఈశ్వరుడు సర్వమాన పితుడు అయినా కానరాడు, అతనికి లింగబేధముగాని, వయో బేధముగాని, నామరూపాలు గాని లేవు. అజ్ఞాన దశలో ఉన్నవారు. ఈశ్వరున్ని, ఈశ్వరి ఈశ్వరము అనొచ్చు. ఈశ్వరుడే జీవుడని ఆయా సందర్భములను బట్టి చెప్పుకోవడం అజ్ఞానదశ అంటున్నారు భగవాన్!

ఉదాహరణకు మామిడి పండునే తీసుకుందాం. మామిడిపండులో టెంక, రసము, తొక్క మూడు కలిసియే ఒకటి. అయితే తాత్విక దృష్టితో చూసే మూడు ఒకటే. చూసే జీవుడు, చూడబడే లోకము, వాటికి ఆధారమైనవి కలిసియే ఈశ్వర స్వరూపమని భగవాన్ ఉవాచ. 'నేను, నాది, అనే తలంపే అనేక సాదృశ్యక జగత్తు అనుకోవడం పొరపాటు. నిన్ను నీవు ఎవరివో తెలుసుకొంటే ఈ సందేహాలకు ఆస్కారమే ఉండబోదు. ఒకవేళ అలాంటి భావాలు పొడచూపితే అవి నశించడం ఖాయమని మహర్షి తెలిపారు. త్రిగుణములు అంటే సత్త్వము - రజస్సు - తమస్సు అనే మూడు గుణములు. శుద్ధ సత్త్వము అయిన ఈశ్వరుని నుంచి తామసిక గుణము కలిగిన అహంభావన - 'నేను' అని అనుకునే అహంకారము యేర్పడగానే దానితోపాటు ఆలోచనలు - భావనలు - తలంపులు యేర్పడతాయి. అహం అంటే నేను. అహంకారం అంటే నేను అనే భావన. మొదటి అహంభావము పుట్టింది. ఆ తర్వాత ప్రపంచము. ఆత్మలో జనించిన అహము జగత్తునకు కారణమైంది. అహము నశించినప్పుడు దానితోపాటుగా లోకము నశించగా మిగిలి వుండిన ఈశ్వరుని స్థితిని పొందుట ఉత్తమమైన స్థితియనీ, అంతకంటే గొప్ప స్థితి లేదంటారు మహర్షి.

మానవుడు తనకు సంబంధించిన వ్యవహార జగత్తులోని కార్యకలాపములు కొనసాగించుకొనుటకు తన శరీరములో యేర్పరుచుకొన్న సాధనములలో అంతఃకరణ చతుష్టయము ఒకటి. ఆ నాలుగు అంతఃకరణములలో ఈ అహంకారం ఒకటి. కనిపించనిది కనబడు విధంగా మారడంలో... అనగా జీవునిగా అవతరించుటలో వచ్చిన మొదటి రూపము 'నేను - అహంకారం. ఈ అహంకారము చచ్చిపోతే - అనగా జీవుని స్థితిమారిపోయి తన మొదటిస్థితికి, కనిపించని స్థితికి మరలిపోతుంది. ఆ స్థితియే అత్యుత్తమమైన స్థితిని పేర్కొన్నారు. అహము కేవలము సత్తు. రెండవది అహంకారం. సత్తును తెలిసికొనుటకు అహంకారమును అణచవలసి యున్నది. బృహదారణ్యకములో ''అహం నామ అభవత్...'' అని ఉన్నది అహం పేరుగల వాడయెను. సత్తు మొదటి పేరు - అహం... అని మహర్షి చెబుతున్నారు.

నామమూ రూపమూ లేని శుద్ధసద్రూపము మొదటి నామ రూప ప్రపంచముగా మారుటలో మొట్టమొదటి పేరు అహంకారము అయినది. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు అని పిలవబడే ఈ మూడింటిలో మధ్యనున్న జీవుడే అహంకారం. ఆది, నేను, అని చెప్పుకుంటుంది. శుద్ధసత్త్వమైన ఈశ్వరునకు నేను అని చెప్పుకోవాల్సిన పని లేదు. కనుక చెప్పడు. చైతన్యములేని, జడము అయిన లోకము - అది కూడా నేను అని చెప్పదు. అహంకారం నశించినప్పుడు జగత్తు అదృశ్యమౌతుంది. ఇక మిగిలేది అంటే శేషించేది ఈశ్వరుడు ఒక్కడే అని భగవాన్ చెబుతారు.

-దాసరి కృష్ణారెడ్డి

సత్యభామ 51

బొమ్మలు: శ్రీరామ్



మాటాట

నిర్వహణ: సుధామ **591**



ఆధారాలు

ఆధారాలు: 85
అడ్డం

1. క్రీస్తు జన్మదినం
2. సంబరం
4. ఉద్యానవనం
6. ఋట్టు, తట్టువంటిదే
7. బైబిల్‌ను ఇలా సంభావిస్తారు
11. ఏప్రిల్ కు ముందు
12. పరమాత్మ రాయబారి నిలువు

1.కర్త కర్మల తోడిది
2. మృగయా వినోదం
3. ఒకరకం నాణ్యమైన కట్టె
5. అప్పటికప్పుడు చెప్పేది
6. పన్నీరు తోడిది
7. పాపికి వ్యతిరేకి
8. ముడి
9. క్రైస్తవుల ప్రార్థనాస్థలం
10. పడవ

మాటాట - 590 సమాధానం



రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

ఒత్తిళ్ల ఫలితం.. పార్శ్వ నొప్పి

ప్రస్తుత తరుణంలో క్షణం తీరిక లేని జీవనం.. నిత్యం పరుగులు, సమయానుకూలంగా, నిద్ర, ఆహారం లేక.. నిలకడలేని ఆలోచనలతో యంత్రాలతో పరిగెడుతూ.. తీవ్ర మానసిక ఒత్తిడికి గురై మానవుడు వ్యాధుల బారిన పడుతున్నాడు. ఇలాంటి ఒత్తిడివలన వచ్చే వ్యాధుల్లో ముఖ్యమైనది పార్శ్వపు నొప్పి. దీనిని వైద్య పరిభాషలో మైగ్రేన్ అంటారు. నేడు పార్శ్వపు నొప్పితో ఎక్కువగా బాధపడుతున్నవారిలో అధికం స్త్రీలే. దీనికి గల కారణం అంతర్గత మానసిక ఒత్తిడితోపాటు అధిక పనిభారం. పార్శ్వపునొప్పివలన ఏ పని సరిగా చేయలేక అంతర్గతంగా మదనపడి మానసిక వ్యాధులకు సైతం గురవుతున్నారు.

కొందరిలో తలనొప్పి ఒకే వైపు వచ్చి వేధిస్తుంది. ఇలాంటి తలనొప్పిని పార్శ్వపు నొప్పి (మైగ్రేన్) అంటారు. ఈ నొప్పి తీవ్రత క్రమంగా పెరిగి క్రమంగా తగ్గుతుంది. నొప్పి భరించలేకుండా వుండి తల దిమ్ముగా ఉంటుంది.

లక్షణాలు

తలనొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు చిరాకు, కోపం ఎక్కువగా ఉండి ఏ పని చేయడం కుదరదు. దీంతో పాటుగా వాంతికి వచ్చినట్లుగా అనిపించడం, శబ్దాలు భరించలేకపోవటం, వెలుతురును సరిగా చూడలేకపోవటం, కళ్లకు చీకటి వచ్చినట్లుగా అనిపించటం వంటి లక్షణాలతో బాధపడుతూంటారు.

కారణాలు

అధిక మానసిక ఒత్తిడివలన మెదడులో కొన్ని రసాయనిక మార్పులు జరిగి మైగ్రేన్ నొప్పి వస్తుంది. మెదడు కణాలలో కణుతులు ఏర్పడటం వల్ల కూడా మైగ్రేన్ నొప్పివస్తుంది.

తలకు గాయాలు తగలడంగాని, కొన్ని సందర్భాల్లో మెదడులోవచ్చే ఇన్‌ఫెక్షన్స్‌వల్ల కూడా మైగ్రేన్ నొప్పి వస్తుంది.

కంటికి సంబంధించిన వ్యాధులను నిర్లక్ష్యం చేయడంవల్ల సైతం మైగ్రేన్ నొప్పి వచ్చి వేధిస్తుంది.

జాగ్రత్తలు

మొదటగా మానసిక ఒత్తిడి నివారణకు యోగా, మెడిటేషన్, ప్రాణాయామము నిత్యం చేయాలి. ఇలా చేస్తే మానసిక ప్రశాంతత కలిగి మైగ్రేన్ నొప్పి తీవ్రత తగ్గుతుంది.

మైగ్రేన్ నొప్పి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు శబ్దాలు లేని చీకటి గదిలో విశ్రాంతి తీసుకోవాలి.

ఫాస్ట్‌ఫుడ్స్, వేపుళ్లకు స్వస్తి పలికి పుష్టికరమైన ఆహారం తీసుకోవాలి.

ఆకుకూరలు, కాయగూరలు, తాజా పండ్లు తీసుకోవటానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి.

నీరు అధికంగా తీసుకోవాలి. వేళకు ఆహారం తీసుకుంటూ సమయానికి నిద్ర పోతూ ఉండాలి.

ప్రతిరోజూ వేకువ జామున లేచి 45 నిముషాల పాటు నడవటం అలవాటు చేసుకోవాలి. తద్వారా రక్తప్రసరణ సక్రమంగా జరిగి మైగ్రేన్ నొప్పి తీవ్రత తగ్గుతుంది.

చికిత్స

పార్శ్వపు తలనొప్పే కదా అని వైద్యం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలకు దారితీయును. హోమియో వైద్యంలో పార్శ్వపు తలనొప్పి (మైగ్రేన్)కి మంచి చికిత్స కలదు. ఈ వైద్య విధానంలో మందును ఎన్నుకునే ముందు వ్యక్తి యొక్క మానసిక లక్షణాలను, శారీరక లక్షణాలను, అలవాట్లను పరిగణనలోకి తీసుకొని మందును ఎన్నుకోవడం జరుగుతుంది. కావున వ్యాధి నివారణ సమూలంగా జరుగుతుంది.



మందులు.. సాంగ్వినేరియా: కుడివైపు వచ్చే పార్శ్వపు తలనొప్పికి ఇది మంచి మందు. తలనొప్పి పోట్లతోకూడి భరించలేకుండా ఉంటుంది. తలనొప్పి వెనుకనుండి ప్రారంభమై ముందుకు వచ్చి తల కుడివైపు భాగంలో ఎక్కువగా ఉంటుంది. తలనొప్పి వచ్చినపుడు వీరు చీకటి గదిలో విశ్రాంతి తీసుకోవటంవలన ఉపశమనం పొందుట గమనించదగిన లక్షణం. ఇటువంటి లక్షణాలున్నవారికి ఈ మందు తప్పక ఆలోచించదగినది.

స్పైజీలియా: ఎడమవైపు వచ్చే పార్శ్వపు తలనొప్పికి ఇది మంచి మందు. తలనొప్పి నుదుటి, కంటి భాగాలలో పోట్లతోకూడి భరించలేకుండా ఉంటుంది. తలనొప్పి వెనుకనుండి ప్రారంభమై ముందుకు వచ్చి తల ఎడమవైపు కణతల భాగంలో ఎక్కువగా ఉంటుంది. తలనొప్పి కదిలినా, కుదిపినా ఎక్కువ గుట గమనించదగిన లక్షణం. ఇటువంటి లక్షణాలున్నవారికి ఈ మందు ప్రయోజనకారి.

కాలీబైక్: తలనొప్పి ముక్కు మొదటభాగంలో ప్రారంభమవుతుంది. తలనొప్పి వచ్చేముందు చూపు మసకబారుతుంది. తరచుగా జలుబు చేయడంవలన ఇటువంటి పార్శ్వపు తలనొప్పి వస్తుంది. సైనసైటీస్‌తో బాధపడేవారిలో ఈ నొప్పి ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి లక్షణాలున్నవారికి ఈ మందు తప్పక ఆలోచించదగినది.

సైలీషియా: తల వెనుక భాగంలో నొప్పి ప్రారంభమై తలమీదుగ కుడి నుదుటి కంటి భాగంలో ఎక్కువగా ఉంటుంది. నొప్పి తీవ్రత ఎక్కువగా ఉండి తల పగిలిపోతున్నట్లుగా అనిపిస్తుంది. తలనొప్పి వచ్చేముందు చూపు మసకబారి వస్తువులు సగంవరకే కనిపించుట, అరికాళ్లలో అరి చేతులలో చెమటలు ఎక్కువగా ఉండుట గమనించదగిన లక్షణం. నొప్పి ఇంకా ఎక్కువగా ఉన్నప్పుడు శబ్దాలు భరించలేరు. ఇటువంటి లక్షణాలున్నవారికి ఈ మందు తప్పక వాడుకోదగినది.

ఈ మందులే కాకుండా బ్రయోనియా, జెల్సిమియం, సెపియా, నైట్రోమోర్, కాల్కేరియా ఫాస్ వంటి మందులను వ్యాధి లక్షణాలను పరిగణనలోకి తీసుకొని ఎన్నుకొని వైద్యం చేసిన పార్శ్వపు నొప్పి (మైగ్రేన్) నుండి విముక్తి పొందవచ్చు.

డా.పావుశెట్టి శ్రీధర్
9440229646

మెనోపాజ్.. జబ్బు కాదు

స్త్రీకి బహిష్టులు అగిపోవడాన్ని 'మెనోపాజ్' అంటారు. ఇది స్త్రీ సంతానోత్పత్తి దశ ముగింపుగా వచ్చే సహజ పరిణామమే కాని ఒక వ్యాధి కాదు. క్రమేపీ రజస్వల అయే వయసు తగ్గి మెనోపాజ్ వచ్చే వయసు పెరుగుతోంది. ప్రస్తుతం అత్యధిక స్త్రీలకు 50 సంవత్సరాలు దాటాక మెనోపాజ్ వస్తోంది.

యవ్వన ప్రారంభం నుంచి స్త్రీ అండాశయాలలో ఉత్పత్తి అయ్యే స్త్రీ సెక్స్ హార్మోన్ 'ఈస్ట్రోజన్' గర్భాశయంపై కలగజేయు ప్రభావంతో స్త్రీకి బహిష్టులు వస్తాయి. సంతానోత్పత్తి దశ చివరిలో అండాశయాలలో ఈస్ట్రోజన్ ఉత్పత్తి క్రమేపీ తగ్గి, తరువాత పూర్తిగా ఆగిపోవడంతో బహిష్టులు ఆగిపోతాయి.

అండాశయాలు లేక గర్భాశయం లేక రెండింటినీ శస్త్ర చికిత్స ద్వారా తొలగిస్తే లేక వాటికి రేడియం చికిత్స చేస్తే ఈస్ట్రోజన్ ఉత్పత్తి తగ్గి అకస్మాత్తుగా మెనోపాజ్ వస్తుంది.

బహిష్టులు ఆగిపోవడానికి 8-10 నెలల ముందునుండి మెనోపాజ్ లక్షణాలు ప్రారంభమవుతాయి.

మెనోపాజ్ - మీ జీవితంలో కీలకదశ

ఆరోగ్యంగా, చురుకుగా వుంటూ ఈ దశను సద్వినియోగం చేసుకోండి.

ఎలా?

1.మెనోపాజ్ గురించి, మెనోపాజ్ సమయంలో, ఆ తరవాత ఆరోగ్యంగా వుండడానికి అవసరమైన స్క్రీనింగ్, రోగ నిర్ధారణ పరీక్షలు జీవన శైలికి సంబంధించిన, చికిత్సకు సంబంధించిన వాటిని గురించి సాధ్యమైనంత ఎక్కువ తెలుసుకోండి.

2.మీకు మెనోపాజ్ గురించి సమాచారాన్ని తెలిపి మీకు ఆసరాను, ధైర్యాన్ని ఇవ్వగల మీ డాక్టరును సంప్రదించండి.

మెనోపాజ్ లక్షణాలు:

సాధారణంగా కనపడేవి

-క్రమహిత బహిష్టులు

-బహిష్టులు త్వరగా లేక ఆలస్యంగా రావడం

-రుతుస్రావం తక్కువగా లేక చాలా ఎక్కువగా అవడం

-రుతుస్రావం చాలా తక్కువ లేక ఎక్కువ రోజులపాటు అవడం

-శరీరమంతా వేడి పాకడం, రాత్రి పూట చెమటలు

-గుండె క్రమం తప్పి కొట్టుకోవడం

-చిరాకు, కోపం

-వేగంగా మూడ్ మారడం అకస్మాత్తుగా కన్నీరు కార్చడం

-రాత్రివేళలో నిద్ర పట్టడంలో ఇబ్బంది

-లైంగిక కోరిక తగ్గడం

-తుమ్మినా, దగ్గినా, నవ్వినా, మూత్రం కంట్రోల్ లేకుండా తెలియకుండా జారిపోవడం

-చర్మం పొడిబారి, దురదపెట్టడం

-కండరాలు పట్టేయడం

-రొమ్ముల్లో నొప్పి

-తలనొప్పి

-బరువు పెరగడం

-జుట్టు వూడిపోయి పలచబడడం- తలమీద, మానంమీద శరీరమంతటా, ముఖంమీద అవాంఛిత రోమాలు పెరగటం

-శరీర వాసనలో మార్పు

-చిగుళ్ళ సమస్యలు, చిగుళ్ళనుండి ఎక్కువ రక్తం కారడం

-గోళ్ళు మెత్తగా అయి, చిట్లి, సులభంగా విరిగిపోవడం

-చెవుల్లో మోతలు/ మానసిక లక్షణాలు/ -నిస్త్రాణ/ -ఆందోళన

-ఏకాగ్రతను కోల్పోడం, మతిమరుపు, మానసిక గందరగోళం

-కుంగుబాటు లేక తీవ్ర విచారం (డిప్రెషన్)

-అప్పటికే వున్న మానసిక సమస్యలు తీవ్రమవడం

కళ్ళు తిరగడం, తల దిమ్ము, మధ్య మధ్యలో అకస్మాత్తుగా సమతౌల్యాన్ని కోల్పోవడం

శరీరంలో వేడి పాకడం, రాత్రి పూట చెమటలు (హాట్ ఫ్లాషెస్ అండ్ కోల్డ్ స్వెట్స్):

ముఖం, మెడ, ఛాతి మరియు నడుములో ప్రారంభమైన వేడి శరీరమంతా పాకుతుంది. కొంతమంది స్త్రీలకు రోజుకు 1, 2 సార్లు ఇలా హాట్ ఫ్లాష్‌లు వస్తాయి. మరికొంతమంది స్త్రీలకు గంటకు 3 సార్లు కూడా వస్తాయి. ఇవి పగటిపూట అకస్మాత్తుగా రావచ్చు. రాత్రి పూట చెమటలు పట్టి నిద్రాభంగం కలగవచ్చు. ఇవి స్వల్పంగా శరీరం కండరం దగ్గర నుంచి, ముచ్చెమటలు పట్టి శరీరం తడిచి ముద్దయిపోవడం వరకు వుండవచ్చు. కొంతమందికి కొద్దిపాటి చికాకును కలిగిస్తాయి. మరి కొంతమందికి ఎక్కువ ఇబ్బందిని కలిగిస్తాయి.

సూచనలు

-తేలికగా వుండి, చెమటలు బాగా పీల్చుకునే నూలు దుస్తుల్ని వేసుకోండి.

-మీరు నిద్రపోయే గది మరీ వేడిగా వుండకుండా చూసుకోండి. గాలి సరిపడా తగిలేలాగా కిటికీకి దగ్గరగా పడుకోండి.

-హాట్ ఫ్లాష్‌ని ప్రేరేపించే వాటిని నివారించండి. ఉదా:వేడి పదార్థాలు, కాఫీ, టీ, మసాలా, కారపు పదార్థాలు, అంతేకాక నిద్రపోవడానికి 2 గంటలలోపు వేడి నీటి స్నానం చేయకండి.

హాట్ ఫ్లాష్ వస్తుందనే అనుమానం రాగానే లేక ప్రారంభం కాగానే వేగంగా ఊపిరి తీసుకోండి. నిమిషానికి 6-8 సార్లు నింపాదిగా, గాఢంగా ఊపిరి తీసుకోండి. ప్రతిసారి మీ పొట్ట కుహరాన్ని, ఊపిరితిత్తుల్ని గాలితో నింపుకోండి.

-ఆక్యుపంక్చర్, మెడిటేషన్, సెల్ఫ్ హిప్నోసిస్ మొదలైన సహాయపడగల పద్ధతుల్ని ప్రయత్నించండి.

-డాక్టర్ సలహాతో కొన్ని మందుల్ని వాడవచ్చు.

నిద్రాభంగం

కొంతమందికి నిద్రపట్టడం కష్టమవవచ్చు లేదా మధ్య మధ్యలో మెలకువ వచ్చేయవచ్చు లేదా మామూలుకంటే చాలా త్వరగా మెలకువ వచ్చి మరి నిద్రపట్టకపోవచ్చు

సూచనలు

క్రమబద్ధమైన నిద్రా పద్ధతిని రూపొందించుకోండి. ప్రతి రాత్రి ఒకే సమయంలో నిద్రపోయి, ప్రతి ఉదయం ఒకే సమయంలో మేల్కొనడానికి ప్రయత్నించండి. మీరు నిద్రించే గదిని చల్లగా, తక్కువ కాంతి వుండేలా నిశ్శబ్దంగా ఉండేలా చూసుకోండి.

-మీరు నిద్రించే గదిని కేవలం నిద్రపోవడానికి, లైంగిక సంపర్కానికి మాత్రమే ఉపయోగించండి.

-ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలపాటు నడవండి. నిద్రపోవడానికి 3 గంటలలోపు ఎక్కువ వ్యాయామం చెయ్యకండి. అయితే పడుకునే ముందు ఒక పావుగంట సేపు రిలాక్సేషన్ వ్యాయామాలు చెయ్యడం ఫలితాన్ని ఇవ్వవచ్చు.

-సాయంత్రం సమయంలో వేడి పానీయాలు తాగకండి.

-రాత్రిపూట కడుపునిండుగా తినకండి.

-నిద్రపోవడానికి 2 గంటలలోపు ఏమీ తాగకుండా వుంటే రాత్రి మధ్యలో మూత్ర విసర్జనకు లేవవలసిన అవసరం వుండదు.

-నిద్రపోవడానికి పడుకున్నాక 15 నిమిషాలలోపు నిద్రపట్టకపోతే, లేచి, రిలాక్స్ అవడానికి ఏదైనా చెయ్యండి.

ఉదా: లలిత సంగీతాన్ని వినడం, మంచి పుస్తకాల్ని చదవడం మొదలైనవి.

ఈ సూచనలేవీ ఫలితాన్ని ఇవ్వకపోతే మీ డాక్టరుని సంప్రదించండి.

3.వేగంగా మూడ్ మార్పులు, కుంగుబాటు మరియు ఆందోళన

మెనోపాజ్ దశలో హార్మోన్లలో కలిగే మార్పుల కారణంగా చాలామందికి మూడ్ మార్పులు వస్తాయి.

సూచనలు

1.మీకు ఆనందం కలిగించే పనుల్ని చెయ్యడానికి మీ కోసం మీరు కొంత సమయాన్ని కేటాయించుకోండి.

-మీ హృదయానికి సన్నిహితులైన కుటుంబ సభ్యులు, మిత్రులతో సంతోషంగా కొంత సమయాన్ని గడపడానికి అనువైన కార్యక్రమాల్ని రూపొందించుకోండి.

డా.ఆలూరి విజయలక్ష్మి
9849022441

మీకు మీరే డాక్టర్

మూత్రపిండాలకు శక్తి

ప్ర: నా భార్య నెఫ్రాపతితో బాధపడుతోంది. క్రియేటినిన్ 2-3 మధ్యన నడుస్తోంది. ఇప్పటికి మూడుసార్లు డయాలసిస్ చేయించాము. రిపోర్టులను జత చేశాము. ఆయుర్వేదంలో ఏదైనా ఉపాయం చెప్పగలరా?

జె.లక్ష్మీనారాయణ, ప్రొద్దుటూరు

జ: మూత్రపిండాల పనితీరును మెరుగుపరిస్తే శరీరంలో ఏర్పడిన విషదోషాలు నెమ్మదిస్తాయి. మందుల సంగతి అలా ఉంచండి.. దర్భవేళ్ళను సేకరించుకోండి. గ్రామీణ ప్రాంతాలలో దొరుకుతాయి. కడిగి ఎండించి మెత్తగా దంచిన పొడిని ఒక చెంచా మోతాదులో గ్లాసు పాలలోనో, మజ్జిగలోనో కలిపి తాగవచ్చు. లేదా టీలాగా (కషాయం) కాచుకుని తాగవచ్చు. రోజూ ఇలా విడవకుండా చేయండి. తప్పక ఫలితం కనిపిస్తుంది. గోక్షురాది చూర్ణాన్ని కూడా రోజూ మజ్జిగలో కలుపుకుని తాగండి. ఈ రెండు ప్రయోగాలు మూత్రపిండాలను బలపరుస్తాయి. కొండ పిండి ఆకు, గలిజేరు ఆకు, గజపల్లేరు ఆకు వీటితో కూర, పప్పు, పచ్చడి లాంటివి చేసి అన్నంలో పెట్టండి. పునర్నవారిష్ట, నవక గుగ్గులు, గోక్షురాది గుగ్గులు, మేహాంతక రసం లాంటి ఆయుర్వేద ఔషధాలున్నాయి. ఆయుర్వేద వైద్యుని సలహా మీద వాడండి.

వ్యాధి కోసమే పథ్యం

ప్ర: ఆయుర్వేదానికి పథ్యం అవసరమా?

జె.వి.నరసింహారావు, సూర్యాపేట

జ: పథ్యం అంటే రోగాన్ని పెంచే ఆహార విహారాదులను మానటం, రోగాన్ని తగ్గించే ఆహార విహారాలను సేవించటం అని అర్థం. ఇది వ్యాధి కోసం ఉంటుంది కానీ, వాడుతున్న మందుల కోసం ఉండదు. ఏ వైద్య పద్ధతిలో చికిత్స తీసుకుంటున్నా కడుపులో మంట ఉన్న వాళ్ళకు మిరపకాయ బజ్జీలు మానాలని చెప్పక తప్పదు కదా! అవి మానటం అనేది ఏ 'ఒమిప్రజోల్' ఔషధం కోసమో కాదు గదా! అన్నీ తినబోయే ముందు, వ్యాధిని పెంచేవి, తగ్గించేవీ గుర్తించి తినాలని ఆయుర్వేదం చెప్తుంది. ఇతర వైద్య శాస్త్రాలు కూడా ఇదే చెప్తాయి. ట్రీట్ ది కాజ్ అనేది సిద్ధాంతం. వ్యాధి తగ్గటానికి పథ్యం అవసరం.

'జిడ్డు' సమస్య

ప్ర: ముఖానికి జిడ్డు తగ్గాలంటే ఏం చెయ్యాలి... దయచేసి వివరించండి!

కె.శారద, రాజమండ్రి

జ: ముఖంమీద జిడ్డు పోవాలంటే, జిడ్డు (కొవ్వు)ని శరీరంలో పెంచే ఆహార పదార్థాలు మానేయాలి! తరచూ ముఖాన్ని కడుక్కోండి. వారానికి రెండు మూడు సార్లయినా ముఖానికి నలుగు పెట్టుకోండి. ఐదారుసార్లు ముఖప్రక్షాళన చేసుకుంటే జిడ్డు, మట్టి అనేవి ముఖంమీద పేరుకోకుండా ఉంటాయి. ముఖం, కాళ్ళూ చేతులూ కడుక్కుంటే శ్రమ, అలసట తగ్గి హాయి చేకూరుతుంది. వ్యాయామంవలన చర్మం కింది పొరల్లో ఉండే కొవ్వు తగ్గుతుంది. చెమట ఎక్కువపడితే, స్వేద రంధ్రాలు విచ్చుకుని మొటిమలు రాకుండా ఆగుతాయి. మానసిక ఆందోళనలూ, భయాలూ, దుఃఖాలు, కోపతాపాలు ముఖంమీద జిడ్డును పెంచుతాయి. కాబట్టి సాధ్యమైనంతవరకూ మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలి. వేళకు భోజనం, పెందరాళే పడుకుని, తెల్లవారుఝామునే నిద్రలేవటం, ప్రొద్దున్నే నీళ్ళు త్రాగటం, జిడ్డు తగ్గే ఉపాయాలే! ప్రాణాయామం బాగా ఉపయోగపడుతుంది.

డా॥ జి.వి.పూర్ణచందు,
సుశ్రుత ఆయుర్వేదిక్ హాస్పిటల్, సత్యం టవర్స్,
1వ అంతస్థు, బకింగ్‌హాంపేట,
పోస్టాఫీసు ఎదురు, గవర్నర్‌పేట,
విజయవాడ-500 002. సెల్:9440172642,
purnachandgvgmail. com

జీవన శైలి గతి తప్పితే..

కాలేయానికి చేటు



● **కాలేయ మార్పిడి అవసరమైన 'సిర్రోసిస్'కి కారణాలేమిటి?**

-అతిగా మద్య సేవనం, హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్స్ మన దేశంలో ముఖ్యంగా 'సిర్రోసిస్'కి కారణాలు. ఈ సిరోసిస్‌తో కాలేయము తన పనులు చేసుకోలేదు. కాలేయము 500కి పైగా ముఖ్యమైన పనులు చేస్తుంది. అందుకని సిర్రోసిస్ వస్తే కాలేయ మార్పిడి తప్పదు. జీవన విధానం సరైనది కాకపోయినా, ఆహారపు అలవాట్లు అనారోగ్యకరంగా వున్నా, అధిక బరువు కలిగి ఫాటీ లివర్‌తో కాలేయం దెబ్బతినవచ్చు. ఈ తరహాలో వచ్చే లివర్ సిర్రోసిస్ రోజు రోజుకి పెరుగుతోంది. ముందు ముందు కాలేయ మార్పిడికి ఇదే ప్రధాన కారణం కావచ్చు. పిల్లల్లో పుట్టుకతో వచ్చిన కారణాలుగాని, విల్సన్స్ డిసీజ్, బెల్‌డక్ట్స్, ఎట్రీషియా, మెటబాలిక్ సమస్యలు కాలేయం దెబ్బతినడానికి కారణాలు.

● **సిరోసిస్ వస్తే కాలేయ మార్పిడి తప్ప మరే చికిత్సా మార్గం లేదా?**

-సిరోసిస్ వల్ల కాలేయము దెబ్బతిని ముడుచుకుపోతుంది. మళ్లీ మామూలు కాలేని మార్పది. సిర్రోసిస్ పెరగకుండా ఆపగలిగే మందు లేదు. సిర్రోసిస్ లక్షణాలు కనిపించకుండా కొన్ని ఇబ్బందులున్నాయిగాని సిర్రోసిస్‌కి మందులు లేవు. రోగికి ఉపశమనాన్ని కలిగించవచ్చు గాని జీవితాన్ని పొడిగించలేం. కాలేయ మార్పిడి చేయకుండా వుంటే రకరకాల సమస్యలతో రోగి క్రమంగా మరణించవచ్చు.

● **కాలేయ మార్పిడి ప్రధానంగా ఎన్ని విధాలు?**

-కాలేయ మార్పిడికి కెడావరిక్ డొనార్ దానంతోను, లివింగ్ డొనార్ దానంతోను చేస్తారు.

కెడావరిక్ డొనేషనంటే బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తినుంచి, అతను లేక ఆమె బంధువుల సమ్మతితో లభించే దానం. సాధారణంగా రోడ్ యాక్సిడెంట్లలో తలకి దెబ్బ తగిలిన వాళ్ళు, బ్రెయిన్ హేమరేజ్‌తోనూ, బ్రెయిన్ డెడ్ అయిన వాళ్ళని గుర్తించి వాళ్ళ వాళ్లు ఒప్పుకుంటే అవయవదానాన్ని చేయించవచ్చు. బ్రెయిన్ డెడ్ అయినవాళ్ళు బ్రతకరు కాబట్టి, చట్టరీత్యా మరణంగా దానిని గుర్తించి దానానికి అంగీకరిస్తారు. మూత్రపిండాలు కాలేయం ఫాంక్రియాజ్, గుండె, ఊపిరితిత్తులు, కణాలలాంటి అవయవాలతో కనీసం ఎనిమిది మందికి కొత్త జీవితాన్నివ్వవచ్చు. అవయవాలు తీయడానికి ప్రభుత్వం కొన్ని ఆసుపత్రులకు అనుమతివ్వడం జరుగుతుంది. అలాగే అవయవాల మార్పిడి ఎవరుపడితే వారు చేయకూడదు. అనుమతి ఉన్న అవయవాల మార్పిడినే ఆయా ఆసుపత్రులు చేయాలి. అలాగే బ్రెయిన్ డెడ్‌ని న్యూరాలజిస్ట్, ఫిజీషియన్‌లతో కూడిన ఓ టీమ్ ఆరు గంటల తేడాతో పరీక్షించి నిర్ధారిస్తుంది.

● **ఇప్పుడు మన దేశంలో కెడావరిక్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ పరిస్థితి ఏమిటి?**

-బ్రతికివున్న దాత నుంచి దానం స్వీకరిస్తే 'రిస్క్' ఉండవచ్చు. బ్రెయిన్ డెడ్ అయినవాళ్ళనుంచి దానం స్వీకరిస్తే ఎలాంటి రిస్క్ ఉండదు. కాని, మన దేశంలో కెడావరిక్ దానాలు, ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉన్నాయి. యాక్సిడెంట్లలో ఎందరో మరణిస్తున్నారు. కానీ, కెడావరిక్ డొనేషన్స్ 1 శాతం మాత్రమే జరుగుతున్నాయి. ఉత్తర భారత్‌లో అసలు జరగడం లేదనే చెప్పాలి. దక్షిణ భారతదేశంలో జరుగుతున్నాయి గాని ఇంకా పెరగాలి.

● **లివింగ్ డొనార్ డొనేషన్స్ సంగతేమిటి?**

-రక్తసంబంధీకులు మాత్రమే లివింగ్ డొనార్ డొనేషన్స్ చేయవచ్చు. కాలేయంలో సగభాగం దానం చేస్తే చాలు- దాతకి స్వీకర్తకి ఇద్దరికీ కాలేయం రెండు నెలల్లో పూర్తిస్థాయికి పెరుగుతుంది.

● **ఎవరు దానం చేయవచ్చు?**

-రక్తసంబంధీకులై ఆరోగ్యంగా ఉండాలి. ఎటువంటి ఇన్‌ఫెక్షన్స్ ఉండకూడదు. డయాబెటిసు, అధిక రక్తపోటు, గుండెజబ్బులు అసలు ఉండకూడదు. మద్యం సేవించేవాళ్లు, అధిక బరువున్నవాళ్లు అనర్హులు. రక్త సంబంధీకుల నుంచి కాకుంటే బంధువులనుంచి స్వీకరించాలన్నా ప్రభుత్వ అనుమతి అవసరం.

● **కాలేయ మార్పిడి సురక్షితమంటారా?**

-దాతని సరిగ్గా గుర్తించగలిగితే పెద్ద శస్త్రచికిత్సలైనా నైపుణ్యంతో చేయగల వైద్యులం ఉన్నా ఏ శస్త్ర చికిత్సలు అయినా 100 శాతం విజయవంతం కావు. దాతలకి చాలా తక్కువ రిస్క్ ఉంది. 200 నుంచి 500 మందిలో ఒకరికి రిస్క్.

డా. రావుల ఫణికృష్ణ
సర్జికల్ గాస్ట్రో ఎంటెరాలజిస్ట్ అండ్ ఒబెసిటీ సర్జన్
9701025111

వంకర పళ్లకు ఓరల్ స్క్రీన్

పిల్లల్లో పాల పళ్ళు ఊడి వాటి స్థానంలో శాశ్వత పళ్ళు వస్తాయన్నది తెలిసిందే. ఈ శాశ్వత పళ్ళు పిల్లవాడి దవడ ఎముకపై, పాలపళ్ళు అమరికపై ఆధారపడి ఉంటాయి. అంటే కొంతమందికి చిన్న దవడ ఉండి పాల పళ్ళు కూడా దగ్గర దగ్గర ఉంటాయి. మరి కొంతమందికి దవడ ఎముక కొంచెం పెద్దగా ఉండి పాలపళ్ళు దూరం దూరంగా వచ్చి, పళ్ళకు పళ్ళకు మధ్య ఖాళీలుంటాయి.

ఈ పాలపళ్ళు ఊడి శాశ్వత పళ్ళు వచ్చే ప్రక్రియలో శాశ్వత పళ్ళు పెద్దగా ఉండటం వల్ల ఉన్న పాలపళ్ళ స్థానంలో ఇమడలేక వంకరగా, కోలగా రావడం, తరువాత వచ్చిన పన్ను కిందకి పోవడం జరుగుతుంది.

ఈ పరిస్థితిలో తల్లిదండ్రులు కొంచెం శ్రద్ధ తీసుకుంటే, అంటే పిల్లవాడి పళ్ళను గమనించి ఎగుడుదిగుడు పళ్ళు కనిపిస్తే సరైన సమయంలో చికిత్స చేయించినట్లయితే తల్లిదండ్రులకు, భవిష్యత్‌లో పిల్లలకు ఆనందదాయకంగా ఉంటుంది.

ఈ విషయంలో మన పెద్దలు చెప్పిన 'మొక్కై వంగనిది మానై వంగునా' అన్న సామెతను గుర్తుంచుకోవాలి. ఈ వయస్సులో చాలా తక్కువ శ్రమతో తక్కువ ఖర్చుతో తక్కువ కాలం ఎక్కువ లాభాన్ని పొందటమే కాకుండా, చికిత్సా పద్ధతి కూడా సులభంగా ఉండి మనం ఆశించిన విధంగా ఉన్నతమైన రీతిలో చికిత్స జరుగుతుంది.

కనుక తల్లిదండ్రులు వారి పిల్లల ఆరోగ్య దృష్ట్యా, పళ్ళ వరుస క్రమాన్ని, ముఖకవళికలను దృష్టిలో పెట్టుకొని, దంత వైద్య నిపుణులను సంప్రదిస్తే ఆ పిల్లవాడికి సరైన చికిత్స జరుగుతుంది. ఈ చికిత్సలో ఓరల్ స్క్రీన్ అనే (రిమూవబుల్ అప్లియన్సు) ఎప్పటికప్పుడు తీసి పెట్టుకొనే క్లిప్పు ముఖ్యం. పిల్లవాడి పళ్ళు కొలతలకు ఒక రబ్బరు మెటీరియల్స్‌లో తీసుకొని, పిల్లవాడి పళ్ళ మోడల్స్‌ను తయారుచేస్తారు. ఆ తరువాత ఆ పళ్ళను అక్రిలిక్ మెటీరియల్‌తో ఒక స్క్రీన్‌లాగా పైపళ్ళకు, క్రింది పళ్ళను కలుపుతూ ఒక ప్లేట్‌ను తయారుచేస్తారు.

ఈ అక్రిలిక్ ప్లేట్‌నే oral screen అంటారు. ఈ ఓరల్ స్క్రీన్ నోటిలో పైదవడ కింది దవడ పళ్ళకు సరిపడేట్లు ఉంటుంది. ఈ స్క్రీన్‌ను నోటిలో పళ్ళకు పైన పెట్టుకొని పెదవులను మూసివేయాలి. ఈ విధంగా పెదవులను మూసివేయటంవల్ల ఆ పెదవుల వత్తిడి ఓరల్ స్క్రీన్‌పై పడి ఆ ఓరల్ స్క్రీన్ వత్తిడి పళ్ళమీద పడి పళ్ళ కదలిక మొదలవుతుంది.

ఈ విధంగా ఎగుడు దిగుడు పళ్ళు నెమ్మదిగా కదులుతూ ఒకదాని పక్కలో ఒకటి ఒక వరుసక్రమంలో చేరుతాయి. ఈ క్లిప్‌ను మనం ఎప్పటికప్పుడు తీసుకోవచ్చు. మళ్లీ యథాతథంగా పెట్టుకోవచ్చు.

ఈ విధంగా పళ్ళు వరుసక్రమంలోకి వచ్చేవరకు క్లిప్‌ని వాడవలసి ఉంటుంది. ప్రతి పది రోజులకొకసారి ఆర్థోడెంటిస్ట్‌ని సంప్రదించి, చికిత్సను క్రమం తప్పకుండా పాటించాలి. ఈ విధంగా చికిత్స చేయించుకున్నట్లైతే 6 నెలల్లో వంకర పళ్ళు మామూలు పద్ధతిలో అమరుతాయి.

ఈ విధమైన చికిత్స ప్రభుత్వ దంత వైద్య కళాశాల హైదరాబాద్‌లో ప్రభుత్వ దంత కళాశాల విజయవాడలో ఉచితంగా పొందవచ్చు. లేదా ఏ ఆర్థోడెంటిస్ట్‌నయినా సంప్రదించినట్లయితే ఈ విధమైన చికిత్స చేస్తారు.

-డా॥ ఓ.నాగేశ్వరరావు
98490 14562

నేరాలకూ రాజధాని..!

దేశ రాజధానిగానే కాదు, పలురకాల నేరాలకూ ఢిల్లీ నగరం నిలయంగా మారుతోందని అధికారిక గణాంకాలు ఘోషిస్తున్నాయి. ముఖ్యంగా మహిళల పట్ల లైంగిక నేరాలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. 2012 డిసెంబర్‌లో నడుస్తున్న బస్సులో ఓ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం (నిర్భయ ఉదంతం) అనంతరం లైంగిక నేరాలను అదుపుచేసేందుకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా పరిస్థితిలో మాత్రం మార్పు కానరావడం లేదు. ఇటీవల ఓ మహిళపై 'క్యాబ్' డ్రైవర్ అత్యాచారం చేయడంతో ఢిల్లీలో మహిళలకు భద్రత ప్రశ్నార్థకంగా మారిందని తేటతెల్లమైంది. తగిన సాక్ష్యాధారాలు లేవని అత్యాచారాలు, లైంగిక వేధింపులకు సంబంధించి వందలాది కేసులను కోర్టులు కొట్టివేయడం గమనార్హం. కేసుల విచారణలు ఏళ్ల తరబడి కొనసాగడం, నిందితులకు శిక్షలు పడినా అమలుకాకపోవడం సర్వసాధారణమైంది. బంధువులు, పరిచయస్థులే చాలా సందర్భాల్లో నిందితులు కావడంతో అనేక రేప్ కేసులు రాజీమార్గం పడుతున్నాయి. ఢిల్లీలో ఈ ఏడాది నేరాలు వంద శాతం పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది నవంబర్ నెలాఖరుకు భారత శిక్షాస్మృతి (ఐపిసి)లోని వివిధ సెక్షన్ల కింద 1,39,773 కేసులు నమోదయ్యాయి. 2013లో ఇదే కాలంలో 69,298 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది 11 నెలల్లో ఢిల్లీలో 1,985 రేప్ కేసులు, 4,004 లైంగిక వేధింపుల కేసులు నమోదయ్యాయి. గత ఏడాది 1,559 రేప్ కేసులు, లైంగిక వేధింపులకు సంబంధించి 3,347 కేసులను పోలీసులు నమోదు చేశారు. బాధిత మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేస్తున్నందునే కేసుల సంఖ్య పెరిగిందని పోలీసుశాఖ ఉన్నతాధికారులు అంటున్నారు. కాగా, పోలీసులపై దాడుల సంఖ్య కూడా ఢిల్లీలో ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది పోలీసులపై దాడులకు సంబంధించి 300 కేసులు నమోదయ్యాయి. వివిధ సంఘటనల్లో ఏడుగురు పోలీసులు మరణించారు. ★

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

గురువారం 25, డిసెంబర్ 2014

ప్రియాంకా చోప్రా

జుహీ చావ్లా

మాధురీ దీక్షిత్

ఆకాశమంత అభినయం..

ఆమె సొంతం

నాలుగు కుప్పిగంతులు వేయడం.. వీలైనన్ని సార్లు తెరనిండా అందాలు ఆరబోయడం.. 'శుభం' కార్డు పడేముందు ఫ్యామిలీ ఫొటోలో హీరో పక్కన ఒదిగి పోవడం.. భాష ఏదైనా భారతీయ సినిమాల్లో చాలావరకూ 'హీరోయిన్' పాత్ర ఇంతే! 'భారీ పారితోషికం' తీసుకుంటున్నా పాపం..! సినిమాల్లో హీరోయిన్లు చాలీచాలని దుస్తులతో కనిపించడం, అప్పుడప్పుడూ పాటల్లో తళుక్కుమనడం తప్ప మరో కొత్తదనం లేకుండా పోతోంది. నటనకు అవకాశం ఉన్న పాత్రల్లో హీరోయిన్లు కనిపించడం బహు అరుదు. ఈ మూస ధోరణులకు భిన్నంగా ఇటీవల కొందరు హీరోయిన్లు తాము కూడా 'నటించగలమని' నిరూపించుకుంటున్నారు. మారుతున్న కాలంలో ప్రేక్షకుల అభిరుచులకు తగ్గట్టుగా కథానాయికకు పెద్దపీట వేస్తున్న సినిమాలు ఈ మధ్య విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. గతంలో ఇలాంటి సినిమాలు ఒకటీ అరా వచ్చినా, హీరోయిన్‌కు నటనపరంగా అవకాశం ఇవ్వడం ఇపుడు ఓ 'ట్రెండ్'గా మారింది.

ముఖ్యంగా బాలీవుడ్ దర్శక, నిర్మాతలు ఇటీవలి కాలంలో మహిళల సమస్యలను ప్రధానాంశాలుగా తీసుకుని సినిమాలు రూపొందిస్తున్నారు. నటనకు అవకాశం ఉన్న పాత్రలు లభిస్తే హీరోలకు తాము ఎందులోనూ తీసిపోమని పలువురు నటీమణులు కూడా వైవిధ్యం చూపిస్తూ సత్తా చాటుకుంటున్నారు. సాంఘిక దురాచారాలు, మహిళల వేదనలు, సమకాలీన పరిస్థితులను స్పృశిస్తూ ఈ ఏడాది బాలీవుడ్‌లో వచ్చిన పలు సినిమాలు ప్రేక్షకాదరణతో సంచలన విజయాలను నమోదు చేశాయి. మహిళ చుట్టూ తిరిగే కథాంశాలతో ఈ ఏడాది బాలీవుడ్ నుంచి 14 సినిమాలు వచ్చాయి. ఇవన్నీ మహిళాశక్తిని, వారి వ్యక్తిత్వ విలువలను ప్రతిబింబించాయి. జీవన గమనంలో ఎన్ని సమస్యలు, సవాళ్లు ఎదురైనా వాటిని ధైర్యంగా అధిగమించడంలో మహిళలు ఎవరికీ తీసిపోరని ఈ సినిమాలు నిరూపించాయి. శృంగారమే కాదు, మిగతా అన్ని రసాలను ఆవిష్కరించడంలో తామేమీ తక్కువ కాదని పలువురు హీరోయిన్లు చాటుకున్నారు. కథానాయికే కీలక పాత్రగా ఈ ఏడాది చాలా సినిమాలు విడుదలైనా కొన్ని మాత్రం ప్రేక్షకుల హృదయాలపై చెరగని ముద్ర వేశాయి. 'దేవ్ ఇష్కియా', 'గులాబ్ గ్యాంగ్', 'క్వీన్', 'లక్ష్మి', 'రాగిణి ఎంఎంఎస్-2', 'రివాల్వర్ రాణి', 'కాంచీ', 'హేట్ స్టోరీ-2', 'మర్దానీ', 'బాబీ జాసూస్', 'మేరీ కోమ్', 'కూబ్‌సూరత్', 'సూపర్ నానీ' వంటి సినిమాల్లో కథంతా హీరోయిన్ చుట్టూ తిరుగుతుంది. హీరోయిన్ల నటనకు ప్రాధాన్యం ఇచ్చిన సినిమాలే ఇవన్నీ. వాణిజ్యపరంగా కొన్ని సినిమాలు నిర్మాతలకు నిరాశ కలిగించినా, చాలావరకూ మహిళా ప్రధాన చిత్రాలు ప్రేక్షకుల ఆదరణకు నోచుకున్నాయి. లింగ వివక్ష, హింస, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, ఒత్తిళ్లు, ఒంటరితనం వంటివి ఎదురైనపుడు మహిళ మానసిక పరిస్థితిని పలు సినిమాల్లో అద్భుతంగా ఆవిష్కరించారు. తాము 'షోకేసుల్లో' బొమ్మలం కాదని, ఉన్నత వ్యక్తిత్వం, పోరాట పటిమ, మహిళా శక్తిని నటన ద్వారా చాటగలమని పలువురు హీరోయిన్లు నిరూపించారు. కష్టాలు,కన్నీళ్లను మౌనంగా భరించరాదని, సవాళ్లకు ఎదురొడ్డి పోరాడితే జీవితానికి సార్థకత అనే సందేశాన్ని శక్తివంతంగా వినిపించడంలో కొందరు హీరోయిన్లు కృతకృత్యులయ్యారు.

కంగనా



ఆలియా భట్

దీపిక

కథానాయికే కీలక పాత్రగా ఈ ఏడాది అనేక సినిమాలు వచ్చినప్పటికీ 'క్వీన్', 'హైవే', 'మేరీ కోమ్', 'గులాబ్ గ్యాంగ్', 'ఫైండింగ్ ఫానీ' సినిమాల్లో హీరోయిన్లు నటన పరంగా తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రముఖ అంతర్జాతీయ మహిళా బాక్సర్ మేరీకోమ్ జీవిత విశేషాల ఆధారంగా నిర్మించిన 'మేరీకోమ్'లో- మాజీ 'ప్రపంచ సుందరి' ప్రియాంకా చోప్రా అద్భుత నటనతో అలరించింది. ఆ సినిమాలో నటించేందుకు ఆమె స్వయంగా మేరీకోమ్‌ను కలుసుకుని బాక్సింగ్‌లో మెళకువలను నేర్చుకుంది. సహజత్వం కోసం నిజమైన బాక్సర్లతో తలపడి షూటింగ్‌లో పలుసార్లు గాయాలకు లోనైంది. మహిళలకు స్ఫూర్తి ప్రదాత అయిన 'మేరీకోమ్' పాత్రకు ప్రాణప్రతిష్ఠ చేసి ప్రియాంక ప్రేక్షకుల నీరాజనాలందుకుంది. మహిళా బాక్సర్ అంతరంగాన్ని, పోరాట పటిమను ఆవిష్కరించడంలో ప్రియాంక 'శభాష్' అనిపించుకోవడంతో 'మేరీకోమ్' సినిమా వసూళ్లలో వంద కోట్ల రూపాయల టార్గెట్‌ను అధిగమించింది.

'గులాబ్ గ్యాంగ్'లో రెండు విభిన్నమైన పాత్రల్లో ప్రముఖ నటీమణులు మాధురీ దీక్షిత్, జుహీ చావ్లా ఎంతగానో మెప్పించారు. 1990 ప్రాంతంలో ఎదురులేని హీరోయిన్లుగా బాలీవుడ్‌ను ఏలిన మాధురి, జుహీ 'గులాబ్ గ్యాంగ్'లో విలక్షణ నటనతో మెప్పించారు. అరాచకాలను ఎదిరించే మహిళా నేతగా మాధురి, వంచన చేసే రాజకీయ నాయకురాలిగా జుహీ అద్భుత నటనను ఆవిష్కరించారు. యువ నటి ఆలియా భట్ సినిమా రంగంలో ప్రవేశించిన కొద్ది కాలానికే 'హైవే'లో కీలక పాత్రలో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కిడ్నాప్‌కు గురైన యువతి అంతరంగ మథనాన్ని ఆమె అవలీలగా ఆవిష్కరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. కిడ్నాపర్ చెరలో ఎదురైన విపత్కర పరిస్థితుల్లో మానసిక సంఘర్షణను ఆమె అద్భుతంగా ఆవిష్కరించింది. అగ్ర హీరోల సరసన వాణిజ్యపరమైన సినిమాల్లోనే కాదు, నటనకు అవకాశం ఉన్న పాత్రల్లోనూ రాణించగలనని 'ఫైండింగ్ ఫానీ'లో నటి దీపికా పదుకొనె నిరూపించింది. ఆ సినిమాలో పంకజ్ కపూర్, నసీరుద్దీన్ షా, డింపుల్ కపాడియా వంటి మేటి నటులకు దీటుగా ఆమె నటించింది. ఓ సాంప్రదాయ కుటుంబానికి చెందిన యువతి ఒంటరిగా విదేశాలకు వెళ్లి, ఆఖరి క్షణంలో తనతో పెళ్లి వద్దనుకున్న యువకుడిని ఒప్పించడం 'క్వీన్' సినిమా కథాంశం. హీరోయిన్ పాత్రే కీలకమైన ఈ సినిమాలో యువనటి కంగనా రనౌత్ అద్భుతంగా నటించింది. ఈ సినిమాతో బాలీవుడ్‌లో మేటినటిగా గుర్తింపు తెచ్చుకుంది.

-లాస్య

'నలభై' దాటాయని నన్ను చూడరా..?

జెన్నిఫర్ లోపెజ్

'కైపెక్కించే పాటలు నేను పాడకూడదా..? నలభై ఏళ్లు నిండినంత మాత్రాన నేను 'సెక్సీ'గా లేనా..? ముగ్గురు పిల్లలకు తల్లినని నన్ను చూడడం మానేస్తారా..? నడివయసు మగువలను దూరం చేస్తారా..?'- అంటూ ప్రముఖ హాలీవుడ్ నటి జెన్నిఫర్ లోపెజ్ (45) కాస్త విసుగ్గానే ప్రశ్నిస్తోంది. నలభై అయిదేళ్ల వయసులోనూ తాను మత్తెకించే పాటలు పాడడం, 'అందాల ఆరబోత'కు దిగడం పట్ల కొందరు విమర్శకులు చేస్తున్న వ్యాఖ్యానాలను ఆమె ప్రస్తావిస్తూ, వయసు పెరిగేకొద్దీ మహిళలకు అనేక సామాజిక అడ్డంకులు ఎదురవుతుంటాయని చెబుతోంది. 1986లో 'మై లిటిల్ గర్ల్'తో సినీరంగ ప్రవేశం చేసిన ఆమె నటిగా, డ్యాన్సర్‌గా, రచయిత్రిగా, పాప్ గాయనిగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. సుమారు 315 మిలియన్ డాలర్ల విలువ చేసే ఆస్తులను సంపాదించిన ఆమె ఇప్పటి వరకూ ముగ్గురు భర్తలకు విడాకులిచ్చింది. తన ముగ్గురు పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ఒంటరి తల్లిగా జీవనయానం కొనసాగిస్తోంది.

'నా ముగ్గురు పిల్లలూ 'నెంబర్ వన్'గా ఎదగాలంటే నేను వృత్తిపరంగా దూసుకుపోవాలి.. ఇంట్లో కూర్చుంటే నా పిల్లల గతేం కాను..? '- అని జెన్నిఫర్ తన విమర్శకులను నిలదీస్తోంది. ఎవరో ఏదో అనుకుంటారని నాలుగు గోడల మధ్య తాను కూర్చోలేనని తెగేసి చెబుతోంది. మహిళలు, ఒంటరి తల్లుల వ్యథల గురించి జెన్నిఫర్ ఇలా మాట్లాడడం ఇదే తొలిసారి కాదు. తన వ్యక్తిగత జీవితం గురించి వ్యాఖ్యానాలు చేసిన వారిపై ఆమె గతంలోనూ పలుసార్లు పదునైన పదాలతో దాడి చేసింది.

ఈ ప్రపంచంలో చాలామంది మహిళలు మోసపోయినట్లే తాను కూడా కొందరి వల్ల వంచనకు గురైనట్లు ఆమె తన గతాన్ని గుర్తు చేస్తోంది. ఎలాంటి విపరిణామాలు ఎదురైనా, అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ సత్తా నిరూపించుకుంటానని ఎంతో ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తోంది. 'అద్భుత మహిళ'గా తనను తాను నిరూపించుకుంటానని అయితే- అందుకు తనకు కొంత సమయం అవసరమంటోంది. తనపై సానుభూతి చూపేవారే తన భావోద్వేగాలను అర్థం చేసుకోగలరని, 'వ్యామోహం' కారణంగా కొన్ని నిర్ణయాలు అనాలోచితంగా జరుగుతుంటాయని చెబుతోంది. తన కంటే చిన్నవాడైన ఓ కుర్రాడితో కొన్నాళ్లు సహజీవనం చేయడం ఓ 'భావోద్వేగ నిర్ణయం' అని, కాలం గడిచాక ఎవరికైనా తప్పులు తెలిసి వస్తాయని వివరిస్తోంది. 'అద్భుత మహిళ' అని అందరూ పొగిడేలా తన 'కెరీర్' నిరాటంకంగా కొనసాగుతుందని, వయసు పైబడిపోవడం శరీరానికే తప్ప మనసుకు కాదని ఆమె అంటోంది. ★

తమలపాకుతో లాభాలెన్నో..

తమలపాకులను తాంబూలంగా సేవిస్తే దంతక్షయంతోపాటు నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్ళు ఆరోగ్యవంతంగా వుండటానికి వీటిలో వుండే కాల్షియం దోహద పడుతుంది. శరీరంపై ఏదైనా దెబ్బ తగిలితే తమలపాకుల రసాన్ని రాస్తే వెంటనే ఉపశమనం కలుగుతుంది. పిల్లల్లో అజీర్తి, కడుపునొప్పికి తమలపాకుల రసం, ఆముదం కలిపి వేడి చేసి పొట్టమీద రాస్తే ఫలితం వుంటుంది. అర చెంచా లేత తమలపాకుల రసాన్ని తేనెతో కలిపి చిన్నపిల్లలకు తాగిస్తే పొడి దగ్గు తగ్గుముఖం పడుతుంది. తమలపాకుల మీద కర్పూరం వేసి కొద్దిగా వేడి చేసి పిల్లల ఛాతీపై రాస్తే జలుబు తగ్గుతుంది. దీని రసాన్ని తేనెలో కలిపి తీసుకుంటే బొంగురుపోయిన గొంతు సరి అవుతుంది. పార్శ్వపు నొప్పితో బాధపడేవారు తమలపాకులపై ఆముదం రాసి వేడి చేసి కణతలపై మృదువుగా రాసుకుంటే ఉపశమనం కలుగుతుంది. చిన్న పిల్లలకు గవద బిళ్లలు ఏర్పడినపుడు తమలపాకులో కొంచెం నూనె రాసి, వేడి చేసి కాపడం పెడితే తగ్గుముఖం పడతాయి.

రక్తహీనత, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడేవారు, మూర్ఛరోగులు తమలపాకులు సేవించరాదు. పనస, మామిడి, అరటి వంటివి తిన్న వెంటనే పాన్ నమలడం మంచిది కాదు. తేనె, పాలు వంటివి తీసుకున్న తరువాత పాన్ నమలడం శ్రేయస్కరం కాదు.

-సుబ్బలక్ష్మి

ముత్యాల ముగ్గు

27 చుక్కలు, 7 వరసలు
అటు, ఇటు చుక్క వదిలి
7 వరకూ

వీరబొమ్మ ఈశ్వరి, వికారాబాద్

మీ సృజనకు పదునుపెట్టి కొత్తకోణాల్లో ఆకర్షించే అందమైన ముగ్గులు పంపండి. చుక్కల వివరాలు రాయడం మరువకండి. చుక్కలు, గీతలు.. ఏ ముగ్గులైనా చూసేందుకు స్పష్టంగా ఉండాలి. చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500003.

ముగ్గులు వేసిన కాగితాలను కలర్ స్కానింగ్ చేయించి bhoomika@andhrabhoomi.net కు మెయిల్‌లో కూడా పంపొచ్చు.

పబ్లిక్‌గా ముద్దులంటే.. చెంప ఛెళ్లుమంది..!

కాలేజీ పిల్లలు మరీ బరితెగించి పోతున్నారు. పబ్లిక్‌గా ఆలింగన, చుంబనాది ప్రలోభాలకి లోనైపోవడం వంటి దృశ్యాలు దాదాపు అన్ని నగరాల్లోని సందు మలుపుల్లో, పబ్లిక్ పార్కులలో మనకు తటస్థపడుతూనే వుంటాయి. వీటిని చూసి చాలామంది మనకెందుకులెమ్మని ఓ చూపు పారేసి వెళ్లిపోతూ వుంటారు. కానీ, ముంబయి దరి థానే జిల్లాకు చెందిన బద్‌లాపూర్‌లో- స్కైవాక్ (ఫుట్‌పాత్ బ్రిడ్జి) దగ్గరలోని ఆర్.కె.లాల్‌రేజ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ స్టూడెంట్సు క్లాసులు పూర్తి కాగానే ముద్దుముచ్చట్ల కోసం కొంతసేపు మజిలీ చేసి కానీ తమ ఇళ్లకు చేరుకోవడం లేదు.

ఇది- కొంతమంది శివసేన కార్యకర్తలకి 'ఐసోరు' అయిపోయింది. భారతీయ సంస్కృతిని ఇంటర్‌నెట్ లెవెల్లో ఈ విధంగా బద్నామ్ చెయ్యడం మాకు ఇష్టంలేదంటూ నరేష్ ఫాక్లే అనే శివసేన నాయకుడు తన అనుయాయులతో- లవర్స్ స్కైలైన్ మీద రైడ్ చేశాడు. లోకంతో సంబంధం లేకుండా ముద్దుముచ్చట్లలో మునిగిపోయిన రెండు, మూడు జంటలపైకి దాడి చేసిన శివసైనికులు- లాగి చెంపకాయలు కొట్టి మరీ కోపం తీర్చుకున్నారు.

ఈ 'ఏ' సర్టిఫికెట్ దృశ్యాలను కొందరు బాటసారులు వీడియోతెక్కించి- యూ ట్యూబ్‌లోకి అప్‌లోడ్ చేశారు. ప్రేమికుల అమ్మానాన్నలు లబోదిబోమంటున్నారు. శివసేన సైనికుల మీద పోలీసులు తప్పక చర్య తీసుకోవాలని మరి కొందరు డిమాండ్ చేస్తున్నారు. ''చెంప దెబ్బలు తిన్న అమ్మాయిలు ఫిర్యాదుచెయ్యమనండి- చూస్తాం'' అంటున్నారు పోలీసులు. పబ్లిక్‌గా చుంబనాది శృంగార చేష్టలు నేరమేమో గానీ బహిరంగంగా- యువతీ యువకుల బుగ్గలు ఛెళ్లుఛెళ్లున వాయించడం ఎంతవరకూ సమంజసం? ఈలోగా ఆ స్టూడెంట్లు మరో 'కార్నర్' వెతుక్కుంటూ పోయారు కాబోలు స్కైలైన్ వంతెన మీద ముద్దు-ముచ్చట్ల సందడి తగ్గింది.

దున్నపోతా..? ఐరావతమా..?

హర్యానాలోని కురుక్షేత్ర ప్రాంతం- సునారియో గ్రామవాసి కర్మవీర్‌సింగ్ అనే రైతు కొద్ది రోజుల క్రితం 'జాగరోం' అనే చోట పశువుల సంతకి తన రెండు దున్నపోతులను తోలుకు వచ్చాడు. అందరికళ్లూ ఆ రైతు తెచ్చిన దున్నపోతుల మీదే. నల్లగా వున్నా, అవి ఐరావతాల్లాగా వున్నాయ్. ఆ దున్నపోతులలో ''అన్న'' పేరు 'భీమ్', తమ్ముడి పేరు 'యూవీ'. భీమ్ బరువు 1200 కేజీలు. ''ఏనుగంత వుంది. నున్నగా- నిగనిగలాడుతూ ప్రకాశిస్తోంది'' అన్నారంతా.

భీమ్ మీద వేలం పాట పెరిగింది. పన్నెండు లక్షల ముప్ఫయివేల బ్రిటిష్ పౌండ్లదాకా వెళ్లింది. 'యు.వీ' కూడా

తక్కువేం కాదు. 86 వేల పౌండ్ల దాకా ధర పలికింది. కర్మవీర్ సింగ్ యు.వి.ని అమ్మేశాడు గానీ, భీమ్‌ని అమ్మనన్నాడు. ఎందుకంటే భీమ్- ''వీర్యదాత''. కండపుష్టి మాత్రమే కాదు రోజుకు అయిదారు మిల్లీలీటర్ల ''వీర్యం'' దానం చేయగల శక్తి గలది.

బుర్రా గేదె దున్నలు ప్రపంచం మొత్తంమీద పాపులర్. ఈ భీమ్‌వల్ల బుర్రా జాతి సంతతి గేదెలు, దున్నలు దేశవ్యాప్తంగా కృత్రిమ సంపర్క క్రియ ద్వారా అభివృద్ధి చెందుతాయి. రైతుకి నెలకో ముప్ఫయివేల పౌండ్ల ఆదాయాన్నిస్తుంది 'భీముడు.' కాకపోతే- రోజుకి ఇరవై పౌండ్ల మేతను లాగిస్తుంది. అయితేనేం ''ఇది బంగారు గుడ్లు పెట్టే బాతులాంటిది.''

''నన్ను సిరిసంపదలతో వెలిగేలా చేసే 'భీమ్' నా బిడ్డలాంటిది. భీమ్ తల్లి పేరు గంగ. అది కూడా ఇప్పటికీ రోజుకి ఇరవై లీటర్ల చిక్కని పాలుయిస్తోంది.'' అంటూ ఆ రైతు భీముడికి దిష్టితీసి మరీ తోలుకుపోయాడు. ఈ బేరం కుదిరివుంటే, యీ భూమ్మీద కొత్త రికార్డు ఒకటి స్థాపించబడి వుండేది. అందుకనే 'దున్నపోతా!' అని ఎవర్నీ తిట్టకండి- ఒక శాల్యూట్ కొట్టండి!

ఉత్తరం లేదు, దక్షిణం లేదు...!

''ఉత్తరాది, దక్షిణాది.. అంటూ దేశంలో విభజన దృక్పథాల్ని సృష్టించే ప్రయత్నం చేయకూడదు.'' అన్నది కోర్టు. అంబుళగన్ అనే జర్నలిస్టు వేసిన ప్రజా ప్రయోజన వాజ్యంపై మద్రాసు హైకోర్టు ధర్మాసనం తాజాగా ఓ రూలింగ్ ఇచ్చింది. 'హైకోర్టుకి సెలవులు ఎక్కువ ఇస్తున్నారు. పైగా ఉత్తరాది పండుగలకు నాలుగేసి రోజులు సెలవులు యిస్తున్నారు'' అన్నది పిటిషనర్ వాదన.

''తమిళుల మీద ఉత్తరాది పర్వదినాన్ని రుద్దకూడదు''- అన్నది అంబుళగన్ వాదన. దీనివల్ల లాయర్లకు కూడా తగినంత పని గానీ, ఆదాయం గానీ లేకుండా పోతోంది అన్నది పిటిషనర్ అభిప్రాయం.

దీని మీద చీఫ్ జస్టిస్ సంజయ్ కిషన్ కేల్ ఆధ్వర్యంలో ఏర్పడ్డ ధర్మాసనం తీర్పునిస్తూ- పిటిషనర్ ధోరణి దేశాన్ని చీల్చేదిగా వున్నది కనుక ఇటువంటి ధోరణులను ఖండించే ఉద్దేశంతో పిటిషనర్‌కి ఇరవై వేల రూపాయల జరిమానా విధిస్తున్నాం''- అంటూ బల్లగుద్ది చెప్పేశారు. కోర్టుకి సెలవుల గురించి ఎంతో ఆలోచించి నిర్ణయిస్తాం. దీన్ని ఎవరూ ప్రశ్నించకూడదు అన్నారు న్యాయమూర్తులు. అదీ సంగతి! ★

అవీ..ఇవీ..అన్నీ

- వీరాజీ

veeraji.columnist@gmail.com

నేర్చుకుందాం

క. ''భూరి గుణులార! మీ మది
కోరిక యెఱిఁగింపుఁ డేమి కోరిన నైనన్
ధీరత నొసఁగుటయే కా
దారయ నాశిరము ద్రుంచి యైనను నిత్తున్

భావం: కృష్ణార్జునులు మారువేషంతో వెళ్లి జరాసంధుని ఎదుట నిల్చి భిక్షమడుగగా జరాసంధుడు వారిని, వారి వేషధారణను చూచి, వీరు బ్రాహ్మణ వేషధారులే కాని బ్రాహ్మణులు కారని అనుకొన్నాడు. కాయలు కాచి వున్న వారి భుజాలను చూచి , వారి మాటలను విని వీరు ఏ రాజశ్రేష్ఠులో అయ్యుంటారు. వీరు అడిగిన నా ప్రాణమును సైతం ఇచ్చేస్తాను. ఇంకొక్క మాట మాట్లాడాలనే బుద్ధి నాకు పుట్టడం లేదు. అనుకొని 'అయ్యలారా! ఓ గుణవంతులారా! మీ మనస్సులోని కోరిక యేమిటో తెలపండి. మీరేమి కోరినా ధైర్యంతో ఇస్తాను. అంతేగాదు చివరకు నా శరీరాన్నైనా ఖండించి ఇస్తాను. అన్నాడు

పోతన భాగవతము - దశమ స్కంధము

స్పందన

41 **కె. ప్రమీలాజనార్దన్**

''అలా మాట్లాడితే కాని నీకు ధైర్యం రాదని మాట్లాడాను'' అంటూ సూర్య హాయిగా నవ్వి అన్నాడు.

''నువ్వో రకంగా కావాల్సిన అమ్మాయినే అంటే వరసైన అమ్మాయినే చేసుకోవాలనుకున్నావు. నీ వివరాలు తెలిసినరోజే ఈ అమ్మాయికి నువ్వెవరో తెలిసి వుంటుంది. అందుకే నీతో స్నేహం పెంచుకోగలిగింది. ఆమె తల్లి దండ్రులు నీ వివరాలు తెలిసి అంగీకరించారంటే వాళ్ళకు మమ్మీ డాడీల మీద అభిమానం వున్నట్లే. హారిక నువ్వెవరో తెలిసినా ఆ అమ్మాయి తెలియనట్లుందంటే నీకు నువ్వుగా ఏదైనా చెబుతావనుకొని వుంటుంది. నువ్వేం చెప్పకపోయేసరికి తనే పెళ్లికి తొందర పెడుతోంది. మమ్మీ డాడీ ఒప్పుకోరని ఆమె భయమేమో!'' అన్నాడు సూర్య.

''నిజమే. ఆమె నా వైపు చూసిన చూపుల్లో అనుమానం వ్యక్తమవ్వడం ఇప్పుడు గుర్తుకు వస్తోంది...'' అన్నాడు అజిత్.

''నీవు దాని గురించి ఆలోచించకు. మమ్మీ డాడీ తప్పకుండా ఒప్పుకుంటారు. నీకు సందేహంగా వుంటే వరుణ్ అంకల్‌కు ఫోన్ చేసి చెప్పు. ఆయనైతే మమ్మీ డాడీ అభ్యంతరం చెప్పినా నచ్చచెబుతారు'' అన్నాడు సూర్య.

''ఓహో మంచి సలహా ఇచ్చావురా. వరుణ్ అంకుల్‌కు చెబుతాను'' అని క్షణమాగి ''సూర్యా నువ్వన్నట్లు హారికకు ఆమె తల్లిదండ్రులకు కూడా నేనెవరినో తెలిసీ ఒప్పుకున్నారంటే వాళ్ళకు మమ్మీ మీద అభిమానం వున్నట్లే'' అన్నాడు అజిత్ సంతోషంగా.



''నిజంరా.. మమ్మీ డాడీ తప్పేం చేశారసలు? దివ్య కూడా అదే అంది. అన్నట్లు దివ్య ఎవో నీకు చెప్పలేదు గదా! మన మేనమామ కూతురు. ఆ విషయం ఈమధ్యనే తెలిసింది.

దివ్యకు బుద్ధి తెలిశాక వాళ్ళ అమ్మమ్మ తాతయ్య చెబితే తెలిసిందట మమ్మీ మళ్లీ పెళ్లి చేసుకుందని. అందులో తప్పేముంది? ఆమె జీవితం ఒంటరితనంతో మగ్గిపోకుండా పెళ్లి చేసుకుంది.

ఆ చేసుకున్న అతడ్ని అభినందించాల్సింది పోయి కోపగించుకొని బంధాన్ని తెంపుకున్నావుగా!'' ఆశ్చర్యంగా అన్న దివ్య మాటలకు వాళ్ళు బాధపడ్డారట.

అప్పట్లో ఆలోచన్లు, ధోరణి వేరమ్మా. ఇప్పటిలా ఎవరినో ప్రేమించాను పెళ్లి చేసుకుంటామని పెద్దలతో ధైర్యంగా చెప్పలేని రోజులవి. పిల్లల బాగును సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని చేసేవారేపనైనా.. అప్పుడప్పుడు ఇలాంటి మంచి పనులు జరిగినా మనిషి జీవితాన్ని పతనావస్థవైపు మళ్లిస్తాయేమో భయపడేవారు. ఏమైనా ఆ అమ్మాయి మంచి పని చేసింది.'' అన్నారట.

ఆమె అభిప్రాయం ఆమె పెద్దల అభిప్రాయం తెలిశాకే నేను మన బంధుత్వం గురించి చెప్పాను. అది విని దివ్య ఎంతో సంతోషించింది. వాళ్ళ అమ్మమ్మ తాతయ్య కూడా హర్షించారట. ఎక్కడో తెలియని ఇంట పడితే ఎలా వుంటుందోనని దిగులు పడుతున్నాము. రక్తసంబంధీల ఇంటే అడుగుపెడుతున్నావంటే సంతోషంగా వుందమ్మా. భావన చాలా మంచి మనిషని మీ అమ్మ చెబుతుండేది. ఆమె మళ్లీ పెళ్లి చేసుకున్నదనే మీ అమ్మ నాన్నలకు కోపం..

ఇప్పుడు మీ అమ్మ నాన్న వుండి వుంటే ఇప్పటి పరిస్థితులను అర్థం చేసుకొని ఆమెను ఆదరించేవారు అన్నాడట వాళ్ళ తాతయ్య. అది తెలియగానే మమ్మీకి ఫోన్ చేశాను. సెల్ ఆఫ్ చేసి వుంది. డాడీకి చెప్పాను. ఆయన చాలా ఆనందపడ్డారు' అన్నాడు సూర్య.

''సూర్యా నీకైతే ప్రాబ్లమ్ లేదు. మమ్మీ ఇష్టపడే సంబంధమే నువ్వూ కోరుకున్నావు. కాని నా విషయం అలా కాదు. హారిక గురించి చెబితే డాడీ అసలు ఒప్పుకోరేమో'' అన్నాడు దిగులుగా అజిత్.

''నేనలా అనుకోవడంలేదు. ఎప్పటి విషయమో తలచుకొని నీ ఇష్టాన్ని కాదనేంత మనసులేని వాళ్ళు కాదు మమ్మీ డాడి. అయినా నీకు చెప్పానుగా వరుణ్ అంకుల్‌తో మాట్లాడమని. నేనూ చెబుతాలే ఆయనతో'' అన్నాడు సూర్య.

''అలాగే వుంటానిక..'' అంటూ సెల్ ఆఫ్ చేసి కారు ఇంటి దగ్గరకు పోనిచ్చి పార్కింగ్ చేసి వెంటనే వరుణ్‌కు ఫోన్ చేసి మాట్లాడబోతుంటే ''ఇప్పుడే సూర్య నీ గురించి చెప్పాడు'' అంటూ నవ్వాడు వరుణ్.

''నువ్వు సూర్య ఎంత పని చేశారురా.''

''అంకుల్...'' తప్పు చేశారంటున్నాడేమో నన్నట్లు అన్నాడు అజిత్.

''ఔనురా.. చాలా తప్పు చేశారు. ఈ అంకుల్‌కు వున్న కూతురి విషయం మరిచి ఎవరినో ప్రేమించారు.''

''సారీ అంకుల్. సుష్మ నిరుపమ్ మాకు తోబుట్టువుల్లాగా అనిపిస్తారు'' అన్నాడు అజిత్.

''నేను తమాషాగా అన్నాను లేరా.. దాని గురించి సీరియస్‌గా ఆలోచించకు'' అని 'అజిత్' గంభీర స్వరంతో అన్నాడు. ''నీవు మీ అమ్మ నాన్నలను అర్థం చేసుకోలేదు. అర్థం చేసుకొని వుంటే నీకు బాధ టెన్షన్ వుండేవి కాదు.

-ఇంకావుంది

అధ్యాత్మ రామాయణం

- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

యుద్ధకాండ 210

రామపాదుకలను ముందుంచుకొని భూమిమీదనే నిద్రిస్తున్నాడు. కాషయాంబర ధారులై మంత్రి పౌరముఖ్యులు ఆయనను పరివేష్టించి ఉన్నారు.

భరతుడు మూర్తీభవించిన ధర్మదేవతలా కనిపించాడు. అటువంటి భరతుణ్ణి చూచి, అంజలించి మారుతాత్మజుడైన హనుమ ఇలా అన్నాడు.

తాపసి, దండక నివాసి కాకుత్స్థ కులనందనుడు రాముడు; నీవు ఏ రామునికై పరితపిస్తున్నావో,

నీవు ఎవరికై పరితాపం చెందుతున్నావో ఆ రాముడు తమ క్షేమసమాచారాలు మీకు తెలుపమన్నాడు. దారుణమైన నీ దుఃఖాన్ని వదలిపెట్టు; నేను నీకు ఎంతో ప్రియమైన వార్త తెలుపుతున్నాను. ఈ ముహూర్తంలోనే నీ సోదరుడైన రామునితో నీవు కలుస్తావు. యుద్ధంలో రావణున్ని వధించాడు, సీతను స్వీకరించాడు; సీతతో లక్ష్మణునితో రాముడిక్కడికి రాబోతున్నాడు.. అన్నాడు మారుతి సవినయంగా.

ఈ మాటలు విని మహాతేజస్వి అయిన భరతుడు సంతోషాతిరేకంతో మూర్ఛపోయాడు. కైకేయి నందనుడు స్పృహ తప్పి భూమిపై పడిపోయాడు. కొంతసేపటికి తెప్పరిల్లాడు. ప్రియవాది అయిన మారుతిని గట్టిగా కౌగిలించుకున్నాడు. కపీశ్వరుణ్ణి ఆనంద బాష్పాలతో అభిషేకించాడు.

నాపై దయచూపవచ్చిన నీవెవడవు? దేవుడవా! మానవుడవా! ఇటువంటి ప్రియమైన వార్త చెప్పిన నీకు, నీకిష్టమైనది ఏదయినా ఇస్తాను, అడుగు!

లక్ష గోవులా? సమృద్ధిగా ఉన్న శతాధిక గ్రామాలా! సర్వాభరణ సంపన్నులైన పదహారుగురు ముగ్ధ కన్యలా! నీకేది ప్రియమైనదో చెప్పు అన్నాడు భరతుడు. మారుతి మౌనం చూచి మళ్లీ తానే అడిగాడు.

ఘోరారణ్యాలకు నా స్వామి వెళ్లి ఇన్ని సంవత్సరాలైంది. ఇప్పుడు నా ప్రభువు ప్రియ సమాచారం ఇన్నాళ్లకు విన్నానుకదా! బతికి ఉంటే నూరేండ్లకైనా మానవుడు ఆనందాన్ని పొందుతాడన్న లోకోక్తి వింటుంటాం! అది ఈ రోజు నిజమయింది.

నీకు శుభం కలుగుగాక! రఘునాథునితో వానరులకు సమాగమమెలా కలిగింది? నీవు చెప్పు చాలు! నేను నమ్ముతాను అన్నాడు భరతుడు.

అప్పుడు మహాత్ముడైన భరతునికి హనుమంతుడు రామచరితాన్ని వరుసగా వివరంగా వినిపించాడు. ఆ చరిత్ర విని భరతుడు పరమానంద భరితుడయ్యాడు. ఆ ఆనంద పారవశ్యంలో వెనువెంటనే శత్రుఘ్నుని ఆజ్ఞాపించాడు.

రఘునందనా! నగరంలో దేవాలయాలలోని దేవతలకందరికి నానా ఉషాహారాలతో- బలులతో పూజా పునస్కారాలు జరుగుగాక! దేవతలందరు విధియుక్తంగా పూజింపబడుదురుగాక! మహాధీశాలురైన సూత- వైతాళిక- వంది మాగధులు, వారకాంతలు వందలాది సంఘాలతో బయలుదేరుగాక! రాజమాతలు, అమాత్యులు, గజతురగ పదాతి దళాలు బ్రాహ్మణులు, పౌరులు, రాముని రాక చూడ్డానికి వచ్చిన రాజులు అందరు కూడా చంద్రమండల కాంతి సంకాశుడైన రఘురాముణ్ణి చూడడానికి ఇపుడే బయలుదేరుగాక!

ఈ విధంగా భరతుడు సంభార సన్నాహాలు చేయాలని ఆదేశించాడు. భరతుని మాటగా శత్రఘ్నుడు అన్ని ఏర్పాట్లు చేయించాడు. వెంటనే నగరాన్ని అలంకరించారు. ముత్యాలు - రత్నాలు పొదిగిన తోరణాలు కట్టారు. చిత్ర విచిత్ర పతాకాలు ఆయా ప్రదేశాలలో నిలిపారు.

- ఇంకావుంది

గురువారం 25 డిసెంబర్, 2014

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ జయ, దక్షిణాయనం
హేమంత ఋతువు - పుష్యమాసం

తిథి: శుద్ధ చవితి రా.11.50
నక్షత్రం: శ్రవణం సా.4.50
వర్జ్యం: రా.8.34 నుండి 10.04 వరకు
దుర్ముహూర్తం:ఉ.10.00 నుండి 10.48 వరకు
తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
  నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చినచో అనారోగ్య బాధలుండవు.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
  పిల్లలవల్ల ఇబ్బందులనెదుర్కొంటారు. అధికారులతో గౌరవింపబడుతారు. పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకుంటారు. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
  మెలకువగా నుండుట అవసరం. స్థానచలనమేర్పడే అవకాశాలుంటాయి. ఋణలాభం పొందుతారు. ఎలర్జీతో బాధపడేవారు జాగ్రత్తగా నుండాలి. కార్యాలకు ఆటంకాలుంటాయి.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)**
  ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో విరోధమేర్పడే అవకాశాలుంటాయి. స్త్రీల మూలకంగా శత్రుబాధలనుభవిస్తారు. ఏదో ఒక విషయం మనస్తాపానికి గురిచేస్తుంది. పిల్లలపట్ల మిక్కిలి పట్టుదల పనికిరాదు.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
  కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. ఆకస్మిక ధనలాభంతో ఆనందాన్ని పొందుతారు. ఇతరులకు ఉపకారం చేసే కార్యాల్లో నిమగ్నులవుతారు. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
  గొప్పవారి పరిచయం ఏర్పడుతుంది. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. మంచి ఆలోచనలను కలిగివుంటారు. బంధు, మిత్రులు గౌరవిస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా పొందుతారు. సత్కార్యాల్లో పాల్గొంటారు.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
  ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందుకుంటారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. ప్రయత్న కార్యాల్లో విజయం సాధిస్తారు. బంధు, మిత్రులతో కలుస్తారు. ఉత్సాహంగా ఉంటారు.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
  నూతన గృహ కార్యాలపై శ్రద్ధ వహిస్తారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధలధికమవుతాయి. ఋణబాధలు తొలగిపోతాయి.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
  కుటుంబ విషయాలపై అనాసక్తితో ఉంటారు. గృహంలో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. తలచిన కార్యాలు ఆలస్యంగా నెరవేరతాయి. స్త్రీలతో జాగ్రత్తగా నుండుట మంచిది.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
  క్రొత్త కార్యాలు ప్రారంభిస్తారు. మానసికాందాన్ని పొందుతారు. ప్రతి విషయంలో వ్యయ, ప్రయాసలు తప్పవు. ధననష్టమేర్పడే అవకాశముంది. వృత్తిరీత్యా క్రొత్త సమస్యల నెదుర్కొంటారు.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
  మానసిక ఆందోళన తొలగుతుంది. ఆరోగ్యం గూర్చి జాగ్రత్త వహించాలి. భయం దూరమవుతుంది. ప్రయాణాల్లో మెలకువ అవసరం. ప్రయత్న కార్యాల్లో ఇబ్బందులెదురవుతాయి.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
  సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. కుటుంబంలో సుఖసంతోషాలు అనుభవిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం సాధిస్తారు. శుభవార్తలు వింటారు. ధైర్యసాహసాలు ప్రదర్శిస్తారు.

మంచిమాట

ఓరిమి

ఓర్పు (ఓరిమి) అనేది మానవునకు ప్రధానముగ వుండవలసిన లక్షణము. ఓర్పును కోల్పోవుట వల్లనే రాజులు భ్రష్టులయ్యారు. ఓర్పును కోల్పోవుటవల్ల పండితులు పతనమయ్యారు. ఓర్పు మనిషికి ప్రధానమైన కవచము. ఓర్పు లేకపోతే మానవత్వం రాణించదు. ఓర్పు స్థితప్రజ్ఞ లక్షణము. ఓర్పులేకపోతే ఏ పనినీ సాధించలేము.

ఓర్పునకు పట్టుదల ప్రధానమైన లక్షణము. పట్టుదల మూర్ఖమైన పట్టుదలగా వుండకూడదు. పవిత్ర కార్యముల యందు, పారమార్థికమైన విషయములందు మనిషి ఏమాత్రము చలించక, భ్రమించక, స్థిరత్వమును కలిగియుండే భావమును పట్టుదల అందురు. ఎన్ని విధములైన యిబ్బందులు కలిగినను, ఎట్టివిధములైన అననుకూల పరిస్థితులు ఎదుర్కొన్నను పట్టిన పవిత్రమైన కార్యమును సాధించే విషయములో పట్టుదల అత్యవసరము. పట్టుదల లేకుండినచో ఓర్పునకు బలము వుండదు.

ఓర్పు, పట్టుదల రెండు జమిలి బిడ్డలు. అది ఒక దానిని విడిచి మరొకటి వుండలేవు. పట్టుదల కోల్పోయిన ఓర్పులో బలహీనత కలుగును. ఓర్పును కోల్పోయిన పట్టుదల అంతర్ధానమయిపోతుంది.

ఓర్పు యొక్క ప్రాముఖ్యతను గుర్తించి, ఆలోచించి, అవలంబించడానికి ప్రయత్నం చెయ్యాలి. ఇతరులు మనలను అనేక విధముల దూషించినా, పరుష వాక్యములు ఆడినను, అవమాన పరచినను మనము ఓర్పును కోల్పోకుండా చూసుకొనవలెను. ఒకరు దూషించినంతను, విమర్శించినంతను మనకు కలిగిన నష్టమేమియును లేదు. బలహీనత చేత ఓర్పును కోల్పోయిన సర్వస్వము కోల్పోయిన వారమగుదుము. కాని కొన్ని, కొన్ని సమయములందు ఈ ఓర్పును, క్షమను జాగ్రత్తగా పరిశీలించి, విచారించి వినియోగించుకోవాలి.

జగత్తులో జీవకోటికి ప్రధాన సహాయకారులైనవి వృక్షములు, నదులు, గోవులు. వృక్షములు, నదులు, గోవులు లేనిచో మానవ మనుగడే క్షీణించిపోతుంది. అయినను వృక్షముల కొమ్మలు, రెమ్మలు కొట్టి, వృక్షమును ఎన్ని విధముల హింసించినప్పటికీ ఆ వృక్షముల కిందనున్న వారికి నీడనిచ్చి, తీయని ఫలములను యిచ్చి, అనేక విధములుగా అది ఉపయోగపడుతూ ఆనందాన్నిచ్చి, అవసరాలను తీర్చుతుంది. అపకారము చేసిన వ్యక్తులకే అవి ఉపకారము చేస్తాయి. ఇంక నదులు- వీటిని మనం అనేక విధములుగా ఉపయోగించుకుంటూ, ఏ విధమైన కృతజ్ఞత వాటికి అందించక పోయినను నదులు తమ ఓర్పును కోల్పోక జీవరాసులకు ఎన్నో విధములుగా ఉపయోగపడుతూ, ఆనందాన్ని యిస్తూ, అవసరాలు తీరుస్తూ తమ గమ్యమైన సాగరంలో కలిసిపోతున్నాయి. జలము జీవులకు ప్రాణము. ప్రాణ సమానమైన జలమును దుర్వినియోగం కాని, సద్వినియోగం కాని చేసినా జలము తన స్వభావమును మార్చుకొనుట లేదు.

గోవులు మధురమైన పాలను అందిస్తున్నాయి. ఈ జీవులన్నీ అపకారము చేసిన వారికి సహితము ఉపకారమే చేస్తున్నాయి. చరిత్రలో కూడ ఇటువంటి క్షమ, ఓరిమి కలిగిన వ్యక్తులను మనము తెలుసుకున్నాము.

జీసస్ వద్ద అనేకులైన శిష్యులుండేవారు. వారందరినీ జీసస్ చాల ఆదరించి, ప్రేమించి, అండ చేర్చుకొనేవాడు. కాని ఆ శిష్యులలో జూడాస్ అనేవాడు ధనమునకు ఆశపడి గురుద్రోహమునకు పాలుపడ్డాడు. కాని అట్టి దుష్టుని కూడ జీసస్ క్షమించాడు.

ఓర్పు మనిషికి కవచము, భూషము కాని సమయము, సందర్భము యోచించి ఓర్పును ప్రదర్శించాలి. మన ఓర్పును కృతఘ్నుల యెడల ఉపయోగించకూడదు. సమయము, సందర్భములను పురస్కరించుకుని ఆధ్యాత్మిక మార్గమునందు, పరోపకార మార్గమునందు, పారమార్థికతత్వము నందు ఓర్పును అమితంగా కలిగివుండాలి. విచక్షణా జ్ఞానమును వినియోగించుకుని క్షమను, ఓర్పును ఉపయోగించుకోవాలి.

- శివాని

సత్యభామ 52

బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 592 మాటాట



ఆధారాలు

ఆధారాలు: 85
అడ్డం
2. కాచేవాడు , రక్షకుడు
5. టాటావలె, సంపన్నుడు
6. చిన్న తీగ
7. కొండ
9. శరరము, గొంతుక
10. పసిబిడ్డ
11. తెలంగాణలో ఒక నది
13. యక్షగాన ప్రదర్శనలోని వాడు
15. లోబరుచుకోవడం

నిలువు
1. పట్టిక, లిస్టు
2. టైం మిషీన్
3. భర్త
4. అడుగు నుండి మొసలి
8.హైదరాబాదీ భాషలో పట్టణం
9. పెద్ద ఆరువు
10. క్రాస్
11. తరిభూమి , వరి పొలం
12. ఇవాళ
14. తిరగబడిన మన్మథ పత్ని

మాటాట - 591 సమాధానం



ఉగ్రవాదంపై ఉక్కుపాదం

ఒకప్పుడు ఉగ్రవాదం భారత్ సమస్య. ఇప్పుడు ఉగ్రవాదం ప్రపంచ సమస్య. చివరకు పాకిస్తాన్‌కు సైతం ఇప్పుడు ఉగ్రవాదం ప్రధాన సమస్య. ఒకప్పుడు ఉగ్రవాదానికి ఊతం ఇచ్చిన ఆ దేశం ఇప్పుడు దాని విష కౌగిలిలో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతోంది. ఉగ్రవాదం వల్ల ప్రపంచంలో అన్ని దేశాల కన్నా మేమే ఎక్కువ బాధపడుతున్నామని పాకిస్తాన్ చెబుతోంది. అది నిజం కావచ్చు కానీ ఒకప్పుడు ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ పెంచి పోషించింది అన్నది అక్షర సత్యం. ప్రపంచ దేశాలకు పాకిస్తాన్ అంటే ఒక ఉగ్రవాద దేశం అనే అభిప్రాయం ఉంది. పాకిస్తాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలని అప్పుడప్పుడు మన దేశం నుంచి గట్టిగానే డిమాండ్లు వినిపించేవి. ఉగ్రవాద ముద్ర పడ్డ దేశం కూడా ఒకసారిగా ఉలిక్కిపడింది. ఇండియాలో నిత్యం, ప్రపంచంలో ఏ మూల ఉగ్రవాద దాడులు జరిగినా ఏదో విధంగా పాకిస్తాన్‌కు చెందినవారికి సంబంధం ఉంటుంది. ప్రపంచ ఉగ్రవాదానికి పాకిస్తాన్ ఊతంగా నిలుస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. అలాంటి పాకిస్తాన్ దేశం సైతం ఉలిక్కిపడింది. ఆ దేశ పౌరులు గజగజవణికి పోయారు. ఉగ్రవాద వికృత రూపం ఇంత భయంకరంగా ఉంటుందా? అని కలవరపడింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా పాఠశాల చిన్నారులను సైతం కర్కశంగా ముష్కరులు మట్టుపెట్టారు. పాఠశాలలో చదువుకుంటున్న 140 మందికి పైగా విద్యార్థులను తూటాలతో హతమార్చారు. అప్పటి వరకు విద్యార్థుల కేరింతలతో కళకళలాడిన విద్యా ప్రాంగణంలో రక్తపుటేరులు పారాయి. ఇది మా ఘనకార్యమే అని తాలిబన్లు ప్రకటించారు. తాలిబన్లపై పాకిస్తాన్ సైన్యం దాడి చేసినందుకు ప్రతీకారంగా సైనికుల పిల్లలను హతమార్చాం అని ఈ మారణ కాండకు వారు చెప్పిన కారణం. తాలిబన్లకు పాకిస్తాన్ అండదండలు ఉన్నాయనేది బహిరంగ రహస్యమే. ఉగ్రవాదులకు ప్రపంచంలో సురక్షితమైన ప్రదేశంగా పాకిస్తాన్ ప్రపంచ వ్యాప్తంగా పేరుంది. అమెరికాలో ట్విన్ టవర్స్ కూల్చివేతకు పథకం రూపొందించి అమలు చేసిన లాడెన్ సైతం ఆశ్రయం పొందింది పాకిస్తాన్‌లోనే. అమెరికా లాడెన్‌ను జాడ కనుగొని పాకిస్తాన్‌కు చెప్పకుండానే దాడి జరిపి మట్టుపెట్టక పోతే రాజలాంఛనాలతో లాడెన్ మరో సురక్షితమైన ప్రాంతానికి తరలివెళ్లేవాడే. అలాంటి పాకిస్తాన్ ఇప్పుడు ఉగ్రవాదాన్ని చూసి వణికిపోతోంది. పెషావర్‌లో పాఠశాలలో పసిపిల్లలపై తాలిబాన్ ముష్కరుల దాడి తరువాత పాకిస్తాన్ ప్రజలు సైతం భారత్ పాక్ కలిసి తీవ్రవాదంపై పోరాడాలని నినాదాలు చేశారు. పలు ఆసియా దేశాలు అభివృద్ధిలో పరుగులు పెడుతుంటే యూరప్‌కే సవాలుగా నిలుస్తుంటే పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి పలు దేశాలు తీవ్రవాదంతో దెబ్బతింటున్నాయి. తీవ్రవాదులు మరింతగా పేట్రేగిపోతుండగా, అదే సమయంలో మతాలు, దేశాలకు అతీతంగా సామాన్య ప్రజల్లో ఉగ్రవాదానికి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ప్రభుత్వాలతో పోటీపడి ఉగ్రవాదులు ఆధునిక ఆయుధాలు సమకూర్చుకుంటున్నారు. దేశాల మధ్య సిద్ధాంతాల పరంగా వ్యతిరేకత ఎంతైనా ఉండవచ్చు కానీ మానవ జాతికే ప్రమాదకరంగా పరిణమించిన ఉగ్రవాదాన్ని అంతమొందించడంలో ప్రపంచ దేశాలు ఏకం కావాలి. ఉగ్రవాదానికి మానవత్వం, మతం, దేశం అనే తేడా ఏమీ ఉండదు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏ దేశానికి ఆ దేశం ప్రయత్నించడానికి బదులు ఇది ప్రపంచ సమస్యగా భావించి, అన్ని దేశాలు ఏకమై సమష్టి ప్రయత్నాలు చేయాలి. ఉగ్రవాద నిర్మూలనలో దేశాలు పరస్పరం సహకరించుకోవాలి. ఉగ్రవాదులు పాలిచ్చి పెంచిన దేశాలను సైతం కబళించేస్తారు. పెషావర్ సంఘటనతో ప్రపంచం ఈ సంగతి గ్రహించింది. పెరిగిపోతున్న ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ఏం చేయాలి అనే అంశంపై వివిధ రంగాల ప్రముఖుల అభిప్రాయాలే ఈ వారం ఫోకస్.

నిఘాను పటిష్ఠం చేయాలి

ప్రపంచాన్ని ఉగ్రవాదం చీడ పురుగులా పట్టుకుని వేధిస్తోంది. ప్రపంచ దేశాలన్నీ ఉగ్రవాదంతో గడగడలాడిపోతున్నాయి. ఎప్పుడు ఏ మూల నుంచి ఉగ్రవాదులు దాడులకు బలికావాల్సి వస్తుందోనన్న భయంతో ప్రజలు వణికిపోతున్నారు. ఉగ్రవాదానికి మతం, ప్రాంతం అంటూ పరిమితులు లేవు. మొన్న దాయాది దేశం పాకిస్తాన్‌లోని పెషావర్‌లో ఆర్మీ స్కూలుపై జరిగిన దాడులే ఇందుకు నిదర్శనం. ఆ ఘటన ప్రపంచం మొత్తాన్ని కదిలించింది. ఉగ్రవాదం ఎంతో భయంకరమో, దాన్ని అణిచివేయాల్సిన ఆవశ్యకత ఎంత ఉందో ప్రపంచ దేశాలకు తెలియజేసింది. పెషావర్ ఘటనతో ప్రపంచ దేశాలన్నీ అప్రమత్తమయ్యాయి. ప్రధానంగా ఉగ్ర ముప్పు ఉన్న దేశాల్లో మన దేశం ఒకటి. ఇప్పటికే ఉగ్ర దాడుల్లో వందలాది మంది ప్రాణాలు పోగొట్టుకున్న చేదు జ్ఞాపకాలు కూడా మనకు ఉన్నాయి. దేశంలో ఉగ్రవాద దాడులను అరికట్టాలంటే నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉంది. భారతదేశం భిన్న సంస్కృతులు, అనేక భాషలు, విస్తారమైన భూమి, వంద కోట్లు దాటిన జనాభా, అంతర్జాతీయ సరిహద్దులు, వేల కోట్ల కిలోమీటర్ల తీర ప్రాంతం కలిగిన దేశం. అందువల్ల ప్రస్తుతం దేశంలో కాస్త లిబరల్ పోలీస్ వ్యవస్థ ఉంది. దాన్ని మరింత పటిష్ఠ పరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దేశంలో ఉగ్రవాద ముప్పు ఎక్కువగా ప్రాంతాల్లో హైదరాబాద్ ఉంది. దీంతో ఉగ్రవాద దాడులను అడ్డుకునేందుకు ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం మంచి పోలీస్ నిఘా వ్యవస్థను అమలు చేస్తోంది. ఇదే తరహాలో దేశమంతటా పోలీస్ నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలి. ఇలా ఉండగా దేశానికి ప్రధానంగా నేపాల్, బంగ్లాదేశ్ సరిహద్దులు ప్రమాదకరంగా మారాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు బంగ్లాదేశ్, నేపాల్‌లకు వెళ్లి అక్కడి నుంచి భారత్‌లోకి అక్రమంగా చొరబడుతున్నారు. ఈ అక్రమ చొరబాట్లను అరికట్టాలి. వేల కోట్ల కిలో మీటర్ల సరిహద్దు ప్రాంతంలో ఎలక్ట్రానిక్ సర్వేలెన్స్ విధానాన్ని అమలుపరచాలి. వీటన్నింటితోపాటు ప్రతీ పౌరుడికి భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించాలి. దేశ పౌరులకు యూనిక్ ఐడి కార్డులు జారీ చేయాలి. ఈ విధానాన్ని అన్ని రాష్ట్రాలు పటిష్ఠంగా అమలుపరచాలి. తద్వారా ఉగ్రవాద దాడులను ఎదుర్కోవచ్చు.

- పేర్వారం రాములు, మాజీ డిజిపి

ప్రభుత్వాలదే బాధ్యత

దేశ సమగ్రతకు విఘాతం కలిగే పరిస్థితులు ఎదురయ్యాయంటే దానిని ఎదుర్కొవడానికి కుల, మతాలకు అతీతంగా ప్రజలు, రాజకీయాలకు అతీతంగా పార్టీలన్నీ ఏకం అవుతాయి. పెషావర్‌లో జరిగిన ఘటన అత్యంత బాధాకరమైంది. దీనిని ప్రపంచ దేశాలు ఖండించాయి. అటువంటి విపత్కర, అత్యంత దారుణమైన పరిస్థితులు ఏ దేశానికి రాకూడదు. గతంలో మన దేశంలో కాందాహార్ విమానం హైజాక్ అయినప్పుడు గానీ, కాశ్మీర్‌లో ఒక మసీదులో కొంత మందిని టెర్రరిస్టులు బందీలుగా చేసినప్పుడుగానీ, పార్లమెంటుపై దాడి చేసినప్పుడుగానీ సమర్థవంతంగా ఎదుర్కొన్న దాఖలాలు ఉన్నాయి. కాబట్టి వాటి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇక టెర్రరిస్టు కార్యకలాపాల గురించి లోతుగా అధ్యయనం చేయాలి. సమాజంలో ఉండేవారే తీవ్రవాదులుగా, ఉగ్రవాదులుగా ఎందుకు మారుతున్నారు?, వారిని ఎవరు పెంచి పోషిస్తున్నారు?, పాలకవర్గానిదే తప్పా?, లోపం ఎక్కడ ఉంది? దానిని సరి చేసి, ఉక్కుపాదంతో అణచి వేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలది కాదా? అని ప్రశ్నించుకుంటే తప్పనిసరిగా ప్రభుత్వాలే బాధ్యత వహించాలి. అన్నింటికీ మూల కారణం నిరుద్యోగ సమస్య. నిరుద్యోగ యువకులకే శత్రు దేశాలు వల వేసి, ఉగ్రవాదులుగా మారుస్తుంది. సిరియా, ఇరాన్ వంటి దేశాలు మతమౌఢ్యంలో మునిగిపోయి, సర్వత్రా వినాశనమై ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. దేశంలో ఆరు నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు బిజెపి అభివృద్ధి మంత్రాన్ని జపించింది. ఇప్పుడేమో ఆ విషయాన్ని పక్కన పెట్టి, దేశంలో మత మార్పిడి నిరోధక చట్టం తేవాలి అంటూ ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తున్నది. మత మార్పిడి అనేది వ్యక్తిగత స్వేచ్ఛ. కానీ ఎవరైనా బలవంతంగా మత మార్పిడి చేయించేందుకు ప్రయత్నిస్తే, సదరు వ్యక్తులపై సిఆర్‌పిసి కింద కఠినమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంది. మాత మార్పిడి నిరోధించడాన్ని రాజ్యాంగంలో పొందుపరచాలన్న ఆలోచనను నాడు సర్దార్ పటేల్ వ్యతిరేకించారు. కానీ ప్రధానిగా నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తర్వాత ఆయన మంత్రివర్గ సహచరులు చేస్తున్న వ్యాఖ్యలు దేశంలో అంతర్గతంగా మత విద్వేషాలు రగిలించేలా ఉన్నాయి. శ్రీరాముని గురించి తెలియని వారు 'హరామ్‌జాదే' అని, 'గాడ్సే' దేశ భక్తుడని, విగ్రహాలు ఏర్పాటు చేస్తామని వ్యాఖ్యానించడం బాధాకరం. మతాలు, ప్రాంతాల వారీగా దేశం విడిపోవాలని కోరుకుంటున్నారా?, అలా చేస్తే దేశం ఎలా అభివృద్ధి చెందుతుంది? అధికారంలోకి వచ్చామని ఇష్టం వచ్చినట్లు చేస్తే అనవసరంగా ఉగ్రవాదం పెచ్చుమీరుతాయి. తద్వారా దేశ సమగ్రత, సమైక్యతకు భంగం వాటిల్లుతుంది.

- సి. రామచంద్రయ్య
ప్రతిపక్ష నాయకుడు,
ఎపి శాసనమండలి.

పరమత సహనం కరవు



ఇస్లాం అంటే శాంతి అని అర్థం. కానీ అనేక ఇస్లాం దేశాల్లో అశాంతి యుతంగా వ్యవహరిస్తున్నాయి. పలు ఇస్లామిక్ దేశాల్లో ఉగ్రవాదం సాధారణం అయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ దేశాల్లోని వ్యవహారాలు ఇస్లాంకు చెడ్డపేరు తెచ్చే విధంగా ఉందని ఇస్లామిక దేశాల కూటమి స్పందించి తగు చర్యకు ఉపక్రమించాలి. చాలా ఇస్లామిక్ దేశాల్లో తీవ్రవాదం కనిపిస్తోంది, హింసాకాండ పెరిగిపోతోంది. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, సిరియా, ఈజిప్ట్‌లో కొంత భాగం, నైజీరియా వంటి దేశాల్లో హింస పెరిగిపోయింది. అక్కడ ఏదో లోపం ఉందనే విషయం గ్రహించాలి. జీహాదీ పేరుతో మరో పేరుతో యధేచ్ఛగా హింసకు పాల్పడుతున్నారు. పరమత సహనం కనిపించడం లేదు. తాజాగా పాకిస్తాన్‌లో అమానుషంగా పాఠశాలలో పిల్లలను కూడా హతమార్చారు అంటే వాళ్ల హింసా ప్రవృత్తి ఎలా ఉందో అర్థం అవుతోంది. ముస్లింలలో సైతం అనేక తెగలు ఉన్నాయి. ఎవరికి వారు తామే నిజమైన ముస్లింలను అని ఇతరులను సహించలేని పరిస్థితి. జియా ఉల్‌హక్ పాకిస్తాన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ముస్లిం ఎవరు అని తేల్చడానికి మునీర్ కమిషన్‌ను వేశారు. ఎంతో మంది ఈ కమిషన్ ముందు తమ వాదన వినిపించారు. ముస్లిం అంటే ఎవరు అని ఎవరి నిర్వచనం వారు చెప్పారు. ఒకరి నిర్వచనాన్ని మరొకరు అంగీకరించలేదు. చివరకు ఆ నిర్వచనలు అన్నీ పరిశీలించిన మునీర్ ఈ నిర్వచనాల ప్రకారం పాకిస్తాన్‌లో ఉన్నవారు ఎవరూ ముస్లింలు కాదు అనుకోవలసి వస్తుందని అన్నారు. ఏ మతంలోనైనా హింసా ప్రవృత్తి మంచిది కాదు.. క్రీస్తు ఆయుధం చేతపట్టలేదు, బుద్ధుడు ఆయుధం చేత పట్టలేదు. ఎందరెందరో మత ప్రవక్తలు ఆయుధం పట్టలేదు. ఇతరులను ఆక్రమించాలనుకునే వారే హింసను నమ్ముకుంటారు. ప్రపంచంలోని పెద్దదేశాలు ఏకమై ఉగ్రవాదాన్ని ఉమ్మడిగా నిర్మూలించాలి. ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లాం కంట్రీస్ అని ఇస్లామిక్ దేశాల సంస్థ ఉంది. ఇస్లాం అంటేనే శాంతి కానీ ఇస్లాంకు చెడ్డ పేరు తెచ్చే విధంగా ఇస్లాం పేరుతో ఉగ్రవాదులు చేస్తున్న ఈ మారణ ఖాండను ఆపేందుకు ఇలాంటి సంస్థలు పూనుకోవాలి. మాటలతో ఖండించడం కాకుండా ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు చేతులు కలపాలి. లేకపోతే ఈ ఉగ్రవాదం ప్రపంచ వినాశనానికి దారితీస్తుంది.

- టి. హనుమాన్ చౌదరి, ఛైర్మన్, ప్రజ్ఞాభారతి

బలమైన రాజకీయ సంకల్పం ఉంది



ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలంటే రాజకీయ సంకల్పం ఉండాలి. అదృష్టవశాత్తు మన దేశంలో ప్రస్తుతం బలమైన రాజకీయ నాయకత్వం ఉంది. రాజకీయ ధృడత్వం లేని నాయకత్వం వల్ల దేశానికి హాని కలిగించే తీవ్ర, ఉగ్రవాద శక్తులతో ఆశించినట్లుగా పోరాడలేం. ఇప్పుడు భారతదేశ ప్రజలు దార్శనికత ఉన్న బలమైన నాయకత్వానికి అధికారం అప్పగించారు. పాకిస్తాన్‌లోని పెషావర్‌లో 140 మంది పిల్లలను తాలిబాన్లు ఊచకోత కోయడం మానవ చరిత్రలో తీరని విషాదం. ఈ సంఘటనపై మనమంతా గుణపాఠాలు నేర్చుకోవాలి. పాకిస్తాన్ ప్రస్తుతం తనకు ముప్పుగా తయారైన ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు బలగాలను రంగంలోకి దింపింది. మనమీ సమయంలో నిశ్శబ్దంగా ఉండాలి. లేనిపక్షంలో భారత్ నుంచి తనకు ముప్పు ఉందని మళ్లీ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుంది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం వల్ల పాకిస్తాన్ పెద్దమూల్యం చెల్లించింది. మన దేశంలో ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు బలమైన చట్టాలను తయారు చేసుకోవాలి. కోర్టుల్లో త్వరితగతిన చార్జిషీట్లు దాఖలు చేసి, వేగంగా కేసులను విచారించి, శిక్షలు పడేలా చేయాలి. నిఘా వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాలి. ఉగ్రవాదాన్ని కనుగొనేందుకు ఆధునిక టెక్నాలజీని వాడుకోవాలి. సైబర్ భద్రత ఉండాలి. కాని సైబర్ లాస్ బలహీనంగా ఉండాలి. వీటికి సవరణ చేయాలి. వివిధ రాష్ట్ర పోలీసు యంత్రాంగం, జాతీయ నేర దర్యాప్తు ఏజన్సీల మధ్య సమన్వయం ఉండాలి. కేంద్రంలో ఏ రాజకీయ పార్టీ ఉన్నా పక్షపాత రహితంగా, మతతత్వ అజెండాకు తావులేకుండా ఉగ్రవాదాన్ని నిర్మూలించే దిశగా అడుగులు వేయాలి. పోలీసు దర్యాప్తు, కోర్టుల్లో విచారణ ఏళ్లతరబడి విచారణ జరిగి శిక్షలుపడిన తర్వాత మళ్లీ సుప్రీం కోర్టు, రాష్ట్రపతి వద్దకు క్షమాభిక్షకు వెళ్లడం వల్ల ఉగ్రవాదులకు చట్టమంటే భయం ఉండదు. ఈ తరహా విధానాలు లేకుండా చట్టాలకు సవరణ తేవాలి. మన దేశ మిలిటరీ వ్యవస్థ, పోలీసు వ్యవస్థ బలమైనది. వీటిని సాంకేతికంగా బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఉగ్రవాదానికి మతం రంగు పులమకూడదు. రాజకీయ పార్టీలు కూడా ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కనపెట్టి ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు పార్లమెంటులో సమష్టిగా బలమైన చట్టాలను రూపొందించడానికి కదలాలి. మన దేశంలో దేశ వ్యతిరేక శక్తుల ఏరివేతకు కులాలు, మతాలు, జాతులకు అతీతంగా ప్రజలను భాగస్వామ్యలను చేయాలి. ఉగ్రవాదం అణచివేయడం కేవలం దర్యాప్తు ఏజన్సీల పని అనుకోరాదు.

- పద్మనాభయ్య
కేంద్ర హోంశాఖ
మాజీ కార్యదర్శి

సమీకృత కార్యాచరణ ప్రణాళిక



టెర్రరిజాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి సమీకృత కార్యాచరణ ప్రణాళిక (ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్) కావాలి. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాలు, పారామిలిటరీ దళాలు, స్థానిక పోలీసులు ఉమ్మడిగా ఈ తరహా ప్రణాళికను రూపొందించుకోవడం మంచిది. పారామిలిటరీ దళాలకు సరైన శిక్షణ ఇవ్వాలి. ఉగ్రవాదుల దాడులను ఎదుర్కొనే సత్తా ప్రభుత్వానికి ఉందా లేదా అని ప్రశ్నించుకోవడం పద్ధతి కాదు. శత్రుదేశం యుద్ధానికి తలపడి మన దేశంపైకి దండెత్తి వస్తే ఎదుర్కొనే శక్తి మన దేశానికి ఉందా లేదా అని అంచనా వేయవచ్చు. ఉగ్రవాదం అలా కాదు. వీరి దాడులను అంచనావేసేందుకు వీలుకాదు. ఏ రూపంలో ఎప్పుడు ఎక్కడ ఎలాంటి అఘాయిత్యాలకు ఒడిగడతారో తెలియదు. ఇంటెలిజెన్స్ వర్గాల నిఘా ఉన్నప్పటికీ, అది సరిపోదు. తీవ్రవాదులు తమ కిరాతకాలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఎవరు ఉగ్రవాదులో, ఎవరు తీవ్రవాదులో తెలుసుకోవడం ఇబ్బందికరమే. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావలసిన అవసరం ఉంది. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వం ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రయత్నించాలి. ప్రస్తుతం మన ప్రభుత్వం ఉగ్రవాదులు, తీవ్రవాదుల కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండ్లు, ఇతర రద్దీ ప్రదేశాల్లో మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తోంది. టిఫిన్ డబ్బాలు, సూట్‌కేసులు, బ్యాగులను ఎవరైనా జనసమ్మర్థమైన ప్రదేశాల్లో వదిలి వేసి వెళితే వెంటనే వాటికి దూరంగా జరిగి, ఆ వెంటనే పోలీసులకు తెలియచేయాలంటూ మైక్‌లద్వారా చెబుతూనే ఉన్నారు. అదే విధంగా ఎవరి ప్రవర్తన అయినా అనుమానాస్పదంగా ఉంటే, ఉగ్రవాదులో, తీవ్రవాదులో అన్న అనుమానం కలిగితే పోలీసులకు తెలియచేయవచ్చు. మన దేశం విశాలమైన దేశం. సముద్ర తీరం చాలా పెద్దది. ఉగ్రవాదులు సముద్రం ద్వారా లేదా పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్ తదితర దేశాల సరిహద్దుల ద్వారా మన దేశంలోకి వస్తుంటారు. రక్షక దళాల నిఘా ఉన్నప్పటికీ, కొన్నిసార్లు రక్షకదళాల కళ్లుకప్పి వస్తుంటారు. హైదరాబాద్ ఉగ్రవాదులకు అడ్డాగా ఉందని స్పష్టమవుతోంది. ఉగ్రవాదుల ఆచూకీ కోసం, వారి కార్యకలాపాలను అణచివేసేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతైనా అవసరం. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ చేరాలంటే ఉగ్రవాదులు, తీవ్రవాదుల కార్యకలాపాలు సాగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం కొనసాగించాలి. మరో మార్గమేమీ లేదు.

- జస్టిస్ ఎ. లక్ష్మణ్‌రావు
మాజీ ప్రధాన న్యాయమూర్తి,
అలహాబాద్ హైకోర్టు.

కుటుంబ పెద్దను కోల్పోయాం

ఉగ్రవాదాన్ని అణిచివేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. హైదరాబాద్ మక్కా మసీదులో జరిగిన నా భర్త సాజెద్ అలీఖాన్ (25) మృతిచెందారు. ప్రార్థన చేసుకోవడానికి వెళ్లిన నా భర్త ఉగ్రవాదుల బాంబు పేలుళ్లలో ప్రాణాలు కోల్పోయారు. ఇంటి పెద్ద మరణంతో మా కుటుంబం ఆర్థికంగా అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంది. నా ముగ్గురు కూతుళ్లు, నేను అనాథాలుగా మారిపోయాం. ఉగ్రవాద పైశాచిక చర్యల్లో మా కుటుంబంలాగే తమ వారిని కోల్పోయి వందల కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ఎంతో మంది తల్లులకు కడుపు కోత మిగిల్చాయి. బాంబు పేలుళ్ల మృతులకు అప్పటి ప్రభుత్వం పరిహారం అందించడంతో మా కుటుంబ పరిస్థితి కాస్త కుదుటపడింది. అలాగే ప్రభుత్వం ఉద్యోగం కూడా ఇవ్వడంతో ఇప్పుడిప్పుడే మా కుటుంబం ఆర్థికంగా కాస్త నిలదొక్కుకుంటోంది. ఎన్ని ఉన్నా కుటుంబ పెద్ద లేని లోటు తీర్చలేనిది. దీనంతటికి కారణమైన ఉగ్రవాదాన్ని రూపుమాపాలి. మాలాగా మరే కుటుంబం అనాథగా మారకుండా ఉండాలి.

- సోఫియా, మక్కా మసీదు పేలుళ్ల బాధితురాలు

స్లీపర్ సెల్స్ వల్లే సమస్యలు

ఉగ్రవాదాన్ని నూటికి నూరు శాతం నిరోధించడం ఏ దేశానికీ సాధ్యం కాదు. పాకిస్తాన్‌కు అంతర్గతంగానే ఉగ్రవాదుల వల్ల సమస్యలు వస్తున్నాయి. మన దేశానికి పాకిస్తాన్ తదితర దేశాల నుండి చొరబడుతున్న ఉగ్రవాదుల వల్ల సమస్యలు వస్తున్నాయి. అమెరికా, బ్రిటన్ తదితర అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఉగ్రవాదుల వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. మన దేశంలో అనేక మతాలు, అనేక కులాలు, అనేక భాషలు, అనేక వర్గాల ప్రజలు జీవిస్తున్నారు. భారత రాజ్యాంగం అందరికీ స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పించింది. ఎవరైనా ఎక్కడైనా జీవించేందుకు వీలుంది. ఈ హక్కును కొంతమంది దుర్వినియోగం చేస్తున్నారు. ఉగ్రవాదులు ఎవరో, సాధారణ ప్రజలు ఎవరో గుర్తించలేని పరిస్థితి నెలకొంది. ఉగ్రవాదులకు రాజకీయ పార్టీలు అండగా ఉంటే సమస్య మరింత పెరిగిపోతుంది. అందువల్ల రాజకీయ పార్టీలు బాధ్యతగా ఉండాలి. భారత్‌లో 'స్లీపర్ సెల్స్' పెద్దఎత్తున పనిచేస్తున్నాయి. ఏ ఆటో కార్మికుడిగానో, ఏ మెకానిక్‌గానో, చిన్న వ్యాపారిగానో, ఇతరత్రా చిన్నాచితకా పనులు చేస్తూ, ఎవరికీ అనుమానం రాకుండా ఉగ్రవాదులతో సంబంధం కలిగిన వారినే స్లీపర్‌సెల్స్ అంటున్నాం. హైదరాబాద్ తదితర నగరాలు, పట్టణాల్లో ఈ తరహా స్లీపర్‌సెల్స్ చాలామంది ఉన్నారు. హైదరాబాద్, ముంబాయి, ఢిల్లీ తదితర అనేక నగరాల్లో ఉగ్రవాదుల చర్యలు నిరాటంకంగా సాగుతున్నాయి. వందలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. స్లీపర్ సెల్స్‌ను గుర్తించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటే మంచిది. దీనివల్ల ఉగ్రవాద చర్యలను కొంతవరకైనా నిరోధించవచ్చు. మన దేశంలో ఉగ్రవాదులు, తీవ్రవాదుల వల్ల ఎక్కువ ఇబ్బందులు ఉన్నాయి. వీరి కార్యకలాపాలు కట్టడి చేస్తే, చాలావరకు సమస్యలకు పరిష్కారం లభించినట్టే భావించవచ్చు. మన దేశంలో పోలీసుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఉదాహరణకు రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపితే 60 వేల నుండి 70 వేల మంది పోలీసు సిబ్బంది ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు కలిపి దాదాపు రెండు లక్షల వరకు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ఎన్ని ఉంటాయో లెక్కించడం కష్టం. ఇన్ని సంస్థలకు పోలీసు రక్షణ ఏర్పాటు చేయడం సాధ్యం కాదు. కీలకమైన కార్యాలయాలకు మాత్రం రక్షణ కల్పించవచ్చు. అయితే అన్ని విద్యాసంస్థలు, కార్యాలయాల్లో సిసిటివిలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేయవచ్చు. ప్రతి కార్యాలయంలో, విద్యాసంస్థల్లో 'ప్రత్యేక బెల్'లను ఏర్పాటు చేసి, అత్యవసర సమయాల్లో వీటిని మోగించడం ద్వారా పోలీసులను అలర్ట్ చేయవచ్చు. తద్వారా కొంతవరకైనా ప్రజలకు రక్షణ కల్పించేందుకు వీలవుతుంది.

- డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్
కన్వీనర్, లోక్‌సత్తా.

అదుపు అందరి బాధ్యత



టెర్రరిజం వల్ల ప్రజల శాంతి సహజీవనానికి భంగం ఏర్పడటమే గాకుండా దేశభద్రతకు సైతం ముప్పు వాటిల్లుతుంది. అభివృద్ధికి కూడా పెద్ద ఆటకం. ఉగ్రవాద చర్యలకు బలయ్యేవి నిజానికి అమాయకుల ప్రాణాలే. ప్రజలు మతసామరస్యం, సంయమనం, జాతీయ సెక్యులర్ విలువలతో, సమైక్యతా భావంతో ఉగ్రవాదాన్ని తుద ముట్టించాలి. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని ప్రజలందరికీ భద్రత కల్పించడం కేంద్ర ప్రభుత్వం ప్రథమ కర్తవ్యం కావాలి. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం కంటే యుద్ధాలు చేయడం చాలా తేలిక. కేవలం సంకుచిత ప్రయోజనాల కోసం ఉగ్రవాదులు రక్తపాతం సృష్టిస్తున్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో ఉగ్రవాదులు, తీవ్రవాదుల బెడద చాలా ఎక్కువగా ఉంది. నేరుగా ఎన్నికల సమయంలో అభ్యర్థులను బెదిరించడం, వారి ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. అయితే మన దేశంలో ప్రజాస్వామ్య ప్రేమికులు ఉండటం వల్ల నేరుగా ఎన్నికల్లో పాల్గొని ప్రజలు తీవ్రవాదానికి సరైన బుద్ధి చెప్పారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదులు ఎన్ని హెచ్చరికలు చేసినా, భయపడకుండా ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఉగ్రవాదుల సమాచారాన్ని రహ్యంగా సేకరించేందుకు ఇంటిలిజెన్స్ విభాగాన్ని పటిష్ఠం చేయాలి. కౌంటర్ ఇంటిలిజెన్స్ విభాగాన్ని రాజకీయాలకు అతీతంగా సమర్థవంతంగా నిర్వహించాలి. రాజకీయ నాయకులు కొంతమంది తీవ్రవాదుల కుటుంబ సభ్యుల ఇళ్ల వద్దకు వెళ్లడం ద్వారా ఎలాంటి సంకేతాలు ఇచ్చారో అర్థం చేసుకోవాలి. ఉగ్రవాద ఘటనలకు ఒక్కోమారు హైదరాబాద్‌లో మూలాలు బయటపడుతుంటాయి. కొన్ని ఘటనలకు హైదరాబాద్ రిక్రూటింగ్ జోన్‌గా ఉంది. దీనిని అదుపు చేయాల్సిన అవసరం ఉంది. ఉగ్రవాదం వైపు యువత ఎందుకు ఆకర్షితులు అవుతున్నారో అర్థం చేసుకుని వారికి ఉద్యోగం, ఉపాధి కల్పించడం ద్వారా ఉగ్రవాదం వైపు వారు మరలకుండా చేయగలుగుతాం.

- నల్లు ఇంద్రసేనారెడ్డి
బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు

ఇస్లామిక్ రాజ్యస్థాపనే వాళ్ల లక్ష్యం



పెషావర్‌లోని రహ్మాన్‌బాబా శ్మశాన వాటిక కాపరి తాజ్ మొహమ్మద్ పాకిస్తాన్‌లోని సైనిక్ స్కూల్ విద్యార్థుల శవాలను ఖననం చేస్తూ కంటనీరు పెట్టుకుని నేను కాటికాపరిని, ఖననం చేయటమే కాని కంటనీరు పెట్టడం ఎరుగను, గృహదహనాలు, బాంబుపేలుళ్లు, శిరచ్ఛేదాలు మొదలైనవి ఎన్నింటినో చూశాను, శవాలను ఖననం చేశాను కాని 4 నుండి 14 ఏళ్ల పిలల శవాలను ఖననం చేస్తున్నపుడు నా కంట నీరు ఆగలేదు, ఇంతటి దారుణం నేను చూడలేదు అని వాపోయాడు. ఇస్లామిక్ ఉగ్రవాదులు ఆ దాడి మేమే చేశామని ప్రకటించుకున్నారు. ఈ రోజున ప్రపంచంలో అనేక దేశాలు ఉంటాయి. మహిళల విషయంలో, ఇతర మతస్తుల విషయంలో వాళ్ల వ్యవహారం ఎట్లా ఉంటుందో వివరాలు చెప్పాల్సిన అవసరం లేదు. కాలం మారింది కాని వాళ్ల పాశవిక ధోరణులు మాత్రం మారడం లేదు. ప్రపంచంలో శాంతి స్థాపించబడాలంటే అన్ని మతాల్లో పరస్పర అవగాహనతో సామరస్య ధోరణి కావాలి, ఇవేవీ మచ్చుకు కూడా మనకు కనిపించడం లేదు. ఉగ్రవాదులను ఎవరు సృష్టిస్తున్నారు? వాళ్లకు శిక్షణ ఎవరు ఇస్తున్నారు? ఆయుధాలు ఎక్కడి నుండి వస్తున్నాయి అనే ప్రశ్నలు వస్తే అన్నింటికీ సమాధానంగా పాకిస్తాన్ పేరే వస్తుంది. ఉగ్రవాదులైన తాలిబన్లు, లష్కర్ ఇ తొయిబా మొదలైన ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థల సృష్టికర్త పాకిస్తాన్. ఆ సంస్థలే ప్రపంచ వినాశనం కోరుకుంటున్నాయి. ఇటువంటి పాశవిక శక్తులను నిలువరించాలి. పాకిస్తాన్ ఇప్పటికే అంతర్గత యుద్ధానికి సిద్ధం అవుతోంది. అయినా పాకిస్తాన్ ఉగ్రవాదుల విషయంలో కఠినంగా వ్యవహరించలేకపోతోంది. ఇస్లామిక్ రాజ్యం ఏర్పడితే పాలన ఎలా ఉంటుందో నోబుల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్‌జాయిని అడిగితే చెబుతుంది. ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లలోని అనేక ప్రాంతాల్లో సామాన్య ప్రజలను అడిగినా చెబుతారు. ఇటువంటి శక్తుల విషయంలో ప్రపంచం, అందులో ముఖ్యంగా భారత్ ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

ఈ ఇస్లామిక్ ఉగ్రవాదుల దాడిని చూశారు. ఈ ఉగ్రవాదంతో వారు సాధించింది ఏమిటి? ఇరాక్‌లో కావచ్చు, ఆఫ్ఘనిస్తాన్‌లో కావచ్చు, పాకిస్తాన్‌లో కావచ్చు, భారత్‌లో ప్రత్యేకంగా కాశ్మీర్‌లో సాగిస్తున్న దాడులు కావచ్చు. ఏదేమైనప్పటికీ వాళ్ల లక్ష్యం ఇస్లామిక్ రాజ్యం ఏర్పాటు చేయడమే, ప్రపంచంలో ఇస్లామిక్ సామ్రాజ్యం ఏర్పాటు చేయాలి. ఈ లక్ష్యం కోసం ప్రపంచం అంతా పనిచేస్తున్నారు. అంతర్గతంగా కొట్లాడుకుంటూ పనిచేస్తున్నారు. ఇస్లామిక్ రాజ్యం లక్ష్యం షరియత్ పాలన. షరియత్ పాలన ఎలా ఉంటుందో ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ల ఆధిపత్యం సాగుతున్న చోట్ల చూస్తే మనకు అర్థం అవుతుంది. శిక్షలు కఠినంగానూ, పాశవికంగానూ

- రాంపల్లి మల్లికార్జునరావు
సమాచార భారతి

వెన్నెల
శుక్రవారం 26 డిసెంబర్ 2014
ఆంధ్రభూమి

ట్రేడ్ టాక్

ఈవారం కూడా ప్రేక్షకుల తీర్పు కోరుతూ బాగానే సినిమాలు విడుదలయ్యాయి. వీటిలో పెద్ద అంచనాలతో వచ్చిన రజనీకాంత్ లింగ, నాగబాబు కుమారుడు వరుణ్‌తేజ్ హీరోగా వచ్చిన ముకుంద, కరుణాకరన్ నితిన్ కాంబినేషన్‌లో రూపొందిన చిన్నదాన నీకోసంలాంటి చిత్రాలు కూడా ఉన్నాయి. అలాగే, జగపతిబాబు 'ఓ మనిషి కథ', కొత్త దర్శకుడు రవిచంద్ర రూపొందించిన 'ప్రేమిస్తేపోయే..కాలం', క్రిస్మస్ కానుకగా విజయ్‌చందర్ నటించిన 'సత్యంవైపు మార్గం' విడుదలయ్యాయి. అలాగే -అమీర్‌ఖాన్‌ను గ్రహాంతరవాసి చూపిస్తూ రాజ్‌కుమార్ హిరాని రూపొందించిన సంచలనాత్మక చిత్రం పీకే కూడా ఉంది. విడుదలైన చిత్రాలన్నింటిలో లింగ అనుకున్న అంచనాలకు చేరలేదు. కరుణాకరన్ మ్యాజిక్ పనిచేయకపోవడంతో -చిన్నదాన నీకోసం నీరసపడింది. వరుణ్‌తేజ్ హీరోగా వచ్చిన ముకుంద మాత్రమే ఫరవాలేదనిపించే స్థాయిలో ఉండి, కలెక్షన్లు రాబడుతోంది. ఓ మనిషి కథ, ప్రేమిస్తేపోయే.. కాలంలాంటి చిత్రాలకు మౌత్‌టాక్ బావున్నా, థియేటర్లు అందుబాటులో లేక ప్రేక్షకులను చేరలేకపోతున్నాయి.

క్లబ్‌కు చేరని కథ!

తెలుగు సినిమా. భారతీయ సినీ చరిత్రలో బాలీవుడ్ తరువాత అంతటి సత్తా కలిగిన పరిశ్రమ. డబ్బుకు కొదువలేదు. నైపుణ్యం తక్కువ లేదు. టెక్నాలజీ లేకపోలేదు. సత్తావున్నవాళ్ల కరవు లేదు. థియేటర్ల కక్కుర్తి లేదు. అవును -అన్నీ ఉన్నాయి. చాలాచాలానే ఉన్నాయి. అందుకే -లెక్కకు మించి సినిమాలొస్తున్నాయి. బాక్సాఫీస్ వద్ద తన్నుకు చస్తున్నాయి.

రివ్యూ 2014

వారం తిరక్కుండానే -రెండోకంటికి కనిపించకుండా వెళ్లిపోతున్నాయి. ఎందుకు?- ఈ ప్రశ్న చాలా ఏళ్లుగా వినిపిస్తున్నదే. చాలా సందర్భాల్లో ప్రశ్నించుకున్నదే? చాలాచాలామంది ప్రస్తావిస్తున్నదే? కానీ -సమాధానం మాత్రం ప్రశ్న దగ్గరే ఆగిపోతుంది. కారణం -చెప్పుకోదగ్గ సక్సెస్‌లు లేకపోవడం. విజయాలను సమష్టిగా లెక్కలు వేసుకోకపోవడం.

ప్రత్యేకంగా-

తెలుగు చిత్ర పరిశ్రమనే తీసుకుంటే -ఏడాదికి 140 నుంచి 180 సినిమాలను నిర్మిస్తున్న స్థాయి మనది. విజయాలు లెక్కించడానికి చేతి వేళ్లుకూడా ఎక్కువైపోయే పరిస్థితి. తుపాను వేగంతో వచ్చి -బాక్సాఫీసు వద్ద చితికిలపడుతున్న సినిమాలు కోకొల్లలు. వీటిపై ఏటా పెడుతున్న పెట్టుబడి -సుమారుగా 500 కోట్లు. మొత్తం కలెక్షన్లు కలిపితే బాలీవుడ్‌లో నాలుగైదు సినిమాలు రాబట్టే మొత్తం. నిర్మాణ విలువల్లో, మార్కెటింగ్ వ్యవస్థలో బాలీవుడ్‌కు సరితూగగల తెలుగు సినిమా -కథనరంగంలో, కలెక్షన్లరంగంలో ఎందుకు బ్యాక్‌బెంచీలో ఉండిపోతోందో అర్థంగాని పరిస్థితి. టాలీవుడ్ సినిమాలే బాలీవుడ్‌లో రీ'మేక'లై కలెక్షన్ల సునామీలు సృష్టిస్తుంటే, ఇక్కడ మనం మాత్రం రెండో వారం థియేటర్లలో సినిమా నిలబడుతుందో లేదో అంజనం వేసి వెతుక్కోవాల్సిన దుస్థితి. చిన్నా పెద్దా తేడాలేకుండా బాలీవుడ్ సినిమాలు శక్తిమేరకు బాక్సాఫీస్ వద్ద వందల కోట్ల క్లబ్‌కు చేరుతుంటే, టాలీవుడ్ సినిమా మాత్రం క్లబ్‌కు ఎప్పుడు చేరతామా? అని కలలుగంటూ గడిపేస్తోంది. ఈమధ్య తమిళ సినిమా కూడా వందకోట్ల మార్కెట్ దాటేసింది. కానీ తెలుగు సినిమా మాత్రం యాభై, అరవై కోట్ల మార్కెట్ దగ్గరే కొట్టుమిట్టాడుతోంది. ప్రతీ ఏడాదిలాగే ఈ ఏడాదీ లెక్కకు మించే పెద్ద సినిమాలొచ్చినా, ఏ ఒక్కటీ మిలియన్ క్లబ్ దరిదాపులకు చేరలేదు. ఇక ఏవో కొద్దిపాటి చిన్న సినిమాలు తమ సత్తా చాటుకోవడం తప్ప, లెక్కకు మిక్కిలిగా ఫ్లాపులే మూటగట్టుకున్నాయి. 2014లో భారీ, చిన్నాచితకా సినిమాలు కలుపుకుని 190 వరకు విడుదలయ్యాయి. ఆశలు నెరవేర్చని సినిమాలుగా వచ్చి వెళ్లిపోయిన వాటిని ఒకసారి సమీక్షించుకుంటే...

తొలిరోజే మూడు సినిమాల విడుదలతో 2014 ఆరంభమైంది. ఫామ్ కోల్పోయిన హీరో శ్రీకాంత్ 'క్షత్రియ'సహా విడుదలైన రెండు సినిమాలూ బాక్సాఫీస్ దగ్గర చతికిలపడ్డాయి. వారం తిరగకుండానే జనవరి 9న పెద్ద అంచనాలతో వచ్చిన హీరో మహేష్ బాబు సినిమా '1, నేనొక్కడినే' ఢమాల్‌మంది. హాలీవుడ్ స్టయిల్ మేకింగ్‌ను తెలుగు ప్రేక్షకుడు రిసీవ్ చేసుకోలేకపోవడమే కారణం అన్నది ఓ చర్చ. పెద్ద సినిమాలు పోటీలో లేని సమయంలో 'ఎవడు' అంటూ వచ్చిన రామ్‌చరణ్ సక్సెస్ టాక్ తెచ్చుకున్నాడు. పూరీజగన్నాథ్, నితిన్ కాంబోలో వచ్చిన 'హార్ట్ ఎటాక్', మోహన్‌బాబు ఫ్యామిలీ హీరోలతో వచ్చిన 'పాండవులు పాండవులు తుమ్మెద' ప్రేక్షకుడిని సంతృప్తిపర్చలేకపోయాయి.

ఫిబ్రవరిలో క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ తెచ్చిన 'పైసా'ను ప్రేక్షకుడు వద్దనుకున్నాడు. 'భీమవరం బుల్లోడు'గా వచ్చిన సునీల్ సైతం బాక్సాఫీస్ వద్ద

- మిగతా 10వ పేజీలో



హాట్ స్వీట్!

తెలుగు తెరపై అదృష్టాన్ని వెతుక్కుంటూ బెంగాల్ నుంచి ఎగిరొచ్చిన బంగారు బొమ్మ -మిస్తీ. అసలు పేరు -ఇంద్రాణి చక్రవర్తి. ముద్దుపేరు మిస్తీ. పేరుకు తగ్గట్టే తియ్యని అందం. -'చిన్నదాన నీకోసం' అంటూ వెతుక్కుంటున్న నితిన్‌తో ఫస్ట్‌టైం టాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది. వాస్తవానికి కెమెరాకు మిస్తీ కొత్తేం కాదు. ఏరికోరి సుభాష్‌ఘాయ్ ఎంచుకున్న కుందనపు బొమ్మే ఈ -'కాంచి'. మనీషా కోయిరాలా, జాకీష్రాఫ్, మహిబా చౌదరిలాంటివాళ్లను స్క్రీన్‌కు పరిచయం చేసిన సుభాష్ -తన 'కాంచి' ప్రాజెక్టు కోసం వెతికివెతికి ఎంపిక చేసుకున్నాడు. 350కి ఆడిషన్స్ నిర్వహించి -ఒక్క లుక్‌లోనే మిస్తీని ఒకే చేశాడు సుభాష్. అలా స్క్రీనింగ్‌లో మార్కులు కొట్టేసింది మిస్తీ. ప్యార్ కా పంచనామాలో కార్తీక్ తివారితో జత కట్టి, 'ఆకాశ్‌వాణి'లోనూ అందంగా కనిపించింది మిస్తీ. బెంగాలీ సహా ఒకవైపు ప్రాంతీయ భాషా సినిమాలపై దృష్టిపెడుతూనే -బాలీవుడ్‌లో తనెంటో నిరూపించుకునే ప్రయత్నాలు చేస్తోంది. పక్కింటి పిల్లలా కనిపించే ఈ బెంగాలీ భామ -పుట్టింది పెరిగింది కోల్‌కతాలోనే. 'చిన్నదాన నీకోసం'లో మంచి పర్ఫార్మెన్స్ అందించిన ఇంద్రాణి -తెలుగులో మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆశపడుతోందట. నెరవేరాలని ఆశిద్దాం.

పోయినోళ్ళందరూ...

సామాన్యుడి స్వప్నం -కథ. సమకాలీన జీవన స్రవంతి -కథనం. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడే నిత్యజీవన సంఘర్షణ -ఆయన సినిమా. ఒకటీ రెండూ కాదు, వంద సినిమాలతో వందసార్లు వాతలు తేలేలా చర్నకోలా విదిల్చి -ఆ బాధను ఆయనా అనుభవిస్తూ వెళ్లిపోయాడు. 2014 చివరిలో తన మరణంతోనూ -దక్షిణ భారత సినిమాను ఓ కుదుపు కుదిపేసి బాలచందర్ తిరిగిరాని లోకాలకు మరలిపోయాడు. వీళ్లే మా సినిమా పరిశ్రమ సొత్తు అని సగర్వంగా చెప్పుకోగలిగే వ్యక్తుల్లో -ఈ ఏడాది చాలా దిగ్గజాలే కనుమరుగైపోయాయి. సినిమాను జీవితానికి, జీవితాన్ని సినిమాకు అన్వయించి.. ఎన్నెన్నో నేర్పించి.. వాళ్లు నేర్చుకున్నవి మనకు విడిచిపెట్టి -చరిత్ర పేజీల్లోకి స్థిరాక్షరాలుగా నిలిచిపోయారు.

వివరాలు 12వ పేజీలో..

మీ వ్యూస్

కష్టమే

'లింగ' చిత్రం బాగున్నా విపరీతమైన ఓవర్ యాక్షన్ లేకపోవడం పెద్ద ప్లస్ అయింది. బ్రిటీష్ కాలంనాటి కథను చక్కగా తెరకెక్కించడంలో దర్శకుడు నేర్పు చూపాడు. ట్రైన్ ఎపిసోడ్ ట్రూలీ వండర్. అయితే కథ పాతది అవడం, సంగీతం అంతంతమాత్రం కావడం మైనస్. తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించడం కష్టమే. మనవాళ్లకు కామెడీ అనేది ఇందులో కనబడదు. అదే లోపం.

- పంచకర్ల గోవర్ధనరావు, కంకిపాడు

సానుభూతి ఏది?

సినిమా ఛాన్సులు లేకపోవడంతో శరీరాన్ని అమ్ముతున్నానని శ్వేతాబసు ప్రసాద్ ట్విట్టర్ లోకి ఎక్కింది. దాంతో జాలి కురిపించిన బాలీవుడ్ ప్రముఖులు ఆమెకు మద్దతు పలికారు. పోలీసులు వ్యభిచారం నేరం కింద అరెస్టు చేస్తే, జర్నలిస్టులు చేసిన రచ్చవల్లనే పోలీసులు తనని అరెస్టు చేశారని, తను అమాయకురాలినని, ఓ వేడుకకు మామూలుగా వెళ్లానంటూ కోర్టులో శ్వేత చెప్పగానే ఆమెను విడుదల చేసేశారు. రచ్చ చేసిన జర్నలిస్టులు క్షమాపణ కోరకపోయినా ఆమె ఉదారంగా వారిని క్షమించేసినట్టు ప్రకటించింది. బాలీవుడ్‌లో ఆమె మూటకట్టుకున్న సానుభూతి ఇప్పుడేమౌతుందో!?

- సుభాష్, శ్రీనగర్

ఒక్క ఛాన్స్

ఈమధ్య వచ్చిన వ్యాసాలలో ఒకే ఒక్కఛాన్స్ అత్యుత్తమం అని చెప్పాలి. భాషలో ప్రాస, భావంలో ఊపు, వ్యక్తీకరణలో స్పష్టత కనిపించాయి. మణిరత్నం సినిమాలే ప్రేరణగా మెగాఫోన్ పట్టానని చెప్పుకుంటూ ఇటీవల ఓ కొత్త దర్శకురాలు ఓ రీమేక్ సినిమాను ప్రేక్షకుల మీదకు వదిలారు. పేరున్న హాస్యనటుడి కుమార్తె కావడమే ఆమె అర్హతా? లేక మణిరత్నం ప్రేరణగా సినిమా తీసేందుకు పడిన తపనా? అన్నది -ఆ సినిమా చూస్తే అర్థమైపోతుంది. చాలామంది సినీరంగంలోకి వస్తున్న వాళ్ల తీరంతా ఇలాగే ఉందా? ఎలాంటి సన్నివేశాలు ఎంతసేపు చూపిస్తే మనసుల్ని కదిలిస్తాయి. సన్నివేశాన్ని ఏక్రమంలో చూపాలి? తాను ఊహించినట్టు చిత్రీకరణలో వచ్చిందా? ఈ విషయాలు తెలియకపోతే ఎవరూ దర్శకులుగా నిలబడలేరు.

- చంద్ర, కాకినాడ

బాగుంది

ఈమధ్య వెన్నెల బాగుంటోంది. కొత్తగా ప్రారంభించిన ఫిలిమ్ క్విజ్, 'మళ్లీమళ్లీ అవే' లాంటివి ఆకర్షిస్తున్నాయి. దీనికి ఏదైనా బహుమతి నగదు రూపంలో ఇస్తే బాగుంటుంది. తద్వారా అభిమానం కూడా పెరుగుతుంది.

- శివలెంక చంద్రశేఖర్, హైదరాబాద్

నివాళి

'బాచి' చిత్రం ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయమైన చక్రి ఎన్నో విజయవంతమైన చిత్రాలకు సంగీతం అందించారు. శివమణి, ఇడియట్, సింహ, దేశముదురు, చక్రంలాంటి చిత్రాలు ఆయన పాటలతోనే హిట్టయ్యాయి. పూరి జగన్నాథ్ చిత్రాలకు ఎక్కువగా ఆయనే సంగీతాన్ని అందించారు.

ఇల్లరికం చిత్రం ద్వారా సినీ రంగప్రవేశం చేసిన పూడిపెద్ది జోగేశ్వరశర్మ అనేక చిత్రాలలో క్యారక్టర్ ఆర్టిస్టుగా, డబ్బింగ్ కళాకారుడిగా పేరు తెచ్చుకున్నారు. దాదాపు 500 చిత్రాల్లో నటించి, మెప్పించారు. ఆయన సంతానమంతా కళామతల్లికి సేవ చేస్తోంది. ఆయన మరణం పరిశ్రమకు తీరని లోటు.

- పాణ్యం శ్రీనివాసరావు, కర్నూలు

నమ్మినబంటు

వెన్నెల్లో ఫ్లాష్‌బ్యాక్ శీర్షికన 'నమ్మిన బంటు' విశేషాలు ఆకట్టుకున్నాయి. పల్లె వాతావరణంలో చిత్రీకరించిన ఈ సినిమాలో 'చెంగు చెంగున గంతులు వేయండి' పాట కొసరాజు గొప్పదనాన్ని చెబుతుంది.

సుశీల ఈ పాటను అంతే భావయుక్తంగా పాడారు. పల్లె వాతావరణానికి తగ్గట్టుగా పాటలు రాయడంలో సిద్ధహస్తుడైన కొసరాజు అద్భుతమైన పాటలు రాశారు. పీల్చేగాలి, తాగే నీరు ప్రకృతి సంపద ఏ ఒక్కరి సొత్తుకాదు అన్న అంశమే ఈ సినిమాలో ప్రధానం. సావిత్రి, గుమ్మడి, ఎస్‌విఆర్, రేలంగి పాత్రలకు న్యాయం చేశారు.

- మార్కస్ మణిరాజు, ముద్దనూరు

మూస లక్ష్మి..

రచయిత, దర్శకుడైన రవి కథను చెప్పినట్టుగా దృశ్యపరంగా లక్ష్మీ రావే.. చెప్పలేకపోయాడు. చాప్టర్లు చాప్టర్లు రాసుకొని హరికథ, పిట్టకథల్లోకి జారిపోయాడు. పిట్టకథలే ఎక్కువైతే సినిమా పరిస్థితేంటి. కుటుంబ విలువల నేపథ్యంలో ప్రేమకథ అల్లాలని ప్రయత్నించి, దానికి బోనస్‌గా కథలు అల్లుకున్న వ్యవహారం. విశాఖ అందాలు బాగా చూపినా పాటలు పరవాలేదనిపించాయి. దర్శకుడు తనదైన శైలిలో సినిమాను మలచలేకపోయాడు.

- కామిడి సతీష్‌రెడ్డి, పరకాల

ఉందా.. మంచికాలం

'ఉందీలే మంచి కాలం ముందుముందునా' సినిమా పేరులో చెప్పినట్టుగానే సినిమా పరిశ్రమ ముందుముందు మంచికాలం ఉందా? అన్న అనుమానం వస్తుంది ఆ చిత్రం చూస్తే. ప్రచారలోపంతో ప్రేక్షకులు లేక ఈ సినిమా వెనక్కి వెళ్లింది. మంచి కథ ఉన్నా కమర్షియల్ చిత్రమైనా ప్రేక్షకులు చూస్తేనే కదా? మధ్యతరగతి మనుషులమధ్య వుండే స్నేహబంధం, తండ్రి కొడుకుల అనుబంధం బాగానే తీశారు. ఎటువంటి సెట్లులేకుండా ఔట్‌డోర్‌లోనే తీశారు. ఎవరూకూడా ఎబ్బెట్టుగా నటించలేదు. కానీ ఫలితం లేదు.

- శ్రావణి.సి, చిక్కడపల్లి

మూడుపాత్రల చుట్టే...

అప్పట్లో వచ్చిన యమలీల పెద్ద హిట్. ఇప్పుడు అదే సినిమా దర్శకుడు మరో యముడి ఎపిసోడ్‌తో తయారుచేసి 'యమలీల-2' అని వచ్చారు. అప్పటి సినిమాలో తల్లి కోసం హీరో ఆరాటపడితే, ఇందులో చిన్న పాప కోసం హీరో కిందామీదా పడతాడు. సినిమా జనాలకు యముడు అచ్చంగా అలాంటి కథాంశంతోనే రావాలని లేదు. సినిమా మూడుపాత్రల చుట్టే తిరుగుతోంది. ఎమ్మెస్ నారాయణ కామెడీ చూస్తే జాలేస్తుంది. సినిమాలో పస లేదు.

-కామిడి సతీష్‌రెడ్డి, పరకాల

శభాష్

ఇటీవల హుద్‌హుద్ తుపాను వచ్చిన నేపథ్యంలో వారి సహాయార్థం తెలుగు సినిమా పరిశ్రమ కదలిరావడం అభినందనీయం. 'మేము సైతం' అంటూ తెలుగు సినీ తారాలోకమంతా కనువిందుచేసి కబడ్డీ ఆడి విరాళాలు సేకరించి పెద్దమొత్తంలో నగదు అందజేయడం అపురూపం. అందరికీ అభినందనలు.

-ఎల్.ప్రపుల్లచంద్ర, ధర్మవరం

శ్రీ వేంకటేశ్వర మహత్యం

కలియుగంలో -పాపభారంతో నిండిన భూలోకంలో విశ్వశాంతికై సప్తఋషులు కశ్యపముని సారథ్యంలో యాగం చేస్తారు. నారదుని సలహాతో త్రిమూర్తులను పరీక్షించి, యజ్ఞ హవిర్భాగాన్ని అందించే స్వీకర్త ఎన్నికకోసం భృగుమహర్షి (గుమ్మడి)ని పంపుతారు. తనరాకను అలక్ష్యం చేసిన బ్రహ్మ, మహేశ్వరులపై ఆగ్రహించిన భృగువు అదే ఆవేశంతో వైకుంఠానికి వచ్చి శ్రీమహాలక్ష్మితో వున్న మహావిష్ణువు వక్షస్థలంపై కాలితో తన్నుతాడు. శ్రీహరి ఆయనను అనునయిస్తునే, అతని కాలికున్న నేత్రాన్ని చిదిమేయటం ద్వారా అజ్ఞానాన్ని తొలగిస్తాడు. శ్రీహరి చర్యకు ఆగ్రహించి మహాలక్ష్మి వైకుంఠం వదిలిపెడుతుంది. ఆమె విరహం భరించలేని మహావిష్ణువు భూలోకం చేరతాడు. ఆకలితో వున్న శ్రీనివాసునికి బ్రహ్మ, మహేశ్వరులు గోవత్స రూపంలో క్షీరాన్ని అందిస్తారు. అడ్డుపడిన పశుకాపరి శరభయ్య (రమణారెడ్డి)ని భూతంగా మారమని విష్ణుమూర్తి శపిస్తాడు. తిరిగి సంచారం చేస్తూ వకుళమాత ఆశ్రమంలో శ్రీనివాసునిగా ఆశ్రయం పొందుతాడు.

ఆకాశరాజు (ఎవి సుబ్బారావు) కుమార్తె పద్మావతిని శ్రీనివాసుడు ఉద్యానవనంలో కలుసుకుని, ప్రేమిస్తాడు. పద్మావతి కూడా శ్రీనివాసుని ఇష్టపడుతుంది. వీరి వివాహానికి తొలుత ఇష్టపడని మహారాణి ధారుణీదేవి (ఋష్యేంద్రమణి), ఎరుకలసాని (షావుకారు జానకి) చెప్పిన సత్యం గ్రహించి సమ్మతిస్తుంది. వైభవంగా శ్రీనివాసు, పద్మావతుల వివాహం జరుగుతుంది. ఈ విషయం తెలిసి ఆగ్రహంతో అక్కడకు వచ్చిన లక్ష్మీదేవి, పద్మావతుల మధ్య జరిగే సంవాదంలో శ్రీనివాసుడు శిలగా మారతాడు. బ్రహ్మ, మహేశ్వర, నారదుల ద్వారా ఇదంతా శ్రీవెంకటేశ్వరుని అవతారం కోసం జరిగిన వృత్తాంతమని లక్ష్మీదేవి తెలుసుకుంటుంది. లక్ష్మీదేవి, పద్మావతి కూడా శిలామూర్తులుగా మారిపోవడంతో -శ్రీ వెంకటేశ్వరుని మహాత్యాలు, స్వామివారి సేవలను చూపుతూ చిత్రం ముగుస్తుంది.

చిత్రంలో నారదునిగా సూరిబాబు, బ్రహ్మగా ఎవి సుబ్బారావు (జూ.), శివునిగా వెంపటి పెద సత్యం, సరస్వతిగా సంధ్య, పార్వతిగా కెవి శాంతి, బాలాజీగా నాగయ్య, మహరాజుగా రాజనాల, ఆశ్రమంలో శిష్యులుగా బాలకృష్ణ, పేకేటి శివరామ్, శరభుని భార్యగా సురభి బాలసరస్వతి, పద్మావతి చెలికత్తెలుగా మోహన, 'బాల' నృత్య నాటికలో మన్మధునిగా రీటా కనిపిస్తారు. ఇతర పాత్రలను మద్దాలి కృష్ణమూర్తి, లంక సత్యం, వంగర, వైవి రాజు పోషించారు.

దర్శకులు పి పుల్లయ్య బలవంతం వల్ల ఘంటసాల ఇందులో స్వామివారి ముందు పాటపాడే భక్తుని పాత్ర పోషించారు. వారి ఇష్టదైవం శ్రీ వెంకటేశ్వరుడు కావటం కూడా ఆయన ఈ సన్నివేశంలో నటించటానికి ఓ కారణం. ఈ పాటలో ఘంటసాల తోపాటు సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు, వేణువువాయించే నంజప్ప, ఘంటసాల పెద్ద కుమారుడు విజయ్‌కుమార్ సైతం కనిపిస్తారు. ఆ సన్నివేశంలోని అద్భుతమైన, చిరస్మరణీయమైన భక్తిగీతం 'శేష శైలావాస శ్రీవెంకటేశా' (ఘంటసాల-ఆత్రేయ).

ఒకసారి నిర్మించి విజయవంతమైన చిత్రాన్ని తిరిగి తామే నిర్మించి విజయవంతం చేసిన ఘనత దర్శకులు పుల్లయ్యకు దక్కింది. మొదటిసారి ఈ చిత్రాన్ని నిర్మించినపుడు థియేటర్లలో శ్రీ వెంకటేశ్వరుని విగ్రహాలు, హుండీలు పెడితే, హుండీలు తొందరగా నిండిపోయేవి. రెండోసారి చిత్రాన్ని నిర్మించినప్పుడు అదేవిధంగా జరగటం విశేషం. ఆ హుండీల్లో డబ్బు తిరుపతి పంపించేవారు. ఇది కూడా ఓ విశేషాంశం.

'శ్రీవెంకటేశ్వర మహత్యం'లో శ్రీనివాసునిగా, మహావిష్ణువుగా ఎన్టీ రామారావు ఎంతో సమ్మోహనంగా, గంభీరంగా, తల్లివద్ద పెళ్ళికొరకు అలకపూనిన సన్నివేశంలో ముచ్చటగా నటించి అలరించారు. ఇక శ్రీలక్ష్మిగా యస్ వరలక్ష్మి వైకుంఠం వీడి వెళ్ళే సమయంలో ఆత్మాభిమానాన్ని, భర్తకై ఆవేదన సమయాల్లో కరుణరసం, చివర భర్త మరో స్త్రీని వివాహం చేసుకున్నాడన్న ఆగ్రహం, ఆవేదన సమర్థవంతంగా నటించి చూపించారు. పద్మావతిగా మహనటి సావిత్రి శ్రీనివాసునిపై ప్రేమ, విరహాన్ని, భర్తతో ప్రణయ పారవశ్యాన్ని, శ్రీలక్ష్మితో సంవాదనలో క్రోధాన్ని, వేడికోలు ఎంతో సంయమనంతో ప్రదర్శించగా శాంతకుమారి వకుళమాతగా భక్తిపారవశ్యాన్ని కడురమణీయంగా, నారదుని వల్ల తన పూర్వజన్మ తెలిసికొన్న సమయంలో ఆనందాన్ని ఎంతో భావుకతతో మెప్పించారు. ఎరుకలసానిగా గెస్ట్‌గా నటించిన షావుకారు జానకి, ఆ కొద్దిసేపటి లోనే చక్కని హావభావాలు ప్రదర్శించటం ఆకట్టుకుంటుంది.

ప్రముఖ దర్శకుడు పి పుల్లయ్య, షిరాజ్ అనే భాగస్వామితో కలిసి 1939లో ఫేమస్ ఫిలింస్ పతాకంపై నిర్మించిన చిత్రం -శ్రీ వెంకటేశ్వర మహత్యం (బాలాజీ). చిత్రంలో పుల్లయ్య సతీమణి నటి శాంతకుమారి పద్మావతిగా, సియస్ఆర్ శ్రీనివాసునిగా నటించారు. కవికోకిల దువ్వూరి రామిరెడ్డి సంభాషణలు అందించారు. చిత్రం జనామోదం పొందటమేకాదు, ఘన విజయం సాధించింది. పి పుల్లయ్య మరోసారి అదే ఇతివృత్తంతో పద్మశ్రీ పిక్చర్స్ బ్యానర్‌పై 1960లో ఎన్టీ రామారావు శ్రీనివాసునిగా, యస్ వరలక్ష్మి శ్రీదేవిగా, సావిత్రి పద్మావతిగా -శ్రీ వెంకటేశ్వర మహత్యం నిర్మించారు. ఈ చిత్రంలో వకుళమాతగా శాంతకుమారి నటించటం విశేషం.

శ్రీ వెంకటేశ్వర మహత్యం చిత్ర గీతాలు అద్భుతమనే చెప్పాలి. 'జయజయ జగన్నాయక జయజయ' (వెంపటి పెదసత్యం తదితరుల బృందగీతం -మల్లాది రామకృష్ణశాస్త్రి); ఎన్టీ రామారావు, యస్ వరలక్ష్మిపై చిత్రీకరించిన ప్రణయగీతం 'శ్రీదేవిని, నీదు దేవేరిని' (యస్.వరలక్ష్మి- ఆరుద్ర); ఎన్టీఆర్, గుమ్మడిలపై చిత్రీకరించిన పద్యం 'పావనంబయ్యె' (ఘంటసాల, నారపరెడ్డి); మరో పద్యం, స్తోత్రం 'కన్నుల కండకావరము' 'నమో నారాయణ' (మాధవపెద్ది సత్యం- నారపరెడ్డి); ఆవు దూడలను బజారులో విక్రయిస్తూ ఎస్ వరలక్ష్మి తదితరులపై చిత్రీకరించిన గీతం 'వరాల బేరమయా, వనరంబేరమయా పరాకు చేయకు' (యస్.వరలక్ష్మి- ఆత్రేయ); పశుకాపరి రమణారెడ్డి, అతని భార్య సురభి బాలసరస్వతిపై చిత్రీకరించిన గీతం 'సిలకో చిక్కావే ఈనాడు సింగారమొలుకుతూ' (పిఠాపురం- బాల, స్వర్ణలత -ఆత్రేయ) ఈనాటికీ అద్భుత గీతాలుగా వినిపిస్తాయి. ఆశ్రమంలో వకుళమాతపై చిత్రీకరించిన 'గోపాలా, నందగోపాల' (శాంతకుమారి, బృందం -ఆత్రేయ) ఈనాటికి మధురమైన భక్తిగీతంగా అలరిస్తున్నది.

సావిత్రి, ఎన్టీఆర్‌లపై చిత్రీకరించిన మనోల్లాసమైన యుగళ గీతం, జలపాతాలు, మేఘాలు, కొండలు, పచ్చని చెట్లమధ్య ఆహ్లాదభరితంగా చిత్రీకరణ సాగిన 'కలగా కమ్మని కలగా మన జీవితాలు మనవలెగా' -అని పద్మావతి, 'వెలుగు చీకటుల కలబోసినవి, కాలము చేతిలో కీలుబొమ్మలు' -అని శ్రీనివాసుడు, 'మమతే జగతిని నడుపుతున్నది' -అని పద్మావతి, 'ప్రేమకు శోకము ఫలమేమో , రాగము, త్యాగము జతలేమో' అంటూ శ్రీనివాసుడు తరువాతి కథ సూచించటం, ఎంతో భావయుక్తంగా సాగిన ఈ పాటకు ఆత్రేయవారు బాణీ సూచించటం విశేషం (గానం- ఘంటసాల, పి.సుశీల). తిరుమల మహిమలు తెలియచెప్పే గీతంలో ఓ భక్తుడు భార్యతో పాడే పాట 'పదవే పోదాము గౌరీ' (పిఠాపురం- ఆత్రేయ) అత్యద్భుత గీతాలే.

అచ్చం తిరుపతిలాగే గర్భాలయ సెట్‌ను వాహిని ఆవరణలో ఓ ఫ్లోర్‌లో వేసి దేవుడిని ప్రతిష్టించారు. గర్భగుడిలోని మూల విరాట్ విగ్రహం, సినిమాలోని విగ్రహాలు కెజి వేలుస్వామి అనే శిల్పకారుడు తయారు చేయగా కళాదర్శకుడు ఎస్‌విఎస్ రామారావు సెట్‌ను ఎంతో సహజంగా రూపొందించారు. ఈ సెట్‌లోనే ఘంటసాల ఆలపించిన 'శేష శైలావాసా' పవళింపు సేవగీతం చిత్రీకరణ జరిపారు.

ఆత్రేయ వ్యాఖ్యానంతో అసలు సినిమా పూర్తయ్యాక వెంకటేశ్వరుని మహిమలు, ఆయనకు జరిగే పూలంగీసేవ, నేత్ర దర్శనం, చంద్రప్రభ, సూర్యప్రభ వాహనాలపై స్వామివారి ఊరేగింపులు, పవళింపుసేవ వివరంగా చూపటం ఎంతో హర్షణీయం.

చిత్రం 20 కేంద్రాల్లో విడుదలవగా 16చోట్ల శతదినోత్సవం జరుపుకుంది. ఒకచోట రజితోత్సవం జరుపుకుంది. ఈనాటికీ ఈ చిత్ర గీతాలు శ్రోతలను అలరించటం ఆనందదాయకం. శ్రీవెంకటేశ్వరుని మహిమల ఆధారంగా ఆ తరువాత కొన్ని డాక్యుమెంటరీలు రూపొందించబడ్డాయి. అలాగే, ఎన్టీ రామారావు తమ రామకృష్ణా సినీస్టూడియో బ్యానర్‌పై 1979లో స్వీయ దర్శకత్వంతో 'శ్రీ తిరుపతి వెంకటేశ్వర కల్యాణం' పేరిట జయసుధ, జయప్రదలతో చిత్రం నిర్మించటం ఎన్నదగిన అంశం.

-సివిఆర్ మాణిక్యేశ్వరి

ఫ్లాష్‌బ్యాక్ @50

స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు: ఆత్రేయ (ఆరుద్ర, మల్లాది రామకృష్ణశాస్త్రి ఒక్కో పాట వ్రాయగా, పద్యాలను నారపరెడ్డి వ్రాశారు)
కెమెరా: పియల్ రాయ్
కళ: యస్‌వియస్ రామారావు
ఎడిటింగ్: కెఎ శ్రీరాములు
సహాయ దర్శకులు:
కె రాఘవేంద్రరావు, యు విశ్వేశ్వరరావు
సంగీతం: పెండ్యాల నాగేశ్వరరావు
నృత్యం: వెంపటి సత్యం
నిర్మాత: వి వెంకటేశ్వర్లు

క్లబ్‌కు చేరని కథ!

9వ పేజీ తరువాయి...

ఫ్లాప్ టాక్ మూటగట్టుకున్నాడు. జనవరిని మించి -ఫిబ్రవరిలో 11 సినిమాలు విడుదలయ్యాయి.

మార్చిలో -బంగారు కోడిపెట్ట, నువ్వే నా బంగారం, నగ్నసత్యం లాంటి సినిమాలు వచ్చినంత వేగంగానే వెళ్లిపోయాయి. లెజెండ్‌గా వచ్చిన బాలకృష్ణ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటడంతో -తెలుగు సినిమాపై మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రమోషన్ కొత్తదారుల్లో ఫేస్‌బుక్‌ను బేస్ చేసుకుని హిట్టుకొట్టిన 'హృదయకాలేయం' ఏప్రిల్‌లోనే విడుదలైంది. సంచలన దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ, మోహన్‌బాబుల కలయికలో వచ్చిన 'రౌడీ' మాత్రం చతికిలపడ్డాడు. పెద్దగా అంచనాలు లేకుండా వచ్చిన హీరో అల్లు అర్జున్ మాత్రం 'రేసుగుర్రా'న్ని ఉరికించాడు. ఊహించని కలెక్షన్లు రాబట్టి బాక్సాఫీస్‌ను బద్దలుకొట్టాడు. ఈ ఏడాది సినిమాల్లో దీనిదే అగ్రస్థానం. ఏప్రిల్‌లో దాదాపు 13 సినిమాలు విడుదలయ్యాయి.

ఇక ప్రముఖ నటి నయనతార ముఖ్యపాత్రలో బాలీవుడ్‌లో హిట్టు రీమేక్‌గా రూపొందిన 'అనామిక' తీవ్ర నిరాశే మిగిల్చింది. ఈ సినిమాతోపాటు అల్లు వారసుడు శిరీష్ హీరోగా మారుతి తీసుకొచ్చిన 'కొత్త జంట' కూడా ఆకట్టుకోలేకపోయింది. మేలో 14 సినిమాల వరకూ విడుదలయ్యాయి. ఇదే నెలలో విడుదలైన అక్కినేని ఫ్యామిలీ హీరోల 'మనం' మంచి హిట్ కొట్టి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అక్కినేని నాగేశ్వర రావు నటించిన చివరి చిత్రం -2014లో ఉత్తమ చిత్రంగా నిలబడటం గమనార్హం.

జూన్‌లో అల్లరి నరేష్ 'జంప్ జిలాని', నాగచైతన్య 'ఆటోనగర్ సూర్య' సహా 15 సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. వాటిలో నటుడు శ్రీనివాస్ అవసరాల దర్శకత్వం వహించిన 'ఊహలు గుసగుసలాడే' మంచి టాక్ సంపాదించి బాక్సాఫీసు వద్ద బలంగా నిలబడింది. చిన్న సినిమాల్లో గొప్ప చిత్రంగా ప్రశంసలు రాబట్టింది.

జూలైలో సందీప్ కిషన్ హీరోగా 'రారా కృష్ణయ్య', 'ఆ ఐదుగురు'లాంటి చిత్రాలు వచ్చాయి. కొంతకాలంగా ట్రెండ్ మార్చి వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటున్న హీరో వెంకటేష్ 'దృశ్యం' కూడా ఉంది. మామూలు రీమేక్‌గా వచ్చి బాక్సాఫీస్ వద్ద పెద్ద మొత్తాలు రాబట్టడమేకాదు, విమర్శకుల ప్రశంసలు అందుకుంది. రామగోపాల్‌వర్మ 'ఐస్‌క్రీం' హడావుడి ఎక్కువచేస్తే, నిర్మాత బెల్లంకొండ సురేష్ తనయుడు శ్రీనివాస్ హీరోగా పరిచయమైన 'అల్లుడు శీను' ఫరవాలేదనిపించింది.

ఆగస్టులో వచ్చిన హీరో శర్వానంద్ 'రన్ రాజా రన్' బాక్సాఫీస్ వద్ద నిలబడి, కమర్షియల్ హీరో స్టాటస్ అందించింది. తెలుగమ్మాయి గీతాంజలి, కమెడియన్ శ్రీనివాస్‌రెడ్డిల కలయికలో వచ్చిన 'గీతాంజలి' హారర్ జానర్‌కు క్రేజ్ తీసుకొస్తే, సంపత్ నంది ఎగరేసిన 'గాలిపటం', సుమంత్ అశ్విన్ 'లవర్స్' ఫర్వాలేదనిపించాయి. ఇదే నెలలో భారీ అంచనాలతో వచ్చిన ఎన్టీఆర్ బాక్సాఫీసు వద్ద 'రభస' సృష్టించలేకపోయాడు. నాగు రూపొందించిన 'వీకెండ్ లవ్'లో కథ తక్కువై కనిపించకుండా పోయింది.

సెప్టెంబర్‌లో -12 చిత్రాల వరకూ వచ్చాయి. శివాజీ హీరోగా వచ్చిన 'బూచాడు బూచమ్మ'కు క్రేజ్ ఎక్కువై కలెక్షన్లు తక్కువయ్యాయి. మాస్‌నే నమ్ముకుని బాక్సాఫీస్ దగ్గర రవితేజ 'పవర్' నిలుపుకున్నాడు. గోపీచందర్ 'లౌక్యాన్ని' ప్రదర్శించి హిట్టుకొడితే, మహేష్‌బాబు, శ్రీను వైట్ల కలిసి తెచ్చిన 'ఆగడు' మాత్రం ఆడకుండాపోయాడు. అంచనాలు శృతిమించడం, అందుకుతగిన సరుకు సినిమాలో లేకపోవడంతో -డిజాస్టర్ ప్రతిష్టను మూటగట్టుకుంది.

అక్టోబర్‌లో 12 సినిమాలొచ్చాయి. 'గోవిందుడు అందరివాడెలే' అంటూ వచ్చిన రామ్‌చరణ్ -కృష్ణవంశీకి పేరు తెచ్చిపెట్టాడు. 'దిక్కులు చూడకు రామయ్యా' అంటూ వచ్చిన నాగశౌర్య -భవిష్యత్‌లో మంచి సినిమాలు చేయగలడన్న నమ్మకాన్ని మిగిల్చాడు. 'ఒక లైలా కోసం' అంటూ వచ్చిన నాగచైతన్య -లవర్‌బాయ్ షేడ్ తెచ్చుకునే ప్రయత్నం చేశాడు. ఓ మంచి కమర్షియల్ హిట్ కోసం చాలాకాలంగా తాపత్రయపడుతున్న మంచు మనోజ్‌కు ఈసారీ ఆశ నెరవేరలేదు. 'కరెంట్‌తీగ' తెగిపోవడంతో -షాక్ కొట్టకుండా ప్రేక్షకుడు జాగ్రత్తపడ్డాడు.

నవంబర్‌లో విడుదలైన సినిమాలు -27. ఒకే నెలలో ఇన్ని సినిమాలు రావడం రికార్డు. ఎక్కువ సినిమాలు విడుదలైంది ఈనెలలోనే. సీనియర్ డైరక్టర్ దాసరి చాలాకాలం తరువాత స్టీరింగ్ ముందు కూర్చుని నడిపిన -ఎర్రబస్సు గమ్యానికి చేరలేదు. సీక్వెల్‌గా 'జైహింద్-2' తెచ్చిన అర్జున్ కూడా -దేశభక్తి నింపలేదు. సందీప్‌కిషన్ 'జోరు' జారిపోయింది. యమలీలకు సీక్వెల్‌గా వచ్చిన '2' ట్రాక్ తప్పింది. మెగా ఫ్యామిలీ పరంపరలో వచ్చిన సాయిధరమ్ తేజ్ నటించిన 'పిల్లా నువ్వులేని జీవితం' మాత్రం బాక్సాఫీసు వద్ద నిలబడింది. హీరోగా ఎనర్జీ చూపించి సాయిధరమ్‌కు ఆకట్టుకున్నాడు. విప్లవ సినిమాల స్టార్ హీరో నారాయణమూర్తి 'రాజ్యాధికారం' ఇలా వచ్చి అలా వెళ్లిపోతే, చిన్న సినిమాగా వచ్చిన 'నా బంగారుతల్లి' విమర్శకుల ప్రశంసలతోపాటు అవార్డులూ అందుకుంది. నవంబర్ చివరిలో వచ్చిన 'అలా ఎలా' -చమత్కార కథనంతో చిన్న సినిమా గుండెల్లో ధైర్యం నింపింది.

ఇక డిసెంబర్‌లో వచ్చిన చక్కిలిగింత, లక్ష్మీరావే మా ఇంటికి.. ప్రేక్షకుడి ఆదరణ పొందలేకపోయాయి. ఏడాది చివరిలో మెగా ఫ్యామిలీ నుంచి మరో హీరో వరుణ్ తేజ్ హీరోగా వచ్చిన ముకుంద హిట్టు టాక్ అందుకున్నాడు. నితిన్ -కరుణాకరన్ కాంబోలో వచ్చిన 'చిన్నదాన నీకోసం' ప్రేక్షకుడికి అసంతృప్తి మిగిల్చింది. వచ్చే ఏడాదిలోనైనా మిలియన్ క్లబ్‌కు చేరే చిత్రం రావాలని ఆశిద్దాం.

-త్రివేదీ

డియర్ ఫ్రెండ్స్.. ఈ క్విజ్ మీ కోసమే...

మీ సమాధానాలు కార్డుపైన గానీ, మరే విధంగానైనా గానీ రాసి పంపించవచ్చు. ఎలాంటి కొట్టివేతలు, తుడిపివేతలు లేకుండా జవాబులన్నీ స్పష్టంగా రాయాలి. మా దగ్గరున్న కీ సొల్యూషన్‌తో అన్ని విధాలా సరిపోయే జవాబులు రాసిన వారి పేర్లు ప్రచురిస్తాం.

ఫిలిం క్విజ్ 14

నిర్వహణ: కైపు ఆదిశేషారెడ్డి

1. ఈ స్టిల్ చూశారుగా ఏ సినిమాలోది...?
2. తరుణ్, స్నేహ నటించిన ఈ చిత్రానికి దర్శకుడు బాలశేఖరన్
3. దాసరి దర్శకత్వం వహించిన 'రావణుడే రాముడైతే..' సినిమాలో హీరోయిన్
4. రాజమౌళి 'మగధీర' సినిమాకు ఎడిటింగ్ నిర్వహించినది
5. 'మహామంత్రి తిమ్మరుసు' సినిమాకు సంగీత దర్శకుడు
6. తమిళ చిత్రం 'కాదలిక్క నేరమిల్లై' చిత్రానికి తెలుగు రీమేక్
7. రామారావు, సావిత్రి ఈ సినిమాలో అన్నా చెల్లెళ్ళుగా నటించారు
8. 'ప్రియురాలు సిగ్గేలనే..' టివి రాజు స్వరపరచిన ఈ పాట ఏ సినిమాలోది
9. సునీల్ 'భీమవరం బుల్లోడు' సినిమాకి దర్శకుడు
10. ఈ చిత్రంలోని కథానాయిక ఎవరు?

సరైన సమాధానాలు రాసిన వారు

చోడవరపు నాగేశ్వరరావు, బాగ్‌అంబర్‌పేట
ధరణి పద్మాసన, నల్లకుంట
కె.సతీష్‌బాబు, కడప
మార్కస్‌మణిరాజ్, ముద్దనూరు
పి.రామ్‌ప్రసాద్, ప్రొద్దుటూరు
ఎస్.శివస్వామి, బొబ్బిలి
పంతం అంజలి అనీషా, గెద్దనాపల్లి
ఎస్.శ్రీనివాసరావు, ఎమ్మిగనూరు
శివలెంక చంద్రశేఖర్, హైదరాబాద్
కె.కళ్యాణ్, ప్రొద్దుటూరు
డా.శివభూషణం, కర్నూలు
జి.జయచంద్రగుప్త, కర్నూలు

ఫిలిం క్విజ్-12 సమాధానాలు

1. రాము 2. బంగారుకోడిపెట్ట 3. దేవత 4. తాపీ చాణక్య 5. కీరవాణి 6. అర్చన 7. మనసే మందిరం 8. జేసుదాసు 9. శివాజీ గణేశన్ 10. స్వాతి.

పూర్తి చేసిన క్విజ్‌ను పంపించాల్సిన మా చిరునామా: ఎడిటర్, వెన్నెల, ఆంధ్రభూమి దినపత్రిక 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్- 03

■ ★★★★ చాలా బాగుంది ■ ★★★ బాగుంది ■ ★★ ఫర్వాలేదు ■ ★ బాగోలేదు

మాయచేసిన ముకుంద

మెగా ఫ్యామిలీ వారసుడిగా మరో హీరో వచ్చాడు. సహజంగానే సినిమాపై -అంచనాలుంటాయి. అరగేంట్రం బాధ్యతలు అడ్డాల శ్రీకాంత్ తీసుకున్నాడు. ఎక్స్‌పెక్టేషన్స్ -ఎక్కువైపోయాయి. ప్రేక్షకుడి నాడి తెలిసి కథను చెప్పగల టాలెంటెడ్ డైరెక్టర్‌గా -నీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టుతో ప్రూవ్ చేసుకున్నాడు శ్రీకాంత్ అడ్డాల. అది నమ్మి -కొడుకును పరిశ్రమకు పరిచయం చేసే బాధ్యతను అప్పగించాడు మెగా బ్రదర్ నాగబాబు. హీరో మెటీరియల్‌కు కేరాఫ్ అడ్రస్‌లా కనిపిస్తున్న వరుణ్ తేజ్ -ముకుందగా ప్రేక్షకుడిని మెప్పించాడా?

మున్సిపల్ మార్కెట్లో సామాన్య ఉల్లి వ్యాపారి కొడుకు ముకుంద (వరుణ్ తేజ్). అతని స్నేహితుడు అర్జున్ (శైలేష్, తొలి పరిచయం). టౌన్‌లో తిరుగులేని రాజకీయ ఆధిపత్యం చెలాయిస్తున్న మున్సిపల్ చైర్మన్ (రావు రమేష్). మున్సిపల్ చైర్మన్ తమ్ముడు కూతురిని ప్రేమిస్తాడు అర్జున్. అది తెలుసుకుని చైర్మన్ సొంత బలగాలు దాడికి దిగుతాయి. మొండి ధైర్యం ప్రదర్శించి ఆపదల్లో చిక్కుకునే స్నేహితుడిని ఎప్పటికప్పుడు కాపాడుతుంటాడు -హీరో ముకుంద. ఆ క్రమంలో -అనుకోకుండా చైర్మన్ కూతురును చూసి ఇష్టపడతాడు. కాలక్రమంలో మున్సిపల్ ఎన్నికలు వస్తాయి. అధికార బలం, అహంకార ధోరణితో చెలరేగిపోతున్న చైర్మన్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలనుకుంటాడు ముకుంద. వ్యక్తిగతంగా చికాకు పెడుతూ, రాజకీయంగా దెబ్బకొడుతున్న ముకుందను తప్పించాలనుకుంటాడు చైర్మన్. ఒకవైపు చైర్మన్ కోటరీ, మరోవైపు ముకుంద అండ్ కో.. సంగ్రామంలో ఎవరు? ఎలా గెలిచారు? ప్రేమించిన అమ్మాయి ముకుంద సొంతమైందా? అన్న ప్రశ్నలకు సమాధానం -ముకుంద.

***

భారతీయ సినిమాలేవీ మహాభారతాన్ని దాటిపోవు, పోలేవు కూడా. దుర్యోధన దుష్ట సంహారానికి కృష్ణుడు పన్నిన మాయోపాయంలో ప్రతీ కోణమూ -ఓ సినిమా. హీరోయిజాన్ని ఎలివేట్ చేసే ఎన్నో ఎలిమెంట్స్ ఈ ఫార్మాట్‌లో ఉంటాయి కనుక -అడ్డాల కూడా అలాంటి సేఫ్‌జోనే ఎంచుకున్నాడు. అందుకే -సినిమా ప్రారంభానికి ముందే లాక్ ఓపెన్ చేశాడు. ఆపదల నుంచి అర్జునుడిని రక్షించడానికి ఆ ముకుందుడు పుట్టాడు. ఆ బాధ్యత ఇప్పుడూ నిర్వర్తిస్తున్నాడు అంటూ హీరో వరుణ్‌ను పరిచయం చేశాడు. చేతలు అర్జునుడివే అయినా, చేయించేదంతా శ్రీకృష్ణుడే. -మహాభారతంలో కృష్ణుడే హీరో. అదే స్ట్రాటజీని 'ముకుంద'లోనూ ప్రయోగించాడు. హీరో వరుణ్‌తేజ్‌కి తక్కువ డైలాగులిచ్చాడు. హీరో యిజాన్ని చూపాలంటే బలమైన సమస్య ఉండాలి. అందుకు స్నేహితుడు అర్జున్‌ను వాడుకున్నాడు. దూకుడు గుణం కలిగిన అర్జున్ సమస్య కొనితెచ్చుకోవడం, ఫలితంగా ఎదురయ్యే ఆపదనుంచి ముకుంద రక్షించడం. తొలిభాగమంతా ఇదే. మలిభాగంలో విలన్ కుట్రలు కుతంత్రాలు, హీరో తిప్పికొట్టడం దగ్గర ఆరంభమై -కురుక్షేత్ర సంగ్రామంలో దుష్టసంహారంతో సినిమా ముగుస్తుంది.

హీరో కళ్లతోనే నటించాడంటూ సినిమా విడుదలకు ముందు జరిగిన ప్రచారానికి న్యాయం చేశాడు వరుణ్. తెలుగు ప్రేక్షకుడు ఆశించే హీరో క్వాలిటీస్ ఉన్న వరుణ్‌కు ముకుంద మంచి బ్రేకే. హీరోయిన్‌గా పూజా హెగ్డే ఎంపిక బావుంది. హీరో ఆహార్యానికి సరిజోడుకాకున్నా -కృష్ణుడిని మౌనంగా ఆరాధించే గోపికమ్మలా డిజైన్ చేసిన పాత్రలో పూజా ఒదిగిపోయింది. ముకుంద హీరోయిజాన్ని ఎలివేట్ చేయడానికి వాడుకున్న ముఖ్య పాత్ర -అర్జున్. కొత్త నటుడు శైలేష్‌కు అదే ప్లస్‌పాయింట్. సహజంగానే కార్ రేసర్ అయిన శైలేష్ -కథను అంతే వేగంగా పరుగు తీయించడానికి ఉపకరించాడు. ముఖంలో భావాలను అలవోకగా పలికిస్తూనే, ఆహార్యంలో వేగంతో ఆకట్టుకున్నాడు. -'ఈరోజు కొటేషన్ ఏంటంటే' అంటూ మేనరిజాన్ని ప్రజెంట్ చేసే చాన్స్ అర్జున్‌కు దక్కడం పాత్రకూ, సినిమాకూ బోనస్. చాన్సిస్తే -లవ్ జానర్‌లో హీరో రోల్‌కు సూటబుల్ పర్ఫార్మెన్స్ అతనిది. తేనె పూసిన కత్తి లాంటి విలన్ పాత్రలో -మున్సిపల్ చైర్మన్ రావు రమేష్ నటన ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కొట్టిన పిండి లాంటి పాత్రే కనుక -సినిమాకు పూర్తిగా ప్లస్ అయ్యాడు. నిడివి తక్కువైనా -కీలకమైన పాత్రలో ప్రకాష్‌రాజ్ కనిపిస్తాడు. కానీ -పెద్ద నటుడిని దర్శకుడు తక్కువగా వాడుకున్నాడపిస్తుంది.

టైటిల్ ముకుంద, దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల -అనగానే విడుదలకు ముందే కథపై 'లవ్ ఫీల్' అంచనాతో ఉన్నారు ప్రేక్షకులు. కానీ -భిన్నమైన కథతో రావడం షాక్ ఇవ్వడంలాంటిదే. ఇక స్టోరీలో బలహీనతలు ప్రేక్షకుడిని కొంత ఇబ్బంది పెడతాయి. ట్వెంటీ ఫోర్ ఫ్రేమ్స్‌లో మిగిలినవన్నీ కలిసొచ్చాయి కనుక -డిజాస్టర్ ఆపద నుంచి దర్శకుడు బయటపడ్డాడు. మహాభారతంలో -అర్జునుడిని పదేపదే ఆపదల నుంచి రక్షించడానికి శ్రీకృష్ణుడికి బలమైన కారణం ఉంది. కానీ -ముకుంద సినిమాలో ప్రాణాలకు తెగించి ఫ్రెండ్‌ను హీరో ఎందుకు కాపాడుతున్నాడో బలమైన నేరేషన్ లేదు. తెరపై వరుణే హీరో అయినా -ముకుంద సినిమాకు తెరవెనుక హీరోలు చాలామందే ఉన్నారు. ప్రధానంగా సంగీతం అందించిన మిక్కీ జె మేయర్, సాహిత్యానికి ప్రాణం పోసిన సిరివెన్నెల సీతారామశాస్త్రి, కళ్లు చెదిరే కెమెరా పనితనాన్ని ప్రదర్శించిన మణికందన్, బ్యాక్‌గ్రౌండ్స్‌కు ప్రజెంట్, రిచ్‌లుక్ తెచ్చిన కళాదర్శకుడు, నిర్మాణ విలువల్లో రాజీపడని నిర్మాతలు.. ఇలా చెప్పుకుంటూపోతే చాలా మందే హీరోలు. ఇన్నిరకాల బలాలు సమకూరిన సినిమాలో -దర్శకుడు తన మార్క్ మిస్ చేశాడు. కథ, కథనంలో శ్రీకాంత్ అడ్డాల మార్క్ పడివుంటే -హీరో వరుణ్‌కు బంపర్ గిఫ్ట్ అయ్యుండేది. మొదట ప్రస్తావించుకున్న అంచనాలను థియేటర్ బయటే వదిలేసి -ప్రేక్షకుడు హాల్లోకి అడుగు పెడితే బాగా ఎంజాయ్ చేయొచ్చు.

-విజయ్‌ప్రసాద్

★★★ ముకుంద

తారాగణం: వరుణ్ తేజ్, పూజా హెగ్డె, శైలేష్, రావు రమేష్, ప్రకాష్‌రాజ్ తదితరులు

సంగీతం: మిక్కీ జె మేయర్

నిర్మాతలు: రాగూర్ మధు, నల్లమలుపు బుజ్జి

స్టోరీ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శ్రీకాంత్ అడ్డాల

బ్యానర్: లియో ప్రొడక్షన్స్

చిన్న ఝలక్!

ప్రతి సినిమాలోనూ -ప్రేమ ఉంటుంది. అది ఎన్ని సినిమాల్లో చూపించినా కొత్తగా ఉంటుంది. అందులోనూ -దర్శకుడు కరుణాకరన్ సినిమాలో ఇంకొంచెం ప్రెష్‌గా ఉంటుంది. అదే అంచనాతో 'చిన్నదాన నీకోసం' సినిమాకు వచ్చాడు ప్రేక్షకుడు. మరి లవ్‌స్టోరీస్ స్పెషలిస్ట్ కరుణాకరన్ -అలాంటి ఫీల్ అందించాడో లేదో చూద్దాం.

హీరో (నితిన్)కు మనసుకు నచ్చిన అమ్మాయి దొరకదు. అలాంటి పరిస్థితుల్లో నచ్చిన అమ్మాయి కనిపిస్తే వదులుతాడా? అందుకే -ప్రెష్ బ్యూటీ నందిని (మిస్తీ) చూసి వెంటపడతాడు. ఆమె మాత్రం -సంగీతం, కరాటే, వీణ నేర్పిస్తూ బిజీగా ఉంటుంది. అటువంటి అమ్మాయిని పడేయాలంటే ఆమె రూట్లో వెళ్లాలనుకుంటాడు హీరో. ఈ ప్రయత్నంలో అసలు రహస్యం తెలుస్తుంది. ఓ మోసాన్ని మోసంతో జయించి ప్రేమను పండించుకోవాన్న లవ్ గేమ్ స్టార్ట్‌చేస్తాడు నితిన్‌కి. అయితే, హీరోయిన్‌కూ ఓ రహస్య లక్ష్యం ఉంటుంది. ఆ గోల్ కోసం నితిన్‌ను బలవంతంగా భరిస్తూనే -వచ్చిన పని పూర్తికాగానే బార్సిలోనా వెళ్లిపోతుంది. ఆమెను పట్టుకోవడానికి హీరో బార్సిలోనాలో అడుగు పెడతాడు. ఆ తరువాత ఏమైందో -చిన్నదాన నీకోసం చూసి తెలుసుకోవాలి

అత్తారింటికి దారేది చిత్రంలో -విదేశాల్లోవున్న పవన్‌కళ్యాణ్ అత్తను తాత దగ్గరకు చేర్చడానికి స్వదేశానికి వస్తాడు. ఇక్కడ -తాతను వెతుక్కుంటూ స్వదేశానికి వచ్చిన హీరోయిన్ ఆయన్ని ఎలా తీసుకెళ్లింది, దూరమైన కూతురి దగ్గరకు చేర్చిందా? లేదా? అన్న కథ కనిపిస్తుంది. సెకెండాఫ్‌లో విషయం ప్రేక్షకుడికి అర్థమైపోవడంతో, సినిమా బలహీనపడింది. మొదటి సగమంతా హీరో హీరోయిన్ల సన్నివేశాలతో లాగేసి -మలిసగంలో తీరిగ్గా కథ మొదలు పెట్టడం పెద్ద మైనస్. కథనంలో బిగి కరవై -పాత చింతకాయ పచ్చడిగా సన్నివేశాలు సాగిపోతుంటాయి. సీన్‌మారి సినిమా బార్సిలోనాకు వెళ్లినా -లవ్ ఫీల్ కంటే హీరోయిన్‌కు బుద్ధి చెప్పడం కోసమే సీన్లు వాడేయడంతో సినిమా రక్తికట్టలేదు.

తొలిభాగంలో పంచ్ డైలాగులే హాస్యం అనేసుకుని -హీరో హీరోయిన్ల మధ్య సోసో సన్నివేశాలతో లాగించేశారు. అవీ, ఇంతకుముందు ఎక్కడో చూశామన్న ఫీలింగ్ కలిగిస్తాయి. మలిభాగంలో సెంటిమెంట్లు, కోపాలు, తాపాలు, మధ్యమధ్యలో అలిగిన ఏడ్పులు.. ఇలా రొటీన్ కథ కథనాలతో దర్శకుడు సరిపెట్టేశాడు. దర్శకుడిపై ఉన్న నమ్మకంతో సినిమాకెళ్లిన ప్రేక్షకుడికి నిరాశే మిగులుతుంది. కమర్షియల్ సినిమా కనుక లాజిక్, క్లారిటీలాంటి చాదస్తాలు పెట్టుకోకుండా సినిమా నడిపేయడం దారుణం.

ఎవరెలా?

హీరోగా నితిన్ తనదైన స్టయిల్లో చేసుకుంటూ వెళ్లినా, సరైన స్క్రిప్ట్ కాకపోవడంతో తేలిపోయాడు. ఓరకంగా సినిమా అంతా తన భుజాలపైనే వేసుకుని నడిపించాడు. హీరోయిన్ మిస్తీ ఓకె. నాజర్, నరేష్, సితార, రోహిణి, అలీ లాంటివాళ్లంతా తమదైన బాణీలోనే పాత్రలను సాగించారు. సినిమాలో ముఖ్యంగా చెప్పాల్సింది కెమెరా పనితనం. ఐ.ఆండ్రూ బార్సిలోనా పట్టణాన్ని చిత్రీకరించిన తీరు ప్రేక్షకులకు నచ్చుతుంది. ఇక సంగీతం గురించి చెప్పుకోవాల్సిన అవసరమే లేదు. టైటిల్‌తో సాగే పాట తప్ప, మిగిలినవేవీ పాటలు క్యాచీగా లేవు. నేపథ్య సంగీతం అస్సలు కుదరలేదు. ఎందుకో ఏమో ఎక్కడో ఎవరో తరుముతున్నట్టే సాగుతుంది. చివరిగా చిన్నదాన్ని అందుకోవడం కోసం బార్సిలోనా వెళ్లినా -సినిమాపై ఆ ప్రభావం ఎక్కడా పడలేదు. దీంతో చిన్నది కాస్త చిన్నబుచ్చుకున్నట్టయ్యింది.

-తిలక్

★ చిన్నదాన నీకోసం

తారాగణం: నితిన్, మిస్తీ చక్రవర్తి, నాజర్, నరేష్, సితార, అలీ, రోహిణి తదితరులు

సంగీతం: అనూప్ రూబెన్స్

నిర్మాతలు: సుధాకర్‌రెడ్డి, నిఖితరెడ్డి

దర్శకత్వం: ఎ.కరుణాకరన్

బ్యానర్: శ్రేష్ఠ్ మూవీస్

పీకె 47

గుప్పిట మూసి చేయి చాస్తే -అందులో ఏముందో తెలుసుకోవాలన్న ఆసక్తి చేతిని చూస్తున్న వాళ్లలో కలగడం సహజం. పీకె సంచలనానికి అదే కారణం. రహస్యాన్ని -రహస్యం అని చెప్పకుండా ప్రమోషన్‌గా వాడేసుకుని 'ఏకె-47'లా పేలాడు -పీకె. అందుకే -విడుదలకు ముందే పిచ్చి పాపులార్టీ వచ్చేసింది పీకేకి. కథ -సీక్రెట్. కథనం -సీక్రెట్. పాత్రలు -సీక్రెట్. ప్రతీదీ సీక్రెట్. తెలిసిందల్లా హీరో అమీర్‌ఖాన్. దర్శకుడు హిరాని. నిర్మాత వినోద్‌చోప్రా. సో.. అంచనాలు మరీ పెరిగిపోయాయి. ఎదురు చూసిన వాళ్లలో టెన్షన్‌ను పీక్‌కి పెంచేశారు. నిజానికి ఈ సినిమాకు హీరో -హిరాని. మున్నాభాయ్ ఎంబిబిఎస్‌లో వైద్య విధానాన్ని ప్రశ్నించాడు. లగే రహో మున్నాభాయ్ అంటూ గాంధీగిరిని ప్రస్తావించాడు. 3 ఇడియట్స్‌లో విద్యావిధానాన్ని నిలదీశాడు. ఇప్పుడు దొంగస్వాములు, బాబాలకు -పీకె 47 గురిపెట్టాడు.

కథేంటి?

గ్రహాలపైకి వ్యోమనౌకలు పంపి జీవరాశి ఆచూకీ తెలుసుకునే ప్రయత్నాలు మనిషి ఎప్పటినుంచో చేస్తున్నాడు. అందుకు భిన్నంగా -గ్రహాంతర వాసి (అమీర్‌ఖాన్) భూమండలం మీదకొస్తే..? అతనొచ్చిన వ్యోమనౌక రిమోట్‌ను భూమ్మీద పొగొట్టుకుంటే...?

ఈ రెండు ప్రశ్నలు చాలు. మస్కిష్కంమీద కోటానుకోట్ల సన్నివేశాలు అల్లుకోవడానికి. దర్శకుడు హిరానీ చేసిన మాయ అదే. పచ్చలహారంలాంటి రిమోట్‌కై వెతుకులాట.. ఆ ప్రయత్నంలో గ్రహాంతరవాసికి ఎదురైన అనుభవాలు.. కనిపించిన భగవంతుడిని వెతికే ప్రయత్నంలో 'మిస్సింగ్'లాంటి చమత్కారాలు.. గ్రహాంతరవాసి అమాయకత్వం చూసి పీకె హై క్యా (తాగొచ్చావా) అనే వెటకారాలు.. కథను పతాకస్థాయికి తీసుకుపోతాయి. టీవీ జర్నలిస్ట్ జగజ్జనని అలియాస్ జగ్గు పరిచయం, విచిత్రం అనిపించిన పీకేతో ప్రయాణం.. ఒక్కొక్కటిగా మనల్ని మరోలోకంలోకి లాక్కుపోతాయి. మనుషుల్లోని సవాలక్ష అవలక్షణాలు, కోణాలను -గ్రహాంతరవాసి అనువాల రూపంలో చూపించాలన్న ఆలోచనే వైవిధ్యమైన కథకు ఆస్కారం వచ్చింది. దానికి బలమైన సన్నివేశాలను రాసుకుని -దర్శకుడు హిరాని పీకె 47 పేల్చాడు.

అందరూ ఆరాధించే గాడ్‌మన్ (సౌరబ్ శుక్లా) దగ్గర రిమోట్ ఉన్నట్టు గుర్తించిన తరువాత -దాన్ని సంపాదించి తన గ్రహానికి తిరిగి వెళ్లేందుకు పీకే ఎలాంటి ప్రయత్నాలు చేశాడన్న సన్నివేశాలతో సినిమా ముగుస్తుంది. ఈ ప్రయత్నాలు, ప్రయాణంలో భాగంగా -జగ్గు ప్రేమకథ, పీకెలో చిగురించే అనురాగంలాంటి సన్నివేశాలతో దర్శకుడు హిరాని గుండెకు తడి స్పర్శను అందించాడు.

ముట్టుకుంటే భగ్గుమనే -మతపరమైన అంశాలను ప్రస్తావించే కథే అయినా ఎక్కడా దొరకకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు దర్శకుడు. కన్విన్స్‌డ్ డైలాగులతో నొప్పించకుండా వినోదాన్ని పండించి మార్కులు కొట్టేశాడు. వాస్తవానికి -ఇలాంటి ఆలోచనలతో చాలా సినిమాలే వచ్చాయి. ఎక్కడో నరకం నుంచి భూమికి దిగివచ్చి -ఇక్కడ 'భవిష్యవాణి'ని పొగొట్టుకుని వెతుక్కున్న 'యమలీల'లు లాంటి కథే ఇది కూడా. కాకపోతే -ఇప్పటి వరకూ ఇలాంటి కథతో వచ్చిన సినిమాలు కామెడీకి పరిమితమైపోతే, భిన్నమైన కోణాన్ని వెతుక్కుని సామాజికాంశాన్ని ఇలాంటి కథతో చర్చించవచ్చన్న ఆలోచన దర్శకుడికి రావడం గ్రేట్. తన ఆలోచనను ప్రేక్షకుడికి కన్విన్స్ చేయడానికి పడిన తపన, కష్టం సినిమాలో కనిపిస్తుంది.

ప్రతి ప్రాజెక్టులోనూ అమీర్‌కు ఓ ప్రత్యేకత ఉంటుంది. మామూలు మనిషిలా తయారైన గ్రహాంతరవాసి ఎలా ఉంటాడో -పీకెలో అమీర్ రుచి చూపించాడు. టైమింగ్‌తో ప్రతి సన్నివేశాన్నీ రక్తికట్టించాడు. బాలీవుడ్ సినిమాలు కోట్ల క్లబ్‌లకు ఎందుకు పరుగులు తీస్తున్నాయో -ఇలాంటి సినిమాలు చూస్తే అర్థమవుతుంది. సినిమా అంటే -ఐదు పాటలు, పది ఫైట్లు అనుకునే సగటు దర్శకులకు హిరానీ మరో పెద్ద బాలశిక్ష అందించాడు. చెప్పదలచుకున్న కథమీద నిబద్ధతతో పనిచేస్తే ఎంత గొప్పగా చెప్పవచ్చో పీకెతో రుచి చూపించాడు. పీకె గురించి చెప్పుకునే కంటే -తెరపై ఎలా పేలాడో చూస్తేనే బావుంటుంది.

- శ్రీకాంత్

★★★★ పీకె

తారాగణం: అమీర్‌ఖాన్, అనుష్కశర్మ, సంజయ్‌దత్, బొమన్ ఇరాని, సౌరబ్ శుక్లా, సుశాంత్ సింగ్ రాజ్‌పుట్ తదితరులు

సంగీతం: అతుల్ గోగవలె, శంతన్ మొయిత్రా

నిర్మాత: విధు వినోద్ చోప్రా

స్టోరీ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్: రాజ్‌కుమార్ హిరాని

రాశిఫలం

శుక్రవారం 26-12-2014

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

శ్రీ జయ, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, పుష్యమాసం,
తిథి- శుద్ధ పంచమి రా.9.29,
నక్షత్రం- ధనిష్ఠ మ.3.13
వర్జ్యం- రా.9.50 నుంచి 11.24 వరకు
దుర్ముహూర్తం-
ఉ.08.24 నుండి 09.12 వరకు
తిరిగి మ.12.24 నుండి
01.12 వరకు

మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.) మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళయందు ఆసక్తి పెరుగుతుంది. నూతన, వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు.

వృషభం (కృత్తిక 2,3,4పా., రోహిణి, మృగశిర 1,2పా.) కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. నూతన కార్యాలు ప్రారంభించకుండానుండుట మంచిది. ఆత్మీయుల సహాయ సహకారాలకై సమయం వెచ్చించాల్సి వస్తుంది.

మిథునం (మృగశిర 3,4పా., ఆరుద్ర, పునర్వసు 1,2,3పా.) ధర్మకార్యాలు చేయుటయందు ఆసక్తి పెరుగుతుంది. దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబ సౌఖ్యముంటుంది. మానసికానందాన్ని అనుభవిస్తారు. పేరుప్రతిష్ఠలు లభిస్తాయి. ఆకస్మిక ధనలాభముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు.

కర్కాటకం (పునర్వసు 4పా., పుష్యమి, ఆశ్లేష) స్థిరాస్తుల విషయంలో జాగ్రత్తగానుండుట మంచిది. ఒక అద్భుత అవకాశాన్ని కోల్పోతారు. నూతన వ్యక్తుల పరిచయమేర్పడుతుంది. ప్రయాణాలవల్ల లాభాన్ని పొందుతారు. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. నూతన కార్యాలు వాయిదావేసుకోక తప్పదు.

సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1పా.) అనారోగ్య బాధలు అధికమవుతాయి. అకారణంగా కలహాలేర్పడే అవకాశాలుంటాయి. అనవసర భయానికి లోనవుతారు. విద్యార్థులు చంచలంగా ప్రవర్తిస్తారు. వ్యాపార రంగంలోనివారు జాగ్రత్తగానుండుట మంచిది. స్త్రీలు పిల్లల పట్ల మిక్కిలి శ్రద్ధవహిస్తారు.

కన్య (ఉత్తర 2,3,4పా., హస్త, చిత్త 1,2పా.) విదేశయాన ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబంలో అనుకోకుండా లాభమేర్పడే అవకాశముంటుంది. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధన నష్టాన్ని అధిగమిస్తారు. ఈరోజు ముఖ్యమైన వ్యక్తిని కలుస్తారు.

తుల (చిత్త 3,4పా., స్వాతి, విశాఖ 1,2,3పా.) బంధు, మిత్రులతో మనస్పర్థలు రాకుండా జాగ్రత్తవహించుట మంచిది. అనుకోకుండా డబ్బు చేజారే అవకాశాలున్నాయి.
ఆరోగ్య విషయంలో మిక్కిలి శ్రద్ధ అవసరం. శారీరక శ్రమతోపాటు, మానసికాందోళన తప్పదు. చిన్న విషయాలకై ఎక్కువ శ్రమిస్తారు.

వృశ్చికం (విశాఖ 4పా., అనూరాధ, జ్యేష్ఠ) బంధు, మిత్ర విరోధమేర్పడకుండా జాగ్రత్తవహించుట మంచిది. మానసికాందోళన అధికమగును. అనారోగ్య బాధలను అధిగమిస్తారు. అనవసర నిందలతో అపకీర్తి వస్తుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. నూతన కార్యాలకు ప్రణాళికలు వేస్తారు.

ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా.) ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదుచేస్తారు. సన్నిహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గుర్తింపులభిస్తుంది. ధైర్యసాహసాలతో కొన్ని కార్యాలు నెరవేర్చుకుంటారు. శుభవార్తలు వింటారు.

మకరం (ఉత్తరాషాఢ 2,3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1,2పా.) ఊహించని కార్యాల్లో పాల్గొనే అవకాశముంటుంది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది. ఆత్మీయులను కలియుటలో విఫలమవుతారు.
అనవసర వ్యయప్రయాసలవల్ల ఆందోళన చెందుతారు. వృథాప్రయాణాలెక్కువగా ఉంటాయి. స్త్రీల మూలకంగా ధనలాభముంటుంది.

కుంభం (ధనిష్ఠ 3,4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2,3పా.) అద్భుతమైన అవకాశాలను పొందుతారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. ముఖ్యమైన శుభవార్తలు వింటారు.
ఆత్మీయుల సహాయ, సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి. అనుకోకుండా డబ్బు చేతికందుతుంది. నూతన వస్తు, ఆభరణాలు సేకరిస్తారు.

మీనం (పూర్వాభాద్ర 4పా., ఉత్తరాభాద్ర, రేవతి) వృత్తి, ఉద్యోగ రంగాల్లో కోరుకున్న అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధన లాభాన్ని పొందుతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది.
గౌరవ, మర్యాదలు పెరుగుతాయి. పిల్లలకు సంతోషం కలిగించే కార్యాలు చేస్తారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి.

డైరెక్టర్స్ ఛాయిస్..

రచయితలు చాలామందే మెగాఫోన్లు పట్టారు ఈ ఏడాది. సామాజిక స్పృహ తప్ప సినిమా అనుభవం లేని మరో రచయితా -ప్రేమిస్తే పోయే..కాలం అంటూ డైరెక్టర్‌గా ఓ ప్రయత్నం చేశాడు. ఓకే అన్న టాక్ తెచ్చుకున్న రవిచంద్రతో చిట్‌చాట్

నా మెసెజ్‌లో తపనుంది..

మీ నేపథ్యం?

డాన్స్ అంటే పిచ్చి. కొరియోగ్రాఫర్‌గా జీవితం ప్రారంభించి అనేకమందికి శిక్షణనిచ్చా. అనేక పాఠశాలల్లో, కళాశాలల్లో షోలు చేశా. డాన్సర్‌గా దాసరి నేతృత్వంలో జరిగిన పోటీలో ఎంపికయ్యాను.

తొలి అవకాశం?

ఎవరినీ అవకాశాలిమ్మని అడగలేదు. రచయితగా కొన్ని కథలు రాసుకున్నా. దర్శకునిగా ప్రయత్నించా. అదృష్టవశాత్తు నిర్మాత రాజు పరిచయంతో అవకాశం దక్కింది. సినిమా విభాగంలో ఇంతకుముందు ఎక్కడా పని చేయలేదు.

దర్శకుడంటే?

సామాజిక స్పృహతో కూడిన కథలే రాసుకుంటా. బాగుచేయకపోయినా, సమాజాన్ని చెడగొట్టకూడదు అన్నది నా ప్రిన్సిపుల్. కమర్షియల్ అంశాలు జోడించినా, సమాజానికి పనికొచ్చే చిత్రాలు తియ్యగలిగేవాడే నిజమైన దర్శకుడు.

సినిమా రెస్పాన్స్ ఎలా ఉంది?

మదర్ సెంటిమెంట్ పండింది. 'ప్రేమిస్తే పోయే..కాలం' ప్రేక్షకాదరణ పొందుతోంది. సినిమా మంచి కలెక్షన్లతో సాగుతోంది. మహిళా ప్రేక్షకులు ఆశీర్వాదాలు దక్కాయి. హ్యాపీగా ఉంది.

సినిమా పేరు అలా ఉందేం?

ప్రేమిస్తే పోయే... అని చుక్కలుపెట్టాం! కాలం వృధా అన్నది సూచన. విలువైన కాలాన్ని ప్రేమ పేరిట వృధా చేసుకోవద్దన్నదే యువతకు సందేశం. జీవితమంటే ప్రేమేకాదు... విలువైన విషయాలు చాలా ఉన్నాయని చూపించాం!

తర్వాతి ప్రాజెక్టులు?

పరిశ్రమలోని పెద్దలకు ఈ సినిమా చేరితే అదే పదివేలు. పెద్ద దర్శకులంతా నా సినిమా చూడాలని కోరిక. తరువాత ప్రాజెక్టులు అవే వస్తాయి.

- 'యు'



పోయినోళ్లందరూ...

తరలిపోయిన సినీ ప్రముఖులు 2014

సామాన్యుడి స్వప్నం -కథ. సమకాలీన జీవన స్రవంతి -కథనం. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడే నిత్యజీవన సంఘర్షణ -ఆయన సినిమా. ఒకటీ రెండూ కాదు, వంద సినిమాలతో వందసార్లు వాతలు తేలేలా చర్నకోలా విదిల్చి -ఆ బాధను ఆయనా అనుభవిస్తూ వెళ్లిపోయాడు. 2014 చివరిలో తన మరణంతోనూ -దక్షిణ భారత సినిమాను ఓ కుదుపు కుదిపేసి బాలచందర్ తిరిగిరాని లోకాలకు మరలిపోయాడు. వీళ్లే మా సినిమా పరిశ్రమ సొత్తు అని సగర్వంగా చెప్పుకోగలిగే వ్యక్తుల్లో -ఈ ఏడాది చాలా దిగ్గజాలే కనుమరుగైపోయాయి. సినిమాను జీవితానికి, జీవితాన్ని సినిమాకు అన్వయించి.. ఎన్నెన్నో నేర్పించి.. వాళ్లు నేర్చుకున్నవి మనకు విడిచిపెట్టి -చరిత్ర పేజీల్లోకి స్థిరాక్షరాలుగా నిలిచిపోయారు.

ఏడాదిలో చివరి కుదుపుగా -బాలచందర్ వెళ్లిపోయాడన్న వార్త.. దూరమైపోయిన దిగ్గజాలను, నిన్నమొన్నటి జ్ఞాపకాలను రీళ్లురీళ్ళుగా కళ్లముందుకు తెచ్చేదే.

దశాబ్దాలకు పైగా కోట్లాది తెలుగువారిని అలరించిన సినీ దిగ్గజాలు అంజలీదేవి, అక్కినేని నాగేశ్వరరావులు ఈ ఏడాదిలోనే దూరమైపోయరు. షాక్‌నుంచి కోలుకోకముందే చిత్రకారుడు, దర్శకుడు బాపూ కనుమరుగైపోయాడు. చిత్రం సినిమాతో పరిచయమైన వర్ధమాన హీరో ఉదయకిరణ్ -ఏడాది ఆరంభంలో జనవరి 5న ఆత్మహత్యకు పాల్పడి తనువు చాలించటం కలవరపర్చింది. ఆ ఘటన మర్చిపోకముందే -సీతమ్మతల్లిగా ఆంధ్రులు అభిమానాన్ని చూరగొన్న అంజలీదేవి 13న తనువు చాలించింది. తెలుగు, తమిళ, హిందీ చిత్రాల్లో నటిగా, నిర్మాతగా తనకంటూ ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకున్న అంజలీదేవి కళామసేవ తెలియని వారుండరు. ఆంధ్రులు వేడుకగా జరుపుకొనే భోగినాడే ఆ దుర్వార్త వినాల్సి రావటం బాధ కలిగించింది. జనవరి 21న ఫన్‌మాస్టర్ చంద్రశేఖరం తనయుడు నటుడు నాగరాజారావు మృతి చెందారు. రంగులరాట్నం, నర్తనశాల చిత్రాల్లో ఆయన నటనను ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. అదేరోజు దివగంత దర్శకుడు ఇవివి సత్యనారాయణ సోదరుడు, స్టిల్ ఫొటోగ్రాఫర్ ఇవివి గిరి కన్నుమూశారు. దేశంలోనే కాదు, ఖాండాంతరాల్లో ఖ్యాతి గడించిన మహానటుడు అక్కినేని నాగేశ్వరరావును జనవరి 22న కోల్పోయాం. రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు, పలు గౌరవ పురస్కారాలు అందుకున్న ఏకైక నటుడు అక్కినేని. తెలుగు కళామతల్లికి రెండు కళ్లుగా భావించే ఎన్టీఆర్, ఏఎన్నార్‌లు లేకపోవడం -పరిశ్రమకు దిక్కుతోచని స్థితే. జనవరి 28న దర్శకుడు బీరం మస్తానరావు మృతి చెందాడు. కృష్ణ హీరోగా 'బుర్రిపాలెం బుల్లోడు', ఎన్టీఆర్ హీరోగా 'ప్రేమసింహాసనం' చిత్రాలే కాకుండా విప్లవశంఖం, గయ్యాళిగంగమ్మ, సువర్ణసుందరి చిత్రాలకు బీరం మస్తానరావు దర్శకత్వం వహించారు. ఇదే జనవరి 28న ప్రముఖ సినిమాటోగ్రాఫర్, దర్శకుడు బాలుమహేంద్ర కన్నుమూసాడు. శంకరాభరణం, మన ఊరిపాండవులు, తరంమారింది, సొమ్మొకడిది సోకొకడిది చిత్రాలకు కెమెరామాన్‌గా పనిచేసిన బాలుమహేంద్ర -'నిరీక్షణ' చిత్రానికి దర్శకత్వం వహించాడు.

హైదరాబాద్‌లోని భాగ్యనగర్ స్టూడియో అధినేత, పలు రజితోత్సవ చిత్రాలను ప్రదర్శించిన సంగం థియేటర్ (నేటి మయూరి) యజమాని బాదం రామస్వామి మార్చి 7న కన్నుమూసాడు. అనుకున్నది సాధిస్తా -చిత్రాన్ని రామస్వామి నిర్మించాడు. నాటక రంగంనుంచి చలనచిత్ర నటిగా స్థిరపడిన తెలంగాణ శకుంతల జూన్ 15న మరణించింది. మాభూమి చిత్రంతో ప్రారంభమైన శకుంతల సినీ ప్రయాణం -దాదాపు విడుదలైన ప్రతీ చిత్రంలో ప్రత్యేక పాత్రతో అలరించింది. జూన్ 23న సీనియర్ దర్శకుడు ఐ.యన్.మూర్తి మృతి చెందాడు. ఎన్టీఆర్ దర్శకత్వం వహించిన తొలిచిత్రం సీతారామకళ్యాణం చిత్రానికి కో డైరెక్టర్‌గా వ్యవహరించటమే కాకుండా, ఎన్టీఆర్ హీరోగా నటించిన ఇరుగు పొరుగు, శభాష్‌సూరి చిత్రాలకు మూర్తి దర్శకత్వం వహించారు. సీనియర్ నటుడు, ప్రస్తుత ఎంపీ మురళీమోహన్, గిరిబాబులను పరిచయం చేస్తూ నిర్మించిన 'జగమేమాయ' చిత్రానికీ ఆయనే దర్శకుడు. ప్రముఖ నటుడు, రచయిత నృత్య దర్శకుడు ముక్కురాజు జూలై 31న మృతి చెందాడు. మాయాబజార్ చిత్రంతో తెరపైకి వచ్చిన ముక్కురాజు దండోరా, వేగుచుక్కలు, ఎర్రసైన్యం, లాల్‌సలాం తదితర చిత్రాలతో మెప్పించాడు. తెలుగు సినిమాను సంస్కృతీ రేఖాచిత్రంగా మలచిన ప్రముఖ చిత్రకారుడు, దర్శకుడు బాపు ఆగస్టు 31న కన్నుమూశాడు. 'సాక్షి' నుంచి శ్రీరామరాజ్యం వరకూ బాపు దర్శకత్వం వహించిన కళాఖండాలను ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం ఉండదు. అంతేకాదు -తెలుగువారంతా గర్వపడే విషయం బాపు విషయంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో బాపుకు సంతాపం ప్రకటిస్తూ, బాపు, రమణల శిలావిగ్రహాలు నిర్మిస్తామని ప్రకటించడాన్ని చూస్తే, గతంలో ఏ సినీ ప్రముఖుడికి దక్కని గౌరవం ఆయనకు దక్కినట్టయ్యింది. ప్రముఖ నిర్మాత దోసపాటి రంగారావు సెప్టెంబర్ 16న మృతి చెందాడు. తెలంగాణకు చెందిన రంగారావు హీరో కృష్ణతో సిబిఐ ఆఫీసర్ చిత్రంతోపాటు అయ్యప్ప ఆర్ట్స్ బ్యానర్‌పై -భయం, ఐడోంట్‌కేర్, అంతా ఒకమాయ, బెండుతీస్తా తదితర చిత్రాలను నిర్మించాడు. అక్టోబర్ 10న నిర్మాత సిసి రెడ్డి మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుడిగా పనిచేసిన సిసి రెడ్డి -మా శ్రేయోభిలాషి, గౌతమ్ ఐపీఎస్ చిత్రాలు నిర్మించాడు. అక్టోబర్ 21న ప్రముఖ కెమెరామాన్, దర్శకుడు అశోక్‌కుమార్ మృతి చెందాడు. అభినందన, నీరాజనం, శ్రీసాయి మహిమ చిత్రాల దర్శకత్వంతోపాటు భారతదేశంలో నిర్మించబడిన మొదటి 3డి చిత్రం మైడియర్ కుట్టీ చేతన్ చిత్రానికి కెమెరామాన్‌గా వ్యవహరించారు. తెలంగాణ ఉద్యమకారుడు జానపద గీతాల రచయిత బిల్ల క్రిష్ణస్వామి అక్టోబర్ 29న మృతి చెందాడు. ఈ రచయిత గురించి చెప్పడానికి నేటి భారతం చిత్రంలో -'నేనురానుబిడ్డో సర్కార్ దవాఖానాకు' అన్న పాట చాలు. ప్రముఖ రచయిత్రి ద్వివేదుల విశాలాక్షి ఇదేవారంలో మృతి చెందారు. విశాలాక్షి రచన వారధి నవల ఆధారంగా హీరో కృష్ణ నటించిన రెండు కుటుంబాల కథ నిర్మితమైంది. వస్తాడే మాబావ చిత్రానికి విశాలాక్షి సంభాషణలు సమకూర్చారు.

ఈ ఏడాది మరికొందరు రోడ్డు ప్రమాదాల్లోనూ మరణించారు. నవంబర్ 30న దర్శకుడు సిహెచ్ శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సర్కస్ సత్తిపండు చిత్రానికి దర్శకుడు, సమ్‌థింగ్ స్పెషల్ చిత్రానికి నిర్మాత శ్రీనివాస్. ఈ రోడ్డు ప్రమాదం మరువకముందే నందమూరి జానకిరాం మరో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జానకిరాం ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై అతనొక్కడే చిత్రానికి నిర్మాత. సీనియర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ పిజె శర్మ డిసెంబర్ 14న గుండెపోటుతో మరణించారు. దాదాపు 500 చిత్రాల్లో నటించిన శర్మ కుటుంబంలో భార్య కృష్ణజ్యోతి, కుమారులు సాయికుమార్, రవికుమార్, అయ్యప్పస్వామి అంతా నటనారంగంలోనే ఉన్నారు.

శర్మ మనవడు ఆది కూడా వర్ధమాన నటుడిగా పలు చిత్రాల్లో హీరోగా నటిస్తున్నాడు. డిసెంబర్ 12న ప్రముఖ సంగీత దర్శకుడు చక్రి గుండెపోటుతో మరణించాడు. చక్రి సంగీత దర్శకత్వం వహించిన ఆఖరి చిత్రం 'ఎర్రబస్సు'.

-పర్చా శరత్‌కుమార్

నాకు నచ్చిన సినిమా...

పాతాళభైరవి

జానపద చిత్రాలను అభిమానించే ప్రేక్షకులను మరింత అలరించి, సాధారణ ప్రేక్షకులచే 'భేష్' అనిపించుకున్న చిత్రరాజం 'పాతాళభైరవి'. ఇది కెవి రెడ్డిగారి దర్శకత్వంలో నిర్మింపబడిన రెండో చిత్రం. మొదటి చిత్రం 'గుణసుందరి' లాగానే బాక్సాఫీసు రికార్డు అప్పట్లో బద్దలుకొట్టిన సినిమా ఇది. సాధారణంగా జానపద చిత్రాలలో ఒక రాజు, దురాశాపరుడైన సైన్యాధిపతి మధ్య సంఘర్షణ ఉంటుంది. కొన్నింటిలో హీరో, మాంత్రికుల మధ్య పోరాటం తప్పనిసరిగా ఉంటుంది. మరికొన్ని చిత్రాల్లో కథానాయకుడు -ఒకవైపున మాంత్రికుడిని, మరోవైపున దుష్ట సేనాధిపతిని ఎదుర్కొంటాడు. అలాంటి జానపదమే ఇది కూడా. 'పాతాళభైరవి' చిత్రంలో యస్‌వి రంగారావు (మాంత్రికుడు) ఎన్టీ రామారావు (హీరో) పోటాపోటీగా నటించారు. కొద్ది చిత్రాల్లో మాత్రమే నటించిన మాలతి ఈ చిత్రంలో కథానాయిక. అన్ని జానపద చిత్రాల్లోలాగే ఈ సినిమాలోనూ కథానాయిక, నాయకులు విడిపోతారు. దుష్టసంహారంతో చివరకు కలుసుకోవడంతో చిత్రం సుఖాంతమవుతుంది. ఇందులో కొన్నికొన్ని దృశ్యాలు ప్రేక్షకులలో ఉత్కంఠ రేకిత్తిస్తాయి. మాంత్రికుడు కథానాయకుడిని బలి ఇచ్చే ముందు స్నానంచేసి రమ్మని చెప్పిన సీనులో -తమ అభిమాన హీరోకు ఏమవుతుందోనని ప్రేక్షకులు టెన్షన్ పడతారు. అలాగే, కొలనులోని దృశ్యం పెద్ద రిలీఫ్ ఇస్తుంది. హీరో, విలన్‌లలాగా వారి స్నేహితులు సహాయకులుగా నటించిన బాలకృష్ణ, పద్మనాభం కూడా పోటీపడి నటించారు.

మాంత్రికుడి శిష్యుడు (పద్మనాభం) సంజీవని సహాయంతో గురువును బ్రతికించుకొనడం మళ్లీ ప్రేక్షకులను నిరాశకు గురిచేసినా, కథాగమనానికి నిస్సందేహంగా తోడ్పడింది. మూడుగంటల సినిమా అయినా (అప్పట్లో కీలుగుర్రం, సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి, సువర్ణసుందరి అన్నీ మూడున్నర గంటల సినిమాలే) ఎక్కడా ప్రేక్షకునికి విసుగు అనేది కలగకుండా చిత్రించారు కెవి రెడ్డిగారు. 1950-60 మధ్య దుష్టపాత్రలను రాజనాల, ముక్కామల మాత్రమే నిర్వహించగలరని తెలుగు ప్రేక్షకులు భావించేవారు. తాను కూడా సునాయాసంగా ఏ రకమైన పాత్రనైనా పోషించగలనని ఈ చిత్రం ద్వారా ఋజువు చేసుకొన్నారు ఎస్వీ. 'ప్రేమకోసమై వలలోపడినే పాపం పసివాడు' మొదలైన పాటలకు కూర్చిన నేపథ్య సంగీతం వీనులవిందు చేస్తుంది. రిక్షావాలా మొదలు మేధావులవరకు అన్నిరకాల ప్రేక్షకులను ఎన్నిసార్లయినా చూసేలా చేసిన చిత్రరాజం 'పాతాళభైరవి'.

-కాకుటూరి సుబ్రహ్మణ్యం, కావలి

తెలుగు చలన చిత్రాలలో ఇప్పటికే ఎన్నో వందల సినిమాలు ప్రేక్షకులు చూసారు. అన్ని చిత్రాల్లో కొన్ని చిత్రాలు మనసును ఆకట్టుకుంటాయి. హృదయాన్ని ఏ పిల్ల సమీర తీరాలకో తీసుకెళతాయి. కొన్ని చిత్రాలు సందేశాత్మకంగా ఉంటే, మరికొన్ని నిత్య నూతనంగా భావించే ప్రేమలాలిత్యంతో అద్భుతంగా ప్రేక్షకుల మనసులలో తొణికిసలాడుతాయి. ఏ సినిమా ఏ ప్రేక్షకుడికి ఎలా నచ్చుతుందో తెలియదు. ఒక్కసారి సినిమా చూశాక ఆ చిత్రం నిరంతరం ప్రేక్షకుణ్ణి వెంటాడింది అంటే అది ఉత్తమ చిత్రమే. అదేవిధంగా ఒక్కసారి మన అద్భుతమైన సంగీత దర్శకులు బాణీలు కట్టిన పాటలు వింటే, మళ్లీమళ్లీ అదే పాట చెవులలో మారుమ్రోగుతుంటే, అది ఉత్తమమైన బాణి. సాహిత్యపరంగా అద్భుతంగా తీర్చిదిద్దిన మాటలు. తమ గానంతో గాయనీ గాయకులు ఆ పాటకు అమరత్వాన్ని చేకూరుస్తారు. అటువంటి గొప్ప పాటలు సినిమాలు మనకు కొదవలేదు. అటువంటి పాటలకు లేక చిత్రాలకు వేదికే ఈ శీర్షిక. మీకు నచ్చిన పాట కానీ, చిత్రం కానీ ఈ శీర్షికలో మీరు పాఠకులతో మీ భావాలు పంచుకోవచ్చు. అయితే, మీకు ఆ పాట కాని, ఆ చిత్రం కాని ఎందుకు నచ్చింది అనే విషయాన్ని సవివరంగా రాయాల్సి వుంటుంది. మీకు నచ్చిన ఆ పాటను కానీ, చిత్రాన్ని కానీ తోటి పాఠకులతో పంచుకోవడానికి ఇది ఉత్తమమైన వేదిక. ఇక ఆలస్యమెందుకు మీకు నచ్చిన పాట లేక సినిమా గూర్చి సవివరంగా వ్రాసి పంపమని ఆహ్వానిస్తున్నాం.

మా చిరునామా : ఎడిటర్, వెన్నెల, ఆంధ్రభూమి దినపత్రిక , 36, సరోజినీదేవి రోడ్ , సికిందరాబాద్- 03

నాకు నచ్చిన పాట

మధురం మధురం ఈ సమయం

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించిన కుటుంబ కథా చిత్రం 'భార్యాభర్తలు'. దర్శకుడు ప్రత్యగాత్మ. -'జోరుగా హుషారుగా' అమ్మాయిల వెంట జులాయిగా తిరుగుతున్న కథానాయకుడు నాగేశ్వర రావు -ఓ సందర్భంలో కారులో వెళ్తూ, రోడ్డుపై నడుచుకెళ్తున్న కృష్ణకుమారిని చూసి వెంటబడతాడు. కృష్ణకుమారి అతని ప్రవర్తనకు విసుగుచెందుతుంది. కానీ, పట్టుబట్టి పెళ్లి చేసుకుంటాడు. పెళ్లి చేసికొన్న మొదటి రాత్రి వారిద్దరి మధ్య ఆసక్తికర సంభాషణ జరుగుతుంది. నా శరీరం కొరకే బలవంతంగా పెళ్లి చేసుకొన్నావు కనుక, ఈ దేహం నీదే అంటుంది కృష్ణకుమారి. ఆ మాటకు నాగేశ్వరరావు చలించిపోతాడు. సమాధానంగా నేను మారాను అని నీకు నమ్మకం కలిగేంతవరకు నిన్ను తాకనైన తాకనంటాడు. అప్పుడు వారిద్దరి మధ్య కొంచెం ఎడబాటు తప్ప అన్యోన్యత కనిపించదు. ఒక రోజు రాత్రి నాగేశ్వరరావు ఇంటికి గిరిజ వస్తుంది. నాగేశ్వర రావుతో కఠినమైన సంభాషణ జరుగుతుంది. చివరకు గిరిజను వెళ్లిపొమ్మని చెప్తాడు నాగేశ్వర రావు. ఈ సంభాషణంతా అంతా కృష్ణకుమారి పైనుంచి వింటుంది. ఆ సంఘటనతో ఆమెలో కొత్త ఉత్సాహం కలగడం, తరువాత ఇద్దరూ ఆనందంగా ఒకటై 'మధురం మధురం ఈ సమయం ఇక జీవితమే ఆనందమయం' అన్న పాట పాడుకుంటారు. ఈ పాటంటే నాకు చాలా ఇష్టం. రాజేశ్వరరావు సమకూర్చిన బాణీలు అజరామరం. దృశ్యపరంగా ఈ పాట వారి దాంపత్య జీవితానికి మధురమైన పాట. ఆ పాటలు, సాహిత్యం, సంగీతం ఈరోజుల్లో వినగలమా! భార్యాభర్తలు కలిసి చూడాల్సిన సినిమా ఇది.

-మార్కస్ మణిరాజ్, ముద్దనూరు

వెన్నెల రచయితలకు సూచన

వెన్నెలకు రచనలు పంపాలనుకునే వారు ఈ కింది విషయాలను గమనించగలరు

- ప్రతి శుక్రవారం వెలువడే వెన్నెలకు రచనలు మంగళవారం లోపు చేరాల్సి వుంటుంది.
- రచనల్లో కొత్తదనం ముఖ్యం
- అరిగిపోయిన పాత సినిమా కబుర్లు, శ్రద్ధాంజలి వ్యాసాలు, సినిమాలపై హితబోధల కన్నా, చదివించే కొత్త తరహా వ్యాసాలకు ప్రాధాన్యత వుంటుంది.
- కొత్త సినిమాలపై సమీక్షలు రాయాలనుకున్న ఔత్సాహికులు ముందుగా ఒకటి రెండు సమీక్షలు పరిశీలన కోసం రాసి పంపితే, పరిశీలించగలం.
- తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వచ్చే కొత్తసినిమాలను పరిశీలించే ఆసక్తి వున్నవారు, సంబంధిత వ్యాసాలు పంపితే అవీ ప్రచురణార్హమే.
- కొత్త హాలీవుడ్ సినిమాలకు సంబంధించిన వ్యాసాలకు కూడా స్వాగతం.
- ఇంతవరకు ఎక్కడా ప్రచురితం కాని, అపురూప చిత్రాలు వుంటే పంపొచ్చు.
- రచనలను ఈ మెయిల్‌లో స్కాన్ లేదా పిడిఎఫ్ ఫార్మాట్‌లో vennela@deccanmail.com కు మెయిల్ చేయగలరు.
- ప్రచురించిన (మీ వ్యూస్ మినహా) ప్రతి వ్యాసానికి పారితోషికం వుంటుంది.

మా చిరునామా :
ఎడిటర్, వెన్నెల, ఆంధ్రభూమి దినపత్రిక
36, సరోజినీదేవి రోడ్ , సికిందరాబాద్- 03

ముత్యాల ముగ్గు

27 చుక్కలు 5 వరుసలు
1 తగ్గించి 1 వరుస
3 తగ్గించి 1 వరుస
5 వరకూ 3 సార్లు

పి.శివకుమారి, విజయవాడ

మీ సృజనకు పదునుపెట్టి కొత్తకోణాల్లో ఆకర్షించే అందమైన ముగ్గులు పంపండి. చుక్కల వివరాలు రాయడం మరువకండి. చుక్కలు, గీతలు.. ఏ ముగ్గులైనా చూసేందుకు స్పష్టంగా ఉండాలి.

చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500003.

ముగ్గులు వేసిన కాగితాలను కలర్ స్కానింగ్ చేయించి bhoomika@andhrabhoomi.netకు మెయిల్‌లో కూడా పంపొచ్చు.

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి శనివారం 27, డిసెంబర్ 2014

పదవులకు చదువులెందుకు..?

రాజస్థాన్ మహిళా సర్పంచ్‌ల నిరసన గళం

'చదువులతో పని ఏమి..? హృదయమున్న చాలు..!'- అని భావిస్తున్నారేమో... ఆ మహిళలు ప్రభుత్వ నిర్ణయంపై మండిపడుతున్నారు. అంతగా చదువుకోని కొందరు నేతలు సైతం కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులుగా పదవులు వెలగబెడుతుండగా, పంచాయతీ పదవులకు కనీస విద్యార్హతలుండాలనం సరి కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలో వివిధ పదవులకు పోటీ చేసేవారికి కనీస విద్యార్హతలుండాలని రాజస్థాన్ ప్రభుత్వం తాజాగా ఓ ఆర్డినెన్స్ జారీ చేయడం పట్ల మహిళా సర్పంచ్‌లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకుని తీరుతామని వారు ప్రకటించారు. పంచాయతీ పదవులకు కనీస విద్యార్హతలు నిర్ణయించడాన్ని తాము సహించేది లేదని 'మహిళా పంచ్ సర్పంచ్ సంఘటన్' తెగేసి చెబుతోంది. ఈ నిబంధనలను అమలు చేస్తే గ్రామీణ మహిళల్లో చాలామంది ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోతారని 'సంఘటన్' నేతలు అంటున్నారు. ఎలాంటి విద్యార్హతలు లేకున్నా అందరికీ ఎన్నికల్లో పోటీ చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం కలిగించేలా 'కనీస విద్యార్హత'ను నిర్ణయించడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరుగాంచిన భారత్‌లో ఈ తరహా నిబంధనలు విడ్డూరంగా ఉన్నాయని వారు విమర్శిస్తున్నారు. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ సంతానం కలిగిన వారు పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అనర్హులని గతంలోనే నిబంధన విధించారని 'సంఘటన్' నేతలు గుర్తు చేస్తున్నారు. మహిళా సాధికారత, సుపరిపాలన అంటూ ఘనమైన హామీలిచ్చే ప్రభుత్వాలు ఇలాంటి అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకోవడంలో అర్థం లేదని వారు అంటున్నారు. నిరుపేద మహిళలకు పదవులు దక్కకుండా చేసేందుకే నిబంధనల పేరిట అడ్డంకులు సృష్టిస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. 'రాజస్థాన్ పంచాయతీ రాజ్ (రెండో సవరణ) ఆర్డినెన్స్- 2014'ను రాష్ట్ర గవర్నర్ ఇటీవల విడుదల చేశారని, కింది స్థాయి పదవులకు సైతం కనీస విద్యార్హతలుండాలని ప్రభుత్వం నిర్ణయించిదని 'సంఘటన్' నేతలు తెలిపారు.

తాజా ఆర్డినెన్స్ ప్రకారం ఇకపై జిల్లా పరిషత్, పంచాయతీ సమితి పదవులకు పోటీ చేసేవారు కనీసం పదో తరగతి పాసై ఉండాలి. గ్రామ సర్పంచ్, వార్డు పదవులకు పోటీ చేసే వారు ఎనిమిదో తరగతి పూర్తి చేసి ఉండాలి. అయితే, షెడ్యూల్డు (గిరిజన) ప్రాంతాల్లో మాత్రం గ్రామ పంచాయతీ పదవులకు అయిదో తరగతి పాసైతే చాలు. కనీస విద్యార్హతలు లేనివారిని ఎన్నికలకు అనర్హులుగా నిర్ణయించడం రాజ్యాంగ విరుద్ధమని, ఇది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని 'మహిళా పంచ్ సర్పంచ్ సంఘటన' దుయ్యబడుతోంది. ప్రతి పౌరుడూ పల్లె నుంచి ఢిల్లీ వరకూ అన్ని పదవులకూ పోటీ చేసే అవకాశం ఉండగా 'కనీస విద్యార్హత' పేరిట అవరోధాలు సృష్టించడం సబబు కాదంటున్నారు. మహిళలకు పదవులు దక్కకుండా, వారిని ప్రజాజీవితం నుంచి వేరు చేసేలా రాజస్థాన్ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిందని, 73, 74వ రాజ్యాంగ సవరణలకు ఇది విరుద్ధంగా ఉందని వారు ఆరోపిస్తున్నారు. తమ పట్ల వివక్ష కొనసాగేలా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం దారుణమని మహిళా సర్పంచ్‌లు అంటున్నారు. కాగా, ఇళ్లలో మరుగుదొడ్లు లేనివారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులని తేల్చి చెబుతూ రాజస్థాన్ ప్రభుత్వం ఈనెల మొదటివారంలో పంచాయతీ రాజ్ చట్టానికి మరో సవరణ చేసింది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఏ ఒక్కరు బయటకు వెళ్లినా ఆ కుటుంబం మొత్తాన్ని ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంట్లో టాయిలెట్ నిర్మించినట్లు ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే తప్ప ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు.

అక్షరాస్యత శాతం తక్కువే...

రాజస్థాన్‌లోని గ్రామీణ మహిళల్లో అక్షరాస్యతా శాతం 45.8 మాత్రమే. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళల అక్షరాస్యతలో జాతీయ సగటు (57.93) కన్నా ఈ రాష్ట్రం వెనుకంజలోనే ఉంది. గిరిజన ప్రాంతాల్లో మహిళల అక్షరాస్యతా శాతం 25. 22గా ఉంది. అక్షరాస్యతను పెంచేందుకే 'కనీస విద్యార్హత' నిబంధన విధించినట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ- మహిళా సర్పంచ్ సంఘటన్ మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. స్థానిక సంస్థల్లో ఏభై శాతం పదవులను మహిళలకు గతంలోనే కేటాయించారని, కనీస విద్యార్హతల నిబంధన వల్ల ఆ రిజర్వేషన్ విధానం ఎలా అమలవుతుందని 'సంఘటన్' నేతలు ప్రశ్నిస్తున్నారు.

-ఆదిత్య

'దుర్గాశక్తి'కి జేజేలు..

'మేం జరిమానా చెల్లించం'...అంటూ ఒక యువతి తెగేసి చెప్పిన మాటలు విని పంచాయతీ పెద్దలతోపాటు, గ్రామస్థులంతా నిశ్చేష్టులయ్యారు. తమ ఆధిపత్యాన్ని ఓ యువతి అలా సవాల్ చేయడం పెద్దలకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఫలితంగా ఆ యువతి కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ చేశారు. అయినప్పటికీ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో పంచాయతీ పెద్దలను ఎదిరించి, పురుషాధిక్యతకు గండికొట్టింది ఆ ధీర వనిత. మనోధైర్యం ఉంటే వికలాంగులు సైతం సాధించలేనిది ఏమీ లేదని నిరూపించింది దుర్గ గుడిలు అనే యువతి.

ముంబయిలోని మురికివాడలలో సంజయ్‌నగర్ ఒకటి. ఆ మురికివాడలో రోడ్డు పక్కన వనమూలికలు విక్రయించే వైదు సమాజ్ అనే తెగకు చెందినవారు నివసిస్తారు. వీరంతా అక్షరాస్యతకు, అభివృద్ధికి చాలా దూరం. పురుషులు వనమూలికలు విక్రయిస్తే, మహిళలు పిన్నీసులు, రబ్బరు బ్యాండ్లు, బొట్టు బిళ్ళలు, కాటుక తదితర వస్తువులను అమ్ముతుంటారు. ఈ తెగలో పురుషుల మాటకు ఎదురులేదు. సంజయ్‌నగర్‌లో అంకుబాయ్ తన కుమార్తెలు గోవింది, దుర్గ గుండిలితో ఉంటోంది. గోవిందిని వివాహం చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలంటూ అంకూబాయ్‌ని ఆమె సమీప బంధువైన ఒక యువకుడు అడిగాడు. ఆ యువకుడు తాగుబోతు కావడంతో అతడిని వివాహం చేసుకోడానికి గోవింది తిరస్కరించింది. ఆ యువకుడు మరో మార్గం లేక వేరే యువతిని వివాహం చేసుకొన్నాడు.

ఒక రోజు దుర్గ తన స్నేహితురాలితో కలిసి బజారులో వెళ్తుండగా ఆ యువకుడు తారసపడ్డాడు. వారిమధ్య వాగ్వివాదం జరిగి తన్నులాటకు దారితీసింది. దుర్గ ఫిర్యాదు మేరకు అతడిని పోలీసులు అరెస్టు చేశారు. దుర్గ పోలీసు స్టేషన్‌కు వెళ్లడం వైదు సమాజ్ పంచాయతీ పెద్దలకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. కులపెద్ద సామి వైదు పంచాయతీ నిర్వహించి, దుర్గ 25 వేల రూపాయలు జరిమానా చెల్లించాలని తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే దుర్గను చంపేస్తామని కూడా బెదిరించడంతో భయపడిన తల్లి అంకూబాయ్ అష్టకష్టాలుపడి 25 వేల రూపాయలు జరిమానాగా చెల్లించింది. అయినా సంతృప్తి చెందని పెద్దలు మరో 50 వేల రూపాయలు చెల్లించాలంటూ హుకుం జారీ చేశారు. 50 వేల రూపాయలు చెల్లించకపోతే భౌతిక దాడితో పాటు సాంఘిక బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ పెద్దల ఆగడాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని దుర్గ నిర్ణయించుకొంది. చిన్నతనంలో పోలియో రావడంతో ఆమె శరీరంలో ఎడమ భాగం దెబ్బతింది. అంగవైకల్యం ఉందని బాధపడకుండా, మనోధైర్యంతో తన దృష్టిని చదువుపై నిలిపింది. ఆమె బ్రెజిల్‌లో జరిగిన వరల్డ్ సోషల్ ఫోరమ్ సమావేశంలో మన దేశం తరపున పాల్గొంది. 50 వేల రూపాయలు చెల్లించడానికి తిరస్కరించడంతో పంచాయతీ పెద్దలు దుర్గ కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ చేశారు. పంచాయతీ సమావేశానికి ఒక స్వచ్ఛంద సంస్థ సభ్యులను, స్థానిక టి.వి రిపోర్టర్‌ను మద్దతుగా దుర్గ తీసుకెళ్లింది. ఆగ్రహించిన పంచాయతీ పెద్దలు ఆ టీవీ విలేఖరిపై దాడి చేసి గాయపరిచారు. తమపై టీవీ జర్నలిస్టు పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలంటూ పెద్దలంతా దుర్గపై ఒత్తిడి తీసుకువచ్చారు. అందుకు అంగీకరించకుండా ఆమె పోరుబాట పట్టడం వైదు సమాజ్ తెగకు చెందిన వారిని ఆలోచింపజేసింది. క్రమంగా వారు దుర్గకు మద్దతుగా నిలిచారు. పంచాయతీ పెద్దల ఆగడాలను ఎదిరించేందుకు మహారాష్ట్ర వైదు సమాజ్ సమితి అనే సంస్థను ఏర్పాటుచేశారు. ఆ సంస్థ కార్యవర్గంలో మహిళలకు సమాన ప్రాతనిధ్యం కల్పించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు వైదు సమాజ్ వారికి అందేలా దుర్గ కృషి చేయడం ప్రారంభించింది.

సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న దుర్గ

ప్రతి శనివారం సాయంత్రం మహిళలు సమావేశమై పరిశుభ్రత, సమానత్వం, మూఢ నమ్మకాలు- వాటివలన కలిగే దుష్ఫలితాలపై చర్చిస్తారు. పిల్లలను బడిబాట పట్టించడంలో వారు సఫలీకృతులయ్యారు. నిన్నమొన్నటివరకు బెదిరింపులకు దిగిన పంచాయతీ పెద్దలు ఇపుడు దుర్గ పేరు చెబితేనే ఉలిక్కిపడుతున్నారు. తమ మురికివాడలో ఒక గ్రంథాలయం ఏర్పాటు చేసేందుకు అక్కడి మహిళలు దుర్గ నాయకత్వంలో కృషి చేస్తున్నారు. ఆత్మవిశ్వాసం తోడైతే అంగవైకల్యాన్ని జయించడమే కాదు, సమాజానికి ఎంతోకొంత మేలు చేయవచ్చని నిరూపించిన దుర్గ ఎంతోమందికి స్ఫూర్తిదాతగా నిలిచింది.

-పొనుగుపాటి హైమావతి

అద్దం

-సి.ఉమాదేవి

రోజూలానే మరో ఉదయం.. వారం మారుతుంది, తేదీ మారుతుంది.. మారనిదల్లా సూర్యుడి దినచర్య, ఆ ఇంటి ఇల్లాలు వాసవి దినచర్యే! అవే పరుగులు.. ప్రతిరోజు రివైండ్ చేయాల్సిందే! పరుగుల నడుమ సంధించబడే శ్వాసనాడనివ్వని ప్రశ్నలు!

''ఈ కూర ఇలా తగలడిందేం? ఉప్పు లేదు, కారం లేదు, రుచి పచి అసలు లేదు, నాకేమైనా బి.పి ఉందా?'' ఆ గొంతులోని విసుగు, చిరాకు చూసి- భరించినవాళ్ళకి నిజంగా బి.పి. పెరగడం ఖాయం.

''నీకు పని తెమలదు, ఆలోచనలు తెమలవు! నా టిఫిను బాక్సు తెస్తే కదులుతా.. నా బాధ నీకేం తెలుసు? టీవీ రిమోట్‌తో ఆడుకుంటావు. వాహన కాలుష్యాన్ని పీల్చుకుంటూ, బ్రేకులు వేస్తూ, కదులుతూ ఆఫీసు చేరేసరికి మాకు మూడుతుంది. ఆలస్యమెందుకయిందని, మళ్లీ దానికో వివరణ! ఇంకా తెమల్లేదా?''

''ఇదుగో.. ఎందుకలా తయారైనంతసేపు కేకలు వేస్తూనే ఉంటారు? ఇలా అయితే మీ గుండె బేజారెత్తుతుంది''. టిఫిను బాక్సు తుడిచి బ్యాగులో పెట్టి అందించింది. నవ్వనేది కనబడని భర్త ముఖం చూసి నిట్టూర్చింది.

ఎక్కడి రిమోట్లక్కడే.. ఎక్కడి సాక్సులక్కడే..! తువ్వాళ్లు, దుప్పట్లు, విడిచిన బట్టలు, తిన్న కంచాలు, తాగిన గ్లాసులు.. ఇలా వదిలేసినవన్నీ సర్దిపెట్టేసరికి దినచర్య ముగింపుకొస్తుంది. ఇదేనేమో రిమోట్‌తో ఆట! బడిలో పిల్లలు, ఆఫీసులో భర్త ఉన్నా- తనను కంట్రోల్ చేసే రిమోట్ వారి చేతిలోనే ఉందేమో! ఏదో రోబో ఆవహించినట్లు వారి పనులన్నీ చక్కబెడుతుంది. అయినా ముగియని దినచర్య వాసవిది. పిల్లలు ఇంటికి వచ్చాక వాళ్ల చదువులు, తగవులు! అవి ముగిశాక రేపేం కూర చేయాలి? చిన్నాడు ఇది తినడు, పెద్దాడికి అది పడదు.. అనుకుంటూ ఇద్దరికీ ఇష్టమైనది చేస్తే పిల్లలకు నచ్చినది భర్తకు ఎప్పుడు నచ్చదు. సమన్వయపరిచి ఉదయాన్నే బాక్సులు సర్దేసరికి సూర్యుడు రేసులో ముందుంటాడు. ఆ రోజు ఇంటికి రాగానే కొడుకు చెంప ఛెళ్లుమనిపించాడు భర్త ఆనంద్.

''ఎందుకండీ ఇంటికి వస్తూనే వాడిని కొట్టారు?'' దెబ్బ తనపై పడినట్లు గిలగిలలాడుతూ అడిగింది వాసవి.

''ఎందుకా..? వాడినే అడుగు. నెలకు వెయ్యి రూపాయలు పెట్టి మ్యాథ్స్ ట్యూషన్ పెడితే- నిన్న ట్యూషన్ ఎగ్గొట్టి సినిమా టిక్కెట్ల కౌంటర్‌లో కనబడ్డాడట. నా ఫ్రెండ్ చంద్రాన్ని చూసి అక్కడనుండి పారిపోయాడట..''.

''లేదు నాన్నా.. నేను సినిమా చూడాలని వెళ్లలేదు. మా మాస్టారే సెకెండ్ షోకు టికెట్లు తెమ్మంటే...'' బెక్కుతున్నాడు పెద్దాడు ఏడుపు ఆపుకుంటూ.

''ఇదెక్కడి చోద్యం..? మాస్టార్లే ఇలా చేస్తే ఎలా? అయినా పోనీలే పెద్దాయన,.. పక్కనే థియేటరు..''. వాసవి మాట్లాడుతుండగా మరోవైపు ఆనంద్ దండకం ..

పిల్లల పెంపకంలో తల్లి ఎలా ఉండాలో సుదీర్ఘ కౌన్సిలింగ్..! మధ్య మధ్యలో ఆఫీసు గొడవలు.. ఆడిటర్ల ప్రశ్నలన్నిటికి ఇవ్వాలనుకుని ఇవ్వలేకపోయిన జవాబులు వాసవికి ప్రశ్నలై తగుల్తున్నాయి.

''నువ్వు అడిగావు సరే.., స్టాకు లేనపుడు, అత్యవసరంగా పరిగెట్టి తెచ్చిన వాటికి ఒక్కొక్కసారి బిల్లు కృష్ణార్పణం. నువ్వు చెప్పగలవా..? సంవత్సరం క్రితంది కాదు.. గత నెల నువ్వు తెచ్చిన సరుకులకు ఎన్నింటికి బిల్లులు సక్రమంగా అడిగి తెచ్చావో..?''

''నాపై ఎందుకీ ప్రశ్నలు, ఇది ఇల్లు కదా...!'' వాసవి ఏదో చెప్పబోయింది.

''ఏదైతేనేం.. దేనికైనా పద్ధతిగానే ఉండాలి కదా?''

'మరి మీరెందుకు ఆఫీసులో బిల్లులు సరిగా చూపలేక బ్లాక్ మార్కులు వేసుంటున్నారు?' ప్రశ్న గొంతులోనే ఆపేసింది వాసవి. తన ప్రశ్నలకు నోరు తెరవని సబార్డినేట్ దొరికినట్లయి, అప్పటికిగాని తనను అంతవరకు పట్టి పీడించిన టెన్షన్ కాస్త వదిలినట్లనిపించలేదు ఆనంద్‌కు.

హోంవర్క్ త్వరగా పూర్తిచేయిస్తే పిల్లల తలపైన బరువు తగ్గిపోయి త్వరగా నిద్రపోయి ఉదయాన్నే నిద్రలేస్తారనుకుని వారి వద్ద కూర్చుంది. భర్త చేతిలో రిమోట్! అంటే కాసేపు మౌనం! ఇక అప్రకటిత సెలవు దొరికినట్లే!

''హోంవర్క్ కానివ్వండి త్వరగా.. భోంచేద్దురుగాని.. నాన్న కూడా లేస్తారు భోజనానికి''.

''త్వరగా ఎలా? దీన్ని నువ్వు సాల్వ్ చెయ్యి చూద్దాం'' ఇది చిన్నాడి సవాల్!

''నేను చదివింది తెలుగు మీడియంరా..'' వాసవి నవ్వుతూ మాటల తడబాటును సర్దుకుంటూ ''వీడికి ఈ లెక్క కాస్త చెప్తారూ?'' అని ఆనంద్‌ను అడిగింది.

ఆనందోబ్రహ్మ! తనే ఫుట్‌బాల్ ఆడుతున్నట్టుగా ఉన్న బాడీ లాంగ్వేజిలో ఎలాంటి మార్పు లేదు.

''మరి మీ ట్యూషన్‌లో అడగలేదా?''

''హోంవర్క్ నువ్వు చేయాలమ్మా. నేను కాదు, కాస్త బుర్ర వాడాలి మరి.. అని క్లాసు తీసుకున్నాడమ్మా ట్యూషను సారు!''

ఆంగ్లంలోని లెక్కను తెలుగులోకి అనువదించుకుని తన కర్థమయినంతవరకు విశదపరచింది.

''మరి నువ్వు కూడా కాస్త వాడి చదువులు ఫాలో అయితే పిల్లలకు ఇబ్బంది ఉండదు కదా!''- భోజనానికి లేచిన భర్త సలహా.



'అది కూడా నా పనేనా?' అని అనాలనుకుంది. ''పోనీలే అలసిపోయి ఉంటారు ఆఫీసులో! నేను కూడా మాటలతో వత్తిడి పెట్తే ఎలా!'' అని మాటను గొంతుకలో అదుముకుంది.

''ఈ తెలుగు వద్దంటే.. మాతృభాషను మనం మరచిపోతే ప్రపంచంలో అది అంతరించిపోతుందని చెప్పి చెప్పి, ఇదిగో ఇలా సంధులు, సమాసాలు, అలంకారాలు అంతా కన్ఫ్యూషన్''- చిన్నాడు రోజూ పాడే పాటనే మళ్లీ పాడిగించాడు.

తెలుగు భాషలోని జాతీయాలు, సామెతలు సైతం మరచిపోతున్న యువతకు తెలుగుపై ప్రేమ పెంచాలనుకున్న తన కోరికకు పెద్దకొడుకు గండికొట్టాడు. కాలేజీలో చేరాక ఫ్రెంచ్ తప్ప మరొకటి ఫస్ట్ లంగ్వేజీగా తీసుకోనని శపథాలు కూడా చేసాక మరిక బలవంత పెట్టలేకపోయింది వాసవి. చిన్నాడికి నచ్చచెప్పి సంధులు, సమాసాలు వివరించేసరికి భోజనాల బల్లమీద ప్లేటుపై గరిటతో డప్పు మొదలుపెట్టాడు పెద్దకొడుకు. అందరూ నిద్రలోకి జారుకున్నారు. ఫ్యాను వేగం అందుకున్నా చెమటలతో తడిచి ముద్దవుతోంది వాసవి. పిల్లలు మంచి నిద్రలో ఉన్నారు. అలసిపోయారు పాపం అనుకుంది- గురకతో తనను ఇంటికి కాపలాకు పెట్టినట్లు నిద్రపోతున్న భర్తను చూచి.

తెలవారుతోంది. 'నేను లేచేసా, నువ్వేం ఇంకా పడుకునే ఉన్నావా..?'- అన్నట్లు కిటికీలో నుండి చురుక్కుమని చూశాడు సూర్యుడు. సూర్యుడితో మనం పోటీ పడకూడదు. గడియారం ముల్లయితే మేలు, బ్యాటరీ ఆగితే అదీ- ఆగి విశ్రాంతి పలుకుతుంది. ఈ రోజు నుండి నేను గడియారంలా ఉంటా. బ్యాటరీ చార్జి తగ్గగానే సెలవు ప్రకటించేస్తా. తన మనసు పలికే మాటలకు తనే నవ్వుకుంటూ చపాతీలు ఒత్తుతోంది వాసవి.

''అమ్మా నా సెల్ చూసావా..?''

కాలేజీకి వెళ్తూ తల్లి పెట్టిన ఇడ్లీ, సాంబారు జుర్రేసి హడావిడి పడిపోతున్నాడు పెద్దకొడుకు.

''వాసవీ.. నా టై ఎక్కడ.. కనబడ్డం లేదు?''

''మీరేగా.. నిన్న ఆఫీసునుండి రాగానే విప్పుతుంటిరి!''

''సరే నేను విప్పితే నీవు సర్దుతావు కదా, ఎక్కడ ఉన్నది అక్కడ ఉండనిస్తే కదా!''

''అంటే ఏది ఎక్కడ వదిలేస్తే అది అక్కడే అలాగే ఉండనివ్వాలన్నమాట''

''వద్దు.. ఇలా బదులివ్వకూడదు. అసలే ట్రాఫిక్‌లో గంట ప్రయాణం..! వత్తిడికి గురికాకూడదు''.

హ్యాంగరుపైనున్న టై తీసి అందించి, చపాతీ మాడిన వాసన రావడంతో వంటింట్లోకి పరిగెట్టింది.

''పెద్దాడా... నీ బాక్స్ రెడీ''

ష్యూర్యాక్ మీద పెట్టి మరచిన పెద్ద కొడుకు ఫోను మోగుతోంది. ఫోను కనబడలేదన్న చిరాకులో టిఫిను బాక్సును కూడా వదిలేసి వెళ్లిపోయిన కొడుకు చేష్టలకు- 'తండ్రి పోలికే..' అనుకుంటూ నిట్టూర్చింది. టేబిల్‌పై ఇడ్లీ, సాంబారు సర్దిపెట్టి భర్తను పిలిచింది.

''ఏంటిది? సాంబారా? చారా?''

''కాస్త కందిపప్పు తక్కువైతేను..'' చెప్పాలనుకుంది. ఆనంద్‌కు తానిచ్చే జవాబు సాంబారులాగే రుచించదు. పైగా ఆఫీసులో ఎన్నో తలనొప్పులు పాపం...

''సరేలే.. ఏంటలా చూస్తావ్! లంచ్ టైం దాటినా ఫైళ్లు వదలరు, మమ్మల్ని వదలరు ఆ ఆడిటర్స్... నీకేం అడిగేవాడు లేడు.'' నవ్వాడు ఆనంద్.

ప్రతిగా నవ్వాలనుకున్నా ముందు ఏడుపే తన్నుకొచ్చేస్తుందేమోననిపించింది వాసవికి.

''నాదేముందిలే... టిఫను బాక్స్ తీసుకెళ్లండి. హాల్లో పెట్టాను''.

''ఇదేమిటి ఎవరు మరచిపోయారు? మరో టిఫను బాక్సు ఇక్కడే ఉందే!''

''అదే బాధగా ఉందండీ! ఫోను కనబడలేదని కోపంలో పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్లిపోయాడు పెద్దాడు''.

''మన పెంపకం కదా మరి.. గారాబం చేసావుగా, తిట్టకూడదు, కొట్టకూడదు అంటావు. ఎలా వస్తాయి పద్ధతులు?''

బండరాయి కూడా ఉలి దెబ్బలకు ముక్కలవుతుంది. భరించువాడు భర్తో, భరించేది భార్యో అర్థం కాని స్థితిలో అయోమయానికి గురయింది వాసవి. ఆఫీసు చేరి టిఫను బాక్సు ప్యూనుకందించాడు ఆనంద్.

''వాళ్ళు వచ్చేసారా?''

''ఎవరు సార్?'' వినయంగా అడిగాడు ప్యూను.

''ఇంకెవరు నా మొగుళ్లు!'' గయ్యిమన్నాడు ఆనంద్.

''వీళ్లమ్మ ఈయనకు ఆనంద్ అనే పేరే ఎందుకు పెట్టిందో!' అనుకుంటూ, ''వచ్చారు సార్. క్యాంటీనులో కాఫీ తాగుతున్నారు''.

ఆనంద్ లేచాడు, క్యాంటీనుకు వెళ్తే కాస్త పరిచయాలు పెరిగి చనువేర్పడుతుందేమోనని. అయినా ఆ అవకాశమివ్వనివాళ్లు వచ్చిన ఉద్దండులు. ముఖాలన్నీ భావరహితాలే. జేబులో ఫోను మోగుతోంది. 'ఇప్పుడెవరబ్బా ఫోను!' చూసాడు ఆనంద్. పక్కింటి లోకనాథం గారు!

''చెప్పండి సార్..'' అన్నాడో లేదో, ''నువ్వు అర్జంటుగా రావాలోయ్'' అన్నాడాయన.

''ఎందుకు సార్, పైగా మా ఆఫీసులో ఆడిట్ జరుగుతోంది..''.

''మీ ఆవిడ మన కాలనీలోని హాస్పిటల్‌లో ఉందోయ్. నువ్వొచ్చి డాక్టరును కలవాలి. నేను వెళ్లి మీ పిల్లలను తీసుకు వస్తాను'' లోకనాథం మాట ఇంకా పూర్తికానేలేదు... నిమిషాలలో గంట దూరాన్ని అధిగమించేశాడు. ఆడిట్, ఫైళ్లు ఆ క్షణంలో గుర్తులేవు. హాస్పిటల్ బెడ్‌మీద నిస్త్రాణగా పడుకుని శూన్యంలోకి చూస్తోంది వాసవి. తల్లికి బాగాలేదని స్కూలులో చెప్పి పిల్లలను వెంట పెట్టుకుని వచ్చాడు లోకనాథం.

తల్లిని చూచి ఏడుపందుకున్నవారిని సముదాయించలేకపోతున్నారు ఆనంద్, లోకనాథం. ఆతృతగా డాక్టరు గదిలోకి వెళ్ళాడు ఆనంద్.

''డాక్టరుగారూ.. ఏమైంది మా మిసెస్‌కి...?'' ఆతృతగా అడిగాడు.

''ఆమె విపరీతమైన ఒత్తిడికి గురయ్యారు'' బి.పి రిపోర్టు, ఇ.సి.జి రిపోర్టు చూస్తూ డాక్టర్ చెప్పాడు.

''కారణమేమై ఉంటుంది?'' విస్తుపోతూ అడిగాడు. 'ఆఫీసు గొడవలతో వత్తిడి తనకుండాలి కానీ- ఈమెకేం లోటు..?'. అర్థం కాక తెల్లబోయాడు. అర్థం చేసుకోలేకపోతున్న సగటు భర్త అతను.

''కారణమేముంటుంది.. మీరో మీ పిల్లలో..?''

''అదేంటి డాక్టరుగారూ అలా అంటారు? ఆమెను నేనే దేనికీ వత్తిడి పెట్టను. జీతం మొత్తం ఆమెకే ఇస్తాను. కావలసినవి తనే తెచ్చుకుంటుంది. ఆడిటర్లలా లెక్కలు కూడా అడగను''.

డాక్టరు కళ్లెగరేస్తూ నవ్వాడు.. ''ఓరి.. అమాయకుడా..!'' అన్నట్లు!

''మీ ఒత్తిడి ఆమెది కాదా? ఆమెవరు? మీలో సగం! ఆమె అద్దంలా మీ కష్టసుఖాలను గ్రహిస్తుంది. కేవలం మీ వత్తిళ్లే ఆమెలో ప్రతిబింబమవుతున్నాయి. మీ పక్కింటి లోకనాథంగారు చెప్పినట్లు ఆమె మితభాషే కాదు, మృదుస్వభావి అని కూడా అర్థమవుతోంది''.

''ఇదేమిటో వివరంగా చెప్పండి... మీరేదేదో మాట్లాడుతున్నారు..''- అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ అడిగాడు ఆనంద్.

''ఏముంది? మీరు మీ ఇబ్బందులకు తెరదించుకునే దిశగా మీ ఒత్తిడినంతా మీ మాటలతో పరోక్షంగా ఆమె పైకి మరలించి ఉంటారు. ఆమె మౌనంగా భరించింది. ఫలితం- తట్టుకునే శక్తి తగ్గి తల్లడిల్లిన మనసుతో ఇలా....'' డాక్టర్ ఆగాడు.

''సారీ డాక్టర్ గారూ.. ఇకపై ఆమెతో ఏమీ చెప్పను, ఏదీ అడగను'' తనను తాను సర్దుకునే దిశగా చిన్నబుచ్చుకుంటూ గొణిగినట్లన్నాడు.

''అదే వద్దనేది... పరిష్కారం లేని సమస్యలుండవు. అన్వేషణకు మార్గమెప్పుడూ తెరచే ఉంటుంది. సాదాసీదాగా కనబడే ఇంటి నిర్వహణ వెనుక కష్టపడే ఇల్లాలికి సహకారమందిస్తే మీకు ఆమె అందించే మద్దతు మీ ఒత్తిడిని మరిపిస్తుంది. కానీ కేవలం మీ సమస్యలను మాత్రమే ఏకరువు పెడితే- చక్కని ప్రతిబింబాన్ని ప్రతిఫలించాలనుకున్న అద్దమే పగిలిపోతుంది..''.

''ఆ మాట అనకండి.. మీరు డాక్టరే కాదు, మంచి సైకాలజిస్టు కూడా, మరి నా మిసెస్ కండిషన్...?అంటూ నమస్కరిస్తూ లేచాడు ఆనంద్.

''నథింగ్ టు వర్రీ... ఆమెను తీసుకెళ్లవచ్చు. ఇకపై ఆమె బి.పి. పెంచకండి..'' నవ్వాడు డాక్టర్.

''ఇంకానా..?'' మరోసారి చేతులు జోడించాడు ఆనంద్.

★

కథల పోటీలో ఎంపికైన రచన

రచయిత్రి ఫోన్ నెం: 98858 09250

నేర్చుకుందాం

ఉ. నావుడుఁ గృష్ణుఁ డమ్మగధనాధుని కిట్లను 'భూవరేణ్య! నీ భావము సూనృత వ్రత శుభస్థితి c జెందు టెఱుంగవచ్చె మా కీవలె నాజిభిక్ష! యితఁడింద్ర తనూభవుఁడే నుపేంఅదుఁడం బావని యీతఁ' డిం దొకని c బైకొని యెక్కటి పోరఁగా దగున్

భావం: జరాసంధుని మాటలు విని కృష్ణుడు ఇలా అన్నాడు. 'మహారాజా! నీ సత్య వ్రత నిష్టమాకు అవగతమయింది. మేము యుద్ధ భిక్ష కోరుతున్నాం. ఇతడు అర్జునుడు. నేను కృష్ణుడిని. ఇతడు భీమసేనుడు. ఇందులో ఒక్కనితో నీవు యుద్ధం చేయవలసి ఉంది. జరాసంధుని పోరు సల్పడానికి ఉద్యుక్తులై శ్రీకృష్ణునితో సహా బ్రాహ్మణ వేషధారులై యుద్ధమనే దానాన్ని గ్రహించడానికి బయలుదేరి జరాసంధుని దగ్గరకు వెళ్లి దాన మహత్వాన్ని చెప్పి వానిని యుద్ధానికి పురికొల్పగా జరాసంధుడు యుద్ధానికి ముందుకు వచ్చాడు.

పోతన భాగవతము - దశమ స్కంధము

స్పందన

42 **కె. ప్రమీలాజనార్దన్**

నీవు కోరుకున్న అమ్మాయి మీ అమ్మ గతాన్ని గుర్తుతెచ్చేదే అయినా ఆ అమ్మాయి తల్లి, ఆమె తల్లి గురించి కూడా తెలిసిన మనిషి భావన. తనను అభిమానించిన వాళ్ళు తనకు బాగా కావాల్సిన వాళ్ళవ్వబోతున్నారంటే ఎంతో సంతోషిస్తుంది. ఆమె సంతోషం శ్యామ్‌కింకా ఆనందం కలిగిస్తుంది.

మీ పెళ్లిళ్ళు చూడు... నేనే దగ్గరుండి ఎంత ఘనంగా జరిపిస్తానో'' అన్నాడు వరుణ్.

రెండు రోజుల తర్వాత తండ్రి తనకు ఫోన్ చేశాడు. ''ఏమిరా నువ్వు భయపడుతున్నావట.

నీవు ఇష్టపడ్డ అమ్మాయిని కేవలం గతం గుర్తుకు తెస్తుందన్న కారణంగా కాదంటామని ఎలా అనుకున్నావు.. జీవితమంతా కలిసి బ్రతకాల్సిన భార్య నీ మనసుకు నచ్చినదై మమతలు కురిపించేదై వుండాలి. నువ్వు ఇష్టపడ్డ అమ్మాయి విషయంలో మాకెటువంటి అభ్యంతరం లేదు. సరేనా..'' అంటూ నవ్వి ''మీ పెళ్లి పనుల బాధ్యత అంతా వరుణ్‌కు అప్పగించాను'' అంటూ కొడుకు భయాన్ని పోగొట్టాడు.

⁂

మనిషి జీవితంలో మార్పులు కొన్ని సహజంగా జరిగేవి. మరి కొన్ని అనుకోని విధంగా జరిగేవి... అనుకోకుండా జరిగేవి అమితానందాన్నో లేక అంతులేని దుఃఖాన్నో కలిగిస్తాయి..'' కోటేశ్వరరావుగారు భార్యకు వేదపాఠం చెబుతున్నట్లుగా చెబుతుంటే లలితమ్మ నిర్లిప్తంగా చూసింది.

''మనకు రెండూ అనుభవంలోకి వచ్చాయి. మన జీవితంలో మార్పు తెచ్చినదేమిటి? బాధ కలిగించే విషయమే గదా!'' అంటూ అతడివైపు చూసింది. సంతోషానికుండే సమయం తక్కువ. అందుకే ఫలితమూ తక్కువేననిపిస్తుంది. బాధ కలిగించే విషయాలు జీవితాన్నే మార్చేసేంత శక్తి కలిగి వుంటాయి...'' బాధ నిండిన స్వరంతో అంది లలితమ్మ.

''పిచ్చిదానా!'' ఓదారుస్తున్నట్టుగా అన్నారు కోటేశ్వరరావుగారు.

''సంతోషం కాలాన్ని మరిపించడంవల్ల నీకలా అనిపిస్తుంది. శరీరంలో ప్రతి అణువు ఆనందంతో పొంగిపోయినప్పుడు కాలం వేగంగా పరుగెత్తినట్లు అనిపిస్తుంది. బాధ మనసును మెలిపెడుతుంటే ప్రతి నిమిషం భారంగా అనిపిస్తుంది. అంతే తప్ప ఎక్కువ సమయం తక్కువ సమయం వుండడం కాదు''.

''అదేమో కాని అనుభవాలు ఆత్మీయులను దూరం చెయ్యలేవు. ఎండమావుల వెంట పరుగు తీసినట్లు జీవితం గడపడంలో శాంతి వుండదు'' అంది లలితమ్మ.

''నీ బాధ నాకర్థమయింది లలితా... ఇలా ఎన్ని రోజులో వుండము. మనం మళ్లీ సంతోషంగా వుండే రోజులు తొందరలోనే వస్తాయి. అనుకోకుండా జరిగే సంఘటనలు కొన్ని జీవితంలో మార్పు తెస్తాయన్నానుగదా! అలా జరిగింది శ్యామ్ రాక.. అదే శ్యామ్ అంటే మన భావన భర్త.. మనం ద్వేషించి వద్దనుకున్న వ్యక్తి.. మన కుటుంబ పరువు ప్రతిష్ఠలను మంటగలిసేలా చేశాడని మనం నిందించిన వ్యక్తి అతడు... మనకోసం కేవలం మనకోసం మనం అశాంతిగా వుండగూడదన్న తలంపుతో మనల్ని కలిసేందుకు వచ్చాడు. ఆ రోజును గుర్తుచేసుకో... అది జరిగి నాలుగు రోజులే గదా! ఇంతలోనే మరవగలమా...'' అంటూ కోటేశ్వరరావుగారు ఆ రోజు జరిగిన సంఘటనలు కళ్ళముందు కదులుతోంటే నోటితో చెబుతున్నారు.



⁂

కేదారేశ్వర ఘాట్‌లో స్నానం చేసి కేదారేశ్వర స్వామిని దర్శించుకొని అలాగే విశ్వనాధుడ్ని అన్నపూర్ణమ్మ విశాలాక్షి అమ్మవార్ల గుళ్ళకు వెళ్లి వచ్చి అలసట తీర్చుకుంటున్నారు కోటేశ్వరరావుగారు, లలితమ్మ.

ఇక్కడికి వచ్చినప్పటినుండి ఎప్పుడో తప్ప ఈ కార్యక్రమంలో మార్పు వుండదు. గంగాస్నానం దైవ దర్శనం మనసుకు ప్రశాంతతనిచ్చేవే. కాని వాళ్ళ మనసు అస్తవ్యస్తమై ఆలోచనల్లతో వుండడంవల్ల నిర్విచారంగా వుండలేకపోతున్నారు. అది తెలుసుకొని ఆలోచనలను తరిమెయ్యాలని ప్రయత్నిస్తున్నారు కాని సాధ్యం కావడంలేదు.

జరిగిన విషయం చిన్నదైతే అసలు తామింత దూరం వచ్చేవాళ్ళా.. ఎక్కడ రాములూరు.. ఎక్కడ వారణాసి.. ఇద్దరికీ అదే ఆలోచన..

పెద్ద కూతురు భర్తపోయాక మళ్లీ పెళ్లిచేసుకొని వస్తే కుటుంబ గౌరవం పోతుందని ఆమెను ఆమె భర్తను ఇంటి గడప తొక్కనివ్వలేదు. అలా చెయ్యడంవల్ల ''నిప్పును నీళ్ళతో కడిగేటువంటి వంశంలోవారు.. ఆ పెళ్లిని ఎలా అంగీకరిస్తారు?'' అనే కాదు, ''ఆయన అలా చెయ్యడంవల్ల మన ఊళ్ళో పిల్లలెవరూ అంత ధైర్యం చెయ్యరు'' అంటూ ఊళ్ళోవాళ్ళు చెప్పుకోవడం విని సంతసించారు. అలా తను కొందరికైనా తనలాంటి బాధ రాకుండా కొంత తోడ్పడగలిగానని సుకున్నారు.

కాని సృజన.. ఎంతపని చేసింది!

భావన పెళ్లి విషయం మరిచిపోయి కాస్త శాంతిగా వుంటున్న తరుణంలో కొడుకు కోడలి ఆకస్మిక మరణం.. మనసును కుదిపేసిందా సంఘటన. విధి రాత అది.. ఎవరు తప్పించగలరు? అనుకొని మనసును నిబ్బరించుకున్నారు.

-ఇంకావుంది

అధ్యాత్మ రామాయణం

- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

యుద్ధకాండ 211

అలంకారాలలో నేర్పరులైన వారెందరో తమ తమ గృహాలను సుందరంగా అలంకరించారు. అయోధ్య ప్రజలందరు రామ దర్శన లాలసులై గుంపులు గుంపుగా బయలుదేరారు. రామునికి సమర్పించడానికై పౌర జానపదులు లక్ష గుఱ్ఱాలు, పదివేల ఏనుగులు, బంగారు పగ్గాల పదివేల రథాలు ఇంకా రకరకాలైన ఐశ్వర్య సూచక వస్తు సామగ్రి తీసికొని బయలుదేరారు.

పల్లకీలపై రాణివాసం కూడా కదలింది. శత్రుఘ్నుడు తోడురాగా భరతుడు పాదుకలు శిరస్సున ధరించి కృతాంజలియై పాద చారిగా బయలుదేరాడు. బ్రహ్మ మనసుపడి నిర్మించిన చంద్రసమాన కాంతి ఉన్న సూర్య సదృశ ప్రకాశమున్న పుష్పక విమానం దూరం నుండే అందరికీ కనిపించింది. అప్పుడు హనుమంతుడు ప్రజలందరితో ఇలా అన్నాడు.

ప్రజలందరూ చూడండి! ఈ విమానంతో పాటే ఉన్న జానకీ సహిత వీర సోదరులు రామలక్ష్మణులున్నారు. కపిరాజు సుగ్రీవుడు, ఆయన మంత్రులు, ఇంకా విభీషణుడు తదితరులెందరో కనబడుతున్నారు.

అలా ఆంజనేయుడు చెబుతుండగానే, స్త్రీ బాల యువ వృద్ధులు- ప్రజలందరు రాముడు అడుగో! రాముడు అడుగో! (అడుగో! అల్లడుగో! శ్రీరాముడూ! రఘురాముడూ!) అంటూ కీర్తించారు; ఆనంద సముద్భవమై ఆ రామనామ గానం ఆకసం దాకా ప్రాకింది. అందరూ రథ- గజ- అశ్వాలను దిగారు. నేలపై నిలబడ్డారు; విమానంలోన ఆకసంలో చంద్రుని వలె ఉన్న రాముణ్ణి చూశారు; అందరినీ చూశారు.

భరతుడు ప్రహృష్టుడై అంజలి ఘటించి రాఘవునికి ఎదురుగా వెళ్లాడు. విమానంలోని రాముడు మేరువుపైనున్న సూర్యునివలె కనిపించాడు. అటువంటి రామునికి భరతుడు వినయ వినమితోత్తమాంగుడై నమస్కరించాడు. రాముని అనుజ్ఞననుసరించి విమానం క్రిందికి దిగింది. భరత శత్రుఘ్నులు విమానమెక్కారు. రాముని దగ్గరికి చేరి సంతోషంతో మళ్లీ మళ్లీ నమస్కరించారు.

చాలాకాలం తర్వాత కనిపించిన భరతుణ్ణి అగ్రజుడు రాముడు లేవదీసి ఒడిలో కూర్చుండబెట్టుకొని సంతోషంతో కౌగిలించుకున్నాడు.

ఆ తర్వాత భరతుడు లక్ష్మణుని దగ్గరకు వెళ్ళాడు. సీతాదేవి సన్నిధికి వెళ్లాడు. ప్రేమ భావం ఉప్పొంగుతుండగా తన పేరు చెప్పుకొని నమస్కరించాడు. సుగ్రీవ, జాంబవంత, అంగద, మైంద, ద్వివిద, నీల, ఋషభులను ఆలింగనం చేసికొన్నాడు. వారందరూ మానవ రూపాలు ధరించి భరతుని సాదర సత్కారాలందుకొన్నారు. సౌమ్యులూ, ప్రసన్నమతులూ అయిన వారెందరో భరతుణ్ణి కుశలమడిగారు. అప్పుడు మళ్లీ సుగ్రీవుణ్ణి కౌగిలించుకొని భరతుడు ఇలా అన్నాడు.

నీ సహాయం కారణంగానే రాముడు విజయుడయ్యాడు. రావణుడు హతమయ్యాడు. నీవు మా నలుగురకు ఐదవ సోదరుడవు సుమా! (సుగ్రీవ వానరాదులకింతకు మించిన గౌరవమింకేమున్నది) శత్రుఘ్నుడు సోదరులు రామలక్ష్మణులకు నమస్కరించి, సీతాదేవి చరణాలకు ప్రణమిల్లాడు.

తల్లిని చూచి రాముడు తెల్లబోయాడు. శోకపరితప్తురాలైన తల్లిదగ్గరికి వెళ్లాడు. వినయంగా ఆమె పాదాలు స్పృశించాడు. ఆమె ప్రసన్నురాలై రాముని తలనిమిరింది. అలాగే కైకేయికి సుమిత్రకూ తల్లులందరికి నమస్కరించాడు.

భరతుడు ఇన్ని రోజులుగా పూజించిన రామపాదుకలను రాముని పాదాలకు భక్తి యుతుడై తొడిగాడు.

- ఇంకావుంది

శనివారం 27 డిసెంబర్, 2014

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

• మేషం (అశ్వని, భరణి, కృత్తిక 1పా.)
మిక్కిలి ధైర్య, సాహసాలు కలిగియుంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు. మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. శతృబాధలు తొలగిపోతాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు.

• వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)
వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగా నుండుట మంచిది. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధ సేవ తప్పదు.

• మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)
బంధు, మిత్రులతో కలుస్తారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నం చేస్తారు. ధనలాభంతో ఋణ బాధలు తొలగిపోతాయి. కుటుంబ సౌఖ్యముంటుంది. శతృబాధలు దూరమవుతాయి.

• కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)
ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. ఆత్మీయుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. అజీర్ణ బాధలు అధికమవుతాయి. కీళ్లనొప్పుల బాధ నుండి రక్షించుకోవడం అవసరం.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)
ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. పిల్లలకు సంతోషాన్ని కలుగజేస్తారు. కళాత్మక వస్తువులను సేకరిస్తారు. బంధు, మిత్రులను కలుస్తారు.

• కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)
కుటుంబంలో చిన్న చిన్న గొడవలు వచ్చే అవకాశం ఉంది. పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోండి. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. ఆర్థిక ఇబ్బందులను అధిగమించుటకు ఋణప్రయత్నాలు చేస్తారు.

• తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా జాగ్రత్తగా నుండుట మంచిది.

• వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)
పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకోగలుగుతారు. పిల్లలపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తిరీత్యా గౌరవ, మర్యాదలు పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)
మనస్సు చంచలంగా ఉంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అకాల భోజనంవల్ల అనారోగ్య బాధలనుభవిస్తారు. ఆకస్మిక కలహాలకు అవకాశముంటుంది.

• మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)
తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యల్లో జాగ్రత్తగా నుండుట మంచిది. మోసపోయే అవకాశాలుంటాయి. ఆర్థిక పరిస్థితి ఆందోళనకరం మారుతుంది.

• కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)
అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. వ్యయ ప్రయాసలుంటాయి

• మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)
మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్న కార్యాలు సఫలమవుతాయి. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది.

పంచాంగం

శ్రీ జయ, ఉత్తరాయణం
హేమంత ఋతువు - పుష్యమాసం

తిథి: శుద్ధ షష్ఠి రా.7.06
నక్షత్రం: శతభిషం మ.1.31
వర్జ్యం: రా.7.31 నుండి 9.01 వరకు
దుర్ముహూర్తం: ఉ.06.00 నుండి 7.36 వరకు

మంచిమాట

ప్రణవం

ప్రణవానికి అధిష్ఠానం బ్రహ్మం. 'ప్రణవం' అన్నా, 'ఓం' అన్నాఒక్కటే. ఓంకారాన్ని అనుష్ఠించి బ్రహ్మను తెలుసుకోవాలి. చిన్న మఱ్ఱి విత్తనంలో పెద్ద చెట్టు ఇమిడియున్నట్లు, ప్రణవంలో ప్రపంచం ఇమిడి ఉంది. ఓంకారం నుండి అండపిండ బ్రహ్మాండం పుట్టింది. తత్వసాధనకు ఈ ఓంకారం యొక్క ఆలంబనమే శ్రేష్ఠం. ఇదే అత్యున్నతమైనది. ఇలా ఈ ఆలంబనం తెలిసిన సాధకుడు, కారణమైన జగద్భావంతో సహా కార్యమైన దుఃఖమునూ, జన్మనూ తన సాధన చేతనే విడిచి జయించి, బ్రహ్మ భావంను పొందుతాడు. అధర్వణ ఉపనిషత్తులో 'సర్వాన్ ప్రాణాన్ పరమాత్మని ప్రణామ యతీతి ప్రణవః' అనగా - మనము ప్రణవంను ఉచ్చరించునపుడు మన దేహేంద్రియ ప్రాణ, మనోబుద్ధులన్నియు అంతర్ముఖం నొంది, పరమాత్మయందు లయం నొందుట వలన ప్రణవం అనబడును. 'సర్వేషామేవ మంత్రాణాం ప్రణవః ప్రాణముచ్యతే' - సమస్త మంత్రములకు (సప్తకోటి మంత్రములు) ప్రణవం ప్రాణం లాంటిది. ప్రాణం లేని దేహం ఏలాంటిదో ప్రణవం లేని మంత్రం అలాంటిది. 'ప్రణవాదపరం జప్త్వా కదా ముక్తో భవిష్యతి' ప్రణవం లేకుండా మంత్రం జపించిన ముక్తి కలుగదు. ఓంకారమే ఆత్మ, బ్రహ్మం ఈ కల్పిత నామరూప ప్రపంచం కూడా ఓంకారమే. ఓంకారమందున్న అకార, ఉకార, మకార మాత్రలు అసలు ఓంకారం నందు కల్పితము. ఈ ఓంకారమునకు ఎనిమిది అంగములు, నాలుగు పాదములు, మూడు స్థానములు, పంచదైవతములు గలవని ఎరుగవలయును. ఇట్టి ఓంకారంను ఎరుంగని వాడు బ్రాహ్మణ శబ్దమునకు అర్హుడు కాడు. అనగా బ్రహ్మం ఎరుంగజాలడని భావం.

విశేషార్థం: అష్టాంగములు అనగా- జీవుని అంగములు నాలుగు. 1.విశ్వుడు 2.తైజసుడు 3.ప్రాజ్ఞుడు, 4.ప్రత్యగాత్మ. ఈశ్వరుని అంగములు నాలుగు-1.విరాట్ 2.హిరణ్యగర్భ, 3.అవ్యాకృత 4.పరమాత్మ- ఇవి అష్టాంగములు అనబడును. చతుష్పాదం అనగా 1.అకారం 2.ఉకారం, 3.మకారం, అర్ధమాత్ర. త్రిస్థానం అనగా 1.జాగ్రదావస్థ 2.స్వప్నావస్థ 3.సుషుప్త్యవస్థ

(1.హృదయం 2.కఠం, 3.భ్రూమధ్యం) పంచదైవతం అనగా -1.బ్రహ్మ, 2.విష్ణు 3.రుద్ర, 4.సదాశివ, 5.మహేశ్వరుడు-అనగా ఓంకార ధ్యానం చేత ఆ బ్రహ్మస్తంబ పర్యంతం అనగా- చరాచర బ్రహ్మాండమంతయు ఈశ్వరమయమనియు, జ్ఞానం కలుగునని భావము. ఈ ఓంకార మహిమను గురించి శృతి స్మృతులలో అసంఖ్యాకముగా చెప్పబడినది. సకృదుశ్చరిత మాత్రా ఊర్ధ్వమున్నా మయతీత్యోంకారః'' అనగా ఒక్కసారి 'ఓం' శబ్దమును ఉచ్చరించినంత మాత్రాన మనస్సును ఊర్ధ్వగామిగా, అనగా బ్రహ్మరంధ్రంను చేర్పించుటను బట్టి ఓంకారం అనబడును. 'ఓంకారం సర్వ మంత్రాణా ముత్తమం పరకీర్తితః' అనగా- ఓంకారం సమస్త మంత్రములలో ఉత్తమోత్తమమైనదని మహర్షులు కొనియాడుచున్నారు. వేదములు స్తోత్రం చేయుచున్నవి. ఇట్టి ఓంకారంనే నిజమైన తారకమంత్రం అనబడును. బ్రహ్మ బుద్ధితో తన్ను తెలుసుకొన్నవారిని, జనన, మరణ, జరా మృత్యు రూపమగు భయంకర సంసార సాగరం నుండి తరింపజేసి సంరక్షించునది ఓంకారమే. శ్రీ శంకరాచార్యులు 'అవతి బ్రహ్మబుద్ధ్యా దృష్టః దష్ట్రూన్నితి ఓం' అని నిర్వచనమొనర్చిరి. 'ఓమిత్యే కాక్షరం బ్రహ్మ' (గీత అ। 8 శ్లో। 13) 'ప్రణవస్సర్వవేదేషు' (గీత అ।7 శ్లో। 8) 'తస్యవాచకః ప్రణవః' (పాంతజియోగ సూత్రం) ఓంకారం గురించిన ప్రమాణ శాస్త్రములు ఎన్నో ఉన్నవి. పరబ్రహ్మ పరమాత్మను పొందుటకు ప్రణవ మంత్రధ్యానం, దాని అనుసంధానం ముఖ్య కర్తవ్యమై యున్నది. తక్కిన మూర్తి ధ్యానములన్నియు దీని యందే లయించియుండును. ఈ ఓంకారం సముద్రం వంటిది. నదులన్నియు సముద్రంలో లీనమగునట్లు, ఇతర దేవతా ధ్యానములన్నియు ఓంకారంనందే లయమొందునని భావము. బ్రహ్మ తత్వంను సూచించే ఓంకారమును తత్వార్థపరముగా ఉచ్చరిస్తూ, భగవంతుని స్మరిస్తూ, ఏ సాధకుడు దేహంను విడుస్తాడో ఆ సాధకుడు పరమగతిని పొందుతాడు.

-అంకం రాములు

సత్యభామ

53 బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ **593** **మాటాట**

ఆధారాలు

ఆధారాలు: 85

అడ్డం
1. విష్ణువు, ఆయుధ ధారి
6. గుంపు
7. ఒక రాశి త్రాసు గుర్తు
9. జీవి
10. చెయ్యి
11. భార్య
12. శత్రువు
14. మోక్షం
15. సమీపించెను
17. రాజులకే రాజు

నిలువు
2. వరుస
3. చెట్టు
4. సూర్యుడు
5 స్వారీ చేసేవాడు
8. కెరటం
9. వయసు
12. పాండిత్యం
13. అడుగు నుంచి జారెను
15. చేరాతల కర్త
16. పెరుగు

మాటాట - 592 సమాధానం



కొత్త పుస్తకం

భక్త కవయిత్రి మీరా
మధుర భక్తిధార
-పింగళి పాండురంగరావు
వెల: రూ.20/-
ప్రతులకు: రచయిత
'సాహితీ మంజరి'
8-71, లాయరుపేట,
ఒంగోలు - 523 002.
9440 55 41 14

దింపుడు ఖలము
(దీర్ఘ కవిత)
-బరకు
వెల: రూ.25/-
ప్రతులకు: రచయిత
833 28 54 601
(అన్ని ప్రధాన బుక్‌స్టాల్స్‌లో)

పద కవితా చక్రవర్తి
మహాకవి క్షేత్రయ్య
-పింగళి
వెల: రూ.20/-
ప్రతులకు: రచయిత
9440 55 41 14
kripanidhiom@gmail.com

అక్షరాలలో ఒదిగిన వ్యధార్థ కథలు

ఆధునిక సమాజం ముసుగులో ప్రపంచంలో వస్తున్న మార్పుల్ని కథలుగా చిత్రిస్తే ఎలా ఉంటుందో తెలియజెప్పే సంకలనమే 'కథా వార్షిక- 2012' మానవ జీవితాల్లోని పలురకాల కోణాల్ని ఇది బహిరంగంగా వ్యక్తపరుస్తుంది. ఈ లోతుపాతుల్ని తెలుసుకుని వీటిలోని కష్టనష్టాల తడిని పలకరించాలంటే ఒక్కసారి మనసు చూపుతో చుట్టిరావాల్సిందే!

తర్కబద్ధమైన హేతువాదానికి మానవీయ కోణాన్ని కర్తవ్య నిర్వహణ బాధ్యతారూపంలో ప్రకటించిన కథలాంటి.. జీవితం కథ 'దేవుణ్ణి అటకాయించిన మనిషి' దీని రచయిత మెహర్ గొప్ప ఆశను కలిగిస్తుంది.

బహుళజాతి సంస్థ తమ పునాదులను పటిష్టం చేసుకోవడానికి భారతదేశంలోని ఆంధ్రరాష్ట్రంలో నాగరాజనే వ్యాపార విషయాల ఇన్‌చార్జి వేసిన పథకానికి, గ్రామస్థాయిలోని సామాన్య ఉమ్మడి ప్రతినిధి తిప్పణ్ణ చేతిలో ఏవిధంగా పరాభవం చెందాడో చాటి చెప్పేదే 'ఒక దళారీ పరాభవం' కథ. జి.ఉమామహేశ్వర్ రాసిన ఈ కథ సామ్రాజ్యవాదంలో భాగంగా ప్రపంచీకరణ పేరుతో జరుగుతున్న మోసానికి నిలువెత్తు దర్పణంలా నిలుస్తుంది.

'గోమేజ్ ఎప్పుడొస్తాడో' కథను వేలూరి వెంకటేశ్వరరావు రాసారు. అమెరికా నేపథ్యంలో రాసిన ఈ కథ గోమేజ్ లోపలి మనిషిని పరిచయం చేసి మనిషితనానికి సంబంధించిన ఒక ఆశను మనలో మిగిల్చిపోతుంది.

కథాంశానికి వస్తే-ఇంటి బయట ఉన్న లాన్‌ని కొయ్యడానికి గోమేజ్‌ని బేరమాడుకుంటారు సుజాత-కేథరిన్‌లు. గోమేజ్‌కు తోడుగా మార్సిలినోను తెచ్చుకుని ఆడుతుండగా మోవర్ పల్టీకొట్టి గోమేజ్‌కు గాయమై రక్తస్రావం కావడంతో హాస్పటల్‌లో జాయిన్ చేస్తుంది సుజాత. కానీ అతనక్కడినుండి పారిపోతాడు. వెతుక్కుని వెళ్లినా ప్రయోజనం కనిపించక ఆశవదులుకుంటుందామె. కొన్ని రోజుల తరువాత ఒక ఉత్తరాన్ని చదువుతుంటే-గోమేజ్ మాటలు గుర్తుకొచ్చి మనసు తడితో కంటనీరు పెట్టుకోవడంతో ఈ కథ ముగుస్తుంది. గొప్ప మానవతా దృక్పథం తొణికిసలాడి చెరగని ముద్ర వేస్తుందిది.

'కాశాపు కథ' గొప్ప శిల్ప వైవిధ్యంతో కొనసాగుతుంది. దీని రచయిత్రి మన్నం సింధుమాధురి.

'కలాపు' అని పిలువబడే 'బిసివిని' గౌడుతోపాటు అనేక మంది అనుభవిస్తూ కాలం వెళ్లదీస్తుంటారు. ఈ క్రమంలో ఓ కొడుకు పుట్టాక, వాడు పెరిగి పెద్దవాడై అనుకోని రీతిలో గౌడు మిత్రుణ్ణి చంపి పారిపోతాడు. కొన్నాళ్లకి కాటి పాపడితో కలాపు లేచిపోయిందనే పుకారు గౌడుద్వారా లేస్తుంది. జోగిని వృత్తిలో ఉండే వారి జీవితాల్ని, ఎదురైన చేదనుభవాల్ని చాలా ఆర్ద్రంగా, విషాదభరితంగా ఈ కథ రూపుకడుతుంది.

మంచి కథాకథనంతో ఆద్యంతం రక్తికట్టించే కథ 'కొన్ని నక్షత్రాలు కాసిన్ని కన్నీళ్లు'. విమల రాసిన ఈ కథలో ఒకనాటి జ్ఞాపకాల సంఘటనను నెమరేసుకుని దాని మూలాలు వెతుకులాట కనిపిస్తుంది.

ఇతివృత్తానికొస్తే..ఉద్యోగరీత్యా కొన్నేళ్ల క్రితం ఆమె పనిచేసిన ప్రాంతంలో ఎన్నికల గందరగోళ స్థితిలో, ఉద్యమకారులు తిరుగాడు

కథా వార్షిక - 2012
మధురాంతకం రాజారాం
సాహిత్య సంస్థ
వెల: రూ.60/-
ప్రతులకు: డా.ఎం.నరేంద్ర
15-54/1, శ్రీ పద్మావతినగర్,
తిరుపతి-2.
మరియు
విశాలాంధ్ర పబ్లిషింగ్ హవుస్
అన్ని బ్రాంచీలు

తుండగా- కొంతమంది కుర్రకారు వేర్వేరు బాధ్యతలతో గుంపులుగా విడిపోతారు. అందులో తిరుపతి, మాధవులు ముఖ్యులు. మాధవ ప్రేమించిన అమ్మాయి జ్యోతి. వాళ్ల పెద్దలు అంగీకరించరు వాళ్ల ప్రేమను. కానీ ఈలోగా అప్రయత్నంగా పోలీసు కాల్పుల్లో కుర్రాళ్లిద్దరు మృతి చెందుతారు. ఇవన్నీ పెళ్లిలో కలుసుకున్న ఆమెతో జ్యోతి భోజన సమయంలో కలుసుకుని గతాన్ని తలుచుకుని బాధపడుతుంది. అందులో భాగమే ఒకనాటి నక్షత్రకాంతి, అవ్యక్తానంద స్థితికి వెదుకులాటకి దారి తీయిస్తుంది. విషాదరేఖలు పురివిప్పి ఆర్ద్రపూరితమైన ముగింపునిస్తాయి.

ఒక ప్రధాన పాత్రతో కథను నడిపిస్తునే మధ్యమధ్యలో శివాని, బసంతి లాంటి చిన్నచిన్న పాత్రలతో జ్ఞాపకాల మధ్య అన్వేషిస్తుంటే అసంపూర్ణ జీవితానికి నిర్లిప్తత, పశ్చాత్తాప భావన వెదుకులాట వెంటాడుతాయి 'వాంగ్మూలం' కథలో. వీటికి కొసమెరుపుగా ఒక ఆత్మహత్య మరణ వాంఛతో ఊపిరాడని తనాన్ని మిగుల్చుతుంది ఇందులో. చాలా వైవిధ్యపూరితమైన కథనం కనిపిస్తుంది. శిల్పరహస్యం కూడా కొత్తగా అనిపిస్తుంది. స్వాతికుమార్ దీనిని రాసిన రచయిత్రి.

అంటరానితనం కేంద్రంగా శ్రమ జీవన ప్రాధాన్యతను వివరించి చెప్పిన కథ 'కాకికి కడివెడు పిచ్చిక్కి పిడికెడు' కథ. స.వెం.రమేశ్ రాసిన శైలి సరళమైంది. సున్నితమైంది. కాకమ్మకు అమ్మను, పిచ్చుకమ్మకు మంగమ్మను ప్రతీకగా చేసి ఇద్దరు తల్లుల బిడ్డలతో నాలుగు తరాల మనుషుల చరిత్రను చిత్రించిన తీరు అబ్బురపరుస్తుంది. అందర్నీ చదివింపచేస్తుంది.

'కథలు లేని కాలం' కథను రాసిన రచయిత్రి ఓల్గా. ఎనిమిదేళ్లు పెంచిన మనుమరాలు అనన్య తిరిగి ఎనిమిదేళ్ల తరువాత అమెరికా నుండి తిరిగి వస్తుంది. గతంలో అమ్మమ్మ చేత కథలు చెప్పించుకోవడానికి అలవాటు పడిన ఆ పిల్లకి, కొన్నేళ్ల తర్వాత కొత్తగా కథలు మార్చి చెప్పడాన్ని జీర్ణించుకోలేకపోతుంది. అనన్యకి అమ్మమ్మైన సుమిత్ర ప్రేమించి పెళ్లి చేసుకుని పల్లె జీవితంలో రంగారావుతో స్థిరపడిపోవడాన్ని ఇష్టపడని కూతురు శ్రావణి, కొన్నేళ్లకు బాగా చదువుకుని వేరొకతనిని పెళ్లి చేసుకుని అమెరికా వెళ్లిపోతుంది. అలా శ్రావణికి పుట్టిన కూతురు అనన్యతోనే ఈ కథంతా నడుస్తుంది. కథన చిత్రణలో విలక్షణమైన కొత్త పార్శ్వాలను తడిమి చూపారు. ఇందులో రచయిత్రి ఓల్గా ప్రత్యేక ముద్ర తప్పక కనిపిస్తుంది.

'దావత్' కథ మహమద్ ఖదీర్‌బాబు శిల్ప నిర్మాణ పద్ధతిని కొత్తకోణంలో పాఠకులకు పరిచయం చేస్తుంది. ఆడ ముస్లిం పెళ్లింట జరిగిన భోజన కార్యక్రమంలో భాగంగా తిండి విషయంలో తలెత్తిన చిన్న తగాదా చివరికి పరిస్థితిని ఏ స్థాయికి దిగజారుస్తుందో తెలియజెప్పే కథ ఇది. మగపెళ్లి వాళ్ల పెత్తనం అన్నింటా ఆధిపత్య ధోరణి కలిగించి అస్లాం లాంటి తండ్రుల పాలిట ఎలా శాపంగా మారుతుందో ఇది వివరిస్తుంది. చాలా సహజంగా సాగి జీవన సత్యాన్ని ఆవిష్కరింపచేస్తుంది.

ఇలా వస్తు వైవిధ్యం పుష్కలంగా కలిగిన ఈ కథలు జీవన సంఘర్షణలను ఎత్తి చూపడమే కాకుండా, అందులోని కరుణ రసాత్మక దృశ్యాలను ఆకర్షీకరించి ఆలోచింపచేస్తాయి. డా.వి.చంద్రశేఖరరావు గారు ఒక కథా సమయంలో పేరుతో ఈ కథలపై ఇచ్చిన విశ్లేషణలు సమగ్రంగా, సందర్భానుసారంగా మానవతా పరిమళాలను అద్ది ఈ కథావార్షికకు నిండుదనాన్ని చేకూర్చాయి. ఇందులోని తొమ్మిది జీవన చిత్రాల్ని ప్రతిబింబించి సాహిత్య లోకానికి కొత్తదారులు తెరలు తెరిచాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

-బులుసు సరోజినీదేవి

నవ్విన ధాన్యరాశి
(కథల సంపుటి)
- సి.వేణు,
వెల: రూ.116/-
స్వచ్ఛత ప్రచురణ
నెం.19, సీకలాస్,
గార్డెన్ లేఔట్, పరంగిపాల్య,
హెచ్.ఎస్.ఆర్. లే అవుట్
రెండో సెక్టార్,
బెంగుళూరు- 560102.

విషాద ఛాయల మాటున..

దాగిన విలువలెన్నో!

'నవ్విన ధాన్యరాశి'... సి.వేణుగారి పాత, కొత్తల ఇరవై కథల సంపుటి. చిత్తూరు జిల్లా సాక్షరతా సమితి వారి 'అక్షరభిక్షకై రాసిన కథలు కూడా ఇందులో వున్నాయి. ఇందులోని కథలు ఎక్కువగా విషాదఛాయల్లో కానవస్తాయి. వృత్తి రీత్యా తెలుగు ఉపాధ్యాయులైన వేణుగారు ఎనభై ఎనిమిదేళ్ళ ప్రాయంలో ఈ గ్రంథాన్ని వెలువరించడం బహుధా అభినందనీయం. కవిగా, కథకునిగా తన సాహితీ ప్రియత్వాన్ని చాటుకున్నవారు వేణుగారు. 1961లో ఆంధ్రపత్రికలో 'మారెమ్మ గుడి' ఆయన తొలి కథ. అదీ విషాదాంత గాథే! 1962 ఆంధ్రప్రభ దీపావళి కథల పోటీలో 'నవ్విన ధాన్యరాశి' కథకు ప్రథమ బహుమతి లభించింది.

"ఈ ప్రాంతపు సాహితీ వికసనానికి
మీ నవ్విన ధాన్యరాశి ఒక మజిలీ
తియ్యందనాలకు మీ కలం కాణాచి
మీరు మట్టిని సైతం బంగారంగా మార్చగలరు"

-అంటూ ప్రముఖ కథారచయిత కీ.శే.మధురాంతకం రాజారాం గారి ప్రశంసలందుకున్నారు వేణు. ఈయన కథల్లోని పాత్రలు సమాజంలోని సాదాసీదా మనుషులే! అమానవీయ ఘటనలకు బలైనవారు కనిపిస్తారు. అందం, ఆనందంలానే దుర్మార్గమూ, దౌష్ట్యమూ సమాజంలో సహజాలన్నది ఆయన రచనాధోరణి. అందుకే విషాదాంతాలుగా ముగిసే కథలు ప్రధానంగా కానవస్తాయి.

విషాదాంత కథలే అయినా- భవభూతి అన్నట్లు 'ఏకోరసఃకరుణఏవ' అన్నట్లుగా, బ్రతుకులో 'కరుణ' ప్రాధాన్యాన్ని కరతలామలకం చేసే కథలివి. **"చెమ్మగిలని కనులు బ్రతుకు కమ్మదనము చూడలేవు. చెమ్మగిలని కనులు బ్రతుకుకమ్మదనము చాటలేవు"** అని కాళోజీ అన్నట్లు గ్రామీణ జీవితంలోని 'ఆర్ద్రతను, మనుషుల్లోని ఉదారతను, మంచితనాన్నీ- అదే సమయంలో బ్రతుకుదౌష్ట్యాన్నీ విశదపరిచే కథలివి.

'గూడు చేరిన పిట్ట', 'తెలియని జవాబు', 'లక్ష రూపాయలు' వంటి కథలన్నీ చదివిస్తాయి. ఇతర కథలలో తనకన్నా ఎక్కువ సంపాదించే శాంతిపై 'మేల్‌ఛావనిజం' చూపబోయిన నారాయణకు ఆమె 'కనువిప్పు' కలిగేలా ఏంచేసిందీ, 'చితాభస్మం' కథలో రాయుడు కోపమే నారాయణుడు కోరికను చివరికెలా తీర్చిందీ, 'కూతుళ్లను కంటే తప్పులేదు. ఫలానికి వస్తూనే సమయం చూసి ఒక ఇంటిదాన్ని చేసేయాలి' అన్న 'రెడ్డప్ప తీర్పు' కథ- రచయితలోని మారిన సమాజంలోని మారని విలువలకు అద్దం పడుతూనే, చదివించే కథలుగా వున్నాయి.

ఇవన్నీ గొప్ప కథలు, ఈనాటితరం మెచ్చే కథలూ కాకపోవచ్చు. కానీ, తొలితరం చిత్తూరు జిల్లా కథకుడిగా రైతు వెతల్ని ఆనాడే కథనాగతం చేసిన కథా 'చిత్రభానుడు' ఈ వేణు. తొమ్మిది పదుల వయసులోకి వెడుతూ తన కథలనిలా 'నవ్విన ధాన్యరాశి'గా రాశిపోసినందుకు సీకల వేణుగోపాలరెడ్డిగారికి మనసా అభినందనలు.

-సుధామ

పరిచయం..

సామాజిక పరిణామ క్రమంలో, వ్యక్తిలోని శక్తి కేంద్రీకరణ అనేక స్థాయిల్లో ఉంటుంది. ఈ శక్తి కేంద్రీకరణ విషయంలో అత్యున్నత స్థాయికి చెందిన వ్యక్తి వివేకానందుడు. ఆయన చికాగో సర్వమత మహాసభలో మాట్లాడినప్పుడు, ఆయన ప్రసంగానికి, సభ్యులందరూ లేచి నిలబడి చప్పట్లు చరి, పూర్తిగా వశీకృతులయ్యారు. ఆయన ప్రసంగం చిన్నదే. చెప్పిన విషయాలూ లోతైనవి కాదు. ఇచ్చిన సమయంలోనే క్లుప్తంగా చెప్పాడు. మరెందుకు అంత వశం చేసుకో గలిగాడంటే, దానికి కారణం ఆయన మాటల్లోని శక్తి ప్రసారమే. అవే మాటలు మరొకరు చెప్తే, ఆ గౌరవం రాదు. అతని ప్రతి మాటా కూర్చున్న వారి అంతరంగంలోకి ప్రసారమైనై. ఇది ఆ మాటల శక్తి కాదు. అతని సంపూర్ణ వ్యక్తిత్వం తాలూకు శక్తి. ఆయన మతోద్ధరణాది ఆధ్యాత్మిక అంశాల్ని అలా ఉంచితే, భౌతికత్వానికి సంబంధించిన ఆయన ప్రతిపాదనలు, సామాజిక తత్వానికి సంబంధించిన, ఆయన విశ్లేషణలూ ఈనాటికీ ప్రజల్ని ఉత్తేజితుల్ని చేస్తై. ఆయన మాట ఒక శక్తి తుఫాను. పుస్తకంలో చదివినా, అవి మనల్ని అపూర్వంగా ప్రభావితం చేస్తై. ఇలాంటి ఉత్తేజంతో గింజల నరసింహారెడ్డి వివేకానందునిపై ప్రశంసాత్మకంగా 'విశ్వగీతి - వివేకానంద స్మృతి' అనే పేరుతో పద్యసంపుటిని అందించారు. ఈ పుస్తకంలోని ప్రతి పద్యంలో నరసింహారెడ్డి వివేకానందుని వలన పొందిన ఉత్తేజం ప్రతిబింబిస్తుంది.



విశ్వగీతి
వివేకానంద స్మృతి
-గింజల నరసింహారెడ్డి
వెల: రూ.40/-
ప్రతులకు: రచయిత
ఇం.నెం.3-72,
కోటబురుజు బజార్
నకిరేకల్,
నల్గొండ-508 221
08682 - 252428

వివేకానందుని పరిచయంతో అనేక మందిలో కలిగిన పరివర్తనల్ని ఈ దేశంలోని వారే కాదు, పరదేశీయులు కూడా, అద్భుతమైన విషయాన్ని తమ అనుభవాల్ని రాశారు. ఆయన తన చుట్టుపక్కల వారిపై చూపే ప్రేమ, ప్రసరించే ప్రభావం అంత గొప్పవి. స్వామిని గురించి, ఆయన గొప్పదనాన్ని గురించి, మంచి కావ్యాన్ని అందించారు నరసింహారెడ్డి.

★

వర్తమానానికి కాల 'దర్పణం'...!

కలానికి కాలానికి వున్న మధ్య దూరాన్ని కవిత్వం కొలుస్తుంది. ఇది జీవితం చేసే సంభాషణపై ఆధారపడి వుంటుంది. ఈ తాకిడి కుదుపులతో ఎత్తి కుదేసినపుడు బతుకు అసలు రంగు బయటపడుతుంది. నిజాలు నిగ్గుతేలి మాటలు అక్షరాల రూపంలో ఒలికి ధారకడతాయి. అలా ఒడిసి పట్టుకున్న జీవితపు అంచుల రంపుకోతే చివరికి 'దర్పణం' అనే కవితా సంపుటికి దారితీసింది. దీనిని రాసిన కవి డా.ఎ.వి.వీరభద్రాచారి.



దర్పణం
కవితాసంపుటి
డా.ఎ.వి.వీరభద్రాచారి
వెల రూ.100/-
ప్రతులకు:
విశాలాంధ్ర బుక్‌హౌస్,
ప్రజాశక్తి, నవోదయ బుక్ హౌస్, దిశ పుస్తక కేంద్రం,
నవోదయ పబ్లిషింగ్ హౌస్

"సుఖ దుఃఖాలకు/ ప్రేమ ద్వేషాలకు
నువ్వే కారణం
ఈ రహస్యం తెలిస్తే/ జీవితాన్ని వృథాగా ఖర్చుచేయవు"

అని అంటారు 'వ్యక్తిత్వ నిర్మాణం' కవితలో. జీవితంలోని అతి సున్నితమైన పార్శ్వాలను విడమర్చి, విశ్లేషించి, వివరించి చెప్పడంలో అందెవేసిన చెయ్యి వీరభద్రాచారిగారిది. సూక్ష్మంలో వున్న మోక్షం పరమార్థ రహస్యాన్ని బోధించడంలో ఆరితేరినతనం ఇందులో కనిపిస్తుంది. కాలాన్ని విలువైన సమయంగా మలుచుకొని జీవితంలో ఒదిగిపోయే తత్వం దీనిలో ఇమిడిపోయి ఇంకిపోయినట్టు అనిపిస్తుంది.

"పద్యం పక్షిలా గాల్లో ఎగురుతుంది
రేపటి వాళ్ళ భవిష్యత్తుకోసం
పద్యం తలకట్టు అవుతుంది
సూర్యోదయంతో చిగురిస్తుంది
మట్టిపొరల్లో నుంచి
మొలకెత్తే విత్తనంలా దూసుకొస్తుంది
చెట్టై నిలుస్తుంది"

ఈ రకమైన అభివ్యక్తీకరణ ఆశాజనకమైన చూపును లోకానికి ప్రసాదించి మనసుని ఉత్తేజపరుస్తుంది. భవిష్యత్తుపై భరోసాని నింపుతుంది. పద్యానికున్న అంతర్లీన శక్తిని రుజువు పరచడంలో ఈ కవి పడే ఆరాటం వర్ణనాతీతం. వ్యవస్థీకృతం. వ్యధాభరితం. కవిత్వ ప్రపంచానికి చేసే దిశానిర్దేశం. ఏది ఏమైతేనేం ఆత్మగతాన్ని, ఆవిష్కరించడం జరిగింది కదా- ఇక ఉచ్ఛ్వాసనిశ్వాసాలన్నీ, భవిష్యత్తు స్వప్నంమీదే విస్తరించి వుంది. కాదనలేక అవుననకుండా ఎలా వుండగలుగుతాం? Poetry communicates foreheads of the vision. ఈ తత్వమే ఇక్కడ కూడా ప్రతిబింబిస్తుంది.

"తెరుచుకున్న
ఉదయపు కిటికీలోంచి
సూర్యుడు
గొంతెత్తి పిలుస్తున్నాడు" అని అంటున్నపుడు రూపుకట్టే అంతర్లీన భావన కొత్త చైతన్యానికి పిలుపునిస్తుంది. శోకమయ లోకాన్ని మేలుకొలుపుతో తట్టిలేపి, శాప విముక్తిని కలిగించి, సుఖమయ జీవనానికి బీజంవేసే పనిలో పడతారు కవి వీరభద్రాచారిగారు. అంటే- Negative concious నుంచి Positive Direction- లోకి వ్యక్తిత్వాన్ని మళ్ళించేందుకు చేసే ప్రయత్నమన్నమాట. ఇది చివరికి సత్ఫలితాన్నే అందిస్తుంది.

ఇలాంటివే మరికొన్ని ప్రయోగాత్మకమైన కవిత్వ వాక్య నిర్మాణాలు అక్కడక్కడా మనకు తారసపడతాయి. వీటిలోని సాంద్రత, తాజాతనం, నిర్వలత్వం సహజసిద్ధంగా, అక్షర సత్యాలుగా వికసిస్తాయి. మచ్చుకు కొన్ని రుచి చూద్దాం.

"జ్ఞాపకాలను నెమరేస్తూ పోతున్నా/ పంట కాలవకు నీళ్లు ఒదిలినట్టు", "పొద్దుటి పూట ఎండ/ సన్నగా కిటికీలోంచి తొంగి చూస్తుంది", "యుద్ధం ఎవరు మొదలుపెడితే ఏం/ యుద్ధం యుద్ధమే", "ఆమె ఒక దృశ్యం/ ఆ మహాలోకపు చీకటి దుఃఖపు తెరలను తొలగిస్తూ/ చలించిపోతూ కదిలిపోతుంది" అన్న వాక్యపంక్తులు సరళత్వంలోని సూటిదనంతోపాటు సాధారణ పదజాలాన్ని అసాధారణంగా చిత్రించే ప్రయత్నంగా అవగతమవుతుంది.

దృశ్యం ఏదైనా జీవితాన్ని కదిలించేదే! వ్యవస్థను అక్షరబద్ధంచేసి కాలానుగుణంగా మలిచి ప్రక్షాళనతో ఊహకు పదునుపెట్టేదే! కాబట్టే అక్షరం బతుకుతో యుద్ధం చెయ్యడం మొదలుపెట్టింది.

-మానాపురం రాజా చంద్రశేఖర్

దాశరథికి ఘన నీరాజనం

డా.జలంధరరెడ్డి మహాకవి దాశరథి గురించి పెద్దఎత్తున సదస్సు నిర్వహించి ఆ ప్రసంగ పత్రాలతో ఒక బృహద్గ్రంథాన్ని వెలువరించారు. పాత పత్రికల్లో వచ్చిన వ్యాసాలన్నింటిని ఎంతో శ్రమకోర్చి సేకరించి 800 పుటల మరో గ్రంథాన్ని ప్రకటించారు. ఈ రెండు పుస్తకాలు దాశరథిని గురించి మాట్లాడే వారందరికీ ప్రధాన ఆధార గ్రంథాలుగా నేడు ఉపయోగపడుతున్నాయి. జలంధర రెడ్డి అం తటితో ఆగక రుద్రవీణపై కోటి రాగాలు పేరుతో దాశరథికి 81 మంది కవులతో కవిత్వ నీరాజనాన్ని సమర్పించారు.

దాశరథీ! మనోజ్ఞ కవితాశరథీ! శరదిందు చంద్రికా
పేశల కావ్యఖండముల పండిన నీ కలమందునన్ మహో
గ్రాశనిపాతముల్ వెలయునౌర! మహేశుని కంటిలో సుధా
రాశి తరంగముల్ కటు హలాహల కీలలు పొంగినట్లుగా.
(పుట.27).

-అన్న డా.సి.నారాయణరెడ్డి "జలపాతం" అంకిత పద్యాలు ఈ గ్రంథానికే మకుటాయమానం. నారాయణరెడ్డి దాశరథిని అగ్రజునిలాగ భావించారు. "అన్నలు లేని చింత హృదయాంతికమందు జనింపకుండా చేసి తమ్ముడాయని మనస్సుమముల్ విరబూయ" సినారెను సంభావించిన వ్యక్తి దాశరథి.

మద్దూరి రామమూర్తి, ఆశావాది ప్రకాశరావు, ఉన్నత జ్యోతివాసు, రామడుగు వెంకటేశ్వరశర్మ, ఎన్.యాదగిరి శర్మ లాంటి వారి పద్యాలు. టి.వీ. భాస్కరాచారి, వేదాటి రఘుపతి లాంటి వారి గేయాలు, అనిసెట్టి రజిత, దర్భశయనం శ్రీనివాసాచార్య, గిరిజా మనోహరబాబు, తిరునగరి లాంటి వారి వచన కవితలు అలరిస్తాయి. దాశరథి పట్ల ప్రశంసోక్తులు పలకడం, ఆయన పుస్తకాల పేర్లు వచ్చేలా రాయడం, ఆయన కవితా పంక్తులను కూర్చడం లాంటి వ్యూహాలను కవులు అనుసరించారు.

"వీధిలో నడుస్తుంటే కనిపించనంతటివాడు, కవిగా వీధిలోకి వస్తే శృంగాయమానంగా కనిపించే ధీరుడు"అంటారు కనపర్తి రామచంద్రాచార్యులు (పుట. 182). "ప్రాచీన అర్వాచీన కవిత్వానికి వారధి ఒళ్ళంతా కవిత్వం, మనసంతా కవిత్వం అన్ని రసాలను గుప్పించి మెప్పించడం అతని తత్వం" (పుట.199) అంటూ జి.వెంకటేశ్వర్లు దాశరథిని ప్రస్తుతించారు.

రుధిర సంధ్యల్లోని భానుడు
నెత్తురు కక్కుతున్న వేళ
ఉషస్సుల్లేని నిశీధిలో చంద్రుడు
అశ్రువులు రాలుస్తున్నాడు
మోదుగుపూలు రక్తం పూసుకొని
అరుణకాంతులను వెదజల్లుతున్న వేళ
ఇటు వసంతము లేక కోకిలలు
ఆర్తనాదాలతో రోదిస్తున్నాయి
పాషాణ హృదయ పారావతాలు
కిక్కురు మనకుండా మిన్నకున్నాయి. (పుట 133)

-అంటూ గడ్డం మోహన్‌రావు రాసిన కవిత కమనీయంగా సాగుతుంది.

తెలుగు తేజముతోడ వెలుగురేఖలు జిమ్ము
కవి దాశరథి- తెలంగాణ యింట
అగ్నిధారను పోసి అశ్రుధారను ఆపె
గదా! దాశరథి- తెలంగాణ కంట
బీడు బుర్రలలోన స్వేచ్ఛాన్నముల నివ్వ
గల దాశరథి- తెలంగాణ పంట
జన్మజన్మల బూజు జాడించి దులిపిన
ఘన దాశరథి- తెలంగాణ జంట
ఇల్లు చక్కదిద్ది కళ్ల కలత దీర్చి
సాగుచేయు రైతు జతగ నిల్చు
రణనినాది దాశరథి కృష్ణమాచారి



రుద్రవీణపై కోటి రాగాలు
ప్రతులకు: డా.జలంధర్‌రెడ్డి,
ఇంటి నెం.12-13-336,
ఫ్లాట్ నెం.465,
వీధి నెం.2, తార్నాక,
సికింద్రాబాదు- 500 017.
మొబైల్.9848292715
వెల: రూ.200/-; పుటలు: 230.

నవ్యకవితకు నిధి భవ్య సుకవి.(పుట 79) అంటున్న సల్ల విజయ్‌కుమార్ ఇట్లాగే తన రచనాభ్యాసాన్ని కొనసాగిస్తే భవిష్యత్తులో మంచికవి కాగలడన్న ఆశను రేకెత్తిస్తున్నారు.

దాశరథి ఆస్థాన కవిగా నియమితులయ్యారంటే- అదేదో ఆదాయం ఉండే ఉద్యోగం కాదు. సంవత్సరానికి ఆరువేల రూపాయల గౌరవ పారితోషికమట. అంటే నెలకు ఐదు వందల రూపాయలు అన్నమాట. ఆస్థాన కవి నియామకం ఉత్తర్వును ఈ గ్రంథంలో పొందుపర్చడంవల్ల చరిత్రకు మేలుచేసిన వారయ్యారు. భవిష్యత్తరాలు దాశరథి పట్ల ఏవేవో ఊహించుకోకుండా రక్షింపబడ్డారు.

సర్వేపల్లి రాధాకృష్ణ, ఇందిరాగాంధీ, బూర్గుల రామకృష్ణరావు, జలగం వెంగళరావు, మదర్ థెరీసా, నీలం సంజీవరెడ్డి లాంటి నేతలతో, జాషువా, సినారె, దేవులపల్లి లాంటి సమకాలీన కవులతో దాశరథి దిగిన ఫొటోలు, ఆకాశవాణిలో పనిచేసినప్పటి ఫొటోలు అందంగా అదనంగా ఉన్నాయి. ఈ చిత్రాలను ఎక్కడో ఒకచోట ఇలా పొందుపరచకపోతే అవి కాలగర్భంలో కలిసిపోయేవి. దాశరథి లాంటి మహనీయుడికి ఎంత నివాళి అర్పించినా తక్కువేనన్నది వాస్తవం. దాశరథి సాహిత్యాన్ని చదవడమే ఆయనకు నిజమైన నివాళి అన్నది మరింత వాస్తవం.

-వెలుదండ నిత్యానందరావు

మితి మీరిన వర్ణనలో.. గతి తప్పిన శైలి

నల్ల భూమయ్యగారు గతంలో కథలు రాసేవారనీ, పుస్తక సంపాదకుల ప్రేరణతో మళ్ళీ కథలు రాయడం మొదలుపెట్టారని చెప్పారు. సంతోషం. వారు రాసిన కథల నుండి ఎంపికజేసిన వాటితో "భూమి ఇంకా గుండ్రంగానే వుంది" పేరిట ఒక సంపుటిని వెలువరించారు. ఈ కథలను పరిశీలిస్తే- రచయిత అప్పుడు రాసినవిగానీ, ఇప్పుడు రాస్తున్న తీరులో గానీ వారి ఆలోచనా విధానం, రచనాశైలీ ఏ మాత్రం మారలేదని మనకు ఇట్టే తెలిసిపోతుంది. వీరి కథలన్నీ అందం, అందం కోసం వెంపర్లాట, వ్యభిచారం, కాముకత్వం, భర్తచాటున వ్యభిచరించే స్త్రీలు, శీలం కోల్పోయిన స్త్రీల చుట్టే తిరుగుతాయి. వీటితోపాటు అందం కోసం వెంపర్లాడి అది దక్కకపోతే, తన ఏడుపుగొట్టు మనస్తత్వాన్ని వేదాంత రీతిలో ఓదార్చుకోవడం అందని ద్రాక్ష పులుపు రీతిలో చిత్రీకరించిన కథలు రెండు వున్నాయి. వయసు అంతరం చూపించి రచయిత అందాల సరోజినిని కాదనుకుని వేరే అమ్మాయిని పెళ్ళిచేసుకుంటాడు. ఎప్పుడూ అందమైన సరోజను, తన రోగిష్టి భార్యను పోల్చి చూసుకుని ఆత్మన్యూనతతో బాధపడుతుంటాడు. చివరకు తన భార్య ఆరోగ్యవంతురాలు కావడం, సరోజిని హఠాత్తుగా చనిపోవడంతో 'అందం', 'ఆరోగ్యం' ఒయాసిస్సులనే భావనకు వస్తాడు. ఇంకో కథలో పరస్త్రీని వాంఛించి, ప్రయత్నించి విఫలమైనపుడు, ఆమె జీవితం విషాదాంతం కాగా.. జీవరాశులెల్ల చిత్తరువు ప్రతిమలని సంతృప్తిపడతాడు. ఇవిగాక తాము వ్యభిచరిస్తూ ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేసే భర్తలకు డబ్బు, హోదాతోపాటు "శ్రమరత్న" అవార్డునిప్పించిన ఇద్దరు పతివ్రతా శిరోమణులను చిత్రీకరిస్తూ మరో రెండు కథలు కూడా వున్నాయి.

ఇక మగవాళ్ళ గురించి చూస్తే దొంగలు, స్వార్థపరులు, అవకాశవాదులు, ఏడుపుగొట్టుగాళ్ళు, అహంకారులు, అసమర్థులు, వ్యసనపరులు, నీచులైన కార్మిక నాయకులు మాత్రమే ఈ కథల్లో కనిపిస్తారు. ప్రభుత్వరంగ సంస్థల నుండి రాగి, ఇత్తడి కడ్డీలను దొంగతనంగా వర్కర్స్‌తో తెప్పించి బోలెడంత డబ్బును సంపాదిస్తారు. దొరికిపోయిన వర్కర్స్ అన్నీ కోల్పోయి కూలీలుగా మారతారు. దొంగ సొమ్ముతో లాభపడినవారు ధనవంతులుగా, సంఘంలో పెద్దమనుషులుగా చలామణి అవుతున్నారని రెండు కథలు తెలియజేస్తాయి. కార్మికుడిగా చేరిన రావు క్రమంగా కార్మిక నాయకుడై రెండు చేతులా సంపాయిస్తాడు. భామా కలాపాలు, రాజనీతి చతురతలు నిండిన రావు జీవితం ఎంత ఉవ్వెత్తున లేచిందో అంత చప్పున చల్లారిపోతుందని తెలిపే కథలు రెండు వున్నాయి. వీటికి భిన్నంగా- ఉద్యోగం సాకుతో నిరుద్యోగుల జీవితాలతో ఎలా ఆడుకుంటారో 'మూడురోజుల లోపు' కథ తెలియజేస్తుంది. 'ఉద్యోగం' కోసం లంచం ఇచ్చినట్లు అధికారులకు తెలియడంతో, అన్ని అర్హతలున్నా అతనికి ఉద్యోగం రాకుండా పోతుంది. 'ఎరుకలోని ఎరుక' కథలో శంకరం ఇతరులు చేసే పనులను తప్పులుగానూ, అవి తనేచేస్తే ఒప్పులుగానూ దబాయించే మనస్తత్వం. అలా మాట దురుసువల్ల అందరితో పోరాడి చివరికి ఏకాకిగా మిగిలిపోతాడు. ఆత్మస్తుతి, పరనిందకు మంచి ఉదాహరణ ఈ కథ.



"భూమి యింకా
గుండ్రంగానే వుంది" (కథలు)
నల్లభూమయ్య, తెలంగాణ
సాహితీ పబ్లికేషన్స్, వరంగల్
వెల: రూ.60/-; పేజీలు: 134
ప్రతులకు:
అన్ని ముఖ్య పుస్తక కేంద్రాలు.

పతితలు, భ్రష్టుల జీవితాలను యథాతథంగా చిత్రీకరించడంలో రచయిత చూపిన అత్యుత్సాహంలో పిసరంత జాలినయినా వారిపట్ల చూపించలేకపోవడం విచారకరం. పేరాలకు పేరాలు, పేజీలకు పేజీల వర్ణనలతో కథలను నింపివేశారు. అనవసర వర్ణనలు, అసంబద్ధ పోలికలు కోకొల్లలు. ఈ వర్ణనలు కూడా సినిమా పాటల చరణాలతో, పద్య పాదాలతో, సామెతలతో నిండి వుండటం విశేషం. వర్ణనలతో కథాగమ్యం దెబ్బతిన్నదన్న విషయాన్ని కూడా గుర్తించలేకపోయారు. చాలా కథల్లో ఎత్తుగడ ఒక రకంగా, ముగింపు మరో రకంగా కనిపిస్తాయి. మరికొన్ని కథల్లో మొదటి సగ భాగానికి, రెండవ సగ భాగానికి అన్వయం లేకుండా జాగ్రత్తపడ్డారు. చాలా కథలను హడావుడిగా ముగించేయడం కూడా కనిపిస్తుంది. బీభత్స రసానికి స్థాయీభావం ఏమిటో తెలుసుకోవాలనుకుంటే ఈ కథలను చదవాల్సిందే.

-కె.పి.అశోక్‌కుమార్

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

ఆదివారం 28, డిసెంబర్ 2014

నేటి ఆధునిక యుగంలో శారీరక సౌందర్యం కోసం ఎంతోమంది మహిళలు బ్యూటీ పార్లర్లకు వెళుతూ లెక్కకు మించి డబ్బు ఖర్చు చేస్తుంటారు. అయితే, కొన్ని సులభ పద్ధతులను పాటించి సౌందర్య సాధనాలను ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. వీటి వల్ల శారీరక అందంపై ఎటువంటి చెడు ప్రభావం ఉండదు. మేని సొగసు మరింతగా ఇనుమడిస్తుంది.

షాంపూ..

30 మందార ఆకులు, 2 చెంచాల శీకాకాయ పొడి, తగినంత నీరు తీసుకోవాలి. మందార ఆకులను బాగా కడిగి, సన్నగా తరిగి తగినంత నీటిలో రుబ్బి పల్చగా చేసుకోవాలి. దీంట్లో శీకాకాయ పొడి కలపాలి. ఈ మిశ్రమంతో తల స్నానం చేస్తే జుట్టులోని జిడ్డు, మురికి వదులుతుంది. శిరోజాలు నల్లబడటమే కాకుండా, మృదువుగా మారి సువాసనతో నిగ నిగలాడుతుంటాయి.

కోల్డ్ క్రీమ్..

2 చెంచాల కొబ్బరి నూనె, 1 చెంచా చొప్పున తాజా వెన్న, నిమ్మరసం తీసుకోవాలి. నిమ్మరసంలో వెన్న వేసి మీగడ తేలేలా బాగా గిలకొట్టాలి. ఇంట్లో తయారుచేసే ఈ క్రీమ్‌ను చేతులకు, కాళ్లకు, ముఖానికి రాసుకుంటే చర్మం కోమలమవుతుంది.

మాయిశ్చరైజర్..

ఆరు కీరా దోసకాయ ముక్కలు, 1 పెద్ద చెంచాడు తేనె కావాలి. కీరా దోస రసంలో తేనె కలిపితే క్రీమ్ తయారవుతుంది. దీన్ని స్నానాంతరం శరీరానికి పట్టించుకుంటే చర్మం మృదువుగా మారుతుంది.

-సుబ్బలక్ష్మి

చీజ్ మాక్రోనీ

కావాల్సినవి:

మాక్రోనీ - 200 గ్రా.
చికెన్ కీమా - 150 గ్రా.
స్వీట్ కార్న్, క్యారట్, బఠానీలు - 100గ్రా.
ఉల్లిపాయలు - 1
అల్లం వెల్లుల్లి ముద్ద - 2 టీ.స్పూ.
పసుపు - 1/4 టీ.స్పూ.
కారం పొడి - 2 టీ.స్పూ.
కరివేపాకు - 2 రెబ్బలు
గరం మసాలా పొడి - 1/2 టీ.స్పూ.
పాలు - 300 ఎం.ఎల్.
గుడ్లు - 4
ఉప్పు - తగినంత
చీజ్ తురుము - 1/4 కప్పు
చిల్లీ సాస్ - 2 టీ.స్పూ.
ఉల్లిపొరక తరుగు - 1/4 కప్పు
నూనె - 5 టీ.స్పూ.



ఇలా చేద్దాం:

మాక్రోనీ ఉడికించి వార్చి పెట్టుకోవాలి. కూరగాయలు చిన్న ముక్కలుగా తరిగి ఉడికించి పక్కన పెట్టుకోవాలి. చికెన్ కూడా కాస్త ఉడికించి జల్లెట్లో వేసి పెట్టుకోవాలి. పాన్‌లో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ వేసి దోరగా వేయించాలి. ఇందులో కరివేపాకు, అల్లం వెల్లుల్లి ముద్ద, పసుపు వేసి కొద్దిగా వేగిన తర్వాత పసుపు, కారం పొడి వేసి కొద్దిగా వేగాక చికెన్ కీమా, కూరగాయల ముక్కలు, తగినంత ఉప్పు వేసి కలుపుతూ వేయించాలి. బాగా వేగిన తర్వాత ఉడికించిన మాక్రోనీ వేసి కలపాలి. తగినంత ఉప్పు వేసి బాగా కలిపిన తర్వాత ఒక గ్లాస్ బౌల్‌లో వేసుకోవాలి. వేరొక గిన్నెలో పాలు, కోడిగుడ్లు వేసి బాగా గిలక్కొట్టి ఈ మాక్రోనీ మీద వేయాలి. దానిపైన చీజ్ తురుము వేసి ముందుగా 180 సెంటిగ్రేడ్ మీద వేడి చేసుకున్న ఓవెన్‌లో పెట్టి అరగంట నుండి 45 నిమిషాల వరకు బేక్ చేసి చిల్లీ సాస్, సన్నగా తరిగిన ఉల్లిపొరకతో అలంకరించి ముక్కలుగా కట్ చేసి సర్వ్ చేయాలి.

కాప్సికం, టమాటా కూర

కావాల్సినవి:

కాప్సికం - 250 గ్రా.
ఉల్లిపాయ - 1
కరివేపాకు - 2 రెబ్బలు
టమాటాలు - 2
పసుపు - 1/4 టీ.స్పూ.
కారచి పొడి - 1 టీ.స్పూ.
ధనియాల పొడి - 1 టీ.స్పూ.
గరం మసాలా పొడి - 1/4 టీ.స్పూ
ఉప్పు - తగినంత
నూనె - 3 టీ.స్పూ.

చేసే విధానం:

కాప్సికం సన్నగా పొడుగ్గా ముక్కలు తరిగి పెట్టుకోవాలి. పాన్‌లో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయలు వేసి దోరగా వేయించి పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద, కరివేపాకు వేసి కొద్దిగా వేగిన తర్వాత కాప్సికం ముక్కలు వేసి కలిపి మూత పెట్టాలి. ముక్కలు కాస్త మగ్గిన తర్వాత ధనియాల పొడి, కారం, తగినంత ఉప్పు వేసి కలపాలి. తర్వాత సన్నగా తరిగిన టమాటా ముక్కలు వేసి కలిపి మూత పెట్టి మగ్గనివ్వాలి. తర్వాత అర కప్పు నీళ్లు కలిపి నిదానంగా ఉడకనివ్వాలి. చివరగా గరం మసాలా పొడి వేసి కలిపి దింపేయాలి. ఈ కూర అన్నం, చపాతీల్లోకి బావుంటుంది.

పనీర్ సాండ్‌విచ్

కావాల్సినవి:

బ్రెడ్ స్లైసెస్ - 6
పనీర్ తురుము - 1 కప్పు
పసుపు - చిటికెడు
కారం పొడి - 1/2 టీ.స్పూ.
గరం మసాలా పొడి - చిటికెడు
ఉప్పు - తగినంత
కొత్తిమీర - కొద్దిగా
వెన్న - 1/4 కప్పు

చేసేద్దాం ఇలా:

బ్రెడ్ స్లైసుల అంచులు తీసేయాలి. పనీర్ తురుములో పసుపు, కారం, గరం మసాలాపొడి, సన్నగా తరిగిన కొత్తిమీర, తగినంత ఉప్పు వేసి కలిపి పెట్టుకోవాలి. బ్రెడ్ స్లైసు మీద వెన్న రాసి ఈ పనీర్ తురుము పలుచగా పెట్టి పెనంమీద కొద్దిగా వెన్న వేస్తూ రెండు వైపులా ఎర్రగా కాల్చుకుని టమాటా సాస్‌తో సర్వ్ చేయాలి. పిల్లలకు చాలా ఇష్టమైన, త్వరగా అయ్యే టిఫిన్ ఇది. మరింత రుచి కావాలంటే కొద్దిగా అల్లం వెల్లుల్లి ముద్ద కానీ, క్యారట్ తురుము కానీ వేసుకోవచ్చు.

- జ్యోతి వలబోజు

గుమ్మడికాయ, పాలకూర ఇగురు

వండాలి ఇలా:

గుమ్మడికాయ చెక్కు తీసి చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. పాలకూర కడిగి సన్నగా తరిగి ఉంచుకోవాలి. పాన్‌లో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయలు వేసి మెత్తబడేవరకు వేయించాలి. ఇందులో పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద వేసి కొద్దిగా వేగిన తర్వాత గుమ్మడికాయ ముక్కలు వేసి కలిపి మూత పెట్టాలి. ముక్కలు కాస్త మగ్గిన తర్వాత కారం , తగినంత ఉప్పు వేసి కలపాలి. తర్వాత పాలకూర తరుగు వేసి కలిపి మూత పెట్టాలి. అవసరమైతే కొన్ని నీళ్లు కలుపుకోవచ్చు. గుమ్మడికాయ ముక్కలు, పాలకూర పూర్తిగా ఉడికి దగ్గరగా అయినపుడు గరం మసాలా పొడి వేసి కలిపి దింపేయాలి.

కావాల్సినవి:

గుమ్మడికాయ - 250 గ్రా.
పాలకూర - 5 కట్టలు
ఉల్లిపాయ - 1
అల్లం వెల్లుల్లి ముద్ద - 1 టీ.స్పూ.
పసుపు - 1/4 టీ.స్పూ.
కారం పొడి - 1 టీ.స్పూ.
గరం మసాలా పొడి - 1/4 టీ.స్పూ.
ఉప్పు - తగినంత
నూనె - 3 టీ.స్పూ.

ముత్యాల ముగ్గు

27 చుక్కలు 14 వచ్చే వరకూ (మధ్య చుక్క)

వి. నాగలక్ష్మి, రామచంద్రపురం

అపసవ్య హార్మోన్లతో సంతాన లేమి

తెలుసుకొనవె యువతీ!

- డాక్టర్ కేతరాజు సరోజినీ దేవి
ఫోన్ : 040- 271 70 468 (క్లినిక్)

పిసిఓడి లేక పిసిఓఎస్ అనేది స్త్రీ శరీరంలో హార్మోనుల అసమతుల్యత, ఒక అపసవ్య పరిస్థితి. దీని మూలంగా శరీరం అనేక మార్పులు, అవాంఛనీయ లక్షణాలు కలిగి స్త్రీ జీవితాన్ని అతలాకుతలం చేస్తాయి. మామూలుగా జరిగే అండ ఉత్పత్తి ఆగిపోయి రుతుక్రమంలో తేడాలు, వంధ్యత్వం మొదలైన దుష్పరిణామాలు కల్గుతాయి. FSH (ఫాలిక్యులర్ స్టిములేటింగ్ హార్మోను), L.H అనే Leutimizing హార్మోనుల నిష్పత్తి తారుమారు అవుతుంది. FSH తక్కువై LH పెరుగుతుంది. ఓవరీల సైజు పెరిగి తెల్లటి పైపొర దళసరిగా మారుతుంది. అది చీల్చుకోలేక అండాలు లోపలే నశించిపోయి చిన్న చిన్న నీటి బుడగల్లా చేరుతాయి. దీనినే పాలీసిస్టిక్ ఓవరీ అంటారు. ఓవరీల అంచున ముత్యాల హారంలాగా (peral Necklace) స్కానింగులో కనిపిస్తాయి. ఏండ్రోజను అనే పురుష హార్మోను చాలా పెరిగిపోయి మగ లక్షణాలైన రోమాలు ముఖం మీద, చుబుకం మీద, ఛాతీపైన, కాళ్లు చేతుల మీద నల్లగా కనిపిస్తూ వుంటాయి. ముఖంపై జిడ్డు, మొటిమలు ఏర్పడతాయి. దీంతో మహిళలు ముఖ్యంగా బాలికలు, యుక్త వయస్సులోని యువతులు నలుగురిలో తిరగలేక ఆత్మన్యూనతా భావం అనుభవిస్తూ బాధపడుతుంటారు. దీనికి తోడు రుతుక్రమం చాలా దూరం అంటే రెండు మూడు నెలలకోసారి లేక ఇంకా ఎక్కువ సమయం తర్వాత కన్పించి లేక ఒకోసారి అధిక రక్తస్రావం జరిగి బాధపడుతుంటారు. దీంతో వంధ్యత్వం (సంతాన లేమి) ప్రాప్తిస్తుంది. సంతానం లేకపోవడం- కుటుంబ కలహాలకి, విడాకుల దాకా రావచ్చు. లేదా వేలకి వేలు డబ్బు ఖర్చు చేసుకుంటూ ఫెర్టిలిటీ సెంటర్ల చుట్టూ తిరుగుతూ వుండడం చూస్తుంటాము.

అయితే- దీనికి తగిన చికిత్స, చక్కటి పరిష్కారం లేకపోలేదు. పరిస్థితి త్వరగా గుర్తుపట్టి నిపుణులైన గైనకాలజిస్టుని సంప్రదిస్తే ఆధునిక పద్ధతులలో కొత్త కొత్త మందులు వాడి అండం విడుదల, నెలసరిని చక్కదిద్దడమే కాక సంతానం కలిగేలాగా పరిష్కార మార్గం చూపుతారు.

ముందుగా హార్మోను ఎస్టిమేషన్లు, పొట్టకు స్కానింగులు, ఓవ్యులేషను జరుగుతోందా? లేదా? అని అధ్యయనం చేయాలి. అండం విడుదల కోసం ఎన్నో మందులు, ఇంజక్షన్లు నేడు లభిస్తున్నాయి. అవి వాడి సంతానం పొందవచ్చును. అవి ఒక క్రమ పద్ధతిలో ప్రొటోకాల్‌ను అనుసరించి వాడాలి. అంతేగానీ ఒక నెలలోపే ఫలితం రాలేదని డాక్టర్లని మార్చి వేస్తూ కాలయాపన చేయరాదు. ఓపిక, నమ్మకం చాలా అవసరం. సెకెండ్ ఒపీనియన్ తీసుకుంటే తప్పులేదు. కానీ, కొంతకాలం ఓపికతో చికిత్స చేయించుకోవాలి. మందులతో కుదరకపోతే లాపరోస్కోపీ ద్వారా ఓవేరియన్ ఫల్గురేషన్ చేస్తారు. పిసిఒడియేగాక ఇంకేదైనా లోపం వుందా? భర్త నార్మలుగా వున్నాడా? లేదా? అని కూడా వైద్యులు చూస్తారు.

మందులు వాడాక గర్భం దాల్చిన వారు చాలా జాగ్రత్తగా వుండాలి. ఎందుకంటే గర్భస్రావం అయ్యే అవకాశం మిగతావారి కంటే వీరిలో ఎక్కువ. నోటి మందులతో ఒవేరియను సిస్టులు తయారయ్యే ప్రమాదం కూడా వుంటుంది. గర్భం ధరించినపుడు కవలలు జన్మించే అవకాశం, డయాబిటిస్ 40, 50 సంవత్సరాల వయసులో వచ్చే ఛాన్సు వుందని పేషెంటుకి, బంధువులకు విశదపర్చాలి. సరైన కౌన్సెలింగ్‌తో పాటు వైద్యుడికి, పేషెంట్‌కి మధ్య పరస్పర విశ్వాసం చాలా అవసరం. ★

భవిష్య కాలం

- 'దివ్యజ్ఞాన విభూషణ' ఉమాపతి. బి.శర్మ

పూజారి మహేశ్వరాచారి, దేవర యామ్‌జాల (ఆర్.ఆర్.జిల్లా)

ప్ర: మతమూ దేవుడూ అంటూనే పాకిస్తాన్‌లోని పెషావర్‌లో అమాయకులైన పసి పిల్లలను ఊచకోత కోయటానికి ఏ శాస్త్రం కారణం? జ్యోతిషమా? వాస్తా? మతమా? దేని ప్రకారం దీనికి మీరు సమాధానం చెపుతారు?

సమా: మతం అనేది ఒక నెపం. మూర్ఖత్వం- హింసాతత్పరత ఆ నేల, ఆ మనుషుల స్వభావం. మతానికీ, దానికీ సంబంధమే లేదు. కన్నకొడుకును హత్యచేసిన హంతకునికి- అతడు పుత్రహంతకుడని తెలిసి కూడా క్షమించి విడచిపుచ్చినవాడు ఇస్లాం మత ప్రవక్తల్లో ఒకడు 'యూసుఫ్' అనే ప్రవక్త. వాస్తురీత్యా వాయవ్య దిశకు అధిపతి కేతువు. కేతువు క్రూరరూపి. మధ్య ఆసియా కూడా అటువంటిదే. గజనీ మహమ్మద్, తైమూర్ మంగోలుడైన చంగీజ్‌ఖాన్, ఘోరీ మహమ్మద్- ఇలాంటి చరిత్రలోని వారే కాకుండా పురాణాలలోని లవణాసురుడు కూడా అటువైపువాడే. భారతదేశానికి వాయవ్య దిశ- మధ్యాసియా ప్రాంతం క్రూరత్వానికి నెలవుగా పురాణాలు, చరిత్రలు చెపుతున్నాయి. మారణహోమం ఆ నేల నైజం. ఆ జనుల నైజం- మధ్యాసియాలో చెలరేగిన క్రూసేడులు- అత్యంత భయంకరం- దానికి వాస్తు సంబంధమైన నేల గుణమే కారణం.

అశోక్ వంగల, రమణయ్యపేట, కాకినాడ

ప్ర: లోగడ మీరు చెప్పిన ప్రకారం రోడ్డు ప్రమాదం నుండి బాగానే కోలుకుంటున్నాను. కుటుంబ పరిస్థితులు బాగా లేవు. ఉద్యోగం, వివాహం గురించి చెప్పండి.

సమా: మీ జాతకంలో కుజ, శనుల కలయిక ఉంది. అది ఆకస్మిక ప్రమాదాలకు దారితీస్తుంది. ప్రతిరోజూ వేంకటేశ్వర సహస్రనామాలు పారాయణం చేసి, బూందీ లడ్డూలు (రెండు) చిన్నవైనా సరే నివేదన చేసి ప్రసాదంగా పంచిపెట్టండి. నలభయి రోజులలోపే మీకు శుభం జరుగుతుంది.

కె.హరి, బరంపురం (ఒడిస్సా)

ప్ర: ధనప్రాప్తి ఎప్పుడు?

సమా: కోరినంత ధనం ఎప్పుడూ... ఎవ్వరికీ లభించదు. ఆకస్మికంగా, ఆలస్యంగా మీకు కొంత ధనలాభం జరిగే అవకాశం ఉంది. 'ఉద్యోగినం పురుషము పైతి లక్ష్మీ'. ఎల్లప్పుడూ ప్రయత్నశీలిని లక్ష్మి కరుణిస్తుంది.

ఎం.బి.ఎన్.రామమూర్తి, ప్రతాప్‌నగర్, కాకినాడ

ప్ర: నాకు వివాహం ఎప్పుడు? ఉద్యోగం ఎప్పుడు?

సమా: ఈ రెండు యోగాలు లోగడ ఒకసారి వచ్చినట్లే వచ్చి తప్పిపోయినట్లు కనిపిస్తోంది, మళ్లీ 2015 చివరలో జరిగే అవకాశం ఉంది.

కాయల నాగ రాజ్యలక్ష్మి భరత్‌నగర్ కాలనీ, (హైదరాబాద్)

ప్ర: ప్రభుత్వోద్యోగం, భవిష్యత్తు, కుటుంబ పరిస్థితులు- మంచి మార్గం చూపండి..

సమా: అన్నీ ఆలస్యంగానే నెరవేరుతాయి. స్థిరాస్తి సంబంధమైన వ్యవహారాలు, ప్రభుత్వ సంబంధమైన విషయాలు మీకు ఇబ్బందులు కలిగిస్తున్నట్టు కనిపిస్తున్నాయి. దైవ విశ్వాసాన్ని, శాస్త్ర విశ్వాసాన్ని కలిగి ఉండటం, ఆత్మవిశ్వాసంతో కర్తవ్యాన్ని నిర్వహించటమే మంచి మార్గం. ఇంకా కావాలంటే భగవద్గీతా పారాయణం చేయండి. అన్ని ప్రశ్నలకూ సమాధానాలు దొరుకుతాయి.

కురువ శ్రీనివాసులు, హైదరాబాద్

ప్ర: మా బాబుకు వాహనం ఇప్పించవచ్చా..? ఉద్యోగం ఎప్పుడు వస్తుంది..?

సమా: మీ అబ్బాయి ఆడంబర ప్రియుడు. కొంచెం తొందరపాటు కూడా ఉండే అవకాశం ఉంది. కళా సంబంధమైన అభిరుచి కారణంగా సినిమాల వైపు ఆకర్షితుడయ్యే అవకాశం ఉంది. తగు జాగ్రత్తలు చెపుతూ వాహనం ఇప్పించండి.

ఎ.సాయికిరణ్, నానేపల్లి (కర్నూలు)

ప్ర: ఇంజనీరింగ్ నాలుగవ సంవత్సరం చదువుతున్నా. తరువాత ఉద్యోగం దొరుకుతుందా?

సమా: చదువు పూర్తయిన తరువాతనే ప్రశ్నించండి. ఇప్పుడు కాదు.

కె.సూర్యప్రసాద్, కదిరి (అనంతపురం)

ప్ర: ఇంటా బయటా అవమానాలు, ఈర్ష్యాద్వేషాలు. దీనికి పరిష్కారం ఏమిటి?

సమా: మిమ్మల్ని మీరు అతిగా ఊహించుకుంటున్నారు. ఆశావాదాన్ని, ప్రయత్న శీలత్వాన్ని అలవరచుకోండి. 'మనిషి బ్రతుకు నరకమౌను మనసు తనది కానిదే' అన్నారు ప్రముఖ కవి సినారె ఒక సినీ గీతంలో. ఏదైనా ఒక మంచి ప్రయత్నం మీద మనసు లగ్నం చేయండి. అన్నీ కుదుటపడతాయి. పరిష్కారం- ఆత్మవిశ్వాసం, ఆంజనేయస్వామి పట్ల భక్తి.

కె.ఎస్.వి.సీతారామశర్మ, ఏలూరు

ప్ర: నా ఆర్థిక ఇబ్బందులు ఎప్పుడు తీరేను? భార్యా పిల్లలతో ప్రశాంత జీవితం ఎప్పుడు?

సమా: ఆర్థిక ఇబ్బందులకు నూట ఎనిమిది సంఖ్యతో గోధుమపిండి- శర్కర - ఆవుపాలు కలిపి ఉండలుగా చేసి ప్రతి సోమవారం చెరువులో చేపలకు ఒక్కొటొక్కటిగా వేయండి (ఇష్టదైవాన్ని స్మరిస్తూ). పరిస్థితులు దారికి రాగలవు.

రామరాజు రత్నభూషణ్‌రావు, విజయవాడ

ప్ర: మీ సమాధానాలు బాగుంటున్నాయి. నాదొక ప్రశ్న. జ్యోతిషంలో రకరకాల సిద్ధాంతాలున్నాయి. జైమినీ జ్యోతిషం- కృష్ణమూర్తి పద్ధతి- వరాహ మిహిరుని సిద్ధాంతాలు.. ఇలా. దేన్ని పాటించమంటారు?

సమా: 'కతాపారా శరీహోరా' అని పండిత వాక్యం. 'వృద్ధపారా శర్యం' అనేది అతి ప్రాచీనమైన గ్రంథం. ప్రధానంగా 'పారాశర్యాన్ని', మిగతా వాటిని పరిశోధనాత్మకంగా అనుభవాలతో సమన్వయం చేసుకుంటూ పోవటం ఉత్తమం. 'ముఖా ముఖే సరస్వతీ' ఒక్కొక్కరూ ఒక్కొక్క దాంట్లో నిష్ణాతులు. అందరినీ అధ్యయనం చేయటం సర్వదా శ్రేష్ఠం.

రేపాక చంద్రమౌళి, కలీంనగర్

ప్ర: 'పుష్కరం' అనే మాటకు అర్థమేమిటి? దానికీ, గోదావరికీ సంబంధమేమిటి?

సమా: 'పుష్' అంటే వికాసము. 'పుష్యము' అనే మాట కూడా దానిలోనిదే. గురుగ్రహ సంచారం వలన ఒక్కొక్క నదిలో ఒక్కొక్కసారి వికాస లక్షణాలు- సింహంలో గురువు, గోదావరికి మేషంలో గురువు - గంగకు- ఇలా పుష్కరాలు పాటించడం ఆనవాయితీ. పుష్కర స్నానం పాప హరణం. ★

ప్రశ్నలు పంపాల్సిన చిరునామా
ఉమాపతి. బి.శర్మ
ఇంటి నెం. 16-2-834-బి/1/, ఎస్‌బిహెచ్-బి కాలనీ దగ్గర, కోదండ రామాలయం రోడ్డు, శ్రద్ధాబాద్ (సైదాబాద్), హైదరాబాద్- 500 059.
umapathisharma@ymail.com

పేరు :
చిరునామా :
.....
.....
.....
.....
తోచిన సంఖ్య (1 నుంచి 108 లోపు) :
ఆ సంఖ్యను అనుకున్న సమయం, తేదీ:
.....
ప్రశ్న :
.....
.....
.....
.....
సంతకం : .....

కూపన్ల ద్వారా మాత్రమే ప్రశ్నలు పంపాలి. పోస్టుకార్డులపై, కవర్ల ద్వారా పంపిన ప్రశ్నలు పరిశీలించబడవు.

నేర్చుకుందాం

చ. అన విని వాఁడు నవ్వి 'యహహా! విన వింతలు పుట్టె మున్ను న న్నని మొన నోర్వఁజాలక భయంబునఁ బాఱితి పెక్కుమార్లు ; వం చన మథురాపురిన్ విడిచి సాగర మధ్యమునందు దాఁగవే? వనరుహనాభ! నీ బిరుదు వా c డితనంబును నాకు వింతయే?

భావం కృష్ణుడు మాటలు విని జరాసంధుడు నవ్వి 'ఆహా ! ఎంత ఆశ్చర్యం. నన్ను యుద్ధ రంగంలో ఎదిరించలేక భయంతో చాలా పర్యాయాలు పరుగెత్తి పోయావు. మథురాపట్టణాన్ని వదిలిపెట్టి సముద్రమధ్యంలో ఇల్లు కట్టుకొని దాగావు. ఓ కృష్ణా ! నీ పరా క్రమం , నీ మగతనం నాకు కొత్త కాదు. అంటూ జరాసంధుడు ఇంతకు ముందు జరిగిపోయిన యుద్ధాలను గురించి చెప్తూ కృష్ణుని తో తనకు పోరు ఏమాత్రం భయంలేదని తాను జంకనని చెప్పుతున్నాడు.

పోతన భాగవతము - దశమ స్కంధము

స్పందన

43 **కె. ప్రమీలాజనార్దన్**

మళ్లీ ఇన్నేళ్ళ తర్వాత కోలుకొనే ధైర్యం శక్తి తరిగి పడమటికి వాలిన వయసులో వున్న తమ మనసు మీద పెద్ద దెబ్బ కొట్టింది సృజన. చివరి రోజులు ఆమె చేతి గుండా వెళ్లిపోతాయ నుకున్నారు. ఆమె కారణంగా ఊరే వదలిపో వాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు.

భర్త అత్తగారి ప్రవర్తన భరించలేక రెండేళ్ళ పిల్లతో పుట్టింటికి చేరింది. తర్వాత సంవత్సరా నికి ఇంట్లో వుంటే ఏదో దిగులు భయంగా వుంటోందని వుద్యోగాలకు అప్లై చేసుకుంది. రాజమండ్రిలో ఎల్ఐసిలో వుద్యోగం వచ్చింది. దగ్గరే కాబట్టి సంతోషంగా ఒప్పుకున్నారు.

కూతుర్ని తన దగ్గరికే తీసుకెళ్లి చదివించు కుంది సృజన. వారానికోసారి రాములూరు వచ్చేది. అప్పుడప్పుడు వీళ్ళూ వెళ్లి రెండు మూడు రోజులుండి వచ్చేవారు. చూస్తుండ గానే సృజన కూతురు డిగ్రీ పూర్తయింది. వెంటనే పెళ్లి కుదిరింది. ఇక తమకే దిగులు లేదనుకున్నారు. కాని సృజన గుండెల్లో గునపం చెక్కింది. కూతురి పెళ్ళైన రెణ్నెల్లకు ఆమె పనిచేసే ఆఫీసులోనే అయిదేళ్ళలో రిటైర వ్వబోతున్న వ్యక్తిని రిజిష్టర్ మ్యారేజ్ చేసు కుంది. అతడి భార్య చనిపోయి నాలుగేళ్ల యింది. పిల్లలు లేరు. అతడికి తోడు కావాల న్నాడు. నాకూ అలాగే అనిపించింది. అందుకే ఇద్దరం పెళ్లి చేసుకున్నాము'' అంటూ లెటర్ వ్రాసింది.

ఇది ఊళ్ళో వాళ్ళకు తెలిస్తే ఎంత అప్ర తిష్ఠ... పెద్ద కూతురు భర్తపోతే కులం కాని వాడ్ని మళ్లీ పెళ్లి చేసుకుంది. ఇక ఈ పిల్ల వయసు మళ్లాక తోడు కావాలంటూ కూతురి పెళ్లి చేశాక తను పెళ్లి చేసుకుంది. ఎప్పటి నుండి గ్రంథం సాగిస్తోందో... కూతురు పెళ్లి కుదరదన్న భయంతో ఆగి ఆ పిల్ల పెళ్లయ్యాక తను పెళ్లి చేసుకుంది. ఎంతో గౌరవ కుటుంబ మనుకున్నాము కాని ఈ పిల్ల పెళ్లి చేసుకోవ డంతో తెలిసింది కోటేశ్వరరావుగారు పిల్లల్ని అడ్డు అదుపు లేకుండా పెంచారని..'' అంటూ ఊళ్ళోవాళ్ళు చెవులు కొరుక్కుంటారు.

అది నేను భరించలేను. అలా అని ఈ విషయం ఎక్కువ రోజులు దాచిపెట్టలేము అనుకొని అప్పటికప్పుడు ఈ ఊరికి దూరంగా ఈ జనం మాటలు వినకుండా వార ణాసి వెళ్లాలని నిశ్చయించుకొని భార్యకు చెప్పారు.

''అయితే ఈ విషయం మాష్టారుగారి భార్యకు చెప్పొద్దు. ఆమెకు విజయవాడ వెళు తున్నట్లు చెప్పమన్నారు. ఆమెకు తెలిస్తే వేరేవా రెవరి ముందో నోరు జారుతుంది. అలా ఒక్కొక్కరికి తెలిసి ఊళ్ళో వారందరికి తెలు స్తుందని భయం.''

'అలాగే' అంది లలితమ్మ. ఇక్కడ వుండి అవమానాలు అవహేళనలు భరించడంకన్నా అలా వెళ్ళడమే మంచిది అందామె కన్నీళ్ళు తుడుచుకుంటూ.

మాస్టారుకు మాత్రం నిజం చెప్పారు.

భావన కుటుంబ గౌరవాన్ని మట్టిపాలు చేసిందని ఆమెను వెలివేశారు. అంతకన్నా మనస్తాపం కలిగించింది సృజన. భావనను బాధించినందుకు ఈ వయసులో తమకీ శిక్షేమో! అదే విషయాన్ని లెటర్ వ్రాశారు. తను తన భార్య తదనంతరం ఆస్థి కూతుళ్లిద్దరికి చెందేట్లు విల్లు వ్రాసి ఆ కాగితాలు కవరులో పెట్టి మాష్టారికిచ్చి వాళ్ళ ఇంట్లో వాళ్ళకు కూడా అందులో విషయాలు చెప్పవద్దని ఒట్టేయిం చుకున్నాడు. వచ్చేటప్పుడు తమతో కొంత డబ్బు తెచ్చుకున్నారు. తర్వాత తమ పొలాల మీద వచ్చే డబ్బు పంపించమని మాష్టారుకు చెప్పారు. తమ గురించి ఆయనకు తప్ప ఎవ రికీ తెలియగూడదనుకున్నాడు. కాని మాష్టారు మాట తప్పారు. కాదు.. కాదు.. అలా మాష్టారు మాట తప్పేలా చేశాడు శ్యామ్...'' తనలో తనే అనుకుంటున్నట్లుగా అంటూ భార్య వంక చూశాడు.

లలితా.. కులం, మతం, ప్రాంతం అంటూ మనం ఏవేవో అనుకోవడం ఎంత మూర్ఖ త్వమో నాకిప్పుడర్థమౌతోంది. మనిషికి కావా ల్సింది అవి కాదు. మానవత్వంతో ఆలోచించ గలగడం.. బంధం అనుబంధాలకు విలువని వ్వడం.. ఆ గుణాలన్నీ వున్న వాడవ్వడం వల్లే శ్యామ్ భావనను పెళ్లి చేసుకోగలిగాడు. మన మూర్ఖత్వం మనల్ని అతడిమీద, భావనమీద మండిపడేలా చేసింది. కాని అతడు మనమీద కోపం పెంచుకోలేదు. ఇన్నేళ్ళ తర్వాత మనం బాధలో వున్నామని తెలుసుకొని మనల్ని వెతు క్కుంటూ వచ్చాడు. లలితా క్షమను భరించడం కూడా కష్టమని అతడు మన ఇంటిముందు కనిపించి మాట్లాడినప్పుడు తెలిసింది. అతడు మనల్ని నిందించి మీరప్పుడు అవమానక రంగా మాట్లాడారు.

ఇప్పటి మీ స్థితి ఏమిటి? అని హేళనగా మాట్లాడితే బాధనిపించేది కాదు. నేరానికి శిక్ష పడిందన్న తృప్తి లభించేది. ఇప్పుడలా కాదు.. ఉన్నత శిఖరం ముందు చిన్న గులకరా యిలా అనిపిస్తోంది, అతడి వ్యక్తిత్వంతో నన్ను పోల్చుకుంటే..'' కోటేశ్వరరావుగారి కళ్ళ ముందు నాలుగు రోజుల క్రిందట వచ్చి వెళ్లిన శ్యామ్ కనిపిస్తున్నాడు.

***

ఆంధ్రాశ్రమంలో విశాఖనుండి వచ్చిన స్వామివారెవరో పురాణం చెబుతున్నారంటే వెళ్లి ఇంటికి వచ్చిన కోటేశ్వరావుగారు లలి తమ్మ ఇంటిముందున్న చిన్న అరుగుమీద కూర్చున్న వ్యక్తిని చూసి మొదట గుర్తించ లేదు.

-ఇంకావుంది

అధ్యాత్మ రామాయణం



- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

పంచదశ సర్గ

శ్రీరామ పట్టాభిషేకం

శ్రీ మహాదేవులవారిలా అన్నారు:

ఓ పార్వతీ! కైకేయీ పుత్రుడైన భరతుడు కాగల గార్యం గురించి ఆలోచించాడు. భక్తితో శిరస్సున అంజలి ధరించి, అన్నగా రితో ఇలా అన్నాడు.

నీ యానతి బట్టి మా తల్లి (కైక) సిత్కృత (మంచి పనే చేసినది) అయినది. నీవు నాకు ప్రసాదించిన రాజ్యాన్ని, మళ్లీ అదేవిధంగా నేను నీకు సమర్పిస్తున్నాను.

అని భరతుడు అన్న పాదాలకు భక్తితో నమస్కరిం చాడు. సాష్టాంగ పడ్డాడు. కైకేయిని గురువు లనూ ప్రార్థించాడు. రామునికి మీరందరు చెప్పి రాజ్య స్వీకారానికి అంగీకరించేట్టు చేయవలసిందని వేడుకొన్నాడు. వారందరూ రామునివైపు చూశారు.

మాయను ఆశ్రయించి మానవునిలా వ్యవ హరిస్తున్న ఈశ్వరుడైన రాముడు, భరతుని నుండి రాజ్యం స్వీకరించడానికి అంగీకరిం చాడు.

సుఖజ్ఞానైక స్వరూపమైన వైకుంఠ రాజ్యా నుభవమే ఉన్నవానికి, ఆనందమే రూపమైన పరమాత్మకు ఈ అల్పమైన మానవ రాజ్యం ఎందుకొఱకు?

ఎవని కనుబొమల కదలిక మాత్రం చేత మూడు లోకాలు నశిస్తాయో, ఎవరి అను గ్రహ మాత్రాన అఖండ లక్ష్మీ సంపద లభి స్తుందో, అవలీలగా సర్వ సృష్టిని క్షణమా త్రాన చేసే శక్తి ఉన్న ఆ మహానుభావునికి, ఆ రమాపతికి ఈ రాజ్యమెంతటిది?

యుద్ధకాండ 212

ప్రభూ! ఆనాడు న్యాసరూపంగా నాక ర్పించిన రాజ్యాన్ని నీవు స్వీకరించు.

ఈనాటికి మీరు అయోధ్యకు తిరిగి వచ్చారు. ఈ రోజు నా జన్మ చరితార్థమైంది; సఫలమైంది. నా మనోరథమీడేరింది. నీ తేజో పరాక్రమాదుల కారణంగానే కోశాగారం, ధాన్యాగారం, స్కంధావారం ప్రభూ! పదిరెట్లు పెరిగింది.

జగన్నాథా! ఈ పరం ఇక పాలించు... అని చెప్పిన భరతుణ్ణి చూచి వానరవీరులందరు కన్నీటి పర్యంతమయ్యారు. మహా సంతో షంతో ప్రస్తుతించారు. రాముడు ఆనంద తరంగిత హృదయుడై భరతుణ్ణి తన ఒడిలో పొదివిపట్టుకొని అదే విమానంపై నందిగ్రా మంలోని భరతాశ్రమానికి వెళ్లాడు.

అక్కడ విమానం నుండి నేలకు దిగాడు. అప్పుడు రాముడంత వరకు తమ ప్రయా ణానికి ఆధారంగా నిలిచిన విమానంతో ఇలా అన్నాడు.

వాహనమా! ఇక నీవు కుబేరుని దగ్గరకే వెళ్లు! నీకు నేను అనుమతినిస్తున్నాను. ధన పాలుడైన కుబేరుని దగ్గరే నీవు ఉండవలసి నది. (పుష్పకం వెళ్లిపోయింది)

(లంకానగరం, పుష్పక విమానం రెండూ కుబేరునివే. కుబేరుణ్ణి తరిమివేసి రావణుడీ రెండింటిని సొంతం చేసికొన్నాడు. అష్టదిక్పా లకులలో ఒకడైన కుబేరుడు ఉత్తరాన ఉన్న హిమాలయాల్లోని అలకానగరాధిపతియై అక్కడే ఉంటున్నాడు. పుష్పకంను అతని సన్నిధికే పంపించాడు రాముడు)

దేవతల గురువు బృహస్పతికి ఇంద్రుడు నమస్కరించిన విధంగా కుల గురువు వశిష్ట నికి నమస్కరించాడు రాముడు. ఉత్తమ అర్హా సనంపై గురువు కూర్చోగా రాముడు ఆయన సమీపంలోనే కూర్చున్నాడు.

ఇది అధ్యాత్మ రామాయణాంతర్గతం. ఉమా మహేశ్వర సంవాదంలోని యుద్ధకాం డలో చతుర్దశ సర్గ.

- ఇంకావుంది

ఆదివారం 28 డిసెంబర్, 2014

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ జయ, ఉత్తరాయణం
హేమంత ఋతువు - పుష్యమాసం

తిథి: శుద్ధ సప్తమి సా.4.51
నక్షత్రం: పూ.భా. ఉ.11.54
వర్జ్యం: రా.8.57 నుండి 10.28 వరకు
దుర్ముహూర్తం: సా.04.24 నుండి 05.12 వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
  అకాల భోజనంవల్ల ఆరోగ్యం చెడిపోతుంది. మానసికాందోళన చెందుతారు. వృత్తి రీత్యా జాగ్రత్తఅవసరం. సహనం అన్ని విధాలా శ్రేయ స్కరం. ఆవేశంవల్ల కొన్ని పనులు చెడిపోతాయి.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
  విదేశయాన ప్రయత్నం సులభంగా నెరవేరు తుంది. మనోవిచారాన్ని పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త వహించుట మంచిది.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
  తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్య బాధలుం డవు. సహ ఉద్యోగులకు సహకరిస్తారు.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)**
  కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనం వహించుట అన్ని విధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అనవసర ధనవ్య యంతో ఋణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
  మానసిక చంచలంతో ఇబ్బంది పడతారు. సోమ రితనం ఆవహిస్తుంది. పిల్లలపట్ల మిక్కిలి జాగ్రత్త వహిస్తారు. కొన్ని మంచి అవకాశాలను కోల్పో తారు. ఆర్థిక పరిస్థితిలో మార్పులుండవు.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
  అన్ని కార్యములందు విజయాన్ని సాధిస్తారు. అంతటా సౌఖ్యాన్ని పొందుతారు. శత్రుబాధ లుండవు. శుభవార్తలు వింటారు. గౌరవ, మర్యా దలు అధికమవుతాయి. అద్భుత శక్తి సామర్థ్యా లను పొందగలుగుతారు.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
  దూర బంధువులతో కలుస్తారు. తద్వారా లాభా లుంటాయి. విదేశయాన ప్రయత్నాలు సంపూ ర్ణంగా నెరవేర్చుకుంటారు. ఆకస్మిక ధనలాభయో గముంటుంది. అన్ని విషయాల్లో విజయాన్ని సాధిస్తారు.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
  వ్యాపారంలో విశేష లాభాన్ని ఆర్జిస్తారు. మంచి వారితో స్నేహం చేస్తారు. అంతటా సుఖమే లభి స్తుంది. ఆకస్మిక ధనలాభముంటుంది. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఒక ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తారు.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
  మానసికానందం లభిస్తుంది. కొన్ని పనులు పూర్తవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొం టారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
  ఋణప్రయత్నం ఫలిస్తుంది. చెడు సహవాసం వైపు వెళ్లకుండా వుంటే గౌరవం దక్కుతుంది. క్షణి కావేశం పనికిరాదు. కలతలేర్పడే అవకాశ ముంది. బంధు, మిత్రులతో జాగ్రత్తఅవసరం.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
  వృత్తిలో ఇబ్బందుల అధిగమిస్తారు. మీ ఆలోచ నలు ప్రణాళికాబద్ధంగా ఉంటాయి. కొన్ని జటిల మైన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ధైర్య సాహసాలతో నూతన కార్యాలు ప్రారంభిస్తారు.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
  సంతోషంగా కాలం గడుపుతారు. కుటుంబ పరి స్థితి సంతృప్తికరంగా వుంటుంది. ఇతరులచే గౌర వింపబడుదురు. విందులు, వినోదాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఆర్థిక చింత యుండదు.

సత్యభామ

54 బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 594 మాటాట



ఆధారాలు

ఆధారాలు: 85

అడ్డం
1. చివర పాల్లుతో మిత్రుడనే
3. మేలు, మంచి
5. రేయి కాదు
7. వీచిక
8. రచయిత చేసేది
9. నస గల పండు
10. అపాత్రమైనది కాకూడదు
12. మసాలా నషాళినికి అంటేది
13. ఒక మత్స్యము
15. బాణం
16. మల్లెపూవే

నిలువు
2. మంచి మాట , మేలు కోరేవాడు
3. మత్యం
4.గురజాడవారి గేయఛందం
5. వేనేవాని భార్య
6. అడుగునుండి గురులేని నలుగురు
7. విశాఖ జిల్లాలో బెల్లానికి ప్రసిద్ధ గ్రామం
11. కత్తి దాచుకునే చోటు
13. ధనము
14. ఒక దుంప

మాటాట - 593 సమాధానం



మంచిమాట

భక్తి మార్గం

భక్తితో భగవంతున్ని ఆరాధించిన యెడల బాధలనుండి దూరమగుట తథ్యము. కోరికలు లేకుండా, నిండు మనస్సుతో పరిపూర్ణమైన విశ్వాసంతో భగవంతున్ని మనం ఆరాధిస్తే తప్పనిసరిగా ఫలితము కనిపిస్తుంది. సర్వకాల సర్వావస్థలయందు మనకు తోడు నీడగా వుండి సహాయము చేయువాడు సర్వాంతర్యామియైన ఆ భగవా నుడు తప్ప తోటి మానవులు కారు అని నమ్మవలెను. పరిపూర్ణ విశ్వాసంతో, నిస్వా ర్థంగా భక్తితో భగవంతున్ని శ్రద్ధగా ఆరాధిస్తే అతడు మనల్ని అన్ని బాధలనుండి తప్ప నిసరిగా కాపాడును. మన రక్షణ బాధ్యత అతడే స్వీకరించును. ఈ విషయాన్ని భగ వద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ ఈ విధంగా వివరించి యున్నారు. ''ఎవరైతే ప్రతినిత్యము నన్ను పరిపూర్ణ విశ్వాసంతో అత్యంత భక్తిశ్రద్ధలతో ధ్యానించుచు, ఎల్లప్పుడూ నాయందే నిష్ట కలిగియుంటారో, అట్టివారి యొక్క సర్వ యోగ క్షేమములను నేనే వహించుచున్నాను''- ఇది అందరూ తప్పనిసరిగా గుర్తుంచుకోవలసింది.

భక్తి అనేది నిర్హేతుకంగా ఉండాలి. అనగా నిష్కామంగానూ, నిరంతరముగానూ, పరిపూర్ణ విశ్వాసంతోనూ వుండవలెను. అప్పుడే పరిపూర్ణ చిత్తశుద్ధి కలిగి జ్ఞానోద యమై మోక్షప్రాప్తి కలుగును. భక్తి తొమ్మిది విధములు- శ్రవణము, కీర్తనము, స్మర ణము, అర్చనము, వందనము, సఖ్యము, ఆత్మనివేదనము, పాదసేవనము, దాస్యము. పై భక్తి మార్గాల ద్వారా ఏదో ఒకదానిపై సర్వేంద్రియములను భగవంతునియందే నిలిపి, తన సర్వస్వమును ఆ పరమాత్మకు అర్పించుటయే పరమభక్తి అంటారు. ఈ భక్తి మార్గమునే 'భక్తియోగమని' కూడా అంటారు.

'భక్తి రేవ గరీయసీ' అని చెప్పినట్లు ప్రతి ఒక్కరిని వారి వారి మనస్తత్వమును, స్థాయిని బట్టి సాధించుటకు వీలైనది 'భక్తిమార్గం' ఒక్కటే. బ్రహ్మీ ముహూర్తకాలము ఆధ్యాత్మిక సాధనములన్నిటికి చాలా ప్రశస్తమైనది. సర్వశ్రేయస్కరమయినది. బ్రహ్మీ ముహూర్తము సమయంలో సత్త్వగుణ స్వభావం కలిగి యుంటుంది. మన మనస్సు కూడా ప్రశాంతంగా, పరిశుద్ధముగా, నిర్మలమై యుంటుంది. ఈ శుభ సమయంలో గొప్ప ఆధ్యాత్మిక శక్తి ప్రసారము జరుగుతూ వుంటుంది. కాబట్టి ఇట్టి మహత్తర సమ యంలో భక్తిభావనకు అనుకూలమైన సమయం. ప్రార్థనకు, జపతపములకు మిక్కిలి అనుకూలమై ఉపకరిస్తుంది.

గీతలో శ్రీకృష్ణ పరమాత్మ ఇలా తెలియజేశారు. ఎవరు సమస్తములైన కామము లను వదలి, కోరికలు లేనివాడై, జీవనం గడుపుతూ 'నేను' నాది' అనే అహంకార మమకారాదులను వదలి యుంటాడో అట్టి పురుషుడే భక్తిభావంతో భగవంతున్ని ధ్యానిస్తాడో అట్టి పురుషుడే శాంతిని ముక్తిని పొందుచున్నాడు. భక్తితో, అహంకారం లేకుండా ఉంటాడో వాడే మనశ్శాంతిని పొందుతాడని పరమాత్మ చెప్పారు.

'భక్తకవి' బమ్మెర పోతన ఆంధ్ర మహాభాగవతములో అష్టమ స్కంధములోని వామనావతారములో బలిచక్రవర్తి తన గురువైన శుక్రునితో ఇలా అంటాడు- విష్ణు మూర్తి అంతటివాడు చెయ్యి చాచి నన్ను దానం అడుగుతున్నాడు. విష్ణుమూర్తి చెయ్యి ఎంతో గొప్పది. అటువంటి గొప్ప చేయి ఇప్పుడు క్రిందిది కావడమూ నా చేయి పైది కావడమూ అన్నది ఎంతో అదృష్టం. ఈ నీచమైన రాజ్యము శాశ్వతం కాదు. ఈ నా శరీరం అపాయం లేకుండా నిలిచేది కాదు. అందువల్ల తాను మాట తప్పలేదనే కీర్తి లభిస్తుందనీ బలి చక్రవర్తి శుక్రాచార్యునకు చెప్పాడు. బలిదాన గుణానికి, భక్తిభావా నికి ఇది ఒక ఉదాహరణ.

ప్రతిఫలాపేక్ష లేకుండా భగవంతున్ని నిర్మల మనస్సుతో పరిపూర్ణ విశ్వాసంతో పూజ చేస్తే అదియే నిజమైన భక్తి అంటారు. 'సర్వేంద్రియములతో, ఇంద్రియాదుల కధిపతియైన పరమాత్మను, నిష్టతో సేవించుటయే 'భక్తి'. కోరికలు అనంతములు, మనస్సు బహు చంచలమైనది. కావున కోర్కెలను అదుపులో వుంచి మనోనిగ్రహ మును పొందాలి. అప్పుడే నిర్మలమైన మనస్సుతో, నియమబద్ధమైన సాధనతో పర మాత్మను ధ్యానించుటకు సాధ్యమగును. ఇది భక్తి భావనకు అనుకూలమైనది.

-నల్లా నరసింహమూర్తి

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

ఆటాపోటీ

ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికీ 2014లో భారత క్రీడా రంగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఉన్నత శిఖరాలను అధిరోహించింది. వివాదాలు చుట్టుముట్టినా, సమస్యలు తలెత్తినా ఆత్మవిశ్వాసంతో అడుగు ముందుకేసింది. మహిళా బాక్సర్ సరితా దేవి ఇంచియాన్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకాన్ని స్వీకరించడానికి నిరాకరించడంతో ఆమెపై సస్పెన్షన్ వేటు పడింది. వెస్టిండీస్ క్రికెటర్లు వేతనాల విషయంలో బోర్డుతో విభేదించి, భారత్ పర్యటనను అర్థాంతరంగా ముగించి స్వదేశానికి వెళ్లిపోయారు. కాగా, ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ పరాజయాన్ని ఎదుర్కొన్నాడు. తెలుగు తేజాలు కశ్యప్, శ్రీకాంత్ తమతమ క్రీడల్లో సంచలనాలు సృష్టించారు. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నీ, ఇంటర్నేషనల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్ (ఐపిటిఎల్)లు భారత క్రీడా రంగానికి కొత్త అందాలు దిద్దాయి.

వీక్షణం - 2014

కశ్యప్ విజయకేతనం

గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో 'తెలుగు తేజం' పారుపల్లి కశ్యప్ 32 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌కు బాడ్మింటన్‌లో స్వర్ణ పతకాన్ని అందించాడు. ప్రకాష్ పదుకొనే, సయ్యద్ మోడీ తర్వాత కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకాన్ని సాధించిన మూడో భారతీయుడిగా చరిత్ర సృష్టించాడు. మహిళల డబుల్స్‌లో జ్వాల గుత్తా, అశ్వినీ పొన్నప్ప జోడీ రజత పతకాన్ని అందుకుంది.

కశ్యప్ విజయాన్ని భారత జాతి యావత్తు కొనియాడింది. ప్రకాష్ పదు కొనే, సయ్యద్ మోడీ, పుల్లెల గోపీచంద్ వంటి మేటి బాడ్మింటన్ క్రీడాకారుల వారసత్వాన్ని కొనసాగిస్తున్న కశ్యప్ ప్రస్తుతం భారత సింగిల్స్ ఆటగాళ్ల జాబితా లో అగ్రస్థానాన్ని సంపాదించుకున్నాడు.

రోహిత్ 'డబుల్' ధమాకా

భారత ఓపెనర్ రోహిత్ శర్మ వన్డే ఇంటర్నేషనల్స్‌లో అరుదైన 'డబుల్'తో ప్రపంచ రికార్డు సృష్టించాడు. శ్రీలంకతో జరిగిన నాలుగో వన్డేలో 264 పరుగులు చేసి, ఈ ఫార్మెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాట్స్‌మన్‌గా రికార్డు నెలకొల్పాడు. అంతేగాక వన్డేల్లో రెండు పర్యాయాలు డబుల్ సెంచరీ చేసిన తొలి ఆటగాడిగా మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక వన్డే ఇన్నింగ్స్‌లో అత్యధికంగా ఫోర్లు కొట్టిన రికార్డు కూడా అతనికి దక్కింది. ఈ మారథాన్ ఇన్నింగ్స్‌లో అతను 33 ఫోర్లు బాది మరో రికార్డు సొంతం చేసుకున్నాడు. 2011లో వెస్టిండీస్‌పై ఇండోర్‌లో వీరేందర్ సెవాగ్ 219 పరుగులు చేసి నెలకొల్పిన రికార్డును బద్దలు చేసిన రోహిత్ గత ఏడాది దక్షిణాఫ్రికాపై శిఖర్ ధావన్ 248 పరుగులతో సృష్టించిన లిస్ట్ 'ఎ'ను కూడా అధిగమించాడు. అతను తన చివరి 214 పరుగులను కేవలం 101 బంతుల్లోనే పూర్తి చేశాడు.

చైనాలో హైదరాబాదీల హవా

చైనా ఓపెన్ సూపర్ సిరీస్ ప్రీమియర్ బాడ్మింటన్ టోర్నీలో హైదరాబాదీల హవా కొనసాగింది. పురుషుల విభాగంలో కిడాంబి శ్రీకాంత్, మహిళల విభాగంలో సైనా నెహ్వాల్ సింగిల్స్ టైటిళ్లను కైవసం చేసుకున్నారు. సైనా తన కంటే తక్కువ ర్యాంక్‌లో ఉన్న క్రీడాకారిణిని ఓడిస్తే, శ్రీకాంత్ ఏకంగా ప్రపంచ మేటి లిన్ డాన్‌కే షాకిచ్చాడు.

రోహిత్ శర్మ

మకావూ క్వీన్ సింధు

మకావూ ఓపెన్ గ్రాండ్ ప్రీ బాడ్మింటన్ టోర్నమెంట్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంపియన్, భారత టీనేజ్ సంచలనం పివి సింధు నిలబెట్టుకుంది. ఈ సీజన్‌లో ఆమెకు ఇదే మొదటి టైటిల్. మహిళల ఫైనల్‌లో ఈ హైదరాబాద్ యువరాణి 21-12, 21-17 తేడాతో కిమ్ హ్యో మిన్ (దక్షిణ కొరియా)ను ఓడించింది.

'సర్దార్' సంచలనం

సర్దార్ సింగ్ నేతృత్వంలోని భారత హాకీ జట్టు ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకొని సంచలనం సృష్టించింది. ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను ఓడించి, 16 సంవత్సరాల విరామం తర్వాత ఆసియా క్రీడల్లో మళ్లీ విజేతగా నిలిచింది. 2016 రియో ఒలింపిక్స్‌లో పాల్గొనే అర్హతను కూడా సంపాదించింది.

శరవేగంగా ముందుకు..

గతంలో ఎన్నడూ లేని విధంగా భారత క్రీడా రంగం ఈఏడాది మరింత బలపడింది. అంతర్జాతీయ వేదికపై పతకాలను కొల్లగొట్టి తన ఉనికిని చాటుకుంది. భారత క్రీడాకారులు అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఉన్నత ప్రమాణాలను అందుకున్నారు. అభివృద్ధివైపు పరుగులుపెట్టిన భారత్ పేరు పలు సందర్భాల్లో ప్రపంచ వ్యాప్తంగా పతాక శీర్షికల్లో కనిపించింది.

గ్లాస్గోలో 64 పతకాలు

నాలుగేళ్ల క్రితం, 2010లో కామన్వెల్త్ గేమ్స్‌కు న్యూఢిల్లీలో ఆతిథ్యం ఇచ్చిన భారత్ 38 స్వర్ణం, 27 రజతం, 36 కాంస్యాలతో మొత్తం 101 పతకాలు సాధించి, ఆస్ట్రేలియా తర్వాత రెండో స్థానంలో నిలిచింది. అయితే, ఈసారి గ్లాస్గోలో అదే స్థాయిలో రాణించలేకపోయింది. 15 స్వర్ణం, 30 రజతం, మరో 19 కాంస్యాలతో 64 పతకాలకు పడిపోయింది. పతకాల జాబితాలో ఐదో స్థానాన్ని దక్కించుకుంది. భారత్ నుంచి అద్భుతాలను ఎవరూ ఊహించలేదు. ప్రస్తుత ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుంటే, పతకాల సెంచరీ పూర్తి చేయలేకపోయినా అర్ధ శతకాన్ని దాటడాన్ని భారత్ మెరుగైన ప్రదర్శనగానే పేర్కొనాలని విశ్లేషకుల అభిప్రాయం. 2010లో అగ్ర స్థానాన్ని ఆక్రమించిన ఆస్ట్రేలియా ఈసారి రెండో స్థానానికి పడిపోయింది. ఇంగ్లాండ్ మొదటి స్థానాన్ని ఆక్రమించగా, కెనడా, స్కాట్‌లాండ్ వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి.

ఆసియా క్రీడల్లో 8వ స్థానం

ఇంచియాన్‌లో జరిగిన 17వ ఆసియా క్రీడల్లో భారత్ 11 స్వర్ణాలుసహా మొత్తం 57 పతకాలు సాధించి, ఎనిమిదో స్థానంలో నిలిచింది. కబడ్డీ పురుషులు, మహిళల విభాగాల్లో స్వర్ణ పతకాలను గెల్చుకొని ఈ విభాగంలో తనకు తిరుగులేదని నిరూపించింది. రాకేష్ కుమార్, సుర్జీత్ సింగ్, నవనీత్ గౌరవ్, అజయ్ ఠాకూర్, జస్వీర్ సింగ్, అనూప్ కుమార్, గుర్‌ప్రీత్ సింగ్, రాజ్‌గురు, నితిన్ మాండే, సుర్జీత్ నర్వాల్, ప్రవీణ్, మన్జీత్ చిల్లార్ సభ్యులుగా ఉన్న పురుషుల కబడ్డీ జట్టు ఫైనల్‌లో ఇరాన్‌తో హోరాహోరీగా పోరాడి 27-25 పాయింట్లతో విజయం సాధించింది. ఆసియా క్రీడల్లో కబడ్డీ ఈవెంట్‌ను ప్రవేశపెట్టిన నాటి నుంచి ఒక్కసారి కూడా భారత్ ఈ టైటిల్‌ను చేజార్చుకోకపోవడం గమనార్హం. కాగా, భారత మహిళల కబడ్డీ జట్టులో తేజశ్వరీబాయ్, మమత పూజారి, ప్రియాంక, అభిలాష మహాత్రే, సుమిత్ర శర్మ, జయంతి, కవిత, కవితాదేవి, అనిత మావి, కిశోరీ షిండే, పూజా ఠాకూర్, సుస్మిత పొవార్ సభ్యులుగా ఉన్నారు. ఫైనల్‌లో ఇరాన్‌ను 31-21 చిత్తుచేసిన ఈ జట్టు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.

'విరాట్' కోహ్లీ

ఒక టెస్టు మ్యాచ్‌లో కెప్టెన్సీ వహించిన మొదటి మ్యాచ్‌లోనే రెండు ఇన్నింగ్స్‌లోనూ సెంచరీలు సాధించిన యువ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. రెగ్యులర్ కెప్టెన్ ధోనీ గాయం కారణంగా విశ్రాంతి తీసుకోగా, ఆస్ట్రేలియాతో జరిగిన మొదటి టెస్టుకు నాయకత్వం వహించిన కోహ్లీ తొలి ఇన్నింగ్స్‌లో 115, రెండో ఇన్నింగ్స్‌లో 141 చొప్పున పరుగులు సాధించాడు.

విరాట్ కోహ్లీ

ఇండియన్ ఏసెస్‌కు ఐపిటిఎల్

అంచనాల మేర ఉత్కంఠను రేపడంలో విఫలమైనప్పటికీ తొలి ఇంటర్నేషనల్ ప్రీమియర్ టెన్నిస్ లీగ్ (ఐపిటిఎల్) టోర్నమెంట్ అభిమానులను ఆకట్టుకుంది. పలువురు సీనియర్లు, రిటైరైన క్రీడాకారుల ఆటను చూసే అవకాశం లభించడమే వారి ఆనందానికి కారణమైంది. ఫైనల్‌లో యుఎఇ రాయల్స్‌ను ఓడించి టైటిల్ సాధిన ఇండియన్ ఏసెస్ జట్టులో రోజర్ ఫెదరర్, పీట్ సంప్రాస్, అనా ఇవానోవిచ్, సానియా మీర్జా వంటి స్టార్లు ఉన్నారు. సంప్రాస్, మార్టినా హింగిస్ తదితరుల ఆటను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించడంతో అభిమానులు ఆనందించారు. అయితే, భారత వెటరన్ ఆటగాడు మహేష్ భూపతి పర్యవేక్షణలో జరిగిన ఈ టోర్నమెంట్ టెన్నిస్ రంగంలో పెను తుపాను సృష్టిస్తుందన్న అంచనాలు నీరుగారిపోయాయి. ఒక్కో రోజు ఐదు మ్యాచ్‌లు ఉన్నప్పటికీ, ఒకే సెట్‌తోనే మ్యాచ్‌ని ముగించడం అభిమానుల నిరాశకు కారణమైంది. కనీసం మూడు సెట్లకు మ్యాచ్‌ని విస్తరించి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. అయితే, దీనిని పూర్తి వ్యాపార పరమైన టోర్నీగా భావించిన భూపతి సాధ్యమైనంత ఎక్కువగా ఆటగాళ్లను కోర్టులోకి దించడానికే ప్రాధాన్యతనిచ్చాడు. ఫలితంగా టోర్నమెంట్ ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) టి-20 క్రికెట్ టోర్నమెంట్ తిరుగులేని విజయం సాధించడంతో దాదాపు అన్ని క్రీడల్లోనూ ఇలాంటి టోర్నీలు తెరపైకి వచ్చాయి.

ఆసియా క్రీడల్లో మిక్స్‌డ్ డబుల్స్ టెన్నిస్ టైటిల్ సాధించిన సాకేత్ మైనేనీ, సానియా మీర్జా

మొదటి ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్ ట్రోఫీతో అట్లెటికో డి కోల్‌కతా జట్టు ఆటగాళ్లు.

బాడ్మింటన్‌లో ఉన్నత శిఖరాలు

భారత బాడ్మింటన్ స్టార్లు ఈఏడాది ఉన్నత శిఖరాలను అధిరోహించారు. వీరిలో ఎక్కువ మంది హైదరాబాదీలు కావడం విశేషం. మొత్తం మీద ఈ ఏడాది భారత్‌కు ఎనిమిది ఇండివిజువల్ టైటిళ్లు లభించాయి. టీం చాంపియన్‌షిప్స్‌లోనూ భారత్ మెరిసింది.

చైనా సూపర్ సిరీస్‌లో సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ వరుసగా మహిళలు, పురుషుల సింగిల్స్ టైటిళ్లు సాధించడం సంచలనం సృష్టించింది. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో టీనేజర్ పివి సింధు కాంస్య పతకాన్ని నిలబెట్టుకుంది. ఉబేర్ కప్, ఆసియా క్రీడల్లో కాంస్య పతకాలను అందుకుంది. సైనా ఈఏడాది మూడు టైటిళ్లను గెల్చుకుంటే, పారుపల్లి కశ్యప్, అరవింద్ భట్, సింధు, ప్రణయ్ కనీసం ఒక్కో టైటిల్ అందుకున్నాడు. సౌరభ్ వర్మ, పిసి తులసి కూడా అంతర్జాతీయ చాలెంజ్ విభాగంలో పతకాన్ని సాధించారు.

ఆసియా బాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో జ్వాల గుత్తా, అశ్వినీ పొన్నప్ప జోడీ మహిళల డబుల్స్‌లో కాంస్య పతకాన్ని గెల్చుకుంది.

'క్రికెట్ మక్కా' అని పిలిచే లార్డ్స్ మైదానంలో 28 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత భారత్ తొలిసారి ఇంగ్లాండ్‌ను ఓడించి చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. ఇశాంత్ శర్మ 74 పరుగులకు ఏడు వికెట్లు పడగొట్టి టీమిండియాకు 95 పరుగుల తేడాతో విజయాన్ని అందించాడు. 2011 తర్వాత భారత్ విదేశాల్లో ఒక టెస్టు గెలవడం కూడా అదే తొలిసారి.

ఏస్ షూటర్ అభినవ్ బింద్రా కామన్వెల్త్ గేమ్స్‌లో తొలిసారి స్వర్ణ పతకాన్ని అందుకున్నాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో అతను విజేతగా నిలిచాడు.

ఇంచియాన్ ఆసియా క్రీడల్లో మహిళల 48-51 కిలోల విభాగంలో మేరీ కోమ్ స్వర్ణ పతకం సాధించింది. ఫ్లైవెయిట్ విభాగం ఫైనల్‌లో ఆమె కజకస్తాన్ బాక్సర్ జైనా షెకెర్బెకొవాను ఓడించింది.

దీపిక పల్లీకల్

స్క్వాష్‌లో సంచలనం

స్క్వాష్‌లో భారత్ సంచలన విజయాలను నమోదు చేసింది. దీపిక పల్లీకల్, జోష్న చిన్నప్ప, సౌరవ్ గోసల్ చాలా కాలంగా భారత స్క్వాష్‌లో తిరుగులేని ఆధిపత్యాన్ని కనబరుస్తుండగా, హరీందర్‌పాల్ సింగ్ కూడా ఈ జాబితాలో చేరాడు. కామన్వెల్త్ గేమ్స్ మహిళల డబుల్స్‌లో దీపిక, జోష్న భారత్‌కు తొలిసారి స్వర్ణ పతకాన్ని సాధించిపెట్టారు. ఇంచియాన్ ఆసియా క్రీడల్లో భారత్‌కు గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక స్వర్ణం, రెండు రజతం, ఒక కాంస్యంతో మొత్తం నాలుగు పతకాలు లభించాయి.

నాలుగు టైటిళ్ల అద్వానీ

బిలియర్డ్స్, స్నూకర్‌లో పంకజ్ అద్వానీ జోరు కొనసాగింది. ఈ ఏడాది అతను ఏకంగా నాలుగు ప్రపంచ టైటిళ్లను గెల్చుకున్నాడు. ఫలితంగా అతని ఖాతాలో ఈ టైటిళ్ల సంఖ్య 8 నుంచి 12కు పెరిగింది.

ఆసియా స్నూకర్ టీం చాంపియన్‌షిప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను పాకిస్తాన్‌లోనే ఓడించిన అద్వానీ, కమల్ చావ్లా, ఫైసల్ ఖాన్, ధర్మేందర్ లిల్లీ భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ■

సాహితి

email: sahiti@andhrabhoomi.net

ఆంధ్రభూమి సోమవారం, 29 డిసెంబర్ 2014

గురజాడ ప్రతిష్టకు ఎప్పుడూ లోటు లేదు

స్పందన

డి.1.12.14వ తేదీన ప్రచురింపబడిన ''పాలకులకు పట్టని గురజాడ'' అను రచనలో రామతీర్థగారు అప్పారావుగారిని ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన చెందారు. ఆయనను నిర్లక్ష్యం చేసిందన్నారు. మన తెలుగు కవులలో గుఱజాడ అప్పారావుగారికి లభించిన యశస్సు ఏ ఇతర కవికి దక్కలేదంటే అతిశయోక్తికాదు. తెలుగు సాహితీ రంగంలో మేరునగతుల్యుడు విశ్వనాథ వారికి గాని తెలుగు భాషలో ఒక విచిత్ర శైలి ప్రదర్శిస్తూ సాక్షి వ్యాసాలు వ్రాసిన బహుముఖ ప్రజ్ఞాశాలి పానుగంటివారికి గాని చిలకమర్తి వారికి గాని జావా సి.నా.రె తదితర ప్రముఖులకు గాని ఇలాటి కీర్తి రాలేదు. బ్రాహ్మణులలో ఒకానొక శాఖలోగల దురాచారాన్ని అప్పారావుగారు కన్యాశుల్కం నాటకంలో ఎత్తి చూపారు. ఆనాటి సాంఘిక వ్యవస్థను కూడా కళ్లకు కట్టినట్టు చూపారు. సుమారు వందేళ్లు దాటి పోయిన ఆ నాటకం నేడు చాలమందికి అర్థంకాదు. తెలంగాణా రాయలసీమలలో అసలు అవగాహన కాదు. పేరుకి వ్యావహారిక భాష అయినా అందులోని ఇంగ్లీషు, సంస్కృతం, హిందుస్థానీ పదాలు, వాక్యాలు చాలమందికి తెలియవు. తెలుగు కవులలో గుఱజాడను మించినవారు లేరనే అభిప్రాయం ప్రబలింది. ఈ అభిప్రాయం కలగడానికి పత్రికల ప్రచారమే కారణం. కన్యాశుల్కం నాటకం వలన వృద్ధులు ధనం ఇచ్చి బాలికలను వివాహం చేసుకునే ఆచారం సమసిపోలేదు. అది కేవలం కొన్ని సాంఘిక రాజకీయ మార్పులవలన కనుమరుగైంది. చింతామణి నాటకంతో వేశ్యావృత్తి నశించలేదు. వరవిక్రయం నాటకంతో కట్నం సమస్య పోలేదు. ఇవి ఇప్పుడు మరో రూపంలో ఉన్నాయి. గుఱజాడ నివసించిన గృహాన్ని ప్రభుత్వం పదిల పరచలేదని నామమాత్రంగా ఉన్న స్మారక మందిరాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ప్రభుత్వానికి కవులకి కవిత్వానికి అసలు సంబంధం ఏదీ లేదు. స్మారక మందిరాలను ఎల్లకాలము ఎవరు కాపాడగలరు? కాళిదాసాది మహాకవుల స్మారక చిహ్నాలు ఎక్కడయినా ఉన్నాయా? వారి కృతులు ప్రధానంకాని స్మారక చిహ్నాలు కావు. మన ప్రభుత్వానికి ఏ కవిపై ఎప్పుడు అభిమానం కలుగుతుందో తెలియదు. రంగస్థల నాటకాలతో సంబంధంలేని వీరేశలింగంగారి పేర నాటకోత్సవాలు జరుపుతున్నారు. మహోన్నత రంగస్థల నాటకాలు రచించిన తిరుపతి వేంకట కవులు, బలిజేపల్లి, కాళ్లకూరి తదితర ప్రముఖులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి గుర్తురారు. ఇదేం న్యాయం? ''గుఱజాడ వ్యక్తిత్వం గిరీశంలో ఉన్నదని భావించే వారి సంఖ్య ఎంత ఉన్నా వాల్మీకిలో రావణుడు ఉన్నాడంటే ఎంత నొచ్చుకుంటామో అటువంటిదే ఈ వదరుబోతుతనం కూడా'' అన్నారు. ఈ వదరుబోతు ఎవరు? వెల్చేరు నారాయణరావు గారా? ఆయన అనువాదం నేను చదవలేదు. అప్పారావుగారు అంటే సౌజన్యరావు పంతులుగారే అని అందరికి తెలుసు. ఆయనను నిందించడం ఏనుగును చూచి కుక్కలు మొరగడం వంటిది. అప్పారావుగారికి కీర్తిప్రతిష్టలు రావలసిన దానికంటె ఎక్కువే వచ్చాయి. ప్రభుత్వం ఆయనను పట్టించుకోనంత మాత్రాన ఆయన ప్రతిష్టకి ఏ లోటు లేదు.

- వేదుల సత్యనారాయణ, 9618396071

కవిత్వానికి గ్లామర్ వుంటే చాలా?

ఉత్తరం

సినిమా వాళ్ళు, రాజకీయవాదులు తమ పలుకుబడిని, స్వార్థాన్ని ప్రచారం చేసుకోవటం లేదా? అంటూ కవిత్వానికి గ్లామర్ అవసరమే, తమను రకరకాలుగా ఫోకస్ చేసుకోవటం కవిత్వానికి వ్యాప్తి కలిగించటంలో ఒక భాగమే అన్నారు ద్వా.నా.శాస్త్రి డిసెంబర్ 15 సాహితీలో ప్రచురించబడిన వ్యాసంలో. ఆనంద వర్ధనుడు, జాషువా, బాలగంగాధర తిలక్‌లను ఉదాహరిస్తూ అన్ని ప్రక్రియలకన్న కవిత్వం మిన్న అంటూ కవిత్వానికి ఆకర్షణ ఉందని స్పష్టం చేసారు. ఈ సంక్షిప్త వ్యాసంలో, ఎన్నో బాలారిష్టాలు దాటుకొంటూ వచ్చిన కవితా సంపుటికి ఆవిష్కరణ, పరిచయ సభలు, అంకిత సభలు పెట్టుకొంటే పెదవి విరిచి నొసలు చిట్లించే కొందరిపై విమర్శనాస్త్రం సంధించారు. ఆ విధంగా నిరసించటం సబబుకాదంటారు. ఫోకస్ చేసుకోకపోవటం వల్లనే, చేతకాకపోవటం వల్లనే గొప్ప కవులు మరుగునపడి వారి రచనలు వెలుగులోకి రాలేదని, ఎన్నో పోగొట్టుకొన్నాం అంటూ కవి సమ్మేళనాలు, ఆవిష్కరణల ఆవశ్యకత వివరించారు. గ్లామర్ అనేది కొందరికి అలంకారమే! ఇతరులకి ఆకర్షణీయమే అంటే శాస్త్రిగారి అభిప్రాయం ప్రకారం కవిత్వానికి గ్లామర్ అవసరం. అందుకని ఆవిష్కరణ సభలు ఒక చోట కాకుండా వీలుంటే మళ్ళీమళ్ళీ చేయాలి. కవిత్వ సభలను అధికారులను, సినిమా వాళ్ళని, మంత్రుల్ని అనర్హులయినా ఆహ్వానించి ప్రచారం పొందాలి. పత్రికలిచ్చే ప్రాధాన్యతా ప్రచారంకోసం వారిని ఆహ్వానించాలి. ఒక మంచి కవి, సాహితీవేత్తను పిలిస్తే ఆ వార్త రావచ్చు. రాకపోవచ్చు. వచ్చినా ఒక మూల ఒదిగి కూర్చోవచ్చు. మరి కవి ఏం చెయ్యాలి అని ప్రశ్నిస్తున్నారు శాస్త్రిగారు! అధికారులు, సినిమా వాళ్ళు, మంత్రులు ఆ వేదికపై వుంటే మంచి కవిత్వం చిన్నపోదా! వాళ్ళు అర్హులయితే సబబే. లేకపోతే కవిత్వం, దైన్యం పొందదా? ప్రచారమే ముఖ్యమా? సరే, నిజమే. పుస్తకావిష్కరణ సభలు నిర్వహించి కాలానుగుణంగా కవిత్వానికి గ్లామర్ తెచ్చే ప్రచారం చేయటం, మీ అభిప్రాయం ప్రకారం ఆ విధంగా ఫోకస్ పొందటం సమాజానికి హితం కలిగించేదే.

- జయసూర్య, 9440664610

పుస్తక ప్రియులు తగ్గారని ఎవరన్నారు?!

జనం తండోపతండాలుగా వస్తున్నారక్కడకు.... అంతకు ముందు కోటి దీపోత్సవం కోసం వేల మంది అక్కడికి వచ్చినప్పుడు భక్తి ఉద్యమం మళ్లీ మొదలైందనిపించింది. ఇప్పుడు మళ్లీ అదే దృశ్యం.. అదే స్టేడియం .. అదే విధంగా వేల మంది గుంపులు గుంపులుగా వచ్చారు. ఈసారి వచ్చింది జ్ఞాన జ్యోతులు వెలిగించుకోవడానికి. ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 17 నుంచి 26 వరకు నిర్వహించిన హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో కనిపించిన దృశ్యం ఇది. సెలవు రోజు పుస్తక ప్రదర్శన తిలకించడానికి లక్ష మంది తరలి వచ్చారు అంటే పుస్తకం అజరామరం అని ఎవరికైనా అనిపించకుండా ఉంటుందా? నుమాయిష్‌ను తలపించే విధంగా పుస్తక ప్రియులు తరలి రావడం నిర్వాహకులను సైతం విస్మయ పరిచింది. భూమ్మీద ఇప్పుడు బతికున్న వాళ్లు ఎవరూ పుట్టక ముందు వచ్చిన పుస్తకాలను సైతం నేటి కుర్రకారు ఆసక్తిగా కొంటుంటే పుస్తకానికి మరణం లేదు అనడంలో సందేహం ఎందుకు?

ఏనుగుల వీరాస్వామి కాశీయాత్ర చరిత్ర, సాక్షి వ్యాసాలు , గణపతి పుస్తకాలు మళ్లీ కొత్త రంగుల్లో స్టాల్స్‌లో కళకళలాడుతూ కనిపించాయి. అవి ఏ కాలం నాటివి? వందేళ్లు దాటిన రచనలు జూనియర్ రచయితల సరసన గర్వంగా నిలుచున్నాయి. ఆనాటి తరంపై తమ ప్రభావాన్ని చూపిన ఇలాంటి పుస్తకాలు సైతం ఇప్పుడు పుస్తక ప్రదర్శనలో నేటి తరం యువత చేతుల్లో కనిపిస్తున్నాయి. ఒకప్పటి ప్యాంట్లే ఇప్పటి ఫ్యాషన్ అన్నట్టుగా వందేళ్ల క్రితం నాటి పుస్తకాల పట్ల నేటి తరం ఆసక్తి చూపుతోంది.

ఇప్పుడు ఆన్‌లైన్‌లో సినిమాలు చూడవచ్చు, అరచేతిలో ఇమిడిపోయే సెల్‌ఫోన్‌లో ఇంకా విడుదల కాని సినిమాలు సైతం చూసేస్తున్నారు. సెల్‌ఫోన్‌లో పుస్తకాలూ చదువుకోవచ్చు. ఇలాంటి కాలంలో సైతం పుస్తకం హస్తభూషణం అనుకునే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. ఒకప్పుడు నవలలను ఇష్టపడ్డవారు ఇప్పుడు వ్యక్తిత్వ వికాస పుస్తకాలను ఇష్టపడుతుండవచ్చు. భక్తి పుస్తకాలకు అమ్మకాల్లో మంచి రేటింగ్ ఉండొచ్చు. ఏదో ఒక అంశంపై అధ్యయనానికి ఉపయోగపడే పుస్తకం చదువుతుండవచ్చు. ఇష్టపడే పుస్తకాల్లో మార్పు ఉంది కానీ పుస్తకాలను ఇష్టపడడంలో మార్పు లేదని పుస్తక ప్రదర్శనలు నిరూపిస్తున్నాయి. టీవీల యుగంలో పుస్తకాలకు కాలం చెల్లిందనే ప్రచారం జరిగింది, కానీ వాటి ముందు పుస్తకాలు సగర్వంగా తలెత్తుకుని నిలబడుతున్నాయి. ఇది నాణానికి ఒకవైపు. ఒకప్పుడు దేశంలో జరిగిన పారిశ్రామిక అభివృద్ధిని ఔత్సాహికులకు, సామాన్య ప్రజలకు వివరించడం అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) ప్రధాన లక్ష్యం. కానీ అది క్రమంగా అమ్మకాలు కొనుగోళ్ల ప్రదర్శనగానే మిగిలిపోయింది.

పుస్తక ప్రియులను, పుస్తక ప్రచురణ కర్తలను, పుస్తక విక్రేతలను ఒకచోట చేర్చే పుస్తకాల పండుగను 1985లో తొలిసారిగా నగర కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈనెల 15 నుంచి 26 వరకు ఎన్టీఆర్ స్టేడియంలో 28వ పుస్తక ప్రదర్శన విజయవంతంగా ముగిసింది. 28 ఏళ్ల కాలంలో పుస్తక ప్రదర్శన ఇంతై వటుడింతై అన్నట్టు పెరిగింది. సందర్శకులను చదివే వారి సంఖ్యను రోజు రోజుకు పెంచుకుంటోంది. ప్రదర్శనకు లభించిన స్పందన చూసి పుస్తక ప్రియులు సంబరపడ్డారు. బాగానే ఉంది కానీ అదే సమయంలో నుమాయిష్‌లానే పుస్తక ప్రదర్శన సైతం అమ్మకాలు, కొనుగోళ్ల వ్యవహారంగానే మిగలాలా? పాలకులు తెలుగు అక్షరాలపై నిషేధం విధించిన నిజాం కాలంలో సైతం తెలంగాణలో ధైర్యంగా గ్రంథాలయ ఉద్యమం నిర్వహించారు.

గ్రంథాలకు అమ్మకాలు, కొనుగోళ్లు మాత్రమే కాదు అంతకు మించిన ప్రయోజనం ఉంది. సమాజంపై తీవ్రమైన ప్రభావం చూపించే శక్తి ఉంది. తెలంగాణ ఉద్యమంలో ఆట, పాట తరువాత సాహిత్యమే కీలక పాత్ర వహించింది. తెలంగాణ ఆవిర్భావం తరువాత జరిగిన తొలి పుస్తక ప్రదర్శన ఇప్పటి వరకు జరిగిన ప్రదర్శనలకు భిన్నంగా జరిగితే బాగుండేది. తొలి ప్రదర్శన నగర కేంద్ర గ్రంథాలయం నుంచి రెండవ సంవత్సరం తరువాత నారాయణగూడలోని కేశవ మెమోరియల్ కాలేజీలో నిర్వహించారు. అటు తరువాత గత ఐదేళ్ల పాటు నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత తొలిసారిగా ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ ప్రాంతంలో తెలంగాణ సాంస్కృతిక కేంద్రాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ స్థలంలో నిర్వహించిన తొలి పుస్తక ప్రదర్శన కొంత భిన్నత్వాన్ని చూపిస్తే బాగుండేది అనేది కొందరి అభిప్రాయం. హైదరాబాద్, విజయవాడ, ఢిల్లీ, చెన్నై ప్రాంతాలకు చెందిన పలువురు పబ్లిషర్స్ 315 స్టాల్స్‌లో పుస్తకాలను విక్రయించారు. అయితే పెద్ద పబ్లిషర్స్ హవానే పుస్తక ప్రదర్శనల్లోనూ కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. దీని వల్ల తమ పుస్తకాలు తాము ప్రచురించుకుని తామే విక్రయించుకోవాలనుకునే వారికి పెద్దగా ప్రయోజనం ఉండదు. రచయితలు సొంతంగా స్టాల్స్ నిర్వహించుకుంటే కేవలం 15 వందల రూపాయలకే ఒక స్టాల్‌ను కేటాయించినట్టు, ఇది రచయితలను ప్రోత్సహించడమే అనేది హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ అభిప్రాయం. ఎవరో కొద్దిమంది తప్ప రచయితలు సొంతంగా స్టాల్స్ నిర్వహించుకోవడం అనుకున్నంత సులభం కాదు. రాయగలిగిన వారికి అమ్ముకునే నైపుణ్యం ఉండక పోవచ్చు. అలాంటి నైపుణ్యం ఉన్నవారికి రాసే శక్తి ఉండక పోవచ్చు. ఇక్కడే పుస్తక ప్రదర్శనశాల నిర్వాహకులు తమ వంతు పాత్ర పోషించాలి. ఇలాంటి ప్రయత్నం పెద్దగా జరుగుతున్న సూచనలు కనిపించడం లేదు. ఇలాంటి అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వచ్చే సంవత్సరం మార్పులను ఆశించవచ్చు. పుస్తక ప్రదర్శనకు పుస్తక ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరు కావడం, క్రిస్మస్ రోజు ఒక్కరోజే లక్ష మంది హాజరు కావడాన్ని చూస్తే పుస్తకాల పట్ల మళ్లీ ప్రజల్లో ఆసక్తి పెరిగిందనడానికి నిదర్శనంగా పేర్కొనాలి. పెద్ద బుక్‌స్టాల్స్ వాళ్లు నాలుగైదు స్టాల్స్ తీసుకోవడం వల్ల సహజంగా వారి స్టాల్స్‌పై ఫోకస్ ఎక్కువగా ఉంటుంది. అంతేకాదు, సందర్శకుల దృష్టిలో పడే చోటే వీరి స్టాల్స్ ఉండడం విశేషం. విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ వంటి బడా పబ్లిషర్స్ పుస్తకాల అమ్మకాల పైనే ప్రధానంగా దృష్టిసారించాయి. అమ్మకాల్లో సింహభాగం వీరిదే. అయితే ఔత్సాహిక పబ్లిషర్స్ మాత్రం పుస్తకాల విక్రయాలతో పాటు రచయితలకు ప్రచారం కల్పించేందుకు పుస్తక ప్రదర్శనను ఉపయోగించుకున్నారు. ప్రదర్శన నిర్వాహకులు సైతం బడా పబ్లిషర్స్‌కు ప్రాధాన్యత ఇవ్వడం కన్నా రచయితలకు ప్రచారం కల్పిస్తున్న ఔత్సాహిక పబ్లిషర్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్, విజయవాడ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పుస్తక ప్రదర్శనలు పుస్తక ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. హైదరాబాద్, విజయవాడలలో జరిగే పుస్తక ప్రదర్శనల్లో తెలుగు సంస్కృతి చాటి చెప్పే విధంగా వినూత్న తరహాలో పుస్తక ప్రదర్శలను నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఒక రాష్ట్రంలో ఒకచోట అని మాత్రమే కాకుండా జిల్లాల్లో సైతం పుస్తక ప్రదర్శనలు నిర్వహిస్తే పుస్తకాలు చదివే అలవాటు మరింతగా పెరుగుతుంది. పుస్తక ప్రియులు రాజధాని నగరాల్లోనే కాదు జిల్లా కేంద్రాలు, మారుమూల గ్రామాల్లో సైతం పెద్ద సంఖ్యలోనే ఉంటారు. రవాణా సౌకర్యాలు ఏ మాత్రం లేని కాలంలో, దశాబ్దాల క్రితమే గ్రామ గ్రామాన గ్రంథాలయ ఉద్యమం నిర్వహించినప్పుడు జిల్లా కేంద్రాల్లో పుస్తక ప్రదర్శన నిర్వహించడం పెద్ద కష్టమా?

- బుద్ధా మురళి

పురస్కారాలు

చింతకింది శ్రీనివాసరావుకు చాసో స్ఫూర్తి పురస్కారం

ప్రతిష్ఠాత్మక చాసో (చాగంటి సోమయాజులు) స్ఫూర్తి పురస్కారానికి ప్రముఖ కథా రచయిత డా. చింతకింది శ్రీనివాసరావు ఎంపికయ్యారు. చాసో మార్గాన కళింగాంధ్ర మాండలికంలో ప్రజా జీవితపు కథలు రచిస్తున్నందుకు గాను శ్రీనివాసరావును ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు చాసో స్ఫూర్తి సాహిత్య ట్రస్టు ప్రతినిధి చాగంటి తులసి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పురస్కారాన్ని 2015 జనవరి 17న విజయనగరంలో జరిగే చాసో శతజయంతి వేడుకల సభల్లో అందజేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్ర యాస భాషల్లో కథలు రాస్తున్న రచయితగా చింతకింది శ్రీనివాసరావు తెలుగు పాఠకలోకానికి చిరపరిచితులు. స్థానీయ పరిస్థితులపై, మానవ జీవితంపై ప్రపంచీకరణ చూపుతున్న ప్రభావాన్ని వాడుక పదాల్లో కథగా కట్టడం ఆయనకు తెలిసిన కళ. రావిశాస్త్రి, చాసో, పతంజలి వారసునిగా ఉత్తరాంధ్రలో కథల పంట పండిస్తున్న చింతకింది శ్రీనివాసరావుకు ఇప్పటికే భరతముని సాహిత్య పురస్కారం సహా పలు అవార్డులు దక్కాయి.

దామెర రాములుకు అలిశెట్టి స్మారక పురస్కారం

ప్రఖ్యాత కవి అలిశెట్టి ప్రభాకర్ పేర ఏటా ఇస్తున్న స్మారక పురస్కారానికి ప్రముఖ కవి డా. దామెర రాములు ఎంపికయ్యారు. అలిశెట్టి ప్రభాకర్ స్మృతిలో రాష్ట్ర స్థాయిలో తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఈ పురస్కారాన్ని గత మూడేళ్ళుగా అందజేస్తోంది. అలిశెట్టి ప్రభాకర్ రాజకీయ, ఆర్థిక, సాహిత్య విశ్వాసాలు దామెర రాములు కవిత్వంలోనూ పాయలు పాయలుగా సామీప్యత చెందుతాయి. ఈ పురస్కార సభ 2015 జనవరి 11న కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరుగుతుందని కరీంనగర్ జిల్లా తెలంగాణ రచయితల వేదిక ఒక ప్రకటనలో తెలిపింది.

సుంకర గోపాలయ్యకు ఎక్స్‌రే అవార్డు

సాహితీ ప్రియులు, కవులు, అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఎక్స్‌రే జాతీయ స్థాయి అవార్డుకు నెల్లూరు జిల్లాకు చెందిన కవి సుంకర గోపాలయ్య ఎంపికయ్యారు. 'ఒక సూర్యుడు - ఒక నెలవంక' రచనకు గాను గోపాలయ్యకు ఈ అవార్డు లభించింది. ఈ అవార్డు కింద పదివేల నగదు, జ్ఞాపికతో గోపాలయ్యను సత్కరించనున్నారు.



అతడు ఆత్మహత్య చేయబడుతున్నాడు

మూల మూలకు మృత్యువాసన!

ఎవరు
ఎలా మరణించినా
అతడు మాత్రం
నా మెతుక్కోసం
నా బతుక్కోసం కలవరిస్తున్నందుకే
ఆత్మహత్య చేయబడుతున్నాడు

పయనం మొదలైనప్పుడు
వొక కాలాన్ని
ఆకుపచ్చగా మంత్రించేవాడు

వేర్లు పెకిల్చే
తుఫాను కెదురునిల్చినప్పుడు
గింజ తదని కాదు
ఎరువు తదని కాదు
భూమి తనది కాదు
చినుకు తనది కాదు
బతుకు తనదికాదు
మెతుకు తనదికాదు
కాలం
అతడి గుప్పిట్లోంచి జారిపోయింది

పగుళ్ళ చర్మంమీద
విత్తు మరణయాతన చూసి
ఒక్కడే-
గింజనోదారుస్తూ
నా మెతుక్కోసం
పురిటి నొప్పులతో పట్టిన మొలక
శ్రమసారె మీంచి జారిపోతున్నా-

ఆకాశం మొత్తం
కుప్పకూలేంత మబ్బు దృశ్యమై
రెప్పపడని కళ్ళని
వొక్క చినుకూ పలకరించదు

క్షణ క్షణం
కొత్త కొత్త ఉరితాళ్ళు
పాత పాత ఉరి తాళ్ళు
అతడి విశాల ఆవరణంతా మోహరిస్తాయి
మెతుకు మెతుక్కు
నేనతన్ని ధ్యానిస్తుంటే
నా మెతుకును కలవరిస్తూ కలవరిస్తూ-
ప్రాణాల్ని ఖాళీచేసి
అతడు వాడిన జిలుకర మందార
పువ్వులా
వేలాడ్తుంటాడు చీలికలు పేలికలై

రణమాఫి చేశాం
రుణమాఫి చేస్తున్నాం
రైతే రాజు
రైతే దేశానికి వెన్నెముక
జై కిసాన్

చావుడప్పుల్లా మోగుతుంటాయ్
తన చెమట తాగిన గింజలెక్కడో
దుఃఖాస్తుంటాయ్

అయినా-
వొకడు మళ్ళీమళ్ళీ
యుద్ధం గెలుస్తాననే-
పంట పొలాన్ని తలకెత్తుకొని
నా మెతుకు నిర్మించడానికి వస్తుంటాడు
నా బతుకు నిర్మించడానికి వస్తుంటాడు

అయ్యో! పాపం!
పాము రాకుండా
ఇంటెనుక మా అమ్మ తెల్లుసిరి నాటినట్టి
చావురాకుండ
నాటడానికో చెట్టుంటే బాగుండేది
చేన్లు పొలాలు చెలకల చుట్టూ
అతడికోసం నాటొచ్చేవాణ్ణి

- వడ్డెబోయిన శ్రీనివాస్
9885756071

కొద్దిపాటి మార్పులే మేలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది కనుక ఒక కొత్త ప్రామాణిక తెలుగు భాషను తయారుచేసుకోవాలనే కోరిక ఇటీవల వెల్లడైంది. ఇది ఆలోచించతగిందే. తెలంగాణ ప్రజలు మాట్లాడే భాష గతంలో అనాదరణకు, అణచివేతకు గురైందనటంలో అనుమానం లేదు. అయితే భాషలో మార్పును సాధించే ప్రయత్నంలో హడావుడికి దూకుడుతనానికి పోకుండా నిదానాన్ని, జాగ్రత్తను పాటించటం ఎంతైనా అవసరం. ఈ విషయంలో రెండు రకాల ప్రతిపాదనలకు వీలుంది. మొదటిది ఉద్యమ కాలంలో తెలంగాణ కవుల రచయితల భాష ఏ రకమైన మార్పునకు లోనైందో ఆ రకమైన మార్పునే అదే తోవలో మరికొంత పొడిగించటం. రెండవది, ఇప్పుడున్న ప్రామాణిక తెలుగు భాషకు సమాంతరంగా వేరొక ప్రత్యేకమైన ప్రామాణిక భాషను సమూలమైన మార్పులతో తయారుచేసుకోవడం. మొదటి ప్రతిపాదనను ఒప్పుకుని దాని ఆచరణ కోసం ప్రయత్నించేటప్పుడు జాగ్రత్త బాగా అవసరం కాకపోవచ్చును కాని, రెండవ ప్రతిపాదన కోసం పనిచేసేటప్పుడు మాత్రం తొందరపాటులో ఇబ్బందుల్ని కొనితెచ్చుకునే ప్రమాదముంది కనుక జాగ్రత్త అవసరం. కొత్త భాషను తయారుచేసుకునే క్రమంలో సంస్కృత పదాల్ని కొంచెం తగ్గించుకుని, ప్రాంతీయ నుడికారాన్ని కొంచెం పెంచుకుంటే నష్టం ఉండకపోవచ్చు. అంటే అచ్చ తెలుగు పదాలు, సామెతలు, మాండలిక పదాలు తెలంగాణ నుడికారానికి నిండుతనాన్ని తెస్తాయి కనుక వాటి ఉపయోగాన్ని ఎక్కువ చేయవచ్చునన్నమాట. అట్లా కాకుండా సంస్కృత పదాలను పూర్తిగా మానుకుంటూ తెలంగాణ మాండలిక గ్రామ్య పదాలను విపరీతంగా గుప్పిస్తే తయారయ్యే భాషను ప్రామాణికం చేసుకుంటే ఒక రకమైన ఇబ్బంది తలెత్తే అవకాశముంది. అటువంటి భాషలో సొగసుతోపాటు తెలంగాణ తనం బాగా కనపడి మనకు ఆనందాన్ని కలిగించవచ్చు. కాని అది ఒక రకంగా విజయం తాలూకు సంతృప్తినిచ్చే విషయమే అయినా, మరొక రకంగా ఇబ్బందిని తెచ్చే సంగతవుతుంది. ఎందుకంటే ఆ కొత్త భాష సీమాంధ్రలోని పదమూడు జిల్లాల తెలుగు ప్రజలకూ, ఇతర రాష్ట్రాల్లోని, ప్రపంచంలోని తెలుగు ప్రజలందరికీ అర్థంకాక, కేవలం తెలంగాణకు చెందిన పది జిల్లాల ప్రజలకు మాత్రమే పరిమితమవుతుంది. మనం తయారు చేసుకోబోయే కొత్త భాష దేశమంతటా, ప్రపంచమంతటా వ్యాపించటానికి బదులు అట్లా కుంచించుకుపోవడం మనం కోరుకునే విషయమేనా? మన భాషలో ప్రాంతీయతను నింపుకుంటూనే ప్రపంచంలోని తెలుగువాళ్లందరిచేతా దాన్ని ఆమోదింపజేయటమనేది ఎట్లాగూ కుదరని విషయం కనుక, ఆమోదం అనే విషయాన్ని త్యాగం చెయ్యాల్సి వుంటుంది అని వాదించి సరిపెట్టుకోగలమా?

సాహిత్య రచనల్లో భాష పరమైన మార్పును సమీక్షించేటప్పుడు ఔచితికీ, లెజిటిమెసీకి విలువనివ్వాల్సి వుంటుంది. నిజానికి సమంజసత్వం అనే కోణంలోంచి చూస్తే కథను చెప్పే రచయిత విద్య లేనివాడైనా పల్లెటూరి మోటు మనిషిగా మారి రాస్తున్నపుడు తప్ప, అతని వాక్యాలన్నీ మాండలికంలో వుండటం సబబు కాదు. ఉదాహరణకు నామినిలాగా ఒక ప్రత్యేకమైన పాత్రలోకి దూరి రాసినపుడు రచన నిండా మాండలికాన్ని నింపటానికి లెజిటిమెసీ ఉంటుంది. లేదా తెలిదేవర భానుమూర్తి లాంటి పాత్రలాగానైనా మారిపోవాలి రచయిత. అట్లా కాని పక్షంలో కేవలం సంభాషణలు మాత్రమే గ్రామ్య భాషలో వుండటం న్యాయం. కాబట్టి కొత్త భాషను రూపొందించుకునేటప్పుడు సమూలమైన మార్పులకు ప్రయత్నించక, మధ్యస్థ మార్గంలో పోవటమే మంచిది అని ఈ వ్యాసకర్త అభిప్రాయం. అసలు సంస్కృత పదాలన్నిటినీ మానుకోవాలని ఎవరూ సూచించరనుకుంటా. ఒకవేళ సూచించినా అది ఆచరించగలిగే విషయం కాదు. అన్నం, రక్తం, ప్రాణం, కష్టం, సుఖం, దుఃఖం, కాలం, బలం, దూరం- ఇవన్నీ సంస్కృతానికి చెందిన మాటలే. వీటిని పూర్తిగా మానుకుని రాసే తెలుగు భాష ఎట్లా వుంటుందో మనం ఊహించుకోవచ్చు. కాబట్టి సంస్కృత పదాలను కొంచెమే- అంటే కృతకంగా కనిపించేవాటిని మాత్రమే తగ్గించుకోవాలి. మాండలిక గ్రామ్య పదాలకన్నా ఎక్కువగా అచ్చ తెలుగు మాటలు, సామెతలు మొదలైన ఇతర రకాల ప్రాంతీయ నుడికారాన్ని పెంచుకోవాలి. అంటే ప్రస్తుతం తెలంగాణలో వాడుకలో వున్న లిఖిత భాషకు కొద్దిపాటి చేర్పులు మాత్రమే చేయాల్సి వుంటుంది. ఉదాహరణకు రావాలి, పోవాలి అనే మాటలకు బదులు రావాలె, పోవాలె అని కొందరు రాయటం మనం చూస్తున్నాం. ఈ రకమైన మరెన్నో పదాలను కొత్తగా చేర్చుకోవచ్చు. ఇటువంటి చిన్న చిన్న మార్పులవల్ల ఇతర ప్రాంతాల్లోని తెలుగు ప్రజలకు మన కొత్త భాష అర్థం కాకపోయే ప్రమాదం ఉండదు. కాని దీనికి భిన్నంగా బుదురకిచ్చిండు, ఐతెమానాయె తియ్యి వంటి మాండలిక గ్రామ్య పదాలను కొత్త ప్రామాణిక లిఖిత భాషలోనికి విరివిగా చొప్పిస్తే అది ఇతర ప్రాంతాల తెలుగు వాళ్లకు అర్థంకాక, ఆ భాషను వాళ్లు స్వీకరించరు. పైగా ఒక భాషను మార్పులు చేర్పులతో కొత్త రూపంలో ఎట్లా ప్రవేశపెట్టగలం? అందరు కవులూ, రచయితలూ, ప్రజలూ ఇకముందు ఫలానా ప్రత్యేకమైన విధంగా మాత్రమే రాయాలి అని చెప్పి వాళ్లు ఆ విధంగా రాసేటట్టు చేయగలమా? నిజానికి ఒక ప్రాంతానికి చెందిన ప్రజల భాష ఆ ప్రజల అభిరుచులకు, భావోద్వేగాలకు, పరిస్థితులకు అనుగుణంగా దానంతట అదే సహజమైన మార్పుకు లోనవుతుంది తప్ప, ఎవరి ప్రయత్నంవల్లనో, బలవంతం వల్లనో మారటం సాధారణంగా జరగదు. అయితే, ఆ రకమైన స్పృహను ప్రజల్లో వ్యాపింపజేయటం వీలయ్యే విషయమే. మనం కోరుకునే సమూలమైన మార్పులను పాఠ్యపుస్తకాల్లో తీసుకొస్తే ఆమోదం గురించిన ఇబ్బంది తలెత్తదు కదా అని వాదించవచ్చు ఎవరైనా. అయితే పూర్తిగా కొత్తదైన అటువంటి లిఖిత భాషతో వెంటనే సమస్య లేకపోయినా, ఇపుడు ఆ భాషను నేర్చుకున్న విద్యార్థులు భవిష్యత్తులో దాన్నే ఉపయోగిస్తారు కనుక మనం మొదట ఊహించిన ఇబ్బందికరమైన పరిస్థితి అపుడైనా రాకమానదు అని గ్రహించాలి. అందరి అభిప్రాయాలనూ లెక్కలోకి తీసుకోవటం ఎట్లాగూ తప్పనిసరి అయినదే కాక చాలా ముఖ్యమైన విషయం కూడా. కాబట్టి దాన్ని పాటించి చాదస్తమైన ధోరణులనూ, మౌలికమైన మార్పులనూ రెండింటినీ కాదని, మధ్యరకమైన మార్పులు చేసేవిధంగా ఆలోచించటం మంచిదేమో.

- ఎలనాగ, 9866945424

నేర్చుకుందాం

క. ఇన్నేల సెప్ప? మాయలఁ
బన్నినఁ లో విడువ గోపబాలక! బలసం
పన్నుని మాగధ భూవరు
నన్నెఱుఁగవె తొల్లి నందనందన! పోరన్!

భావం: ఇన్ని మాటలు దేనికి ? ఎన్ని మాయలు పన్నినా నిన్ను వదలను. నందనందనా ! యుద్ధ రంగంలో జరాసంధుడంటే ఏమిటో నీకు బాగా తెలుసు.

ఉ. కాన రణోర్వి నన్నెదురఁ గష్టము గాన తలంగు ; గోత్ర భి
త్సూనుఁడు భూరి బాహు బలమర్దనుఁ డయ్యును భిన్న ; యీ మరు
త్సూనుఁడు మామకప్రకట దోర్బల శక్తికి ఁ జూడఁ దుల్యుఁడౌ;
వీని నెదుర్తు నంచు ఁ జెయివీచె జరాసుతు ఁడుగ్రమూర్తియై

భావం:ఓ కృష్ణా! యుద్ధభూమిలో నన్ను ఎదిరించటం నీకు చాలా కష్టం. అర్జునుడు భుజ బలశాలి అయినా చిన్నవాడు. ఈ భీముడు నా బాహుబలానికి సమానుడు. వీణ్ణి ఎదుర్కొంటాను' అన్నాడు.

పోతన భాగవతము - దశమ స్కంధము

స్పందన

44

కె. ప్రమీలాజనార్దన్

'నమస్కారమండి' అంటూ అతడు నిలుచున్నపుడు గుర్తించారు, అతడు భావన భర్త అని..

''ఎందుకొచ్చావిక్కడికి?'' కోపంగా అనబోయారు కాని చిరునవ్వు చిందుతున్న అతడి ముఖాన్ని చూసి కఠినత కరిగిపోయింది. మామూలుగా అడిగినట్లుంది కోటేశ్వరరావు గారి స్వరం.

''మీకోసమే'' అతడిచ్చిన జవాబు మొదట చాచి చెంపన కొట్టినట్లనిపించింది కోటేశ్వరరావుగారికి.

తమ కోసం ఎదుకొచ్చాడు! అతడ్ని తన ఇంటి గుమ్మం గూడా ఎక్కకుండా అడ్డు నిల్చొని నానా మాటలు అన్నాడు. అప్పుడు అంత ఆవేశం వచ్చింది. పరువు ప్రతిష్ఠలు వున్న కుటుంబమని పేరున్నదన్న అహం.. అవన్నీ ఒక్కసారిగా జారిపోయి ప్రాణం వుండీ లేనివాడిలా బ్రతుకుతున్నాడిప్పుడు.. అనుకుంటూ మౌనంగా వున్న ఆయన్ను చూసి ''ఏమిటి ఆలోచిస్తున్నారు? నేను మీ కోసం వచ్చానన్నాను కాని మీ ఇంట్లోకి వస్తానడంలేదు'' చిరునవ్వుతోనే మాట్లాడుతున్నాడు శ్యామ్.

''బాబు...'' ఒక్కసారిగా ఉప్పెనలా ముంచుకొచ్చింది దుఃఖం.

''అలా అనకు. ఆనాటి నా స్థితి నన్ను ఆవేశపూరితంగా తప్ప మరోవిధంగా ఆలోచించనివ్వలేదు. మన సమాజంలో స్త్రీ అదీ వితంతువును మళ్లీ పెళ్లి...'' కోటేశ్వరరావుగారి మాటలను పూర్తిచెయ్యనివ్వలేదు శ్యామ్.

''వద్దు. మరిచిపోయిన రోజుల్ని గుర్తుచెయ్యకండి. భావన గురించి అప్పుడే కాదు.. ఇప్పుడూ మీరలా మాట్లాడడం నాకిష్టంలేదు. తాళి కట్టగానే భర్త కాడు. మానసికంగా శారీరకంగా దగ్గరైన జీవితమే దాంపత్య జీవితం''.

కోటేశ్వరరావుగారు లలితమ్మ అతడి వంక అలాగే చూస్తున్నారు.

ఆ రోజు అంత అవమానకరంగా మాట్లాడినా పట్టించుకోనివాడిలా వెళ్ళాడు. ఈ రోజు తమ కోసం వచ్చానంటున్నాడు. గతాన్ని గుర్తు చేసుకోవడం ఇష్టం లేదన్నాడు. అన్నిటినీ మించి చెదరని చిరునవ్వుతో మాట్లాడుతున్నాడు. అది వాళ్ళకెంతో సంతోషం ధైర్యం కూడా కలిగించింది.

''రాంబాబు...'' తాళం తీసి ఇంట్లోకి అడుగుపెడుతూ అంది లలితమ్మ.

శ్యామ్ లోపలికి వచ్చాక ''కూర్చోబాబు..'' అటూ కుర్చీ చూపించి తను పక్కనున్న స్టూలుమీద కూర్చోబోతున్న కోటేశ్వరరావు గారి చెయ్యి పట్టి ఆపాడు శ్యామ్. ''మీరిక్కడ కూర్చోండి'' అంటూ ఆయన్ను కుర్చీలో కూర్చోపెట్టి తను స్టూలుమీద కూర్చున్నాడు.

లలితమ్మ మంచినీళ్ళు తెచ్చిచ్చి అతడివైపు చూసి ''మేము ఇక్కడవున్నట్లు మీరెలా తెలుసుకున్నారు?'' అడిగింది.

''ఎలా తెలిస్తేనేం, మీ గురించి తెలుసుకోవడం నాకు సంతోషంగా వుంది'' అన్నాడు శ్యామ్.

''విశ్వనాథం మాష్టారికి తప్ప మరెవరికి మేము ఇక్కడ వున్నట్లు తెలియదు'' అన్నాడు కోటేశ్వరరావుగారు.

''ఆయనవల్లే నాకు తెలిసింది...'' శ్యామ్ అంటే నమ్మలేనివారిలా చూశారు కోటేశ్వరరావుగారు, లలితమ్మ.

శ్యామ్ వాళ్ళ అనుమానం గ్రహించినవాడిలా నవ్వాడు. ''మాష్టారు మీకిచ్చిన మాట తప్పారని ఆశ్చర్యపడుతున్నారా?''

''ఔను. ఆయన మాట తప్పే మనిషి కాదు'' అన్నారు కోటేశ్వరరావుగారు.

''చెడు జరుగుతుందంటే మాట తప్పడం తప్పు. కాని ఇప్పుడు ఆయన మాట తప్పడం కాదు. మహోపకారం చేసినట్లు'' అంటూ కోటేశ్వరరావుగారి వంక చూశాడు.

''మాష్టారు హైద్రాబాద్‌లో కనిపించారు. మీ గురించి మీరు భావనకివ్వమన్న కవరు గురించి చెప్పారు. భావనను ఆ కవరు తీసుకొనేందుకు రాములూరికి రమ్మన్నది మాష్టారు గారి అమ్మాయి మహిత. భావనకా ఊరు ఇంటిని చూడాలని వుంది కాబట్టి నేను ఆమెకేం చెప్పలేదు. చెప్పాలని కూడా అనుకోడంలేదు. మీరు భావనకు తండ్రి. మీరు ఆమెకు క్షమాపణ చెప్పడం మీ పెద్దరికానికి చిన్నతనమౌతుంది. మీరు మాకెప్పుడూ గౌరవనీయులే. మాష్టారికి ఆ మాటే చెప్పాను. మీ అడ్రసు అడిగాను. మీతో మాట్లాడతానని ఆ కవరు చించి పారెయ్యమని చెప్పాను. అసలెందుకిలా వచ్చారు? మీరేం తప్పు చేశారని?''

''ఇంకేం చెయ్యాలి నాయనా.. పిల్లల్ని పెంచడంలో లోపం వుందని ఆలస్యంగా తెలుసుకున్నాము..'' అని అతడివైపు చూసి ''బాబూ, మమ్మల్ని క్షమించమని అడగలేను కాని ద్వేషించవద్దని ప్రాధేయపడుతున్నాను'' అన్నారు కోటేశ్వరరావుగారు.

''ఛఛ, ఏమిటి మీరలా మాట్లాడడం...'' నొచ్చుకున్నట్లుగా అన్నాడు శ్యామ్. ''కోపం ద్వేషం లాంటివేవైనా వుంటే నేనింత దూరం వచ్చేవాడ్ని కాదు. మీరు పిల్లల పెంపకంలో లోపం వుందనుకుంటున్నారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచిస్తారు. వాళ్ళ కుటుంబ పరువు ప్రతిష్ఠలను ఇనుమడింపచెయ్యాలని కోరుకుంటారు. అది తప్పు కాదు. కాని అనుకోని పరిస్థితులు వాళ్ళను మీ ఆలోచనలకు భిన్నంగా వ్యవహరింపజేశాయి.

-ఇంకావుంది

అధ్యాత్మ రామాయణం

యుద్ధకాండ 213

- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

అయినా ఈ మానుషరూపంలో వచ్చినందుకు తనను నిత్యం సేవించే వారు జతపడ్డారు; వారి కోరికలు తీర్చవలసి ఉన్నది. అందుకే లీలామానుష దేహంతో లోకాన్ని అనుసరించి ప్రవర్తించడం జరుగుతున్నది.

శత్రుఘ్నుని ఆజ్ఞననుసరించి నిపుణ క్షురకుడు వచ్చాడు. రాఘవుని పట్టాభిషేకానికి కావలసిన సంభారాలన్నీ సమకూర్చబడ్డాయి.

మొదటగా భరతుడు, ఆ తరువాత మహాత్ముడైన లక్ష్మణుడు, ఆ పిదప వానరేంద్రుడు సుగ్రీవుడు, తదనంతరం రాక్షస రాజు విభీషణుడు వరుసగా స్నానాద్యలంకారాలు పూర్తి చేశారు.

రాముడలనాడు కట్టిన జడలు విడిచాడు; అభ్యంగనస్నానాదులు పూర్తిచేశాడు. అంగరాగాలు, చిత్ర విచిత్ర హారాలతో అపూర్వ వస్త్రాలంకృతుడయ్యాడు. శ్రీమంత రూపంతో ప్రకాశిస్తూ నిలిచాడు. మహామతి అయిన లక్ష్మణ భరతులు రాముని అలంకరించారు. రాజకాంతలు సుమధ్య అయిన సీతకు రాజోచితాలైన వస్త్రాభరణాలను అలంకరించారు.

పుత్ర వాత్సల్యంతో కౌసల్య ఇవన్నీ పర్యవేక్షిస్తూనే, ఎంతో ప్రేమతో, వానరపత్నులందరినీ స్వయంగా అలంకరించింది.

అప్పుడు శత్రుఘ్నుని ఆజ్ఞననుసరించి, ధీమంతుడైన సుమంత్రుడు సూర్యకాంతి కలిగిన రథానికి గుఱ్ఱాలను పూన్చి, రథాన్ని తీసికొని వచ్చి నిలిపాడు. సత్య ధర్మ పరాయణుడైన రాముడు ఆ రథాన్ని అధిరోహించాడు.

సుగ్రీవ, అంగద హనుమ, విభీణాదులందరు స్నాన సంధ్యలు పూర్తిచేసుకొని దివ్యాంబరాలు, దివ్యభూషణాలు ధరించి రథ-అశ్వ-గజవాహనులై రామునికి ముందు వెనుకల సమన్వయంతో కదిలారు. సీతాదేవి, సుగ్రీవ పత్నులు తదితరులు సుందర పల్యంకికలలో బయలుదేరారు.

ఆకుపచ్చని అశ్వాల రథంపై ఇంద్రాది దేవతలు పరివేష్టించగా బయలుదేరిన విధంగా, రాముడు రథంపై కూచొని పురవీధుల గుండా పయనించాడు. ఆ రామచంద్రునికి మహాతేజస్వి అయిన భరతుడు సారథ్యం వహించాడు. రత్నదండయుత శ్వేతఛత్రాన్ని శత్రుఘ్నుడు పట్టుకొన్నాడు. వ్యజన చామరాలను లక్ష్మణుడు వహించాడు. రథ సమీపాననే ఉండి అరిందముడైన సుగ్రీవుడు, అసుర నాయకుడైన విభీషణుడు చంద్ర ప్రభా భాసమానమైన చామరాలను పట్టుకొన్నారు.

ఆ సమయంలో దేవతలు, సిద్ధ సంఘాలు, దివ్య దర్శనులైన ఋషులు రాముణ్ణి స్తుతిస్తున్నారు. ఆ మధుర ధ్వనులంతటా వినిపిస్తున్నాయి. వానరులందరూ నరరూపులై గజవాహనులై అనుసరించారు. భేరీ శంఖ నినాదాలతో మృదంగ పణవ ఆనకాల ధ్వనులు మంగళమయమై మ్రోగుతుండగా రాముడు చక్కగా అలంకృతమైన పురవీధుల్లో పయనించాడు. పురవాసులందరూ ఉత్సవ సంభారాలతో రాముడు రావడం ఎగబడి చూచారు.

ఆ రాముడు దూర్వాదళాల వంటి శ్యామలగాత్రుడు; అపూర్వ కిరీట రత్నాభరణాలతో అలంకృతుడు; అరుణారుణ పద్మదళాలవంటి సుందర నయనుడు, విచిత్ర రత్నాలతో కూడిన బంగారు జరీ పనితనమున్న పీతాంబరం ధరించినవాడు, బలిష్ఠములైన భుజములు గలవాడు, వెలలేని ముత్యాల దివ్యహారాలతో శోభిల్లువాడు, కపులు తమ చాంచల్యాన్ని వీడి శాంతచిత్తులై సుగ్రీవాది ప్రముఖులతో కలిసి సేవలందించగా వెలుగుతున్నవాడు, సూర్య ప్రభాభాసమానుడైనవాడు, కస్తూరి చందనాద్యనేక లేపనాలతో పరిమళించేవాడు, కల్పవృక్ష పుష్ప మాలలు ధరించినవాడు అయిన రఘునందనుణ్ణి రామచంద్రుణ్ణి చూచి తాము ఎంతో భాగ్యశాలురమని ప్రజలు అపూర్వానందమందారు.

- ఇంకావుంది

సోమవారం 29 డిసెంబర్, 2014

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ జయ, దక్షిణాయనం
హేమంత ఋతువు - పుష్యమాసం

తిథి: శుద్ధ అష్టమి మ.2.43
నక్షత్రం: ఉ.భా. ఉ.10.33
వర్జ్యం: రా.9.48 నుండి 11.9 వరకు
దుర్ముహూర్తం: మ.12.24 నుండి 01.12 వరకు
తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
  అనుకూల స్థానచలనం కలిగే అవకాశాలున్నాయి. గృహంలో మార్పును కోరుకుంటారు. ఇతరుల విమర్శలకు లోనవుతారు. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. ధననష్టం కలుగవచ్చు.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
  శుభవార్తలు వింటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు వినోదాల్లో పాల్గొంటారు. ఆకస్మిక ధన లాభాన్ని పొందుతారు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. ముఖ్యమైన కార్యాలు పూర్తి అవుతాయి.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
  ఆత్మీయుల సహకారం లభిస్తుంది. ఆకస్మిక ధన నష్టమేర్పడే అవకాశముంది. ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటారు. అనారోగ్య బాధవలన బలహీనులవుతారు. అధికార భయం ఉంటుంది.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)**
  మనోల్లాసాన్ని పొందుతారు. సోదరులతో వైరమేర్పడకుండా మెలగాలి. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. ఆర్థిక ఇబ్బందులు ఆలస్యంగా తొలగిపోతాయి.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
  కీర్తి, ప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఇతరులకు ఉపకారం చేయుటకు వెనుకాడరు. ఋణబాధలు తొలగిపోతాయి. శత్రుబాధలుండవు.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
  సత్కార్యాల్లో పాల్గొంటారు. సంపూర్ణ ఆరోగ్యమేర్పడుతుంది. స్థిర నివాసముంటుంది. వ్యవసాయ మూలకంగా లాభాలను పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ ఫలిస్తాయి. సూక్ష్మ విషయాలను గ్రహిస్తారు.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
  కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. ఆకస్మిక ధనలాభంతో ఆనందాన్ని పొందుతారు. ఇతరులకు ఉపకారం చేసే కార్యాల్లో నిమగ్నులవుతారు. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
  దేహాలంకరణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులను కలుస్తారు. పేరు, ప్రతిష్ఠలు సంపాదిస్తారు. నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలను పొందుతారు.ఋణబాధలు తొలగిపోతాయి.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
  ఋణప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు. స్త్రీలకు స్వల్ప అనారోగ్య బాధలుంటాయి.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
  రాజకీయ వ్యవహారాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. ఆరోగ్యవంతులుగా నుంటారు. ఇతరులకు ఉపకరించు పనులు చేపడతారు.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
  పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి. ఋణబాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచి పేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొనుటకు కృషిచేస్తారు.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
  కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా లేనందున మానసికాందోళన చెందుతారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది. విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

మంచిమాట

సన్మార్గుడు

భక్తికి నిలయమైన మనసు దేవాలయమని భక్తాగ్రేసరుల విశ్వాసం. మాటలో, పాటలో, ఆటలో సైతం పరవళ్లుతొక్కే భక్తిని చూసి భగవంతుడు పారవశ్యం చెందుతుంటాడని వీరు బలంగా నమ్ముతుంటారు. అందుకే సుఖం ఆశించి దుఃఖం వాటిల్లినా, వెలుగుకోసం తపిస్తే చీకటిలో వుండిపోవలసి వచ్చినా, మంచికి ప్రతిఫలంగా వంచనే లభించినా ప్రతిదీ భగవంతుడి లీలగానే వీరు భావిస్తారు. అంతటితో ఊరుకోక ఆత్మవిమర్శ చేసుకుంటారు. ప్రార్థనలు, పూజలు, స్తోత్రపఠనాలతో దైవం పట్ల పరిపూర్ణ విశ్వాసాన్ని చూపినా ఏ లోపాలు తమకు ఇబ్బంది కలిగిస్తున్నాయో వాటిని తొలగించుకునే ప్రయత్నం చేస్తుంటారు. లౌక్యానికి, దైవ చింతనకుమధ్య సమన్వయం సాధ్యంకాదని గ్రహిస్తారు. సమస్త సుఖాలకు లౌక్యం మూలమని బలంగా విశ్వసించేవారెవరైనా కొన్ని సుఖాలను స్వంతం చేసుకోగలిగినా, పది మందిలో డాబు ప్రదర్శించినా అందువల్ల లభించేది తాత్కాలికమైన ఆనందమే! కోరికలు ముందు పుట్టి ఆ తర్వాత వీరు పుట్టారా అన్నట్లు కన్పించేవారు దేనికోసం ఎంతగా వెంపర్లాడినా కొన్ని కోరికలు తీర్చుకోగలిగినా తామెంత భక్తులమని ప్రకటించుకున్నా వారి భక్తిపరిపూర్ణతను ఎంతమాత్రం సంతరించుకోదు, ఆకలి తీర్చేందుకు అన్నం దాహం తీర్చేందుకు నీరు, వుండేందుకో గూడు ఎవరికైనా ఎంత అవసరమో తమతమ బ్రతుకుల్ని బాగుచేసుకునేందుకైనా, జన్మను సార్థకం చేసుకునేందుకైనా భక్తిమార్గం చాలా చాలా అవసరం.

చూస్తుంది, చేస్తుంది, సాధిస్తుంది- అన్నీ తానే అనుకుంటే అంతకు మించిన అహంభావం మరొకటి వుండదు. ఏది చూసినా, ఏదిచేసినా ఏది సాధించినా ఆ ఘనత తానున్న సమాజానిదని, అదంతా దైవానుగ్రహమని ఎవరు భావిస్తారో వారు భక్తిభావనతో భగవంతుడికి చేరువవుతుంటారు. ప్రతిక్షణం తామే పనిచేస్తున్నా, తమతో ఎవరు మాట్లాడుతున్నా భగవంతుడి ప్రతి రూపాలుగానే భావిస్తుంటారు. భక్తిపారవశ్యంలో ఎవరెలా వున్నప్పటికి తమ దుఃఖాలను తొలగించుకునేందుకైనా, తమ సమస్యలను పరిష్కరించుకునేందుకైనా, దీర్ఘకాలంగా తమను బాధిస్తున్న వ్యాధులనుండి తమనుతాము కాపాడుకునేందుకు ఎవరి ప్రయత్నం వారు చెయ్యాల్సిందే. అలాంటప్పుడు భగవంతుడిని భక్తితో పూజిస్తే ఏం ప్రయోజనం చేకూరినట్లని ప్రశ్నించే మేధావులు లేకపోలేదు. మానవ ప్రయత్నంలో ఎంతమాత్రం లోపం లేకుండా ఎవరి పని వారు చేస్తూనే ఫలితం దైవనిర్ణయంగా భావించగలిగేవారు అనుకూల, ప్రతికూల పరిస్థితుల్లో సైతం ఒకేవిధంగా వుంటూ తమ భక్తిభావనలో ఎటువంటి ఊగిసలాటల్లేక ముందుకే వెళ్తుంటారు. తెలియని శక్తేదో భక్తిలో వుందని గ్రహిస్తారు.

ప్రతి వ్యక్తిని పరమాత్ముని ప్రతిరూపంగా భావించడం మంచిదే కాని, తానే పరమాత్ముడినన్నట్లు ప్రవర్తించే వారితోనైనా, ప్రచారం చేసుకుంటున్న వారితోనైనా జాగ్రత్తగా వ్యవహరించవలసిన అవసరం వుంది. ఎవరికైనా భక్తి ఎంత శక్తివంతమైన సాధనమో, వేషధారణలు చూసి మోసపోయే తీరు బలహీనతకు నిదర్శనమే తప్ప మరొకటి కాదు. దైవలీలలు, దైవ సాక్షాత్కారం గురించి ప్రవచించే తీరు, ప్రార్థించే తీరు, గానం చేసే తీరు ఎలా వున్నప్పటికీ భక్తిముసుగులో తోటివారి బలహీనతలను సొమ్ము చేసుకునే తీరు అత్యంత నీచమైనది. ఎవరి తెలివితేటలైనా ఎంతవరకు పనిచేస్తాయి? తెలివి తక్కువతనంతో తలూపడం మాని ఎదుటివారు ఎదురు ప్రశ్నవేసేంతవరకే!

ధర్మాన్ని రక్షిస్తే తప్ప ధర్మం ఎవరినీ రక్షించదని, న్యాయాన్ని నమ్మితే తప్ప న్యాయం ఎవరినీ నమ్మదని, సత్యాన్ని పాటిస్తే తప్ప సత్ఫలితాలు ఎవరికీ స్వంతంకావని గ్రహించవలసిన అవసరం ఎంతున్నదో దైవభక్తి మాత్రమే కాదు, ప్రకృతిని మనం ఎంతగా కాపాడితేనే ప్రకృతి సైతం ఎలాంటి ఆపదలు మనకు రాకుండా చూస్తుంది. భక్తి ప్రార్థించే పెదవుల్లోకాక, చేసే ప్రతి పనిలో పొంగిపొర్లితే మానవాళి సుఖశాంతులతో వర్ధిల్లుతుంది.

- కొల్లు రంగారావు

సత్యభామ 55

బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 595 మాటాట



ఆధారాలు

ఆధారాలు: 85
అడ్డం
1. దీనికి ఓ హద్దుండాలి
3. చేవ్రాలు
5. ఎండ
8. తాబేలు
9. ఒకదేశం
11. పుష్పహారం
13. ఒక జానపద వాద్యం
14. వికారం వల్ల కడుపులో జరిగేది

నిలువు
2.మందుడు
3. సమాజం
4. ఇప్పటికీ పెళ్లి విషయంలోపోని దురాచారం
6. భార్య
7. ఇందులో గిరీశం ప్రధాన పాత్రధారి
10. పుకారు
11. భగవంతుడికి చేసేది
12. పెళ్లికీ, చావుకీ కూడా మ్రోగేది

మాటాట - 594 సమాధానం



రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

అర్జునుడు... నారీ తీర్థాలు

ఒకసారి పాండవ మధ్యముడైన అర్జునుడు తీర్థయాత్రలు చేస్తూ దక్షిణ సముద్రతీర ప్రాంతానికి వెళ్ళాడు. ఆ ప్రాంతంలో సౌభద్రం, పౌలోమం, కారంధమం, ప్రసన్నం, భారద్వాజం అనే పంచతీర్థాలు ఉన్నట్టు తెలుసుకున్న అర్జునుడు అక్కడికి బయలుదేరుతూంటే ఒక సాధువు వారించి, 'వాటిలో పెద్దపెద్ద మొసళ్ళున్నాయి. అవి స్నానం చెయ్యడానికి దిగిన వారిని పట్టి మ్రింగుతున్నాయి. ఇలా అనేక సంవత్సరాలుగా జరుగుతున్నది కనుక వాటి దరికి వెళ్ళవద్దు'అని హెచ్చరించాడు. అయినా లక్ష్యపెట్టకుండా అర్జునుడు ఆ తీర్థాలున్న ప్రదేశానికి చేరుకున్నాడు.

ముందుగా సౌభద్ర తీర్థంలో స్నానానికి దిగాడు. సాధువు చెప్పినట్టుగానే కొన్ని క్షణాల్లో ఒక బలిష్టమైన మొసలి అర్జునుని కాలు పట్టుకొని లోపలకు లాగసాగింది. అతి ప్రయాసతో అర్జునుడు దాన్ని ఒడ్డుకు ఈడ్చుకొచ్చాడు. ఒడ్డుకు రాగానే ఆ మొసలి ఆశ్చర్యంగా ఓ త్రిలోక సుందరిగా మారిపోయింది. నిశ్చేష్టుడైన అర్జునుడు కాస్సేపటికి తేరుకొని, మొసలి రూపంలో ఎందుకున్నావని ఆమెను అడిగాడు.

అప్పుడా సుందరి, ''మహాశక్తిమంతా! నేను అప్సరసను. నా పేరు వర్గ. నేనంటే కుబేరుడికెంతో ఇష్టం. నాకు నలుగురు చెలికత్తెలున్నారు. వారికీ నాలాగే కామగమనం తెలుసు. మేము అప్పుడప్పుడూ భూలోకం వచ్చి ప్రకృతి అందాలను చూడ్డానికి అరణ్యాల్లో సంచరిస్తూ ఉంటాం. ఒకరోజు మేమైదుగురం ఇక్కడికి సమీపంలో ఉన్న అరణ్యానికి వచ్చాం. పచ్చని చెట్లతో, పుష్పాలతో ప్రశాంతంగా ఉన్న ప్రదేశంలో ఒక యువకుడు తపస్సు చేసుకుంటూ కనిపించాడు. అతని తేజస్సుతో ఆ ప్రదేశమంతా సూర్యభగవానుని కన్నా మిన్నగా వెలిగిపోతోంది. అతని అద్భుతరూపం చూసి ఇంత అందగాడికి తపస్సేమిటి అనుకున్నాం.

''వయస్సు పొంగులో ఒడలు తెలియలేదు. ఆ సుందరుడి తపస్సు భగ్నం చేసి మా వశం చేసుకోవాలని నేనూ, సౌరభేయి, సమీచి, బుద్బుద, లత అతని చెంత చేరాం. ఆటలతో పాటలతో అలరించాం. వెటకారం చేస్తూ పగలబడి నవ్వాం. అహంకారంతో ఎన్నోవిధాలుగా అవమానించాం. నెమ్మదిగా కనులు విప్పిన ఆ తాపసి మా ఆట పాటలకు అంద చందాలకు ఏమాత్రం చలించలేదు. అతడి మనోనిగ్రహం ముందు మా చేష్టలన్నీ నిష్ప్రయోజనమయ్యాయి. మా దురుద్దేశాన్ని గ్రహించిన ఆ మునీశ్వరుడు, ఇక ఎవ్వరికీ మేమలా తపోభంగం చేయకూడదనుకున్నాడు కాబోలు- 'మీరు మొసళ్ళుగామారి పంచతీర్థాల్లో పడి ఉండండి'అని శపించాడు.

''మేము గడగడ వణకిపోయాం. ఏంచేయాలో తోచలేదు. కొన్ని క్షణాల అనంతరం తేరుకొని చేసిన అపరాధానికి పశ్చాత్తాపపడుతూ 'తాపసోత్తమా! వయస్సు, అందం, కోరిక, మాలో విచక్షణా జ్ఞానాన్ని నశింపజేసాయి. మీవంటి తపోధనుల పట్ల వెకిలిగా ప్రవర్తించడం, వెర్రిమొర్రి వేషాలు వేయడం తప్పని ఒప్పుకుంటున్నాం. మీ శాప ప్రభావంతో మేము మొసళ్ళు కావడం అన్నమాట తల్చుకుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తోంది. దయచేసి మమ్మల్ని క్షమించి మీ శాపాన్ని ఉపసంహరించుకోండి' అంటూ అతని కాళ్ళమీద పడ్డాం.

''ఆ తాపసి సానుభూతితో మమ్మల్ని చూస్తూ 'నేనింతవరకూ ఎగతాళికి కూడా అసత్యం పలుకలేదు. కాబట్టి నా శాపప్రభావంతో పంచతీర్థాల్లో మొసళ్ళుగా పడి ఉండడం తప్పదు. మీరు ఆ తీర్థాల్లో స్నాన మాచరించడానికి వచ్చిన వారిని పట్టి మ్రింగుతుంటారు. మీకు ఆహారం కాకుండా మిమ్మల్ని ఒడ్డుకు లాగ గలిగిన పురుషునివల్ల శాపవిమోచనం కలిగి స్వస్వరూపాలు ధరిస్తారు. కనుక మీరు త్వరగా పంచతీర్థాల వద్దకుపోయి అయిదుగురూ అయిదింటిలో ప్రవేశించండి'అని దయతో పలికాడు. ''అప్పట్నుంచీ మొసళ్ళరూపంలో మేమీ జలాశయాల్లోపడి ఉన్నాం. మహాబలులు నా చెలులు కూడా నాలాగే నాలుగు జలాశయాల్లో ఉన్నారు. దయార్ద్ర హృదయంతో వారికీ యథారూపాన్ని ప్రసాదించు'' అని వేడుకుందా త్రిలోక సుందరి.

జాలిపడిన అర్జునుడు ఆమె మాట మన్నించి మిగతా నలుగురికీ కూడా శాపవిముక్తి కలిగించాడు. వారు ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ, ''మహాభాగా! మీరే గనుక ఇక్కడకు రాకపోతే ఎంత కాలమైనా మేము మొసళ్ళుగానే ఉండిపోయే వాళ్ళం. ఎంతో ధైర్యంగా మాకు శాపవిముక్తి కలిగించిన మీకు సర్వదా కృతజ్ఞులం!'' అన్నారు ఏక కంఠంతో.

అప్పుడు అర్జునుడు ''దేవకాంతలారా! తపోధనుల సాధుత్వాన్ని బలహీనతగా భావించి, అహంకారంతో వారిపట్ల అనుచితంగా ప్రవర్తిస్తే ఫలితం ఇలాగే ఉంటుందని ఇప్పటికైనా గ్రహించండి!''అని మందలించాడు.

వారు బుద్ధిగా తలలూపి అర్జునుడికి నమస్కరించి తమ లోకానికి పోయారు. ఆనాటినుండీ పంచతీర్థాలు నారీ తీర్థాలుగా పేరు పొందాయి.

- చోడిశెట్టి శ్రీనివాసరావు


సౌభద్ర తీర్థం

ముక్కోటి ఏకాదశికి

ముస్తాబవుతున్న భద్రాది

ముక్కోటి శోభతో అలరారుతున్న భద్రాద్రి

అల వైకుంఠ పురమ్ములో- నగరిలో- ఆమూల సౌధమ్ములో అని మహాభాగవతంలో పోతన అన్నట్లు, ధృవ మండలానికి ఈశాన్యంగా బ్రహ్మాండానికి ఆవల త్రిపాద్విభూతిగా వేదం కీర్తించిన వైకుంఠంలో శ్రీమహావిష్ణువు ఉత్తరద్వార ముఖంగానే పరివేష్టించి ఉంటారని అర్చిరాది గ్రంథంలో చెప్పినట్లు ఈ ముక్కోటి ఏకాదశి నాడు శ్రీమన్నారాయణుడు ఉత్తరద్వారంలో కోరి కొలువైయ్యి తన భక్తులకు నయనానందకరంగా గోచరమవుతున్నాడు.

పావన గౌతమీ తీరంలో వెలసిన దివ్యక్షేత్రం భద్రాచలంలో జరిగే వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) ఉత్సవాలు శ్రీరామభక్తులకు నయనానందం కలిగించటమే కాకుండా ఆధ్యాత్మిక భావనలతో హృదయాన్ని నింపి వారిని పులకింప చేస్తున్నాయి. గజగజ వణికించే చలిలో చీకటి తెరలు విచ్చుకోక ముందే గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఉత్తరద్వారంలో స్వామిని దర్శించి పునీతులయ్యే వేలాది మంది భక్తులకు పుణ్యదినం ముక్కోటి ఏకాదశి పర్వదినం. ముక్కోటికి ముందురోజు గోదావరి నదిలో హంసలాకృతమైన తెప్పపై జరిగే స్వామివారి తెప్పోత్సవం కూడా కడు కమనీయం.. రమణీయం.

ముక్కోటి దేవతలు..నారాయణుని సేవలో

ముక్కోటి దేవతలు వైకుంఠంలో చేరి శ్రీమన్నారాయణుని సేవించుకునే పర్వదినమే ముక్కోటి ఏకాదశి. సూర్యుడు ధనుర్రాశిలో ప్రవేశించిన తర్వాత వచ్చే శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశిగా పిలుస్తారు. వైకుంఠ ఏకాదశి నాడు భక్తిశ్రద్ధలతో ఎవరైతే ఉపవాసముండి భగవన్నామ సంకీర్తనం, జాగారంతో గడుపుతారో వారికి తప్పక మోక్షం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. సృష్ట్యాదిలో మధు- కైటభులనే రాక్షసులను శ్రీమన్నారాయణుడు సంహరించి వైకుంఠ ఏకాదశి నాడే వైకుంఠంలోని ఉత్తర ద్వారం నుంచి ముక్తిని కల్పించినట్లు పురాణగాథ. అందుకే ఈ ఏకాదశిని మోక్షదాఏకాదశిగా వేదవ్యాస మహర్షి కీర్తించారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు శేషశయ్యపై జగద్రక్షణ చింతనా పరమైన యోగనిద్రలో ఉన్న మహావిష్ణువు నాలుగు నెలల తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశి నాడు మేల్కొని బ్రహ్మాది దేవతలకు దర్శన భాగ్యం ప్రసాదించే పర్వదినం ఇదని, సృష్ట్యాదిలో విశ్వసృష్టికి సంకల్పం చేసిన రోజని శాస్త్రాలు చెబుతున్నాయి. భగవద్దర్శనం కోసం పరితపించే దేవతలందరూ ఈ నాలుగు నెలలు దీక్షతో చాతుర్మాస్య వ్రతంగా ఆచరిస్తారని యతిధర్మ సముచ్చయం అనే ధర్మశాస్త్రం చెబుతోంది. సకల జీవరాశుల్లో విష్ణు రూపం గా అంతర్యామిగా ఉన్న పరమాత్మకు విశ్రాంతి కాలమైన ఈ నాలుగు మాసాల్లో అందరూ దైవచింతనలో ఉండాలని ఆర్షవాణి బోధిస్తోంది. అందుకే యతీశ్వరులు, సన్యాసులు తమ నిత్య సంచారం ఆపివేసి ఏదోఒక పవిత్రమైనచోట జప, తపాదులతో ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. చాతుర్మాస్య వ్రతానికి ఫలంగా వచ్చే మార్గశిర శుద్ధ ఏకాదశియే ఈ ముక్కోటి ఏకాదశి. సంక్రమణాన్ని అనుసరించి శుద్ధ ఏకాదశి నాడు కూడా ఈ ఉత్సవాన్ని ఆచరిస్తారు. పరమ పవిత్రమైన ఈరోజున ఉత్తరద్వారంలో గరుడ వాహనంపై వేంచేసి వున్న శ్రీమహావిష్ణువును ఎవరైతే సేవిస్తారో వారికి భగవానుగ్రహం- మోక్షం తప్పక సిద్ధిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఉత్తరద్వార దర్శనం వల్ల జన్మరాహిత్యం, మోక్షం తప్పక కలుగుతాయని పరమపురుష సంహిత అనే ఆగమశాస్త్రం తెలుపుతోంది.

అధ్యయనోత్సవాలు

వైకుంఠ ఏకాదశికి ముందు పదిరోజులు, తర్వాత పదిరోజులు అధ్యయనోత్సవాలు నిర్వహించడం పరిపాటి. ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాలు, అధ్యయనోత్సవాలు అత్యంత ప్రధాన ఉత్సవాలు. బ్రహ్మోత్సవాలు స్వామి వైభవాన్ని పెంచేవి కాగా, పవిత్రోత్సవాలు ఏడాది పాటు మనం చేసే మంత్ర, క్రియా భక్తి-ద్రవ్యాల విషయంలోని అన్ని దోషాలు పోగొట్టి పరిపూర్ణం అయ్యేందుకు ప్రాయశ్చితంగా నిర్వహించేవి. అధ్యయనోత్సవాలు భగవంతుని కీర్తనాపరమైన వేద- ఇతిహాస- పురాణ శాస్త్ర దివ్యప్రబంధాలు. పగలేపత్తు (పగలు నిర్వహించేవి), రాపత్తు (రాత్రులు నిర్వహించేవి) పేరిట 20రోజుల పారాయణం చేస్తారు. దీనివల్ల భగవన్మూర్తిలో కారుణ్య వృద్ధి చెంది, భక్తుల సర్వాభీష్టాలు నెరవేరుతాయని ఆగమశాస్త్రం చెబుతోంది.

దశావతార ఉత్సవాలు

భద్రాచలంలో జరిగే అధ్యయనోత్సవాల్లో దశావతార అలంకారాలు ప్రత్యేక ఆకర్షణ. ముక్కోటి ఏకాదశికి ముందు పదిరోజులు వరుసగా మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, శ్రీకృష్ణావతారాల్లో శ్రీరామచంద్రమూర్తి దర్శనమిస్తారు. శ్రీరామావతారం చాలించి వైకుంఠం చేరిన శ్రీరాముడు తన భక్తుడు భద్రమహర్షిని అనుగ్రహించేందుకు నాలుగు చేతులతో శంఖు, చక్ర, ధనుర్బాణాలతో భద్రాద్రిలో ప్రత్యక్షమయ్యాడు. ఇదొక అపూర్వమైన, విలక్షణమైన, మరెక్కడా మనకు కన్పించని స్వరూపం. శంఖు చక్రాలతో నారాయణునిగా, ధనుర్బాణాలతో శ్రీరామునిగా కలిసి వెలసిన రామనారాయణుడు భద్రాద్రి రాముడు. అందుకే శ్రీరామున్ని వైకుంఠ రామునిగా కూడా బ్రహ్మ పురాణం కీర్తిస్తోంది.

ఉత్తరద్వార దర్శనం

చాతుర్మాస్య వ్రతం తర్వాత యోగనిద్ర నుంచి మేల్కొని ముక్కోటి దేవతలకు గరుడ వాహనరూఢుడై వైకుంఠంలో ఉత్తరద్వారంలో దర్శనం ఇచ్చిన శ్రీమన్నారాయణుడు రామనారాయణునిగా కలియుగ వైకుంఠంగా భాసిల్లే భద్రాద్రిలో సైతం భక్తులకు వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తరద్వార దర్శన భాగ్యాన్ని ప్రసాదిస్తున్నాడు. ఉత్తరద్వార దర్శన వైభవాన్ని అలనాడు శ్రీరంగంలో కాంచిన భక్తరామదాసు భద్రాద్రిలో సైతం ఈ సంప్రదాయాన్ని కొన్ని వందల ఏళ్ల క్రితమే ప్రారంభించారు. తొలుత దక్షిణం వైపు ఆగ్నేయంలోని ద్వారంలో స్వామి ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేసిన దేవస్థానం, ఆతర్వాత 1972 ప్రాంతంలో ఉత్తరం వైపు ఓ ప్రత్యేక ద్వారాన్ని, జేగంటలతో తలుపులను ఏర్పాటు చేసి ఒక్క వైకుంఠ ఏకాదశి నాడు మాత్రమే తలుపులు తెరిచి వైకుంఠ ద్వారదర్శన భాగ్యం కల్పిస్తున్నారు.

- మొబగాపు ఆనంద్‌కుమార్
భద్రాచలం



ముక్కోటి ఏకాదశి వేళ ఉత్తరద్వారంలో స్వామివారి దివ్య దర్శనం... స్వామివారి తెప్పోత్సవం (ఫైల్ ఫొటో)

దేవదేవుని అనుగ్రహానికే ధనుర్మాస వ్రతం

విల్లిపుత్తూరులోని గోదాదేవి అండాళ్ అమ్మ కాత్యాయని వ్రతం చేసి గోపాలుణ్ణి తనవానిని చేసుకొని గోపకన్యలను చూచి తాను కూడా ఆ రంగని పొందాలని నెలరోజులు తెల్లవారు ఝామున లేచి తోటి చెలులను తనతో చేర్చుకుని రంగని సేవించింది. ఆ తల్లి చేసిన వ్రతమే ధనుర్మాసవ్రతం. ఆ తల్లిలాగే మనమూ ఆ రంగని దివ్యానుగ్రహాన్ని పొందడానికి ఈ వ్రతాన్ని చేయాలి. ధనుర్మాస వ్రతాన్ని గురించి స్వయంగా బ్రహ్మదేవుడు నారదుడికి వివరించాడు. ధనుర్మాస వ్రత మహత్యం బ్రహ్మాండ, ఆదిత్య, భాగవత పురాణాలతో పాటు- నారాయణ సంహితలో ప్రస్తావింపబడింది. ధనుర్మాస వ్రతం చేయదలచినవారు బంగారు లేదా వెండి లేకపోయినట్లయితే శక్తి మేరకు పంచలోహములతో గానీ, రాగితో గానీ విష్ణువు విగ్రహాన్ని తయారుచేయించుకుని ధనుర్మాస ప్రారంభదినంనాడు పూజామందిరంలో మధుసూదన నామంతో ప్రతిష్టించుకోవాలి. ప్రతిరోజూ సూర్యోదయానికంటే ఐదు ఘడియల ముందే నిద్ర లేచి కాలకృత్యాలు, స్నానాదులను పూర్తిచేసుకుని సంధ్యావందనాది అనుష్ఠానాలను ముగించుకుని ధనుర్మాస వ్రతారంభం చేసుకోవాలి. మధుసూదనుడికి ప్రతిరోజూ ఆవుపాలు, కొబ్బరి నీరు, పంచామృతాలతో అభిషేకించాలి. వీటిని వరుసగా ఒక్కొక్కదానినే శంఖంలో నింపుకుని, ఆ శంఖంతో అభిషేకం చేయాలి. తర్వాత తులసీదళాలు, వివిధ రకాలైన పుష్పాలతో అలంకరించి షోడశోపచారాలు, అష్టోత్తరాలతో పూజించాలి. నైవేద్యాన్ని సమర్పించాలి. నైవేద్యంగా మొదటి పదిహేను రోజులూ 'చక్కెర పొంగలి' లేదా 'పులగం'ను, తర్వాతి పదిహేను రోజులూ 'దధ్యోదనము'ను సమర్పించాలనేది శాస్త్రవచనం. ఈ విధంగా చేయడంతోపాటూ బ్రాహ్మణులకు అన్నదానం చేస్తే మంచిది. కాశీ, రామేశ్వరం, ప్రయాగ వంటి పుణ్యక్షేత్రాల్లో వందలకొద్దీ బ్రాహ్మణులకు భోజనం పెట్టడం వలన కలిగే ఫలితం ఈ మాసంలో ఒక్క రోజు బ్రాహ్మణుడికి అన్నదానం వల్ల కలుగుతుందని శాస్త్రం చెబుతోంది. ఈ విధంగా మధుసూదనుడితోపాటు ప్రతిరోజూ బృందావనంలో తులసిని పూజించాలి. ఇలా ధనుర్మాసంలో వ్రతాన్ని చేయడం పూర్తయ్యాక మధుసూదన స్వామి మూర్తిని

''మధుసూదన దేవేశ ధనుర్మాస ఫలప్రద
తవ మూర్తి ప్రదానేన మమసంతుమనోరథాః ॥'' అనే శ్లోకాన్ని పఠిస్తూ బ్రాహ్మణుడికి దానం యివ్వాలి. మధుసూదనుని మూర్తిని స్వీకరిస్తూ- ''ఇందిరా ప్రతిగృహ్ణాతు''అని పండితుడు ఆశీర్వాదాన్ని అందిస్తాడు. ఈ విధంగా ధనుర్మాస వ్రతాన్ని ఆచరించడంవల్ల కోరిన కోరికలు తీరడంతోపాటూ ''ఇహంలో సౌఖ్యం పరంలో మోక్షం'' లభిస్తాయని పురాణ కథనం. కాగా ధనుర్మాస వ్రతం నెల రోజులపాటు చేయలేనివారు 8 రోజులు గానీ, 6 రోజులు గానీ, లేదంటే కనీసం ఒక్కరోజు అయినా ఆచరించాలని శాస్త్రవచనం.

- ఎస్. నాగలక్ష్మి

ఆత్మజ్ఞానమే సర్వవేదాంతసారం

ఆత్మచింతన- ఆత్మజ్ఞానము శాంతచిత్తులు- కోరికలను అధిగమించిన వారికి- మోక్షాపేక్ష కల్గినట్టి వారికి ఎంతో ప్రయోజనం. ఆత్మజ్ఞానము సర్వవేదాంత సారము. జగద్గురు ఆదిశంకరాచార్యులవారు రచించిన 'ఆత్మబోధ'లో పలు శ్లోకాల ద్వారా విషయమును విశదీకరణము చేసి లోకానికి సందేశాత్మకంగా అందించారు. ఆత్మజ్ఞానమును తెలిసికొన్న జీవులు ధన్యులు కాగలరు. శాంత మనస్కులు- మముక్షువులు కాగలరు. మనలోని దివ్యత్వమును పైకి తెచ్చేది తపస్సు. ఇంద్రియ నిగ్రహమే దీనికి మూలం, కోరికలను జయించిన వారికే శాంతి లభిస్తుంది. అజ్ఞాని ఆత్మనుగాంచలేడు.

జ్ఞానమార్గం ఎంతో విశిష్టమైనది. అగ్ని లేనిదే వంట ఎలా సాధ్యపడదో- జ్ఞానం లేనిదే మోక్షం సిద్ధించదు. అజ్ఞాన కలుషితమైన దానిని జ్ఞానసాధన మార్గం ద్వారా శుద్ధిచేసుకోవాలి.

ఆత్మస్వరూపం జ్ఞానమే! ఇది మేధకు చెందినది. వ్యక్తి చైతన్యం శుద్ధ అఖండ చైతన్యంలో లీనం కావాలి. జ్ఞానము- జ్ఞాత- జ్ఞేయము అనునవి స్వరూప జ్ఞానము యొక్క ప్రతిబింబాలుగా ఉంటాయి.

రాగద్వేషాలతో కూడుకొన్న సంసార జీవితం జ్ఞానోదయం కానంతవరకు సత్యమైన దానివలె కన్పిస్తుంది. పరమార్థ ప్రయోజనం ఆశించువారికి ప్రపంచం యావత్తూ స్వప్నతుల్యమౌతుంది. ఆత్మజ్ఞానం కలుగనంత కాలం జీవులు చస్తూ-పుడుతూ, సంసార బాధలకు లోనౌతుంటారు. క్షణిక భోగాలకూ, కష్టాలకూ గురిఔతారు. వ్యావహారిక ప్రపంచం, స్వప్న ప్రపంచం రెండూనూ క్షణికములే.

సకల సృష్టికి అంతర్భూతం బ్రహ్మపదార్థమే, సృష్టి అంతయూ భ్రాంతిగనే వుంటుంది. నామరూపాత్మకమైన జగత్తే జీవులకు గోచరిస్తూ వుంటుంది. సంసారం నీటి బుడగ లాంటిది. బ్రహ్మ పదార్థము సత్‌చిత్ ఆనందమయము. విశ్వదృష్టితో చూస్తే



సృష్టి, స్థితి, లయాలకు కారణభూతం. శాశ్వతము- సర్వవ్యాపకము- సత్-చిత్ స్వాభావికమైన విష్ణువు నందే సర్వము భాసిస్తుంటుంది. ''సర్వం విష్ణుమయం జగత్'' అని వేదం.

ఆధ్యాత్మిక దృష్టిగల వానికి మూల పదార్థమైన బ్రహ్మము ఒక్కటే దృష్టిపథంలో వుంటుంది. వాగ్గేయకారుడైన అన్నమయ్య కలియుగ వరదుడైన శ్రీ వేంకటేశ్వరుని అర్పించిన కీర్తనలలో ''బ్రహ్మమొక్కటే- పరబ్రహ్మమొక్కటే'' అని వర్ణించినాడు. ఉపాధులన్నీ మానవ కల్పితములే. ఉపాధులు తొలగినపుడే మిగిలేది కన్పించేది ఒకే ఒక పరమాత్మతత్త్వము ఉపాధి దోషము మాయాకల్పితము. అది తొలగితే మిగులునది 'ఆత్మ' ఒక్కటే. పంచభూతాత్మకమైనది స్థూల శరీరము. దీన్నే పంచీకరణము అంటారు.

పూర్వజన్మకృత కర్మలకు తగినట్లుగా జన్మకల్గుతుంది. అపంచీకృతమైనది సూక్ష్మ శరీరము. దశేంద్రియములతో కూడి వుంది. సుఖదుఃఖాలను అనుభవింపజేస్తుంది. వీటికి ప్రధానం మనసు. ఇది చేయు పనినిబట్టి అహంకారము- చిత్తము- బుద్ధి అని పిలువబడుతూ, పునర్జన్మలకు నిలయమౌతుంది. ఆత్మజ్ఞానము కలుగుటకు అవరోధంగా వుంటుంది. జ్ఞాననిష్ఠ కలుగువరకు సంసార బాధలు తప్పవు.

స్థూల- సూక్ష్మ- కారణ శరీరాలకు అన్యమైనది ఆత్మ. అవిద్యయే కారణశరీరము. అజ్ఞానంలో జీవులు సంచరించినంతకాలం ఆత్మను ఎఱుగలేరు. ఆత్మజ్ఞానమును పొందలేరు. శాశ్వతానంద స్వరూపము ఆత్మదేగాన, అన్నమయ- ప్రాణమయ- మనోమయ- విజ్ఞానమయ- ఆనందమయ అను పంచకోశములను శుద్ధాత్మనుండి వేరుచేయాలి.

విచారణ- వివేకము జ్ఞానమునకు ప్రధాన సాధనములు. శ్రవణ- మనన- నిధి- ధ్యాసలు వీటికి మూలంగాన వీటి ద్వారా పంచకోశములను విడదీసినచో ఆత్మగోచరిస్తుంది. ఆత్మజ్ఞానము లభిస్తుంది. ఆత్మపరిశుద్ధ మనస్కులకే ద్యోతకమౌతుంది. నిష్కల్మషమైన మనోబుద్ధులు కల్గి- క్రమశిక్షణ నీతి మార్గమును అనుసరించిన వారికి బుద్ధికుదురుతుంది. అటువంటి వారికే ఆత్మసాక్షాత్కారము కలుగుతుంది. ఆత్మ జ్ఞానమును పొందే అవకాశం పెరుగుతుంది. ఆత్మజ్ఞానము లేనిదే ఏదీ లభించదు. చైతన్యంతో సదా తాదాత్మ్యం చెందినవాడే ఆత్మజ్ఞాన నిష్ఠాపరుడు. ఆత్మజ్ఞానమును పొందిన వారికే బ్రహ్మజ్ఞానం లభిస్తుంది. మనసులు సత్-చిత్ ఆనందమయమౌతాయి. అజ్ఞానం అంతరిస్తుంది. అన్ని అవస్థలను అధిగమించిన వారే ఆత్మజ్ఞానులు.

- పి.వి.సీతారామమూర్తి

పాపులకు సుఖభోగాలేమిటి?

★ విడాకులు తీసుకొన్న భార్య, భర్తలను ఏ విధంగా సంబోధించవచ్చు? - రామారావు, సికింద్రాబాదు

మన ధర్మశాస్త్రాల ప్రకారం విడాకులు శాస్త్రీయం కావు. కొన్ని అనివార్య పరిస్థితులలో అలా చేయవలసి వస్తే, వివాహ సమయంలో అగ్నిప్రమాణ పూర్వకంగా చేసుకొన్న పరస్పర ప్రతిజ్ఞలను రద్దు చేసుకొనేందుకోసం ఘటశ్రాద్ధము అనే పేరుతో కొన్ని శ్రాద్ధ

ధర్మ సందేహాలు
- కుప్పా వేంకట కృష్ణమూర్తి

ప్రక్రియలను ఆచరించాలి. అప్పుడే వారి బంధం విడిపోయినట్లు లెక్క. అది జరగక్కుండా స్త్రీపురుషులలో ఎవరైనాసరే మరో వ్యక్తితో శారీరక సంబంధాలు పెట్టుకుంటే, అది వ్యభిచారమే అవుతుంది- అని శాస్త్రకారుల అభిమతం.

★భార్యా విహీనుడిని ఏమని భావించాలి? -రమ్య, వైజాగ్

భార్య మరణిస్తే ఆ పురుషుణ్ణి ''విధురుడు'' అంటారు. విధవాస్త్రీకి ఎటువంటి ధర్మాలున్నాయో ఇంచుమించు అలాంటి ధర్మాలే విధురుడికిగూడా వున్నాయి. అతడు ఆచరించే శ్రాద్ధ విధుల్లోగూడా కొన్ని మార్పులు వస్తాయి.

★ పాండవులు పరాక్రమవంతులు, శ్రీకృష్ణుడికి ప్రియులు, పైగా దైవాంశ సంభూతులు. వారికి అన్ని కష్టాలేమిటి? దుర్యోధనునికి రాజ్యభోగాలేమిటి? - చిత్ర, విజయవాడ

దైవాంశ సంభూతుల దాకా ఎందుకు? సాక్షాత్తు దైవావతారమైన శ్రీకృష్ణ పరమాత్మకే కష్టాలు తప్పలేదే! మన సమాజంలో ఒక రౌడీల నాయకుడు ఉన్నాడు అనుకుందాం. ఈ జన్మలో అతని భోగాలు అపూర్వాలు. మరి పై జన్మలో వాడి గతేమిటి? అందుకనే, పెద్దలు పుణ్యఫలాన్ని- పుణ్యోద్దీపక పుణ్యఫలమనీ, పాపోద్దీపక పుణ్యఫలమనీ రెండుగా విభజించారు. దురుద్దేశ పూర్వకంగా కొన్ని పుణ్యకర్మలను ఆచరించినపుడు, వారికి మరు జన్మలో పాపోద్దీపక పుణ్యఫలం లభిస్తుంది. దుర్యోధనాదులంతా ఆ కోవలోనివారే. రావణాదులూ అంతే. వారికి పై జన్మలో తీవ్ర కష్టాలు తప్పవు. కేవలం సదుద్దేశ్యంతోగానీ, అసలే నిష్కామంగా గానీ, పుణ్యకార్యాలు చేసిన వారికి మరుజన్మలో పుణ్యోద్దీపక పుణ్యఫలం లభిస్తుంది. దాని వల్ల ప్రస్తుత జన్మలో ఇతోధికంగా పాపక్షయం జరిగి పై జన్మలో మహత్తరమైన సుఖం లభిస్తుంది. పాండవులు ఈ కోవలో ఉత్తములు.

ప్రశ్నలు పంపాల్సిన చిరునామా :
కుప్పా వేంకట కృష్ణమూర్తి
ఇంటి నెం. 11-13-279, రోడ్ నెం. 8, అలకాపురి, హైదరాబాద్-500 035.
vedakavi@serveveda.org

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి

మంగళవారం 30, డిసెంబర్ 2014

ఆనందీ బెన్

మలాలా

ఘనతలు, కలతల కలబోత..

మరికొన్ని గంటల్లో... ఓ ఏడాది జ్ఞాపకాల పొరల్లోకి జారిపోనుంది... మహిళలకు సంబంధించి 2014 అనేకానేక ఘన విజయాలను నమోదు చేసింది... ఎప్పటిలాగే కొన్ని విషాద స్మృతులనూ మిగిల్చింది... చేదు, తీపి అనుభూతుల సమాహారంగా నిలిచిన పాత ఏడాదికి వీడ్కోలు పలికి, కొత్త ఆశలు రేకెత్తిస్తున్న నూతన సంవత్సరానికి స్వాగతం పలికేముందు ఈ ఏడాది చోటుచేసుకున్న పరిణామాలను ఓసారి సింహావలోకనం చేసుకుంటే- కొన్ని అనుభూతులు ఆనందం కలిగిస్తాయి... మరికొన్ని పరిణామాలు ఆందోళనకు గురి చేస్తాయి... ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆసేతు హిమాచలం మహిళా ఓటర్లు ఎంతో ఉత్సాహంతో పోలింగ్‌లో పాల్గొని రాజకీయ చైతన్యం చాటుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో 66.4 శాతం మేరకు పోలింగ్ జరిగిందంటే- పల్లెలు, పట్టణాలనే తేడాలేకుండా అన్ని వర్గాల మహిళలూ ఓటు వేసేందుకు భారీగా 'క్యూ' కట్టడమే కారణం. కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పాటుకు మహిళా ఓటర్లు తమ వంతు బాధ్యతను నిండు మనసుతో నెరవేర్చారు. మరోవైపు రాజకీయాలు, కళలు, క్రీడలు, ఉపాధి, పరిశ్రమలు, కార్పొరేట్ రంగాల్లో ఎంతోమంది అతివలు సత్తా చాటారు. ఏ రంగంలోనైనా పురుషులకు దీటుగా రాణించగలమని పలు సందర్భాల్లో నిరూపించారు.

అంతర్జాతీయంగా చూస్తే బాలికల విద్య కోసం కృషిచేస్తున్న పాకిస్తాన్ సాహస యువతి మలాలా అత్యంత పిన్న వయసులో నోబెల్ శాంతి పురస్కారాన్ని కైవసం చేసుకుంది. బంగ్లాదేశ్‌లో అత్యధిక మెజారిటీతో అవామీ లీగ్ పార్టీ అధినేత్రి షేక్ హసీనా మూడోసారి అధికార పగ్గాలు చేపట్టారు. ఇక, మన దేశంలోనే అతి పెద్ద ప్రభుత్వ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తొలి చైర్పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన అరుంధతీ భట్టాచార్య 'అత్యంత శక్తివంతమైన మహిళల జాబితా'లో మొదటి స్థానంలో నిలిచారు. నరేంద్ర మోదీ రాజకీయ వారసురాలిగా సీనియర్ మంత్రి ఆనందీ బెన్ గుజరాత్ తొలి మహిళా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. లోక్‌సభతో పాటు పలు అసెంబ్లీ ఎన్నికల్లో వరుస పరాజయాలతో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ప్రతిష్ట మసకబారింది. అక్రమ ఆస్తుల కేసులో తమిళనాడులో జయలలిత ముఖ్యమంత్రి పదవిని కోల్పోగా, 'శారదా స్కామ్'తో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇరకాటంలో పడ్డారు. ఎనిమిది సార్లు ఎంపీగా గెలిచిన సుమిత్రా మహాజన్ (71) లోక్‌సభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతర్జాతీయ మహిళా బాక్సర్ మేరీకోమ్ ఆసియన్ గేమ్స్‌లో సర్వపతకం సాధించగా, తెలుగమ్మాయి పివి సింధు 'వరల్డ్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్' టైటిల్‌ను కైవసం చేసుకుంది.

దక్షిణాఫ్రికాకు చెందిన రోలెన్ స్ట్రాస్ లండన్‌లో జరిగిన 'ప్రపంచ సుందరి' పోటీల్లో టైటిల్ సాధించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నీనా దావులూరి 'మిస్ అమెరికా'గా, ప్రణతి గంగరాజు 'మిస్ ఇండియా యుఎస్ఎ'గా నిలిచారు. 'మేరీకోమ్' సినిమాలో బాక్సర్‌గా నటించి ప్రేక్షకజన హృదయాలను గెలుచుకున్న బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా మరోవైపు- 'ఆసియా శృంగార భామ'గానూ గుర్తింపు పొందారు. జైపూర్‌కు చెందిన ఆస్తా అగర్వాల్ 'ఫేస్‌బుక్' సంస్థలో 2.1 కోట్ల రూపాయల వార్షిక వేతనంతో జాక్‌పాట్ కొట్టేసింది. కథానాయికే కేంద్ర బిందువుగా ఈ ఏడాది బాలీవుడ్‌లో 14 'మహిళా ప్రధాన చిత్రాలు' విడుదల కాగా అందులో కొన్ని ఘన విజయాలు సాధించాయి. నటనకు అవకాశం ఉన్న పాత్రలు లభిస్తే హీరోలకు తాము ఎందులోనూ తీసిపోమని ప్రియాంకా చోప్రా, మాధురీ దీక్షిత్, జుహీ చావ్లా, కంగనా రనౌత్, ఆలియా భట్, దీపిక పదుకొనె వంటి నటీమణులు వైవిధ్యభరితమైన నటనతో చాటుకున్నారు. సాంఘిక దురాచారాలు, మహిళల వేదనలు, సమకాలీన పరిస్థితులను స్పృశిస్తూ ఈ ఏడాది బాలీవుడ్‌లో వచ్చిన పలు సినిమాలు ప్రేక్షకాదరణతో సంచలన విజయాలను నమోదు చేశాయి.

వీక్షణం-2014

రోలెన్ స్ట్రాస్

అరుంధతీ భట్టాచార్య

చానూ షర్మిళ

మేరీకోమ్

పి.వి. సింధు

సానియా మీర్జా

కార్పొరేట్ 'ఎర్ర తివాచీ'!

బ్యాంకింగ్, కార్పొరేట్ రంగాల్లో ఈ ఏడాది మహిళలకు ప్రాధాన్యం మరింతగా పెరిగింది. అనేక సంస్థల్లో చైర్పర్సన్లు, సిఇఓలు, ఇతర కీలక స్థానాల్లో మహిళలు నియమితులయ్యారు. సుమారు 400 లిస్టెడ్ కంపెనీల్లో తొలిసారిగా కనీసం ఒక మహిళా డైరెక్టర్‌ను నియమించారు. కార్పొరేట్ సంస్థల్లో ఎగ్జిక్యూటివ్ పోస్టుల్లో ఉన్నమహిళలకు 10 నుంచి 12 శాతం మేరకు వేతనాలు పెరిగాయి. ఫార్మా, హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లోనూ మహిళా ఎగ్జిక్యూటివ్‌లకు వేతనాలు ఆశాజనకంగా పెరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థపై అంచనాలు ఆశాజనకంగా ఉండడంతో మహిళలకు ఉద్యోగావకాశాలు గతంలో కంటే మెరుగయ్యాయి.

అక్కచెల్లెళ్ల సాహసం..

బస్సులో వెళుతుండగా లైంగిక వేధింపులకు పాల్పడిన ఆకతాయి యువకులకు దేహశుద్ధి చేసి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రోహ్తక్‌కు చెందిన అక్కచెల్లెళ్లు ఆర్తి, పూజలకు హర్యానా ప్రభుత్వం నగదు నజరానాలను ప్రకటించింది. యువతులకు స్ఫూర్తిగా నిలిచిన ఈ ఇద్దరినీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఘనంగా సత్కరించాలని హర్యానా ముఖ్యమంత్రి నిర్ణయించారు.

సన్నీ కోసం 'శోధన'!

భారత్‌లో చాలామంది యువకులు 'శృంగార భామ' సన్నీ లియోన్ పేరునే నిత్యం జపిస్తున్నారు. ఈ ఏడాది గూగుల్‌లో కుర్రాళ్లంతా అత్యధికంగా గాలించిది ఈ మాజీ 'నీలి చిత్రాల' నటినే! ప్రధాని నరేంద్ర మోదీ, బాలీవుడ్ అగ్రనటుడు సల్మాన్ ఖాన్ కన్నా గూగుల్ 'శోధన' (సెర్చి)కి సంబంధించి సన్నీ ముందు వరసలో ఉంది.

సత్తా చాటిన సింధు

కామన్‌వెల్త్ క్రీడల్లో పతకం చేజారినప్పటికీ 'వరల్డ్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్'లో పతకం గెలిచి హైదరాబాదీ అమ్మాయి పివి సింధు సత్తా చాటుకుంది. ఈ పోటీలో వరసగా రెండేళ్లు నెగ్గిన తొలి భారతీయురాలిగా రికార్డు సృష్టించింది.

వయసు 20..! జీతం 2 కోట్లు..!

జైపూర్ (రాజస్థాన్)కు చెందిన ఇరవై ఏళ్ల ఆస్తా అగర్వాల్ 2.1 కోట్ల రూపాయల వార్షిక వేతనంతో 'ఫేస్‌బుక్' సంస్థలో జాక్‌పాట్ కొట్టేసింది. ముంబయి ఐఐటిలో ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఆమె కొంతకాలంగా 'ఫేస్‌బుక్'లో ఇంటర్న్‌షిప్ చేస్తూ అదే సంస్థలో ఉద్యోగానికి ఎంపికైంది.

'అక్షర సేనాని'కి నోబెల్ సత్కారం

మతోన్మాద తాలిబన్లను ఎదిరించి బాలికల విద్య కోసం పోరుబాట పట్టిన పాకిస్తాన్ సాహస యువతి మలాలా యూసఫ్‌జాయ్ (17) నోబెల్ శాంతి బహుమతి అందుకుంది. అత్యంత పిన్న వయసులో నోబెల్ పురస్కారాన్ని దక్కించుకున్న యువతిగా కొత్త రికార్డు సృష్టించింది. తుపాకీ కన్నా అక్షరమే శక్తివంతమైన ఆయుధమని బాలికల విద్య కోసం ఆమె చేస్తున్న సమరం యావత్ ప్రపంచాన్నే కదిలించింది.

గుజరాత్‌లో తొలి మహిళా సిఎం

సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీకి అఖండ విజయం సాధించి పెట్టిన నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించడంతో ఆయన స్థానంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆనందీ బెన్ ఎంపికయ్యారు. మోదీ కేబినెట్‌లో సీనియర్ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించిన ఆనందీ గుజరాత్‌లో తొలి మహిళా ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించారు.

'బంగారు' మేరీ!

అంతర్జాతీయ మహిళా బాక్సర్, 'మణిపూర్ మణిపూస' ఎంసి మేరీకోమ్ సియాచిన్‌లో జరిగిన ఆసియన్ గేమ్స్‌లో స్వర్ణ పతకం సాధించి భారత కీర్తి పతాకాన్ని రెపరెపలాడించింది.

టెన్నిస్ స్టార్.. బ్రాండ్ అంబాసిడర్

ఈ ఏడాది రెండు మిక్స్‌డ్ డబుల్స్ పోటీల్లో సంచలన టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా టైటిళ్లను సాధించింది. సియాచిన్‌లో జరిగిన ఆసియా గేమ్స్‌లో మన దేశానికే చెందిన సాకేత్ మైనేనితో, యుఎస్ ఓపెన్‌లో బ్రూనో సొరెస్ (బ్రెజిల్)తో కలిసి ఆమె పతకాలను కైవసం చేసుకుంది. దేశానికే వన్నె తెచ్చిన ఆమెను తమ రాష్ట్ర 'బ్రాండ్ అంబాసిడర్' గా తెలంగాణ ప్రభుత్వం నియమించింది.

నిరాహార దీక్షకు పద్నాలుగేళ్లు!

'సాయుధ దళాలకు ప్రత్యేక హక్కుల చట్టా'న్ని రద్దు చేయాల్సిందిగా కోరుతూ 'మణిపూర్ ఉక్కు మహిళ' చానూ షర్మిళ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు ఈ ఏడాది నవంబర్ 6 నాటికి 14 ఏళ్లు పూర్తయ్యాయి.

అత్యంత శక్తివంతమైన మహిళ..

ప్రభుత్వ రంగంలో అతిపెద్ద బ్యాంకు అయిన 'స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా' చైర్పర్సన్ అరుంధతీ భట్టాచార్య ఈ ఏడాదికి సంబంధించి భారతీయ వాణిజ్యరంగంలో 'అత్యంత శక్తివంతమైన మహిళ'గా 'ఫార్చ్యూన్' పత్రిక గుర్తించింది. ఆమె తర్వాతి స్థానంలో ఐసిఐసిఐ బ్యాంకు సిఇఓ చందా కొచ్చర్, యాక్సిస్ బ్యాంకు సిఇఓ శిఖా శర్మ నిలిచారు. 'అత్యంత శక్తివంతమైన' తొలి పదిమంది మహిళల్లో ఎజెండ్‌బి సంస్థ సహ వ్యవస్థాపకురాలు జియా మోదీ, 'టాఫే' సిఇఓ మల్లికా శ్రీనివాసన్, అపోలో ఆస్పత్రుల డైరెక్టర్ ప్రీతి రెడ్డి, 'బయోకాన్' సిఎండి కిరణ్ మజుందార్ షా తదితరులు ఉన్నారు.

మహిళా ఎంపీల సంఖ్య తక్కువే..

'ఆకాశంలో సగం.. అవకాశాల్లో సగం..' అన్న నినాదం చాలాకాలంగా వినిపిస్తున్నా చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం నామమాత్రంగానే ఉంటోంది. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలే ఇందుకు నిదర్శనం. 543 మంది ఎంపీలను ఎన్నుకునేందుకు జరిగిన 16వ లోక్‌సభ ఎన్నికల్లో 61 మంది మహిళలు మాత్రమే గెలిచారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో 59 మంది మహిళలు గెలుపొందగా, ఈ ఏడాది ఆ సంఖ్య స్వల్పంగా పెరిగింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం నిర్దేశించిన 'మహిళా రిజర్వేషన్ బిల్లు' అటకెక్కిపోవడంతో చట్టసభల్లో అతివల ప్రాతినిధ్యం పెరిగే సూచనలు ఇప్పట్లో లేవు.

-మౌనిక

పరాజయాల పరంపర

లోక్‌సభ, పలు అసెంబ్లీ ఎన్నికల్లో వరుస ఓటముల ఫలితంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ రాజకీయంగా విపత్కర పరిస్థితులను ఎదుర్కొనక తప్పలేదు. వరుసగా పదేళ్ల పాటు కేంద్రంలో అధికారం చలాయించిన కాంగ్రెస్ పార్టీకి సార్వత్రిక ఎన్నికల్లోనూ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, హర్యానా, జమ్ము-కాశ్మీర్, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎన్నికలు జరిగిన పలు రాష్ట్రాల్లో ఆ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. దేశ వ్యాప్తంగా మోదీ పవనాలు వీస్తూ రానురానూ బిజెపి బలోపేతం కావడంతో సోనియా సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది. తొలిసారిగా పూర్తి మెజారిటీతో కేంద్రంలో బిజెపి సర్కారు కొలువుదీరగా, లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా పోయింది. ప్రస్తుత పరిస్థితులను అధిగమించి 'కాంగ్రెస్ పునరుత్థానం' సాధించడం సోనియాకు ఓ సవాల్‌గా మారింది.

జయకు పదవీ వియోగం

తమిళనాట జనాదరణలో తిరుగులేని అన్నాడిఎంకె పార్టీ అధినేత్రి జయలలిత అక్రమ ఆస్తుల కేసుల ఫలితంగా ముఖ్యమంత్రి పదవిని కోల్పోయారు. 66.65 కోట్ల రూపాయల అక్రమ ఆస్తుల కేసులో ఆమెకు బెంగళూరులోని సిబిఐ ప్రత్యేక కోర్టు వంద కోట్ల రూపాయల జరిమానా,నాలుగేళ్ల జైలు శిక్షను విధించింది. తీర్పు వెలువడిన మరుక్షణం జైలుకు తరలించడంతో ఆమె సిఎం పదవికి అనర్హురాలయ్యారు. కొద్ది వారాల పాటు జైలులో ఉన్న తర్వాత ఆమెకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

'శారదా స్కామ్'తో దీదీ కలవరం

మాటల తూటాలతో రాజకీయ ప్రత్యర్థుల్ని హడలెత్తించే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, 'అపర కాళిక' మమతా బెనర్జీకి 'శారదా స్కామ్' నిద్ర లేకుండా చేస్తోంది. పేద, మధ్య తరగతి వారు 'శారదా చిట్స్'లో పొదుపు చేసిన సొమ్మును కైంకర్యం చేసిన ఉదంతంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేతలకు ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో ఆమె ఇరకాటంలో పడ్డారు. 'శారదా స్కామ్'లో రాష్ట్ర మంత్రి మదన్ మిత్రాతో పాటు ఇద్దరు ఎంపీలను సిబిఐ అధికారులు అరెస్టు చేయడం వెనుక కేంద్రంలోని మోదీ ప్రభుత్వ హస్తం ఉందని మమత ఆరోపిస్తున్నారు. ఆ ఆరోపణల సంగతెలా ఉన్నా- 'శారదా స్కామ్'తో మమత ప్రతిష్ఠ మసకబారుతోందని ఆమె పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

వివాదాల్లో విద్యామంత్రి

ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్‌లో అత్యంత కీలకమైన మానవ వనరుల శాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్మృతి ఇరానీ తన విద్యార్హతలకు సంబంధించి వివాదాల్ని ఎదుర్కొన్నారు. 2004, 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా విద్యార్హతల విషయమై ఆమె తప్పుడు అఫిడవిట్ ఇచ్చారని విపక్షాలు ఆరోపించాయి. డిగ్రీ కూడా చదవని స్మృతికి విద్యాశాఖను ఎలా అప్పగించారని విమర్శలు వెల్లువెత్తాయి. 1996లోనే ఢిల్లీ విశ్వవిద్యాలయం దూర విద్య విభాగంలో తాను బి.ఎ పూర్తి చేశానని, 1994లో అదే వర్సిటీ నుంచి బి.కామ్ పార్ట్-1 పూర్తి చేశానని ఆమె పరస్పర విరుద్ధమైన అఫిడవిట్లను ఎన్నికల కమిషన్‌కు సమర్పించారు. యాలే విశ్వవిద్యాలయం (అమెరికా) నుంచి తాను డిగ్రీ పూర్తి చేసినట్లు కూడా ఆమె మరో సందర్భంలో పేర్కొన్నారు. అయినా, మంత్రి పదవి చేపట్టడానికి డిగ్రీలు అవసరం లేదని, నిజాయితీ, నిబద్ధత వంటివి ఉండాలని ఆమె తన రాజకీయ ప్రత్యర్థుల దాడిని తిప్పికొట్టారు.

భద్రత ప్రశ్నార్థకం..

అత్యాచారాలు, లైంగిక నేరాలు,కట్నవేధింపులు, గృహహింస నిరోధానికి పాలకులు ఎన్ని శాసనాలు చేస్తున్నా దేశ వ్యాప్తంగా మహిళల పట్ల అకృత్యాలకు అంతులేకుండా పోతోంది. సాక్షాత్తూ ఢిల్లీ నగరం దేశానికే కాదు, నేరాలకూ రాజధానిగా మారిందని అధికారిక గణాంకాలే ఘోషిస్తున్నాయి. బాలికలు, యువతులు, ఉద్యోగినులు, గృహిణులు.. ఇలా వయోభేదం లేకుండా మహిళలకు భద్రత ప్రశ్నార్థకంగా మారింది. 2012లో 'నిర్భయ' ఉదంతం అనంతరం లైంగిక నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు 'నిర్భయ చట్టం' అమల్లోకి వచ్చినా పరిస్థితిలో మార్పు లేదు. అత్యాచార బాధితులకు ఊరట కలిగించేందుకు నిర్దేశించిన 'నిర్భయ నిధి', 'నిర్భయ కేంద్రాలు' కాగితాలకే పరిమితమవుతున్నాయి. యుపిలో ఇద్దరు బాలికలపై అత్యాచారం చేసి చెట్టుకు వేలాడదీయడం, హైదరాబాద్‌లో ఓ ఐటి ఉద్యోగినిని కారులో తీసుకెళ్లి అత్యాచారం చేయడం, బెంగళూరులో స్కూలు పిల్లలపై అత్యాచారాలు.. ఇలా అన్ని ప్రాంతాల్లోనూ వెలుగు చూస్తున్న అత్యాచారాల సంఘటనలు సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకునేలా చేశాయి. తాజాగా ఢిల్లీలో ఓ మహిళపై 'క్యాబ్' డ్రైవర్ అత్యాచారం చేయడంతో- నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న టాక్సీలను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యాసంస్థలు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, బస్సులు, రైళ్లు.. ఇలా ఎక్కడా మహిళలకు భద్రత లేని పరిస్థితి నెలకొంది.

చిరస్మరణీయులు..

అంజలీ దేవి

జోహ్రా సెహగల్

తెలంగాణ శకుంతల

సితారా దేవి

కళారంగానికి సంబంధించి ఈ ఏడాది పలువురు ప్రముఖ మహిళలు కన్నుమూశారు. ప్రఖ్యాత బాలీవుడ్ నటీమణులు జోహ్రా సెహగల్ (103), నంద (75), బెంగాలీ నటి సుచిత్రా సేన్ (82), కథక్ నృత్యకారిణి సితారా దేవి (94), నాటకరంగంలో పేరుగాంచిన వీణాపాణి చోప్రా (67), తెలుగు చలనచిత్ర సీమకు చెందిన అంజలీ దేవి (86), తెలంగాణ శకుంతల, సామాజిక కార్యకర్త మల్లాది సుబ్బమ్మ ఈ లోకాన్ని వీడిపోయారు. కేంద్ర మాజీ మంత్రి శశి థరూర్ భార్య, ప్రముఖ వ్యాపార వేత్త సునంద పుష్కర్ (49) అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

అందాల పోటీల్లో ఖ్యాతి..



నీనా దావులూరి



ప్రణతి గంగరాజు

ఈ ఏడాది అమెరికాలో జరిగిన రెండు అందాల పోటీల్లో ఇద్దరు తెలుగమ్మాయిలు టైటిళ్లను కైవసం చేసుకున్నారు. నీనా దావులూరి (25) 'మిస్ అమెరికా 2014', ప్రణతి గంగరాజు 'మిస్ ఇండియా యుఎస్ఎ-2014' టైటిళ్లను సాధించారు. లండన్‌లో జరిగిన 'మిస్ వరల్డ్ 2014' పోటీల్లో బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచ సుందరి (1994) ఐశ్వర్యా రాయ్‌కు అరుదైన గౌరవం దక్కింది. 'ప్రపంచ సుందరీ మణుల్లో మేటి విజేత'గా గుర్తించి ఆమెను 'మిస్ వరల్డ్' పోటీల సందర్భంగా సత్కరించారు. ఏభై దేశాల నుంచి ముద్దుగుమ్మల పాల్గొన్న 'మిస్ సూప్రానేషనల్- 2014' పోటీల్లో భారతీయ యువతి ఆశాభట్ విజేతగా నిలిచింది. ఈ టైటిల్‌ను సాధించిన తొలి భారతీయురాలిగా ఆమె చరిత్ర సృష్టించింది.

ముత్యాల ముగ్గు



13 చుక్కలు,
13 వరుసలు

గుండు స్వరూపారాణి,
పెద్దాపూర్ (కరీంనగర్)



చుండూరు తన్మయి,
ఇసిఐఎల్, హైదరాబాద్

17 చుక్కలు, 7 వరుసలు
5 వరకూ సరిచుక్కలు

ఎన్.జ్యోతి,
అశ్వాపురం (ఖమ్మం)

నేర్చుకుందాం

క. కరువలి సుతునకు నొక భీ
కర గద నిప్పించి యొక్క గదఁ దనకేలన్
ధరియించి నలువురును గ్ర
చ్చుఱ ఁ బురివెలి కేగి యచట సమతల భూమిన్

భావం: జరాసంధుడు భీమునికి ఒక గదను ఇప్పించి తా నొక గదను ధరించాడు. తరువాత పట్టణానికి వెలుపల సమతలమైన ప్రదేశానికి ఆ నలుగురూ చేరారు. మారువేషాలతో వెళ్లి జరాసంధుడి దగ్గర యుద్ధమనే దానం గ్రహించిన తరువాత ఎవరితో యుద్ధం చేస్తావో జరాసంధుడినే చెప్పమని అంటే తన బాహుబలానికి కృష్ణుడు అర్జునుడు సరిపోరని చెబుతూ ఒక్క భీముడే తన బాహుబలానికి సరైన జోడు నిర్ణయించుకుని తాను భీమునితో యుద్ధం చేస్తానని జరాసంధుడు ప్రగల్భాలు పలికి కదనరంగానికి వచ్చాడు. అక్కడ భీమునికి ఒక గదను ఇప్పించి తాను ఓ గదను చేతబుచ్చుకున్నాడు.

పోతన భాగవతము - దశమ స్కంధము

స్పందన

45

కె. ప్రమీలాజనార్దన్

మీరిప్పుడు ఆలోచించాల్సింది.. అనుకోవలసింది.. కుటుంబ పరువు ప్రతిష్ఠల గురించి కాదు. పిల్లల నిర్ణయం వాళ్ళ జీవితాన్ని సుఖవంతం చేసిందా? లేదా అని..'' అన్నాడు శ్యామ్.

''బాబు..'' కోటేశ్వరరావుగారి కళ్ళు చెమర్చాయి.

''నేను వయసులోనే పెద్దవాడిని. ఆలోచనల్లో నీ ఎత్తుకు ఎదగడం అసాధ్యమయ్యా...'' తను ఏవగించుకున్న మనిషి తనెంత అభిమానిస్తున్నాడు... అలా అనిపించగానే గుండె చెరువైనట్లుగా వుందాయనకు.

''విశ్వనాథం మాష్టారు నీకంతా చెప్పినట్లున్నారు'' అన్నారు కోటేశ్వరావుగారు ఏదో ఆలోచిస్తున్నట్లుగా చూస్తూ. తను ఎవరికీ చెప్పవద్దని మరీ మరీ చెప్పి ఒట్టు కూడా వేయించుకున్నాడు. ఇతడికి చెప్పడం విశేషమనిపించింది కాని ఇప్పుడనిపిస్తోంది- ఇతడి ఆత్మీయత అనురాగం అతడ్ని కదిలించి వుంటుందని... అందులో మాష్టారు కూడా తన గురించి తన కుటుంబం గురించి ఆలోచించేవారే.. ఆత్మీయతానుబంధం గలిగినవారు.

''చెప్పారు. నేనారోజు మెడికల్ కాన్ఫరెన్స్ కోసం హైదరాబాదుకు వెళ్ళకపోతే ఇలా మిమ్మల్ని కలుసుకొనే అవకాశం లభించేది కాదు. కాన్ఫరెన్స్ అయిపోయాక సాయంత్రం అబిడ్స్‌లో బిగ్ బజార్‌లోపలికి వెళ్లబోతున్న నాకు మాష్టారు ఆటో దిగుతూ కనిపించారు. నేనే ఆయన్ను గుర్తుపట్టి దగ్గరికి వెళ్లి పలకరించాను. ఆయన ఎవరో స్నేహితుడి మనవరాలి పెళ్లికి వచ్చారట. ప్రొద్దున్నే పెళ్లయిందట. రాత్రి ట్రైన్‌లో ప్రయాణమని చెప్పడం తప్ప మీ గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు. ఆయన కూతురు మహిత ఫోన్ చేసిన విషయం చెప్పాను.

''నిజమా...'' అంటూ ఆశ్చర్యపడ్డారాయన. మహిత మీ గురించి తెలుసుకొని ఫోన్ చెయ్యడం ఆశ్చర్యంగా వుంది. నేనిక్కడకు పెళ్లికి రెండు రోజులు ముందుగా బంధువులను, ఇద్దరు ముగ్గురు మిత్రులను కూడా కలుసుకున్నాను. నేనిన్ని రోజులు ఇక్కడ వుండడం వల్ల నాకా విషయం తెలియలేదు. సెల్‌ఫోన్ పట్టుకొని తిరగడం నాకిష్టంలేదు. అందుకే నేను సెల్ ఫోన్ కొనలేదు కాబట్టి నాకీ విషయం ఊరికి వెళ్ళాకే తెలిసేది. ఇప్పుడు మీరు కనిపించారు, గుర్తుపట్టి పలకరించారు. చాలా సంతోషంగా వుంది. భావన ఎలా వుంది? ఎంతమంది పిల్లలు అంటూ కుశల ప్రశ్నలు వేశారు. జవాబు చెప్పాక అడిగాను. భావన తండ్రి మీకు ఇచ్చిన కవరులోవున్న వివరాలేమిటో మీకుతెలిసే వుంటుంది. నేను తెలుసుకోవచ్చా? అని భావన మధ్యాహ్నమే ఫోన్ చేసి చెప్పింది మహిత ఫోన్ చేసిన విషయం. ఈ రోజే మీరు కనిపించడం.. నాకెంతో సంతోషంగా వుంది మాష్టారు. ఆ కవరులో వున్న విషయమేమిటో మీరు చెబుతారని'' అన్న నా మాటలకు ఆయన నవ్వి ''పెద్ద విషయాలేం లేవు. వున్నా నేను చెప్పేవాడ్ని కాదు. ఎందుకంటే ఎవరికీ అందులో విషయాలు కాని వాళ్ళ గురించిన వివరాలు కాని చెప్పవద్దని ఒట్టు వేయించుకొని చెప్పారాయన'' అన్నారు మాష్టారు.

''మాట మీరకపోవడం మంచితనమే. కాని భావన బాధపడే విషయాలేవైనా వుంటే ఆ కవరు ఇవ్వవద్దని నా మనవి'' అన్నాను నేను.

''లేదు బాబు. భావనను నిందిస్తూ ఆయనేం వ్రాయలేదు. మీ మీద విరుచుకుపడి ఇంట్లోకి రానివ్వనందుకు తనకు దేవుడు శిక్ష వేశాడని, పెద్ద మనసుతో తనను క్షమించమని, తను తన భార్య గతించాక ఆమె వాటా ఆస్థి తీసుకోమని లెటర్ వ్రాశాడు...'' అన్న ఆయన మాటల్లో ఉద్వేగం, ఆవేదన ఆయనకు మీ మీద వున్న గౌరవం అభిమానం తెలుపుతుంటే నాకు ఆయన మీద నాకు తెలియకుండానే గౌరవభావం పెరిగింది. ఆ తరం వాళ్ళ ఆప్యాయత అభిమానాలు ఈనాడు ఎక్కడో కాని కనిపించడంలేదు. స్నేహం అంతకంటే మానసికంగా దగ్గరైన మీమీద నింద పడగూడదన్న తాపత్రయతం మీకిచ్చిన మాటను గూడా మరిచేట్లు చేసింది. పరిసరాలను మరిచి ఆయన్ను హృదయాన్ని హత్తుకున్నాను.

''ఇంత మంచి మిత్రుడు ఆప్తులున్న మా మామగారు అదృష్టవంతులు'' మనస్ఫూర్తిగా అన్నాను ఆయనతో.

''కాదయ్యా.. నీలాంటి అల్లుడు వుండడం ఆయన అదృష్టం. నీవు ఆయనమీద కోపంతో రగిలిపోతుంటావనుకున్నాను. కాని ఎంతో నింపాదిగా ఆలోచించగల మంచి మనసు నీది. భావన సౌందర్యం నిన్ను మురిపించిందని అపోహపడ్డాను. కాని ఇప్పుడర్థమయింది ఆమె స్థితి. నిన్ను ఆమె మనిషివి కావాలనుకొనేట్లు చేసింది'' అన్నాడరాయన.

''అప్పుడు ఇప్పుడు కూడా మీరు పొరపడ్డారు మాష్టారు. ఆమె స్థితికి జాలిపడి నేను ఆమెను అందుకోలేదు.. నా హృదయంలో చోటుచేసుకుందామె. ఒక్కొక్కసారి నాకనిపిస్తుంది, ఆమె నాకు దక్కాలని రాసిపెట్టి వుండడంవల్లే కళ్యాణం జరిగినరోజే పెళ్లికొడుకు పోయాడని.. అలా కాకపోతే కులగోత్రాలు మామధ్య అడ్డుగా వుండి మదిలో భావాలను మదిలోనే బంధించపడేవి. మనుగడ మరొకరితో ముడిపడిపోయేది.

-ఇంకావుంది

అధ్యాత్మ రామాయణం



యుద్ధకాండ 214

- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

రాముడు పురవీధుల్లో వస్తున్నాడన్న వార్త అయోధ్యానగర గృహిణులకు తెలిసింది. వారు ఎక్కడి ఇంటి పనులు అక్కడనే వదలిపెట్టి సంతోషంతో ముఖాలు విప్పారగా, తమను తామలంకరించుకొని మేడలపైకి ఎక్కి చూస్తున్నారు.

'సర్వదృక్' అనే పేరు శ్రీహరికున్నది. రాముని రూపంలో ఆ హరే ఉన్నాడని భావించి, ఆ రమణీయాకృతిని దర్శించి ముఖాల చిరునవ్వుల వెన్నెలలు చిమ్మగా, స్త్రీలందరు అతనిపై పుష్పాలు కుమ్మరించారు. వారి కన్నులకు రసాయన స్వరూపుడు, మనస్సుకు ఆనంద స్వరూపుడై నిలిచిన ఆ పరబ్రహ్మమూర్తిని మొదట కన్నులతో, తరువాత మనస్సుతో ఆలింగనం చేసికొని ధన్యులమయ్యామని భావించారు.

విష్ణుభగవానుడైన రాముడు తన ప్రజలను చిరునగవుతో, ప్రేమ పూరితమైన చూపులతో, ఆప్యాయంగా పలుకరిస్తూ అపర లోకపాలునిలాగా, నెమ్మది నెమ్మదిగా కదిలాడు. అలా వెళ్లి ఇంద్రుని అంతఃపురంలా అలంకృతమైన తన తండ్రి నివాస గృహానికి చేరుకొన్నాడు. రాజభవనంలోకి వెళ్లిన తర్వాత రాముడు అతి ప్రసన్న చిత్తంతో తన తల్లి కౌసల్య చరణాలకు ప్రణమిల్లాడు. రఘువంశ శిరోమణి అయిన ఆ ప్రభువు కైక తదితర తల్లులకూ నమస్కరించాడు. అప్పుడు సత్య పరాక్రముడైన రాముడు భరతునితో ఇలా అన్నాడు.

సర్వసంపదలతో ఉన్న నా ఉత్తమ మందిరాన్ని నా మిత్రుడు సుగ్రీవునకు వసతిగా ఏర్పాటుచెయ్. మిగిలినవారందరికి సుఖనివాసాలను ఏర్పాటుచెయ్. అందరికి సరిగా వసతి సౌకర్యాలు కల్పించి భవనాలను కేటాయించు.

రాముని మాటల ప్రకారంగా భరతుడు ఏర్పాట్లన్నీ పూర్తిచేశాడు. ఆ తర్వాత తేజస్వంతుడైన భరతుడు సుగ్రీవునితో ఇలా అన్నాడు.

శ్రీరాముని అభిషేకానికి నాల్గు సముద్రాల నుండి మంగళ తీర్థాలు తేవాలి. అందుకని శీఘ్రంగా వెళ్లి వచ్చే దూతలను పంపించాలి.

భరతుని మాటలకు స్పందించి వెంటనే సుగ్రీవుడు అందుకొరకు జాంబవంతుణ్ణి, హనుమంతుణ్ణి, అంగదుణ్ణి, సుషేనుణ్ణి నియోగించాడు. వారు వాయువేగంతో వెళ్లి బంగారు కలశాలలో సముద్ర ఉదకం తీసుకొని వచ్చారు. ఆ తీర్థాన్ని తీసుకొని శత్రుఘ్నుడు మంత్రులతో కలిసి వెళ్లి వశిష్ఠునికి అప్పగించాడు.

వృద్ధుడూ కులగురువు అయిన వశిష్ఠుడు సమాహితుడై వేద బ్రాహ్మణులను పిలిపించి రత్నమయ పీఠంపై సీతారాములను కూర్చోపెట్టాడు. వశిష్ఠ. వామదేవ, జాబాలి, గౌతమ, వాల్మీకాదులు అతి ప్రసన్నులై, కుశ తులసీ సహిత గంధయుక్త పవిత్ర జలంతో రామునికి అభిషేకం చేశారు. ఋత్విక్కులు, బ్రాహ్మణ శ్రేష్ఠులు, కన్యలు, మంత్రులతో కలిసి, వసువులు ఇంద్రునికి సర్వఔషధీరసాలతో అభిషేకం చేసిన విధంగా రఘుశ్రేష్ఠునికి అభిషేకం చేశారు.

ఆ సమయంలో మహర్షులు, ఆకాశంలోని దేవతలు, తమ తమ గణాలతో ఉన్న నలుగురు లోకపాలురు స్తుతిస్తుండగా శ్రీరాముణ్ణి అభిషేకించారు.

శత్రుఘ్నుడు శుభంకరమైన స్వచ్ఛ ఛత్రాన్ని చేత ధరించాడు. విభీషణ సుగ్రీవులిద్దరు చామరాలు పట్టారు. ఇంద్రుడు పంపించగా తెచ్చిన వాయుదేవుడు కాంచనమాలని చ్చాడు. స్వయంగా ఇంద్రుడు కూడా వచ్చి సర్వరత్నాలు కూర్చినది, మణులతో బంగారంతో ప్రకాశించేది అయిన ఆభరణాన్ని భక్తితో రామునికి సమర్పించాడు.

దేవ గంధర్వులు పాటలు పాడారు. అప్సరసలు నృత్యం చేశారు.

- ఇంకావుంది

మంగళవారం 30 డిసెంబర్, 2014

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ జయ, దక్షిణాయనం
హేమంత ఋతువు - పుష్యమాసం

తిథి: శుద్ధ నవమి మ.12.43
నక్షత్రం: రేవతి ఉ.9.04
వర్జ్యం: రా.4.14 నుండి 5.46 వరకు
దుర్ముహూర్తం: ఉ.08.24 నుండి 09.12 వరకు
తిరిగి రా.10.48 నుండి 11.36 వరకు

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
  ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. కలహాలకు అవకాశముంటుంది. ఋణప్రయత్నం చేస్తారు.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
  ధనలాభముంటుంది. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. శుభవార్తలు వింటారు. ఆనందంగా కాలక్షేపం చేస్తారు.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
  నూతనకార్యాలకు శ్రీకారంచుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా వుంటుంది. బంధు, మిత్రులతో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తారు.ధనలాభముంటుంది. గొప్ప వ్యక్తిని కలుస్తారు.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)**
  ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలు ఖరీదు చేస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. అన్ని రంగాల్లో అద్భుత విజయాలను సాధిస్తారు. నూతన కార్యాలను ప్రారంభిస్తారు. ఋణవిముక్తి లభిస్తుంది.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
  ఋణప్రయత్నాలు తొందరగా ఫలిస్తాయి. స్థాన చలన సూచనలుంటాయి. శుభకార్యాల మూలకంగా ధనవ్యయం అధికమవుతుంది. ప్రయాణాలెక్కువ చేస్తారు.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
  నూతన కార్యాలకు ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. వృత్తి, వ్యాపార రంగాల్లో ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించాలి. ఆత్మీయుల సహాయ, సహకారాలకై వేచి వుంటారు. దైవదర్శనం లభిస్తుంది.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
  బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. ధననష్టమేర్పడే అవకాశముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అధికారులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
  నూతన వస్తు, వస్త్ర, వాహన, ఆభరణ లాభాలను పొందుతారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
  వ్యవసాయ రంగంలోనివారికి లాభదాయకంగా ఉంటుంది. చెడును కోరేవారికి దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక భయము, ఆందోళన ఆవహిస్తాయి.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
  ప్రయత్న కార్యాలందు దిగ్విజయాన్ని పొందుతారు. ధనలాభముంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
  మానసికాందోళనతో ఉంటారు. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశముంది. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ఆటంకాలెదురవుతాయి. ఆరోగ్యం గూర్చి ప్రత్యేక శ్రద్ధ అవసరం.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
  శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభంలో ఆనందంగా ఉంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు. కీర్తి, ప్రతిష్ఠలు అధికమవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

సత్యభామ 56

బొమ్మలు: శ్రీరామ్

నిర్వహణ: సుధామ 596 మాటాట



ఆధారాలు

ఆధారాలు: 85
అడ్డం
1. ట్రైం
2. రజకుడు
5. పిల్లలపై తల్లితండ్రులకు ఉండేది
6. సమయం
8. కంటకం
9. ఆటాకులపై రాసేందుకు వాడే ది
10. కాలి అందె

నిలువు
1. బలం
2. టుమారో
3. తలక్రిందయిన శంకరుల జన్మస్థలం
4. ఏడు
7. బంధం , వీడనిలంకె
8. పరిసమాప్తి

మాటాట - 595 సమాధానం

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

మంచిమాట

అసలైన వివేకం

మనోవాక్కాయ కర్మల్లో దేనిని తీసుకున్నా దాన్ని సంకల్పించినప్పుడు, చేస్తున్నప్పుడు, చేసిన తర్వాత, శాంతిభావం, పవిత్రానుభూతులు ఉంటేనే అది సత్కర్మ అవుతుంది. ప్రసన్న చిత్తంతో దేన్ని పలికినా, ఏ పని చేసినా కర్తను ఆనందం నీడలా వెన్నాడుతుందని బుద్ధభగవానుడంటాడు. బౌద్ధంలో కర్మసిద్ధాంతం చాలా కీలకమైనది. ఎవరికివారే తమ మనసులను మలినపర్చుకుంటూ ఉంటారు కాబట్టి దాన్ని శుభ్రం చేసుకోవడం వారే స్వయంగా చూసుకోవాలని భగవానుడు అంటారు. పూజ అయినా, ధ్యానమైనా, ఆలయ గమనమైనా శీలం, సదాచారం, వాటిని చేయాలనుకున్నపుడు, చేస్తున్నప్పుడు, చేశాక మనసెలా ఉంది అనేదాన్ని బట్టే తమ ఫలితాలని స్తాయి. ముఖ్యంగా కార్యం నెరవేరాక మనోవాక్కాయ కర్మలందు ఎంతసేపు, ఎంత శుద్ధ స్పృహతో ఎంత శాంతితో ఉన్నారు అనేదాన్ని బట్టి మీరెంత పుణ్యాన్ని పొందారనేది నిర్ధారించుకోవాలి. ఇంద్రియ కార్యాలపట్ల కూడా ఈ విధమైన స్పృహను పెంచుకుంటే ఒక దృశ్యం, ఒక శబ్దం, ఒక గ్రంథం, ఒక రుచి, ఒక స్పర్శ, ఒక ఆలోచన, అన్నీ ఆధ్యాత్మికాలైపోతాయి. వైరభావంతో ఉన్న వ్యక్తి ఇతరులకు చేసే హాని కన్నా తనకు తానే ఎక్కువ హాని చేసుకుంటాడు. వైరభావం కలిగినప్పుడు ప్రతీకారానికి సంబంధించిన ఆలోచనలు పేట్రేగిపోవటంవల్ల శరీరం చాలా మార్పులకు లోనవుతుంది. రక్తపోటులాంటివి పెరగటం జిగురు పదార్థాలు, స్రావాలు తగ్గటం, జీర్ణవ్యవస్థ పనితీరు నెమ్మదించటం జరుగుతాయి. దీర్ఘకాలంలో వైరభావం బాగా ఉండి వ్యక్తులకు గుండెజబ్బులు, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు పొడిబారటంవల్ల దుష్ఫలితాలు తలెత్తవచ్చు. తమ పట్ల తమకు స్పృహ ఉన్నవారు ఒక ఆలోచన తమను ఎలా బాధిస్తున్నదీ చూసుకోవాలి. భవిష్యత్‌లో అలాంటి ఆలోచన ఏ అంగంలో రోగాన్ని పట్టించుకోగలదో కూడా గుర్తుంచుకోవాలి. అలాంటి వారు వైరభావాన్ని ఆలోచనల ద్వారా పెంచుకోరు. అన్ని వ్యాధులకు మనపై మనం ఎరుకతో ఉండటమే మందు. ఆలోచనల్లోని వ్యక్తులకు, పరిస్థితులకు, సంఘటనలకు ప్రాధాన్యతను ఇవ్వటం అందరికీ అలవాటే. ఆలోచన కంటే ఆలోచనల వలన కలిగే అనుభూతికి అధిక ప్రాధాన్యతనిచ్చినప్పుడు అది ఎరుకతో ఉండటం అవుతుంది. ఇది నిజమైన వివేకాన్ని ఇస్తుంది. అంటే ఆ క్షణంలో పనేమిటో గుర్తించటం, ఏయే ఆలోచనలు, మాటలు, చేతలు, తనను ఎలా ప్రభావితం చేస్తున్నాయో గుర్తించండి. చేస్తూ చేస్తూ ఉండగా 'నేను'కు ఆధారమైన ప్రతి భావం, భావావేశం, వాటివలన కలిగే పథనిర్దేశం అన్నీ మార్పునకు లోనయ్యేవే అని తెలుస్తుంది. ఇదే ముక్తినిస్తుంది. అందుకే అన్నీ తెలుసుకొని మెదలడమే అని కర్మ సిద్ధాంతం చెబుతోంది. జాగరూకతతో ఎరుకతో ఉండటమే అసలైన వివేకం.

-గుండు రమణయ్య గౌడ్

మంచిమాట శీర్షికకు ఆధ్యాత్మిక సంబంధమైన వ్యాసాలను సులభశైలిలో ఎవరైనా సొంతంగా రాసి పంపించవచ్చు. రచనలు పాఠకులకు ఆసక్తికరంగా వుండాలి. మూడు అరతావులకు తగ్గకుండా వుండాలి. ప్రచురించిన రచనలకు పారితోషికం ఉంటుంది.

మస్తిష్కం... జీవన సౌధం!

మీ ఫ్రెండ్‌తో సినిమాకి చెక్కేయాలనుకుంటున్నారా? సెల్ లో గేమ్ ఆడాలనుందా? అర్జెంటుగా డాడీకి ఫోన్ చేసి ముఖ్యమైన ఇన్‌ఫర్మేషన్ ఇవ్వాలా? చేయొచ్చు. మీరనుకున్న పని ఏదైనా చేయొచ్చు. అందుకు మీ శరీరంలో ముందుగా స్పందించే అవయవమేంటో తెలుసా...బ్రెయిన్. సంకల్పిత, అసంకల్పిత చర్యలేవైనా ముందుగా బ్రెయిన్ స్పందించాలి. మిగతా బాడీ పార్ట్స్‌కు ఆదేశాలివ్వాలి. నల్లేరుపై నడకైనా... కంప్యూటర్ కోడింగ్‌ను ఓ పట్టుపట్టాలన్నా, మోటార్ బైక్ రేసులో పాల్గొని కప్ కొట్టేయాలన్నా...పనేదైనా అందులో రాణించాలంటే మెదడు షార్ప్‌గా ఉండాలి. లేకపోతే చదువులోనే కాదు...ఎందులోనూ రాణించలేం. మరి బ్రెయిన్ ఎలా పనిచేస్తుందీ అంటే...అబ్బో అది చాలా పెద్ద విషయం. నాడీ వ్యవస్థ మొత్తం బ్రెయిన్ చెప్పినట్టే నడుస్తుంది. మెదడులోని అతి పెద్ద భాగం - సెరిబ్రెల్ కార్టెక్స్‌లో 15-33 బిలియన్ల న్యూరాన్లు ఉంటాయి. సమాచారాన్ని శరీరంలోని ఇతర భాగాలకు చేరవేయడంలో కీలకమైన పాత్ర పోషించేవి ఇవే. న్యూరాన్లు యాక్టివ్‌గా ఉంటే మీ బ్రెయిన్ యాక్టివ్‌గా ఉన్నట్టే. మనం జిమ్‌కు వెళ్లి ఎక్సర్‌సైజులు చేసి శరీరాన్ని దృఢంగా ఉంచుకున్నట్టే బ్రెయిన్‌ను చురుగ్గా ఉంచుకునేందుకూ కొన్ని ఎక్సర్‌సైజులున్నాయి. అవేంటో తెలుసుకోవాలనుందా?

1.కొత్తవి నేర్చుకోండి: కొత్త విషయాలేవైనా నేర్చుకుంటుంటే...బ్రెయిన్ ఎప్పుడూ చురుగ్గా పనిచేస్తుందట. సరికొత్త న్యూరాన్లు జీవం పోసుకుంటాయట. ఎన్ని కొత్త న్యూరాన్లు ప్రాణం పోసుకుంటే బ్రెయిన్ అంత చురుగ్గా పనిచేస్తుంది. ఓ కొత్త భాషేదైనా నేర్చుకోండి లేదా కొత్త రకం డాన్స్ ప్రాక్టీస్ చేయండి. మీకు తెలియకుండానే మీ బ్రెయిన్ మరింత చురుగ్గా పనిచేయడం మొదలెడుతుంది.

2. వీడియో గేమ్స్ ఆడండి: వీడియో గేమ్స్ ఆడుతుంటే అమ్మా నాన్నా కోప్పడతారు కానీ ఇవి మెదడుకు మేత పెడతాయని అనేక పరిశోధనల్లో తేలింది. వీడియో గేమ్స్ మన మెదడులోని మోటార్ న్యూరాన్ యాక్టివిటీని ఉత్తేజితం చేస్తాయట. చిన్నప్పుడు వీడియో గేమ్స్ అడిన పిల్లలు పెరిగి పెద్దయినా కూడా వారి మెదడు చురుగ్గా పనిచేస్తున్నట్టు పరిశోధనల్లో వెల్లడైంది. ముఖ్యంగా మెదడులోని లెఫ్ట్ వెంట్రియాల్ స్ట్రియాటమ్‌లో చురుకుదనం పెరుగుతుందట. మనిషి మెదడులో భావోద్వేగాలను ప్రేరేపించే కీలకమైన భాగమిది.

3. న్యూరోబిక్స్: మీరు కుడిచేతి వాటం గలవారనుకోండి. ఎడమ చేతితో పనులు చేయడం, రాయడం వంటివి చేయండి. దీనివల్ల మెదడుకు మేత పెట్టినవారవుతారు. ఇలాంటి పనులు చేయడంవల్ల మెదడులో స్తబ్దుగా ఉన్న కణాలకు ప్రేరణ లభిస్తుంది. చురుగ్గా పనిచేయడం మొదలెడతాయి. అందుకని...వెనక్కు నడవడం, పక్కలకు నడవడం, కళ్లుమూసుకుని నడవడం వంటి 'న్యూరోబిక్స్' చేయండి. తేడా గమనించండి.

4. యాప్స్‌తో చురుకుదనం: ఇది స్మార్ట్ ఫోన్ల యుగం. ఏ పని చేయాలన్నా ఓ యాప్ రెడీగా ఉంటుంది. డౌన్‌లోడ్ చేసుకోవడమే తరువాయి. మరి బ్రెయిన్‌ను చురుగ్గా ఉంచుకోవడానికి యాప్స్ లేవా అంటే..ఉన్నాయి. brain trainer special, lumosity, brain fitness pro, fit brain trainer అలాంటివే. ఇలాంటి గేమ్స్ ఆడటంవల్ల మెదడులోని న్యూరాన్లు ఉత్తేజితం అవుతాయి.

5. కొత్త వ్యక్తులతో సంభాషణ: కొత్త వ్యక్తులతో మాట్లాడటమనేది ఓ కళ. మన అభిప్రాయాలను సరైన రీతిలో నిస్సంకోచంగా, నిర్మొహమాటంగా వెల్లడించడం, ఎదుటివారు చెప్పే విలువైన విషయాలను మెదడులో నిక్షిప్తం చేసుకోవడం, వారు అడిగే ప్రశ్నలకు దీటుగా స్పందించడం...ఇలాంటివి బ్రెయిన్‌కు పదును పెడతాయి. ఎదుటివ్యక్తులతో సంభాషణ మన ప్రవర్తనా శైలిని, మానసిక అవగాహన స్థాయినీ పెంచుతుంది. ఇలాంటి సంభాషణలు ముఖాముఖీయే కానక్కర్లేదు.. టెలిఫోన్‌లో మాట్లాడటం, సామాజిక వెబ్‌సైట్లలో స్పందించడం వంటివి కూడా మెదడుకు మేతపెట్టేవేనంటారు పరిశోధకులు.

6. సన్నిహితులతో గడపడం: 'మీకు ఇష్టమైన వ్యక్తులతో రోజులో కాసేపైనా గడపండి'- అనేకమంది సైకాలజిస్టులు ఇచ్చే సలహా ఇది. దీనివల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది. సన్నిహితులంటే క్లోజ్ ఫ్రెండ్స్ కావచ్చు, బంధువులు కావచ్చు. ఎవరైనా మనసుకు దగ్గరైనవారితో కాసేపైనా గడిపితే భావోద్వేగాలు అదుపులో ఉంటాయి. దాని వల్ల మెదడుపైనా ఒత్తిడి తగ్గుతుంది.

7. వ్యాయామం: శారీరక వ్యాయామం కేవలం దేహ దారుఢ్యానికే కాదు... మెదడునూ ఆరోగ్యవంతంగా, చురుగ్గా ఉంచుతుందట. న్యూరోఫార్మకాలజీలో ప్రచురితమైన ఓ పరిశోధనవ్యాసం ప్రకారం జాగింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్ వంటి ఏరోబిక్స్‌వల్ల మెదడులోని హిప్పోకామస్ భాగంలో కొత్త న్యూరాన్లు పుట్టుకొస్తాయట. జ్ఞాపకశక్తి, సమాచార నిక్షిప్తం వంటి అంశాలను డీల్ చేసేది ఈ హిప్పోకామస్ విభాగమే.

8. ధ్యానం: ఒత్తిడి, కుంగుబాటు, ఉద్రేకాలను అరికట్టే దివ్యౌషధం ధ్యానం అనే విషయం అందరికీ తెలిసిందే. తరచు ధ్యానం చేసేవారిలో న్యూరాన్లు ఉత్తేజమవుతున్నట్లు, వాటిద్వారా సమాచార పంపిణీ చురుగ్గా జరుగుతున్నట్లు అనేక పరిశోధనల్లో తేలిన నిజం.

10. మెదడుకు మేత: శరీరంలోని ఇతర భాగాల మాదిరిగానే మెదడుకు కూడా మనం తీసుకునే ఆహారమే మూలం. కాబట్టి తినేటప్పుడు బ్రెయిన్‌నూ దృష్టిలో ఉంచుకుని తినాలి. తాజా కాయగూరలూ, పండ్లూ తింటే వాటిలో ఉంటే యాంటీఆక్సిడెంట్లూ, ఒమేగా ఫాటీ ఆసిడ్ల వల్ల మెదడులో చురుకుదనం పెరుగుతుంది. న్యూరాన్లు త్వరితగతిన పాడవకుండా ఇవి కాపాడతాయి.

-సంజీవ్



సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు వచ్చేస్తున్నాయ్

మీరు ప్రయాణిస్తున్న కారుకు స్టీరింగ్ ఉండదు. డ్రైవర్ అసలే ఉండడు. బ్రేక్ పెడల్స్ ఉండనే ఉండవు. అయినా మీరు హాయిగా వెనక సీట్లో కూచుంటే దానంతట అదే ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకువెడుతుంది. ఇదంతా కల అనుకుంటున్నారా? కాదండీ బాబూ! అక్షరాలా నిజం. ఇలాంటి సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు త్వరలోనే మార్కెట్లోకి రాబోతున్నాయి. ఆమాటకొస్తే కాలిఫోర్నియాలో టెస్ట్ డ్రైవింగ్‌లో భాగంగా ఇలాంటి కార్లు బిజిబిజీగా రోడ్లపై తిరిగేస్తున్నాయి కూడా. ప్రఖ్యాత సెర్చ్ ఇంజన్ గూగుల్ కూడా ఇలాంటి డ్రైవర్ లెస్ కారును తీసుకొస్తోంది.

నిజానికి గూగుల్ డ్రైవర్‌లెస్ కారు ఇప్పటికే మార్కెట్లోకి రావాల్సింది. అయితే ఇటీవలే కాలిఫోర్నియా ప్రభుత్వం ఓ నిబంధన తీసుకొచ్చింది. ఏంటంటే...సెల్ఫ్ డ్రైవింగ్ కార్లకూ మాన్యువల్‌గా నడిపే సౌకర్యాలు ఉండాలని. అంటే స్టీరింగ్, బ్రేక్ పెడల్స్ వంటివన్నమాట. టెక్నికల్ ఫెయిల్యూర్‌వల్ల కారాగిపోతే డ్రైవరొచ్చి తీసుకువెళ్లే వెసులుబాటు ఉండాలన్నది ఈ నిబంధన అంతరార్థం. ఇప్పటికే సెల్ఫ్ డ్రైవింగ్ కారుకు తుదిరూపమిచ్చిన గూగుల్...మళ్లీ మాన్యువల్‌గా నడిపేందుకు కావలసిన సౌకర్యాలను సమకూరుస్తోంది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే 2015 చివరినాటికి సెల్ఫ్ డ్రైవింగ్ కారును మార్కెట్లోకి తీసుకురావాలన్నది గూగుల్ ఆలోచన.

వాట్సాప్‌లో వాయిస్ కాలింగ్!

ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అందించే సౌకర్యాలతో మన దైనందిన జీవితం పెనవేసుకుపోయింది. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్ లేకుండా జన జీవితాన్ని ఊహించుకోలేం. ఈ మధ్యకాలంలో స్మార్ట్‌ఫోన్‌లో వచ్చిన వాట్సాప్ సౌకర్యమూ అంతే. మెస్సేజ్‌లు, ఫోటోలు, వీడియోలు, ఆడియో నోట్స్ షేరింగ్‌కు వాట్సాప్ సరైన వేదిక. స్మార్ట్‌ఫోన్ ఉంటే వాట్సాప్ ఉన్నట్టే. ఇప్పుడు వాట్సాప్‌కు మరో సౌకర్యం తోడవుతోంది. అదే- వాయిస్ కాలింగ్. స్కైప్, వైబర్, లైన్, ఫేస్‌టైమ్, హాంగవుట్స్ వంటివాటిలోనే ప్రస్తుతం వీడియో కాలింగ్ సదుపాయం ఉంది. ఇది వాట్సాప్‌లో కూడా మొదలైతే ఇక చెప్పేదేముంది? అయితే దీన్ని వాట్సాప్ యాజమాన్యం ఇంకా ధ్రువీకరించడం లేదు.

ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్ లేకుండా జన జీవితాన్ని ఊహించుకోలేం. ఈ మధ్యకాలంలో స్మార్ట్‌ఫోన్‌లో వచ్చిన వాట్సాప్ సౌకర్యమూ అంతే. మెస్సేజ్‌లు, ఫోటోలు, వీడియోలు, ఆడియో నోట్స్ షేరింగ్‌కు వాట్సాప్ సరైన వేదిక. స్మార్ట్‌ఫోన్ ఉంటే వాట్సాప్ ఉన్నట్టే.

వీటికేది సాటి?

ఇది టెక్నాలజీ యుగం. రోజురోజుకూ ఎన్నో కొత్త గాడ్జెట్స్ మార్కెట్లోకి వస్తున్నాయి. పోతున్నాయి. వీటిలో నిలబడినవెన్ని? మార్కెట్లో సంచలనం సృష్టిస్తున్నవేవి? అలా చూస్తే... 2014లో మార్కెట్‌ను ఓ ఊపు ఊపిన గాడ్జెట్స్ ఉన్నాయి. అవేమిటో చూద్దామా?

యాపిల్ ఐఫోన్ 6, ఐఫోన్ 6ప్లస్

యాపిల్ ఐఫోన్ 6, ఐఫోన్ 6ప్లస్

2014లో స్మార్ట్‌ఫోన్‌కు యాపిల్ కొత్త వన్నెలు అద్దింది. కొత్త సొబగులు తీర్చి దిద్దింది. ఐ ఫోన్ 6, ఐ ఫోన్ 6 ప్లస్‌లను రంగంలోకి దించి స్మార్ట్‌ఫోన్ల మార్కెట్‌లో తనకు సాటిలేదనిపించుకుంది. 5.5 అంగుళాల స్క్రీన్‌తో, 8 ఎంపి ఐ సైట్ కెమెరాతో ఐ ఫోన్ ప్రపంచ మార్కెట్‌లో సంచలనాలకు కేంద్రబిందువైంది. 2014లో లాంచ్ అయిన ఈ రెండు ఉత్పత్తులూ మార్కెట్‌లోకి వచ్చిన మూడు రోజుల్లోనే లక్షకు పైగా అమ్ముడుపోయి రికార్డు సృష్టించాయి.

అమెజాన్ కైండిల్ సెవెన్త్ జనరేషన్

ఇ-రీడింగ్ అలవాటుగా మార్చుకున్న యూత్‌ను దృష్టిలో ఉంచుకుని రూపు దిద్దుకున్న కైండిల్ సెవెన్త్ జనరేషన్‌తో చదవడం ఎంతో హాయి. ఫిఫ్త్ జనరేషన్‌తో పోలిస్తే రెండు రెట్లు ఎక్కువ మెమొరీ (4జిబి)తో వేలాది పుస్తకాలను నిక్షిప్తం చేసుకునే వెసులుబాటు దీని సొంతం. ఎక్స్-రే, గుడ్ రీడ్స్, బిల్ట్ ఇన్ డిక్షనరీ, హైలైటింగ్ వంటి ఆప్షన్లతోపాటు టచ్‌స్క్రీన్ ఇంటర్‌ఫేస్... కైండిల్ ప్రత్యేకత. ఇంగ్లీష్, స్పానిష్, బ్రెజిలియన్ పోర్చుగీస్, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, జపనీస్ భాషల వారు కైండిల్‌ను వాడొచ్చు. కైండిల్ సెవెన్త్ జనరేషన్ ధర- రూ. 6000

గూగుల్ క్రోమ్‌కాస్ట్

గూగుల్ క్రోమ్‌కాస్ట్

బొటన వేలు సైజులో ఉండే ఈ చిన్న పరికరం సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. మీ టీవికి ఉన్న హెచ్‌డిఎంఐ పోర్ట్‌కు దీన్ని తగిలిస్తే చాలు ఇది చిత్ర విచిత్రాలు చేస్తుంది. ఆండ్రాయిడ్ ఫోన్, టాబ్లెట్, ఐ ఫోన్, విండోస్ లాప్‌టాప్, క్రోమ్‌బుక్‌లాంటి అన్నింటినీ క్రోమ్‌కాస్ట్‌తో వాడుకోవచ్చు. ఇక యాప్స్ వినియోగానికి అంతే లేదు. దీని ధర రూ. 2,999

శామ్‌సంగ్ గేలక్సీ నోట్ 4

శామ్‌సంగ్ గేలక్సీ నోట్ 4

యాపిల్ ఐ ఫోన్‌కు దీటుగా శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ తీసుకువచ్చిన గేలక్సీ నోట్ 4కూడా ఈ సంవత్సరంలో యువతకు క్రేజీ గాడ్జెట్‌గా మారింది. కట్టిపడేసే డిజైన్ దీని సొంతం. ఐ ఫోన్ ఫీచర్లతోపాటు 16 మెగా పిక్సెల్ కెమెరా గేలక్సీ నోట్ 4 ప్రత్యేకత. దీని ధర రూ. 58,300

యాపిల్ ఐ పాడ్ ఎయిర్ 2

ఐ పాడ్‌లలో ఎయిర్ 2 విలక్షణమైనదనే చెప్పాలి. 6.1 మిల్లీమీటర్ల మందం, 437 గ్రాముల బరువుతో ఇది ఐ పాడ్‌లలోనే సున్నితమైనదిగా పేరు తెచ్చుకుంది. టచ్ ఐడి, ఎ8ఎక్స్ చిప్, యాపిల్ సిమ్‌వంటి ప్రత్యేకతలతో ఎయిర్ 2 మార్కెట్‌లో ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఎయిర్ 2 యాప్ స్టోర్‌లో వేలాది యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

మోటొరోలా మోటో 360

బడ్జెట్ ఫ్రెండ్లీ గాడ్జెట్స్‌తో యువత మనసు దోచుకున్న మోటొరోలా... 2014లో విలక్షణమైన మోటో 360 వాచ్‌తో మార్కెట్‌ను కొల్లగొట్టింది. శామ్‌సంగ్, ఎల్‌జి స్మార్ట్‌వాచ్‌ల మాదిరి దీర్ఘ చతురస్రాకారంలో కాకుండా రౌండ్ షేప్‌లో ఉండే మోటో 360లో ఎన్నో ఫీచర్లున్నాయి. 1.56 అంగుళాల ఎల్‌సిడి డిస్‌ప్లే సౌకర్యం ఉన్న ఈ వాచ్ కవర్‌ను కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 3తో రూపొందించారు. 4 జిబి బిల్ట్ ఇన్ మెమొరీ, పీడోమీటర్, హార్ట్ రేట్ మానిటర్ వంటి సౌకర్యాలూ ఉన్నాయి. ఇది వాటర్ రెసిస్టెంట్ కూడా. ధర రూ. 15 వేలు



2014లో వచ్చిన మరో సంచలనం- సోని ప్లే స్టేషన్ 4. 500 జిబి మెమొరీ హార్డ్ డ్రైవ్, డ్యూయల్ షాక్ 4 కంట్రోలర్స్, హెచ్‌డిఎంఐ కేబుల్, వైర్డ్ మోనో హెడ్‌సెట్, యుఎస్‌బి చార్జబుల్ కేబుల్‌తో సోనీ ప్లే స్టేషన్ 4 వెర్షన్ మార్కెట్లో సంచలనాలకు తెరతీసింది.

బోస్ సౌండ్‌లింక్ కలర్

ముద్దొచ్చే చిన్న సైజులో ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకువెళ్లే వీలున్న ఈ బోస్ సౌండ్‌లింక్ కలర్‌తో మీకు నచ్చిన బ్లూటూత్ డివైజ్‌నుంచి మరింత స్పష్టంగా, మరింత ఎక్కువ సౌండ్‌తో పాటలు వినొచ్చు. రకరకాల రంగుల్లో దొరుకుతుంది కూడా. బ్లూటూత్ సౌకర్యం ఉన్న స్మార్ట్‌ఫోన్, టాబ్లెట్ వంటి దేనికైనా దీనిని ఇట్టే కనెక్ట్ (వైర్‌లెస్) చేసుకోవచ్చు. ధర రూ. 11,138

సోనీ ప్లే స్టేషన్ 4

2014లో వచ్చిన మరో సంచలనం- సోని ప్లే స్టేషన్ 4. 500 జిబి మెమొరీ హార్డ్ డ్రైవ్, డ్యూయల్ షాక్ 4 కంట్రోలర్స్, హెచ్‌డిఎంఐ కేబుల్, వైర్డ్ మోనో హెడ్‌సెట్, యుఎస్‌బి చార్జబుల్ కేబుల్‌తో సోనీ ప్లే స్టేషన్ 4 వెర్షన్ మార్కెట్లో సంచలనాలకు తెరతీసింది. ★

జ్ఞాపకాలో, అనుభవాలో, అల్లరో, ఆనందమో.. ఏ అంశంమీదనైనా పాఠకులతో మీ ఫీలింగ్స్ పంచుకోవాలని అనిపిస్తే -ఈ పేజీకి రాసి పంపించండి.

బావుంటే తప్పక ప్రచురిస్తాం.
రచనలు పంపాల్సిన చిరునామా..
ఎడిటర్,
ఆంధ్రభూమి దిన పత్రిక
36, సరోజినీ దేవి రోడ్
సికింద్రాబాద్-500003

యాపిల్ ఐ పాడ్ ఎయిర్ 2

మోటొరోలా మోటో 360

బోస్ సౌండ్‌లింక్ కలర్

bhoomika@andhrabhoomi.net

భూమిక

ఆంధ్రభూమి బుధవారం 31, డిసెంబర్ 2014

ఐడియా

వారంలో కనీసం రెండు రోజులైనా స్నానానికి ముందు బాడీ మసాజ్ చేసుకోవాలి. స్నానం చేశాక తేలికైన మాయిశ్చరైజర్ రాసుకుంటే రోజంతా శరీరం హాయిగా ఉంటుంది. చర్మం మృదుత్వంతో మంచి నిగారింపును సంతరించుకోవాలంటే తరచూ క్యారెట్, ఆపిల్, కమలాలు, దానిమ్మపళ్ల రసాలు సేవించాలి. శరీరం నాజూగ్గా ఉండాలంటే వీలైనంత వరకూ నూనె వంటకాలు, జంక్‌ఫుడ్, కూల్‌డ్రింక్స్, స్వీట్స్‌కు దూరంగా వుండాలి. సలాడ్లు, మొలకెత్తిన చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలి. రొటీన్‌కు భిన్నంగా అప్పుడప్పుడూ జుట్టుకు తేలిక రంగులు వేసుకుని విభిన్నంగా కనిపించాలి. దీనివల్ల న్యూలుక్ కలుగుతుంది. రాత్రి పడుకునే ముందు కళ్లకింద జెల్ రాసుకోవాలి. దీనివల్ల కళ్లకింద నల్లని వలయాలు అంతరించిపోతాయి. వారంలో ఒకసారైనా ఇంట్లో తయారుచేసుకున్న ఫేస్ మాస్క్ వేసుకోవాలి. దీనికోసం ముల్తానీ మట్టి వాడాలి. అప్పుడప్పుడూ హెయిర్ స్టయిల్ కూడా మారుస్తుండాలి. ఇక, దంతాలు ఆరోగ్యవంతంగా నిగనిగలాడాలంటే సొంతంగా పళ్లపొడి తయారుచేసి వాడుకోవచ్చు. పళ్లపొడిని తయారు చేసేందుకు 2 చెంచాలు మెత్తటి ఉప్పు, 1 చెంచా చొప్పున నిమ్మరసం, లవంగాల పొడి తీసుకోవాలి. ఉప్పు, లవంగాల పొడిలో నిమ్మరం చేర్చాలి. ఈ మిశ్రమాన్ని వాడితే దంతాలు మిలమిల మెరుస్తూ వుంటాయి.

-సుబ్బలక్ష్మి



బుల్‌ఫైట్‌లో కార్లా

ప్రాణాంతకమైనా.. పోరుకు రెడీ!

బాక్సింగ్, కరాటే, కుంగ్ ఫూ వంటి యుద్ధవిద్యల్లోనే కాదు, అత్యంత ప్రమాదకరమైన 'బుల్‌ఫైట్' (దున్నపోతులతో పోరాటం)లోనూ పురుషులకు తామేమీ తీసిపోలేదని మెక్సికన్ యువతులు నిరూపిస్తున్నారు. స్పెయిన్ దేశంలో జనం ఎగబడి చూసే 'బుల్ ఫైట్'లో ఆది నుంచి పురుషులదే ఆధిపత్యం. ఈ క్రీడలో మహిళలు పాల్గొనడంపై చాలాకాలం నిషేధం అమలులో ఉంది. అయితే, ఆ నిషేధాన్ని ఇటీవల ఎత్తివేయడంతో ఎంతోమంది యువతులు 'బుల్‌ఫైట్'కు 'సై' అంటున్నారు. తాజాగా మెక్సికో నగరంలో జరిగిన ఈ క్రీడలో 25 ఏళ్ల కార్లా ఏంజెల్స్ ఒళ్లంతా గాయపడినా వీరోచితంగా పోరాడి ఓ భీకరమైన దున్నపోతును అవలీలగా నిరోధించింది. అమాంతం ఎత్తిపడేసి, కొమ్ములతో కుమ్మేసేందుకు ఆ దున్నపోతు రెండు సార్లు ప్రయత్నించగా ఆమె క్షేమంగా బయటపడింది. రక్తం ఓడుతున్నా సాహసోపేతంగా పోరాడిన ఆమెను అందరూ ప్రశంసలతో ముంచెత్తారు. ఈ పోరాటంలో తన సహాయకులిద్దరూ గాయపడినా సురక్షితంగా బయటపడ్డారని కార్లా 'ఫేస్‌బుక్'లో ఆనందం వ్యక్తం చేసింది. మెక్సికోలో పదిరోజుల పాటు జరిగిన ఈ పోటీలో తొలిసారిగా ముగ్గురు మహిళలు పాల్గొని దున్నపోతులను ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఓ కుమార్తెకు తల్లిగా బాధ్యతలు నిర్వహిస్తూనే కార్లా 'బుల్‌ఫైట్'పై ఆసక్తి పెంచుకుంది. మహిళలు దీన్ని ఒక హాబీగా కాకుండా వృత్తిగా భావించాలంటే మరికొంత కాలం పడుతుందని ఆమె అంటోంది. చాలాదేశాల్లో 'బుల్‌ఫైట్'ను నిషేధించినా స్పెయిన్‌లో ఇపుడు యువతులు సైతం ఇందులో సత్తా చాటేందుకు ఆసక్తి చూపుతున్నారని, సరైన శిక్షకులు లభిస్తే ఈ క్రీడ మరింతగా విస్తరిస్తుందని ఆమె సూచిస్తోంది. ★

కుమార్తెతో కార్లా

శుభ్రత ఉంటే... ఇల్లే కదా స్వర్గసీమ!

దామోదరం ఈమధ్యనే ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొన్నాడు. ఖరీదైన టైల్స్ వేయించాడు. బాగా డబ్బు ఖర్చు చేసి ఇంటీరియర్ డెకరేషన్ అందంగా చేయించాడు. ఖరీదైన సోఫా సెట్లు, టీపాయ్, ఇతర ఫర్నిచర్ వంటివి హాలులో అమర్చినా, వాటిమీద ఎప్పుడూ దుమ్ము నిండి వుంటుంది. గదుల్లో కాఫీ, టీ, మట్టి మరకలు కనపడుతూ వుంటాయి. కప్‌బోర్డ్ అద్దాలపై మరకలు అసహ్యంగా వుంటాయి.

★★★

రాజాబాబు ఇంట్లో బెడ్‌రూమ్ చూస్తే రణరంగంలా దర్శనమిస్తుంది. విప్పేసిన బట్టలు బెడ్‌పై అస్తవ్యస్తంగా పడేసి ఉంటాయి. దుప్పట్లు, దిండ్లు అడ్డదిడ్డంగా పడి వుంటాయి. పిల్లల గది అయితే ఇక చెప్పక్కర్లేదు. చెడు వాసనలు వస్తూ వుంటాయి.

★★★

సునంద వాళ్ళాయన రెండు రోజుల క్రితం స్నానాల గదిలో కాలు జారి ఆస్పత్రి పాలయ్యాడు. వనజా వాళ్ళ వంట గదిలోకి వెళితే చాలు.. మన కాళ్ళు నేలకి అంటుకుంటాయి. గచ్చుపై ఎక్కడ చూసినా జిడ్డు కనిపిస్తుంది. గ్యాస్ స్టౌ నల్లగా గార పట్టి ఉంటుంది. కిచెన్‌లోని సింక్ ఎప్పుడు చూసినా వాడేసిన పాత్రలు, కంచాలతో నిండిపోయి దుర్వాసన కొడుతూ వుంటుంది.

★★★

ఇల్లనేది అందంగా వుండాలనే కోరిక అందరిలోనూ సహజం. దానికి తగ్గట్లుగా ఎంత ఖర్చుకైనా వెనుకాడరు. అద్దె ఎంతయినా మంచి ఇంట్లో ఉండాలనుకుంటారు. ఫర్నిచర్ కోసం ఎంత డబ్బయినా ఖర్చు చేసేందుకు వెనుకాడరు. అయితే, వచ్చిన చిక్కల్లా శుభ్రత విషయంలోనే చాలామంది బద్ధకిస్తారు. డైనింగ్ హాలు, వడక గదులు, వంటిల్లు, బాత్‌రూమ్ వంటివి కళ్లకు ఇంపుగా ఉంటే శారీరక ఆరోగ్యమే కాదు, మానసికంగానూ ఉత్తేజం కలుగుతుంది.

హాలు..

పిల్లలు, పెద్దలు ఎప్పుడూ హాల్లోని సోఫాల్లో కూర్చుని టీవీ ప్రోగ్రాములు చూస్తూ తినుబండారాలన్నీ అక్కడే లాగిస్తూ వుంటారు. అతిథులకు సైతం అల్పాహారాలు అక్కడే ఇస్తుంటారు. టీపాయ్ మీద, ఫ్లోర్‌మీద కాఫీ, టీ మరకలు పడుతూ వుంటాయి. బయటి నుంచి ఇంట్లోకి వచ్చినపుడు మొదట అడుగుపెట్టేది హాల్లోనే కాబట్టి మట్టి మరకలు టైల్సుపై అతుక్కుంటాయి. అలా వదిలేస్తే అవి ఎండిపోయి అసహ్యంగా వుంటాయి. ఆ మరకలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. ఫ్లోర్‌మీది మరకలు లిక్విడ్స్‌తో నీట్‌గా తుడుచుకోవాలి. ఎప్పటికప్పుడు సోఫాల మీద దుమ్ము లేకుండా చూసుకోవాలి.

వంట గది..

మన ఆరోగ్యం వంట గది శుభ్రత మీద ఆధారపడి ఉంటుందనేది నగ్న సత్యం. వంటిల్లు అపరిశుభ్రంగా వుంటే జబ్బులు కొని తెచ్చుకున్నట్లే. స్టౌను, కిచెన్‌లో ఇతర సామాగ్రిని ఎప్పటికప్పుడు క్లీన్‌గా వుంచుకోవాలి. వంట గదిలో నీళ్లు, నూనె కింద పడినపుడు తుడవకపోతే జారి పడిపోయే అవకాశం వుంది. వంట సమయంలో ఘాటైన వాసనలు ఇల్లంతా చుట్టుకోకుండా చక్కటి వెంటిలేషన్ వుండేలా చూసుకోవాలి. వంట సమయంలో ఎగ్జాస్ట్ ఫ్యాన్ ఆన్‌లో వుండేలా చూసుకోవాలి. సింక్‌ను ఎప్పుడూ శుభ్రంగా వుంచుకోవాలి. వాడిన పాత్రలను ఎప్పటికప్పుడు కడిగి సింక్‌ను కూడా శుభ్రంగా ఉంచుకోవాలి.

వడక గది

బెడ్‌రూమ్‌లోకి గాలి, వెలుతురు బాగా వచ్చేటట్లు చూసుకోవాలి. గాలి, వెలుతురు సరిగా ఉంటే చెడు వాసనలు రావు. క్రిములు, కీటకాలు, దోమలు ఇంట్లోకి చొరబడకుండా కిటికీలకు దోమతెరలు వుండే చట్రాలను బిగించుకోవాలి. బెడ్‌మీది దుప్పట్లు, తలగడలు, సోఫామీది కవర్లను ఉదయం వేళ ఎండలో వేసి మళ్లీ సాయంత్రం వాడుకోవాలి. లేకుంటే అవి చెడు వాసనలు కలిగిస్తాయి. నిద్ర లేవగానే బెడ్‌షీట్లు, తలగడలను చక్కగా అమర్చుకోవాలి. చెమ్మ వున్నట్లయితే తెచ్చి ఎండలో ఆరవేసి తిరిగి లోపల పెట్టుకోవాలి. మురికి బట్టలు బెడ్‌మీద పడేయక ఒకచోట విడిగా వుంచుకోవాలి.

బాత్‌రూమ్

పాతకాలపు రోజుల్లో బాత్‌రూమ్‌లు ఇంటికి దూరంగా- గాలి, వెలుతురు బాగా ఉన్నచోట ఉండేవి. ఆధునికత పెరిగి బాత్‌రూమ్‌లు, టాయిలెట్లు బెడ్‌రూమ్‌లకు అటాచ్డ్‌గా ఇంటి అంతర్భాగంలోకి వచ్చేశాయి. ఇరుకు గదిలా వుండే బాత్‌రూమ్‌లోకి గాలి, వెలుతురు సహజంగా వెళ్ళే అవకాశం లేదు. వీటి పట్ల సరైన శ్రద్ధ తీసుకోకపోతే సమస్యలు కొని తెచ్చుకున్నట్లవుతుంది. వీటిని నీట్‌గా వుంచుకోకపోతే అందులోని దుర్గంధం బెడ్‌రూమంతా వ్యాపిస్తుంది. టాయిలెట్‌ను వాడిన ప్రతిసారీ చాలినంత నీటిని ఉపయోగించాలి. ఆ తర్వాత ఏదైనా ఫినాయిల్ లాంటి లిక్విడ్‌ను నీటిలో కలిపి పోయాలి. దీనివల్ల దుర్గంధం పోవటమే కాక, క్రిమి కీటకాదులు చేరే అవకాశం వుండదు. స్నానం చేసిన తర్వాత సబ్బు నురగ, షాంపూ నురగ నేలపై పేరుకుంటుంది. దానిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోకపోతే అది బాగా పేరుకుపోతుంది. మనం కాలు వేయగానే జర్రున జారే అవకాశం వుంది. బాత్‌రూమ్ పాచి పట్టకుండా ఎప్పటికప్పుడు క్లీన్ చేసుకుంటే- జారి పడడం వంటి ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చు.

ఇల్లు చక్కటి ఆరోగ్యాన్ని కూడా ఇచ్చేదిగా వుండాలి. అలా వుండాలంటే అవసరమైన జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలి. సూర్యరశ్మి ఇంట్లోకి వచ్చేలా ఉదయం, సాయంత్రం వేళల్లో తలుపులు బాగా తెరచి వుంచాలి. వారానికి రెండుసార్లయినా ఫ్లోర్ క్లీనింగ్ లోషన్ ఉపయోగించి గదులన్నింటినీ శుభ్రం చేయాలి. ఇందుకోసం యాంటీ బాక్టీరియల్ లోషన్ వాడటం మంచిది. ఉదయం, సాయంత్రం వేళల్లో సువాసనలు వెదజల్లే అగరుబత్తీలను వెలిగించటం ద్వారా ఇంట్లోని చెడు వాసనల నుండి ఉపశమనం పొందవచ్చు. ఇల్లు అందంగా వుంటే చాలదు, చక్కటి ఆరోగ్యాన్ని కూడా ఇచ్చేదిగానూ వుండాలి.

-కైపు ఆదిశేషారెడ్డి

సేద్యంలో స్ఫూర్తిదాత

కష్టపడి పనిచేయడం, కుటుంబానికి అండగా నిలవడంలో మహిళలు ఏ మాత్రం తీసిపోరని ఆమె నిరూపించి అందరి చేత 'శభాష్' అనిపించుకుంది. స్త్రీశక్తిని తక్కువగా అంచనా వేయవద్దని, అవకాశం లభిస్తే తాము కూడా అద్భుతాలను సాధిస్తామని ఆమె చాటిచెబుతోంది. గోరఖ్‌పూర్ (ఉత్తర ప్రదేశ్)కు సమీపంలో సర్పతాహ అనే మారుమూల పల్లెలో ఉంటున్న రామ్‌రతీ దేవి స్వయంగా వ్యవసాయం చేపట్టి 'ఉత్తమ కర్షక మహిళ'గా ఘనత సాధించింది. పొలం పనుల్లో మెళకువలు పాటిస్తూ పురుషుల కన్నా ఎక్కువగా ఫలసాయాన్ని సాధించడంతో ఆమె కృషిని అధికారులు కూడా గుర్తించారు. తన భర్త రామ్ బహెల్ అనారోగ్యం కారణంగా ఇంటిని వీడి బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడడంతో ఆమె సేద్యం చేసేందుకు సిద్ధపడింది. ఆమె నిర్ణయం తెలిశాక ఊళ్లో వారే కాదు, బంధుమిత్రులు సైతం ఆక్షేపించారు. 'మగరాయుడిలా వ్యవసాయం చేయడం ఏమిట'ని విమర్శించిన వారే ఆ తర్వాత ఆమెను స్ఫూర్తిగా తీసుకున్నారు. కష్టపడే మనస్తత్వం ఉన్నపుడు ఏ పని చేపట్టినా విజయం తథ్యమన్న ఆత్మవిశ్వాసంతో ఆమె పొలం పనుల్లో పాల్గొనేది. మిగతా రైతులు పొలం పనులు చేపట్టినపుడు ఆసక్తితో అన్ని విషయాలను గమనించేది. భూమి దున్నడం, విత్తనాల ఎంపిక, అనువైన సమయంలో వాటిని నాటడం, నీరు పెట్టడం, కలుపు తీయడం వంటి పనులు స్వయం చేస్తూ అవగాహన పెంచుకునేది. ఎవరి ఆసరా లేకున్నా ఆమె ఒక్కతే అన్ని పనులనూ చేసుకునేది. మొదటి ఆరు నెలల కాలంలో ఎలాంటి ఆదాయం లేకున్నా అధైర్య పడలేదు. కొంతకాలానికి ఫలసాయం చేతికందాక లాభాలు రావడం మొదలైంది. అనారోగ్యంతో ఇంటిపట్టున ఉంటున్న భర్తకు ఓ వైపు సపర్యలు చేస్తూనే మరోవైపు ఫలసాయాన్ని రెట్టింపు చేయాలని ఆలోచించేది. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్ర పోయే వరకూ ఎపుడూ సేద్యం గురించే దృష్టి సారించేది. సాగుబడిలో మెళకువలు తెలిశాక ఆమె పలురకాల పంటలను వేస్తూ అధిక లాభాలు చవిచూసింది. చెరకు, వెల్లుల్లి, టమాటా, కందులు, ఆకుకూరలు, కూరగాయలు, పెసలు వంటివి అంతర పంటలుగా వేయడంతో ఆదాయం బాగా పెరిగింది. సేద్యంలో ఆమె సాధించిన అద్భుతాలను చూసి మిగతా రైతులు విస్మయం చెందేవారు. ఆదాయం పెరగడంతో భర్తకు మంచి వైద్యం అందించింది. సాగునీటికి ఇబ్బంది లేకుండా పొలంలో బోరింగ్ వేయించింది. కొడుకు కోసం బైక్‌ను, ఇంట్లో అవసరాల కోసం పలు గృహోపకరణాలు కొనుగోలు చేసింది. సేంద్రియ ఎరువులను స్వయంగా తయారు చేసుకుని వృథా ఖర్చును తగ్గించుకుంది. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా రామ్‌రతీ దేవి పండించిన కూరగాయలకు మార్కెట్లో డిమాండ్ పెరిగింది. ఆమె ఇపుడు గ్రామంలోని మిగతా రైతులకు సేద్యం గురించి పాఠాలు చెబుతోంది. విసుగూ, విరామం లేకుండా ఇతర రైతుల సందేహాలను నివృత్తి చేస్తుంది. వ్యవసాయ రంగంలో ఆమె పట్టుదల, కఠోర శ్రమను గుర్తించి ఢిల్లీకి చెందిన సిఐఐ (భారతీయ పరిశ్రమల సమాఖ్య) లక్ష రూపాయల నగదుతో పాటు అవార్డును ఇచ్చి సత్కరించింది.

-చలన

ముత్యాల ముగ్గు



కె.సుజాత, ఉక్కునగరం (విశాఖ)

వి.సంధ్య, ఎమ్మిగనూరు

అఖిలాంధ్ర పాఠకుల మానస పుత్రిక
ఆంధ్రభూమి
సచిత్ర వారపత్రిక
WEEKLY
విభిన్నమైన కథాంశాలతో
నాలుగు సీరియల్స్
వెల. 15 రూపాయలే
సామాజిక స్పృహ కలిగించే
ఉత్తమ కథలు
నవ్వుల పువ్వులు పూయించే
జోక్స్, కార్టూన్స్
నిత్యజీవితంలో
ఉపయోగపడే విలువైన
వ్యాసాలు
కొత్త సంగతులింకా ఎన్నో ఉన్నాయి
కొనండి!
చదవండి!!
చదివించండి!!!
8 జనవరి 2015 సంచిక మార్కెట్లో ఉంది

vahini@andhrabhoomi.net

వాహిని

10
ఆంధ్రభూమి
బుధవారం
31, డిసెంబర్
2014

నేర్చుకుందాం

సీ. పర్వత ద్వంద్వంబు పాథోధియుగళంబు మృగపది ద్వితయంబు వృషభయుగము
పావక ద్వయము దంతావళయుగళంబు దలపడు వీఁక నుద్దండ లీలఁ
గదిసి యన్యోన్య భీకర గదాహతుల నుగ్రంబుగ విస్ఫులింగములు పెదరఁ
గెరలుచు నవ్య దక్షిణ మండల భ్రమణములను సింహ చంక్రమణములను

తే. గదిసి పాయుచు డాసి డగ్గఱచు మింటి
కెగసి క్రుంగుచుఁ గ్రుంగి నే యెగసి భూమి
పగుల నార్చి ఛటచ్ఛటోద్భట మహోగ్ర
ఘన గదా ఘట్టనధ్వని గగన మగుల

భావం: భీమ జరాసంధులిద్దరూ రెండు పర్వతాలూ, రెండు సముద్రాలూ, రెండు సింహాలూ రెండు వృషభాలూ, రెండు అగ్నులూ, రెండు మత్తేభాలు తలపడిన విధంగా పరస్పరం ఎదిరించి భయంకరంగా యుద్ధం చేశారు. పై కెగురుతూ, వంగుతూ, త్రోసుకుంటూ, తన్నుకుంటూ కుడి ఎడమలకు తిరుగుతూ, గదా ఘట్టనలతో నిప్పురవ్వలు రాలగా విజృంభించి సింహనాదాలు చేస్తూ వారు ఘోర సంగ్రామం సాగించారు.

పోతన భాగవతము - దశమస్కంధము

స్పందన

46 **కె. ప్రమీలాజనార్దన్**

మదిలో నిలిచిన రూపు తలపునకు వచ్చినపుడు ఎంత నరకంగా వుండేదో..'' నా మనసును ఆయనకు విశదపరిచాను.

''మంచేదైనా జరిగితే మావల్లే జరిగిందంటూ పదిసార్లు చెప్పుకొనే మనుషులున్న ఈ ప్రపంచంలోనే ఎంతో చేసినా చేసిందేమీ లేదంటూ చెప్పుకొనే నీలాంటి వినమ్రులూ వున్నారు...'' అంటూ నావైపు చూసి ''మీ పేరు?'' అడిగారు మాష్టారు.

''శ్యామ్‌సుందర్... శ్యామ్ అంటారందరూ. మీరూ అలాగే పిలవండి...'' అంటూ ఆయన ముఖంలోకి చూసి ''మరో మాట మాష్టారు. 'మీరు' అంటూ నన్ను మన్నించి దూరం పెట్టకండి. మీరు పెద్దవారు. మీతో 'బాబూ...' అనిపించుకోవడమే నాకు సంతోషం'' అని చెప్పాను.

''ఏదో చాదస్తం బాబూ... మా ఊరి అల్లుడ్ని మన్నించకపోతే బాగుండదేమోనని.. ఇంతసేపటి తర్వాత అనిపించింది'' అంటూ నవ్వి ''మీ అడ్రసు తెలిపారు. నీవు వాళ్ళ బాధను మరిపించి మళ్లీ మామూలు మనుషులుగా చెయ్యగలవని నా నమ్మకం'' అన్నారాయన.

ఆ మాట అల్లుడి నోట విన్న కోటేశ్వరరావుగారు ''నిజమే. మీరు కనిపించగానే మనసు నుండి ఏదో బరువు తొలగినట్లుగా అనిపించింది..'' అంటే-

''చూడండి.. మీరు మరో తప్పు చేస్తున్నారు'' అన్నాడు శ్యామ్ నవ్వుతూ.

''ఏమిటిది?'' కంగారు పడ్డారు కోటేశ్వరావుగారు.

''మాష్టారు చేసిన తప్పే. నన్ను 'మీరు...' అని మన్నించడం.. మేమెంత పెద్ద వాళ్ళమైనా మీ ముందు చిన్నవాళ్ళమే. నాకలా చిన్నవాడిగానే వుండాలని ఇష్టం'' అన్నాడు శ్యామ్.

''అలా అయితే నువ్వూ తప్పు చేస్తున్నావు'' నవ్వారు కోటేశ్వరరావుగారు.

''తప్పు చేస్తున్నావో మమ్మల్ని శిక్షిస్తున్నావో నాకు తెలియడంలేదు. నన్ను మామయ్యగారని పిలవలేదు. మీ అత్తగారిని అత్తయ్యగారని పిలవలేదు...'' అన్నారు కోటేశ్వరరావుగారు, తను ఇలా చెప్పొచ్చో లేదోనని సందేహిస్తున్నట్లుగా చూస్తూ.

''అదా...'' నవ్వాడు శ్యామ్.

''మీకు అభ్యంతరమేమోనని అనలేదు. అంతే. దాని గురించి ఆలోచించకండి అన్నాడు శ్యామ్. తను పనిమీద హైద్రాబాద్‌లోనే ఇంకో రోజు వుండాల్సి వచ్చిందని వరుణ్‌కు, భావనకు ఫోన్ చేసి చెప్పి ఇక్కడికి వచ్చాడు. ఆ రోజు అక్కడే వుండి వాళ్ళకు కావాల్సిన వస్తు సామగ్రిని సెల్‌ఫోన్ కూడా వారెంత వద్దన్నా వినకుండా అమర్చి పెట్టాడు. మీరు మీ ఊళ్ళోనే కాదు, ఎక్కడ వున్నా దర్జాగా వుండాలి. మనసును బాధించేది సంఘటనలే కాదు.. మనం వుంటున్న స్థితిగతులుకూడా.. మనం తప్పు చెయ్యనంతవరకు భయపడక్కర్లేదు. బాధపడక్కర్లేదు. ఈశ్వరుని సన్నిధిలో సుఖశాంతులతో గడపండి. తొందరలో భావనను తీసుకొస్తాను. మహిత ఆ ఊరికి వచ్చే కవరు చూడాలన్నది. ఎందుకో... మాష్టారు నా

మాటలు విన్నాక నోటితో చెప్పకున్నా ఆ కవరు చించేస్తారని నాకు తెలుసు. ఏమైనా భావన అక్కడికి వెళ్లి వచ్చేంత వరకు ఆమెకు మీ గురించి చెప్పను. ఆమెకు ఏం చెప్పకుండా మీ దగ్గరికి తీసుకొని వస్తాను. అలా అనుకోకుండా మిమ్మల్ని చూసినప్పుడు ఆమె కళ్ళు ఎంత వెలిగిపోతాయో... అది చూడాలని వుంది..'' అని చెప్పి వెళ్లిన శ్యామ్ పది రోజుల తర్వాత ''మీ మనవళ్ళ పెళ్లి నాలుగు రోజులలో వుంది, మీరు ఎల్లుండి ఫ్లైట్‌కు ఢిల్లీ వచ్చేలా టికెట్స్ పంపిస్తున్నాను'' అంటూ చిన్న లెటర్ వ్రాసి పెట్టి కొరియర్‌లో టికెట్స్ పంపించాడు.

''ఏమిటిది? మొన్న వచ్చినపుడు పెళ్లిళ్ళ విషయమే చెప్పలేదు. ఇప్పుడు అకస్మాత్తుగా నాలుగు రోజులలో పెళ్లని టికెట్స్ పంపించాడు..'' ఆశ్చర్యంగా అనుకొని అల్లుడి సెల్‌కు ఫోన్ చేశారు కోటేశ్వరరావుగారు.

''మీరు ఆశ్చర్యపడతారని నాకు తెలుసు. ఇలా జరగడం నాకూ ఆశ్చర్యంగానే వుంది. అంతేకాదు.. కావాల్సిన మనుషులను సన్నిహితం చేసే ఆనంద క్షణాలు వస్తాయని నేనెప్పుడూ వూహించనైనా లేదు'' అన్నాడు శ్యామ్.

''నిజమే బాబూ... మళ్లీ మాకు సంతోషకరమైన రోజులు వస్తాయని కలలో కూడా అనుకోలేదు..'' అని క్షణమాగి ''అమ్మాయి ఎలా వుంది బాబు?'' ఆర్ద్రంగా అడిగారు కోటేశ్వరరావుగారు.

''తొందరలో చూస్తారుగా... అప్పుడు మీరే చెప్పండి ఎలా వుందో...'' అన్నాడు శ్యామ్ నవ్వుతూ.

''అబ్బాయిల పెళ్లిళ్ళన్నాను కాని పెళ్లికూతుళ్లు ఏ ఊరి వాళ్ళో చెప్పలేదు. ఒకవేళ వాళ్ళు విదేశపు అమ్మాయిలను ఇష్టపడ్డారా?'' అని ఏదో తప్పు చేసినట్లుగా ఆగి అన్నారు కోటేశ్వరరావుగారు. ''ఈ కాలంలో ఇలాంటివి మామూలైపోయాయి. కాబట్టి దాని గురించి అంతగా పట్టించుకోనక్కర్లేదు..'' తను ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదని తనలో ఇప్పుడు ఎంతో మార్పు వచ్చిందన్న విషయం అల్లుడు తెలుసుకోవాలన్న ఆరాటం అతడి మాటల్లో తొంగి చూస్తోంది. అది గ్రహించిన శ్యామ్ తనలో తనే నవ్వుకొని అన్నాడు.

-ఇంకాఉంది

అధ్యాత్మ రామాయణం



- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

యుద్ధకాండ 215

దేవదుందుభులు మ్రోగాయి. ఆకసం నుండి పూల వాన కురిసింది.

నవదూర్వాంకుర శ్యామల వర్ణుడైన రాముణ్ణి స్తుతించి అభినందించగా భవానీ సహితుడై శంకరుడు వచ్చాడు.

పద్మపత్ర విశాల నేత్రుని, కోటి సూర్య కాంతి ప్రకాశ కిరీటి శోభితుని కోటిమన్మథుల లావణ్యాకృతిని, పీతాంబరధారిని, దివ్యాభరణధారిని దివ్య చందన లిప్తుని, సహస్ర సూర్య ప్రకాశ తేజోవిరాజితుని, సుందర ద్విభుజుని, రఘునందనుని ఉమాసహిత శంకరుడు స్తుతించగా వచ్చాడు.

శ్రీరాముని వామాంకాన వామభాగంలో ఎఱ్ఱ కలువను ధరించి కూర్చొని ఉన్న సీతాదేవిని తన వామహస్తంతో ఆలింగనం చేసుకొని ఉన్న శ్రీరాముని, సర్వాతిశాయి అయిన సుశోభితుణ్ణి దేవతలెల్లడల పరివేష్టించియున్న రఘురాముని ఉమాసహితుడైన శంకరుడు వచ్చి ఈ విధంగా స్తుతించాడు.

శ్రీరాముని పట్టాభిషేక సందర్భంగా శ్రీ మహాదేవుల వారు స్తుతిస్తూ, నమోస్తు రామాయసశక్తికాయ, నీలోత్పల శ్యామలకోమలాయ, కిరీటహారాంగద భూషణాయ, సింహాసన స్థాయ మహాప్రభాయ- అని ప్రారంభించారు. భక్తితత్త్వంతో రాముణ్ణి ఇంకా ఈ విధంగా ప్రస్తుంచారు.

రామా! నీకు ఆది మధ్యాంతాలు లేవు. నీవు అద్వితీయుడవు. ఎల్ల లోకాలు నీ మాయచేతనే సృష్టిస్తావు. నిలుపుతావు, లయం చేస్తావు. అయినా నీవు నిర్లేపుడవు. నిరంతర స్వానందమగ్నుడవు. అందువల్లనే దోషగంధరహితుడవు. నీ మాయాగుణాలచే నీవు ఆవరింపబడి ఉంటావు. నీవు శరణాగత భక్తులకు మార్గం చూపిస్తావు. సురనరవరాది నానావిధ రూపాలతో అవతరిస్తుంటావు. చిత్ర విచిత్ర లీలలు కొనసాగిస్తావు. జ్ఞానులకు మాత్రమే అందుబాటులో ఉంటావు.

స్వామీ! నీ అంశతోనే లోకాలు సృష్టిస్తున్నావు. ఆదిశేషుని రూపంలో క్రింది భాగంలో ఉండి నీవే భరిస్తున్నావు. సూర్య, వాయు, చంద్ర, ఓషధి, తదితర వర్ష రూపాలతో లోకాలను నానా విధాలుగా పైనుండే రక్షణ చేస్తున్నావు.

నీవు దేహికి జఠరాగ్ని రూపంలో ఉండి, పంచ ప్రాణాల సహాయంతో, ప్రాణులు భుజించిన అన్నాన్ని జీర్ణం గావించి, దాని ద్వారా సర్వ జగత్తును పాలిస్తున్నావు.

ఈశా! చంద్ర సూర్యాగ్నులలో తేజస్సు ఉండడానికి, సమస్త ప్రాణులలోని చైతన్యాంశానికి, దేహధారులలో ఉండే ధైర్యశౌర్య ఆయుర్బలాదులన్నిటికీ ప్రభూ! నీ ఉనికే ప్రధాన కారణం.

స్వామీ! నీవు బ్రహ్మ, శివ విష్ణు భేదాలతో, కాల కర్మ శశి సూర్య విభాగాలతో ఈశ్వర తత్త్వవాదులకు వేరువేరుగా ఉన్నట్లనిపిస్తూ ప్రకాశిస్తుంటావు. కాని నీవు అద్వితీయమైన బ్రహ్మవు. అన్ని రూపాలలో ఉండేది నీవే!

శ్రుతులలో పురాణాలలో, ప్రసిద్ధములైన మత్స్యాది రూపాలతో ఏ విధంగా నీవొక్కడవే ప్రఖ్యాతి సాధించి ప్రసిద్ధుడవైనావో, అదేవిధంగా సత్సత్ అనే రూపాలున్న విభాగాలలో నీవు ఒక్కడవే ఉన్నావు. నీకన్నా భిన్నమైనది మరొకటి లేదు.

ఈ అనంత సృష్టిలో ఏది పుట్టిందో, ఏది పుట్టుతున్నదో, ఏది పుట్టనున్నదో- ఆ స్థావర జంగమాది రూపాల్లోనూ, సమస్త వస్తు సముదాయంలోను నీవు తప్ప వేరెవరూ కనిపించరు. నీవు ప్రకృతికన్నా పరముడవు.

నీవు పరమాత్ముడవు; మాయలో పడ్డ ప్రజలు నీ తత్త్వాన్ని తెలుసుకోలేరు. నీ భక్తులను సేవించడంవల్ల, నిర్మలమైన మనస్సు ఉండడంవల్ల మాత్రమే నీ తత్త్వం తెలుస్తుంది.

- ఇంకాఉంది

బుధవారం 31 డిసెంబర్, 2014

రాశిఫలం

■ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

పంచాంగం

శ్రీ జయ, దక్షిణాయనం
హేమంత ఋతువు - పుష్యమాసం

తిథి: శుద్ధ దశమి ఉ.11.07
నక్షత్రం: అశ్విని ఉ.8.03
వర్జ్యం: సా.5.22 నుండి 6.55 వరకు
దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు

• మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)
వ్యయ ప్రయాసలు అధికమవుతాయి. ధననష్టమేర్పడకుండా జాగ్రత్తవహించుట మంచిది. అనారోగ్య బాధలు తొలగుటకు డబ్బు ఎక్కువ ఖర్చు చేస్తారు. తీర్థయాత్రకు ప్రయత్నిస్తారు.

• వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)
అల్పభోజనంవల్ల అనారోగ్యాన్ని పొందుతారు. ఏదో ఒక విషయం మిమ్మల్ని మనస్తాపానికి గురి చేస్తుంది. వీలైనంతవరకు అసత్యానికి దూరంగా నుండుట మంచిది.

• మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)
చంచలం అధికమవుతుంది. గృహంలో మార్పు లు కోరుకుంటారు. స్వల్ప అనారోగ్య కారణంతో నిరుత్సాహంగా ఉంటారు. స్త్రీలతో తగాదాలేర్పడే అవకాశాలుంటాయి. ప్రయత్న కార్యాలు ఫలిస్తాయి.

• కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)
ఆకస్మిక ధననష్టం జరుగకుండా జాగ్రత్తపడుట మంచిది. మనస్తాపానికి గురి అవుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. నూతన కార్యాలు వాయిదా వేసుకోక తప్పదు. స్త్రీలు మనోల్లాసాన్ని పొందుతారు.

• సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)
అనారోగ్య బాధలతో సతమతమవుతారు. స్థానచలన సూచనలుంటాయి. నూతన వ్యక్తులు కలుస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు. ఆర్థిక ఇబ్బందులు దూరమవుతాయి.

• కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)
ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. ఆత్మీయుల సహకారం లభిస్తుంది. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. అజీర్ణబాధలు అధికమవుతాయి. కీళ్లనొప్పుల బాధఉంటుంది.

• తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)
గొప్పవారి పరిచయం ఏర్పడుతుంది. స్త్రీల మూలకంగా లాభం ఉంటుంది. మంచి ఆలోచనలను కలిగివుంటారు. బంధు, మిత్రులు గౌరవిస్తారు. కుటుంబ సౌఖ్యం పరిపూర్ణంగా పొందుతారు. సత్కార్యాల్లో పాల్గొంటారు.

• వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)
ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటారు. వృత్తి ఉద్యోగ రంగాల్లో నష్టపోయే అవకాశముంటుంది. కుటుంబంలో మార్పులు కోరుకుంటారు. ఒక మంచి అవకాశాన్ని జారవిడుచుకుంటారు. గృహ అవసరాలకు ప్రాధాన్యమిస్తారు.

• ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)
మనోధైర్యాన్ని కోల్పోకుండా జాగ్రత్త వహించుట అవసరం. ఆటంకాలేర్పడతాయి. కోపాన్ని తగ్గించుకుంటే మంచిది. ఇతరులకు హాని తలపెట్టు కార్యాలకు దూరంగా వుంటారు.

• మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)
ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవడంతో ఇబ్బంది పడతారు. దైవదర్శనానికి ప్రయత్నిస్తారు. ఋణప్రయత్నాలు ఆలస్యం ఫలిస్తాయి. సోదర వైరం కలిగే అవకాశముంటుంది.

• కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)
ధనలాభముంటుంది. కుటుంబంలో ఆనందోత్సాహాలు లభిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. సమాజంలో గౌరవం లభిస్తుంది. సంపూర్ణ ఆరోగ్యవంతులుగానుంటారు. ప్రతి విషయంలో అభివృద్ధి ఉంటుంది.

• మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)
వ్యాపార రంగంలో లాభాలుంటాయి. ఋణప్రయత్నాలు చేయవలసి వస్తుంది. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. బంధు, మిత్రుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది.

మంచిమాట

భగవద్గీత

మనిషి నడవాల్సిన రీతిని, చెయ్యవలసిన కర్మలని, ధర్మమార్గంలో నడిపే పద్ధతుల్ని, ధైర్యాన్ని నూరిపోసేదే భగవద్గీత. ఇది కేవలం కృష్ణుడు అర్జునుడికి మాత్రమే చెప్పింది కాదు. శ్రీకృష్ణభగవానుడు మానవాళినుద్దేశించి అర్జునుణ్ణి మిషగా పెట్టి చేసిన ప్రబోధం.

భగవంతుడు అందులో స్పృశించని విషయం లేదు. వేదాల, ఉపనిషత్తుల సారమంతా అందులో వుందని అన్నీ తెలిసిన పెద్దలు చెప్పగా వింటున్నాం. ఇది అనన్యసామాన్యమైన గ్రంథమని, ఇందులో లేని విషయం లేదని, అందరూ ఆరాధించవలసిన ఆచరించవలసిన విషయాలెన్నో ఇందు పొందుపరచి ఉన్నారని పెద్దల మాట.

నేటి మానవుడు ఎంతో విజ్ఞానాన్ని సముపార్జించాడు. గగన వీధులలో విహరిస్తున్నాడు. గ్రహాలలోనూ కాలుమోపుతున్నాడు. సాగరపు లోతు, ఆకాశపు ఎత్తును కనుగొనడానికి ముందే ఉంటున్నాడు. ఇలా మొత్తం ప్రకృతిని కూడా జయించాలని పోరాడుతునే ఉన్నాడు. మనుగడకోసం పోరాటం సల్పి విజయం సాధించిన వ్యక్తి మనసును గెలవలేకపోతున్నాడు. దాంతో గ్రహాలపై తిరిగినా, ఆకాశంలో పక్షికన్నా వేగంగా పరుగెత్తినా, నీటిలో చేపకన్నా త్వరగా ఈదగలిగినా కూడా మనిషి మనిషితనంతో బతకలేకపోతున్నాడు.

మనిషితనం అంటే మంచితనం, అనురాగం, అప్యాయత, ప్రేమ పంచలేని వ్యక్తి విచక్షణ ఉన్నా విచక్షణలేని మృగానికన్నా హీనంగా చరిస్తున్నాడు. ఇంద్రియాలపై జయకేతనం ఎగురవేయలేని వ్యక్తి దినదినాభివృద్ధి జరుగుతున్నట్లుగా కనిపించినా, అతనిలో రేకెత్తే వాంఛలు అధఃపాతాళానికి మనిషిని చేరుస్తునాయనిపిస్తుంది.

ఇవన్నీ పొడచూపకుండా ఉండాలంటే మనిషి మనసుపై విజయం సాధించాలి. దీనికి ధర్మాచరణ అనే ఆయుధాన్ని పట్టుకోవాలి. నిరంతరం అభ్యాసం చేయాలి. దీనికి భగవద్గీత పఠనం ఎంతో మేలు చేస్తుంది. భగవద్గీత పఠనం అంటే తెలుసుకోవడమే కాదు అందులో చెప్పిన నీతిని ఆచరించాలి. యజ్ఞం, దానం, ధర్మం అంటూ ఏదేదో తెలిసి కొంత, తెలియదని కొంత కర్మలను ఆచరించడం, నిరంతరమూ ప్రతి కర్మా ధర్మయుక్తమైనదా కాదా అన్న ఆలోచనతో కాలయాపన చేయకుండా నిష్కామ బుద్ధితో అంటే చేసేవాడు, చేయించేవాడు భగవానుడే తాను అనునది నిమిత్తమాత్రమే.

నేను, నాది, నాచే అని గాక ఈశ్వరార్పణబుద్ధితో పని చేయండి - పని అంటే కర్తవ్యాన్ని చేయండి ఫలితాన్ని ఆశించకండి. ప్రతి విషయాన్ని నాపై ఆరోపించి మీరు మీ పని చేయండి. మీ యోగక్షేమాలు నేను చూస్తాను. మీకు ఎటువంటి ఫలితాన్ని ఇవ్వాలో దాన్ని నేను ఇస్తాను. మీరు నిశ్చంతగా ఉండండి అని ఇసుమంత కష్టం లేకుండా భగవానుడు చెప్పిన రీతిలో నడుచుకుంటే చాలు మనందరమూ మానవులమే కాదు మాధవులం అయితీరుతాం. ఇక అపుడు మనసు, ఇంద్రియాలు జయ, అపజయ అన్న మాటలేవీ వినిపించవు. నేను అనేదే లేనప్పుడు ఇక జయాపజయాలుకాని వాదోపవాదాలు కానీ ఏవీ ఉండవు. తాము ఓ పరికరంగా కర్మ ఆచరిస్తే పాపపుణ్యాలు దరిచేరవు. లౌకికము, గాని అలౌకికం గాని ఏదీలేకుండా నిరంతరమూ ఆనందచిత్తంతో ఉంటారు. ఆనందమయుడైన పరమాత్మను నిత్యం స్మరిస్తూ ఉంటాం. శరీరం జీవించి ఉన్నా, లేకున్నా ఎల్లప్పటి ఉంటే ఆత్మ నిత్యసంతోషినే కదా.

ఏ ఉపనిషత్ అయినా, వేదం అయినా ఆ పర్మమాత్మ ఒక్కడే సత్యము. మిగిలినదంతా మిథ్య అనే కదా చెబుతున్నాయి. భగవద్గీతలో రాగద్వేషాలతో కొట్టుకొని పోయే అర్జునుణ్ణి ఓదారుస్తూ శ్రీకృష్ణరూపంలో ఉన్న పరమాత్మ ఎవరు పుడ్తున్నారు, ఎవరు చస్తున్నారు, నేను చంపేయాల్సి వస్తోందే అనుకోవడం పొరపాటు అసలు నీవు ఎవరు అంటూ చేసిన హితబోధ సర్వ గ్రంథసారమే కదా. వేదసారమైనా అదేకదా. అందుకే అర్థం చేసుకుంటే భగవద్గీతనే సర్వవేదాంత సారం.

-హనుమాయమ్మ

సత్యభామ

57 బొమ్మలు: శ్రీరామ్



నిర్వహణ: సుధామ **597** **మాటాట**



ఆధారాలు

ఆధారాలు: 85
అడ్డం
1. ఏడాదికి చివర
6. పాఠశాల
7. ఒక యాసలో రండు అనే
9. ప్రయోజనం , మంచి
10. విజిల్
11ఛేస్
14. రానున్నదానికి వెల్ కం

నిలువు
1. వేడుకలు
2. వేగం
3. సెలవు అనడానికి కొందరు వాడే మాట
4. జనకుడు
5. టాటా అంటే ఇదే
8. పైట
9. పరిహాసం
10. పక్షికం
11. బాగుగా
12. నలకూబరుడంటే ఎవరికి ప్రేమ
13. రెలిజియన్

మాటాట - 596 సమాధానం



రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

మెనోపాజ్‌ని మీ జీవితాన్ని స్తంభింపజేసే 'పాజ్' లేక ముగింపు దశగా భావించకండి. కొత్త అభిరుచుల్ని పెంపొందించుకోండి. ఈ క్రింది వైఖరులతో భవిష్యత్తు జీవితాన్ని దర్శించండి

అంతవరకు లాగా గర్భం వస్తుందేమో, అకస్మాత్తుగా రుతుస్రావం మొదలవుతుందేమోననే కలవరానికి ఆస్కారం ఉండదు.

మూత్ర సమస్యలకు.. వ్యాయామంతో విరుగుడు

మెనోపాజ్ తరువాత మూత్రాశయం బయటి ద్వారం చుట్టూ వున్న కణజాలం పలచగా అవుతుంది. అంతేకాక పెల్విస్ కండరాలు కూడా బలహీనపడతాయి. దీనివలన మూత్రం లీక్ అవుతుంది. పెల్విస్ కండరాలు బలహీనపడడంతో తుమ్మినా, దగ్గినా, నవ్వినా మూత్రం లీక్ అవుతుంది. మూత్రాశయం అతిగా స్పందించడం వలన తరచుగా, అకస్మాత్తుగా మూత్రం పోసుకోవలసి వస్తుంది. కొంతమంది స్త్రీలకు రెండు రకాల సమస్యలూ వుంటాయి.

సూచనలు

- కాఫీ, మద్యపానం, పుల్లటి పండ్లు లేక పండ్ల రసాలు, టమాటో ఉన్న పదార్థాలు, మసాలా ఉన్న పదార్థాల్ని తీసుకోకండి. ఇవి మూత్రాశయాన్ని అతిగా ప్రతిస్పందించేలాగా చెయ్యొచ్చు.
- మీ బరువు ఎక్కువగా ఉంటే బరువు తగ్గడానికి ప్రయత్నించండి.
- తుమ్మితే, దగ్గితే, నవ్వితే మూత్రం లీక్ అవుతూంటే కెగెల్ వ్యాయామాలు చాలా మంచి ఫలితాన్ని ఇస్తాయి. అనేకసార్లు మూత్రాన్ని కంట్రోల్ చేసే కండరాల్ని బిగపట్టడం, వదులు చెయ్యడంవలన కండరాలు కొంత దృఢమై సమస్య తగ్గుతుంది.
- అర్జంట్‌గా మూత్రం పోసుకోవలసి వస్తే లేక అకస్మాత్తుగా మూత్రం పడిపోతే కొన్ని మందులతో ఫలితం కనపడొచ్చు. మీ డాక్టర్ని సంప్రదించండి.
- చర్మాన్ని పొడిగా, పరిశుభ్రంగా ఉంచుకోండి. పైన చెప్పినవేమైనా పనిచేసేలోగా మూత్రం లీక్‌వల్ల బట్టలు పాడవడం లేక చర్మం సమస్యలు రాకుండా మూత్రాన్ని పీల్చుకునే పాడ్స్‌ని ఉపయోగించండి.

ఈ సూచనలేవీ ఫలితాన్నివ్వకపోతే యురాలజిస్ట్‌ని సంప్రదించండి. ఈస్ట్రోజన్ ఆయింట్‌మెంట్ వల్ల ఫలితం ఉంటుందేమో తెలుసుకోవడానికి గైనకాలజిస్ట్‌ని కూడా సంప్రదించండి.

జ్ఞాపకశక్తి, ఏకాగ్రత తగ్గడం

మెనోపాజ్ వచ్చిన కొందరి స్త్రీలకు ఈ సమస్యలు వస్తాయి.

సూచనలు

- శారీరకంగా చురుకుగా ఉండండి. ప్రతిరోజు 30 నిమిషాల పాటు నడవండి.
- సామాజిక విలువ వున్న కార్యక్రమాలలో నిమగ్నమవ్వండి. ఎవరితో గడిపితే మీకు ఆనందం కలుగుతుందో కుటుంబ సభ్యులతో, మిత్రులతో కొంత సమయాన్ని గడపడానికి కార్యక్రమాల్ని రూపొందించుకోండి.
- మానసికంగా చురుగ్గా ఉండండి. ఇది మిమ్మల్ని ఛాలెంజ్ చేసే కొత్త విషయాల్ని నేర్చుకోవడానికి ప్రోద్బలపరిచే పనులు లేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాల ద్వారా సాధించవచ్చు. మీ బుద్ధికి ప్రేరణ కలిగించుకోవడానికి ప్రయత్నించండి. పుస్తకాల్ని చదవడం, పజిల్స్ చెయ్యడం మొదలైన కార్యక్రమాలు సహాయపడవచ్చు.

యోని సంబంధిత సమస్యలు

సహజంగా వచ్చే మెనోపాజ్ దశలో, ఆపరేషన్ ద్వారా అండాశయాల్ని తొలగిస్తే లేక పొత్తికడుపునకు రేడియో థెరపీ తరువాత అండాశయాలు తక్కువ ఈస్ట్రోజన్‌ని ఉత్పత్తి చేస్తాయి. దీనివలన యోని పొర పలచగా, పొడిగా అవుతుంది. సాగే శక్తిని కోల్పోతుంది. ఈ మార్పులవలన దురద, డిశ్చార్జి వుంటాయి. కొంతమందికి లైంగిక సంపర్కంలో లేక యోని ద్వారా పరీక్ష చేయించుకుంటున్నప్పుడు నొప్పి వుంటాయి. వీటికి తోడు కేన్సర్‌కి చేసే చికిత్సలవలన యోని పొడవు తగ్గుతుంది. ఇరుకుగా అవుతుంది. ఇన్‌ఫెక్షన్స్ ఎక్కువగా వస్తాయి.



సూచనలు

- యోని సంబంధిత మాయిశ్చరైజర్స్ యోని పొడిగా వుండడాన్ని, పొక్కడాన్ని నివారిస్తుంది.
- యోని లూబ్రికెంట్‌ని వాడడం ద్వారా లైంగిక సంపర్కంలో అసౌకర్యాన్ని తగ్గించవచ్చు. యోని పొరకు గాయాల్ని నివారించవచ్చు.
- కొబ్బరి నూనె అల్మండ్ ఆయిల్ లాంటివి లూబ్రికేషన్ కోసం ఉపయోగించవద్దు.
- వదులుగా వుండే నూలు పాంటీలను ధరించండి.
- దూషణలవలన యోని పొడిగా అవడం, పొక్కడం జరుగుతుంది కాబట్టి యోని డూష్ చేసుకోవద్దు.

ఈ సూచనలేవీ ఫలితాన్ని ఇవ్వకపోతే మీ డాక్టర్‌ను సంప్రదించండి

- ఈస్ట్రోజన్ ఆయింట్‌మెంట్‌ని ఉపయోగిస్తే ఫలితం ఉంటుందేమో అడిగి తెలుసుకోండి. కొన్ని రకాల కేన్సర్స్ ఉన్నప్పుడు ఈస్ట్రోజన్ ఆయింట్‌మెంట్‌ని ఉపయోగించకూడదు. అందుచేత ఈ ఆయింట్‌మెంట్‌ని ఉపయోగించడంలో లాభనష్టాల్ని మీ డాక్టర్‌తో చర్చించండి.
- యోని ద్వారా డిశ్చార్జి, మంట, దురద ఇన్‌ఫెక్షన్ లక్షణాలు- ఇవి అకస్మాత్తుగా రావచ్చు. అలా జరిగినపుడు మీ గైనకాలజిస్టుని సంప్రదించండి. ఆమె/అతను మిమ్మల్ని పరీక్షించి, అవసరమైతే ఏంటీ బయాటిక్‌ని ఇస్తారు.

లైంగిక కోరిక తగ్గడం

మెనోపాజ్ సమయంలో హార్మోన్‌లలో కలిగే మార్పులవలన కొంతమందికి లైంగిక కోరిక తగ్గవచ్చు. యోని పొడిగా, ఇరుకుగా మారడంవలన లైంగిక కలయికలో నెప్పి కారణంగా కూడా లైంగిక సంపర్కంపట్ల విముఖత కలగవచ్చు. తీవ్రమైన అలసట, మూడ్ మార్పులు, కేన్సర్ వ్యాధి, ఆ వ్యాధి చికిత్స కారణంగా జననాంగాల్లో జరిగే మార్పులు, భావోద్వేగపరమైన ఆందోళనలు, భయాలవల్ల కూడా లైంగిక కోరిక తగ్గవచ్చు.

సూచనలు

మీకు లైంగిక కోరిక తగ్గడానికి దారితీసిన లక్షణాల గురించి మీ డాక్టర్‌తో చర్చించండి.

- వాటికి చికిత్స తీసుకుంటే మీలో లైంగిక ఆసక్తి పెరిగి మీ భర్తకు చేరువ అయ్యే అవకాశం ఉంది.
- మీ భర్తతో కలిసి ఉల్లాసంగా గడపడానికి కొంత సమయాన్ని కేటాయించుకోండి.
- మరీ ఎక్కువ అలసటను కలిగించే పనులను చెయ్యకండి.
- మీ భర్తతో మనసు విప్పి మాట్లాడండి. మీరు ఎలా ఫీలవుతున్నారో, మీకు ఏది ఆనందం కలిగిస్తుందో ఆయనతో చెప్పండి. లైంగిక సాన్నిహిత్యం అంటే అన్నిసార్లు యోని ద్వారా లైంగిక కలయికే కానక్కర్లేదు. ఆలింగనం, చుంబనం, ఆత్మీయ స్పర్శ కూడా లైంగిక సంతృప్తిని కలిగించవచ్చు.

-లైంగిక కలయికలో ఒకవేళ నొప్పి ఉంటే వెజైనల్ మాయిశ్చర్ లేక లూబ్రికెంట్‌ని వాడటంవల్ల ఫలితం కనపడవచ్చు. మీకు సౌకర్యంగా వుండే పొజిషన్‌లో లైంగిక కలయిక కూడా ఫలితాన్ని ఇవ్వవచ్చు.

దీర్ఘకాలిక పరిణామాలు

మెనోపాజ్ తరువాత వయసు పెరగడం కారణంగా జరిగే శారీరక మార్పులు స్త్రీలలో వస్తాయి. ఇవి గుండె జబ్బులకు లేక ఎముకలు డొల్లగా అవడానికి (ఆస్టియో పోరోసిస్) దారి తీయవచ్చు. కేన్సర్ చికిత్స కారణంగా చిన్న వయసులో మెనోపాజ్ వచ్చిన స్త్రీలకు ఈ సమస్యల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రమాదాల్ని తగ్గించడానికి కొన్ని చర్యల్ని తీసుకోవచ్చు. ●

డా.ఆలూరి విజయలక్ష్మి
9849022441

నెలసరి నొప్పి పోయేది ఎలా..?

సుమారు 50 శాతం మంది స్త్రీలు బహిష్టు సమయంలో పొత్తికడుపు నొప్పితో బాధపడుతుంటారు. యుక్తవయస్సు అంటే 18 సంవత్సరముల నుండి 24 సంవత్సరాల వరకూ ఉన్న స్త్రీలలో బహిష్టు సమయలో కడుపునొప్పి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వయస్సు పెరుగుతున్నకొద్దీ వివాహ అనంతరం నొప్పి తీవ్రత తగ్గుతుంది. డిస్మెనోరియా ప్రధానంగా రెండు రకాలు. మొదటిది ప్రైమరీ డిస్మెనోరియా, రెండవది సెకండరీ డిస్మెనోరియా.

ఈ రోజుల్లో చాలామంది స్త్రీలలో బహిష్టు సమయంలో పొత్తి కడుపు నొప్పి బాధిస్తుంది. ఇటువంటి నొప్పినే వైద్య పరిభాషలో డిస్మెనోరియా (పెయిన్‌ఫుల్ మెన్సెస్) అంటారు. బహిష్టు కనపడిన తర్వాత మొదటి రెండు మూడు సంవత్సరాల వరకూ బహిష్టు సమయంలో పొత్తికడుపు నొప్పి రావడం సాధారణంగా జరగదు.

సుమారు 50 శాతంమంది స్త్రీలు బహిష్టు సమయంలో పొత్తికడుపునొప్పితో బాధపడుతుంటారు. యుక్తవయస్సు అంటే 18 సంవత్సరముల నుండి 24 సంవత్సరాల వరకూ ఉన్న స్త్రీలలో బహిష్టు సమయలో కడుపునొప్పి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వయస్సు పెరుగుతున్నకొద్దీ వివాహ అనంతరం నొప్పి తీవ్రత తగ్గుతుంది.

డిస్మెనోరియాను ప్రధానంగా రెండు రకాలుగా చెప్పవచ్చు. మొదటిది ప్రైమరీ డిస్మెనోరియా, రెండవది సెకండరీ డిస్మెనోరియా.

ప్రైమరీ డిస్మెనోరియా యుక్త వయస్సులోని స్త్రీలలో ఎక్కువగా కనిపిస్తుంది. వీరికి బహిష్టు సమయంలో పొత్తికడుపు నొప్పి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీనికి ముఖ్యంగా హార్మోనుల అసమతుల్యతే కారణం.

సెకండరీ డిస్మెనోరియా వయస్సు మీరిన స్త్రీలలో ఎక్కువగా కనిపిస్తుంది. దీనికి గర్భాశయ కణుతులు, పెల్విక్ ఇన్‌ఫెక్షన్స్ ఉండటం కారణం.

అలాగే బహిష్టు సమయంలో కండరాల సంకోచంవల్ల గర్భకోశ ముఖ ద్వారం వంగి ఉండటంవలన, ఓవేరియన్ సిస్టుల వల్లకూడా బహిష్టు సమయంలో కడుపునొప్పి ఎక్కువగా వస్తుంటుంది.

నెలసరి నొప్పికి ప్రధాన కారణాలు

మానసిక ఒత్తిడి, హార్మోనుల అసమతుల్యత గర్భాశయంలో ఫైబ్రాయిడ్స్, జన్యులోపాలు.

లక్షణాలు

-బహిష్టు సమయంలో పొత్తికడుపులో నొప్పితో రక్తస్రావం ఎక్కువ కావడం.

-గర్భాశయంలో ఫైబ్రాయిడ్స్ ఉన్నప్పుడు బహిష్టు సమయంలో కాకుండా మధ్యమధ్యలో కడుపునొప్పితో రక్తస్రావం ఎక్కువ కావడం

-పొత్తికడుపులో నొప్పి తీవ్రంగా ఉంటుంది. పీరియడ్స్ సక్రమంగా రాకపోవటం జరుగుతుంది.

-బరువు పెరుగుట, మానసికంగా చికాకుగా కోపంగా ఉండటం.

జాగ్రత్తలు

-హార్మోనుల సమతుల్యతను కాపాడటానికి పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలి. మొలకెత్తిన విత్తనాలు, పాలు, గ్రుడ్లు, పండ్లు, కాయగూరలు మొదలైనవి ఎక్కువగా తీసుకోవాలి.

-అధిక బరువు వున్నవారు బరువు తగ్గడానికి ప్రయత్నించాలి.

-నిత్యం యోగా, ప్రాణాయామము చేయాలి.

-మానసిక ఒత్తిడిని నివారించటానికి ధ్యానం చేయాలి.

-నొప్పి తీవ్రత, రక్తస్రావం ఎక్కువగా ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి సలహా తీసుకోవాలి.

చికిత్స

హోమియో వైద్యంలో బహిష్టు సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పికి మంచి చికిత్స కలదు. వ్యాధి లక్షణాలను మరియు వ్యక్తి మానసిక, శారీరక లక్షణాలను పరిగణనలోకి తీసుకొని మందులను ఎన్నుకొని వైద్యం చేసిన బహిష్టు సమయంలో వచ్చే నొప్పి నుండి విముక్తి పొందవచ్చు.

మందులు

మెగ్నిషియం ఫాస్, లేకసిస్, బెల్లడోనా, సెపియా, నైట్రోమోర్, కామామిల్లా, కాల్మియా, సెబైనా, ఎకోనైట్, కోలోసింత్, కాల్కేరియా కార్బ్ వంటి మందులను లక్షణాలను బట్టి ఎన్నుకొని వైద్యం చేసిన నెలసరి నొప్పి నుండి విముక్తి పొందవచ్చు. ●

డా.పావుశెట్టి శ్రీధర్
9440229646

మీకు మీరే డాక్టర్

స్థూలకాయానికి ఆయుర్వేద నివారణ

ప్ర: తిండి తగ్గించండి, వ్యాయామం చేయండి అనే విషయాలు వినీ వినీ ఓపిక పోయింది. ఇవి కాకుండా స్థూలకాయం తగ్గటానికి ఏదైనా ఉపాయం చెప్తారా?

కె.శ్రీకాంత్, ఖమ్మం

జ: స్థూలకాయం అనే వ్యాధి రావటానికి "I' అనే ఒక ఇంగ్లీషు అక్షరం ప్రేరకం అవుతుంది. స్థూలకాయం వచ్చే శరీర తత్వం వంశపారంపర్యం కాబట్టి దాన్ని మనం మార్చగలిగేది ఏమీ లేదు. కానీ రేపెప్పుడో వచ్చే దాన్ని నేడే వచ్చేలా చేసేది ఈ I అనే ఇంగ్లీషు అక్షరం మాత్రమే! I అంటే నేను. ఈ 'నేను' కారణాలను గుర్తించటానికి ప్రయత్నించండి. I అంటే Incorrect lifesyle, improper diet, irregular exercise and food habits, improper thinking, insufficient Thyroid ఇలాంటి కారణాలు ఎన్నో ఉన్నాయి. వీటిలో మీ పాత్ర ఏమిటన్నది ప్రశ్న. తెలిసి చేసే తప్పుల్ని ప్రజ్ఞాపరాధాలంటారు. ఆ అపరాధ ఫలితమే స్థూలకాయం ఆగకపోవటం. పథ్యం అనేది వాడే మందుకు ఉండదు, వచ్చిన వ్యాధి కోసమే ఆహార విహార జాగ్రత్తలన్నీ! అన్ని వ్యాధుల్లోనూ 'అన్నీ తినేయండి' అనటం అర చికిత్స అవుతుంది. ఉన్నంతలో కొన్ని పాటించండి.

-వాయువిడంగాల పేరుతో గింజలు మూలికలు అమ్మే షాపుల్లో దొరుకుతాయి. వాటిని సమానంగా మిరియాలను కలిపి మెత్తగా దంచిన పొడి ఒక చెంచా మోతాదులో రోజూ రెండు పూటలా 'టీ' లాగా కాచుకుని తాగండి.

-భోజనం చెయ్యబోయే ముందు బాగా నీళ్ళు తాగి, అప్పుడు అన్నం తినండి. చిలికి వెన్న తీసిన మజ్జిగ ఎక్కువగా తాగండి.

-క్యాబేజీ సలాద్ తప్పనిసరిగా ప్రతిరోజూ తీసుకోండి.

-ఉదయాన్నే 1-2 చెంచాల మెంతులు నోట్లో వేసుకుని నమలకుండా నీళ్ళతో మింగేయండి.

-క్యారెట్, ముల్లంగి, యాపిల్ కలిపి తీసిన జ్యూస్‌లో మిరియాల పొడి వేసుకుని రోజూ తాగండి.

-స్థూలాంతకర రసం, మేదోహర విడంగాది లోహం ఔషధాలు వాడండి.

చుండ్రు నివారణ

ప్ర: నా వయసు యాభై ఐదేళ్ళు. తల నిండా చుండ్రు ఉంది. ఎవరెన్ని చెప్పినా చేస్తున్నాను. అయినా తగ్గటంలేదు. పిల్లలకొచ్చినట్లు ఈ వయసులో ఇది నన్ను వదల్లేదు. చుండ్రు పోయే ఉపాయం చెప్పండి!

టి.శాంతారావు, కర్నూలు

జ: మొదట చర్మవ్యాధి నిపుణుణ్ణి సంప్రదించి సొరియాసిస్ కాదని నిర్ధారించుకోండి. మానసిక వత్తిళ్ళు కూడా చుండ్రు రావటానికి కారణం అవుతాయి. తలకు నూనె రాయటం అంటే తలపై చర్మంలోకి ఇంకేలా పట్టించాలి. అందువలన చుండ్రు తగ్గుతుంది. వెంట్రుకలకు రాసి ఊరుకున్నందువల్ల ఉపయోగం లేదు. వేపాకుల కషాయంతో తరచూ తలస్నానం చేయండి. మెంతుల్ని రాత్రంతా నీళ్ళలో నాననిచ్చి, ఉదయాన్నే పేస్టు చేసి తలకు పట్టించండి. పొట్లకాయ గుజ్జు కూడా బాగా ఉపయోగపడుతుంది. ●

డా॥ జి.వి.పూర్ణచందు,
సుశ్రుత ఆయుర్వేదిక్ హాస్పిటల్, సత్యం టవర్స్,
1వ అంతస్థు, బకింగ్‌హాంపేట,
పోస్టాఫీసు ఎదురు, గవర్నర్‌పేట,
విజయవాడ-500 002. సెల్:9440172642,
purnachandgvgmail. com

అందం పోతుందని.. తల్లిపాలను దూరం చేయొద్దు

ఆధునిక యుగంలో లైఫ్‌స్టైల్ మార్చుకోవడం తప్పనిసరి అయిపోయింది. ఆడ, మగ చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా ఆధునికతకు అనుగుణంగా జీవిత సరళిని మార్చుకోవలసి వస్తుంది. ఈ నేపథ్యంలోనే ప్రతి భర్త - నా భార్య చాలా స్మార్ట్‌గా స్లిమ్‌గా, అందంగా ఉండాలని అనుకోవడం, అదేవిధంగా భార్య కూడా తన భర్త అభిరుచులకు అనుగుణంగా ఆధునికతకు తీసిపోకుండా మోడరన్ డ్రెస్‌లు, మోడరన్ ఫుడ్ హేబిట్స్, పర్సనాలిటీ మెయింటనెన్స్, మోడరన్ కస్టమ్స్ మొదలైన విషయాలను దృష్టిలో పెట్టుకుని తల్లులైన వారు కూడా జీవితాన్ని సాగించవలసి వస్తుంది.

ఈ పరిస్థితుల్లో తల్లులు పిల్లలకు సరైన న్యాయం చేకూర్చటంలేదనే చెప్పాలి. ఎందుకంటే తల్లిపాలు బిడ్డకు అనేక రకాలుగా ఉపయోగపడతాయి. తల్లిపాలు శరీరం పెరుగుదలకే కాకుండా వ్యాధి నిరోధక శక్తిని కూడా ఇస్తుంది. ముఖ్యంగా శరీర పెరుగుదలకు ఎముకలు, పళ్ళు తయారు కావటానికి ఉపయోగపడే పదార్థాలైన కాల్షియం, ఫాస్పరస్‌లు పుష్కలంగా తల్లిపాలలో లభ్యమవుతాయి. కనుక తల్లులు పిల్లలకు కనీసం సంవత్సరం పాటైనా తమ పాలను ఇవ్వడం కనీస బాధ్యతగా భావించాలి.

కొంతమంది తల్లులు వారి వృత్తిరీత్యా పిల్లలకు సరైన టైంలో పాలను అందించలేని పరిస్థితి ఏర్పడుతుంది. అదేవిధంగా చాలామంది మోడరన్ డ్రెస్‌లు ధరించి పిల్లలకు పాలివ్వరు. మరికొంతమంది వారి పర్సనాలిటీని దృష్టిలో ఉంచుకొని పిల్లలకు పాలిస్తే పర్సనాలిటీ దెబ్బతింటుందని పిల్లలకు పాలివ్వటం మానేస్తారు. కొందరు తల్లులు వారి సొంత ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పిల్లలకు పాలివ్వకుండా పోతపాలు అంటే బర్రెపాలు, ఆవుపాలు ఇస్తారు.

ఈ పాలలో సరైన మోతాదులో కాల్షియం, ఫాస్ఫరస్‌లు లభ్యం కాకపోవటంవల్ల ఎముకలు, దంతాలు సరిగ్గా బలంగా పెరిగే అవకాశం లేదు. వ్యాధి నిరోధక శక్తి లోపించి త్వరగా ఎముకలకు సంబంధించిన వ్యాధులు, పళ్ళకు సంబంధించిన వ్యాధులు సంక్రమించే అవకాశాలు ఉన్నాయి.

తల్లిపాలు తాగడంవల్ల దవడలు, పళ్ళు సరైన పద్ధతిలో పెరుగుతాయి. ముఖం చూడటానికి క్రమపద్ధతిలో కనిపిస్తూ అందంగా ఉంటుంది. పళ్ళు పటిష్టంగా ఉండి తెల్లగా ముత్యాలవలె మెరుస్తూ ఉంటాయి. ఈ విధమైన పళ్ళు పుచ్చిపోకుండా అరిగిపోకుండా వ్యాధి నిరోధక శక్తి కలిగి ఉంటాయి. బిడ్డకు పళ్లు వచ్చేముందు చిగుళ్ళను దవడలను సున్నితంగా ఒక క్రమపద్ధతిలో అదమగలిగితే మంచిది. పిల్లలకు పాలు ఇచ్చే అలవాటును బట్టి కూడా పళ్ళు దవడల్లో మార్పులు వచ్చే అవకాశముంది. కనుక పిల్లలకు ఒక క్రమపద్ధతిలో నిర్ణీత సమయాల్లోనే పాలు ఇవ్వటం మంచిది. ఎక్కువ సమయం పాటు పాలు ఇవ్వటం మంచిది కాదు. ఈ విధంగా చేయటంవల్ల ముఖ కవళికలల్లో మార్పులు ఏర్పడతాయి. అదేవిధంగా దవడలలోను పళ్ళలోను తేడాలు ఏర్పడి పిల్లల ముఖం చూడటానికి అందంగా ఉండకపోవచ్చు. ●

-డా॥ ఓ.నాగేశ్వరరావు
98490 14562

ఒత్తిడిని జయిస్తేనే విజయం

వర్తమాన సమాజంలో మానసిక ఒత్తిడి ఓ సవాలుగా పరిణమిస్తున్నది. అన్ని వయసుల వ్యక్తులు, వివిధ వృత్తులు, ఉద్యోగాలు వ్యాపారాలు సాగించే వారు ఒత్తిడికి చిత్తవుతున్నారు. దీర్ఘకాలిక ఒత్తిడివల్ల మానసిక, శారీరక రుగ్మతలకు గురవుతున్నారు. మనలో అధికశాతం మనుషులు తీవ్రస్థాయి ఒత్తిడి ఎదురైనపుడు సామర్థ్యాలు కోల్పోతున్నారు. ఆ సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోలేక, సమస్యల్ని పరిష్కరించుకోలేక వేదనకు గురవుతున్నారు. అందుకే ఒత్తిడికి దూరంగా వుండమంటారు మానసిక నిపుణులు, వైద్యులు.

అయితే అనుకోకుండా ఒత్తిడి ఎదురైనపుడు, అందుకు తట్టుకుని, ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్ళగలిగినవారే తమ వృత్తి, ఉద్యోగం, వ్యాపారాలలో విజయం సాధిస్తున్నారని తాజా పరిశోధన రుజువు చేసింది. కెరీర్‌లో విజయ సాధనకు, ఒత్తిడికిగల సంబంధంపై పరిశోధన చేసిన యేల్ విశ్వవిద్యాలయం నిపుణులు ఈ విషయం వెల్లడించారు. తీవ్రమైన ఒత్తిడికి గురైన సమయంలో సైతం ఉద్వేగాలపై నియంత్రణ కలిగి ఉంటామని వివిధ రంగాల విజేతల్లో 90 శాతం అంగీకరించారని పరిశోధనల్లో తేలింది. ఒత్తిడికి గురికాకుండా, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించటమే విజయ రహస్యంగా వారు వెల్లడించారని పరిశోధకులు తెలిపారు. జీవన నైపుణ్యాలు, సృజనాత్మక శక్తి, ఉద్వేగ నియంత్రణ లాంటి అంశాలు ఒత్తిడిని తట్టుకోడానికి తోడ్పడుతున్నట్టు విజేతలు అభిప్రాయపడ్డారు.

దృక్పథమే ప్రధానం

మానసిక ఒత్తిడి ప్రభావంలో దృక్పథం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రతికూల భావాలు, మానసిక బలహీనతలున్నవారు ప్రతి సమస్యకు తీవ్రంగా స్పందించి ఒత్తిడికి గురవుతారు. సానుకూల దృక్పథం, ఆత్మవిశ్వాసం కల వ్యక్తులు మాత్రం అవరోధాలు ఎదురైనపుడు పరిష్కారాలు అన్వేషించి ముందుకు సాగుతారు. సాధారణంగా బలహీనులకు ఒత్తిడి శాపంగా పరిణమించగా, సమర్థులకు వరమౌతుంది. వృత్తిపర నైపుణ్యాలు, వ్యక్తిగత సామర్థ్యాలు ఉన్నవారు ఒత్తిడిని సవాలుగా స్వీకరించి, సాధించి విజయాన్ని స్వంతం చేసుకుంటారు.

తమలోని బలాలు, సామర్థ్యాలు, సానుకూల అంశాలను గుర్తించి, వాస్తవికంగా వ్యవహరించేవారిలో ఒత్తిడి 23 శాతం తక్కువగా ఉంటుందని కొన్ని పరిశోధనల్లో తేలింది. వీరిలో ఒత్తిడికి కారణమైన కార్టిసాల్ హార్మోన్ నియంత్రణలో ఉంటుందని అధ్యయనాలు చెపుతున్నాయి. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం పరిశోధకుల అధ్యయనంలో, మొహమాటం ఒత్తిడి కారకాలలో ఒకటని తేలింది. కొందరు కాదు, లేదు, వద్దు అని చెప్పలేకపోవడంవల్ల సమస్యల్లో ఇరుక్కుపోయి ఒత్తిడి, నిరాశకు గురవుతుంటారని ఆ సర్వేలో తెలిసింది. ఇలాంటి సందర్భాలలో నిర్మొహమాటంగా వ్యవహరించడం, లేదా లౌక్యం ప్రదర్శించడం చక్కని మార్గమని నిర్వహణారంగ నిపుణులు అంటున్నారు. చాలామంది ప్రతి చిన్న విషయానికి తీవ్రంగా స్పందించి, ఆందోళన చెంది ఒత్తిడి బారిన పడుతుంటారు. అలాంటివారు సమస్యను విశ్లేషించి, సాధ్యాసాధ్యాలను పరిశీలించి సమయస్ఫూర్తితో వ్యవహరించడం మంచిది. చాలా సందర్భాలలో తొందరపాటు నిర్ణయాలు, మొహమాటపు పనులు మనల్ని సమస్యలోకి నెట్టేస్తుంటాయి. నిర్ణయాత్మక శక్తి, సమస్యల పరిష్కార ముక్తిని అలవర్చుకుంటే ఒత్తిడి దరిచేరకుండా ఉంటుంది.

జాగ్రత్తలు ముఖ్యం

మానసిక ఒత్తిడిని తట్టుకుని, సమర్థవంతంగా పనిచేయడానికి పలు జాగ్రత్తలు పాటించాలి. సాధారణంగా చక్కని జీవన ప్రమాణాలు, సన్నిహిత సంబంధాలు, ఉత్తమ అభిరుచులు ఉన్నవారిలో ఒత్తిడిని తట్టుకునే శక్తి సహజసిద్ధంగా ఉంటుంది. అలాగే శారీరక వ్యాయామాలు, సమతుల ఆహారం, సరిపడా విశ్రాంతి పొందే వ్యక్తుల్లో హార్మోన్లు సమతుల్య స్థితిలో ఉంటాయి. కాబట్టి ఈ క్రింది జాగ్రత్తలు పాటిస్తే ఒత్తిడిని అదుపులో ఉంచుకోవచ్చు.

-ప్రతిరోజు చక్కని వ్యాయామం చేయాలి.

-పోషక విలువలు కల సమతుల ఆహారం తీసుకోవాలి.

-రోజు శరీరం పూర్తిగా విశ్రాంతి పొందేవరకు నిద్రపోవాలి.

-యోగ, ధ్యాన సాధన ద్వారా ఉపశమనం పొందాలి.

-సన్నిహితులతో భావాలు పంచుకోవాలి.

-ఉద్వేగాలపై నియంత్రణ కలిగి ఉండాలి.

-సమయపాలన తప్పనిసరిగా పాటించాలి.

-వ్యవహారాలలో ప్రాధాన్యతాక్రమం అనుసరించాలి.

-నిర్మొహమాటం గా వ్యవహరించడం నేర్చుకోవాలి.

-ఉత్ప్రేరకాలకు దూరంగా ఉండాలి.

ఈ జాగ్రత్తలు పాటించడంతోపాటు జీవన నైపుణ్యాలను అలవర్చుకోవాలి. ప్రధానంగా భావ వ్యక్తీకరణ, పరస్పర సంబంధాల నిర్వహణ, సమస్యల పరిష్కారం, నిర్ణయాలు తీసుకోవడం, ఉపశమన పద్ధతులపట్ల అవగాహన పెంచుకోవాలి. ఒత్తిడికి కారణమయ్యే పరిస్థితులు, పరిణామాలు, పరిసరాలు, వ్యక్తులు, వ్యవహారాలను గుర్తించాలి. ఆయా సందర్భాలలో వ్యవహరించాల్సిన వ్యూహాలను రూపొందించుకోవాలి. సహనం, సర్దుబాటు, స్వీకరణ, బాధ్యతాయుత ప్రవర్తన, సమయస్ఫూర్తిని అలవర్చుకోవాలి. వ్యక్తిగత, వృత్తిపర నైపుణ్యాలను నేర్చుకోవాలి. శాస్త్రీయ, సానుకూల, వాస్తవిక దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. ఇలాంటి జాగ్రత్తలు, నైపుణ్యాలు పాటిస్తే ఒత్తిడి వరమౌతుంది. విజయం వశమవుతుంది. ●

డా.ఎన్.బి.సుధాకర్ రెడ్డి
Psychologist.. nbsreddi@gmail.com